# Kaluva Mallaiah Navalalu – Vastu Vishleshana

(A Thesis submitted to the University of Hyderabad in partial fulfilment of the Degree of Doctor of Philosophy in Telugu)

Research

GADDAM LINGARAJU

Regd. No.16HTPH20

**Supervisor**
**Prof. S. SARAT JYOTHSNA RANI**

**Department of Telugu**
**School of Humanities**
**University of Hyderabad**
**Hyderabad – 500046**
**Telangana**

**July – 2022**

# కాలువ మల్లయ్య నవలలు – వస్తు విశ్లేషణ

(పిహెచ్.డి. పట్టా కోసం హైదరాబాదు విశ్వవిద్యాలయానికి సమర్పించిన పరిశోధన గ్రంథం)

## Kāluva Mallayya Navalalu - Vastu Viślēṣaṇa


పరిశోధన

గడ్డం లింగరాజు

రిజిస్ట్రేషన్ నెం.16HTPH20

పర్యవేక్షణ

ఆచార్య ఎస్. శరత్ జ్యోత్స్నారాణి

తెలుగు శాఖ

మానవీయ శాస్త్రాల విభాగం

హైదరాబాదు విశ్వవిద్యాలయం

హైదరాబాదు, తెలంగాణ – 500 046


జూలై – 2022

# DECLARATION

I, **GADDAM LINGARAJU** hereby declare that this Thesis entitled "**Kaluva Mallaiah Navalalu – Vastu Vishleshana**" submitted by me under the guidance and supervision of **Prof. S. Sarat Jyothsna Rani** is a bona fide research work. I also declare that it has not been submitted previously in part or in full to this University or any other University or Institution for the award of any degree or diploma. I hereby agree that my thesis can be deposited in Shodhganga/ INFLIBNET.

Date: GADDAM LINGARAJU

Place: Hyderabad Regd. No.16HTPH20

## CERTIFICATE

This is to certify that the Thesis entitled **"Kaluva Mallaiah Navalalu – Vastu Vishleshana"** submitted by **Mr. Gaddam Lingaraju,** bearing **Regd. No. 16HTPH20** in partial fulfilment of the requirements for the award of Doctor of Philosophy in the School of Humanities, Department of Telugu is a bona fide work carried out by him under my supervision and guidance.

The thesis is free from plagiarism and has not been submitted previously in part or in full to this University or any other University or Institution for the award of any degree or diploma.

**A. Published in the following publications:**

Parts of this thesis have been: (NOT EXACT PARTS. Issues discussed in the following papers have been presented elaborately in the Chapter-1 and Chapter-3 of the thesis.

1. **"Kaluva Mallaiah 'Bhumi Putrudu' Navala – Raitu Jeevitam"**. (ISSN 2456-4702). Pg. No. 28 - 29. "Bhava Veena" (International Journal of Telugu Literary, Culture & Language Study – December 2018), Vol.:15, Issue No.12 (1). Edited by Pitta Santhi. Edited, printed, published, owned by Kolla Srikrishna Rao, Rohini Towers, 2/11 Brodipet, Guntur.

2. **"Adarsha Samaja Nirmanamlo Kaluva Mallaiah Krushi"** ISSN 2456-4702). Pg. No. 45 - 49. "Bhava Veena" (International Journal of Telugu Literary, Culture & Language Study – July, 2022), Vol.:19, Issue No.7 (1). Edited by Pitta Santhi. Edited, printed, published, owned by Kolla Srikrishna Rao, Rohini Towers, 2/11 Brodipet, Guntur.

**A n d**

**B. Presented in the following conferences:** (Issues presented in the following papers have been discussed elaborately in the thesis.)

1. Presented a paper titled **"Chaduv Navala – Deshabhakthi Bhavana"** in the National Seminar on "Telugu Sahithyam – Deshabhakthi Bhavana", conducted by Jyothsna Kala Peetham in collaboration with Chithkala Vahini, Hyderabad at the University of Hyderabad, Hyderabad during 19 – 20 January, 2019.

2. Presented a paper titled **"Kaluva Mallaiah Navalalu – Sanskruthika Vikasam"** in International Seminar on "Telangana Sanskrutika Vikasam – Vivida Drukkonaalu" jointly conducted by Prapancha Telugu Maha Sabalu – 2017 and Telangana University, Nizamabad on 04 – 05 December, 2017.

Further, the scholar has passed the following courses towards fulfillment of coursework requirement for Ph.D.:

| **Sl. No.** | **Course Code** | **Name** | **Credits** | **Pass/Fail** |
|---|---|---|---|---|
| 1. | HT801 | Research Methodology | 4.00 | PASS |
| 2. | HT802 | History of Telugu Research | 4.00 | PASS |
| 3. | HT803 | Studies in Literature | 4.00 | PASS |
| 4. | HT804 | Studies in Specialized Area | 4.00 | PASS |

Prof. S. Sarat Jyothsna Rani
**Research Supervisor**

Prof. Darla Venkateswara Rao
**Head, Department of Telugu**

Prof. V. Krishna
**Dean, Humanities**

# విషయసూచిక


**కృతజ్ఞతలు** i – iii

**పరిచయం** iv – ix

**మొదటి అధ్యాయం: కాలువ మల్లయ్య జీవిత విశేషాలు** 1 – 18

1.0. పరిచయం 2

1.1. కుటుంబ నేపథ్యం 2

1.2. బాల్యం – విద్యాభ్యాసం 4

1.3. వివాహ జీవితం 6

1.4. ఉద్యోగ జీవితం 7

1.5. రచనా వ్యాసంగం 8

1.5.1. కథా రచయితగా కాలువ మల్లయ్య 9

1.5.2. నవలాకారునిగా కాలువ మల్లయ్య 13

1.5.3. నాటకకర్తగా కాలువ మల్లయ్య 14

1.5.4. ఇతర రచనలు 15

1.5.5. వ్యాస సంపుటాలు – పరిశోధనాత్మక రచనలు 15

1.6. సాహిత్య పురస్కారాలు – బహుమతులు 16

1.7. కాలువ మల్లయ్య అధిష్ఠించిన పదవులు – గుర్తింపులు 18

**రెండవ అధ్యాయం: తెలంగాణ నవల – పరిచయం** 19 – 36

2.0. నవల పరిచయం 20

2.1. వివిధ భాషలలో నవలకు గల పేర్లు 20

2.2. నవల నిర్వచనాలు 21

2.2.1. పాశ్చాత్యుల నిర్వచనాలు 22

2.3. తొలి తెలుగు నవల 22

2.4. నవల ప్రక్రియ – వస్తు వైవిధ్యం 25

2.5. తెలంగాణ నవలా సాహిత్యం 27

2.5.1. తెలంగాణ తొలి తెలుగు నవల 28
2.5.2. తెలంగాణ చారిత్రక నవలలు 29
2.5.3. తెలంగాణ సాంఘిక నవలలు 30
2.5.4. తెలంగాణ ఉద్యమ నవలలు 31
2.5.5. తెలంగాణ విప్లవ నవలలు 31
2.5.6. ఇతర నవలలు 32

**మూడవ అధ్యాయం: కాలువ మల్లయ్య నవలలు – వస్తు విశ్లేషణ** 37 – 163

3.0. వస్తు పరిచయం 38
3.1. వస్తువు దృష్ట్యా తెలుగు నవలలు – వర్గీకరణ 39
3.2. సామాజిక నవలలు 43
3.2.1. భూమిపుత్రుడు నవల 44
3.2.1.1. నవలా వస్తువు 44
3.2.1.2. వస్తు విశ్లేషణ 47
3.2.1.3. రైతు జీవిత చిత్రణ 48
3.2.1.4. బొగ్గు గని కార్మికుల సమస్యలు 50
3.2.1.5. బ్యాంక్ అధికారుల దౌర్జన్యాలు 51
3.2.1.6. ముగింపు 52
3.2.2. సాంబయ్య చదువు నవల 52
3.2.2.1. నవలా వస్తువు 53
3.2.2.2. వస్తు విశ్లేషణ 55
3.2.2.3. గ్రామీణ జీవితంలో మొట్ట మొదటి జనరల్ ఎన్నికలు 55
3.2.2.4. గ్రామీణ జీవితంలో కులవివక్ష 56
3.2.2.5. దొరల దౌర్జన్యాలు 57
3.2.2.6. తెలంగాణ ఉద్యమ చరిత్ర 58
3.2.2.7. విద్యార్థి యూనియన్ ఎన్నికలు 59
3.2.2.8. ముగింపు 60

3.2.3. మాట్లాడే బొమ్మలు నవల 60
3.2.3.1. నవలా వస్తువు 61
3.2.3.2. వస్తు విశ్లేషణ 62
3.2.3.3. తెలంగాణ రైతు జీవిత చిత్రణ 62
3.2.3.4. గ్రామాలపై ఎమర్జెన్సీ ప్రభావం 64
3.2.3.5. శాస్త్రీయ, అశాస్త్రీయ విద్యా విధానాల మధ్య వైరుధ్యం 65
3.2.3.6. విద్యారంగం – రాజకీయాలు 67
3.2.3.7. జానపద క్రీడల పరాయీకరణ 68
3.2.3.8. మాతృభాషలో విద్యాబోధన 69
3.2.3.9. కులం – రిజర్వేషన్లు 70
3.2.3.10. పాతకొత్తల సంధికాలం 72
3.2.3.11. మానవీయ విలువలు 74
3.2.3.12. ముగింపు 75
3.2.4. బతుకు పుస్తకం నవల 75
3.2.4.1. నవలా వస్తువు 76
3.2.4.2. వస్తు విశ్లేషణ 80
3.2.4.3. కులం 81
3.2.4.4. వలసలు 85
3.2.4.5. కృత్రిమ ఎరువుల వాడకం 86
3.2.4.6. ప్రపంచీకరణ ప్రభావం 87
3.2.4.7. పల్లె పట్నానికి తరలిపోవటం 90
3.2.4.8. ముగింపు 90
3.2.5. డబ్బు మైనస్ తృప్తి = దుఃఖం నవల 90
3.2.5.1. నవలా వస్తువు 91
3.2.5.2. వస్తు విశ్లేషణ 93
3.2.5.3. అధిక వడ్డీల ఆశ – షేర్లు, ఫైనాన్స్ కంపెనీల 94

మోసాలు
3.2.5.4. ముగింపు 95
3.2.6. తెలంగాణ దేవదాసు నవల 96
3.2.6.1. నవలా వస్తువు 96
3.2.6.2. వస్తు విశ్లేషణ 99
3.2.6.3. ముగింపు 100
3.3. దళిత నవలలు 100
3.3.1 మాదిగ విజయం నవల 101
3.3.1.1 నవలా వస్తువు 101
3.3.1.2. వస్తు విశ్లేషణ 108
3.3.1.3. దళితుల మత మార్పిడి విధానం 109
3.3.1.4. దళితుల జీవన విధానం 110
3.3.1.5. దళితుల సంస్కృతి 112
3.3.1.6. భూస్వామ్య వ్యవస్థలో దొరల పీడన 113
3.3.1.7. దళిత సమస్యను చిత్రించే ఉపన్యాసాలు 114
3.3.1.8. ముగింపు 116
3.3.2. గులాంగిరి చోడో నవల 116
3.3.2.1. నవలా వస్తువు 117
3.3.2.2. వస్తు విశ్లేషణ 120
3.3.2.3. దళితుల జీవిత పరిణామం – సంస్కృతి 122
3.3.2.4. ముగింపు 123
3.3.3. మంచియన్నది మాల అయితే.. నవల 124
3.3.3.1. నవలా వస్తువు 124
3,3,3.2. వస్తు విశ్లేషణ 127

3.3.3.3. తెలంగాణ గ్రామీణ జీవితంపై కమ్యూనిస్టు పోరాటాల ప్రభావం 129
3.3.3.4. ముగింపు 129
3.3.4. అస్పృశ్యకోయిల నవల 130
3.3.4.1. నవలా వస్తువు 130
3.3.4.2. వస్తు విశ్లేషణ 132
3.3.4.3. దళితుల సామాజిక జీవితం 132
3.3.4.4. బతుకమ్మ పండుగ – కుల వివక్ష 134
3.3.4.5. అంటరానితనం – దొరల దౌర్జన్యం 135
3.3.4.6. విప్లవోద్యమ పోరాటం – పీడిత కులాలకు రక్షణ 138
3.3.4.7. ముగింపు 138
3.4. వృత్తి నవల 138
3.4.1. గువ్వలచెన్నా నవల 139
3.4.2. నవలా వస్తువు 139
3.4.3. వస్తు విశ్లేషణ 141
3.4.4. చేనేత కార్మికుల జీవిత చిత్రణ 142
3.4.5. వలసలు 144
3.4.6. ముగింపు 145
3.5. కార్మిక నవల 145
3.5.1. మెతుకు పుస్తకం నవల 145
3.5.2. నవలా వస్తువు 146
3.5.3. వస్తు విశ్లేషణ 150
3.5.4. పారిశ్రామిక ప్రాంతం – కార్మిక దినోత్సవం 150
3.5.5. వస్తు వినిమయ సంస్కృతి 152
3.5.6. పరిశ్రమ మూసివేత – కార్మికుల సమస్యలు 153
3.5.7. ముగింపు 155
3.6. చైతన్య స్రవంతి నవల 155

3.6.1. తపస్సు నవల 155
3.6.2. నవలా వస్తువు 156
3.6.3. వస్తు విశ్లేషణ 160
3.6.4. ముగింపు 161
3.7. అలభ్య నవలలు 162
3.7.1. చీకట్లో చిరుదీపం 162
**నాల్గవ అధ్యాయం: కాలువ మల్లయ్య నవలలు – పాత్ర చిత్రణ** 164 – 258
4.0. పాత్రలు – పాత్రచిత్రణ పరిచయం 165
4.1. కాలువ మల్లయ్య నవలల్లో పాత్రల పేర్లు – వర్గీకరణ 167
4.2. ప్రధాన పాత్రలు 171
4.2.1. కొండమల్లయ్య (భూమిపుత్రుడు) 171
4.2.2. తిరుపతయ్య (భూమిపుత్రుడు) 174
4.2.3. సాంబయ్య (సాంబయ్య చదువు) 176
4.2.4. వెంగళరావు (సాంబయ్య చదువు) 178
4.2.5. అయిలయ్య (మాట్లాడే బొమ్మలు) 180
4.2.6. సాంబయ్య (మాట్లాడే బొమ్మలు) 181
4.2.7. బుచ్చయ్య (మాదిగ విజయం) 183
4.2.8. పేరయ్య (మాదిగ విజయం) 184
4.2.9. సారయ్య (మెతుకు పుస్తకం) 186
4.2.10. అరుణ్ కుమార్ (మెతుకు పుస్తకం) 188
4.2.11. దివాకర్ రెడ్డి (మెతుకు పుస్తకం) 190
4.2.12. కొంరయ్య (గులాంగిరి చోడో) 192
4.2.13. మారయ్య (గులాంగిరి చోడో) 195
4.2.14. రాజేష్ (గులాంగిరి చోడో) 196
4.2.15. నర్సింహారెడ్డి (గులాంగిరి చోడో) 198
4.2.16. కొండయ్య (మంచియన్నది మాల అయితే..) 199
4.2.17. గోవిందరావు (మంచియన్నది మాల అయితే..) 201

| | | |
|---|---|---|
| 4.2.18. | లసుమయ్య (బతుకు పుస్తకం) | 203 |
| 4.2.19. | కొండల్ రావు (బతుకు పుస్తకం) | 205 |
| 4.2.20. | రాజయ్య (బతుకు పుస్తకం) | 207 |
| 4.2.21. | రాజ్యలక్ష్మి (తెలంగాణ దేవదాసు) | 209 |
| 4.2.22. | రఘురాం (తెలంగాణ దేవదాసు) | 210 |
| 4.2.23. | వేణుగోపాలరెడ్డి (తెలంగాణ దేవదాసు) | 212 |
| 4.2.24. | శివయ్య (డబ్బు మైనస్ తృప్తి=దుఃఖం) | 212 |
| 4.2.25. | మంజుల (డబ్బు మైనస్ తృప్తి=దుఃఖం) | 214 |
| 4.2.26. | కోకిలమ్మ (అస్పృశ్య కోయిల) | 216 |
| 4.2.27. | లక్ష్మణరావు (అస్పృశ్య కోయిల) | 216 |
| 4.2.28. | శ్యాంరావు (అస్పృశ్య కోయిల) | 217 |
| 4.2.29. | చిప్ప మల్లయ్య (గువ్వలచెన్నా) | 218 |
| 4.2.30. | శంకరయ్య (గువ్వలచెన్నా) | 219 |
| 4.3. | ఆదర్శ పాత్రలు | 220 |
| 4.3.1. | నర్సమ్మ (భూమిపుత్రుడు) | 220 |
| 4.3.2. | ఎల్లయ్య లేదా ఆనందరావు (మాదిగ విజయం) | 221 |
| 4.3.3. | శ్రీకాంత్, ఆజాద్ లు (మాదిగ విజయం) | 224 |
| 4.3.4. | ఈరమ్మ (మాదిగ విజయం) | 225 |
| 4.3.5. | భిక్షపతి (మెతుకు పుస్తకం) | 226 |
| 4.3.6. | లింగమ్మ (గులాంగిరి చోడో) | 228 |
| 4.3.7. | వీరమ్మ (గులాంగిరి చోడో) | 230 |
| 4.3.8. | మల్లేశం (బతుకుపు స్తకం) | 231 |
| 4.3.9. | వెంకటయ్య (బతుకు పుస్తకం) | 232 |
| 4.3.10. | భూమారెడ్డి (తెలంగాణ దేవదాసు) | 232 |
| 4.3.11. | మనోజ్ (అస్పృశ్య కోయిల) | 233 |
| 4.3.12. | గోపాలకృష్ణశర్మ (అస్పృశ్య కోయిల) | 235 |
| 4.3.13. | లింగమ్మ (గువ్వలచెన్నా) | 235 |

| | | |
|---|---|---|
| 4.3.14. | రమేష్ (గువ్వలచెన్నా) | 236 |
| 4.4. | సందేశాత్మక పాత్రలు | 236 |
| 4.4.1. | వీరేశం (మాదిగవిజయం) | 236 |
| 4.4.2. | అంజయ్య (గులాంగిరి చోడో) | 238 |
| 4.4.3. | మధునయ్య (గులాంగిరి చోడో) | 238 |
| 4.4.4. | పురుషోత్తమరావు (బతుకు పుస్తకం) | 239 |
| 4.4.5. | లచ్చులు (బతుకు పుస్తకం) | 240 |
| 4.4.6. | రవీందర్ రెడ్డి (తెలంగాణ దేవదాసు) | 241 |
| 4.4.7. | సదానందం (డబ్బు–తృప్తి = దుఃఖం) | 241 |
| 4.5. | సహాయక పాత్రలు | 242 |
| 4.5.1. | రాజయ్య (భూమిపుత్రుడు) | 242 |
| 4.5.2. | షావుకారి రాజేషం (భూమిపుత్రుడు) | 244 |
| 4.5.3. | లక్ష్మి (భూమిపుత్రుడు) | 245 |
| 4.5.4. | ఈశ్వర్ (సాంబయ్య చదువు) | 246 |
| 4.5.5. | సరస్వతి (మాట్లాడే బొమ్మలు) | 247 |
| 4.5.6. | శ్రీనివాస్ (మాట్లాడే బొమ్మలు) | 248 |
| 4.5.7. | సోమయ్య (మాదిగ విజయం) | 249 |
| 4.5.8. | కొంరెల్లి (మెతుకుపుస్తకం) | 250 |
| 4.5.9. | రంగయ్య (మంచియన్నది మాల అయితే...) | 251 |
| 4.5.10. | భూమయ్య (బతుకుపుస్తకం) | 252 |
| 4.5.11. | లింగమ్మ (బతుకుపుస్తకం) | 253 |
| 4.5.12. | గడ్డం రామయ్య (బతుకుపుస్తకం) | 254 |
| 4.5.13. | మొండయ్య (డబ్బు – తృప్తి = దుఃఖం) | 254 |
| 4.5.14. | సుమిత్రమ్మ (డబ్బు – తృప్తి = దుఃఖం) | 255 |
| 4.5.15. | ఓదెలు (అస్పృశ్యకోయిల) | 256 |
| 4.5.16. | మనోజ్ తాత (అస్పృశ్యకోయిల) | 256 |
| 4.5.17. | మనోజ్ తల్లి (అస్పృశ్యకోయిల) | 257 |

| | | |
|---|---|---|
| 4.5.18. | అన్నలు (అస్పృశ్యకోయిల) | 257 |
| 4.5.19. | శ్రీరాం (గువ్వలచెన్నా) | 257 |
| 4.5.20. | రాజమల్లు (గువ్వలచెన్నా) | 258 |
| 4.5.21. | లక్ష్మీరాజం (గువ్వలచెన్నా) | 258 |
| **ఐదవ అధ్యాయం: కాలువ మల్లయ్య నవలలు – రచనాశిల్పం** | | 259 – 290 |
| 5.0. | శిల్పం పరిచయం | 260 |
| 5.1. | కాలువ మల్లయ్య రచనాశైలి | 260 |
| 5.2. | కాలువ మల్లయ్య నవలల్లో భాగాలు, నిడివి | 261 |
| 5.3. | నవల శీర్షిక ఔచిత్యం | 262 |
| 5.4. | ఎత్తుగడ | 265 |
| 5.5. | నవల ముగింపు | 269 |
| 5.6. | పాత్రోచిత భాష | 273 |
| 5.7. | దృష్టికోణం | 276 |
| 5.8. | మాండలికాలు | 277 |
| 5.9. | ధ్వన్యనుకరణ పదాలు | 282 |
| 5.10. | జంట పదాలు | 283 |
| 5.11. | సామెతలు | 284 |
| 5.12. | జాతీయాలు | 287 |
| 5.13. | అన్యదేశ్యాలు | 288 |
| | ఉపసంహారం | 291 – 297 |
| | ఉపయుక్త గ్రంథసూచి | 298 – 303 |
| | అనుబంధాలు | 304 – 328 |
| | అనుబంధం – 1 – డా॥ కాలువ మల్లయ్య గారితో జరిపిన ఇంటర్వ్యూ | 305 |
| | అనుబంధం – 2 – కాలువ మల్లయ్య గారితో దిగిన ఛాయాచిత్రాలు | 313 |
| | అనుబంధం – 3 – యుజిసి కేర్ జర్నల్ భావవీణలో, జాతీయ, అంతర్జాతీయ సదస్సుల్లో సమర్పించిన పరిశోధన పత్రాల ధ్రువపత్రాలు. | 315 |

# కృతజ్ఞతలు

నాకు జన్మనిచ్చి, చిన్ననాడే నా చేతికి పలకనిచ్చి, పట్టభద్రుడిగా నన్ను చూడాలని ఆశించి, ఆ ముచ్చట తీరకుండానే పరలోకానికి పయనమైన నా తల్లి కీ.శే. గడ్డం కోటమ్మకు, నన్ను ప్రయోజకుడిగా చూడాలని తపిస్తున్న నా తండ్రి గడ్డం చంద్రయ్యకు పాదాభివందనాలు.

నన్ను పెంచి పెద్దచేసి ప్రేమానురాగాలు చూపిస్తూ, నా బరువు బాధ్యతలు మోస్తూ ఎప్పటికప్పుడు నా సంతోషాల్ని, బాధల్ని తమవిగా భావిస్తూ, ప్రతి క్షణం నా అభివృద్ధిని కోరుకునే పెద్దమ్మ – పెద్దనాన్నలైన బొడ్డు సోవమ్మ – లింగయ్యలకు పాదాభివందనాలు.

'కాలువ మల్లయ్య నవలలు – వస్తు విశ్లేషణ' అనే అంశంపై పరిశోధన చేయడానికి నాకు అవకాశం కల్పించిన హైదరాబాద్ విశ్వవిద్యాలయం తెలుగు శాఖకు...

నా పరిశోధనాంశంలో అవసరమైన సూచనలు, సలహాలు అందించి నా పరిశోధనా గ్రంథం పూర్తి కావడానికి సహకరించిన నా పర్యవేక్షకులు ఆచార్య ఎస్. శరత్ జ్యోత్స్నారాణి గారికి...

డాక్టోరల్ కమిటీ సభ్యులుగా ఉంటూ నా పరిశోధనకు తగిన సలహాలు, సూచనలు ఇచ్చిన ఆచార్య రేమిళ్ల వెంకట రామకృష్ణశాస్త్రి గారికి, ఆచార్య యం. గోనా నాయక్ గారికి, ఆచార్య డి. విజయలక్ష్మి గారికి...

తెలుగు శాఖ అధ్యక్షులు ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు గారికి, తెలుగు అధ్యాపకులు ఆచార్య తుమ్మల రామకృష్ణ గారికి, ఆచార్య జి. అరుణకుమారి గారికి, ఆచార్య పిల్లలమర్రి రాములు గారికి, ఆచార్య పమ్మి పవన్ కుమార్ గారికి, కీ.శే. ఆచార్య ఎండ్లూరి సుధాకర్ గారికి, డా॥ బాణాల భుజంగరెడ్డి గారికి, డా॥ డి. విజయకుమారి గారికి, డా॥ బి. తిరుపతి గారికి...

నా పరిశోధనకు అవసరమైన సమాచారంతోపాటు కొన్ని నవలలు అందించిన కాలువ మల్లయ్య గారికి...

నాకు సకాలంలో కావాల్సిన పుస్తకాలను అందించిన ఇందిరా గాంధీ స్మారక గ్రంథాలయ సిబ్బందికి, తెలుగు శాఖలోని బోధనేతర సిబ్బందికి...

నా గమ్యాన్ని గుర్తు చేస్తూ కుటుంబం గురించి యోగక్షేమాలు అడిగే శ్రీ వి.వి. రమణ గారికి...

నేను ఈరోజు ఇంతవరకు చదవడానికి ముఖ్య కారణమైన నా అన్నలు – వదినలైన సైదులు – మంగమ్మ, మల్లయ్య – వెంకటమ్మ, చంద్రయ్య – పద్మ, శ్రీనివాస్ – ఉపేంద్రలకు, అక్క – బావ వెంకటమ్మ – కోటయ్యలకు...

సెంట్రల్ యూనివర్శిటీకి రావడానికి సహాయం చేసిన వదిన పుష్పకుమారి – అన్న మట్టయ్యలకు...

నాకు లోక జ్ఞానాన్ని పరిచయం చేసిన లింగయ్య సార్, రామాంజమ్మ మేడం, వెంకన్న సార్, రాంచంద్రారెడ్డి సార్లకు...

నా పరిశోధనకు సహకరిస్తూ సలహాలు, సూచనలు ఇచ్చిన అన్నలు ఆరాల లింగమల్లయ్య, శోభన్ బాబు, లక్ష్మణ్, రాజబోయిన శ్రీనివాసరావు, జనార్ధన్, దేవయ్య, రాయమల్లు, శ్రీహరి, ఈశ్వర్, చంద్రయ్య, శ్రీకాంత్, సంజీవ్, భాస్కర్, ఉదయభానులకు...

నాకు హైదరాబాద్ విశ్వవిద్యాలయం అందించిన మిత్రులు రాజశేఖరస్వామి, ప్రభాకర్, సోమశేఖర్, రాంప్రసాద్, భాస్కర్ గుప్తా, నరేష్, ఏడుకొండలు, నాగరాజు, గౌతమ్, గోపి, సాయిరాం, అనంత్, రాఘవేందర్, అమృతరావు, కృష్ణవేణి, శ్రీలత, చిట్టి, షాలినిలకు...

హైదరాబాద్ విశ్వవిద్యాలయం అందించిన తమ్ముళ్లు కమలాకర్, దాసరి శ్రీను, నరేందర్, రాముడులకు...

నాకు ఆత్మీయ తమ్ముడైన నారాయణదాసు సురేష్ కు...

ఎల్లప్పుడు నా క్షేమాన్ని ఆకాంక్షిస్తూ నా ప్రగతిని చూడాలని తపనపడే అత్త మామలు కాయనబోయిన పార్వతమ్మ, రామయ్యలకు...

అడుగడుగునా నాకు తోడుంటూ నాలో ఎల్లప్పుడూ ఆత్మవిశ్వాసాన్ని పెంపొందింపజేస్తూ నాతో చేరి నాలో సగమైన నా భార్య శ్రీలతకి, అమ్మ రూపంలో జన్మించిన నా కూతురు కీర్తిశ్రీకి...

**అడుగడుగునా నాకు తోడుగా నిలుస్తూ**

**నా నిరుత్సాహాన్ని ఉత్సాహంగా మారుస్తూ**

**నా ఉత్సాహానికి వారి ప్రోత్సాహాన్ని జతపరుస్తూ**

**నా ప్రగతిలో, ప్రతి అడుగులో నాకంటే ముందుంటూ**

**నా బలం, బలహీనత వారై**

**నన్ను నడిపిస్తున్న నా మిత్రులు**

**డా॥ డి. తులసీరామ్–బిందు, యన్. సత్యనారాయణ–సంధ్యలకు...**

ఎప్పుడూ నా వెన్నంటి ఉండే మిత్రులు రమేష్, రఘు, మహేష్, చైతన్య, సోమేష్, అశోక్, పందిరి వెంకటేష్, సురేష్ లకు...

పరిశోధన చేయడానికి ఆర్థిక సహాయం అందించిన యు.జి.సి. వారికి...

ప్రతి ఒక్కరికి పేరు పేరునా హృదయపూర్వక కృతజ్ఞతలు...

**మీ**

**గడ్డం లింగరాజు**

## పరిచయం

### I. పరిశోధనాంశ పరిచయం:

నేను జూలై 2015వ సంవత్సరంలో హైదరాబాద్ విశ్వవిద్యాలయం, మానవీయ శాస్త్రాల విభాగం, తెలుగు శాఖలో ఎం.ఫిల్. కోర్సులో ప్రవేశం పొందాను. 'జిగిరి నవల – పరిశీలన' అనే అంశాన్ని పరిశీలించాను. ఆగస్టు 2016వ సంవత్సరంలో పిహెచ్.డి. కోర్సులో ప్రవేశం పొందాను. సామాజిక దృక్పథంతో వచ్చిన నవలలపై పరిశోధన చేయాలన్న కోరికతో కాలువ మల్లయ్యగారి నవలా సాహిత్యాన్ని పరిశోధనకు తీసుకోవడం జరిగింది. ఆచార్య ఎస్. శరత్ జ్యోత్స్నారాణి గారి పర్యవేక్షణలో 'కాలువ మల్లయ్య నవలలు – వస్తు విశ్లేషణ' అనే పరిశోధనాంశాన్ని తీసుకొని వారి సలహాలు, సూచనలు పాటిస్తూ పరిశీలించాను.

'హితేన సహితం సాహిత్యం' అనే ఆలంకారికుల నిర్వచనం ప్రకారం హితాన్ని చేకూర్చి మేలును కోరుకునేది సాహిత్యం అంటారు. సాహిత్యం కాలాన్ని బట్టి, ప్రాంతాన్ని బట్టి, సంస్కృతిని బట్టి మారుతూ సమాజంలోని మనుషులకు చైతన్యాన్ని కలిగిస్తుంటుంది. అంతటి గొప్ప చైతన్యాన్ని కలిగించే సాహిత్యం అనేక ప్రక్రియలతో బహుముఖీనంగా విస్తరించబడింది. సాహిత్యకారులు తమ అభిరుచిని బట్టి ఏదో ఒక ప్రక్రియను మాత్రమే చేపట్టి సాహితీ వ్యాసంగాన్ని సృష్టించారు. కొందరు రచయితలు మాత్రం అన్ని రకాల ప్రక్రియల్లో సాహిత్య సృజనను గావించి బహుముఖ ప్రజ్ఞాశాలురుగా వెలుగొందారు. అలా సాహితీ క్షేత్రంలో అన్ని రకాల ప్రక్రియలతో కూడిన సాహిత్య సేద్యాన్ని పండిస్తున్న నిత్య కృషీవలుడు కాలువ మల్లయ్య.

కాలువ మల్లయ్య తెలుగు కథా, నవలా రచయితలలో తనకంటూ ఓ ప్రత్యేకతను కలిగి ఉండి ఒక సామాజిక నిబద్ధతతో తెలంగాణ పల్లె జీవితాన్ని, అట్టడుగు శ్రామిక వర్గ సంస్కృతిని, దళిత, బహుజనుల చైతన్యాన్ని వాస్తవిక దృక్పథంతో తన నవలల్లో నిక్షిప్తం చేస్తున్నాడు. కాలువ మల్లయ్య పదహారు నవలలు రచించాడు. కాలువ మల్లయ్య నవలల్లో ఉన్నటువంటి సామాజిక, ఆర్థిక, రాజకీయ అంశాలను తెలియజేస్తూ, కాలువ మల్లయ్య నవలల ద్వారా సమాజం ఏ విధంగా చైతన్యం అవుతుందో తెలియజేయాలన్నది నా పరిశోధన ఉద్దేశ్యం.

### II. పరిశోధన పరిధి:

తెలుగులో ఎన్ని ప్రక్రియలు ఉన్నప్పటికీ జీవితాన్ని ఉన్నది ఉన్నట్లుగా చిత్రించి మధ్య తరగతి ప్రజల జీవిత సమస్యలను సాహిత్యంలోకి ప్రవేశపెట్టిన ఘనత నవలా ప్రక్రియకే చెందుతుంది. తెలుగు నవల కందుకూరి వీరేశలింగం గారితో ప్రారంభమై శాఖోపశాఖలుగా విస్తరించి 2013లో

రావూరి భరద్వాజ గారి 'పాకుడురాళ్ళు' నవలతో జ్ఞానపీఠ పురస్కారాన్ని అధిరోహించింది. తెలుగు నవలలు ఎన్నో ఇతర భాషల్లోకి అనువాదాలు అవుతున్నాయి. ఎంతో ప్రసిద్ధి చెందిన తెలుగు నవలా రచయితలు ఎందరో ఉన్నారు. తమకు ఇష్టమైన ఇతివృత్తాలను స్వీకరించి నవలలు రాస్తున్నారు. సమాజంలోని అనేక సమస్యలను చిత్రిస్తూ, పరిష్కార మార్గాలను చూపిస్తూ, చైతన్యాన్ని సాధిస్తున్నారు నవలాకారులు. అలా తమ నవలల ద్వారా సమాజ చైతన్యాన్ని కాంక్షించిన రచయితలలో కాలువ మల్లయ్య ఒకరు.

కాలువ మల్లయ్య నవలలు, కథలు, వ్యాసాలు, కవిత్వం,నాటకాలు మొదలైన ప్రక్రియల్లో తన రచనా వ్యాసంగాన్ని సృష్టించారు. అంతటి విస్తృతంగా ఉన్న కాలువ మల్లయ్యగారి సాహిత్యాన్ని సేకరించి, పరిశోధన చేసి విశ్లేషించడం పరిశోధన కాలం దృష్ట్యా క్లిష్టతరం. కాబట్టి పర్యవేక్షకులైన ఆచార్య ఎస్. శరత్ జ్యోత్స్నారాణి గారి సలహాతో కాలువ మల్లయ్య గారి నవలలను మాత్రమే నా పరిశోధన పరిధిగా ఎంచుకొని "కాలువ మల్లయ్య నవలలు – వస్తు విశ్లేషణ" అనే శీర్షిక పేరుతో పరిశోధన చేశాను.

## III. పరిశోధన గ్రంథ లక్ష్యం:

గ్రామీణ జీవితం, సంస్కృతి, సంక్షోభం, మధ్య తరగతి ప్రజల సమస్యలు, కార్మికుల సమస్యలు, కుల వృత్తుల జీవన విధానం, వలసలు, దళిత,బహుజనుల జీవితం, రైతాంగ జీవితంలోని సమస్యలు, భూస్వామ్యులైన దొరల దౌర్జన్యాలు, మావోయిస్టుల ఉద్యమాలు, విదేశాలపై మోజు, మాతృభాషపై ప్రేమ, ఇంగ్లీష్ మీడియం చదువు, బీడీ కార్మికుల సమస్యలు, స్త్రీలపై అత్యాచారాలు మొదలైన సామాజిక, ఆర్థిక, రాజకీయ అంశాలు కాలువ మల్లయ్య నవలల్లో కనబడతాయి. ఇలాంటి నవలలను సాహిత్యపరంగా అన్వయించి చెప్పడమే ఈ పరిశోధన లక్ష్యం.

## IV. పూర్వ పరిశోధనలు:

'విశ్వవిద్యాలయాల్లో తెలుగు పరిశోధన' గ్రంథం ద్వారా సేకరించిన సమాచారం ప్రకారం కాలువ మల్లయ్య నవలలపై 'కాలువ మల్లయ్య నవలలు-సామాజిక విశ్లేషణ' అనే అంశంపై బి.మల్లికార్జున్ 2005 వ సంవత్సరంలో కాకతీయ విశ్వవిద్యాలయంలో పరిశోధన చేశారు. పగిడ్యాల మహేందర్ 'కాలువ మల్లయ్య అస్పృశ్య కోయిల నవల– వస్తు రూపవిశ్లేషణ' అనే అంశంపై సిద్ధాంత వ్యాసాన్ని మద్రాసు విశ్వవిద్యాలయానికి సమర్పించారు. వారి సిద్ధాంత వ్యాసం, సిద్ధాంత గ్రంథం ద్వారా కాలువ మల్లయ్య రచించిన భూమిపుత్రుడు, సాంబయ్య చదువు, మాట్లాడే బొమ్మలు, అస్పృశ్య కోయిల అనే నాలుగు నవలలపై మాత్రమే పరిశోధన జరిగిందని

తెలుసుకున్నాను. కాబట్టి కాలువ మల్లయ్య రచించిన మొత్తం పదహారు నవలలపై సంపూర్ణంగా పరిశోధన జరగలేదని ఈ పరిశోధన చేశాను.

## V. పరిశోధన గ్రంథ రచన – అనుసరించిన ప్రణాళిక:

'కాలువ మల్లయ్య నవలలు – వస్తు విశ్లేషణ' అనే పరిశోధనాంశాన్ని విషయ విశ్లేషణ సౌలభ్యం కోసం నా పర్యవేక్షకులైన ఆచార్య ఎస్. శరత్ జ్యోత్స్నారాణిగారి సలహాలు, సూచనలు పాటిస్తూ ఐదు అధ్యాయాలుగా విభజించాను. అధ్యాయ విభజనను ఈ పరిశోధన గ్రంథంలో కింది విధంగా అనుసరించాను.

**మొదటి అధ్యాయం : కాలువ మల్లయ్య జీవిత విశేషాలు**

**రెండవ అధ్యాయం : తెలంగాణ నవల – పరిచయం**

**మూడవ అధ్యాయం : కాలువ మల్లయ్య నవలలు – వస్తు విశ్లేషణ**

**నాల్గవ అధ్యాయం : కాలువ మల్లయ్య నవలలు – పాత్ర చిత్రణ**

**ఐదవ అధ్యాయం : కాలువ మల్లయ్య నవలలు – రచనా శిల్పం**

**ఉపసంహారం**

**ఉపయుక్త గ్రంథసూచి**

**అనుబంధాలు.**

కాలువ మల్లయ్య నవలలను సేకరించి, తద్వారా పరిశోధనకు సంబంధించిన పరిశోధనాంశాన్ని పర్యవేక్షకుల సూచన మేరకు విశ్లేషించాను.పైన పేర్కొన్న ఐదు అధ్యాయాల్లో ప్రతి అధ్యాయాన్ని కొన్ని శీర్షికలు, ఉప శీర్షికలుగా విభజన చేయడం జరిగింది. అలాగే ఐదు అధ్యాయాలలో చెప్పిన అంశాలను సంక్షిప్తంగా కింద తెలియజేస్తున్నాను.

### మొదటి అధ్యాయం: కాలువ మల్లయ్య జీవిత విశేషాలు:

ఈ అధ్యాయంలో ఎనిమిది శీర్షికలు, వాటి ఉపశీర్షికల ద్వారా కాలువ మల్లయ్య కుటుంబ నేపథ్యం, బాల్యం, విద్యాభ్యాసం, వివాహ జీవితం, ఉద్యోగ జీవితం, రచనా వ్యాసంగం, సాహిత్య పురస్కారాలు, బహుమతులు, కాలువ మల్లయ్య అధిష్టించిన పదవులు, గుర్తింపులు మొదలైన వాటిని పేర్కొన్నాను.

**రెండవ అధ్యాయం: తెలంగాణ నవల – పరిచయం:**

ఈ అధ్యాయంలో ఆరు శీర్షికలు, వాటి ఉపశీర్షికల ద్వారా నవలా ప్రక్రియకు సంబంధించి పాశ్చాత్య, తెలుగు సాహితీవేత్తలు, నవలాకారులు ఇచ్చిన పలు నిర్వచనాలను, వివిధ భాషలలో నవలకు గల పేర్లు, తొలి తెలుగు నవల గురించి ప్రముఖుల అభిప్రాయాలు, నవల ప్రక్రియలో వస్తువైవిధ్యాన్ని చర్చించాను. తెలంగాణలో తొలి తెలుగు నవల గురించి ప్రముఖులు తెలిపిన అభిప్రాయాలను, తెలంగాణ చారిత్రక, సాంఘిక, ఉద్యమ, విప్లవ, ఇతర నవలలు గురించి పరిశీలించాను.

**మూడవ అధ్యాయం: కాలువ మల్లయ్య నవలలు – వస్తు విశ్లేషణ:**

ఈ అధ్యాయంలో ఎనిమిది శీర్షికలు, వాటి ఉపశీర్షికల ద్వారా వస్తువును పరిచయం చేసి, ప్రముఖులు తెలిపిన వస్తు నిర్వచనాలను తెలియజేశాను. సాహిత్యకారులు, విమర్శకులు, పరిశోధకులు తెలిపిన వస్తువు దృష్ట్యా తెలుగు నవలల వర్గీకరణను తెలియజేసి, కాలువ మల్లయ్య గారు రచించిన నవలలను సామాజిక నవలలు, దళిత నవలలు, వృత్తి నవలలు, చైతన్య స్రవంతి నవలలు, కార్మిక నవలలు, అలభ్య నవలలు అని వర్గీకరించాను. ప్రతి నవలను పరిచయం చేస్తూ, నవలా వస్తువును తెలియజేసి, నవలల్లోని వస్తువును విశ్లేషించాను.

**నాల్గవ అధ్యాయం: కాలువ మల్లయ్య నవలలు – పాత్ర చిత్రణ:**

ఈ అధ్యాయంలో ఆరు శీర్షికలు వాటి ఉపశీర్షికల ద్వారా పాత్రలు, పాత్రచిత్రణను పరిచయం చేసి పాత్రల యొక్క వర్గీకరణను ప్రముఖులు తెలిపినవి తెలియజేశాను. కాలువ మల్లయ్య నవలల్లోని పాత్రల పేర్లను తెలియజేశాను. సాహితీకారులు, విమర్శకులు, పరిశోధకులు తెలిపిన పాత్రల వర్గీకరణను ఆధారంగా చేసుకొని కాలువ మల్లయ్య నవలల్లోని పాత్రలను ప్రధాన పాత్రలు, ఆదర్శ పాత్రలు, సందేశాత్మక పాత్రలు, సహాయక పాత్రలు అని నాలుగు రకాలుగా వర్గీకరించి ఆ పాత్రల పాత్రచిత్రణలోని పాత్ర స్వభావం, ప్రయోజనం, వైశిష్ట్యం, వైవిధ్యాలను విశ్లేషించాను.

**ఐదవ అధ్యాయం: కాలువ మల్లయ్య నవలలు – రచనా శిల్పం:**

ఈ అధ్యాయంలో పద్నాలుగు శీర్షికల ద్వారా శిల్పాన్ని పరిచయం చేసి, ప్రముఖులు తెలిపిన శిల్ప నిర్వచనాలను తెలియజేశాను. శిల్పంలో భాగంగా కాలువ మల్లయ్య నవలల్లో ఉన్న భాగాలు, నిడివి, ఎత్తుగడ, ముగింపు, నవల శీర్షిక ఔచిత్యం, పాత్రోచిత భాష, దృష్టి కోణం, మాండలికాలు,

సామెతలు, జాతీయాలు, ధ్వన్యనుకరణ పదాలు, జంటపదాలు, అన్యదేశ్యాలు, కాలువ మల్లయ్య రచనాశైలిని విశ్లేషించాను.

ముగింపులో కాలువ మల్లయ్య నవలల్లోని సారాంశాన్ని తెలియజేసి, పరిశోధన ఫలితాలను వెల్లడించాను.

ఈ సిద్ధాంత గ్రంథ రచనకు ఉపయోగించిన ఆధార గ్రంథాలను ఉపయుక్త గ్రంథసూచిలో తెలిపాను. ఈ పరిశోధన గ్రంథం చివర్లో మూడు అనుబంధాలను జతపరిచాను. మొదటి అనుబంధంలో రచయిత డా॥ కాలువ మల్లయ్యగారితో తీసుకున్న ఇంటర్వ్యూను పొందుపరిచాను. కాలువ మల్లయ్య జీవితం, సాహిత్యం నేపథ్యంగా ప్రశ్నావళి రూపంలో కొన్నింటిని తయారుచేశాను.

రెండవ అనుబంధంలో రచయిత డా॥ కాలువ మల్లయ్యగారితో దిగిన ఛాయచిత్రాలను పొందుపరిచాను.

మూడవ అనుబంధంలో యు.జి.సి. కేర్ జర్నల్ భావవీణలో ప్రచురించిన పరిశోధన పత్రాలను, అలాగే వివిధ జాతీయ, అంతర్జాతీయ సదస్సులలో సమర్పించిన పరిశోధనా వ్యాసాల ధృవీకరణ పత్రాలను పొందుపరిచాను.

ఈ పరిశోధన గ్రంథ రచనకు ఉపయోగించిన ఉపయుక్త గ్రంథాల వివరాలను కొన్ని కొటేషన్స్ (Bibliographic Information & Citations) కూర్చడంలో American Psychological Association (APA) వారి శైలి గ్రంథాన్ని అనుసరించాను.

## VI . పరిశోధన గ్రంథ రచన – ప్రధాన ఆధార గ్రంథాలు:

ఈ పరిశోధన గ్రంథ రచనలో 'కాలువ మల్లయ్య నవలలు – వస్తు విశ్లేషణ' అనే పరిశోధనాంశాన్ని పరిశీలించాను. ఈ సిద్ధాంత గ్రంథ రచనకు ప్రధానంగా ఉపయోగించిన గ్రంథాలను కింద తెలియజేస్తున్నాను.


1) అయిలయ్య, బన్న. 2010. కాలువ మల్లయ్య కథలు – తెలంగాణా జనజీవితం. వరంగల్:నానీ ప్రచురణలు.

2) జయప్రకాష్, ఎస్. 2009. పరిశోధన విధానం. హైదరాబాద్: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్. తొమ్మిదవ ముద్రణ.

3) ప్రతాపరెడ్డి, కాసుల. 2017. తెలంగాణ నవలా వికాసం. హైదరాబాద్: తెలంగాణ సాహిత్య అకాడమీ.

4) మధుసూదనరావు, త్రిపురనేని. 2010. సాహిత్యంలో వస్తుశిల్పాలు. హైదరాబాద్. పర్స్పెక్టివ్ పబ్లిషర్.

5) మల్లయ్య, కాలువ. 2001. కాలువ మల్లయ్య నవలలు. కరీంనగర్: తెలుగు వచనం ప్రచురణలు.

6) మల్లయ్య, కాలువ. 2002. డబ్బు మైనస్ తృప్తి = దుఃఖం. విజయవాడ: స్వాతి సచిత్రమాసపత్రిక.

7) మల్లయ్య, కాలువ. 2005. గువ్వలచెన్నా. హైదరాబాద్: చతుర మాసపత్రిక.

8) మల్లయ్య, కాలువ. 2011. తెలంగాణ దేవదాసు. విజయవాడ: స్వాతి సచిత్ర మాసపత్రిక.

9) మల్లయ్య, కాలువ. 2014. మంచియన్నది మాల అయితే.. . హైదరాబాద్: సామాజిక భారత్ ప్రచురణలు.

10) మల్లయ్య, కాలువ. 2015. మాదిగ విజయం. హైదరాబాద్: సామాజిక భారత్ బి.వి.వి. ఛారిటబుల్ ట్రస్టు.

11) మల్లయ్య, కాలువ. 2017. అస్పృశ్యకోయిల. హైదరాబాద్: లిఖిత ప్రెస్.

12) మల్లయ్య, కాలువ. 2017. మెతుకుపుస్తకం. హైదరాబాద్: బి.వి.వి. ప్రచురణలు.

13) మల్లయ్య, కాలువ. 2019. గులాంగిరి చోడో. హైదరాబాద్: బి.వి.వి. ప్రచురణలు.

14) మల్లయ్య, కాలువ. 2000. బతుకుపుస్తకం. హైదరాబాద్: లైఫ్–లైన్ కమ్యూనికేషన్స్.

15) మృణాళిని, సి. 1988. సాంఘిక నవల – కథనశిల్పం. హైదరాబాద్: తెలుగు పరిశోధన ప్రచురణలు.

16) వెంకటసుబ్బయ్య, వల్లంపాటి. 1994. నవలాశిల్పం. హైదరాబాద్: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్.

17) సుజాతరెడ్డి, ముదిగంటి. 1990. తెలుగు నవలానుశీలనము. హైదరాబాద్: రోషణమ్ పబ్లికేషన్స్.

ఈ పరిశోధనా గ్రంథంలో రచయితను ఉద్దేశించి సందర్భానుసారంగా గౌరవార్థానికి బదులుగా ఏకవచనంలో సంబోధించడం జరిగింది. అన్యథా భావించవద్దు.

ఈ పరిశోధన గ్రంథం పండిత, పరిశోధకుల ఆమోదం పొందగలదని ఆశిస్తూ సూచనలు, సలహాలు, సవరణలను తెలియజేస్తే శిరోధార్యంగా స్వీకరిస్తానని సవినయంగా మనవి చేసుకుంటున్నాను.

# మొదటి అధ్యాయం

# కాలువ మల్లయ్య జీవిత విశేషాలు

## మొదటి అధ్యాయం

## కాలువ మల్లయ్య జీవిత విశేషాలు

### 1.0. పరిచయం:

తెలుగు సాహిత్యం పద్య కావ్యాల నుండి కవిత్వం, నవల, కథ, నాటకం, మినీ కవితలు, హైకూలు, రెక్కలు వంటి ఆధునిక ప్రక్రియల వరకు విస్తరిస్తూనే ఉంది. కాలానుగుణంగా కవులు, రచయితలు నూతన ప్రక్రియలు సృష్టిస్తూ రచనలు చేస్తూనే ఉన్నారు. యువతరం రచయితలు కూడా వెలుగులోకి వస్తూనే ఉన్నారు. ఎన్ని ప్రక్రియలు ఉన్నప్పటికి సంఘ జీవితాన్ని ఉన్నది ఉన్నట్లుగా చిత్రించి మధ్యతరగతి ప్రజల జీవిత సమస్యలను సాహిత్యంలోకి ప్రవేశపెట్టిన ఘనత నవలా ప్రక్రియకే చెందుతుంది. తెలుగు నవల కందుకూరి వీరేశలింగంగారితో ప్రారంభమై శాఖోపశాఖలుగా విస్తరించి 2013వ సంవత్సరంలో రావూరి భరద్వాజగారి 'పాకుడురాళ్ళు' నవలతో జ్ఞానపీఠ పురస్కారాన్ని అధిరోహించింది. తెలుగు నవలలు ఎన్నో ఇతర భాషల్లోకి అనువాదాలు అవుతున్నాయి. ఎంతో ప్రసిద్ధి చెందిన తెలుగు నవలా రచయితలు ఎందరో ఉన్నారు. తమకు ఇష్టమైన ఇతివృత్తాలను స్వీకరించి నవలలు రాస్తున్నారు. సమాజంలోని అనేక సమస్యలను చిత్రిస్తూ, పరిష్కార మార్గాలను చూపిస్తూ చైతన్యాన్ని సాధిస్తున్నారు నవలాకారులు. అలా తన నవలల ద్వారా సమాజ చైతన్యాన్ని కాంక్షించిన రచయితలలో కాలువ మల్లయ్యగారు ఒకరు. ఇటీవల కాలంలో తెలంగాణలో తన రచనల ద్వారా తెలంగాణ గ్రామీణ జీవనం, ఆచార వ్యవహారాలు, సంస్కృతి సంప్రదాయాలు, విశ్వాసాలు, పండుగలు మొదలైన వాటిని తనదైన శైలిలో సాహిత్య సృష్టిని చేస్తున్న రచయితలలో కాలువ మల్లయ్యగారు ప్రముఖులు. కాలువ మల్లయ్య బహుముఖ ప్రజ్ఞాశాలి. కథా రచయితగా, నవలాకారునిగా, నాటక కర్తగా, దృశ్యమాధ్యమ రచయితగా, సంపాదకుడిగా, వ్యాసకర్తగా, సినిమా రచయితగా కాలువ మల్లయ్యగారు తన రచన వ్యాసంగాన్ని సృష్టించారు.

### 1.1. కుటుంబ నేపథ్యం:

ఒక రచయిత యొక్క సాహిత్య విలువలు తెలుసుకోవాలంటే ఆ రచయిత యొక్క సామాజిక వర్గాన్ని, రచయిత పెరిగిన పరిసరాలను, వారి కుటుంబ నేపథ్యాన్ని తెలుసుకోవడం ద్వారా ఆనాటి దేశ, కాల, సామాజిక పరిస్థితులు తెలుస్తాయి. తద్వారా వారి రచనల్లో ప్రతిబింబించే సామాజిక స్పృహను అంచనా వేసి సమాజానికి తెలపడం జరుగుతుంది.

దేశ ప్రధాని జవహార్‌లాల్ నెహ్రూ కుటుంబం పూర్వీకులు 'నహర్' ప్రక్కన నివసించడం వల్ల 'నెహ్రూ' అని ఇంటిపేరు వచ్చినట్లుగా కాలువ మల్లయ్య కుటుంబీకులు కూడా పూర్వం కాలువల ఒడ్డున నివసించడం వల్లనే 'కాలువ' అనేది ఇంటిపేరుగా వ్యాప్తి చెందిందని కాలువ మల్లయ్య గారి అభిప్రాయం. 'నెహర్' అన్న 'కాలువ' అన్న ఒక్కటే అర్థం.

కాలువ ఓదేలు, పోచవ్వ దంపతులకు ఇద్దరు సంతానం. ఒకరు కాలువ మల్లయ్య, మరొకరు కాలువ సత్తమ్మ. కాలువ మల్లయ్య తాత లసువయ్య, నానమ్మ కొమురమ్మ. కాలువ మల్లయ్యగారి కుటుంబం తాతల కాలం నుండి కూడా వ్యవసాయాధారిత కుటుంబం. వీరి కులం గొల్ల (యాదవ) కావడంవల్ల వీరికి గొర్రెల పెంపకం జీవనోపాధి.

కాలువ మల్లయ్య తండ్రి ఓదేలు ఊరిలో పెద్ద గొల్ల. గొల్లలకు పంచాయితీలు చెప్పేవాడు. ఓదేలు నాల్గవ తరగతి వరకు చదవడం వలన కొంత అక్షర జ్ఞానం కలవాడు. ఓదేలుకు జానపద సాహిత్యంతో విడదీయరాని అనుబంధం కలదు. జానపద కథల్లోని కాటమరాజు కథలు, గంగాదేవి కథలు, భాగవతుల కథలు, శారదకాళ్ళ కథలు, తోలు బొమ్మలాటలు, పులివేషాలు మొదలైన జానపద కళలను మందెచ్చులవారు, కొమ్మోల్లు, ఒగ్గోల్లు, రాజన్నలవారు, గంగిరెద్దులవారు, పెద్దమ్మలవారు, బీరన్నల లాంటివారు కుర్మలకు కథలు చెప్పుతూ, ఒగ్గు, కొమ్ము, డోలు, వాయిద్యాలతో మోగిస్తూ ప్రదర్శించేవారట. వాటిని కాలువ మల్లయ్య ఎంతో ఆసక్తిగా చూసేవాడట. ఊరి పంతులు వెంకటయ్యతో కలిసి ఓదేలు యాదవ అజ్ఞాన విజ్ఞాన ఒగ్గుకథను చెప్పేవాడట. అమాయకులైన గొల్లలను విజ్ఞానవంతులను చేయడానికి జిల్లా అంతా తిరిగి ఒగ్గు కథలు చెప్పేవారట. ఈవిధంగా జానపదుల ప్రదర్శనలు కాలువ మల్లయ్యకు ఆసక్తిని పెంచి రచయితగా ఎదిగే క్రమంలో ఉపయోగపడ్డాయని తెలుస్తుంది.

కాలువ మల్లయ్య విద్యార్థి దశలో ఉన్నప్పుడు నలభై ఏళ్ళ వయస్సు ఉన్న గొర్లకాపరియైన అతని చిన్నాన్నను, పదిహేను సంవత్సరాలు కూడా లేని రెడ్డి కులస్థుడు 'గొల్లోడా నీ గొర్రె చెండ్లో పడిందిరా' అని బూతులు తిడుతూ కొట్టడం లాంటి సంఘటన చూసి, గొల్లలు కూడా పీడితులే అనిపించి, పీడిత జాతుల పక్షాన రచనలు చేయాలనిపించి, వారికి న్యాయం జరగాలన్న తపనతో రచనలు చేస్తున్నాడు. ఇటువంటి చిన్న సంఘటనతోపాటు అతని కుటుంబ నేపథ్యం కాలువ మల్లయ్యను రచయితను చేసింది.

## 1.2. బాల్యం – విద్యాభ్యాసం:

ఒకప్పటి కరీంనగర్ జిల్లా ప్రస్తుత పెద్దపల్లి జిల్లా జూలపల్లి మండలంలోని తేలుకుంట గ్రామం కాలువ మల్లయ్య జన్మస్థలం. తేలుకుంట గ్రామంలోని దిగువ మధ్యతరగతి కుటుంబమైన గొల్ల (యాదవ) కులంలో శ్రీ కాలువ ఓదేలు, శ్రీమతి పోచవ్వ దంపతులకు 1952వ సంవత్సరం జనవరి పన్నెండవ తారీఖున కాలువ మల్లయ్య జన్మించాడు. కాలువ మల్లయ్య బాల్యం అంతా తాను పుట్టి పెరిగిన తేలుకుంట గ్రామంలోనే గడిచింది. 1952వ సంవత్సరం జనవరిలో పుట్టిన కాలువ మల్లయ్య ఇరవై మూడు సంవత్సరాలు తేలుకుంట గ్రామంలో మట్టిలో మట్టిగా, ఆడుతూ పాడుతూ, ఎగురుతూ, దుముకుతూ, పొలాల గట్ల వెంట పరిగెడుతూ, చేలల్లో చెలకల్లో, చెరువుల్లో, ఊరి దగ్గర వున్న కొండల్లో కోనల్లో, గొర్ల వెంట తిరుగుతూ, వ్యవసాయపు పనులు చేసుకుంటూ పల్లె జీవన సంస్కృతి, ఆచార వ్యవహారాలు అన్నింటిని ఆస్వాదిస్తూ బాల్య జీవితాన్ని గడిపాడు.

కాలువ మల్లయ్య తండ్రి ఓదేలుకు చదువంటే అమితమైన ఇష్టం. శ్రమను నమ్ముకొని బతికిన తన తరం వాళ్ళకు చదువు అందకుండా పోవడంతో ఓదేలు తన కొడుకుకైనా విద్యాబుద్ధులు నేర్పించాలనుకున్నాడు. గ్రామంలోని దొరను కాదని దొరకు ఎదురు తిరిగి విద్యాభ్యాసం చెప్పించాలని ఓదేలు దంపతులు నిర్ణయించుకొని కాలువ మల్లయ్యను బడికి పంపించారు. తండ్రి అభీష్టం మేరకు ఒకటవ తరగతి నుండి తొమ్మిదవ తరగతి వరకు స్వస్థలమైన తేలుకుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుకున్నాడు. ఇక్కడే కాలువ మల్లయ్య కవిత్వం రాయడానికి పునాదులు పడింది. పాల్కురికి సోమనాథుని ద్విపద పాఠ్య భాగంగా ఉంటే అది చదివి మరొక ద్విపద రాసి టీచర్‌కు చూపిస్తే కవిత్వం నువ్వు రాయకూడదు, బ్రాహ్మణ కులంవారు మాత్రమే కవిత్వం రాయాలని పీడిత కులమైన గొల్లలు కవిత్వం రాయకూడదని నిరుత్సాహ పరిచాడు. ఎనిమిదవ తరగతి చదువుతున్నప్పుడు తుపాకీరాముడు ఏకపాత్రాభినయం లాంటి నాటకం రాసి, జనవరి ఇరవైఆరు గణతంత్ర దినోత్సవం రోజున కాలువ మల్లయ్య ఆ పాత్రలో నటించి అందరిని కడుపుబ్బ నవ్వించేవారట. ఎనిమిదవ తరగతిలోనే అంత కల్పనాచాతుర్యంతో రాయడంతో అందరూ మెచ్చుకునేవారట. నాటకాల్లో పడి చదువును నిర్లక్ష్యం చేయొద్దని హెచ్చరించినవారూ ఉన్నారు.

పదవ తరగతి, హెచ్.ఎస్.సి.ని తేలుకుంటకు ఏడు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఎలిగేడులో పూర్తి చేశాడు. అక్కడ కాలువ మల్లయ్యకు తెలుగు సారు మలయశ్రీగారు. మలయశ్రీగారు కాలువ మల్లయ్య పదవ తరగతిలో ఉన్నప్పుడు 'కావ్యసుందరి' రచనను ప్రచురించాడు. మలయశ్రీగారి

ప్రోత్సాహంవల్ల హేతువాదంపై మొగ్గు చూపేటటువంటి రచనలు చేయడానికి కారణమైంది. పాఠశాలలో ఆగస్టు పదిహేను స్వాతంత్ర్య దినోత్సవం, జనవరి ఇరవై ఆరు గణతంత్ర దినోత్సవ పోటీల్లో ఉపన్యాస, వ్యాసరచన పోటీల్లో ప్రథమ బహుమతులు పొందేవాడు. కాలువ మల్లయ్య H.S.C. లో ఉన్నప్పుడు పాఠశాల మ్యాగజైన్ కథల పోటీలో 'దెబ్బకు దెబ్బ', 'దేవుడు తూలడం' పేరు మీద కథకు మొదటి బహుమతి వచ్చింది. బహుమతిగా డైరీ ఇస్తే ఆ డైరీలో ఆ తరువాత కాలంలో కవితలు, చిన్న చిన్న కథలు రాసి పొందుపరిచేవాడు. అలా పాఠశాల చదువు ముగిసింది.

కరీంనగర్ SRR డిగ్రీ కళాశాలలో P.U.C., B.Sc. (MPC) చేశాడు. అక్కడ కాలువ మల్లయ్యకు గ్రామంలో చదవడానికి అవకాశం లేని వారపత్రికలు, మాస పత్రికలు, కథలు, అనేక పుస్తకాలు చదివే అవకాశం లభించింది. కవి సమ్మేళనాలకు, సమావేశాలకు, గ్రంథాలయాలకు పోవడం జరిగేది. M.P.C.తో P.U.C. కాని B.Sc. కాని చదవడం మంచి మార్కులు సాధించడం కష్టమే అయిన చదువుకు సంబంధించిన అన్ని పనులు పూర్తి చేసుకుంటూనే సమావేశాలకు వెళ్ళేవాడు. యద్దనపూడి సులోచనారాణి, మాదిరెడ్డి సులోచన, పోల్కంపల్లి శాంతాదేవి, వాసిరెడ్డి సీతాదేవి, రంగనాయకమ్మవంటి స్త్రీవాద రచయితల సాహిత్యం చదివేవాడు. కొన్ని యద్దనపూడి మార్కు నవలలు చదివిన తరువాత ఆ ప్రభావంతో PUC అయిపోయిన తరువాత ఎండాకాలం సెలవుల్లో 1972 మే, జూన్ నెలలో ఒక నవల రాయడం ప్రారంభించాడు కాలువ మల్లయ్య. ఆ నవలను ఎండాకాలం సెలవుల్లో ఎడ్లు మేపడానికి వెళ్ళి మామిడిచెట్టు కింద కూర్చొని రాశాడు. ఎండాకాలం సెలవుల్లో నవల పూర్తి చేశాడు. దాని పేరు ముందుగా 'విధివ్రాలు' అని పెట్టాడు. ఆ తరువాత 'విధివ్రాలా?' అని పేరు మార్చాడు. బ్రహ్మరాతను బట్టి కాదు మనం చేసుకున్న పనులను బట్టే మన భవిష్యత్తు, జీవన విధానం, అభివృద్ధి ఉంటుంది అనేది ఆ నవల సారాంశం. కాలువ మల్లయ్య ఆ నవలపై మలయశ్రీగారిని చదివి అభిప్రాయం చెప్పమని తెలిపాడు. కాలువ మల్లయ్య B.Sc.లో చేరిన ఆరు నెలల తరువాత వెళ్ళితే మలయశ్రీగారు ఆ నవల పోయిందని చెప్పాడు. కాలువ మల్లయ్య B.Sc.లో మళ్ళీ ఆ నవలను రాసి జీవగడ్డ విజయకుమార్‌గారికి ఇస్తే అతను కూడా ఆ నవలను గురించి పట్టించుకోకపోవడంతో చదువు ధ్యాసలో పడి ఆ నవల అలాగే ఉండిపోయింది. ఆ నవల అలాగే డైరీ రూపంలో ఉండటంవల్ల తరువాత కొంత కాలానికి డైరీ కనిపించకపోవడంతో ప్రస్తుతం ఆ నవల అందుబాటులో లేదు. కాలువ మల్లయ్య B.Sc. చదువుతున్న రోజుల్లోనే మలయశ్రీ ఓ కవితా సంకలనం వేశాడు. ఆ సంకలనంలో కాలువ

మల్లయ్య కవిత 'స్వార్థం' అచ్చయింది. 1972వ సంవత్సరం 'కవితా తరంగణి' సంకలనంలో ఈ కవిత ప్రచురింపబడింది.

వరంగల్ ఉపాధ్యాయ శిక్షణ కళాశాలలో 1975వ సంవత్సరం జూన్‌లో కాలువ మల్లయ్య B.Ed. చదువు పూర్తయింది. అదే నెలలో పెళ్లయింది.

- M.Sc. (A.I.C) పట్టాను కొలకత్తా యూనివర్సిటీ నుండి పొందాడు.
- తెలుగు భాషా సాహిత్యంపై గల మక్కువతో 1985వ సంవత్సరంలో ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి M.A. తెలుగు డిగ్రీ పట్టా పొందాడు.
- 1986వ సంవత్సరంలో డా॥ బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం నుండి P.G.D.P.R. డిప్లొమా పూర్తి చేశాడు.
- 1993వ సంవత్సరం ఉస్మానియా విశ్వవిద్యాలయంలో 'తెలుగులో ప్రగతిశీల కథాసాహిత్యం' అనే అంశంపై డా॥ పి.వి. చలపతిరావుగారి పర్యవేక్షణలో పరిశోధన చేసి పిహెచ్.డి. పట్టాను పొందాడు.

## 1.3. వివాహ జీవితం:

కాలువ మల్లయ్యకు 1975 జూన్ 4వ తేదీన విజయలక్ష్మితో వివాహమైంది. కాలువ మల్లయ్య మామ S.K. పిళ్ళై అభ్యుదయ కవి. పెళ్ళయ్యే నాటికే కాలువ మల్లయ్యకు సాహిత్యంలో ప్రవేశమున్నా మామ పిళ్ళై కవిత్వం రాయమని ఎక్కువగా ప్రోత్సహించేవాడట. విద్యావంతురాలైన విజయలక్ష్మి కాలువ మల్లయ్య రచనా వ్యాసాంగానికి ఎంతగానో సహకరిస్తుంది. కాలువ మల్లయ్య, విజయలక్ష్మి దంపతులకు ఇద్దరు పిల్లలున్నారు. కుమారుడు అభ్యుదయ్, కుమార్తె సాహిత్య. తనకు సాహిత్యంపై ఉన్న అభిరుచి మేరకు కాలువ మల్లయ్య తన పిల్లలకు పేర్లు పెట్టాడనిపిస్తుంది. అభ్యుదయ్ ఇంజనీరింగ్ హైదరాబాద్‌లో చదివి, U.S.లో M.S. పూర్తిచేసి, ప్రస్తుతం చెన్నైలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నాడు. అభ్యుదయ్ భార్య జ్యోత్స్న. వీరికి 2016లో వివాహం జరిగింది. కాలువ మల్లయ్యకు కూతురు సాహిత్య అంటే ప్రాణం. సాహిత్య M.Pharmacy పూర్తి చేసిన తరువాత శ్రీనివాస్‌తో వివాహం అయింది. ప్రస్తుతం కాలువ మల్లయ్య అల్లుడు దాడి శ్రీనివాస్ బెంగళూర్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నాడు. కాలువ మల్లయ్య పిల్లలను బాగా చదివించి విద్యావంతులుగా తీర్చిదిద్దాడు. తల్లిదండ్రులు పిల్లలకు ఇవ్వాల్సింది ధనం మూటలను కాదు, హాయిగా, సుఖవంతంగా, ప్రయోజనకరంగా బతకడానికి ఉపయోగపడే జ్ఞానాన్ని ఇస్తే చాలు వారు ఎంతో ఉన్నత స్థాయికి చేరుతారని నమ్మిన వ్యక్తి కాలువ

మల్లయ్య. వారి పిల్లలకు కూడా కాలువ మల్లయ్య అదే విజ్ఞతను నేర్పించాడు. ఎన్ని డిగ్రీలున్నా రచయితగా ఎంతో పేరున్నా 65 ఏళ్ళ వయస్సు దాటినా పొట్ట నింపుకోడానికి ఏదో ఒక పని చేస్తూ కష్టార్జితంతో ఎదగాలన్న ధ్యేయంతో బతుకు జీవనం గడుపుతున్న వ్యక్తి కాలువ మల్లయ్య. కాలువ మల్లయ్య పిల్లలపై ఆధారపడకుండా బతకాలని నిర్ణయించుకొని ఆ విధంగానే జీవన యాత్ర కొనసాగిస్తున్నాడు.

## 1.4. ఉద్యోగ జీవితం:

కాలువ మల్లయ్య 1975లో B.Ed. పూర్తిచేసిన నాలుగు నెలల్లోనే ఉద్యోగం సంపాదించాడు. 1975 డిసెంబర్ నుండి 1976 ఏప్రిల్ వరకు నిజామాబాద్ జిల్లాలోని మాక్లూర్ హైస్కూల్‌లో గణిత ఉపాధ్యాయుడిగా ఉద్యోగం చేశాడు. కాలువ మల్లయ్యకు ఉపాధ్యాయ పదవి అంటే చాలా అభిమానం. దేశ భవిష్యత్తును తీర్చిదిద్దేది ఉపాధ్యాయుడేనని అతని గాఢ నమ్మకం. టీచర్‌గా పనిచేసింది నాలుగు నెలలే అయిన ఎన్నో సంవత్సరాల అనుభూతి పొందాడు. టెన్త్ క్లాసు పిల్లలకు ట్యూషన్ చెప్పుకుంటూ ఉపాధ్యాయ వృత్తిలో చాలా ఆనందంగా గడిపేవారట. మాక్లూర్‌లో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న సమయంలోనే సింగరేణిలో ఓవర్‌మెన్ ఉద్యోగం కొరకు కాల్ లెటర్ వచ్చిందని కొత్తగూడెం వెళ్ళి వ్రాత పరీక్ష, ఇంటర్వ్యూ, ఆరోగ్య పరీక్షలకు హాజరయ్యాడు. ఉద్యోగం వచ్చినట్లు లేఖ వస్తే ఉపాధ్యాయ వృత్తి మీద ఉన్న ప్రేమతో ఆ ఉద్యోగానికి వెళ్ళలేదు. మరి కొంత కాలం తరువాత కుటుంబ సభ్యుల కోరిక మేరకు ఫెర్టిలైజర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, రామగుండంలో కెమిస్ట్ ఉద్యోగం కొరకు అప్లై చేశాడు. ఆ కంపెనీలో వివిధ రకాల పరీక్షలు పూర్తిచేసి ఉద్యోగం సంపాదించాడు. ఇంటికి దగ్గరగా ఉంటుందని కొందరు, కేంద్ర ప్రభుత్వం ఉద్యోగంకు వెళ్లమని కొందరు చెప్పారు. రకరకాల తర్జనభర్జనల మధ్య ఉపాధ్యాయ వృత్తిని వదిలి కెమిస్ట్ ఉద్యోగంలో చేరాడు.

1976 ఏప్రిల్ 21న రామగుండం FCI లో ఆపరేటర్‌గా ఉద్యోగంలో చేరాడు. ఆ తరువాత క్రమక్రమంగా పదోన్నతి జరిగి జూనియర్ కెమిస్ట్, చార్జ్‌మెన్, సీనియర్ కెమిస్ట్, గ్రేడ్–2, గ్రేడ్–1లనుండి డిప్యూటి చీఫ్ కెమిస్ట్ పదవుల వరకు ఎదిగాడు. ఇరవై ఏడు సంవత్సరాలు ఆ కంపెనీలో ఉద్యోగం చేసి ప్రపంచీకరణ, సరళీకరణ, ఆర్థిక విధానాలు తీసుకువచ్చిన విధ్వంసంలో యాభై ఒక్కటి సంవత్సరాల వయస్సులో కాలువ మల్లయ్య బలవంతపు పదవీ విరమణ పొంది హైదరాబాద్‌కు వచ్చారు. ఆ తరువాత కాలం నుండి చిన్న చిన్న ఉద్యోగాలు చేస్తూ జీవనం

సాగిస్తున్నాడు. రామగుండం, గోదావరిఖనిలో గడిపిన ఇరవై ఏడు సంవత్సరాలు కాలువ మల్లయ్యను సాహిత్యంలో మహోన్నత దశకు తీసుకువచ్చింది.

పిహెచ్.డి.లో చేరిన తరువాత నుండి కాలువ మల్లయ్య గోదావరిఖని జూనియర్ కళాశాలలో ఉన్న డా॥ B.R. అంబేద్కర్ విశ్వవిద్యాలయం స్టడీ సెంటర్‌లో డిగ్రీ విద్యార్థులకు పాఠాలు బోధించేవాడు. SDLC డిగ్రీ కాలేజిలో తెలుగు, సైన్స్ కౌన్సిలర్‌గా పనిచేశాడు. పని చేయాలన్న కోరికను ఇలా తీర్చుకున్నాడు. అంబేద్కర్ విశ్వవిద్యాలయంలో తెలుగు కౌన్సిలర్‌గా పనిచేస్తున్న సమయంలో పేపర్లు దిద్దేవాడు. ఇలా పద్దెనిమిది సంవత్సరాలు పనిచేశారు. ఇరవై సంవత్సరాలు స్పాట్ వాల్యుయేషన్‌లో పనిచేశాడు. 2005 సంవత్సరంలో అధికార భాషా సంఘం సభ్యుడిగా ఉండి దాదాపు రెండు సంవత్సరాలు పనిచేశాడు. ప్రస్తుతం తెలంగాణ అకాడమిలో విషయ నిపుణులుగా పనిచేస్తూ జీవనం గడుపుతున్నాడు.

## 1.5. రచనా వ్యాసంగం:

కాలువ మల్లయ్య సాహితీ రంగంలో అడుగు పెట్టడానికి అనేక అంశాలు అతనిపై ప్రభావాన్ని చూపాయి. కాలువ మల్లయ్య రచయిత అవ్వడానికి ప్రధాన కారణం తండ్రి ఓదేలు అనిపిస్తుంటుంది. కాలువ మల్లయ్య తండ్రి ఓదేలు చదువుకున్నది తక్కువే అయినా చాలా రకాల పుస్తకాలు చదివేవాడట. రామాయణం, మహాభారతం, భాగవత పురాణాలు, సత్యార్థ ప్రకాశిక, తెనాలి రామలింగని కథలు, భట్టి విక్రమార్క కథలు, బ్రహ్మంగారి కాలజ్ఞానం, భేతాళ కథలు మొదలైన ప్రాచీన గ్రంథాలతో పాటు నవలలు, కథలు, డిటెక్టివ్ సాహిత్యం వరకు చదివేవాడు. గ్రంథాలయం నుండి వీటిని ఇంటికి తీసుకువచ్చి చదువుకునేవాడు. రామాయణం, మహాభారతం లాంటి పుస్తకాల్లోని పద్యాలను ఓదేలు చదివి దాని తాత్పర్యం మల్లయ్యకు వివరించేవాడట. తండ్రి నుండి నిరంతరంగా పుస్తకాలు చదవడానికి ప్రేరణ పొందితే, తల్లి పోచవ్వ నుండి తెలంగాణ భాషను ఎలా వాడాలో నేర్చుకున్నాడు. తెలంగాణ మాండలిక భాషను నేర్చుకొని సందర్భాన్ని బట్టి తన రచనలలో దానిని వాడుకున్నాడు.

కాలువ మల్లయ్య సాహిత్యంలో దాదాపుగా మొత్తం దళిత పీడిత కులాల పాత్రలే ఉంటాయి. ఆవేశంతో వచ్చేది పద్యం, ఆలోచనతో వచ్చేది వచనం అని కాలువ మల్లయ్య అంటారు. సహజమైన ఆలోచనా ప్రవృత్తి ఆయన సహజ గుణం. ఆ గుణంతోనే రచనలు చేయడం ప్రారంభించారు.

### 1.5.1. కథా రచయితగా కాలువ మల్లయ్య:

నా దేశం యొక్క శ్రేయస్సు గ్రామాల్లో ఉంది. నేను అటువంటి గ్రామాల్లో పుట్టడం వల్లె ఆ పల్లె ఋణం తీర్చుకోవడానికి రాస్తున్నానంటారు కాలువ మల్లయ్య (మల్లయ్య, కాలువ.1999:పుట.xxii). కరుడు గట్టిన అజ్ఞానం, మూఢ నమ్మకాలు, మూర్ఖపు బ్రతుకులు, ఆకలి, పేదరికం, అనారోగ్యం, బురదలోకి కురుకుపోయిన ఈ ప్రజానీకపు అభివృద్ధికి మార్గం ఏమిటి? అని ప్రశ్నించుకోనేటట్లు రాయడం రచయిత దృక్పథం. తెలుగు కథా సాహిత్యంలో భూస్వాముల దౌర్జన్యపు కథలు, మధ్యతరగతి వ్యక్తుల కథలు ఎక్కువ సంఖ్యలో రాసిన కథకులు ఉన్నారు. కాలువ మల్లయ్య తన కథల్లో గ్రామీణ ప్రాంతపు స్త్రీల గురించి, ఆ ప్రాంతపు నిరుపేద ప్రజల సాధకబాధకాలను కథావస్తువుగా గ్రహించారు. ఈ రచయిత అట్టడుగు ప్రజలను, గ్రామాలను ప్రేమించే మనిషి కాబట్టి అట్టడుగు వర్గపు బహుజన ప్రజల జీవితపు లోతులను స్పృశించారు. కాలువ మల్లయ్యకున్నది పీడిత కుల నేపథ్యమే.

కాలువ మల్లయ్యకు తండ్రి చెప్పే నోటికథలు, శాత్రాల వల్ల, ఊళ్ళో బతుకమ్మ పాటలు, జానపద కళాకారుల ఆటపాటలు, యాచక వృత్తులవారి ప్రదర్శనలు చూడడటం వల్ల రచనలు చేయాలన్న ఆసక్తిని కలిగించాయట.

మానవ జీవితాన్ని, సంస్కృతిని ప్రతిబింబించే రచనలన్నా, రచయితలన్నా అభిమానమే అని కాలువ మల్లయ్య అంటారు. భారతీయ కథకు అభ్యుదయ పరిమళం అద్ది, హిందీ ప్రాంత జీవన సంస్కృతిని, సంప్రదాయాలను విస్తృతంగా చిత్రించిన ప్రేమ్‌చంద్, మొట్టమొదటి రచన చేసి తెలంగాణ జన జీవన సంస్కృతిని సంప్రదాయాలను దేశీయ ఛందస్సులో అక్షరబద్ధం చేసిన పాల్కురికి సోమనాథుడన్నా కాలువ మల్లయ్యకు ఇష్టమే. అంతేగాక మంచికి దోహదం చేసి సమాజాన్ని పురోగమన దిశలో పయనింపజేసే ఏ రచయితనైనా అభిమానించడం కాలువ మల్లయ్య సహృదయతకు నిదర్శనం. కొడవటిగంటి కుటుంబరావు, కాళీపట్నం రామారావు, రావిశాస్త్రి, దాశరథి రంగాచార్యుల రచనలను అమితంగా అభిమానిస్తారు.

శ్రీశ్రీ ప్రేరణతో, ఆవేశంతో మొదట రచనలు చేయడం ప్రారంభించాడు. తన రచనలకు తన చుట్టూ జరుగుతున్న గ్లోబలైజేషన్‌లో భాగంగా మృగ్యమవుతున్న మానవ సంబంధాలు, జీవితాన్ని గెలుచుకోవడానికి నిరంతరం సాగుతున్న పోరాటాలు, దినదిన గండంగా బతుకుతున్న కార్మికులు, నిరుద్యోగానికి గురి చేస్తున్న చదువులు, జీవచ్ఛవాలై బతుకుతున్న మనుషులు, అనునిత్యం రణక్షేత్రాలుగా మారుతున్న తెలంగాణ గ్రామాలు, బతుకును శాపంగా భావించి తరతరాలుగా

సంఘంలో వివక్షకు గురవుతున్న దళితులు తమ లక్ష్య సాధనకై చేస్తున్న పోరాటాలు, ఎంత చేసిన రెక్కలు ముక్కలు చేసుకుంటున్నా, డొక్కలు నిండక తమకు తెలియని కుట్రకు బలవుతున్న రైతులు, అనునిత్యం జరుగుతున్న సంక్షోభం, సంఘర్షణ వీటన్నింటిని చూస్తూ ఎలా రాయకుండా ఉండగలనని కాలువ మల్లయ్య అంటారు.

తనలో నిరంతరం జరుగుతున్న అంతర్మథనానికి, తనను తాను తెలుసుకోవడానికి రాస్తున్నానంటారు కాలువ మల్లయ్య. ఇంకా "నేను సాహితీవేత్తను అయి ఉండకపోతే ఆత్మహత్య చేసుకునేవాణ్ణి" అనే మాటల ద్వారా రచయిత ఉద్దేశ్యం అర్థమవుతుంది (మల్లయ్య, కాలువ. 1999:పుట.xxii). "సాహిత్యం నాకు మానవ జీవితాన్ని ప్రేమించడం నేర్పింది. నన్ను కర్తవ్యోన్ముఖున్ని చేసింది. నన్ను మనిషిగా తీర్చిదిద్దిన సాహితీ ఋణం తీర్చుకోవడానికి నేను రాస్తున్నానంటారు కాలువ మల్లయ్య" (మల్లయ్య, కాలువ.1999:పుట.xxii).

1982 అక్టోబర్ నెలలో ఒకేసారి వెలి, పాలేరు, పతనం, మార్పు, భ్రమలు అనే ఐదు కథలు తీసుకొని మంచిర్యాల ఏసిసి ఫ్యాక్టరీలో ఉద్యోగిగా ఉన్న అల్లం రాజయ్య దగ్గరకు వెళ్ళాడు. అల్లం రాజయ్యకు అప్పటికే రచయితగా ముఖ్యంగా విప్లవ పత్రికల్లో రాసే రచయితగా మంచి పేరుంది. అల్లం రాజయ్య ఆ కథలను చదివి కథలు బాగున్నాయని చెప్పి స్వల్ప మార్పులతో వివిధ పత్రికలకు పంపమన్నాడు. ఏ కథను ఏ పత్రికకు పంపించాలో కూడా తెలియజేశాడు. ఆ కథలలో 'వెలి'ని సృజన పత్రికకు, 'పాలేరు' కథను అరుణతార పత్రికకు, 'పతనం' కథను నూతన పత్రికకు, 'మార్పు' కథను ప్రజా సాహితి పత్రికకు, 'భ్రమలు' కథను వెల్లువ పత్రికకు పంపించాడు. అన్నింటి కంటే ముందుగా సృజన నుండి 1983 జనవరి సంచికలో వెలి కథ అచ్చయింది. తరువాత మిగతా కథలన్నీ అచ్చయ్యాయి. కాలువ మల్లయ్య ఓ స్పష్టమైన దృక్పథం ఏర్పరచుకొని రచనను తీవ్రంగా తీసుకొని వ్రాయడం ప్రారంభించిన తరువాత అచ్చయిన మొదటి కథ సృజనలో వచ్చిన 'వెలి' కథ. కాని అంతకుముందే పద్దెనిమిది కథలు చిన్న చిన్న పత్రికల్లో అచ్చయ్యాయి కాని వాటికి గుర్తింపు రాలేదు. ఆ కథలను 'కట్నం కథలు' అనే పేరుతో కొంత కాలం తరువాత ముద్రించాడు.

'వెలి కథ' ఒక చాకలి స్త్రీ గురించి రాసిన కథ. ఒక చాకలి స్త్రీని ఊరి దొరలు గ్రామ బహిష్కరణ చేస్తే (వెలి) ఆమె బావ విప్లవోద్యమ స్ఫూర్తితో దొరను ఎదిరించి దొరల ఆధిపత్యంపై తిరుగుబాటు చేసిన బావమరదళ్ళ కథ. ఓ దళితుడైన పాలేరు విప్లవ చైతన్యంతో దొరను ఎదిరించిన కథ 'పాలేరు' కథ. ఒకప్పుడు తెలంగాణ సాయుధ పోరాటాన్ని సమర్థించి కమ్యూనిస్టుగా ఉన్న వ్యక్తి ఆ తరువాత వ్యాపారిగా, పెట్టుబడిదారీ మనస్తత్వంలోకి మారిన రివిజనిస్టు కథే 'పతనం' కథ. ఈ

వ్యవస్థపై ప్రజలకున్న భ్రమలు తొలగిపోవాలని విప్లవించి సమసమాజాన్ని స్థాపించుకోవాలని చేసే కథే 'భ్రమలు'.

కథలు రాయడం ప్రారంభమైన తరువాత భాష విషయంలో ఓ స్పష్టత తెచ్చుకోవడానికి ప్రయత్నించాడు. అల్లం రాజయ్య లాంటి ఒకరిద్దరు తెలంగాణ మాండలిక జీవద్భాషలో కథలు రాస్తున్నారు కాని అవి విప్లవ పత్రికకే పరిమితమయ్యాయి. తెలంగాణ భాషలో కథలు ఎందుకు రాయకూడదు? తెలంగాణ జీవితాన్ని ఎందుకు విశ్వవ్యాప్తం చేయకూడదని బాగా ఆలోచించి ప్రేమ్‌చంద్, టాల్‌స్టాయ్, రావిశాస్త్రి లాంటివారు ప్రాంతీయ జీవితాన్ని తీసుకొని ఆ జీవితానికి విశ్వజనీనత కల్పించేటట్టు రచనలు చేశారు కదా! అందుకే తెలంగాణ భాషను, జీవితాన్ని, సంఘర్షణను సాహిత్యంలో ప్రవేశపెట్టి విశ్వవ్యాప్తం చేయాలని సాహిత్యంలో అదే వస్తువును తీసుకొని రచనలు చేయడం ప్రారంభించారు.

1936–1986 ప్రాంతంలో రాసిన 'అవ్వతోడు గిది తెలంగాణ' శీర్షికలో రాసిన 50 కథలలో ముఖ్యంగా 'పండుగనాడే మెతుకుల బువ్వ', 'ఆగమాగమయింది', 'బతుకుదెరువు లేకుంటయింది', 'మంద మీద తోడేలు పడ్డట్టయింది', 'పురాగటిక్కటాసారు', 'సోసంత్ర మంటేందే?' కథలు వివిధ కులాలపై, వృత్తుల పతనంపై మాండలిక భాషలో రాసినవి. అవి కాలువ మల్లయ్యకు మంచి పేరు ప్రఖ్యాతులు తెచ్చిపెట్టాయి. ఆంధ్ర సచిత్ర వారపత్రికలో వచ్చిన కథ 'తెల్లవారితే', భారతి పత్రికలో వచ్చిన కథ 'కిటుకు'. ఘర్మ జలానికి, వెలుగు లాంటి కథలు మంచి కథకుడుగా కాలువ మల్లయ్యకు పేరు తెచ్చిపెట్టాయి.

ఈ నలభై సంవత్సరాల సాహితీ ప్రస్థానంలో కాలువ మల్లయ్య ప్రస్తుతానికి 1000కి పైగా కథలు రాశాడు. కాలువ మల్లయ్య కథలు, కథల సంపుటాలు ముద్రించబడిన వాటిని కింద పొందుపరుస్తున్నాను.

| క్రమ సంఖ్య | కథలు | ప్రచురించిన సంవత్సరం |
|---|---|---|
| 1. | కట్నం కథలు (17 కథలు) | 1983 |
| 2. | ఘర్మ జలానికి ఖరీదు కట్టే షరాబు లేడు (14 కథలు) | 1991 |
| 3. | రాజు–కోడి (ఆధునిక భేతాళ కథలు) (25 కథలు) | 1992 |
| 4. | మా కథలు – విశాలాంధ్ర ప్రచురణ (30 కథలు) | 1998 |
| 5. | కాలువ మల్లయ్య కథలు (30 కథలు) | 1999 |

| | | |
|---|---|---|
| 6. | అవ్వతోడు గిది తెలంగాణ (36 కథలు) | 1998 |
| 7. | నేలతల్లి (30 కథలు) | 2011 |
| 8. | అంటరానితనం అంబేద్కర్ | 2002 |
| 9. | చెప్పుల తయారీ | 2005 |
| 10. | మన జాతిపిత గాంధీ | 2006 |
| 11. | సంఘ సంస్కర్త వీరేశలింగం | 2006 |
| 12. | చేతి పంపు రిపేరు | 2006 |
| 13. | బాతు–బంగారు గుడ్డు | 2006 |
| 14. | స్నేహం విలువ | 2006 |
| 15. | మాధర | 2006 |
| 16. | చందమామ రావే | 2006 |
| 17. | తప్పెవరిది | 2006 |
| 18. | గరుత్మంతుడు | 2006 |
| 19. | ఎవరు దొంగ | 2006 |
| 20. | తెలంగాణ మట్టికథలు (105 కథలు) | |
| 21. | తెలంగాణ తాతలు చెప్పిన కథలు (125 కథలు) | |
| 22. | గ్లో‘బలి’ కథలు | |
| 23. | జనం కథలు (పోరాట కథలు) | |
| 24. | అంబేద్కర్ సాక్షిగా... (దళిత కథలు) | |
| 25. | బహుజనం కథలు | |
| 26. | తెలంగాణ పిల్లాణి కథలు | |
| 27. | మానవ స్వప్నం (కథల సంపుటి) | |
| 28. | గలుమ (స్త్రీవాద కథలు) | |
| 29. | సినిమా కథలు | |
| 30. | T.V. సీరియల్ కథలు | |
| 31. | మానవత్వం పరిమళించెను... (సెంటిమెంట్ కథలు) | |
| 32. | ‘తెలంగానం’ కథలు | |

| త్వరలో ప్రచురించేవి: | |
|---|---|
| 1. | అవ్వతోడు గిది తెలంగాణే... (కథనాలు) |
| 2. | మల్లయ్య తాత చెప్పిన కథలు |
| 3. | రాజకీయ కథలు |
| 4. | కులం, మతం కథలు |
| 5. | విశ్వమానవ కథలు |

### 1.5.2. నవలాకారునిగా కాలువ మల్లయ్య:

తెలుగు సాహిత్యంలో నవలది ఒక ప్రత్యేక స్థానం. కాలువ మల్లయ్య నవలా ప్రక్రియలో తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నాడు. కాలువ మల్లయ్యకు ఉన్న కుటుంబ నేపథ్యం వలన పీడిత అణగారిన వర్గాల వారి తరపున రచనలు చేసి సాహిత్యంలో ఒక మహోన్నత దశకు చేరుకున్నాడు. మధ్యతరగతి ప్రజల సమస్యలు, రైతు సమస్యలు, దళిత, బహుజనుల సమస్యలు, స్త్రీల సమస్యలు, కార్మిక, గ్రామీణ, వివిధ కుల వృత్తుల వారి సమస్యలను ప్రస్తావిస్తూ కాలువ మల్లయ్య తన నవలల ద్వారా గ్రామీణ జీవన వర్గ సంస్కృతిని, దళిత, బహుజనుల సమస్యలను ఉన్నతీకరించాడు. కాలువ మల్లయ్య మొత్తం 16 నవలలు రాశారు. నవలల వివరాలను ఈ కింద పట్టికలో పొందుపరుస్తున్నా ను.

| క్రమ సంఖ్య | నవలలు | ప్రచురించిన సంవత్సరం |
|---|---|---|
| 1. | భూమి పుత్రుడు | 1991 |
| 2. | సాంబయ్య చదువు | 1995 |
| 3. | మాట్లాడే బొమ్మలు | 1999 |
| 4. | బతుకుపుస్తకం | 2000 |
| 5. | డబ్బు మైనస్ తృప్తి = దుఃఖం | 2002 |
| 6. | గువ్వలచెన్నా | 2005 |
| 7. | చీకట్లో చిరుదీపం | 2010 |
| 8. | తెలంగాణ దేవదాసు | 2011 |
| 9. | మంచియన్నది మాలయైతే | 2014 |
| 10. | మాదిగ విజయం | 2015 |

| | | |
|---|---|---|
| 11. | మెతుకు పుస్తకం | 2017 |
| 12. | అస్పృశ్య కోయిల | 2017 |
| 13. | బాంచెన్ దొరా కాల్మొక్తా లేదా గులాంగిరి చోడో | 2019 |
| 14. | తపస్సు | |
| 15. | విధి(వ్రాలా? | |
| 16. | ఊరంటే? | |

### 1.5.3. నాటక కర్తగా కాలువ మల్లయ్య:

సాహిత్య ప్రక్రియలన్నింటిలో నాటకం అత్యంత శక్తివంతమైన సాధనం. ప్రజా హృదయాన్ని సూటిగా స్పందింపజేసే శక్తి ఒక్క నాటకానికే ఉంది. అలాంటి తెలుగు నాటకానికి మహోజ్వలమైన చరిత్ర ఉంది. ఎందరో నాటక కర్తలు తమ నాటకాల ద్వారా తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేశారు. తెలుగు నాటకం కాలానుగుణంగా సామాజిక పరిస్థితులకు అనుగుణంగా ఎన్నో మార్పులకు లోనై ఏకాంకికలు, నాటికలుగా రూపాంతరం చెందింది. నాటకాలను దృశ్య నాటకాలు, శ్రవ్య నాటకాలు అని రెండు రకాలుగా పిలుస్తారు. దృశ్య నాటకాలు ప్రదర్శింపబడేవి, శ్రవ్య నాటకాలు రేడియో నాటికలు.

కాలువ మల్లయ్యగారు నాటకాలను సామాజిక చైతన్యంతో రాశారు. అతడు రాసిన వాటిలో కొన్ని ప్రదర్శింపబడ్డాయి. ఆ నాటకాలన్నీ ప్రేక్షకుల మన్ననలు పొందాయి. ఎన్నో అవార్డులు పొందాయి. కాలువ మల్లయ్య నాటకాలను ఈ కింది పట్టికలో పొందు పరుస్తున్నాను.

| క్రమ సంఖ్య | నాటకాలు | ప్రచురించిన సంవత్సరం |
|---|---|---|
| 1. | ఎవరు దొంగ (ఏకపాత్రాభినయం) | 1990 |
| 2. | దేశంలో దొంగలు పడ్డారు (ఏకపాత్రాభినయం) | 1990 |
| 3. | గొల్లోల కొంటిగాడు (ఏకపాత్రాభినయం) | 2000 |
| 4. | మానవుడు (నాటిక) | 2003 |
| 5. | వింత పశువు – సంత పశువు (నాటిక) | 2004 |
| 6. | పేగు బంధం (నాటిక) | 2004 |
| 7. | విరిగిన పల్లవి (నాటిక) | 2005 |
| 8. | నేపథ్యం (నాటిక) | 2005 |

| | | |
|---|---|---|
| 9. | ఆకలి (నాటిక) | 2005 |

### 1.5.4. ఇతర రచనలు:

కాలువ మల్లయ్య కథలు, నవలలు, నాటకాలు, పాటలు, గేయాలు, కవితలు మొదలైన ప్రక్రియలన్నింటినీ సృజించారు.

కాలువ మల్లయ్య ప్రచురించిన కవితా సంపుటాలు:

| | | |
|---|---|---|
| 1. | కవితా సౌరభం | 1982 |
| 2. | కవితా ఝరి | 1983 |
| 3. | జీవన దృశ్యాలు | 2014 |
| 4. | విశ్వ మానవ గీతాలు | 2015 |
| 5. | తేలుకుంట నానీకైతలు | 2016 |

భారతదేశ చరిత్ర – మెరుపులు, మరకలు, ప్రపంచ చరిత్ర (సామాజిక కోణం), పలాన పురాణాల్లో ఏముంది, తెలంగాణ రాష్ట్రోద్యమచరిత్ర, గుమ్మి (నిఘంటువు), వేదమా? స్వేదమా?, A Book on Gautama Buddha, Bharat Ratna Ambedkar, తెలంగాణ సాహిత్య సమీక్ష, పెట్టుబడిదారీ వ్యవస్థ – సామాజిక కమ్యూనిజం మొదలైన రచనలు చేశాడు.

### 1.5.5. వ్యాస సంపుటాలు – పరిశోధనాత్మక రచనలు:

| | | |
|---|---|---|
| 1. | తొమ్మిది పదుల తెలంగాణ కథ | 2011 |
| 2. | గబ్బిలం – జాషువా తాత్విక స్వప్నం | 2012 |
| 3. | జాతీయ కవి జాషువా | 2013 |
| 4. | నూటపదేళ్ళ తెలుగు కథ | 2012 |
| 5. | అమ్మ భాసను అభిమానిద్దాం | 2017 |
| 6. | భాష – చదువుల తల్లి | 2016 |
| 7. | నా తెలం'గానం' | 2016 |
| 8. | మీ రాజ్యం మీరేలండి | 2016 |
| 9. | నూటపదేహేనేళ్ళ తెలంగాణ కథ | 2017 |
| 10. | తెలంగాణ కథ – తెలుగు కథ | 2016 |
| 11. | స్వాతంత్ర్యానంతర భారత రాజకీయ ముఖచిత్రం | 2017 |
| 12. | The Journey Towards Social Justice | 2017 |

| | | |
|---|---|---|
| 13. | Towards Humanism | 2017 |
| 14. | బహుజన రాజ్యాధికారం | 2017 |
| 15. | శూద్రచమార్ కాలజ్ఞానం వ్యాసాలు | 2018 |

### 1.6. సాహిత్య పురస్కారాలు – బహుమతులు:

కాలువ మల్లయ్యగారి సాహిత్య కృషికి ఎన్నో సంస్థలు, అకాడమీలు, పత్రికలు, సాహిత్య పురస్కారాలను అందించాయి. కొన్ని కథలు, నవలలు ఉత్తమ పురస్కారాలను పొందాయి. మరెన్నో బహుమతులను కూడా ప్రకటించాయి.

| క్రమ సంఖ్య | అవార్డు | రచన | సంవత్సరం | వేదిక |
|---|---|---|---|---|
| 1. | సాంస్కృతిక సమాఖ్య | తపస్సు (కవిత) | 1984 | విజయవాడ |
| 2. | భాగ్య అవార్డు | మేలుకో (కవిత) | 1984 | వరంగల్ |
| 3. | సాంస్కృతిక సమాఖ్య | యువ సాహితీ కథా రచయిత | 1989 | విజయవాడ |
| 4. | ఆంధ్రభూమి కథల పోటీ (వారపత్రిక) | భూమి గుండ్రంగా ఉంది (కథ) | 1990 | హైదరాబాద్ |
| 5. | ఆంధ్రప్రభ కథల పోటీ | సృష్టికర్త ఆవేదన (కథ) | 1991 | హైదరాబాద్ |
| 6. | తెలుగు విశ్వవిద్యాలయం ఏటుకూరి వెంకటనర్సయ్య పురస్కారం | భూమిపుత్రుడు (నవల) | 1992 | హైదరాబాద్ |
| 7. | సాహిత్య సేవా సమితి ట్రస్ట్ | -- | 1994 | విశాఖపట్నం |
| 8. | దాశరథి రంగాచార్య జన్మదిన పురస్కారం | | 1995 | |
| 9. | చతుర నవలల పోటీ | సాంబయ్య చదువు (నవల) | 1996 | |
| 10. | స్రవంతి అవార్డు | | 1996 | |
| 11. | సాహిత్య సేవా సమితి ట్రస్ట్ | నీ బాంచెన్ కాల్మొక్తా (నవల) | 1997 | |
| 12. | స్వాతి వార కథల పోటీ | కరువు (కథ) | 1998 | |

| | | | | |
|---|---|---|---|---|
| 13. | అంబేద్కర్ సాహిత్య పురస్కారం | -- | 1999 | |
| 14. | రావిశాస్త్రి స్మారక బహుమతి (సాహిత్య కృషి) | -- | 1997 | |
| 15. | వేదగిరి పూర్ణచందర్‌రావు (కథాసమీక్ష అవార్డు) | -- | 1997 | |
| 16. | తెలుగు సాహిత్య భూషణ్ అవార్డు | -- | 1999 | |
| 17. | విశాల సాహిత్య పురస్కారం | మా కథలు (సంపుటి) | 1999 | |
| 18. | అమెరికా తెలుగు అసోషియేషన్ (ATA) | బతుకు పుస్తకం (నవల) | 2001 | |
| 19. | నవ్య సాహిత్య పురస్కారం | -- | 2001 | |
| 20. | తెలుగు విశ్వవిద్యాలయం (సాహిత్య పురస్కారం) | బతుకు పుస్తకం (నవల) | 2001 | |
| 21. | కోల్‌బెల్ట్ సాహిత్య రతనాలు అవార్డు | -- | 2002 | |
| 22. | కేంద్ర సాహిత్య అకాడమీ సీనియర్ ఫెలోషిప్ అవార్డు | -- | 2003 | |
| 23. | MSK ఆంధ్రజ్యోతి అవార్డు | -- | 2004 | |
| 24. | వేలూరి శివరామశాస్త్రి స్మారక అవార్డు | -- | 2004 | |
| 25. | ఆంధ్ర సారస్వత పరిషత్ అవార్డు | మాట్లాడే బొమ్మలు (నవల) | 2004 | |
| 26. | ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గురజాడ కథా పురస్కారం | -- | 2012 | |
| 27. | ఆంధ్రపదేశ్ ప్రభుత్వ గిడుగు భాషా పురస్కారం | -- | 2012 | |

| | | | | |
|---|---|---|---|---|
| 28. | ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం – తెలుగు అకాడమీ | -- | 2013 | |
| 29. | సహృదయ సాహితి పురస్కారం | నేలతల్లి (కథా సంపుటి) | 2015 | |
| 30. | రావూరి భరద్వాజ స్మారక నవలా పురస్కారం | -- | 2014 | |
| 31. | True Indian Award | -- | 2015 | |

### 1.7. కాలువ మల్లయ్య అధిష్టించిన పదవులు – గుర్తింపులు:

రచయితగా కాలువ మల్లయ్య చేస్తున్న విశేష సేవలకు గుర్తింపుగా సాహిత్య విలువలు కాపాడుతున్న సంస్థల్లో అంతర్జాతీయ స్థాయిలో ఘనమైన గుర్తింపు లభించింది.

1. 'అమెరికన్ బయోగ్రఫికల్ ఇన్‌స్టిట్యూట్' – అమెరికా రీసెర్చ్ బోర్డ్ మెంబర్ పదవి – 2000.
2. 'అమెరికన్ బయోగ్రఫికల్ ఇన్‌స్టిట్యూట్' – అమెరికా వారి పుస్తకంలో సముచిత స్థానం – 2000.
3. 'అమెరికన్ – ఏషియన్' వారి 'Who is who' లో మెంబర్ – 2000.
4. 'ఆసియన్ – పసిఫిక్ ఇంటర్నేషనల్' వారి 'Who is who' లో స్థానం.
5. కేంద్ర సాహిత్య అకాడమీ, న్యూఢిల్లీ వారి 'Who is of Indian Writers' అనే పుస్తకంలో స్థానం – 1997.
6. తెలుగు అధికార భాషా సంఘం సభ్యులు – 2005 – 2007.

కాలువ మల్లయ్య రచించిన 'హింసరచన', 'జీవచ్ఛవం' కథలు కన్నడ భాషలోకి, 'చదువుతున్నవాడు', 'నేపథ్యం', 'ఆంబోతు కథలు' హిందీలోకి అనువదించబడ్డాయి.

★★★

# రెండవ అధ్యాయం

# తెలంగాణ నవల – పరిచయం

## రెండవ అధ్యాయం

## తెలంగాణ నవల – పరిచయం

### 2.0. నవల పరిచయం:

ఒక జాతి సంస్కృతిని తెలుసుకోవడానికి నవల అత్యుత్తమ సాధనం. తెలుగులో నవల రచనా ప్రారంభమైనప్పటి నుండి ఇప్పటిదాకా వచ్చిన తెలుగు నవలల్ని పరిశీలిస్తే తెలుగు జాతి చరిత్ర, సంస్కృతి, రాజకీయ, ఆర్థిక, సామాజిక విషయాలు వివరంగా తెలుస్తాయి. ఈ కాలంలో తెలుగు ప్రజల జీవన గమనం, సమాజంలోని ప్రజల ఆలోచనల్లో వచ్చిన మార్పులు, సామాజిక సంఘటనలకు సాహిత్యం ప్రతిబింబించిన తీరు అర్థమవుతుంది.

ఆధునిక యుగంలో బహుజనాదరణ పొందిన వాఙ్మయ ప్రక్రియల్లో నవల ఒకటి. ఆధునికంగా పాశ్చాత్యుల నుండి సంక్రమించిన సారస్వత ప్రక్రియ నవల. ఆంగ్ల సాహిత్య ప్రభావం వల్ల తెలుగు సాహిత్యంలోకి నవల ప్రక్రియ ప్రవేశించింది. "ఆధునిక కాలంలో బహుముఖమైన మానవ జీవితాన్ని చిత్రించేందుకు, విమర్శించేందుకు, వ్యాఖ్యానించేందుకు అన్ని జాతులకు, వర్గాలకు, తరగతులకు చెందిన మానవ జీవితాన్ని, సిద్ధాంతాలను వివరించి ప్రస్తుతీకరించేందుకు, అన్ని తరగతుల మనోవైవిధ్యంగల వ్యక్తులు చదివేందుకు నవలా ప్రక్రియ అనువైన ప్రక్రియగా ఇప్పుడు చలామణి అవుతున్నది" (సుజాతారెడ్డి, ముదిగంటి.1990:పుట.38). జీవితాన్ని నవలలో జీవింపచేయడమే నవలా ప్రక్రియ ప్రత్యేకత. మానవ జీవితంలో జరిగే వివిధ రకాల సంఘటనల ద్వారానే నవలా ప్రక్రియ ఏర్పడినట్లు తెలుస్తుంది. "పద్యం హృదయాన్ని వికసింపజేస్తే వచనం మేధను వికసింపజేస్తుంది. అటువంటి వచన రచనా ప్రక్రియలో ప్రధానమైన సాహిత్య వికాసం ఆధునిక కాలంలో నవలా రూపంలో జరిగింది" (సుజాతారెడ్డి, ముదిగంటి.1990:పుట.38) అని ముదిగంటి సుజాతారెడ్డి తెలియజేశారు.

### 2.1. వివిధ భాషలలో నవలకు గల పేర్లు:

ఆంగ్ల సాహిత్య ప్రభావంతో తెలుగులో నవల ఆవిర్భవించింది. 'నవల' అనే పదం Novel అనే ఆంగ్ల పదం నుండి తెలుగులోకి వచ్చింది. "ఇంగ్లీషులోని (Novel) అనే మాట Novella అనే ఇటాలియన్ పదం నుండి వచ్చింది. క్రీ.శ.1350లో మొట్ట మొదటిసారిగా 'నవల' అనే ప్రక్రియను ఇటలీలో ప్రవేశపెట్టిన 'బాకేషియో' (Bacassio) తన రచన Decameronకు Novella Storia అని పేరు పెట్టాడు. ఈ మాటకు అర్థం ఏమిటంటే 'కొత్త కథ' అని. వచనంలో 'కథ' మాదిరిగా ఉంటూ, కథకు భిన్నమైన ఒక విలక్షణత కలిగిన సాహిత్య ప్రక్రియను బాకేషియో

Novellaగా పేర్కొన్నాడు" (శ్రీరామమూర్తి, కోడూరి.2001:పుట.1). తెలుగులో 'నవల' అని, మరాఠీ, కన్నడ భాషల్లో 'కాదంబరి' అని గుజరాతీ, బెంగాలీ, పంజాబీ, అస్సామీ, హిందీ, ఒడియా భాషల్లో 'ఉపన్యాస్' అని, తమిళంలో పుదియ లేదా నావెల్ లేదా కావెల్ అని ఉర్దూలో నవల అనే పేర్లతో పిలుస్తారు.

నరహరి గోపాలకృష్ణమశెట్టి 1872లో 'శ్రీరంగరాజ చరిత్ర'ను రాశాడు. దీనిని 'నవీన ప్రబంధం' అన్నాడు. వీరేశలింగం 1878లో 'రాజశేఖర చరిత్రము' వ్రాసి దానికి 'వచన ప్రబంధం' అని పేరు పెట్టాడు. 1897లో కాశీభట్ట బ్రహ్మయ్యశాస్త్రిగారు వీరేశలింగం రాజశేఖర చరిత్రముపై వివేక చంద్రిక విమర్శనం పేరుతో విమర్శ చేస్తూ దాని పీఠికలో 'నవల' అనే పేరును సూచించారు. "ఆంగ్ల భాషలో నావల్ (Novel) అను పదం 'కొత్త'యను నర్థము గల 'నవ్' అను పదం నుండి పుట్టినది. ఈ నవ్ అను దానికిని నవయను సంస్కృత పదమునకును గల సంబంధం తేటతెల్లంబె కదా? కావున నవల యనగా "నవాన్ విశేషాన్ లాతి గృహ్ణాతీతి నవలా' అనగాఁ గ్రొత్త విశేషములు గలదని యర్థము వచ్చుచున్నది. వచన భాష యందును నీ మాటకిదియే యర్థమగుటచే నవలను పదమునకు సరియైన వేరొక సంస్కృత పదమునకయి ప్రయత్నము చేయక 'నవల' యని యీ పదము నేనిట వాడుచున్నాను" (నాగభూషణ శర్మ, మొదలి. 1971:పుట.18) క్రమంగా వచన ప్రబంధమని పేరు మరుగున పడి 'నవల' అన్న పేరే వ్యాప్తిలోకి వచ్చింది.

నావెల్ అనే పదానికి కొత్త అర్థం వచ్చినట్లే 'నవ' అనే సంస్కృత పదానికి కూడా కొత్త (లేదా) నూతన అనే అర్థాలున్నాయి. నవల పదం పుట్టడంలో రెండు భాషలు ఇంగ్లీషు, సంస్కృత భాషల ప్రభావం ఉందని చెప్పవచ్చు.

## 2.2. నవల నిర్వచనాలు:

సమకాలీన సమాజ జీవన విధానాన్ని చిత్రీకరిస్తూ నవలలు వెలువడ్డాయి. ముఖ్యంగా మధ్యతరగతి జీవితాలలోని వాస్తవికతను సాంఘికాభివృద్ధి వలన జనించిన సమస్యలను దృష్టిలో పెట్టుకొని ప్రాచ్య, పాశ్చాత్యులు అనేక మంది నవలకు నిర్వచనాలు ఇచ్చారు. వారిలో ప్రముఖులైన కొంత మంది విమర్శకులు, సాహితీవేత్తల నిర్వచనాలను ఇప్పుడు పరిశీలిస్తాను.

"నవల ఇలాగే ఉండాలి, ఇలా ఉండకూడదు అని చెప్పే నిర్దేశక సూత్రాలు అదృష్టవశాత్తు నవలకు లేవు. కాబట్టి నవలను వర్ణనాత్మక సూత్రాలతో మాత్రమే విశ్లేషించవలసి ఉంటుంది" (వెంకటసుబ్బయ్య, వల్లంపాటి.1994:పుట:9).

"సాంఘిక జీవితానికి ప్రతిబింబంగా వ్యక్తుల జీవిత గమనాన్ని చిత్రిస్తూ జనుల ఆచార వ్యవహారాలను వ్యక్తీకరించే గద్య ప్రబంధం నవల" (నాగభూషణ శర్మ, మొదలి.1971: పుట. 14).

"రచనా కాలము నందలి వాస్తవికములగు జీవితాచార వ్యవహారములను చిత్రించునది నవల" (వెంకట కుటుంబరావు, బొడ్డపాటి. 1971:పుట.102).

"పదబంధాలు, భాషా పాండిత్యాలు, సమాజ శృంఖలాలు ఎరుగని ప్రక్రియ నవల. ఇది సామాన్యుని వలె నిరాడంబరం అయింది. జీవితం వలె సత్యమైంది. ప్రకృతి వలె సుందరం అయింది. ఆకాశం వలె విశాలం అయింది. సూర్యుని వలె తేజోవంతం అయింది. వాయువు వలె సర్వవ్యాప్తం అయింది" (వెంకట్రామయ్య, తుమ్మల.1980: పుట.15).

"నవల సమకాలీన జీవిత వాస్తవికత మీద ఆధారపడ్డ కల్పనాత్మక వచన సాహిత్య ప్రక్రియ" (వెంకట సుబ్బయ్య, వల్లంపాటి.1994:పుట.15).

"సాహిత్యాన్ని సమాజంతో అనుసంధించే సాహితీ ప్రక్రియ నవల" (ఆనందరామం, సి.1994:పుట.4).

### 2.2.1. పాశ్చాత్యుల నిర్వచనాలు:

ఈ క్రింది నిర్వచనాలు వివిధ గ్రంథాలలో ఉన్నాయి. ఇవి ప్రసిద్ధమైనవి కావడంవల్ల వీటికి ఆధారాలు చూపడం లేదు.

- "A Democratic Literary Form" – ప్రజా సాహిత్య ప్రక్రియే నవల – Joseph Sipley.
- "జీవితం నవల లాంటిది. నవల జీవితంలాంటిది" – ఇల్యా ఎట్టైన్‌బర్గ్.
- "Novel is a summary of Actual Life" – వాస్తవ జీవిత సారాంశమే నవల – మెరిడితే (Meredithe).
- "యదార్థ జీవనాన్ని యదార్థ దృష్టితో అధ్యయనం చేసి దాన్ని గద్య రూపంలో వ్యక్తం చేసేదే నవల" – రిచర్డ్ క్రాస్.

## 2.3. తొలి తెలుగు నవల:

తెలుగులో మొదటి నవల ఏది అన్న విషయంలో తర్జనభర్జనలు జరిగాయి. 150 సంవత్సరాల క్రితం వెలువడిన నవలా ప్రక్రియ పుట్టుపూర్వోత్తరాలను తెలుసుకోవాల్సిన అవసరం

ఉంది. తొలి తెలుగు నవల ఏది అనే విషయంలో కొన్ని భేదాభిప్రాయాలు ఉన్నాయి. వాటి గురించి ఇప్పుడు చర్చిస్తాను.

1. క్రీ.శ. 16వ శతాబ్దంలో శ్రీ కృష్ణదేవరాయల కొలువులో ఉన్న అష్టదిగ్గజ కవులలో ఒక్కడైన పింగళి సూరన కళాపూర్ణోదయం రచించాడు. దీనిని కొంత మంది విమర్శకులు తొలి తెలుగు నవలగా పేర్కొన్నారు. "పింగళి సూరన కృతమైన కళాపూర్ణోదయంను కల్పిత ప్రబంధము, పద్య రూపంలో ఉన్న తొలి నవల అని కొందరు తలచారు. కాని కళాపూర్ణోదయం నందు ఆధునిక నవలా లక్షణాలు కనబడవు" (నాగయ్య,జి.2022: పుట.809).
2. క్రీ.శ 19వ శతాబ్ది చివరలో కొక్కొండ వెంకటరత్నం 'మహాశ్వేత' నవలను రచించాడు. ఇది సంస్కృతంలో బాణుడు రాసిన కాదంబరికి అనువాదం. మహాశ్వేతను తొలి తెలుగు నవలగా పేర్కొన్న వారిలో ముఖ్యుడు నిడదవోలు వెంకటరావు. "కొక్కొండ వెంకటరత్నం 1867లో ప్రకటించిన మహాశ్వేత మొదటి నవల అని నిడదవోలు వెంకటరావు అభిప్రాయం" (వెంకటరావు, నిడదవోలు.1992:పుట,122). ఇందులో రెండు విషయాలు మనం గమనించాలి. ఒకటి "మహాశ్వేత" 1867లో రచించబడింది అనడానికి శివశంకర పాండ్య మాటలు ఒక్కటే ఆధారం. మరో నిదర్శనం లేదు. రాసిన తరువాత 28 సంవత్సరాలకు ఇది వైజయంతి పత్రికలో ప్రచురించబడింది. అది కూడ కొంత భాగం మాత్రమే. ఈ గ్రంథం మనకు ఇప్పుడు లభ్యం కావడం లేదు. గ్రంథరూపంలో రాకపోవడం వల్ల కథావస్తువు కల్పితమైనది కాకపోవడం వల్ల ఆనాటి వారు ఎవ్వరూ దీనిని వచన ప్రబంధంగా గుర్తించలేదు. ఏ విధంగా చూసినా మహాశ్వేతను తొలి తెలుగు నవల అనడానికి వీలు లేదు.
3. కర్నూలులో డిప్యూటి కలెక్టర్‌గా పనిచేస్తున్న నరహరి గోపాలకృష్ణమశెట్టి నవలా రచనకు తొలిసారిగా పూనుకున్నారు. ఆయనకు ప్రేరణ ప్రభుత్వ గెజిట్‌లో వెలువడు ప్రకటన ద్వారా లభించింది. 1872లో బెంగాల్ గెజిట్‌లో అప్పటి గవర్నర్ జనరల్ మేయో ఒక ప్రకటన ఇచ్చాడు. బెంగాల్ వారి ఆచార వ్యవహారాలు ప్రతిబింబించే ఒక వచన గాథ రచించిన వారికి బహుమతి ఇస్తుందని ప్రకటించాడు. నరహరి గోపాలకృష్ణమశెట్టి ఆ ప్రకటనను చూసి 'శ్రీ రంగరాజ చరిత్రము' అనే పేరుతో ఆనాటి తెలుగువారి సామాజిక ఆచార వ్యవహారాలను తెలియజేసి ఒక కల్పనా కథను రచించాడు. ఇతను దీనిలో చారిత్రక

నేపథ్యాన్ని వివరించాడు. ఈయన తన రచనను 'నవీన ప్రబంధం'గా చెప్పుకున్నాడు. 'శ్రీ రంగరాజ చరిత్రము' 1987 జూన్ 14వ తేదీన ప్రచురించబడింది. శ్రీరంగరాజ చరిత్రము మొదటి నవల అనడానికి మరో కారణం అప్పటి గెజిట్‌లో దాని గురించి రాస్తూ subject అన్నచోట 'A Novel' అని రాయడంతోపాటు కింద 'Remarks' అన్నచోట "This is a parently the first attempt ever made in this part of India at Novel Writing in Telugu Prose" అని ఉన్నది (నాగభూషణ శర్మ, మొదలి.1971:పుటలు.37, 38).

4. కందుకూరి వీరేశలింగంగారు తన స్వీయచరిత్రలో రాజశేఖర చరిత్రను వచన ప్రబంధం అని పేర్కొనప్పటికి కాశీభట్ట బ్రహ్మయ్యశాస్త్రిగారు ఈ ప్రక్రియకు నవల అనే పేరు పెట్టడం వల్ల కందుకూరి రాజశేఖర చరిత్రను తెలుగులో మొదటి నవలగా పేర్కొనవచ్చు. "తెలుగులో మొదటి వచన ప్రబంధం నేను చేసితిని, మొదటి నాటకం నేనే తెనిగించితిని, మొదటి ప్రకృతి శాస్త్రమును నేనే రచించితిని, స్త్రీలకై మొదటి వచన పుస్తకమును నేనే కావించితిని" అని కందుకూరి తెలియజేశారు (వీరభద్రరావు, కొత్తపల్లి.2000: పుటలు:493,494). 1878లోనే వివేక వర్ధిని పత్రికలో వివిధ భాగాలుగా దీనిని ప్రచురించారు. 1880లో పుస్తక రూపంలో ప్రచురించారు. ఈ విధంగా తెలుగు సాహిత్యంలోకి నవలగా రంగ ప్రవేశం చేసింది. కాలక్రమాన్ని బట్టి రాజశేఖర చరిత్ర రెండవ నవలగా చెప్పాలి కాని తనకు వచ్చిన పొగడ్తలు అనుకరణ మొదలైన వాటిని బట్టి చూస్తే ఇదే తెలుగు సాహిత్యంలో వచ్చిన ప్రప్రథమ నవల అని ఆరుద్ర 'సమగ్రాంధ్ర సాహిత్యంలో పేర్కొన్నాడు.

1880 జూలై 20వ తేదీనాడు 'శ్రీరాజశేఖర చరిత్రము' లేక 'వివేక చంద్రిక'ను పుస్తక రూపంలో మొదటిసారిగా ప్రచురిస్తున్నప్పుడు ఆ కూర్పు పీఠికలో వీరేశలింగం ఇలా తెలిపారు "ఇప్పటి వరకు మన ఆంధ్ర భాషలో జనుల ఆచార వ్యవహారాలను తెలుపుతూ నీతి బోధకములుగా నుండు వచన ప్రబంధము లేవియు లేకపోవుట యెల్లవారికి విశదము ఉన్నది కదా అని రాయడం వల్ల వారు అంతకుముందే ఎనిమిదేళ్ళక్రిందట 1872లో ప్రచురితమైన శ్రీ రంగరాజ చరిత్ర ఉనికిని గుర్తించినట్టు భావించాలి" అని ఆరుద్ర తెలిపాడు" (ఆరుద్ర.2012: పుట.469).

అలివర్ గోల్డ్‌స్మిత్ రచించిన 'ది వికార్ ఆఫ్ వేక్‌ఫీల్డ్' (The Vicar of Wakefield) అనే గ్రంథానికి అనుకరణగా రాజశేఖర చరిత్ర రచించబడింది కాబట్టి ఆంగ్ల సాహిత్య ప్రభావంతో

నవలా లక్షణాలు అన్నింటిని పొందుపరిచి అనుకరణగా రచించబడ్డ రాజశేఖర చరిత్ర మొదటి నవలగా మనం భావించవచ్చు. "సర్వ లక్షణ సమగ్రమైన తొట్ట తొలి తెలుగు నవల రాజశేఖర చరిత్రయేనని విదితం కాగలదు" (నాగభూషణశర్మ, మొదలి.1971:పుట.38). పైన పేర్కొన్న విషయాలను బట్టి ప్రముఖులైన ఆరుద్ర, నిడదవోలు వెంకటరావు, మొదలి నాగభూషణ శర్మ, పుల్లాభట్ల, కొత్తపల్లి వీరభద్రయ్య మొదలైన విమర్శకులు చెప్పిన అభిప్రాయాల ఆధారంగా కళాపూర్ణోదయంను పద్య నవలగా పేర్కొనబడినప్పటికి ఆధునిక యుగ లక్షణాలు కనబడక పోవడం చేత తొలి తెలుగు నవల అని చెప్పడానికి వీలు లేదు. మహాశ్వేత నవల అసంపూర్ణంగా ఉండటం వలన సంస్కృత బాణుని కాదంబరి అనువాదంగా ఉండడంచేత దీనిని కూడా తొలి నవల అనడానికి వీలు లేదు. శ్రీరంగరాజ చరిత్రమును పరిశీలించినట్లైతే నరహరి గోపాలకృష్ణమశెట్టి ప్రభుత్వోద్యోగి కాబట్టి ఆంగ్ల రచనా విధానాన్ని అనుసరించినట్టుగా తెలుస్తుంది. ఆనాటి గవర్నర్ జనరల్ మేయో ప్రకటనకు స్పందించి తెలుగు వారి ఆచార వ్యవహారాలను తెలియజేసే ఒక కల్పనా కథను రచించాడు. ఇందులో నవలా లక్షణాలు సమగ్రంగా కనిపించకపోవడంతో ఇదే మొదటి నవల అని స్పష్టంగా చెప్పలేం. ఇక రాజశేఖర చరిత్రకు వస్తే గోల్డ్‌స్మిత్ రచనకు అనుకరణమే అయినా సర్వలక్షణ సమగ్రమైనదిగా చెప్పవచ్చు. నాటి సమాజంలో ఉన్న దురాచారాలు ఈ నవలలో ప్రతిబింబిస్తాయి. కావున ఇదే తొలి నవలగా చెప్పడం సమంజసంగా ఉంటుంది.

పైన తెలిపిన కారణాల ఆధారంగా రాజశేఖర చరిత్రను మొదటి నవలగా అనేకులు తెలిపారు.

## 2.4. నవల ప్రక్రియ – వస్తు వైవిధ్యం:

తెలుగు నవలా రచన మొదలైనప్పటి నుండి నేటికి అనేక రకాల మలుపులు తిరుగుతూ సమాజ స్థితిగతులను ఇముడ్చుకుంటూ రకరకాల వ్యక్తుల, సమాజ పోకడలను సాహితీకరిస్తూ అభివృద్ధి చెందింది. తెలుగు నవలా రచయితలు ఈ ప్రక్రియ వికాసాన్ని పెంపొందించారు. ఒక సాహిత్య ప్రక్రియ వికాసం ఆయా రచయితల ప్రయోగాలను బట్టి ఉంటుంది. నవలా ప్రక్రియ అభివృద్ధి కూడా రకరకాల సాహిత్య ప్రయోగాల వల్ల జరిగింది. తెలుగు నవలను వృద్ధి చేసే క్రమంలో సమాజ, సమాజాంతర విషయాలను తీసుకుంటూ, సమకాలీన, ప్రాచీన కాలం, విజ్ఞానదాయకం, పౌరాణిక, చారిత్రక అంశాలలోని ప్రధాన వస్తువులను తీసుకొని నవలా రచయితలు ప్రయోగాలు చేశారు. ఆ విధంగా చేయడం వల్ల నవలా ప్రక్రియలో వస్తు భేదాలు ఏర్పడి వాటి ద్వారా నవలా సాహిత్య వికాసం చెందింది.

వల్లంపాటి వెంకటసుబ్బయ్య గారు వస్తువును ఆధారంగా నవలలను ఎనిమిది రకాలుగా విభజన చేశారు (వెంకటసుబ్బయ్య, వల్లంపాటి.1994 :పుట.99).

వల్లంపాటి వెంకటసుబ్బయ్య గారి విభజన:

1) సమాజ ప్రధానమైన నవలలు
2) వ్యక్తి ప్రధానమైన నవలలు
3) రాజకీయ నవలలు
4) అపరాధ పరిశోధక నవలలు
5) విజ్ఞాన శాస్త్ర నవలలు
6) చారిత్రక నవలలు
7) బాలల నవలలు
8) చైతన్య స్రవంతి నవలలు

పుల్లాభొట్ల వెంకటేశ్వర్లు వస్తువును ఆధారంగా చేసుకొని నవలలను ఐదు రకాలుగా విభజన చేశారు (వెంకటేశ్వర్లు, పుల్లాభొట్ల.2019:పుట.03).

1) అపరాధ పరిశోధక నవలలు
2) సాంఘిక నవలలు
3) రాజకీయ నవలలు
4) చారిత్రాత్మక నవలలు
5) పౌరాణిక నవలలు

పైన పేర్కొన్న వారి విభజనల ఆధారంగా తెలంగాణ సమాజంలోని వస్తువును ఆధారంగా చేసుకొని నవలలను కింది విధంగా విభజించవచ్చు.

1) రాజకీయ నవలలు
2) సాంఘిక నవలలు
3) చారిత్రక నవలలు
4) హాస్య నవలలు
5) బాలల నవలలు
6) వ్యాపార నవలలు
7) అపరాధ పరిశోధక నవలలు

8) మనోవైజ్ఞానిక నవలలు

9) పౌరాణిక నవలలు

## 2.5. తెలంగాణ నవలా సాహిత్యం:

కాసుల ప్రతాపరెడ్డి రచించిన 'తెలుగు నవలా వికాసం' అనే పుస్తకం తెలంగాణలో మొదటి నవల ఏది అన్న చర్చతో ఆరంభమైంది. తెలంగాణలోని నల్లగొండ జిల్లాకు చెందిన హుజూర్‌నగర్ ప్రాంతం వాడైన తడకమళ్ళ వెంకట కృష్ణారావు కంబుకంధర చరిత్ర (1866), కామరూప కథ (1868) అనే రచనలు చేశాడు. అయితే వీటిలో కంబుకంధర చరిత్రను తొలి తెలంగాణ నవలగానే కాకుండా తొలి తెలుగు నవలగా గుర్తించాల్సి ఉంటుందని సాహిత్య పరిశోధకులు అభిప్రాయపడుతున్నారు. "తొలి తెలుగు నవల 1866లో వెలువడింది. మొదట కంబుకంధర చరిత్ర, ఆ తరువాత కామరూప కథ రెండూ ఒకే సంవత్సరంలో వెలుగు చూశాయి. ఇందులో మొదటి నవల కంబుకంధర చరిత్రలో పద్యాలు, వచనం కలగలిపి ఉన్నాయి" (వెంకటేశ్వర్లు, పతంగి.2014:పుట.17).

కామరూప కథ గురించి సంగిశెట్టిగారు ఈ నవల సంపాదకుల నిర్ణయాన్ని ఇలా పేర్కొన్నాడు. ఇది కంబుకంధర చరిత్రమును పోలిన కల్పిత కథ, వ్రాతను బట్టి మరియు తడకమళ్ళ కృష్ణ రాయకవి రచించినదిగా గుర్తింపు తెచ్చుకున్నది. లైబ్రరీలో ఆయన చేతి వ్రాత గ్రంథాలు పెక్కు గలవు. మిక్కిలి పెద్దదియగు కల్పిత గాథ, లిపి కష్టం మీద జదువదగినదిగా నున్నదిగాన, యిందలి కథా సంగ్రహము జెప్పగుదుర లేదు. ఇది నేటి నా వేలును బోలిన రచన అంటే ఇది స్వతంత్ర రచన. నవల మాదిరిగా ఉన్నదని 1937లో ఈ వ్రాత ప్రతి క్యాటలాగ్ రాస్తూ సంపాదకులు పేర్కొన్నారు. మద్రాసు లైబ్రరీలో అందుబాటులో ఉన్న కంబుకంధర చరిత్రను పునర్ముద్రించినట్లైతే తెలుగు పాఠకులకు తొలి నవల అందుబాటులోకి వస్తుందని తెలుగు విశ్వవిద్యాలయం పూనుకొని బాధ్యతగా ఈ పనిని పూర్తి చేస్తే బాగుంటుందని సంగిశెట్టి శ్రీనివాస్‌గారు తెలంగాణ తెలుగు నవలలో తెలియజేశారు.

తెలంగాణ నుండి మొదటి స్వతంత్ర పత్రిక హితబోధిని (1913–15) వెలువరించిన బండారు శ్రీనివాసరావు 1910లో 'ఆశాదోషం' అనే నవలను రాసిండు. మహబూబ్‌నగర్ జిల్లా కోయిల్ కొండ దుర్గానికి సంబంధించిన ఈ చారిత్రక నవల ప్రస్తుతం అందుబాటులో ఉంది. 16వ శతాబ్దానికి చెందిన చారిత్రక నేపథ్యంలో రాసిన నవలలో ముస్లిం రాజుల దాడిలో కోయిల్ కొండ

దుర్గం నాశనం కావడం, అక్కడి పాలక వంశం అంతరించి పోవడం కథాంశంగా చిత్రీకరించబడింది. సరళ గ్రాంథిక భాషలో రచన సాగింది.

తెలంగాణలో నవలలు మొదటగా చారిత్రక నేపథ్యంలో ప్రారంభమై ఆ తరువాత కాలంలో ఉద్యమాలు, మధ్యతరగతి కుటుంబ జీవితాలు, తెలంగాణ పల్లె బతుకులు, సామాజిక, రాజకీయ, బాలల, మనోవైజ్ఞానిక నేపథ్యంలో వెలువడ్డాయి. వాటి గురించి ఇప్పుడు చర్చిస్తాను. తెలంగాణలో నవల ప్రక్రియ ఆరంభమైన తరువాత కొంత కాలం తీసుకొని ఆ తరువాత ఆ నవలలు పెను వేగంతో కాకుండా మందకొడితనంతో పయనించడానికి గల కారణాల్ని కూడా మరింత లోతుగా అధ్యయనం చేయవలసిన అవసరం ఎంతైనా ఉంది.

### 2.5.1. తెలంగాణ తొలి తెలుగు నవల:

తెలంగాణలో మొదటి నవల ఏది అనే విషయంలో కొన్ని చర్చలు జరుగుతున్నాయి. ఈ మధ్యకాలంలో ప్రచురించిన తెలంగాణ నవలావికాసం, తెలంగాణ తెలుగు నవల, సంగిశెట్టి శ్రీనివాస్‌గారి తెలంగాణ నవలా వికాసంకు సంబంధించిన వ్యాసాలను, ముంగిలి పుస్తకాల నుండి సమాచారాన్ని సేకరించి తెలంగాణ మొదటి నవలను తెలియజేస్తాను.

- అందుబాటులో ఉన్న ఆధారాలను లోతుగా పరిశీలించినట్లైతే తొలి తెలుగు నవల కంబుకంధర చరిత్ర అని తేలుతుంది. అయితే కామరూప కథ పూర్తిస్థాయి నవలగా భావించవచ్చు. నవలలోని ఇతివృత్తం, రచనా విధానం, కథనం అన్నీ ఆధునిక నవలకు చాలా దగ్గరగా ఉన్నాయి. అందుకే ఇదే తొలి తెలుగు నవల అని నిర్ధారించవచ్చు అని సంగిశెట్టి శ్రీనివాస్ తెలిపాడు (వెంకటేశ్వర్లు, పతంగి.2014:పుట.22).
- 'ప్రజల మనిషి' నవల తెలంగాణ తొలి నవల అని రావులపాటి సీతారామరావుగారు తెలియజేశారు (వెంకటేశ్వర్లు, పతంగి.2014:పుట.3).
- తడకమళ్ళ వెంకట కృష్ణారావు 'కంబుకంధర చరిత్ర' అనే రచన చేశాడు. అంతే కాకుండా అదే సంవత్సరంలో కామరూప కథ అనే రచన కూడా చేశాడు. అయితే వీటిలో కంబుకంధర చరిత్రను తొలి తెలంగాణ నవలగా కాకుండా తొలి తెలుగు నవలగా గుర్తించాల్సి ఉంటుందని సాహిత్య పరిశోధకులు అభిప్రాయపడుతున్నారు అని కాసుల ప్రతాపరెడ్డి తెలియజేశారు (ప్రతాపరెడ్డి, కాసుల.2017:పుట.19, 20).

### 2.5.2. తెలంగాణ చారిత్రక నవలలు:

చరిత్రలో జరిగిన సంఘటనల ఆధారంగా రచింపబడినవి చారిత్రక నవలలు అని చెప్పవచ్చు. "చారిత్రక నవల అంటే నవలలో సంఘటనలు, ఆ నవల వ్రాసే కాలం నాటి వెనుకటి తరాలకు చెంది ఉందో – అది చారిత్రక నవల అనవచ్చు" అని మొదలి నాగభూషణశర్మ తెలియజేశాడు (నాగభూషణశర్మ, మొదలి. 1971:పుట.148).

"ఒక నిర్దిష్ట చారిత్రక దశలో రాజకీయాల చేత ప్రభావితమైన సమాజాన్ని సమాజంలోని వ్యక్తుల్ని చిత్రించే సాహిత్య ప్రక్రియగా చారిత్రక నవలగా అభివర్ణించవచ్చు" (వెంకటసుబ్బయ్య, వల్లంపాటి. 1994 :పుట.112).

దేశపాండ్య సోమరాజు రామానుజరాజు 1914లో 'మంజుమతి' అనే చారిత్రక నవల రాశాడు. అలాగే ఒద్దిరాజు సోదరులలో ఒకరైన ఒద్దిరాజు సీతారామచంద్రరావు 1918లో 'రుద్రమదేవి' నవలను రచించాడు. దీనిలో కాకతీయ మహారాణి రుద్రమదేవి చరిత్ర ఇతివృత్తంగా ఉంది. ఈ నవలను ప్రేరణగా తీసుకొని అడవి బాపిరాజు, నోరి నరసింహశాస్త్రిగార్లు చారిత్రక నవలలు రచించినట్టు తెలుస్తుంది. ఈ నవల ప్రచురించబడి లభిస్తున్నది. తరువాత అడవి బాపిరాజు, నోరి నరసింహశాస్త్రి వంటి రచయితలకు చారిత్రక నవలలు రాయడానికి ప్రేరణను ఇచ్చిన నవల. నోరి నరసింహశాస్త్రిగారు వరంగల్‌లో నివసించాడు. కాబట్టి ఒద్దిరాజు నవలతో అతనికి ప్రత్యక్ష పరిచయం కలిగి ఉంటుంది. ఆ నవలలోని వస్తువును తీసుకుని ఆయన రుద్రమదేవి, తిక్కన సోమయాజి నవలలను రచించాడు. అలాగే సురవరం ప్రతాపరెడ్డి 'శుద్ధాంత కాంత', 'ఆరెవీరులు' అనే నవలలను రాశాడు కాని అవి ఇప్పుడు అలభ్యం. ఆ తరువాత శేషభట్టారు వెంకట రామానుజాచార్యులు 'ప్రాకృత దాంపత్యం' అనే నవలను రచించాడు.

ఒద్దిరాజు సోదరులలో ఒద్దిరాజు సీతారామచంద్రరావు (1887–1956) శౌర్యశక్తి, భ్రమర, బ్రాహ్మణ సాహసము అనే చారిత్రక నవలలు రాశాడు. ఒద్దిరాజు రాఘవ రంగారావు (1894–1973) 'వీరావేశము', 'వరాహముద్ర' అనే చారిత్రక నవలలను రాశాడు. వీరావేశము నవలలో తిక్కన గణపతిదేవుడిని ఆశ్రయించి తిరిగి మనుమసిద్ధిని గద్దె మీద నిలపడం వస్తువు. ఒద్దిరాజు రాఘవ రంగారావు 'వరాహముద్ర' నవలలో కాకతీయులకు సంబంధించిన ఇతివృత్తం తీసుకొని రచించాడు. అలాగే అడవి బాపిరాజు తెలంగాణ చారిత్రక ఇతివృత్తాలను తీసుకొని హిమబిందు, గోనగన్నారెడ్డి, అడివి శాంతశ్రీ అనే నవలలు రాశాడు. దాశరథి కృష్ణమాచార్య

'అమరశిల్పి జక్కన' అనే నవలను రాశాడు. బండారు శ్రీనివాసరావు 1910లో 'ఆశాదోషం' అనే నవలను రచించాడు.

ధూపాటి వెంకటరమణాచార్యులు (1894–1961) 'వసుంధర' అనే చారిత్రక నవలను రాశాడు. 1922లో అది అచ్చయింది. మొదటి ప్రతాపరుద్రునికి సంబంధించిన వస్తువును తీసుకొని ఆయన ఆ నవలను రాశాడు. అలాగే కొండపల్లి ముట్టడి, అన్నయమంత్రి (1951) నవలలు రాశాడు. చారిత్రక పరిశోధకుడిగా ప్రసిద్ధి గాంచిన బి.ఎన్. శాస్త్రిగారు 'తుక్కాదేవి', 'వాకాటక మహాదేవి' అనే చారిత్రక నవలలు రాశాడు.

### 2.5.3. తెలంగాణ సాంఘిక నవలలు:

రచయితలు సమకాలీన సమాజంలోని సమస్యలైన బాల్య వివాహాలు, మూఢనమ్మకాలు మొదలైన దురాచారాలను రూపు మాపడానికి ఉపయోగించిన నవలలను సాంఘిక నవలలుగా చెప్పవచ్చు.

"పరస్పర విభిన్నాలైన రెండు కార్యాలను నిర్వర్తించినప్పుడే మనం ఒక నవలను సాంఘిక నవల అంటాం. మొదటిది సమకాలీన సమాజాన్ని ప్రతిబింబించాలి. రెండవది సమకాలీన సమాజాన్ని ఎదిరించి నిలవాలి" అని ఆనందరామం తెలిపారు (ఆనందరామం,సి.1994:పుట. 11).

"సాంఘిక నవలను స్థూలంగా సమకాలీన సమాజగత వ్యక్తుల బాహ్యాంతర జీవితాలను విభిన్న దృక్కోణాల నుండి సాధ్యమైనంత సమగ్రంగా చిత్రించే ప్రక్రియగా నిర్వచించవచ్చు. ఏ సమస్యనైనా సంఘజీవి అయిన మానవుడు ఏ విధంగా ఎదుర్కొంటున్నాడు, ఏ విధంగా ఎదుర్కోవాలి అనే విషయాల్ని సాంఘిక నవల చిత్రీకరిస్తుంది అని మృణాళిని తెలియజేశారు (మృణాళిని, సి.1988:పుట.26).

ఒద్దిరాజు సీతారామచంద్రరావు 'స్త్రీ సాహసము', 'ముక్తవలస', 'శశవిషాణము', 'ప్రేమ ప్రవాహము', 'ఇరువురు మగలు', 'నాగరిక భార్య', 'ఎఱుపు సొమ్ము', 'రక్తాంజలి' అనే నవలలు రాశాడు. కోకల సీతారామశర్మ 'పావని' నవలను, బెల్లంకొండ నరసింహాచార్యులు 'చీనాసుందరి', చాట్రాతి లక్ష్మీనరసమాంబ 'అనురాగ విపాకము' రాశారు. అలాగే పుల్లాభొట్ల వెంకటేశ్వర్లు 'సముద్ర ఘోషలు', 'రాధ' అనే నవలలు రచించాడు. పెండెం వాసుదేవరావు 'గుసగుసలు' అనే నవలను రచించాడు. ఉమ్మెత్తల యజ్ఞరామయ్య 1949లో 'ఆశాలత' అనే నవలను రచించాడు. భాస్కరభట్ల కృష్ణారావు (1918–66) 'యుగసంధి', 'భవిష్యద్దర్శనం', 'వింత ప్రణయం',

'వెల్లువలో పూచిక పుల్లలు' అనే నవలలు రచించాడు. లోక మలహరి (1950–60) మధ్యకాలంలో 'జగ్గని యిద్దె', 'సంగం' అనే రెండు నవలలు రచించాడు. దళితుల్లో విద్యావ్యాప్తి కొరకు విశేషంగా కృషి చేశాడు.

## 2.5.4. తెలంగాణ ఉద్యమ నవలలు:

తెలంగాణ నవలా ప్రక్రియ చరిత్రలో సాయుధపోరాటం ఒక మలుపు. తెలంగాణలోని ఫ్యూడల్ వ్యవస్థ దౌష్ట్యం, నిజాం రాచరిక పాలనలో చిల్లర దేవుళ్ల అణచివేత ధోరణి లోకానికి విదితమే. ఆ వ్యవస్థకు వ్యతిరేకంగా సాగిన చారిత్రక ఉద్యమంపై నవలలు చాలానే ఉన్నాయి. ఇందులో ప్రధానంగా చెప్పుకోదగినది వట్టికోట ఆళ్వారుస్వామి 'ప్రజల మనిషి'. ఈ పోరాటం ఇతర ప్రాంతాల రచయితలకు స్ఫూర్తినిచ్చింది. వారు కూడా తెలంగాణ సాయుధ పోరాటంపై నవలలు రాశారు. అలా వచ్చిన నవలల్లో ప్రధానమైనవి బొల్లిముంత శివరామకృష్ణ 'మృత్యుంజయులు' (1947), మహీధర రామమోహన్‌రావు 'ఓనమాలు' (1956), 'మృత్యువు నీడల్లో' (1962), లక్ష్మీకాంత మోహన్ 'సింహగర్జన' (1950) మొదలైనవి. తెలంగాణ విమోచనోద్యమం కథావస్తువును తీసుకొని రాసిన నవలల్లో ప్రధానమైనవి – బి.ఎన్. శాస్త్రి 'విప్లవ జ్వాల', తిరునగరి 'సంగం', కందిమళ్ల ప్రతాపరెడ్డి 'బందూక్', సరిపల్లి కృష్ణారెడ్డి 'ఉప్పెన', బి.ఎన్. రెడ్డి 'ఆయువుపట్టు', అలాగే ముదిగంటి సుజాతారెడ్డి రాసిన 'మలుపు తిరిగిన రథచక్రాలు', ఇల్లిందల సరస్వతీదేవి 'బాంచెన్ కాల్మొక్త', తాడిగిరి పోతరాజు 'పావురాలు', దాశరథి రంగాచార్యులు 'చిల్లర దేవుళ్ళు', 'మోదుగపూలు', 'జనపథం', 'మాయజలతారు' మొదలైనవి ఉన్నాయి.

## 2.5.5. తెలంగాణ విప్లవ నవలలు:

అల్లం రాజయ్య రచించిన 'కొలిమంటుకున్నది', 'ఊరు', 'అగ్నికణం' నవలల్లో విప్లవోద్యమ నేపథ్యంలో తెలంగాణలోని పరిస్థితులు చిత్రితమయ్యాయి. పులుగు శ్రీనివాస్ రచించిన 'అన్నలు' విప్లవోద్యమంలో నక్సలైట్స్ వహించిన పాత్రను తెలియజేస్తుంది. వసంతరావు దేశ్‌పాండే రచించిన 'అడవి' నవల ఆదివాసీల ఉద్యమ చైతన్యాన్ని తెలియజేస్తుంది. చెరబండరాజు 'నిప్పురాళ్ళు', 'మాపల్లె', 'ప్రస్థానం', 'దారిపొడుగునా' అనే నవలలను రచించాడు. వనజ రచించిన 'అడవి పుత్రిక' విప్లవోద్యమంలో భాగస్వామి అయి దళాల్లో చేరిన ఒక మహిళ జీవితాన్ని తెలియజేస్తుంది. పి. చంద్ రచించిన 'నెత్తుటిధార', శేషగారి నవలలు కూడా విప్లవోద్యమాన్ని తెలియజేస్తాయి.

### 2.5.6. ఇతర నవలలు:

తెలంగాణ ప్రాంతంలోని గ్రామీణ, కార్మిక, మధ్యతరగతి, దళిత, బహుజనుల చైతన్యాన్ని కాంక్షించి రచయితలు ఎన్నో నవలలు రచించారు. అలాగే తెలంగాణ ప్రాంతంలోని సాయుధ, ఆర్థిక, సాంస్కృతిక అంశాలను ఆధారంగా చేసుకొని వచ్చిన నవలలను కొన్నింటిని ఇక్కడ నేను చర్చిస్తాను.

బోయ జంగయ్య రచించిన 'జాతర' నవలలో జాతరల్లో స్త్రీలు ఏ విధంగా లైంగిక వేధింపులకు గురవుతారో చిత్రించారు. ముదిగంటి సుజాతారెడ్డి 'సంకెళ్ళు తెగాయి' తెలంగాణలోని కుల వైవిధ్యాన్ని చిత్రించింది. 'ఆకాశంలో విభజన రేఖలు లేవు' అనే నవలలో స్త్రీ, పురుషుల మధ్య మిత్ర వైరుధ్యాలే తప్ప శత్రు వైరుధ్యాలుండవని చెబుతుంది. కె.వి. నరేంద్ర 'అత్తారింటికి దారేది' నవలలో పెళ్లిచూపుల్లోని డొల్లతనాన్ని ఎత్తిచూపుతూ రాశారు. గీతాంజలి రచించిన 'ఆమె అడవిని జయించింది' నవల స్త్రీల మధ్య ఉండే వైరుధ్యాన్ని చర్చకు పెట్టింది. ననుమాస్వామి చైతన్యవంతులైన స్త్రీ, పురుషుల జీవితాల ఇతివృత్తంగా చేసుకొని 'మోహిని' అనే నవలను రచించారు. అలాగే పెద్దింటి అశోక్‌కుమార్ 'జిగిరి', 'ఎడారి మంటలు', 'దాడి', 'సంచారి' అనే నవలల్లో వలసలు, ఎలుగుబంటులను ఆడిస్తూ బతికే సంచార జాతిని గురించి, గంగిరెద్దులాటను, నీటి సమస్యలను స్పృశిస్తూ రాశారు. నేరెళ్ల శ్రీనివాస్ గౌడ్ కుల వృత్తియైన గౌండ్ల కులవృత్తిలోని సమస్యల్ని 'బతుకుతాడు' అను నవలలో చిత్రించారు. ఎస్.ఎమ్. ప్రాణ్ రావు 'నీలిపాప' అనే నవలలో పర్యావరణ సమస్యలను గురించి తెలియజేశాడు.

1969లో నవీన్ రాసిన 'అంపశయ్య' నవల చైతన్య స్రవంతిలో సాగుతూ మధ్యతరగతి జీవిత స్రవంతిని కళ్ళకు కట్టినట్టు చిత్రించింది. కథానాయకుడు రవి ఆలోచనలు, కలలు, కోరికలు సగటు మధ్యతరగతి యువకుని జీవితానికి ప్రతిరూపాలు. అందుకే యువకులంతా తమ జీవితాన్ని రవి పాత్రలో వెతుకుతున్నారు. అప్పటి నుండి నవీన్ 'అంపశయ్య' నవీన్‌గా మారాడు. అలాగే నవీన్ రచించిన 'ముళ్ళపొదలు', 'అంతఃస్రవంతి', 'చీకటి రోజులు' మొదలైన నవలలు చైతన్య స్రవంతిలో మధ్యతరగతి ప్రజల జీవితాలను గుర్తు చేశాయి. కాలువ మల్లయ్యగారి 'భూమి పుత్రుడు', 'సాంబయ్య చదువు', 'గువ్వల చెన్నా', 'అస్పృశ్య కోయిల', 'మాదిగ విజయం' మొదలైన నవలల్లో మధ్యతరగతి గ్రామీణ జీవితాలు కన్పిస్తాయి. అలాగే పరవస్తు లోకేశ్వర్ 'సలాం హైద్రాబాద్'లో వర్తమాన సామాజిక పరిస్థితుల్లో ఉన్న మహిళా రాజ్య జీవితాన్ని డాక్యుమెంటులా చిత్రించాడు. ఎమ్.వి. తిరుపతయ్య రచించిన 'జీవన సమరం' నవలలో తల్లి కలల సాకారం కోసం

మధ్యతరగతి యువకులు పడుతున్న బాధలను తెలియజేశాడు. మలయశ్రీ రచించిన నవల 'నిర్ణయం'లో మధ్యతరగతి యువతీ, యువకుల ఆశయాలు, ఆశానిరాశలు, అనుభవాలు కనిపిస్తాయి.

తెలంగాణలోని గ్రామీణ వ్యవసాయం, భూపోరాటాలను చిత్రించిన నవలలకు కొనసాగింపుగా కార్మికోద్యమ నవలలు వచ్చాయి. నిర్దిష్ట కార్మిక పోరాటాలను చిత్రిస్తూ బి.ఎస్. రాములు 'బతుకుపోరు' నవలలో బీడీ కార్మికులపై జరుగుతున్న దోపిడీ, అణచివేతల నేపథ్యంలో పోరాట రూపం ఎలా మారుతుందో ఇందులో వివరించాడు. తుమ్మేటి రఘోత్తమరెడ్డి 'నల్ల వజ్రం' నవల సింగరేణి కార్మికుల జీవితాలను చిత్రించింది. కె.వి. నరేంద్ర బొగ్గు గని కార్మికుల జీవితాలపై 'నల్ల సముద్రం' అనే నవలను రాశారు. జాతశ్రీ 'సింగరేణి మండుతోంది' అనే నవలను రాశారు. బి.ఎస్.రాములు 'జీవనయానం', 'సారాంశం' అనే నవలలు రచించారు. 1979–84 సంవత్సరాల మధ్య విప్లవోద్యమం చేపట్టిన సారా వ్యతిరేక పోరును 'సారాంశం'లో వివరించారు. పి. చంద్ 'అంతర్జాతీయ శ్రామిక యోధుడు', కె.ఎల్.మహేంద్ర 'శ్రామిక యోధుడు', 'ఒక కన్నీరు', 'హక్కుల యోధుడు బాలగోపాల్', 'విప్లవాగ్ని', 'తెలంగాణ స్ట్రయిక్', 'భూదేవి', 'బొగ్గులు', 'బంద్రు నర్సింహులు' అనే నవలలు రచించాడు. అలాగే భూపాల్ 'పట్నమొచ్చిన పల్లె' నవలలో వర్తమాన తెలంగాణ గ్రామీణ వ్యవస్థను చిత్రించారు. జ్వాలాముఖి 'వేలాడిన మందారం' అనే నవలను రాశాడు.

బోయ జంగయ్య 'జగడం' నవలలో 1947 తరువాత శాసనసభ ఎన్నికల వరకు తెలుగు సమాజంలో చోటు చేసుకున్న సామాజిక, రాజకీయ పరిణామాలను దళిత దృక్కోణంలో చిత్రీకరిస్తూ దళితులు మరింతగా చైతన్యవంతులై రాజ్యాధికారం చేపట్టాలనే సందేశాన్ని ఇచ్చాడు. వేముల ఎల్లయ్య రాసిన 'కక్క' నవల గురించి ప్రత్యేకంగా చెప్పుకోవాలి. మాదిగల వాడుక భాషను నవలలో సమర్థవంతంగా ఉపయోగిస్తూ వారి సాంస్కృతిక, సామాజిక జీవన విధానాన్ని మరియు కులవృత్తి చుట్టు తిరుగుతూ దళిత ప్రజా జీవితాల్ని ఈ నవలలో చిత్రీకరించాడు.

ముదిగంటి సుజాతారెడ్డి 'ఆకాశంలో విభజన రేఖల్లేవు' అనే నవలలో రాడికల్ ఫెమినిజాన్ని వివేచిస్తూ రాసినది. ఈ నవల స్త్రీల స్వార్థపూరిత ద్వంద్వ ప్రమాణాలను విమర్శిస్తూ స్త్రీ, పురుషుల మధ్య ప్రజాస్వామిక విలువలతో కూడిన సంబంధాలుండవని ప్రతిపాదిస్తుంది.

జాజుల గౌరి రాసిన 'వొయినం' నవలను దళిత స్త్రీవాద రచనగా చెప్పవచ్చు. ఇది 2012లో వచ్చింది. బోయ జంగయ్య రాసిన 'పుట్టుమచ్చ'ను కూడా దళిత స్త్రీవాద రచనగా చెప్పవచ్చు.

మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన మాదిరెడ్డి సులోచన 1960–70 ప్రాంతంలో చాలా నవలలు రాశారు. తెలంగాణేతర స్త్రీ రచయితలు వ్యాపార నవలలను కోకొల్లలుగా వెలువరిస్తూ విశేష పాఠకలోకాన్ని ఆకర్షిస్తున్న సమయంలో వారితో పోటీ పడుతూ నవలలు రచించిన కీర్తి ఆమెకు దక్కుతుంది. మాదిరెడ్డి సులోచన 70 వరకు నవలలను రాశారు. 1969లో తెలంగాణ ఉద్యమంపై నవలలు రాలేదన్న అపోహను మాదిరెడ్డిగారి నవలలు తొలగిస్తాయి. 'సంధ్యారాగం' నవలలో తెలంగాణ, ఆంధ్ర కుటుంబాలను తీసుకొని, సంఘటనలను సృష్టించుకొని తెలంగాణ ఉద్యమాన్ని చిత్రించాలనే ఉద్దేశ్యంతో ఈ నవలను రచించింది. మాదిరెడ్డి సులోచన 'రుతుచక్రం' నవలలో వ్యవసాయ జీవితాన్ని తెలియజేస్తూ తెలంగాణ పండుగల శోభను కూడా తెలియజేశారు. వృత్తిని ప్రధానంగా చేసుకొని 'సుషుప్తి' నవలను రచించింది. కుమ్మరి వృత్తిని ప్రధాన వస్తువుగా చేసుకొని ఆమె ఈ నవలను రాసింది. అలాగే ఆమె 'వారసులు', 'జీవనయాత్ర', 'అగ్నిపరీక్ష', 'ఆఖరిమెట్లు' మొదలైన నవలలు రచించారు.

బొమ్మాని హేమాదేవి 40కి పైగా నవలలు రాసినట్లు తెలుస్తుంది. ఆమె 'నవధాన్యాలు', 'తపస్విని', 'లవ్‌స్టోరీ', 'ఉపాసన', 'కుంకుమపూలు', 'భావన–భార్గవి', 'నవభారతి', 'కళావతి', 'నవరసాలు', 'తరంగాలు', 'నవోదయం' 'బంగారు గూడు' (పెద్దగూడు) అనే నవలలు ఇందులో ప్రధానమైనవి.

పోల్కంపల్లి శాంతాదేవిగారు 60కి పైగా నవలలు రచించారు. ఆమె నవలల్లో ప్రధానంగా కుటుంబ జీవితం కన్పిస్తుంది. ఇందులో ప్రధానమైన నవలలు 'పుష్యమి', 'చండీప్రియ', 'నౌకాయానం', 'సమర్పణ', 'బాటసారి', 'కుంకుమరేఖలు', 'అష్టదళం', 'కోడెనాగు', 'మాయలేడి', 'జీవన సంగీతం', 'అడవి మంట', 'ఆత్మబంధువు' మొదలైనవి.

ఇల్లిందుల సరస్వతీదేవి 'బాంచెన్ కాల్మొక్త', 'పెళ్ళికూతుళ్ళు' అనే నవలలు రాశారు. శాంతి ప్రబోధగారు 'జోగిని' అనే నవలను రచించారు. జోగినుల దుర్భర జీవితాలను ఇందులో చిత్రీకరించారు. అమృతలత గారు 'సృష్టిలో తీయనిది' అనే నవల రచించారు. ఇందులో ఆమె కుటుంబ జీవితాన్ని చిత్రించింది. ఏ.వి. నరసింహారెడ్డి 1962లో 'ప్రేమజీవుల ఆదర్శ త్యాగాలు' అనే నవలను రాశాడు.

అంపశయ్య నవీన్‌గారు 'సంకెళ్ళు', 'విచలిత', 'సౌజన్య', 'దాగుడుమూతలు', 'కరుణ', 'ప్రత్యూష', 'ప్రయాణంలో ప్రమిదలు', 'మనోరణ్యం', 'ఉమెన్స్‌కాలేజి', 'దృక్కోణాలు', 'అమెరికా',

'చెదిరిన స్వప్నాలు', 'ప్రేమోన్మాదులు', 'అవాస్తవికుడు', 'తారుమారు', 'అనురాగ స్రవంతి', 'తీరని దాహం' వంటి నవలలు రచించాడు.

మలయశ్రీ 12 నవలలు రాశాడు. వాటిలో ప్రధానమైనవి – 'తిరుగుబాటు', 'నిర్ణయం', 'కలవారి కష్టాలు', 'తాగుబోతు', 'విచిత్ర ప్రేమ', 'మంటల వర్షం', 'ఏం మగాళ్ళు', 'వెన్నెల వాన', 'వింత బతుకులు', 'బ్రహ్మంగారి కథ' మొదలైనవి.

హేతువాది అయిన రేగులపాటి కిషన్‌రావు 'ఆమె వితంతువు కాదు', 'పతివ్రత' అనే నవలలు రాశాడు. బి.ఎన్. శాస్త్రి 'రాధ', 'సంధ్యారాగం', 'పరివర్తన', 'జీవనపథం' అనే సాంఘిక నవలలు రచించాడు. ఎమ్.వి. తిరుపతయ్య 1987లో 'బతుకు' అనే నవలను, ఆ తర్వాత రెండు దశాబ్దాలకు 'జీవన సమరం' అనే నవలను రచించాడు. ఈ నవలలో (జీవన సమరం) పల్లెల్లోని ప్రజలు ఎదుర్కొంటున్న నిర్బంధకాండను, నక్సలైట్లుగా మారిన కొడుకులు, తల్లిదండ్రులు పాలకవర్గాల నుండి పడే కష్టాలను వాస్తవికంగా చిత్రించాడు.

వరంగల్‌కు చెందిన రామా చంద్రమౌళి 18 నవలలను రచించారు. అవి 'శాపగ్రస్తులు', 'చూరునాళ్ళు', 'ప్రవాహం', 'శాంతివనం', 'తెలిసి చేసిన తప్పు', 'అమృతం తాగిన రాక్షసులు', 'వక్రరేఖలు', 'చదరంగంలో మనుషులు', 'పిచ్చిగీతలు', 'రాగధాత', 'నిన్ను నువ్వు తెలుసుకో', 'పొగమంచు', 'మజిలీ', 'దారి తప్పిన మనుషులు', 'ఎడారిలో చంద్రుడు', 'పరంపర' మొదలైనవి.

దిలావర్‌గారు 'సమిధలు' అనే నవలను, జాతశ్రీ 'మట్టి బంధం', దశరథ్‌గారు 'శతాబ్దాల నిశ్శబ్దం', 'తెగిపడిన సంకెళ్ళు' అనే నవలలు రాశారు. తిరుకోవలూరు శశిరేఖ 'కాలానికి సమాధి' అనే నవలను రాశారు. రావులపాటి సీతారామారావు 1968లో 'బ్రతుకు బొంగరం', 'ఊరు మారిపోయింది', 'లక్షల్లో ప్రేమ', 'హృదయ వేదం' అనే నవలలు రాశారు. ఐతా చంద్రయ్య 'ఇసుక గోడలు', 'ఆడపిల్ల', 'తల్లిభారతి', 'పడమటి సూర్యోదయం' 'సంధ్యా మదనం', 'సత్తికొండ', 'దేశభక్తి' అనే నవలలు రాశాడు. కసిరెడ్డి వెంకట్ రెడ్డి 'మంగళసూత్రం', 'రాగజ్వాల', 'సంకర జాతికి నీతి ఉన్నదా', 'వయసు పిలుపు', 'మాపల్లె', 'సుడిగుండాల్లో సూరీడు', 'బ్రహ్మముడి' అనే నవలలు రచించాడు.

ఎస్.ఎం. ప్రాణ్ రావు 1995లో 'డ్రీంబాయ్' అనే పిల్లల నవల రాశాడు. 1996లో 'వెన్నెలలో కోనేరు' అనే నవలను రాశాడు. ఇందులో వేశ్యావృత్తిలోని దీనస్థితిని తెలియజేశాడు. 1994లో రాసిన 'నీలిపాప' అనే నవలలో పర్యావరణానికి సంబంధించిన విషయాలను తెలియజేశాడు. 'నీలాంబరి' నవలలో దొంగ బాబాల గురించి వారి రహస్యాలు గురించి

తెలియజేశాడు. ప్రభాకర్ జైనీగారు 'చోర్ బజార్', 'లక్ష్యం', 'గమ్యం', 'రూపాయలొస్తున్నాయ్ జాగ్రత్త' తదితర రచనలు చేశాడు.

డా॥ శంకరయ్య 'పడమటి కొండలు' అనే నవల సి.పి. బ్రౌన్ అకాడమీ, నవ్య తెలుగు వారపత్రిక వారు సంయుక్తంగా నిర్వహించిన నవలల పోటీలో లక్ష రూపాయల బహుమతిని అందుకుంది. తెలంగాణ భాషా నుడికారంతో రాసిన నవల ఇది. ఇందులో అమెరికాలోని ప్రవాస భారతీయుల కుటుంబ స్థితిగతులను తెలియజేశారు.

కె. రామచంద్రమూర్తి 'కాలమేఘం' అనే నవల రాశాడు. అమెరికా విధానాలు ప్రపంచ వ్యాప్తంగా ఏ విధమైన ప్రభావాలు చూపుతున్నాయనేది ఈ నవల ఇతివృత్తం. అంతర్జాతీయ నిర్ణయాలు, రాజకీయాలు, దేశీయ సమాజాలను, సంబంధాలను ఎలా మారుస్తాయనేది ఈ నవలలో రచయిత చిత్రించాడు. గూడ అంజయ్య 2010లో 'పొలిమేర' అనే నవల రాశాడు. ఉద్యమకారుల జీవితాలను, నిర్బంధాలను, ప్రేమలను, జైళ్ల పరిస్థితులను ఆయన ఇందులో పొందుపరిచాడు. డా॥ అఫ్సర్ 'మై గరీబ్ హూ' తెలంగాణ ముస్లిం జీవన శైలిని పొందుపరిచిన తొలి నవలగా నిర్వచించాడు. ముస్లింవాద నవలల్లో స్కైబాబా 2015లో రాసిన 'ఆపా' నవల మాత్రమే కనిపిస్తుంది. ఇంకా ముస్లింవాద నవలలు రావాల్సి ఉంది. నందిగం కృష్ణారావు రాసిన 'చీకట్లో నల్ల పిల్లి' అనే నవలను విడిగా ప్రస్తావించుకోవాలి. ఉస్మానియా విశ్వవిద్యాలయాన్ని కేంద్రంగా తీసుకొని ఈ నవల వెలువడింది. హైదరాబాద్‌లోని మురికివాడల జీవితాలు ఎలా ఉంటాయో, అవి రాజ్య కుటిల నీతికి ఎలా బలవుతాయో ఈ నవల అద్భుతంగా తెలియజేస్తుంది. పోలీసు వ్యవస్థ, పాలక వర్గాల కుటిల నీతిని, చాణుక్య నీతిని ఈ నవల ప్రతిఫలిస్తుంది.

తెలంగాణలో నవల 1866లోనే ప్రారంభమైందని తెలుగు నవల ఆవిర్భవానికి తెలంగాణ నవలలో కూడా బీజాలున్నాయని మనం అర్థం చేసుకోవచ్చు. అలాగే గ్రామీణ జీవితాన్ని, ఉద్యమాలను, ప్రజా సంఘర్షణలను ఈ నవలలు చిత్రీకరించాయి. ప్రజల నుండి దూరం కాని తెలంగాణ నవల తన ప్రత్యేకతను నిలబెట్టుకుంటూ వస్తున్నది.

★★★

# మూడవ అధ్యాయం

# కాలువ మల్లయ్య నవలలు – వస్తు విశ్లేషణ

## మూడవ అధ్యాయం

## కాలువ మల్లయ్య నవలలు – వస్తు విశ్లేషణ

### 3.0. వస్తు పరిచయం:

రచయిత తాను చూసిన సమాజాన్ని తనకు నచ్చిన ప్రక్రియలో అభివ్యక్తం చేయడానికి ప్రయత్నం చేస్తాడు. ఏ రచన అయినా రచయిత అనుభవాల మేరకు పరిమితమై ఉంటుంది. ప్రతి రచయిత తాను రాయాలనుకున్న భావాలను మనసులో నిర్దిష్టంగా రూపొందించుకొని రచనకు ఉపక్రమిస్తాడు. రచయిత మొదటగా వస్తువును స్వీకరిస్తాడు. వస్తువును ఆంగ్లంలో 'content' అంటారు. రచయిత ఉద్దేశించిన మూల భావం వస్తువు. "సాహిత్యంలో వ్యక్తమయ్యే ప్రధాన భావాన్ని వస్తువు అనవచ్చు. రచయిత సాహిత్యంలో వివరించిన ఆశయాన్ని వస్తువుగా చెప్పవచ్చు" (మధుసూదనరావు,త్రిపురనేని.1997:పుట.13). ఒకానొక దృగ్విషయంలో ప్రత్యేకంగా, నియమబద్ధంగా ఉన్న మూలకాల, క్రమ విధానాల మొత్తమే వస్తువు. మనిషి, మానవ సంబంధాలు, సామాజిక జీవితం, దానిలోని సమస్త వైరుధ్యాలు, వీటన్నింటి యొక్క కళాత్మక ప్రతిఫలం సాహిత్యంలో వస్తువు అవుతుంది" (శరత్ జ్యోత్స్నారాణి,ఎస్.2003:పుట.25).

సాహిత్యం అనేది మానవ సమాజం కోసమే కాబట్టి కవులు తీసుకునే ముడిసరుకు అనే వస్తువు కూడా మానవ జీవితంలో నుండే తీసుకుంటారు. రచయిత ముందుగా ఎన్నుకున్న వస్తువును ఎలా చెపితే బాగుంటుందో నిర్ణయించుకొని ప్రక్రియలను ఆశ్రయిస్తాడు. అలా రచయిత ఎన్నుకున్న వస్తువును బట్టి, ప్రక్రియను బట్టి, సృజనాత్మక సాహిత్య సేద్యాన్ని చేస్తాడు. సాహిత్యంలో ఉన్న కవిత్వం, కథ, నవల, నాటకం మొదలైన ప్రక్రియల్లో ఒక్కదానిని మాత్రమే తీసుకొని అనుకున్న విధంగా వస్తువును కథారూపంలో రచించటం జరుగుతుంది.

రచయితలు తన జీవిత అనుభవంలో నుండికాని, తనకు పరిచయం ఉన్న వ్యక్తుల అనుభవాలలో నుండి కాని, తనను ప్రభావితం చేసిన వ్యక్తుల నుండి కాని, గ్రంథాల నుండి కాని, తనను ఎంతో తీవ్రంగా స్పందింపచేసిన సంఘటనలు నిజ జీవితం నుండి కాని, ప్రసార మాధ్యమాల నుండి కాని, కథావస్తువును ఎంపిక చేసుకుంటారు. దానిని యధావిధంగా చెప్పితే ఆసక్తి కల్గించదు కాబట్టి ఒక స్వరూపాన్ని క్రమ పద్దతిని అమర్చుకుని ఆకర్షణీయంగా చెపుతారు. అలా రచయితలు చెప్పాలనుకున్న విషయాన్ని సూటిగా తెలియజేస్తారు.

రచయితలు ఎంచుకున్న వస్తువును బట్టి ప్రక్రియల్లో రచన ఉంటుంది. అన్ని ప్రక్రియల్లో కెల్లా, సమాజాన్ని ఉన్నది ఉన్నట్లుగా, చక్కగా చిత్రించడానికి అవకాశం ఉన్న ప్రక్రియ నవల.

ఆధునిక వచన సాహిత్య ప్రక్రియలలో అశేష పాఠకాదరణ పొందిన ప్రక్రియ నవలది అగ్రస్థానం. నవలలో వస్తు, శిల్పాలు రెండూ సమ ప్రాధాన్యాన్ని కలిగి ఉన్నాయి. వాటిలో ఏవి లోపించినా నవల లోపభూయిష్టంగా కనిపిస్తుంది. వస్తువు, శిల్పాలు రెండూ సమానంగా చిత్రించబడిన నవలలు అన్ని వర్గాల పాఠకుల్ని ఆకట్టుకుంటాయి.

నవలా రచయిత తన కిష్టమైన ఇతివృత్తాన్ని స్వీకరిస్తాడు. అందుకు నియమ నిబంధనలు ఉండవు. అయితే ఇతివృత్త స్వీకారం అనేది రచయిత జీవితానుభవంమీద, రచయితకు ఉన్న ప్రాపంచిక దృక్పథం మీద ఆనాటి సామాజిక అవసరాల మీద ప్రధానంగా ఆధారపడి ఉంటుంది. రచయితకు బాగా తెలిసి ఉన్న జీవితంలో నుండే ఇతివృత్తాన్ని ఎన్నుకున్నప్పుడే సఫలీకృతుడు అవుతాడు. ఇతివృత్తంలో ప్రధానంగా మూడు లక్షణాలైన కాలం, స్థలం, కార్యంలు ఉండాలి. అవి ఒకదానితో మరొకటి కలిసిపోతేనే ఇతివృత్తానికి జీవితం, దాని నుండే కథకు పరిపూర్ణత చేకూరుతుంది. సమగ్ర ఇతివృత్తంలో ప్రారంభం, వికాసం, ముగింపులు ఉంటాయి. నవలలో ఒకదానితో కాని రెండు లేదా అంతకంటే ఎక్కువ కథలతో కాని కలిపి రాస్తారు. నవలలో ఇతివృత్త సంవిధానం అనేక రూపాలుగా కనిపిస్తుంది. కొన్ని నవలల్లో పరస్పర సంబంధం కలిగిన రెండు ఇతివృత్తాలు కనిపిస్తాయి. వాటి నిర్మాణాన్ని పరిశీలిస్తే రెండు రకాల నవలలున్నాయి. అవి శిథిలేతివృత్తంగల నవల, సుసంఘటితేతివృత్తం గల నవల అని విలియం హెన్రీ హడ్సన్ అభిప్రాయపడ్డాడు.

నవలకు కథ శరీరం అయితే, కథావస్తువు ప్రాణం అవుతుంది. ఇతివృత్తం అనేది అస్థిపంజరం వంటిది, ఆకర్షణీయంగా ఉండదు. కాని మొత్తం నవలాశరీరానికి అదే ఆధారం అవుతుంది. నవలల్లో వస్తువు సంవిధానాన్ని దృష్టిలో ఉంచుకొని చూస్తే స్థూలంగా, నవలల్లో వస్తువు, పాత్రచిత్రణ, సన్నివేశం, సంఘటన, వాతావరణం, కాలం, స్థలం, సంవాదం, కథాకథనం, ఉద్దేశ్యం, భావచిత్రాలు, ప్రతీకలు, వర్ణనలు వంటి ముఖ్యాంశాలు ఉంటాయి. నవలల్లోని ఆ అంశాలన్నీ అవినాభావ సంబంధాన్ని కలిగినవిగా ఉన్నాయి. ఇంకా ఆ అంశాలను నిశితంగా వస్తు విశ్లేషణ చేస్తే నిర్ధిష్ట రచన ఏ వర్గ జీవితాన్ని ప్రతిబింబిస్తోంది అనేది తెలుస్తుంది.

## 3.1. వస్తువు దృష్ట్యా తెలుగు నవలలు – వర్గీకరణ:

ప్రపంచ సాహిత్యంలోనే విస్తృత ప్రచారం పొంది ప్రభావితమైన ప్రక్రియ నవల. ఆంగ్ల భాషా ప్రభావంతో తెలుగు సాహిత్యంలోకి నవలా ప్రక్రియ ప్రవేశించి, బహుళ జనాదరణను పొందింది.

తెలుగు నవలల్లోని కథావస్తువును బట్టి అనేక విధాలుగా సాహిత్యకారులు, విమర్శకులు, పరిశోధకులు వర్గీకరించారు. వారి వర్గీకరణను చూద్దాం:

1) ఆచార్య జి. యోహన్ బాబుగారు 'బలివాడ కాంతారావు నవలలు – పరిశీలన' అనే గ్రంథంలో బలివాడ కాంతారావు రాసిన 26 నవలలను వస్తువు దృష్ట్యా మూడు రకాలుగా వర్గీకరించారు. అవి:

1) కుటుంబ జీవన చిత్రణాత్మక నవలలు,
2) సామాజిక జీవన చిత్రణాత్మక నవలలు,
3) సాంస్కృతిక నవలలు.

2) బొడ్డుపాటి వెంకట కుటుంబరావు 'ఆంధ్ర నవలా పరిణామము' అనే గ్రంథంలో నవలలను ఆరు రకాలుగా వర్గీకరించారు. వాటిని సహజావబోధ ప్రధానములు అంటారు. అవి:

1) శీలపాత్ర ప్రధానములు,
2) సంఘ చిత్రణ ప్రధానములు,
3) ఘటనాప్రధానములు,
4) ఇతిహాస ప్రధానములు,
5) మనః ప్రవృత్తి నిరూపణ ప్రధానములు,
6) కౌతుహల ప్రధానములు/ఆసక్తిజనకములు/కాల్పనికములు.

3) ముదిగంటి సుజాతారెడ్డి 'తెలుగు నవలానుశీలనం' అనే గ్రంథంలో నవలలను పదకొండు రకాలుగా వర్గీకరించారు. అవి:

1) సాంఘిక నవలలు,
2) డిటెక్టివ్ నవలలు,
3) మంత్రతంత్రాల నవలలు,
4) మనోవిశ్లేషణాత్మక నవలలు,
5) చారిత్రక నవలలు,
6) విజ్ఞానశాస్త్ర నవలలు,
7) వినోదాత్మక నవలలు,
8) హాస్యవ్యంగ్యాత్మక నవలలు,
9) పౌరాణిక నవలలు,

10) బాలల నవలలు,

11) రాజకీయ నవలలు.

4) మొదలి నాగభూషణశర్మ తన 'తెలుగు నవలావికాసం' గ్రంథంలో నవలలను మూడు రకాలుగా విభజించారు. అవి:

1) పౌరాణిక నవలలు,

2) సాంఘిక నవలలు,

3) చారిత్రక నవలలు.

5) బి. ఎస్. రాములు 'కథలబడి – కథాసాహిత్య అలంకార శాస్త్రం' గ్రంథంలో నవలలను 41 రకాలుగా విభజించారు. అవి:

1) అభ్యుదయ నవలలు

2) దళిత నవలలు

3) కులవృత్తి జీవిత నవలలు

4) విప్లవ నవలలు

5) గ్రామీణ నవలలు

6) అంబేద్కరిస్ట్ , దళితవాద నవలలు

7) డిటెక్టివ్ నవలలు

8) పట్టణ నవలలు

9) పాపులర్ వ్యాపార నవలలు

10) చారిత్రక నవలలు

11) పిల్లల నవలలు

12) రాజకీయ సామాజిక ఉద్యమ నవలలు

13) మనోవిజ్ఞానిక నవలలు

14) సినిమా నవలలు

15) విజ్ఞానశాస్త్ర నవలలు

16) దేశభక్తి నవలలు

17) గాంధీవాద నవలలు

18) కార్మిక జీవిత నవలలు

19) ఫిక్షనల్ నవలలు

20) ఉత్తరాంధ్ర నవలలు

21) ఇన్వెస్ట్ గేటివ్ నవలలు

22) మార్క్సిస్టు నవలలు

23) కోస్తాంధ్ర నవలలు

24) రాయలసీమ నవలలు

25) గిరిజన జీవితాల నవలలు

26) ఉత్తమపురుష నవలలు

27) బి.సి. జీవితాల నవలలు

28) ఉత్పత్తి సంబంధాలను విశ్లేషించే నవలలు

29) ఉద్యోగ, ఉపాధ్యాయ నవలలు

30) మానవ సంబంధాల పరిణామ నవలలు

31) బహుళ పాత్రకేంద్ర నవలలు

32) అగ్రకుల, మధ్యతరగతి జీవితాల నవలలు

33) ప్రవాసాంధ్ర నవలలు

34) విద్యార్థి యువజనులను ఉద్దేశించిన నవలలు

35) మహిళా పాఠకుల కోసం రాసే నవలలు

36) సామాజిక ఆర్థిక చారిత్రక పరిణామాల నవలలు

37) ఏకపాత్ర కేంద్రక నవలలు

38) రామాయణ, భారత, ఇతిహాస ప్రబంధ సాహిత్య నవలలు

39) తెలంగాణ ఉద్యమ నవలలు

40) స్త్రీల జీవితాల నవలలు – కుటుంబ సంబంధాల నవలలు

41) చైతన్య స్రవంతి నవలలు

5) వల్లంపాటి వెంకటసుబ్బయ్య తన 'నవలాశిల్పం' అనే గ్రంథంలో నవలలను ఐదు రకాలుగా విభజించారు. అవి:

1) సమాజ ప్రధానమైన నవలలు,

2) వ్యక్తి ప్రధానమైన నవలలు,

3) తాత్త్విక నవలలు,

4) రాజకీయ నవలలు,

5) చారిత్రక నవలలు.

పైన ప్రముఖులు తెలిపిన వర్గీకరణను ఆధారంగా చేసుకొని కాలువ మల్లయ్య రచించిన 16 నవలల్లోని కథావస్తువును పరిశీలించి వాటిని ఐదు రకాలుగా వర్గీకరిస్తున్నాను. అవి:

| | | |
|---|---|---|
| 1. | సామాజిక నవలలు | భూమిపుత్రుడు, సాంబయ్య చదువు, మాట్లాడే బొమ్మలు, బతుకు పుస్తకం, డబ్బు మైనస్ తృప్తి = దుఃఖం, తెలంగాణ దేవదాసు. |
| 2. | దళిత నవలలు | మంచియన్నది మాల అయితే.., గులాంగిరిచోడో, మాదిగ విజయం, అస్పృశ్య కోయిల. |
| 3. | వృత్తి నవల | గువ్వల చెన్నా |
| 4. | చైతన్య స్రవంతి నవల | తపస్సు |
| 5. | కార్మిక నవల | మెతుకు పుస్తకం |
| 6. | అలభ్య నవలలు | చీకట్లో చిరుదీపం, విధి(వ్రాలా?, ఊరంటే? |

పై వర్గీకరణ సమగ్రమని భావించాల్సిన అవసరం లేదు. విషయ వర్గీకరణ సౌలభ్యం కోసం మాత్రమే చేసిన విభజన ఇది. ప్రతి నవలను పరిచయం చేస్తూ, నవలా వస్తువును తెలియజేసి దానిలోని తారతమ్యాలను, లోటుపాట్లను విశ్లేషణ చేయదలిచాను.

### 3.2. సామాజిక నవలలు:

అనేక మంది వ్యక్తుల సమూహం సమాజం. సమాజంలోని అనేక సమస్యలను చిత్రిస్తూ రచింపబడిన నవలలు సామాజిక నవలలు. కాలువ మల్లయ్య సామాజిక అంశాలైన రైతు జీవన విధానాలు, భూస్వామ్య వ్యవస్థ, మధ్యతరగతి కుటుంబ సమస్యలు, గ్రామీణ జీవితం, తెలంగాణ పల్లెలో వచ్చిన మార్పులు, సంస్కృతి మొదలైన సమస్యలను చిత్రిస్తూ సమాజ చైతన్యాన్ని కాంక్షించారు. కాలువ మల్లయ్య తన నవలల ద్వారా సామాజిక స్పృహను తెలియజేశాడు. కాలువ మల్లయ్య రచించిన భూమిపుత్రుడు, సాంబయ్య చదువు, మాట్లాడే బొమ్మలు, బతుకు పుస్తకం, డబ్బు మైనస్ తృప్తి = దుఃఖం, తెలంగాణ దేవదాసు. సామాజిక నవలల్లోని వస్తువును తెలియజేసి విశ్లేషణ చేశాను.

### 3.2.1. భూమిపుత్రుడు నవల:

కాలువ మల్లయ్య రచించిన మొదటి నవల 'భూమిపుత్రుడు'. ఇది చతుర పత్రికలో చలసాని ప్రసాదరావుగారి సంపాదకత్వంలో 1991 డిసెంబర్ సంచికలో వెలువడింది. ఈ నవలకు 1992 సంవత్సరంలో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయ పురస్కారం లభించింది. భూమిపుత్రుడు, సాంబయ్య చదువు, మాట్లాడే బొమ్మలు అనే మూడు నవలలు కలిపి "కాలువ మలయ్య నవలలు" అనే పుస్తకంగా 2001 డిసెంబర్ లో ముద్రించబడింది.

కాలువ మల్లయ్య సామాజిక అంశాలైన కార్మిక, విప్లవ, దళిత, గ్రామీణ రైతు జీవన విధానాలను, భూస్వామ్య వ్యవస్థ, మధ్య తరగతి కుటుంబ సమస్యలు, స్త్రీల సమస్యలు మొదలైన అంశాలను స్పృశిస్తూ నవలలు రచించారు. 20వ శతాబ్దపు చివరలో వచ్చిన భూమిపుత్రుడు నవలలో ముఖ్యంగా రైతు కుటుంబంలో చోటు చేసుకున్న ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక పరిస్థితులను తెలియజేశారు.

భూమిపుత్రుడు నవల తెలంగాణ రైతుల యొక్క దుర్భర పరిస్థితులను, భూమిని నమ్ముకున్న రైతు భూమిని అమ్ముకునే దైన్యస్థితికి రావడానికి గల కారణాలను, బొగ్గు గనుల్లో పనిచేసే శ్రామికుల యొక్క కష్టాలను, బ్యాంక్ అధికారులు, వడ్డీ వ్యాపారులు రైతులను ఇబ్బంది పెట్టే పరిస్థితులను, ఉన్నత చదువులు చదివి ఏ ఉద్యోగం రాకపోవడం వల్ల నిరుద్యోగులుగా ఉన్న యువకులు చివరికి నక్సలైట్లుగా మారుతున్న వైనాన్ని విశ్లేషిస్తుంది.

#### 3.2.1.1. నవలా వస్తువు:

తెలంగాణ ప్రాంతంలోని కరీంగనర్ జిల్లాలోని ఒక గ్రామంలోని రైతు జీవితం ఈ నవలకు భూమిక. ఈ నవలలో ప్రధాన పాత్ర కొండ మల్లయ్యది. కొండ మల్లయ్య ఒక రైతు బిడ్డ. అతని వయస్సు 50 సంవత్సరాలపైనే. శ్రమైక జీవన సౌందర్యానికి సమానమైంది ఏది లేదని నమ్మిన భూమిపుత్రుడు. వ్యవసాయాన్ని నమ్ముకొని భూమినే జీవనాధారంగా చేసుకొని బతుకుతూ కుటుంబాన్ని పోషిస్తున్న వ్యక్తి. అతని భార్య నర్సమ్మ. ఆమె వంశం తాత, ముత్తాతల కాలం నుండి కూడా వ్యవసాయ కుటుంబమే. ఎనిమిది సంవత్సరాల వయస్సులో మల్లయ్యను పెళ్ళి చేసుకుంది. శ్రమ జీవనంలోని అందాన్ని చూసిన వ్యక్తి నర్సమ్మ. కష్టాల్లో, సుఖాల్లో భర్తకు చేదోడు వాదోడుగా ఉంటూ సంసార బాధ్యతలు మోస్తుంది.

కొండ మల్లయ్య దంపతులకు ముగ్గురు కొడుకులు, ఒక కూతురు ఉన్నారు. పెద్ద కొడుకు పేరు రచయిత ప్రస్తావించలేదు. అతడు వ్యవసాయం చేసుకుంటూ తమ ప్రాంతంలో జరుగుతున్న

పోరాటాలలో చేరి చివరకు పోలీసు కాల్పుల వల్ల చనిపోతాడు. రెండవ కొడుకు రాజయ్య. మల్లయ్య రాజయ్యను ఐదేళ్ళు నిండగానే బడికి పంపించాడు. కొన్ని రోజుల తరువాత రాజయ్యకు చదువు కోవడం ఇష్టం లేక బడి మానేశాడు. రాజయ్య బడి మానేసిన తరువాత తండ్రికి వ్యవసాయపు పనుల్లో సహాయంగా ఉండేవాడు. రాజయ్య వ్యవసాయ పనులు చేస్తూ పెళ్ళి చేసుకున్నాడు. పెళ్ళి అయిన తరువాత భార్య లక్ష్మి కోరిక మేరకు బొగ్గు గని పనిలో చేరి, గనిలో జరిగిన ప్రమాదం వల్ల చనిపోయాడు.

మల్లయ్య మూడవ కొడుకు తిరుపతయ్య. ఇతన్ని మల్లయ్య బాగా చదివించాలనుకున్నాడు. తండ్రి మీద ప్రేమతో తిరుపతయ్య బాగా చదువుతాడు. తిరుపతయ్య అమ్మమ్మ వాళ్ళ ఊళ్ళో పదవ తరగతి వరకు చదివి ఆ తరువాత సుల్తానాబాదులో ఇంటరు పూర్తి చేసి కరీంనగర్ లో బి.ఏ.లో చేరుతాడు. ఖర్చులు మరింత పెరగడం వల్ల ఆ ఖర్చులను భరించలేక రాజయ్య అతన్ని చదువు మాన్పించాలనుకుంటాడు. కాని తండ్రి ఒప్పుకోడు. కుటుంబంలో ఒక్కరైనా చదువుకున్న వాళ్ళుండాలని మల్లయ్య పట్టుబట్టి తిరుపతయ్యను డిగ్రీ వరకు చదివిస్తాడు. చదువు అయిపోగానే ఉద్యోగం వస్తుందని తన కొడుకు కష్టాలు తీర్చుతాడని అనుకుంటాడు కాని డిగ్రీ అయి నాలుగేళ్ళు గడిచినా ఉద్యోగం రాలేదు. అటు ఉద్యోగం రాక ఇటు వ్యవసాయం చేయడం చేతగాక తిరుపతయ్య సతమతమయ్యేవాడు. ఇలాగే నిరుద్యోగిగా ఉంటే కమ్యూనిస్టుల్లో కలుస్తాడేమోనని మల్లయ్య భయపడేవాడు. చుట్టుప్రక్కల గ్రామాల్లో రాడికల్స్ ప్రభావం చాలా ఉంది. తిరుపతయ్య ఇద్దరు స్నేహితులు రాడికల్లో కలిసిపోయారు. ఇప్పటికే ఓ కొడుకు బలైపోయాడు. చదువుకున్న ఈ కొడుకు కూడా నక్సలైట్ల పోరాటంలో కలుస్తాడేమోనని భయపడేవాడు. కాని తిరుపతయ్యకు అలాంటి విషయాలు, పోరాటాలు నచ్చవు. మల్లయ్యకు తిరుపతయ్య అంటే ఎంతో ప్రేమ, ప్రత్యేక అభిమానం. తాను తిరుపతయ్యను అపురూపంగా చూసుకునేవాడు. చదువుకున్నవాడికే ఎక్కువ ఆలోచన, జ్ఞానం ఉంటుందని నమ్మేవాడు. కొండ మల్లయ్య కూతురు కాంతమ్మ ఇంటి పనులు చేస్తూ తల్లిదండ్రులకు వ్యవసాయపు పనుల్లో సహాయం చేస్తుంది. అర్థాంతరంగా జీవితం చాలించి వెళ్ళిపోయిన పెద్ద కొడుకు గురించి, చదువురాక ఇంకా జీవితంలో స్థిరపడని రాజయ్య గురించి, డిగ్రీ చదివిన బ్రతుకు అగమ్యగోచరంగా ఉన్న చిన్న కొడుకు గురించి, పద్దెనిమిది ఏళ్ళు నిండిన కూతురు పెళ్ళి చేయడం ఆలస్యమైందని తన ఆర్థిక పరిస్థితులను గురించి తలుచుకుంటూ మల్లయ్య దుర్భరమైన జీవితాన్ని గడుపుతున్నాడు.

కొండ మల్లయ్య ఇద్దరు కొడుకులతో వ్యవసాయం పని చేసుకుంటూ గడుపుతాడు. వ్యవసాయం వల్ల వచ్చే ఆదాయంతో ఇంట్లో ఖర్చులు, వడ్డీలు కట్టడానికే సరిపోవట్లేదని తాను బొగ్గు పనికి వెళ్తానని రాజయ్య తండ్రితో అంటాడు. రాజయ్య బొగ్గు గని పనికి వెళ్ళడం మల్లయ్యకు అసలు ఇష్టం ఉండదు. విలాసవంతమైన జీవితం గడపాలన్న భార్య లక్ష్మి కోరిక మేరకు ఎలాగైనా బొగ్గు పనిచేయాలని నిశ్చయించుకుంటాడు. మల్లయ్య ఆరువేల రూపాయలు వడ్డీకి తీసుకొచ్చి ఏజెంటుకు కట్టేస్తాడు. ఏజెంట్ ద్వారా రాజయ్య బొగ్గు గని పనిలో చేరుతాడు. గని పని వలన రాజయ్య కష్టాలను ఎదుర్కొంటాడు. గనిలో జరిగిన ప్రమాదం వల్ల రాజయ్య చనిపోతాడు.

మార్గశిర మాసంలో మొక్కజొన్న పంట వేశారు. ఆ పంట వల్ల వచ్చిన డబ్బు వడ్డీలు కట్టడానికి, ఇంట్లో ఖర్చులకే సరిపోతుంది. మల్లయ్య ఎద్దును కొనాలనుకున్నా డబ్బులేకపోవడం వల్ల కొనలేకపోయాడు. తిరుపతయ్య వ్యవసాయం చెయ్యడం మానెయ్యమని తండ్రికి సలహా ఇచ్చాడు. ఉన్న మాగాణి భూమి అమ్మి బాకీల నుండి విముక్తి పొందాలని చెప్పాడు. తాను కరీంనగర్ లో ఏ ప్రైవేట్ స్కూల్లో అయినా చేరి నాలుగైదు వందలైనా సంపాదించాలనుకుంటాడు లేదా సింగరేణిలో జాబు చెయ్యడానికి సిద్ధపడతాడు. మల్లయ్య వేసవి పంట పండిన తరువాత భూమి అమ్మకానికి సంబంధించిన విషయం పైన నిర్ణయం తీసుకోవాలనుకుంటాడు.

కూతురు పెళ్ళి వలన అయిన ఖర్చులు మరియు బాకీలు పెరిగిపోవడం వల్ల రోజురోజుకు దిగజారుతున్న ఆర్థిక పరిస్థితులు, ఉన్న భూమిని అమ్మందే బాకీ తీర్చడం సాధ్యంగాని పరిస్థితులు, అగ్నిగుండంలా ఉన్న ఆ ప్రదేశంలోని పరిస్థితులు, వెంటాడుతున్న కొడుకుల జ్ఞాపకాల వల్ల చివరకు రెండెకరాల భూమిని అమ్ముతాడు. వచ్చిన డబ్బుతో ఊళ్ళో ఉన్న అప్పులు తీరుస్తాడు. ఆ తరువాత కొన్ని రోజుల్లో తిరుపతయ్యకు బొగ్గు గనిలో 'కోల్ ఫిల్లర్' ఉద్యోగం వస్తుంది. తిరుపతయ్య ఉద్యోగం వలన కుటుంబం మొత్తం పట్టణంలో ఉండడానికి సిద్ధపడతారు. పుట్టి పెరిగిన ఊరును ఐదు దశాబ్దాలకు పైగా జీవిస్తున్న నేలను, పీలుస్తున్న గాలిని వదిలిపెట్టి పట్టణానికి వెళ్ళినాడు ఆ రైతుబిడ్డ మల్లయ్య.

రైతు బతుకంతా కష్టాల కడలే. ఏడాదంతా ఏరోజు తీరిక దొరకదు. అట్లాని ఏరోజు హాయిగా, సుఖంగా ఉన్నది లేదు. మండుటెండల్లో మాడిపోతూ పనిచేస్తాడు. కడవల కొద్ది ఘర్మజలాన్ని ధారపోస్తాడు. రైతు శరీరంపై ఎప్పుడు చెమట కంపుకి పేరుకుపోయిన ఉప్పు, కాళ్ల పగుళ్ళు తేలి దుబ్బమయమై ఉంటాయి. ఎముకలు కొరికే చలిలోనూ ముడుచుకుపోతున్నా పనిచేయక తప్పదు. చాలా మందికి కప్పుకోవడానికి చిరుగులు పడ్డ గొంగళ్ళు తప్ప వేరే లభించవు.

కుండపోత వర్షాలు పడుతున్నా రైతు నానక తప్పదు. వర్షాకాలంలో బురదలో నాగళ్ళు దున్నడం వల్ల కాళ్ళు ఎప్పుడూ నానుతుండటం వల్ల పుళ్లు పుళ్లుగా తయారవుతాయి. అయినా ఏ కాలంలోనూ రైతుకు తప్పదు పని.

ఎన్ని పోరాటాలు జరిగినా, జరుగుతున్నా గ్రామాల్లో ఇంకా పాత అవశేషాలు ఉన్నాయి. ఇప్పటికీ చాకలివాళ్ళు కోళ్లను, గొర్రెలను కోసిపెట్టడం ప్రతిగా వాటి కాళ్లు, తలకాయలు తీసుకెళ్లడం, మంగలివారు ఇంటికొచ్చి క్షవరం చేయడం లాంటివి కొన్ని గ్రామాల్లో ఉన్నాయి. బీడీలు చేయడం గృహ పరిశ్రమగా కొన్ని గ్రామాల్లో ఉంది. కొంత పారిశ్రామీకరణ జరిగిన చాలా గ్రామాల్లో కులవృత్తులు చెక్కుచెదరకుండ ఉన్నాయి. చదువుకున్న వాళ్లలో అన్ని కులాలవారు ఉద్యోగాలు దొరికితే చేసేవాళ్లు చేస్తున్నా ఊళ్లలో ఉన్నవాళ్లు పాత వృత్తులే చేసుకుంటున్నారు. పరిస్థితులు తరిమివేయగా కడుపులు చేతుల్లో పట్టుకొని కొంత మంది, మరికొంత మంది బ్రతుకుదెరువు వెతుక్కుంటూ, కొంత మంది ఉద్యోగాలను వెతుక్కుంటూ ఊళ్లు వదిలి వలస పోతున్నారు. అందువల్ల ఊళ్లో కూలిపోతున్న గోడలు, పగిలిపోతున్న పెంకులతో శిథిలావస్థలో ఉన్న ఇళ్ళు కనిపిస్తున్నాయి. మరికొన్ని ఊళ్ళలో బ్రతుకుదెరువు కోసం యువకులు ఊరు వదిలి వెళ్ళిపోతే బిక్కు బిక్కుమంటూ ఇంటి వద్ద ఉన్న వృద్ధులు కనిపిస్తారు.

ఈ నవలలో గ్రామీణ రైతు జీవన విధానాన్ని ఎంతో చక్కగా తన అనుభవంతోపాటు, తాను చూసిన సమాజంలోని సంఘటనల ద్వారా కళ్ళకు కట్టినట్లు కాలువ మల్లయ్య చిత్రించారు. రైతుకు భూమి మీద ఉన్న మమకారం గొప్పది. భూమిని కన్నతల్లిగా భావించే తత్త్వం రైతుది. అందుకే అతను భూమిపుత్రుడయ్యాడు.

### 3.2.1.2. వస్తు విశ్లేషణ:

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం జరిగినప్పుడు గ్రామాలను వదిలిపెట్టి వెళ్లిన దొరలు, భూస్వాములు ఆ తరువాతి కాలంలో మళ్లీ కాంగ్రెస్ కండువాలు ధరించి తిరిగి గ్రామాల్లోకి వచ్చారు. కమ్యూనిస్టులు పంచిపెట్టిన భూముల్ని తిరిగి స్వాధీనం చేసుకున్నారు. 1952 సంవత్సరంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ భూసంస్కరణల చట్టం తీసుకువచ్చినప్పటికీ, జమీందారీ, జాగీర్దారీ విధానాలు రద్దు అయినప్పటికీ సారాంశంలో భూస్వామ్యం మాత్రం అలాగే నిలిచింది. అందువల్లనే మళ్లీ ఉత్తర తెలంగాణలో కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాలలో విప్లవోద్యమం పురుడు పోసుకుంది. “ఈ రెండు జిల్లాలలో అటవీ సంపద ముఖ్యమైన సంపద. ఆ తరువాత సింగరేణి బొగ్గు గనులు చెప్పుకోదగిన పరిశ్రమ. దీనితోపాటు సిమెంటు, ఎరువులు, కాగితం,

బట్టలు మొదలైన పరిశ్రమలు కూడా ఉన్నాయి. అయినప్పటికీ ఈ రెండు జిల్లాలలో వ్యవసాయమే ప్రధానమైన జీవనాధారం. గ్రామీణ ప్రాంతంలో నివసించేవారిలో అత్యధికులు ఈ వ్యవసాయం మీదనే ఆధారపడి జీవిస్తారు. నీటి పారుదల సౌకర్యాలు కూడా చాలా తక్కువ. వ్యవసాయం మీద ఆధారపడిన జనాభాలో దాదాపు డెబ్బై శాతం జనాభా భూమిలేని నిరుపేద కూలీ జనమే. చాలా కొద్దిమంది భూస్వాముల ఆధీనంలోనే వందల, వేల ఎకరాల భూమి కేంద్రీకృతమై ఉంది. భూమి బాగా కేంద్రీకరింపబడి ఉండటం వలన ఆధునిక వ్యవసాయ పద్ధతులు, పరిశ్రమలు అంతగా రాకపోవడం వలన ఈ జిల్లాలలో కరుడుగట్టి భూస్వామ్య వ్యవస్థ స్పష్టంగా కనిపిస్తుంది. భూస్వాములతోపాటు ఫారెస్ట్ అధికారులు, వడ్డీ వ్యాపారస్తులు ప్రజల మీద దోపిడీ దౌర్జన్యాలను జరుపుతుంటారు" (గంగాధర్, ఎం.1994:పుట.293). ఈ పరిస్థితుల గర్భంలోంచే విప్లవోద్యమం ఆవిర్భవించినట్లు చరిత్ర ద్వారా తెలుస్తుంది. ప్రజా ఉద్యమాల సందర్భాల్లో ప్రభుత్వాల వైఖరి ఎల్లప్పుడు ఉన్నట్లుగానే ఉత్తర తెలంగాణలోనూ కనిపిస్తుంది. ఆనాటి తెలంగాణ గ్రామాల్లో ఉన్న వడ్డీ వ్యాపారులు, దళారీలు, వారి మధ్య ఇక్కట్లపాలైన సాధారణ రైతులు, మరొకవైపు సింగరేణి గనుల్లో కష్టతరమైన కార్మికుల జీవితాలు, ఇంకొకవైపు విస్తరిస్తున్న విప్లవోద్యమం. దాంతోపాటే దానికి సమాంతరంగా ప్రభుత్వ నిర్బంధం పెరుగుతూ వచ్చాయి. ఒకవైపు విప్లవకారులు, మరొకవైపు ప్రభుత్వ పోలీసుల మధ్య ప్రజల జీవితంలో ఒక ఘర్షణాత్మక వాతావరణం నెలకొన్నది. ఈ పరిస్థితులన్నీ ఈ నవలలో సజీవంగా చిత్రించబడ్డాయి.

### 3.2.1.3. రైతు జీవిత చిత్రణ:

తాను పుట్టి, పెరిగి మట్టిలో కలిసిపోయేవరకు రైతుకు భూమే జీవనాధారం. రైతు కుటుంబాల్లో ఏరోజు తీరిక ఉండదు. పండుగ దినాల్లో కూడా ఎంతో కొంత పనిచేస్తారు. దేశ కాలమాన పరిస్థితులను బట్టి ఒక్కో రైతుకు ఒక్కో రకమైన సమస్యల చట్రం ఉంటుంది. తెలంగాణ రైతుకు భూస్వామ్య సమస్య ఉన్నది. వివిధ రూపాలలో దాని ఆధిపత్యం అమలులో ఉన్నది. ఓసారి అతివృష్టి, మరోసారి అనావృష్టి, కరువు సమస్య, వర్షాలు బాగా కురిసినా పంటలు సరిగ్గా పండకపోవడం, పంట పండిన సంవత్సరం ధరలు లేకపోవడం, ఎన్నోసార్లు పండిన పంట పెట్టుబడులకే సరిపోవడం, అప్పుల బాధ, పెరుగుతున్న వడ్డీలు ఇలా ఎన్నో కారణాల వల్ల సమస్యల వలయంలో చిక్కుకుంటాడు రైతు. ఇన్ని సమస్యల వలయంలో విలవిలాడినవాడు నవలలోని ప్రధాన పాత్ర అయిన రైతు కొండ మల్లయ్య.

తాను ప్రాణాధికంగా ప్రేమించే భూమిని ఏ రైతూ అమ్మడానికి సిద్ధంగా ఉండదు. మట్టిని ప్రేమించే రైతు ఆ మట్టి పరుల సొత్తు కావడం సహించడు. గ్రామాల్లో భూములుండి పనిచేయక, పనిచేయించుకుని బ్రతికే దొరలలాంటి వాళ్లు తమ విలాసాల కొరకు భూమిని అమ్మడానికి ఏమాత్రం సంకోచించరు. అందుకు కారణం భూమి వాళ్ళదే అయినా అందులో పనిచేసేది వాళ్ళు కాదు కాబట్టి. ఒకప్పుడు నలభై యాభై ఎకరాలున్న వాళ్ళు వాటిని దున్నించుకునే సామర్థ్యం లేక కొంత, విలాస జీవితానికి అలవాటుపడి కొంత, మారిన పరిస్థితుల దృష్ట్యా మరికొంత, తమ భూములను అమ్ముకుంటూ కూర్చొని తిన్నవాళ్లు ఉన్నారు. కాని తనలా కుటుంబ సభ్యులంతా భూమిలోనే పనిచేస్తూ బ్రతికే రైతుల సంగతి అలా కాదు. రైతుకు భూమి అంటే ప్రాణం. రోజులో ఎక్కువ భాగం భూమిలోనే గడుపుతాడు. నేలతో అతనికి విడదీయరాని సంబంధం ఉంది. అందుకే భూమి పోవడం తన శరీరంలోని భాగం పోవడంగానే, తన పరువు పోవడంగానే భావిస్తున్నాడు. తాను పండించిన పంట వడ్డీలకు కూడా సరిపోకున్నా ఏ భూమినైతే తాకట్టు పెట్టి అప్పు తీసుకున్నాడో ఆ భూమి అప్పు కిందికి పోయే స్థితికి వచ్చిన రైతు భూమిని అమ్ముకోవడానికి సంకోచిస్తాడు. అయినా ధరల సుడి గుండం, ప్రకృతి వైపరీత్యాలు, రాజకీయ, సాంఘిక పరిస్థితులు, మరెన్నో విషయాలు భూమిపుత్రుడి భూమిని అతనికి కాకుండా చేస్తున్నాయి. రెక్కలు ముక్కలు చేసుకొని భూమి సేవలోనే అంకితమైన రైతుకు ఆ భూమే లేకుండా చేస్తున్నాయి.

నవలలో ఒకచోట కొండ మల్లయ్య కొడుకులు భూమిని అమ్మడం తప్పనిసరి అని మొరాయించి కూర్చున్నప్పుడు అతనిలా అంటాడు. “భూమినమ్ముకుంటే తల్లినమ్ముకున్నట్టురా... కన్న తల్లి నమ్ముకున్నట్టురా... తల్లి నమ్ముకుంటార్రా... మీరేం మనుషుల్రా? కనుగుడ్ల నిండా నీళ్లతో ఆఖరి అస్త్రం ప్రయోగించాడు” (మల్లయ్య,కాలువ.2001:పుట.43). భూమిని కన్నతల్లితో పోల్చడం అనేది అలంకారప్రాయం కాదు. మానవ సమాజంలో మరీ ముఖ్యంగా మట్టిమనుషుల జీవితాల్లో, భూమిపుత్రుల జీవన సమరంలో భూమి విలువను తెలుపుతుంది. అయితే రైతు కేవలం భూమి మీద మాత్రమే ఆధారపడే జీవి. అందుకే అది చెయ్యి అందివ్వనినాడు తల్లడిల్లిపోవడం కనిపిస్తుంది. తమ చుట్టూ ఉండే అసమాన మానవ సమాజం రైతు జీవితాన్ని దోపిడీకి గురిచెయ్యడం ఒక ఎత్తైతే ప్రకృతి వైపరీత్యాలు మరొక ఎత్తు.

సమయానికి వర్షాలు లేక కొన్నిసార్లు పంట నష్టపోతే, అతివృష్టి వల్ల మరెన్నోసార్లు నష్టమవుతుంది. ఒక్కోసారి సముద్రంలో వర్షంలా, ఆకలి లేనివాడికి అన్నం పెట్టినట్లుగా అనవసర సమయాల్లో సమృద్ధిగా వర్షాలు కురుస్తాయి. వాటివల్ల ప్రయోజనం లేకపోగా ఎన్నో నష్టాలు, వేసిన

నాట్లు నాటుకోక ముందే పెద్ద వర్షాలు పడటంవల్ల నారు నీళ్లపై తేలి కొట్టుకుపోతుంది. చెరువులు, కుంటలకు గండ్లు పడి భూముల్లో ఎన్నోసార్లు ఇసుక మేటలు పడతాయి. పెసర చేలు ఏరివేత కొచ్చిన సమయంలో కుండపోత వర్షాలు కురవడం వల్ల పెసర్లు చేల్లోనే మురిగిపోతాయి. వరి పొలాల కోతల సమయంలో వర్షాలు పడి పంటంతా పాడవుతుంది. ఇలా ఎన్నోసార్లు అనావృష్టివల్ల, ఇంకొన్నిసార్లు అతివృష్టివల్ల, మరి కొన్నిసార్లు గాలి దుమారం లాంటి ప్రకృతి వైపరీత్యాల వల్ల రైతులు నష్టపోతుంటారు.

"సమయానికి వర్షాలుపడి అన్ని సానుకూలమైతే పెట్టుబడికి రైతుల దగ్గర డబ్బుండదు. ఎరువులు, క్రిమి సంహారక మందులు కొనడానికి, కలుపు నాట్లకు చేతిలో చిల్లిగవ్వైనా ఉండదు. ఇక షావుకారి చెప్పిన రేటుకు అప్పు తెచ్చుకోక తప్పదు. చీడపీడల బారి నుండి పంటను రక్షించుకోవడం మరో తపస్సులాంటిది. పంట చేతికి వచ్చే సమయానికి ధర ఉండదు. ఓ సంవత్సరం ఓ దినుసుకు ధర ఉంటుంది. దానికి ధర ఉంటుందని పండిస్తే చేతికొచ్చే సమయానికి దాని ధర అట్టడుగుకు పడిపోతుంది. ఇలా ధరల గడబిడలు రైతుకు అర్థమవ్వవు. అప్పు ఇచ్చిన షావుకారి కల్లం మీదనే పంటలను కొలుచుకుపోతాడు. వ్యవసాయ మార్కెట్ కెళ్లి అమ్ముకొచ్చినా పెద్దగా లాభం ఉండదు" (మల్లయ్య, కాలువ.2001:పుట.54) అని వర్షాధారంతో పంటలు పండించే తెలంగాణ రైతుల జీవితాన్ని కళ్లకు కట్టినట్లు చూపించారు. భారతదేశం వంటి వ్యవసాయక దేశంలో రైతు జాతి జీవితానికే వెన్నెముకలాంటివాడు. రైతు జీవితంలో వచ్చే ఒడిదుడుకులను ప్రభుత్వాలే పరిష్కరించాల్సి ఉంటుంది. కానీ నిజానికి అలా జరగడం లేదు. షావుకార్లు, వడ్డీ వ్యాపారులు, దళారీల వ్యవస్థను నిర్మూలించే కార్యక్రమాల్ని చేపట్టడం లేదు. దాంతో ఎంతో కొంత పంట పండిననాడు కూడా రైతుకు ఊపిరి పీల్చుకునే అవకాశం లేకుండా పోయింది. వ్యవసాయ మార్కెట్లో దళారీలు ఉంటారు. వారి అందినంతామేర దోచుకునే ప్రయత్నం చేస్తారు. దానితో రైతుకు ఏమాత్రం మిగులు ఉండదు. ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లు మళ్లీ రైతు నిరాశలో కూరుకుపోయి, భవిష్యత్తు మీద మిగిలిన కొద్ది ఆశతో మళ్లీ భూమివైపే పయనిస్తాడు.

### 3.2.1.4. బొగ్గు గని కార్మికుల సమస్యలు:

భూమి పుత్రుడు నవలలో సింగరేణి సమస్యల్ని సజీవంగా చిత్రించడం కనిపిస్తుంది. నిజానికి చాలామంది ప్రజలకు బొగ్గు గనుల్లో కష్టతరమైన ఉద్యోగాలు చేయడం, తమ ప్రాణాల మీదకే తెచ్చుకోవడం ఇష్టం ఉండదు. కానీ గ్రామాల్లో బ్రతకలేని, మరెక్కడకీ బతుకుదెరువు కోసం వెళ్లలేని

ఒక అనివార్యమైన స్థితిలో సింగరేణి బొగ్గు గనుల్లోకి పనికి వెళ్లారు. అక్కడ వారికి ఉండే కష్టాలను రచయిత చక్కగా వర్ణించారు.

కొండ మల్లయ్య కొడుకైన రాజయ్య బొగ్గు గనుల్లో ఉండే పని గురించి ఇలా తెలియజేశాడు "మైళ్ల తరబడి భూగర్భంలోకి నడవడం, లోపల జారుడు, నీళ్ల తడి, ఉక్కపోత, బొక్క టోపీలు తలలపై పెట్టుకొని లోపలికెళ్ళడం, లోపల రాత్రి పగలుకు తేడాయే తెలియకపోవడం... చీకటి, విపరీతమైన వేడి, బొగ్గు తేమలోనే అప్పుడప్పుడు కొంత విశ్రాంతి తీసుకోవడం, లాడీసుల కొరకు ఎదురుచూడటం, కొంచెం చప్పుడైతే ఉలిక్కిపడడం, ప్రతి క్షణం గండంగా భావించడం, బయటకొస్తే పునర్జన్మగానే భావించడం, ఎంత పనిచేసినా పై అధికారులతో మాటలు, బొగ్గుతో స్నానమాడి నల్లని ఆకారాలతో, చెమట కంపుతో బయటకు రావడం, ముక్కుల్లో, నోట్లో, శరీరమంతా బొగ్గు పొడి, బయటకు వచ్చిన తరువాత ఇంటి కెళ్లడానికి కాళ్లీడ్చుకుంటూ మైళ్ల దూరం నడవడమో, సైకిల్ తొక్కడమో చేయడం" అంటూ చెప్పిన సందర్భం ఆధారంగా (మల్లయ్య, కాలువ.2001:పుట.82) బయట ప్రపంచానికి బొగ్గు గని ఉత్పత్తులు మాత్రమే తెలుస్తాయి. కానీ భూగర్భంలోంచి బొగ్గును బయటికి తీయడంలో ఎంత మంది ప్రజలు తమ శ్రమను ధారపోస్తారో తెలియవు. బొగ్గుబాయి పనుల్లో ప్రతి అడుగు మరణ సదృశ్యమే అనే విషయం మనకు తెలుస్తుంది. బొగ్గు ఉత్పత్తి చేసే కార్మికులకు సరైన జీతాలు, మౌలిక వసతుల కల్పనలు గురించి 'సింగరేణి కార్మిక సమాఖ్య' పనిచేస్తున్నట్లు తెలుస్తుంది. ఆ సంఘం ద్వారా వారు తమ హక్కులను సాధించుకుంటున్నారు.

### 3.2.1.5. బ్యాంక్ అధికారుల దౌర్జన్యాలు:

కొండ మల్లయ్య లాంటి రైతులు తప్పనిసరి పరిస్థితుల్లో ప్రభుత్వం బ్యాంకు ద్వారా రైతులకు అప్పులు ఇస్తుందని భూమిని తనఖా పెట్టి ఆ అప్పులను తీసుకున్నారు. కొండ మల్లయ్య అప్పును పొందిన విధానాన్నే తెలుసుకుందాం "ఓసారి భూమిని తనఖా పెట్టి ఎల్.ఎం.బి. నుండి ఐదు వేల రూపాయాల అప్పు కోసం దరఖాస్తు పెట్టుకున్నాడు తాను. దరఖాస్తు ఫారం నింపింది మొదలుకొని అప్పుడున్న పట్వారీకి, గిరదావరికి, పైరవీకారికి, బ్యాంకు క్లర్కుకు, సూపరింటెండుకు, బ్యాంకు మెనేజరుకు వీళ్లందరికీ ముడుపుల రూపంలో పదిహేను వందల వరకు ఖర్చయింది. అంతే కాకుండా పైరవీకారి వెంట రమ్మన్న ప్రతిసారీ తాను, తనలాంటి రైతులు ఎన్నోసార్లు పని మానుకొనిపోయారు. బస్సు కిరాయిలకు, హోటల్ ఖర్చులకు, సిగరెట్, కిల్లీలకు, తాగడానికి ఖర్చులన్నీ తామే భరించారు. డబ్బు వచ్చిన తర్వాత మరుసటి సంవత్సరం నుండి ఏడాదికి ఎనిమిది

వందల చొప్పున పదేండ్లు చెల్లించాడు తాను. ఇక ప్రభుత్వ అప్పుల్లో వడ్డీ తక్కువ ఎక్కడుందో తనకర్థమయ్యేది కాదు" (మల్లయ్య, కాలువ.2001:పుట.89, 90).

బ్యాంక్ అధికారులు రైతులకు నోటీసులు పంపి అపరాధ రుసుముతో సహా బాకీ డబ్బు కట్టించుకునేవారు. డబ్బు చెల్లించకుంటే జీపు తీసుకొని స్వయంగా వెళ్ళి ఉన్న పళంగా బాకీ చెల్లించాలని ఒత్తిడి చేసేవారు. ప్రాణం మీద నిల్చుండి బాకీలు వసూలు చేసుకునిపోయేవారు. ఇంటికి వచ్చిన అధికార్లు బత్తా కిందకి డబ్బులు, జీపు ఖర్చులు, అపరాధ వడ్డీతో సహా వసూలు చేసేవారు. రైతుకు ఆ సంవత్సరం పంట పండకపోయిన, చీడపీడలు తగిలి పంట పాడైనా, అతివృష్టి, అనావృష్టిలాంటి ప్రకృతి వైపరీత్యాల వల్ల రైతు నష్టపోయినా బ్యాంకు అధికారులు పట్టించుకునేవారు కాదు. రైతు బాకీ చెల్లించలేని పరిస్థితులున్నా వినేవారు కాదు. బ్యాంకు అధికారుల దౌర్జన్యం వల్ల సగటు రైతు విలవిలలాడేవాడు.

### 3.2.1.6. ముగింపు:

భూమి పుత్రుడు నవలలో బొగ్గుగని కార్మికుల సమస్యలు, భూస్వామ్యం, వడ్డీ వ్యాపారులు, షావుకార్ల దాష్టీకాలు, కరువు కాటకాలు అన్నింటి గురించి విశేషంగా చర్చించడం కనిపిస్తుంది. వీటన్నిటి మూలంగా సగటు ఉత్తర తెలంగాణ రైతు జీవితం ఎలా ఉంటుందో ఈ నవల ద్వారా మనకు తెలుస్తుంది. దేశానికి వెన్నెముక అయిన రైతును వస్తువుగా తీసుకొని చిత్రించిన ఈ నవల ఇరవయ్యవ శతాబ్దపు చివరి దశాబ్దాల తెలంగాణ రైతు జీవితానికి మచ్చు తునుక అని చెప్పవచ్చు. "తెలంగాణ రైతాంగ జీవితంలోని కష్టాలు, కడగండ్లను సమగ్రంగా చిత్రించిన నవల భూమిపుత్రుడు. 1980 దశకంలో తెలంగాణ రైతు జీవనంలోని సంక్షోభానికి ఈ నవల అద్దం పడుతుంది" (ఐలయ్య, బన్న.2006:పుట.109) అని బన్న ఐలయ్యగారు తెలిపిన మాటలు "భూమిపుత్రుడు" నవల సారాంశాన్ని పూర్తిగా వివరిస్తాయి.

### 3.2.2. సాంబయ్య చదువు నవల:

కాలువ మల్లయ్య 'సాంబయ్య చదువు' నవల చతుర పత్రికలో1995 సంవత్సరం నవంబర్ సంచికలో ప్రచురింపబడింది. 2001 సంవత్సరంలో తెలుగు వచనం ప్రచురణలుగా వెలువడింది. కరీంనగర్ జిల్లాలోని ఒక గ్రామంలో సామాన్య రైతు కుటుంబంలో జన్మించిన సాంబయ్య చదువు, ఉద్యోగం, జీవితంలో స్థిరపడటం మొదలైన అంశాలు నేపథ్యంగా ఒక వెనుకబడిన మధ్యతరగతి వ్యక్తి జీవిత ప్రస్థానం ఈ నవలలోని కథాంశం. "చదువు నేపథ్యంగా 1940–1986 సంవత్సరం వరకు తెలంగాణ గ్రామీణ జీవనంలో నెలకొన్న సామాజిక పరిణామాలను ఈ నవల

ప్రతిఫలింపజేసింది. కాలువ మల్లయ్య స్వీయ జీవనం అంతఃస్సూత్రంగా ఈ నవల రూపుదిద్దుకుంది" (ఐలయ్య, బన్న.2006:పుట.109).

### 3.2.2.1. నవలా వస్తువు:

కరీంనగర్ జిల్లాలోని ఓ గ్రామంలో చిలుకయ్య, రాజమణిల కుటుంబం ఉంటుంది. ఆ కుటుంబంలో చాలా సంవత్సరాల తరువాత తమ వంశాన్ని నిలబెట్టే వంశోద్ధారకుడు సాంబయ్య పుట్టాడని అతన్ని ప్రాణంగా చూసుకుంటారు. సాంబయ్య పుట్టిన సంవత్సరంలో వర్షాలు బాగా పడి చిలుకయ్యకు మంచి పంటలు పండాయి. అంతకుముందు ఉన్న అప్పులు అన్ని తీరాయి. మొట్టమొదటి జనరల్ ఎలక్షన్స్ ప్రారంభమైన రోజున పుట్టిన సాంబయ్య గొప్పోడు అవుతాడని తన మిత్రులు, బంధువులు అంటుంటే ఎంతో సంతోషించేవాడు. చిలుకయ్య నిరక్షరాస్యుడు. చిలుకయ్య వ్యవసాయం, కూలీ పనులు చేసుకుంటూ బ్రతికేవాడు. ఆ ఊరిలో వెంగళరావు దొర ఉండేవాడు. ఆ ఊరికి కొత్తగా మంజూరు అయిన ఏకోపాధ్యాయ పాఠశాలకు ఉపాధ్యాయుడిగా వెంకటయ్య పంతులు వచ్చాడు. ఊరికి పాఠశాల భవనం లేకపోవడంవల్ల ఆ ఊరి దొర వెంగళరావు ఇంట్లోనే బడి నడుస్తుంది. చుట్టూ ప్రక్కల నాలుగైదు ఊర్లకు జమీందారుగా దొరగా పేరున్న వెంగళరావు అంటే అందరికీ భయమే. అతనికి ధనబలంతోపాటు అంగబలం ఉన్నాయి. అతనికి ఎదురుగా మాట్లాడటానికి అందరూ జంకుతారు. అలాంటి దొర కొడుకుకి చదువు చెప్పడం వెంకటయ్యకు సమస్యగా ఉంది. అలాంటి సమయంలో చిలుకయ్య తనకు అందని ద్రాక్షగా మిగిలిపోయిన చదువును తన కొడుకైన సాంబయ్యకు అందించాలనుకుంటాడు. గ్రామంలోని వెంగళరావు దొర అనుమతితో చదివించాలనుకుంటాడు. వెంగళరావును అడిగితే తన దొరతనంతో సాంబయ్యకు చదువు వద్దని తన వద్ద పాలేరుగా చేర్చమని వెనుకబడిన కులానికి చెందినవాడికి చదువు ఎందుకని చిలుకయ్యకు చెబుతాడు. అయినా కొడుకును ఎలాగైనా చదివించాలనే దృఢ సంకల్పంతో ఉన్న చిలుకయ్య కొడుకును ఊరి పాఠశాలలో చేర్పిస్తాడు.

చాలామంది వెనుకబడిన వర్గానికి చెందిన పిల్లలు పాఠశాలలో ఎదుర్కొన్న కుల అవమానాల్ని సాంబయ్య ఎదుర్కుంటాడు. అయినా మొక్కవోని ధైర్యంతో చదువును కొనసాగిస్తాడు. అంతేకాదు ఆ ఊరి అగ్రవర్ణాల పిల్లలను తనతో తిరగమని వారి తల్లిదండ్రులే స్వయంగా ప్రోత్సహించే స్థాయికి తాను ఎదుగుతాడు. చదువులో అంతటి ప్రతిభాపాటవాల్ని కనబరుస్తాడు. ఆ ఊరి సర్పంచ్ దొర పిల్లలతో సమానంగా తిరిగే స్థానాన్ని పొందుతాడు. కరువు కాలంలో వ్యవసాయ పనులు చేసుకుంటూ H.S.C. విద్యను పూర్తి చేస్తాడు. సాంబయ్య HSC పూర్తి చేసిన

తరువాత ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో రెండు మూడు సార్లు తోటి విద్యార్థులంతా కలిసి వరంగల్, కరీంనగర్ ర్యాలీలలో పాల్గొన్నాడు. ఈ ఉద్యమంలో పరోక్షంగా ప్రేరేపితుడవుతూ చైతన్యవంతుడవుతాడు. ఆ తరువాత కాలంలో తన కుటుంబ పరిస్థితుల వల్ల చదువుకు దూరం కాడు, ఉద్యమాల్లో భాగస్వామి కాడు. అనేక మంది ప్రోత్సాహంతో డిగ్రీస్థాయి విద్యను పూర్తి చేస్తాడు. కుటుంబంలో నానాటికీ పెరుగుతున్న ఆర్థిక ఇబ్బందులు, మరొకవైపు ఒత్తిడిలో సాంబయ్య నిరుద్యోగిగా ఉన్నప్పుడే తల్లిదండ్రుల ప్రోద్బలంతో పెళ్ళి చేసుకుంటాడు. ఆ తరువాత రెండు నెలలకే 'హాఫ్ ఎ మిలియన్ స్కీమ్' కింద టీచర్ ఉద్యోగం వస్తుంది. ఎన్నో కలలతో పై చదువులు చదివిన సాంబయ్యకు టీచర్ ఉద్యోగం రావడం సంతృప్తిగానే ఉంటుంది. తను అనుకున్న ఉద్యోగం వచ్చినందుకు సంతోషంగా అనిపిస్తుంది. కానీ బతకలేనివాడు బడిపంతులు అని చాలామంది హేళన చేస్తారు. మరోవైపు మంచి చదువు ఉంది కదా పెద్ద ఉద్యోగం తప్పక వస్తుందని ఆశపడి పెళ్లి చేసిన భార్య తరపువాళ్లు కూడా అదే భావనతో ఉంటారు. భార్య కూడా ఉపాధ్యాయ వృత్తి మాని, వేరే ఉద్యోగం చేయమని పోరు పెడుతుంది. దాంతో ఇంటిపోరు, బయటిపోరు తప్పని సాంబయ్యకు మరొక ఉద్యోగం చూసుకోవడం అనివార్యమవుతుంది. అదే సమయంలో కేంద్ర ప్రభుత్వ యాజమాన్యంతో గోదావరిఖనిలో మందుల ఫ్యాక్టరీ నిర్మాణమవుతుంది. అందులో అతనికి ఉద్యోగం వస్తుంది.

సాంబయ్య తనకు ఉన్నదాంట్లో బాగానే బ్రతకడం ప్రారంభిస్తాడు. తల్లిదండ్రుల్ని ఊర్లోంచి తన దగ్గరికి తెచ్చుకుని ఉంచుకోవాలని ప్రయత్నం చేస్తాడు. కాని వారు గ్రామాన్ని వదిలిరారు. మరోవైపు విప్లవోద్యమం బలపడి గ్రామాల్లోని దళితుల పరిస్థితుల్లో చాలా మార్పులు వస్తాయి. తలవంచి తిరిగినవాళ్లే ఆత్మగౌరవంతో తల ఎత్తి తిరగడం ప్రారంభిస్తారు. దీనికి వ్యతిరేకంగా ప్రభుత్వం ఉద్యమాల్ని అణచివేయాలని గ్రామాలపైన తీవ్ర నిర్బంధం ప్రయోగిస్తుంది. విప్లవకారులు, ప్రభుత్వ పోలీసుల మధ్య నిరంతరం దాడులు ఎక్కువవుతాయి. ఇలాంటి పరిస్థితులను సాంబయ్య తన జీవితంలో చూస్తుంటాడు. ఎన్నో సంఘటనలు అతన్ని ఉద్యమాలవైపు లాగాలని ప్రయత్నించినా తాను ఎన్నడూ తలొగ్గలేదు. ఉద్యమాలు మంచివా, చెడ్డవా అని ఆలోచిస్తుండేవాడు. తన ఊళ్లో ఒకనాడు అణచివేతలకు గురైన కుటుంబాల్లోని యువతరమే నేడు విప్లవోద్యమానికి నాయకత్వం వహిస్తున్న సన్నివేశాన్ని, వాటన్నిటికీ దూరంగా ఉన్న తననూ పోల్చుకునే ప్రయత్నం చేస్తాడు. పేద రైతు కుటుంబం నుండి దిగువ మధ్యతరగతికి ఎదిగిన సాంబయ్య మట్టితో పెనవేసుకున్న సంబంధాన్ని విడిచిపెట్టలేని తన తల్లిదండ్రులను ఊళ్ళోకే వెళ్లి చూసోస్తుంటాడు.

మారిన సామాజిక స్థితిగతుల మధ్య, లోకం నిర్ణయించిన విలువల చట్రంలో తన కుటుంబాన్ని వెళ్లదీస్తుంటాడు. ఇది స్థూలంగా 'సాంబయ్య చదువు' నవలలోని కథాసారాంశం.

### 3.2.2.2. వస్తు విశ్లేషణ:

సామాన్య రైతు కుటుంబంలో పుట్టిన సాంబయ్య చదువు, ఉద్యోగ జీవితంతోపాటు స్థిరపడటం మొదలైన అంశాల సమాహారమే 'సాంబయ్య చదువు' నవల. జీవన సాగరంలోని ఆటుపోట్లకు సజీవ రూపకల్పన ఈ 'సాంబయ్య చదువు' నవల. పల్లెల్లో పుట్టి పెరిగి ఉద్యోగ రీత్యా పట్నాల్లో స్థిరపడిన వారి పిల్లలు పల్లె అందాల్ని, స్వచ్ఛతని కోల్పోవడం, జీవనాధారమైన నాగలి, మోట తెలియకపోవడం లాంటి సంఘటనలు మన మూలాలను మనం ఏవిధంగా కోల్పోతున్నామో దీనిలో చిత్రితమైంది.

హరిజనులకు చదువు అవసరం లేదనడం, ఒకవేళ బడికొస్తే వారిని మిగతా పిల్లలతో కలువనీయకుండా వేరుగా కూర్చోబెట్టడం, అగ్ర కులాల వారికే విద్య, అధికారం ఉండాలనడం అగ్ర వర్ణాల వారి వేర్పాటువాదాన్ని, అహంకారాన్ని తెలియజేస్తుంది. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన ప్రజలకు రాలేదనే ఆవేదన ఈ నవలలో గమనించవచ్చు. తన కొడుకుని చదివించాలి. తనకు లేని చదువు తన కొడుకుకు కావాలి. తాను పడిన అవమానాలకు దూరంగా ఉంచాలి. పలక బలపం పట్టుకొని తన కొడుకు బడికి పోతుంటే చూడాలి. ఏ పాఠమైనా గడగడ చదివేస్తుంటే విని ఆనందించాలి అని మధ్యతరగతి జీవనం గడిపే తండ్రి కల నెరవేరింది అని చెప్పవచ్చు. విద్యార్థులను తీర్చిదిద్దడంలో, వారిని భావిపౌరులుగా మలచడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతైనా ఉంటుంది. ఒక ఉపాధ్యాయుడు చెడ్డవాడైతే ఒక తరం చెడిపోతుంది. అందుకే ఉపాధ్యాయుడి పాత్ర గురుతరమైంది. అంటే సమాజంలో ఉపాధ్యాయుని స్థానాన్ని తెలియజేసే అమూల్య వాక్యాలను పరిశీలిస్తే రచయితకు అధ్యాపకుల పట్ల గల గౌరవ భావం స్పష్టమవుతుంది. సమాజంలోని అంతరాలు, దోపిడీ, పీడన లాంటి విషయాలను తెలియజేస్తూ ప్రత్యేక తెలంగాణ ఉద్యమం ఆ ప్రభావంతో ప్రజల్లో కలిగిన రాజకీయ చైతన్యాలను గురించి తెలియజేస్తుంది ఈ నవల.

### 3.2.2.3. గ్రామీణ జీవితంలో మొట్టమొదటి జనరల్ ఎన్నికలు:

కరీంనగర్ జిల్లాలోని ఓ గ్రామంలో 1952 సంవత్సరంలో మొట్టమొదటి జనరల్ ఎన్నికలు జరిగాయి. ఆ రోజునే సాంబయ్య పుట్టాడు. చిలుకయ్య ఎన్నికల రోజున కొడుకు పుట్టడంతో ఎంతో ఆనందపడ్డాడు. ఆ ఊరిలోని జనమంతా ఎంతో ఉత్సాహంగా ఉన్నారు. అంతవరకు ఓటు అంటే ఏమిటో తెలియని జనం ఓటు హక్కును వినియోగించుకోబోతున్నారు. రజాకార్ల కాలంలా తమకు

కష్టాలు ఉండవు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన కొంత కాలం వరకు తమ ప్రాంతానికి స్వాతంత్ర్యం రాలేదు. ఆ తరువాత నిజాం పాలన పోయింది. ఇప్పుడు ప్రథమంగా దేశాధినేతను ఎన్నుకోబోతున్నందుకు సంతోషపడుతున్నారు. ఎన్నికలైతే మునుపట్లా తమపై దొరల జులుం, వేధింపులు ఉండవని వాళ్ళు సంతోషపడుతున్నారు. కొందరు అత్యవసర వ్యవసాయ పనులు ముగించుకొని ఓటేసి రావాలని పొలం పనులకు వెళ్ళారు. మొదటిసారిగా ఓట్ల పండుగను జరుపుకోబోతున్న వాళ్లకు ఎంతో ఆనందంగా ఉంది. కాంగ్రెస్, కమ్యూనిస్టు పార్టీల వాళ్లు ప్రజలకు ఎలా ఓటు వేయాలో వివరించి చెబుతున్నారు. తమకే ఓటు వేయాలని ఫలానా చోటే ఓటు వేయాలని ఇరుపక్షాల వాళ్లు చెబుతున్నారు. ఇద్దరూ చెప్పింది విని ప్రజలు తమకు నచ్చిన గుర్తుపై ఓటు వేశారు. అలాగే నిరక్షరాస్యుడైన చిలుకయ్య కూడా గుర్తులే తప్ప వ్యక్తుల పేర్లు చదువలేడు కాబట్టి ఒక గుర్తుపై ఓటు వేసి బ్యాలెట్ పేపర్ మడిచి బాక్సులో వేసి వచ్చాడు. మొదటిసారి ఎన్నికలు జరిగిన తీరు రచయిత ఎంతో చక్కగా వివరించాడు. ఎన్నికలలో ప్రజలు ఎవరికి ఓటు ఎలా వేయాలి అన్న వారి ఆలోచనలను తెలియజేశాడు. గ్రామీణ జీవితంలో ఓట్ల పండుగ సమయంలో జరిగే పరిణామాలను, సన్నివేశాలను, వైరుధ్యాలను చక్కగా అర్థం చేసుకోవచ్చు.

### 3.2.2.4. గ్రామీణ జీవితంలో కులవివక్ష:

సాంబయ్య చదువు నవలలో కుల అణచివేత కూడా ఉంది. "ఛీ నీయవ్వ! మాదిగిండ్లకెల్లచ్చిన కాళ్ళకు చెప్పులెవ్వని ఎన్నిసార్లు చెప్పిన తేకపాయె లింగడు. బట్ట పీలికలు బజార్లనే పారేసిరి. కాలుకు తగిలింది. పెయ్యి కడుక్కోవాలె" అని చిలుకయ్య తండ్రి లచ్చువయ్య అన్నాడు (మల్లయ్య, కాలువ.2001:పుట.138). ఈ మాటలు ఆనాడు కులవ్యవస్థ ఎంత బలంగా ఉన్నదో తెలియజేస్తుంది. నిజానికి కులవ్యవస్థ పుట్టుక అగ్రకులాల చేత సృష్టించబడి, ఆ తరువాత అదొక భావజాలంగా మారి అన్ని కులాలకు వ్యాపించింది. ఒక్క వెనుకబడిన కులానికి చెందిన లచ్చువయ్యకి కులం అనేది ఒక భావజాలంగా సమాజం నూరిపోసింది. సమాజంలో ఆ భావన నిలిచి ఉండడానికి భూస్వామ్యం తోడుగా నిలిచింది. తెలంగాణలో నాడు దొరలంతా అగ్ర కులాలకు చెందినవారే కనిపించడం ఈ విషయాన్ని ధృవీకరిస్తుంది. ఈ నవలలో మరోచోట క్షవరం చేసే దగ్గర కూడా కులాన్ని ఎలా పాటిస్తారో వివరించబడింది. "ఏం జేసుడే చిలుకన్న... అందరికి సేసినట్టు కాదు గద... ఈల్లకు సవురం జేయన్నంటె ధోతిడిసి గొంగడి కట్టుకోవన్నాయె... ఇగో భాగోతిమిగ? కస్పూరు సంగతులు గీ పల్లెలల్ల నడువయి.... పోచాలు హోటల్ల గాలాసలు వేరే పడుతరు అని అంగీ విడిచేశాడు నర్సయ్య. గొంగళి కట్టుకుని ధోతి కూడా విడిచేశాడు. అక్కన్నుంచి

పీట తీశాడు. బజాట్లో కూచోపెట్టి లింగయ్యకు క్షవరం చేస్తున్నాడు నర్సయ్య. హరిజనులకు క్షవరం చేసేటప్పుడు గొంగళి కట్టుకుని చేయడం చాలా కాలంగా ఉంది. ఉన్నికి ముట్టుండదని, నూలువైతే మైల పడతాయని వాళ్ల నమ్మకం" (మల్లయ్య, కాలువ.2001:పుట.145). ఈ మాటలు కూడా తెలంగాణలో ఉన్న కులవ్యవస్థ రూపాన్ని బట్టబయలు చేస్తాయి. నిజానికి ఇక్కడ కూడా వెనుకబడిన మంగళి కులస్థులు కూడా దళితుల పట్ల ఎటువంటి కుల వివక్షను కలిగి ఉన్నారో తెలుస్తుంది.

నిరక్షరాస్యులైన ప్రజలు కులాన్ని పాటించడం ఏదో ఒక స్థాయిలో అర్థం చేసుకోవచ్చు. వారి చైతన్య స్థాయిని బట్టి అది సహజమని కూడా అనుకోవచ్చు. కాని చదువుకున్న, చదువు చెప్పే అగ్రవర్ణ ఉపాధ్యాయులకు కూడా ఎంతటి అగ్ర కులాధిపత్యం ఉండేదో కూడా ఈ నవలలో చిత్రించాడు. "శర్మగారు హిందీ పండిట్... అతడు కులాలు మతాలు తారతమ్య భేదాలు అన్ని దైవనిర్మితాలని, మనకు జన్మలు పూర్వజన్మల కర్మలను బట్టి వస్తాయని చెప్పేవాడు. అతడు బాల్య వివాహాలను కూడా సమర్థించేవాడు. ఒకరికొకరు పొంతన లేకండా చెబుతుంటే సాంబయ్యలో రకరకాల సంఘర్షణలు కలిగేవి. అంటరానితనం ఉండకూడదని గాంధీ తప్పు చేశాడని శర్మ చెప్పేవాడు. ఓరోజు పాఠం చెబుతూ మధ్యలో ఇలా చెప్పసాగాడు శర్మ. బ్రాహ్మణులు బ్రహ్మ ముఖంలోంచి పుట్టారు, భుజాల్లోంచి క్షత్రియులు పుట్టారు, వైశ్యులు ఉదరంలోంచి పుట్టారు, పాదాల్లోంచి శూద్రులు పుట్టారు. వీటినే నాలుగు వర్ణాలుగా విభజించడం జరిగింది. ప్రస్తుత కాలంలో ఆ వర్ణాలను ఇలా చెప్పవచ్చు. బ్రాహ్మణులు బుద్ధిజీవులు... అంటే బుద్ధిని ఉపయోగించి బతికేవారు, క్షత్రియులు ఆయుధ జీవులు.... ఆయుధాలు ధరించి దేశ రక్షణ భారాన్ని పరిపాలన భారాన్ని మోసేవారు. వైశ్యులు వ్యాపార జీవులు... వ్యాపారాన్ని వృత్తిగా చేసుకొని బతికేవారు. శూద్రులు శ్రమజీవులు... పంటలు పండిస్తూ, ఇతర పనులు చేస్తూ బతికేవారు. కులాలన్నీ భగవంతునితో ఏర్పాటు చేయబడ్డవే" (మల్లయ్య, కాలువ.2001:పుట.165). ఈ మాటలు పాఠశాలలో కులం ఎటువంటి పాత్రను కలిగి ఉన్నాదో తెలియజేస్తుంది. పాఠశాలలో ఉపాధ్యాయులు సమాజ పురోగమనానికి బాటలు వేయాల్సినవారు ఎంతటి దుర్మార్గమైన రీతిలో అగ్రకుల ఆధిపత్యాన్ని బోధించేవారో ఈ నవల తెలియజేస్తుంది.

### 3.2.2.5. దొరల దౌర్జన్యాలు:

సాంబయ్యను చదివించాలని దొరయైన వెంగళరావు అనుమతి కోరగా అతన్ని పాఠశాలకు పంపవద్దు అని తన దగ్గర పాలేరుగా పనిచేయమని చిలుకయ్యకు చెప్పిన సందర్భంలో దొర మాటలు వారి దౌర్జన్యాన్ని తెలియజేస్తాయి. "నీకు చేతి నిండ పని లేకుంటె నాకు పాలేరుంచు,

మూడు గుంచాల మక్కలు జీతమిత్త, పసిపోరడే పనిజేత్తడని భయపడకు. ఎడ్లగాసుకొత్తె ఐపాయె. నువ్వు ఒంటినాగలెవుసంగానివి. ఎంత జేసినా గంతే. వాన్నా కొసెల్ల చదివియ్యలేవు. నడుమాపుతె ఎందుకు కొరగాకుంటైతడ. అందుకోసం నాకు గొడ్లకుంచు, మూడు గుంచాల మక్కలు నీకు వేన్నీళ్ళకు చన్నీల్లోల అక్కెరకత్తయి నా మాటిను" (మల్లయ్య, కాలువ.2001:పుట.143) అన్న మాటలు దొర యొక్క అహంకారాన్ని తెలియజేస్తాయి. సామాన్యులు తాము ఏదైనా పని చేయాలంటే దొర అనుమతితోనే చేసేవారు. దొర వద్దంటే ఎదురించితే వారికి కఠిన శిక్షలు ఉండేవి. పై మాటల సందర్భంలో చిలుకయ్య దొర చెప్పిన వినకుండా తన కొడుకుని చదివించి దొర, సర్పంచ్ కొడుకులైన అగ్ర వర్ణాల పిల్లలతో తిరిగే స్థాయికి ఎదుగుతాడు. మరొక సందర్భంలో బక్కమ్మ విషయంలో జరిగిన పంచాయతీ దొరల దౌర్జన్యాలకు మచ్చు తునక. ఆమె భర్త మరణించిన తర్వాత మేనబావ కొంరయ్యను ప్రేమిస్తుంది. శారీరకంగా ఒక్కటవుతారు. కానీ పెళ్లి చేసుకోరు. వారి ప్రేమ ఫలితంగా బక్కమ్మ గర్భవతి అవుతుంది. ఇద్దరు పెళ్లి కూడా చేసుకోవడానికి సిద్ధపడతారు. కానీ అనవసరంగా దొర వెంగళరావు పంచాయతీ పెట్టి మూడు వందల రూపాయలు జరిమానా, బక్కమ్మకు గ్రామ బహిష్కరణ శిక్షను వేస్తారు. ఆ సందర్భంలో కోపోద్రిక్తుడైన కొంరయ్య, దొర వెంగళరావుతో "అయితే మీ కొడుకు తెనుగు నర్సయ్య బిడ్డను పాడుజేసిండు. దానికేం దండుగ గడ్తరో జెప్పుంఁడి" (మల్లయ్య, కాలువ.2001:పుట. 140) అని అంటాడు. దానికి దొర కొంరయ్యను పంచెలతో వేప చెట్టుకు కట్టి గొడ్డును బాదినట్లు బాది, రాత్రి మొత్తం అలాగే కట్టి ఉంచండి అని ఆదేశించి వెళ్లిపోతాడు. సామాన్యులకు ఒక నీతి, దొరలకు ఒక నీతి ఇదేమిటి అని ప్రశ్నించిన కొంరయ్యకు దొర విధించిన శిక్ష అది. నిజానికి ఆనాటి దొరల ఆగడాలకు ఇది ఒక మచ్చుతునక అని చెప్పవచ్చు. గ్రామాలలో సర్వాధికారం గ్రామ పెద్దలైన దొరలదే. ప్రజలంతా వారు చెప్పిన తీర్పులకే కట్టుబడి ఉండేవారు. ఏదైనా సమస్య వచ్చినప్పుడు లంచం తీసుకొని లంచం ఇచ్చిన వారికి అనుకూలంగా తీర్పులు చెప్పేవారు.

### 3.2.2.6. తెలంగాణ ఉద్యమ చిత్రణ:

సాంబయ్య చదువు నవలలో తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కోసం 1969 సంవత్సరంలో చేసిన ఉద్యమాన్ని చిత్రించారు. "ఈ మధ్య 'జై తెలంగాణ' ఉద్యమం ప్రారంభమైంది. మొదట్లో పట్టణాలకే పరిమితమైన ఉద్యమం క్రమక్రమంగా గ్రామాల్లోకి వ్యాపించింది. పాఠశాలలు మూసివేయాలని అలజడులు ప్రారంభమయ్యాయి. ఇందుల్లో లాయర్లు, ఇంజనీర్లు, రాజకీయనాయకులు, డాక్టర్లు అందరూ పాల్గొన్నారు. పట్టణాల్లో విద్యార్థుల పాత్రే ప్రధానంగా ఉంది. విద్యార్థులను

రెచ్చగొడుతున్నారు నాయకులు" (మల్లయ్య, కాలువ.2001:పుట.187). ఈ మాటల ద్వారా ఆనాడు తెలంగాణ ఉద్యమ తీవ్రతను తెలుసుకోవచ్చు. దాని వ్యాప్తినీ అంచనా కట్టవచ్చు. తెలంగాణ ప్రాంతమంతటా ఉద్యమం ప్రారంభమైంది. బస్సులకు నిప్పు అంటించడం, రైళ్లను ఆపడం, వీధి దీపాలను పగలగొట్టడం లాంటివి జరిగాయి. వార్తా పత్రికల ద్వారా, రేడియో ద్వారా ఎక్కడ ఏమి జరుగుతుందో తెలుసుకునేవారు. విద్యార్థులెవరూ పాఠశాలలకు వెళ్లలేదు. ఛలో హైదరాబాద్, ఛలో నిజామాబాద్ , ఛలో వరంగల్ అంటూ గోడలపై రాతలు రాశారు. ప్రాణాలైన అర్పిద్దాం తెలంగాణను సాధిద్దాం. జై తెలంగాణ, జైజై తెలంగాణ అంటూ నినాదాలు చేశారు. ఉద్యమం పేరుతో నానా బీభత్సం సృష్టించారు. ఉస్మానియా యూనివర్శిటీ క్యాంపస్ లో పోలీసు కాల్పుల వల్ల నలుగురు విద్యార్థులు మృతి చెందడంతో ఆందోళన ఉధృతి కావడం జరిగింది. అయితే అందరితోపాటు సాంబయ్య కూడా 'జై తెలంగాణ ఉద్యమం'లో పాల్గొన్నాడు. కొన్ని విషయాల గూర్చి తెలుసుకున్న సాంబయ్యకు ప్రత్యేక తెలంగాణ అవసరమే అని అనుకున్నాడు. ఈ విధంగా ఈ నవలలో ప్రత్యేక తెలంగాణ ఉద్యమం గురించి దాని ఆవశ్యకతను గురించి తెలుసుకోవచ్చు.

### 3.2.2.7. విద్యార్థి యూనియన్ ఎన్నికలు:

సాంబయ్య బి.యస్సీ. చదువుతున్న సమయంలో విద్యార్థి యూనియన్ ఎన్నికలు జరిగాయి. విద్యార్థి యూనియన్ ఎన్నికలతో కాలేజీలో పెద్ద హడావుడి జరిగింది. కులాలవారిగా, ప్రాంతాలవారిగా, రాజకీయాలవారిగా విద్యార్థులు ప్రచారం చేసేవారు. గుంపులు గుంపులుగా తిరుగుతూ తమకు ఓటు వేయాలని విద్యార్థులను అడిగేవారు. మాది సిక్ వాడి గ్రూపు, మాది కార్ఖానాగడ్డ గ్రూపు, మాది జ్యోతినగర్ గ్రూపు అంటూ ప్రచారం చేసేవారు. తమకు ఓటు వేస్తే అధికార పార్టీ ఎమ్మెల్యేతో అన్ని పనులు చేయిస్తామని మరికొందరు ప్రచారం చేసేవారు. కొందరు తెలంగాణ నినాదంతో పోటీ చేశారు. విద్యార్థులు కిరాయికి ఉండే గదుల్లోకి వచ్చి ఓటేయ్యమని అడిగేవారు. ప్రతి తరగతి గదికొచ్చి ప్రచారం చేసేవారు. ఇలా కొన్ని గ్రూపుల మధ్య పోటీ జరిగి డిగ్రీ కాలేజీ ఎన్నికలు ముగిశాయి. విద్యార్థి యూనియన్ ఎన్నికలలో చోటుచేసుకున్న రాజకీయ సంఘటనలు కూడా మనం తెలుసుకోవచ్చు. సాంబయ్య చదువులో భాగంగా విద్యార్థుల ఎన్నికల హడావుడి ఎలా ఉంటుందో అలాగే అందులో రాజకీయ పార్టీల ప్రమేయం కూడా ఉంటుందని దాని ద్వారా విద్యార్థి గ్రూపు రాజకీయాలు చోటుచేసుకున్నాయి అని మనం ఈ నవల ద్వారా తెలుసుకోవచ్చు.

### 3.2.2.8. ముగింపు:

ఒకవైపు కటిక పేదరికం, మరోవైపు విద్య మీద ప్రేమ, మరోవైపు అశాస్త్రీయ విద్యావిధానం, కుల అసమానతలు, దొరల దౌర్జన్యాలు, కరువు, విప్లవోద్యమ పోరాటం, 1969 ప్రత్యేక తెలంగాణ ఉద్యమం, ప్రజల్లో వచ్చిన చైతన్యం సాంబయ్య చదువు నవలలో చిత్రించబడ్డాయి. ఈ నవల దాదాపు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట కాలం నుండి కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాల్లో జరిగిన మూడు, నాలుగు దశాబ్దాల ఉత్తర తెలంగాణ గ్రామ జీవితాన్ని, అందులోని ఒక కుటుంబాన్ని నమూనాగా తీసుకొని చిత్రించింది.

ఈ నవలలో పాత్రోచిత సంభాషణ కనిపిస్తుంది. ఆ సంభాషణల్లో కూడా చక్కటి తెలంగాణ నుడికారం ప్రయోగించబడింది. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు మాట్లాడుకునే భాష ఆ భాషలోని నానుళ్లు, నుడికారాలు చక్కగా రచయిత వాడారు. ఏ రచనకైన రచనలోని పాత్రల సొంత భాష ఉండడమనేది సజీవ చిత్రణకు మిక్కిలి దోహదం చేస్తుంది.

### 3.2.3. మాట్లాడే బొమ్మలు నవల:

'మాట్లాడే బొమ్మలు' నవల చతుర పత్రికలో 1999 సెప్టెంబర్ సంచికలో ప్రచురింపబడింది. 2001 సంవత్సరంలో తెలుగు వచనం ప్రచురణలుగా ముద్రించబడింది. చదువు మూలంగా కుటుంబాల్లో వచ్చే స్పర్ధలు, మనుషుల మధ్య దూరాలు పెరగడం, బంధాలు తరగడం, గ్రామసీమలను నిర్లక్ష్యం చేయడం ఇతివృత్తంగా సాగిన నవల ఇది. సంస్కారాన్ని, ఆదర్శాన్ని, విజ్ఞానాన్ని, వినయాన్ని నేర్పవలసిన విద్య మనుషులను స్వార్థపూరితులుగా తయారుకావడానికి గల పరిస్థితులను ఈ నవల తెలియజేస్తుంది. కాలువ మల్లయ్య 'సాంబయ్య చదువు' నవలకు ఇది కొనసాగింపుగా అనిపిస్తుంది. అందుకు నవలలోని అనేక విషయాలే ధృవీకరిస్తాయి. విమర్శకుల అభిప్రాయం కూడా దీనినే తెలియజేస్తుంది. "సాంబయ్య చదువు నవలకు కొనసాగింపే మాట్లాడే బొమ్మలు నవల. సాంబయ్య చదువు నవలలో చివరన క్లుప్తంగా ప్రస్తావించిన అంశాలు ఈ నవలలో విస్తృతంగా విశ్లేషించడం జరిగింది. ఇతివృత్తము ప్రధానంగా 1975 ఎమర్జెన్సీ రోజుల నుండి 1999 వరకు నెలకొన్న తెలంగాణ సామాజిక జీవనంలోని సంఘటనలను ప్రతిఫలింపజేస్తుంది. రచయిత స్వీయ జీవితానుభవాలే అంతఃసూత్రంగా నవల్లో కన్పిస్తాయి" (ఐలయ్య, బన్న.2006:పుట.110).

### 3.2.3.1. నవలా వస్తువు:

కరీంనగర్ జిల్లాలోని ఓ గ్రామంలో జీవించిన రెండు కుటుంబాల కథే 'మాట్లాడే బొమ్మలు' నవలలోని వస్తువు. అయిలయ్య, శాంతమ్మలు చిన్నకారు రైతులు. అయిలయ్య చెల్లెలు సరస్వతిని అదే ఊరిలోని డిగ్రీ, బి.ఎడ్. పూర్తి చేసిన సాంబయ్యకిచ్చి పెళ్ళి చేస్తారు. అయిలయ్యకు ఒక కొడుకు శ్రీనివాస్, ఇద్దరు కూతుళ్లు. సాంబయ్య, సరస్వతి పిల్లలు ఆనంద్, కవితలు. అయిలయ్య, సాంబయ్యలిద్దరూ తమ పిల్లల్ని ఎన్నో కష్టాలకోర్చి చదివిస్తారు. అయిలయ్య పదవ తరగతి వరకు చదివి తన తండ్రి అకాల మరణంవల్ల అర్థాంతరంగా చదువు ఆపేసిన కారణంగా పిల్లల్ని ఎలాగైనా బాగా చదివించాలని అనుకుంటాడు. అదివరకే మొదలై ఉత్తర తెలంగాణ వ్యాప్తంగా రాజుకుని, ప్రభావవంతమైన ముద్రను వేస్తున్న విప్లవోద్యమ కాలంలో వివిధ ఆదర్శాల మధ్య డిగ్రీ, బి.ఎడ్. పూర్తిచేసి సాంబయ్య కట్నం లేకుండానే సరస్వతిని పెళ్లి చేసుకుంటాడు. మొదట తాను ఈ సమాజానికి ఏదో విధంగా సేవ చేయాలని ఉపాధ్యాయ వృత్తిలో చేరినా, డబ్బు సంపాదనే పరమావధి అని, ఏవేవో ఉన్నత పోకడలు పోయే నూతన ప్రపంచంలో జీవించే సహచరిణి సరస్వతి ఒత్తిడివల్ల తరువాత ఎరువుల ఫ్యాక్టరీలో ఉద్యోగిగా చేరతాడు. అయినా జీవితాచరణలో ఆదర్శాలు, నైతిక విలువల కోసం తపన పడుతూనే ఉంటాడు. సాంబయ్య తాను కాలేజీ రోజుల్లో చూసిన, పాక్షికంగా పాల్గొన్న అభ్యుదయ ఉద్యమాల భావాలకు, వాటి ఆచరణలో ఇమిడిపోదామని చేసే ప్రయత్నంలో, మనిషి స్థానంలో అమానవీయత ప్రవేశించిన సమకాలీన సామాజిక పరిస్థితులకు మధ్య నలిగిపోతాడు. సాంబయ్య, అయిలయ్య బావబావమరదులిద్దరూ తమ పిల్లల పాఠ్యపుస్తకాల్లోని విషయాలు జీవితాన్ని ఎలా జీవించాలో బోధించేవిగా అనిపించక మనోవేదన పడుతుంటారు.

కాలం గడుస్తున్న కొద్దీ సమాజంలో వచ్చే మార్పులు వారిని మరింత కృంగదీస్తాయి. పెరిగిన కృత్రిమ ప్రేమలు, యాంత్రికత, కుళ్లిన రాజకీయాల మధ్య మానవుడు మాయమైపోతున్న విషాద సన్నివేశాన్ని వాళ్లు చవిచూస్తారు. తను నమ్మిన విలువల ప్రకారం పిల్లల్ని చదివిద్దామని మాతృభాషలోనే విద్యాబోధన చేయిద్దామని తపించిన సాంబయ్య ఆశల్ని సమకాలీన సమాజం భంగం చేయడం వలన రాజీ పడతాడు. కొడుకును ఐ.ఏ.ఎస్. కోసం ఢిల్లీలో కోచింగ్ కి పంపుతాడు. కూతురు ఎం.బి.బి.యస్. చదువుతుంటుంది. అయిలయ్య కొడుకు శ్రీనివాస్ బ్యాంక్ ఆఫీసర్ అయి, విశాఖపట్నంలో ఉద్యోగం చేస్తూ అక్కడే పరిచయమైన మానసను తల్లిదండ్రులకు చెప్పకుండానే పెళ్లి చేసుకుంటాడు. వయసు పైబడిన సాంబయ్య, అయిలయ్యలు చదువులు,

ఉద్యోగాలు తరాల మధ్య సృష్టిస్తున్న అంతరాలు చూసి చలించిపోతారు. తాను, తన సహచరిణి పెళ్లి అయిన తర్వాత మొదటిసారి కలిసి ఇంటికి వస్తున్నామని శ్రీనివాస్ తండ్రికి ఉత్తరం రాస్తాడు. తాను వస్తానన్న రోజు కరీంనగర్ బస్టాండుకు తన బావ సాంబయ్యను తీసుకొని వచ్చి ఇద్దరూ చాలాసేపు ఎదురుచూస్తారు. కానీ శ్రీనివాస్ ఎంతకూ రాడు. ఇంటివద్ద అయిలయ్య సహచరిణి కొడుకు కోసం ఎదురుచూస్తూనే ఉంటుంది. గత కాలాన్ని స్మరించుకుంటూ సాంబయ్య, కొడుకు కోసం ఆత్రంగా ఎదురుచూసే కళ్లతో అయిలయ్య ఉంటారు. అంతటితో నవలలోని కథ ముగుస్తుంది. ఇది స్థూలంగా 'మాట్లాడే బొమ్మలు' నవలలోని వస్తువు.

### 3.2.3.2. వస్తు విశ్లేషణ:

ఈ నవలకు 'మాట్లాడే బొమ్మలు' అని పేరు పెట్టడంలో ఔచిత్యం కనిపిస్తుంది. మానవీయ విలువలు మాయమైపోయి కృత్రిమ మానవ సంబంధాలు ఏర్పడిన కాలంలో మనుషులు కేవలం జవజీవాలు లేని బొమ్మలైపోతారని, సంభాషణ బొమ్మలు చేసేది తప్ప మనుషులు చేసేది కాదని చెప్పడం ఒక ఉద్దేశం. బొమ్మలకు ఆలోచించే శక్తి ఉండదు. ఎవరైన కదిలిస్తే కదులుతాయి. కింద పడేస్తే పడిపోతాయి. నిలబెడితే నిలబడతాయి. ఎక్కడ పెడితే అక్కడ ఉండిపోతాయి. అంటే మనుషులు వాటిని నియంత్రిస్తుంటారు. ఆనాటి సామాజిక పరిస్థితులే ఆయా పాత్రలను నియంత్రించాయని, నడిపించాయని చెప్పడం, మనుషుల ఉద్దేశ్యపూర్వక కార్యకలాపాలకు స్థానం లేకుండా పోయిందని తెలియజేయడం మరొక ఉద్దేశ్యం. నవలలో ప్రధానంగా 'చదువు' అనే విషయాన్నే చర్చించినప్పటికీ ఆ చదువును ప్రేరేపించగల, నడిపించగల, నిర్దేశించగల సామాజిక పరిస్థితులను గూర్చి వివిధ కోణాల్లో విశ్లేషించడం ఈ నవల్లో కనిపిస్తుంది.

### 3.2.3.3. తెలంగాణ రైతు జీవిత చిత్రణ:

ఉత్తర తెలంగాణలో ఆనాడు ఉన్న సమాజం, ఆ సమాజంలో ఉన్న వైరుధ్యాలు, విప్లవోద్యమ ప్రభావాలను గూర్చి ఈ నవలలో విశేషంగా చిత్రించడం జరిగింది. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి రెండున్నర దశాబ్దాలు దాటినా భూస్వామ్య సమస్య పోలేదు. ప్రజా జీవితం కుంటుబడిపోవడానికి ప్రధాన అడ్డంకిగా భూస్వామ్య వ్యవస్థ ఉన్నది. గ్రామాల్లోని షావుకార్లు, వడ్డీ వ్యాపారుల దాష్టీకాలు కూడా సామాన్యుల జీవితాలను దుర్భరం చేసాయి. మరోవైపు ప్రజా సమస్యల నుండి, వాళ్ల సంఘటిత శక్తి నుండి విప్లవోద్యమం పుట్టి, విస్తరిస్తూ ఉంది. దాని ప్రభావం గ్రామీణ జీవితంపై తీవ్రంగా పడడం కూడా కనిపించింది. ఈ పరిస్థితులనే నవలలో చిత్రించారు. "వడ్లమ్మితే వచ్చిన డబ్బులున్నయి గద కొనేంది ఎద్దును?" 'ఈ పైసలకెంతమంది చూసుకుంటున్నరనుకుంటున్నవు?

కల్లం మీదనే వడ్లు కొలుసుక పోతనంటే నేనియ్యనని చెప్పిన షావుకారికి. ఇంతకు ముందయితే మనల్నే బెదిరింది తీసుకపోయేటోడు. ఇప్పుడు అన్నల భయం మొదలైంది. అన్నలు అన్నలంటున్నరు' 'అవును... ఈ నడుమ వాళ్ల మాటలు వినబడ్తున్నయి. ఎవ్వరెవ్వలో పడుచోల్లు ఊళ్లళ్లకొస్తున్నరు. అందులో పెద్ద పెద్ద చదువులు చదివేటోల్లున్నరట. వాళ్ళేవేవో విడమరిచి చెప్పుతున్నరట' (మల్లయ్య, కాలువ.2001:పుట.232). ఈ సంభాషణ ద్వారా రైతుల జీవితాల్లో విప్లవోద్యమం వల్ల వచ్చిన పురోగతి కనిపిస్తుంది. షావుకార్ల పీడింపు తగ్గిన పరిస్థితి కనిపిస్తుంది. అయితే రైతుల సమస్యలు మొత్తం పోయాయా అంటే అది జరిగే క్రమంలో మరొక పరిస్థితి దాపురించిందని నవలలోనే మరొకచోట తెలుస్తుంది. "ఏడెనిమిదేళ్ళుగా తమ ప్రాంతంలో భూపోరాటాలు జరుగుతున్నాయి. అవి రోజురోజుకి ఉధృతమౌతున్నాయి. పోరాటాల్లో ఎంతోమంది యువకులు బలవుతున్నారు. వీటితో పాలేర్ల జీతాలు, కూలీరేట్లు పెరిగాయి. దొరతనాలు తగ్గాయి. కాని తనలాంటి చిన్న వ్యవసాయదారుడి పరిస్థితిలో మార్పులేదు. పోరాటాల వల్ల చిన్న వ్యవసాయదారులకు లాభమే జరిగుంటే వ్యవసాయదారుల పతనమాగిపోవాల్సింది. కాని అలా జరగడం లేదు. తనలాంటి రైతుల బతుకులు కొనబోతే కొరివి అమ్మబోతే అడివిలాగే ఉంది. చాలా గ్రామాల్లో వ్యవసాయం దెబ్బతింటున్నాయి. వ్యవసాయాలు వదిలి వలస పోతున్నారు జనాలు. మరోదిక్కు భూస్వామ్య కుటుంబాల వాళ్లు ఉద్యమకారులకు భయపడి ఊళ్ళొదిలి పోతున్నారు" (మల్లయ్య, కాలువ.2001:పుట.271). ఈ మాటల ద్వారా నాటి గ్రామీణ జీవనాన్ని అర్థం చేసుకోవచ్చు. భూస్వామ్యానికి వ్యతిరేకంగా విప్లవోద్యమం మొదలైంది. దాని కారణంగా పాలేర్ల జీవితాలు మెరుగుపడ్డాయి. క్రమంగా ఉద్యమం విస్తరిస్తూ రైతాంగానికి విముక్తి చేసే క్రమంలో ఉండగానే ప్రభుత్వ అణచివేత కూడ మొదలైంది దాంతో అటు విప్లవకారులకు, ప్రభుత్వానికి మధ్య వైరుధ్యం తీవ్రమై, దాని ప్రభావం గ్రామాల్లోని మనుషులపై పడడం మొదలైంది. ఊర్లనుండి భూస్వాములైతే పారిపోయారుగాని, పోరాటాలను అణచివేయాలని పోలీసులు రంగ ప్రవేశం చేయడంతో పరిస్థితి మరో సంక్లిష్టతలోకి మారింది. గ్రామాల్లోని రైతులను, యువకులను విప్లవకారులకు సహకరిస్తున్నారనే పేరుమీద అరెస్టులు చేయడం, కేసులు పెట్టడం, చిత్రహింసలకు గురిచేయడం, భయాందోళనలకు గురిచేయడం ద్వారా చాలామంది సొంతూళ్లలో ఉండలేక వలస వెళ్లే పరిస్థితి కూడ ఒకటి దాపురించింది. ఇటువంటి ఒక వైరుధ్య భరితమైన సామాజిక పరిస్థితి నాడు ఉత్తర తెలంగాణ మొత్తం ఉండింది. దానిని సూక్ష్మ దృష్టితో నవలాకారుడు చక్కగా వర్ణించాడు.

### 3.2.3.4. గ్రామాలపై ఎమర్జెన్సీ ప్రభావం:

ఇందిరాగాంధీ ప్రభుత్వం తీసుకువచ్చిన అత్యవసర పరిస్థితి (ఎమర్జెన్సీ) గ్రామాలపై ఎటువంటి నిర్బంధాన్ని ప్రయోగించిందో ఈ నవలలో చిత్రించారు. ఆనాడు ఎవరి నోట విన్నా దేశంలోని పరిస్థితుల గురించి మాట్లాడుకోవడమే. అంతటి ప్రభావాల్ని వేసిన కాలమది. నవలలో ఒక సన్నివేశంలో బస్సులో ప్రయాణిస్తున్న ఇద్దరు యువకుల సంభాషణ, దాని పర్యావసానం ఏమి జరిగిందో ఇట్లా వివరించారు. “అయిలయ్య ముందు సీట్లో కూర్చున్న కాలేజీ చదివే యువకులిద్దరు మాటల్లో పడ్డారు. రాజకీయాలు మాట్లాడుతున్నారు వాళ్లు. పోలీసు రాజ్యమైంది దేశమంతా. ఇలా ఎన్నేండ్లు ఏలుతదో ఇందిరమ్మ. ప్రజాస్వామ్యానికి అర్థం మారిపోయింది. అధికారం పోతుందనే కదా అత్యవసర పరిస్థితి ప్రకటించడం, ‘గదిలో వేసి కొడుతుంటే పిల్లైనా తిరుగబడుతుంది. హిట్లర్, ముస్సోలిని లాంటి నియంతలే పోయారు. ప్రపంచాన్నే జయిద్దామన్న అలెగ్జాండర్ సంగతి ఏమైంది? చరిత్ర నుంచి ఈ పాలకులెందుకు గుణపాటం నేర్చుకోరు. పేరుకేమో ప్రజాస్వామ్యం. అన్ని నిరంకుశ విధానాలే’. ‘ఉత్తర భారతదేశంలో ఎమర్జెన్సీ ప్రభావం బాగా ఉందట. సంజయ్ లీలలు బాగా సాగుతున్నాయట. అతడే పరోక్ష ప్రధానట’. ‘మన దగ్గర కూడా కుటుంబ నియంత్రణ టార్గెట్లు పెడుతున్నారు. ఆర్.ఎస్.ఎస్. వాళ్లను, ప్రతిపక్షపోల్లను, కమ్యూనిస్టులను అరెస్టు చేస్తున్నరట’. ‘ఇలాంటి ప్రభుత్వాలు కూలిపోక తప్పదు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్సును చిత్తు చిత్తుగా ఓడిస్తారు ప్రజలు’. ‘అందరూ నియంతలకు పట్టిన గతే ఆమెకు పడుతుంది’. వాళ్లు మాట్లాడుకుంటూనే ఉన్నారు. బస్సు కరీంనగర్ పొలిమేరలు దాటి పరుగుతీస్తోంది. కండక్టర్ టికెట్లివ్వడం పూర్తిచేసి తన సీట్లో కూర్చున్నాడు. నిల్చోని సివిల్ దుస్తులలో ఉన్న పోలీసులిద్దరూ ఆ యువకుల దగ్గరికొచ్చారు. వాళ్ల కాలర్లు పట్టుకున్నారు. ‘ప్రభుత్వాన్నే తిడుతార్రా మీరు’. ‘ప్రభుత్వాన్ని కూలదోయడానికి కుట్ర పన్నుతున్నారన్న మాట. ప్రధాన మంత్రినే ఇష్టమొచ్చినట్టు అంటున్నారంటే మీరు ఖచ్చితంగా తీవ్రవాదులే’ అని వాళ్లను లేపి నిల్చోబెట్టారు. బస్సాగింది. వాళ్లను తీసుకుని బస్సు దిగారు వాళ్లు. కరీంనగర్ దిక్కుకు పోయే బస్సాపి వాళ్లతో పాటే ఎక్కారు. ఆ బస్సు కదిలింతర్వాత ఊరెల్లే బస్సు కదిలింది” (మల్లయ్య, కాలువ.2001:పుట.233). ఈ సన్నివేశం ఆనాటి పరిస్థితులను కళ్లకు కట్టినట్లు చూపుతుంది. ఇద్దరు యువకులు ఆనాటి యువతరానికి ప్రతినిధులు. వాళ్లు అత్యంత చైతన్యవంతంగా రాజకీయాలు మాట్లాడుకోవడమన్నది భావప్రకటనలో భాగం. అదొక స్వేచ్ఛ. ఆనాడు ఇందిరా ప్రభుత్వం విధించిన ఎమర్జెన్సీ పరిస్థితులు

భావ ప్రకటనా స్వేచ్ఛను కూడా ఎంతగా హరించిందో ఈ సన్నివేశం ద్వారా రచయిత వివరించారు.

ఈ మాటలు మరొక విశేషాన్ని కూడా పట్టి ఇస్తాయి. ఆనాడు ఉన్న యువతరం, విద్యార్థులు ఎంతటి రాజకీయ చైతన్యాన్ని కలిగి ఉన్నారో, ప్రధానంగా తెలంగాణ వంటి నిత్య పోరాట ప్రాంతాల్లోని యువతరం ఎంతటి సామాజిక స్పృహతో ఉన్నారో తెలియజేస్తాయి. మరి ప్రజలలో ఇంతటి అవగాహనా స్థాయి పెరగడానికి కారణమేమిటి, ముఖ్యంగా ఉత్తర తెలంగాణలో ఈ పరిస్థితులు రావడానికి కారణమేమిటి అని చరిత్రలోకి తొంగిచూసినప్పుడు అక్కడ జరిగిన ఉద్యమాల ప్రభావమేనని తెలుస్తోంది. "తెలంగాణ జిల్లాలలో ఇవ్వాళ మనం ఎన్ని రకాల రాజకీయ అవగాహనల గురించి మాట్లాడుకుంటున్నామో దానికి ప్రధానంగా నక్సలైట్ ఉద్యమమే కారణం. తెలంగాణ రాష్ట్రం ఒకటి కావాలన్న ఆకాంక్ష బలంగా ఉందన్న కూడా – ఆ ఆలోచన, ఆ తెలివితేటలు, ఆ విశ్లేషణ, న్యాయం – అన్యాయం, అణచివేత – ప్రతిఘటన అన్న విశ్లేషణ తెలంగాణ ప్రాంతానికి నేర్పించింది నక్సలైట్ ఉద్యమమే. కార్యకర్తలు కూడా ఒకప్పుడు నక్సలైట్ ఉద్యమంతో రకరకాల సంబంధాలున్నటువంటి వాళ్ళే. ఆ తెలివితేటలు, రాజకీయ తెలివితేటలు, విశ్లేషణా సామర్థ్యం, ఒక అవగాహన తెలంగాణ జిల్లాలను లేదా మన రాష్ట్రం లాంటి రాష్ట్రాలను, కమ్యూనిస్టు ఉద్యమాలు, నక్సలైట్ ఉద్యమాలు లేని రాష్ట్రాలతో, ప్రాంతాలతో పోల్చినప్పుడు ఆ తేడా మనకు కనిపిస్తుంది. న్యాయం – అన్యాయం, అణచివేత – ప్రతిఘటన అనే చట్రంలో ఆలోచించిడమనేది సమాజ పురోగతికి చాలా ఉపయోగకరం దాన్ని నేర్పించింది నక్సలైట్ ఉద్యమం వాళ్లకు" (బాలగోపాల్, కె.2010:పుట.116). బాలగోపాల్ గారు అన్న మాటలకు ఆధారాలు కూడా ఈ నవలలో ఉన్నాయి. "నోట్లో నాలికెలు లేనోల్లు వాళ్లు. ఇప్పుడు వాళ్ళు అన్నలతోని తెలివికస్తున్నరంటున్నరు" (మల్లయ్య, కాలువ.2001:పుట.234).

మొత్తంమీద ఆనాటి ప్రజా చైతన్యంలో విప్లవోద్యమం పాత్ర గణనీయంగా ఉన్నదని ఈ సన్నివేశం ద్వారా తెలుస్తోంది.

### 3.2.3.5. శాస్త్రీయ, అశాస్త్రీయ విద్యా విధానాల మధ్య వైరుధ్యం:

భారతదేశం ప్రధానంగా తెలంగాణ వంటి భూభాగంలో భూస్వామ్యం బలంగా ఉన్న కారణంగా దాని ప్రభావం మిగతా అన్ని రంగాలపై పడింది. విద్యారంగం అన్నది సమాజ అధ్యయనంలో భాగం. ఆ అధ్యయన దృక్పథాలు, లక్ష్యాలు ప్రజల ప్రయోజనాల దృష్టితో ఏర్పడాల్సి ఉంటుంది. కాని దేశంలోగాని, తెలంగాణలో గాని అటువంటివేవీ కనిపించవు. 'వర్గ సమాజంలో

విద్య ప్రధానంగా రెండు లక్ష్యాలకు వాడబడుతుంది. ఒకటి – అధికారంలో ఉన్నవారి ఆధిపత్యానికి నష్టం రానటువంటి విద్య జరపాలి. రెండు – ఉత్పత్తి సాధనకు కావలసిన చాకచక్యాన్ని, నైపుణ్యాన్ని అభివృద్ధి చేయగలగాలి. అయితే ప్రక్రియలో మనిషి తనను తాను మార్చుకుంటూ తన పరిసరాలను మార్చగలననే చైతన్యాన్ని పొందడమే అసలైన విద్య. ఈ అంశాన్ని పూర్తిగా విస్మరించి, పైన పేర్కొన్న రెండు లక్ష్యాలకు ఎంతో ప్రాధాన్యత ఇవ్వబడుతోంది. చారిత్రకంగా నియమిత విద్య స్థిరపడి అది సామాజిక వాస్తవిక జీవితానికి దూరం కావడంతో బళ్ళో చదువుకి బయట అనుభవానికి అంతరం పెరుగుతూనే ఉంది. ఈ అంతరం పాశ్చాత్య దేశాలకంటే భారతదేశం లాంటి మూడో ప్రపంచ దేశాల్లో ఎక్కువగా ఉంది" (రామారావు, కాళీపట్నం.1990: పుట.89, 90). ఈ మాటలు భారతీయ విద్యా విధానాన్ని తాత్త్విక స్థాయిలో వివరించేవి. ఇక్కడి విద్యా వ్యవస్థను అర్థం చేసుకోవడంలో శాస్త్రీయ అవగాహనను అందించగలవి. భారతదేశంలో పూర్తిగా అశాస్త్రీయ విద్యావిధానం అమలులో ఉండడం వలన హేతుబద్ధత గీటురాయిగా ఆలోచించే చాలామంది విద్యార్థులకు తరగతి గది పాఠాలకు, సమాజంలోని వాస్తవ విషయాలను వైవిధ్యం కనిపిస్తుంది. ఈ విషయమే నవలలో చక్కగా వర్ణించబడింది. "సరేగాని మీ సార్లనేవేవో ప్రశ్నలడిగి తికమక పెడ్తున్నావట అన్నాడు. నేనేం తికమక పెట్టలేదు నాన్న. గ్రహణాల గూర్చి ప్రశ్నలడిగాను. తెలుగు సారేమో రాహుకేతువులు, సూర్యచంద్రులను మింగితే గ్రహణాలు పడతాయని చెప్పాడు. సైన్స్ సారేమో సూర్యుడు మండుతున్న అగ్నిగోళమని చెప్పాడు. అగ్నిగోళాన్ని రాక్షసులయినా ఎట్లా మింగుతారని అడిగాను. ఇది తప్పా? శ్రీనివాస్ ప్రశ్నకు జవాబు చెప్పడం అయిలయ్యకు చాతకావడం లేదు" (మల్లయ్య, కాలువ.2001:పుట.285). విద్యావిధానంలోనే లోపం ఉండడం వలన తెలుగు పాఠ్యాంశాల్లో సూర్యచంద్రులను దేవుళ్లని, సైన్సు పాఠ్యాంశాల్లో గ్రహాలని ఉండడం వలన విద్యార్థికి ఏది సరైనదో అర్థం చేసుకునే అవకాశం ఉండదు. పైగా విద్యార్థి దశలోనే ప్రకృతిని అర్థం చేసుకునే క్రమం మొదలవుతుంది గనుక, పాఠశాలల్లోనే గందరగోళపడడం వలన జీవితంలో ఎదురయ్యే విషయాలను అర్థం చేసుకోవడంల్లోనే విఫలమయ్యే అవకాశం ఏర్పడుతుంది. పైగా దేశంలోని అత్యధిక ప్రజలు శ్రమమీద ఆధారపడి బ్రతికేవాళ్లు కావడం వలన, వారి పిల్లలు విద్యార్జన క్రమంలో ఉన్నప్పుడు ఉత్పత్తికి సంబంధించిన జ్ఞానం అందించవల్సి ఉంటుంది. ఎందుకంటే వారు తర్వాత ఉత్పత్తిలో భాగం కావల్సినవారు, ఉత్పత్తిని అనుభవించవల్సినవారు. కాని వారి తర్వాతి జీవితంలో వచ్చే విషయాలకు సంబంధించి కాకుండా

ఎటువంటి సంబంధంలేని నిరాధారమైన పాఠ్యాంశాలే ఎక్కువగా చదివించడం వలన శాస్త్రీయమైన అవగాహన కొరవడడం కనిపిస్తుంది.

### 3.2.3.6. విద్యారంగం – రాజకీయాలు:

విద్యారంగానికి, రాజకీయాలకు సంబంధం ఏముందని చాలామంది అనుకుంటుంటారు. కాని మానవ ఆచరణలోని ప్రతి విషయమూ రాజకీయమే అని చాలామందికి తెలియని విషయం. కారణం విషయాన్ని వాళ్లు తాత్త్వికంగా ఆలోచించకపోవడమే అనిపిస్తుంది. అరిస్టాటిల్ మనిషి ఒక రాజకీయ జంతువు అంటాడు. రాజకీయ జంతువు చేసే కార్యకలాపాలన్నీ రాజకీయాలే అవుతాయి తప్ప మరోటి కావు. విద్యనర్థించే విద్యార్థులు, వారికి బోధించవల్సిన విషయాలు, బోధనలో పాల్గొనే ఉపాధ్యాయులు, ఈ వ్యవస్థను నియంత్రించే ప్రభుత్వ రంగాలు – వీటన్నింటి ఉమ్మడి రూపం విద్యారంగం. విద్యార్థులైనా, ఉపాధ్యాయులైనా సమాజంలో భాగం. వారికి మధ్య ఉండే పాఠ్యాంశాలు సమాజంలో భాగం. పాఠ్యాంశాలను, విద్యార్థులను, ఉపాధ్యాయులను, మొత్తం విద్యారంగాన్ని శాసించేది సమాజం. సమాజంలోని రాజకీయాలు అట్లా చూసినప్పుడు విద్యార్థులకు, రాజకీయాలకు సంబంధం అనివార్యంగానే ఉండి తీరుతుంది. వేదాలకాలం నుండి ఆధునిక కాలం వరకు ఈ విషయాలను శాస్త్రీయంగాను, తాత్త్వికంగాను విశ్లేషించుకుంటే అర్థమయ్యే విషయమిది. అయితే ఆధునిక కాలానికి, అంతకు పూర్వ కాలానికి ప్రధానమైన భేదం అంతకు ముందు తమకు తెలవకుండా రాజకీయాలలో పాలుపంచుకున్నారు, ఆ రాజకీయాలను మార్చే ప్రయత్నంలో భాగస్వామ్యం వహించలేదు. కాని ఆధునిక కాలంలో విద్యార్థులు ఈ ప్రయత్నంలో కూడా భాగస్వాములవుతున్నారు. అవి మంచి రాజకీయలా, చెడ్డ రాజకీయాలా అట్లుంచితే వివిధ రాజకీయ పార్టీలు కూడా విద్యార్థుల్ని రాజకీయాలలో క్రియాశీలం చేస్తున్నాయి.

ఈ అవగాహన ఈ నవలలో చక్కగా వర్ణించబడింది. "విద్యార్థులకు రాజకీయాలొద్దు. విద్యనార్జించే విద్యార్థి రాజకీయాల జోలికి పోతే విద్యార్జనకు భంగం కలుగుతుంది. చదువే ధ్యేయంగా బతకాల్సిన వాళ్ళకు రాజకీయాలెందుకు? అందుకే విద్యార్థులంతా రాజకీయాలకు దూరంగా ఉండాలి. చదువుపై మనసులను లగ్నం చేయాలి. ఆవేశపూరితమైన నిర్ణయాలు తీసుకుంటూ తీవ్రవాదం వైపు మొగ్గు చూపకూడదు అంటూ ప్రతి సభలోనూ చెబుతున్నారు నాయకులు. విద్యార్థులకు రాజకీయాలొద్దా? ఏ రాజకీయాలు మీరనేది? మీరు కోరుకుంటున్న రాజకీయాలైతే పర్వాలేదు కదా. మీకు పావులుగా ఉపయోగపడేదైతే మంచిదే. అలాంటి వాటిని మీరే ప్రోత్సహిస్తారు. విద్యార్థుల్ని బలిపశువుల్ని చేస్తారు. తెలంగాణ ఉద్యమంలో రెండు వందల

యాభై మందిని బలిగొన్నారు. ఆంధ్ర ఉద్యమంలో మరికొంతమందిని, ఓ దిక్కు ఇలా విద్యార్థుల్ని బలిపశువుల్ని చేస్తూనే విద్యార్థులకు రాజకీయాలొద్దనడంలో మీకున్న చిత్తశుద్ధి ఏపాటిది? పాఠశాలలను, కళాశాలలను ఎన్నికల కురుక్షేత్రాల్లా మారుస్తూ విద్యార్థులకు రాజకీయాలొద్దనడంలో అర్థమేముంది? వీళ్ళు వద్దంటున్న రాజకీయాలెలాంటివో విద్యార్థులు గుర్తించాలి అంటూ వామపక్ష విద్యార్థి యూనియన్ల నాయకులు వాళ్ళ ఉపన్యాసాలను ఖండిస్తున్నారు" (మల్లయ్య, కాలువ.2001:పుట.266). ఈ మాటల్లో నాయకుల మాటలు పక్కన పెడితే విద్యార్థులు క్రియాశీలంగా రాజకీయాల్లో పాల్గొంటున్నారనీ, అది కూడ విప్లవోద్యమ ప్రేరేపితులుగా ఉంటున్నారని అర్థం అవుతోంది. ఉత్తర తెలంగాణలో విప్లవోద్యమ కాలం నాటికి కాలేజీల్లో, విశ్వవిద్యాలయాల్లో విద్యార్థి ఎన్నికలు ఉన్నాయి. ఆ తరువాతి కాలంలో కొన్ని విశ్వవిద్యాలయాల్లో మినహా దాదాపు అన్ని కళాశాలల్లో , విశ్వవిద్యాలయాల్లో ఎన్నికలను ప్రభుత్వం నిలిపివేసింది. ఎన్నికలు ఉన్నప్పుడు సహజంగానే వాటిని బయటి రాజకీయాలు ప్రభావితం చేయడం అనేది ఉంటుంది. ఆయా రాజకీయ శిబిరాలకు చెందిన విద్యార్థులు చాలా సందర్భాల్లో తీవ్ర ఘర్షణలు పడ్డారు.

### 3.2.3.7. జానపద క్రీడల పరాయీకరణ:

కాలువ మల్లయ్య నవలలకు గ్రామాలే పునాది. ఆ గ్రామాల్లోని అనేక విషయాలను సూక్ష్మ దృష్టితో గమనించినప్పుడు మాత్రమే పట్టుకోగలిగే అవకాశం ఉంటుంది. రచయితకు గ్రామీణ నేపథ్యం ఉండడం వలన, ఆ అనుభవం రచనకు ఉపయోగపడింది. గ్రామాల్లో చాలా కాలం నుంచే కొన్ని క్రీడలు సాంప్రదాయకంగా వస్తున్నాయి. అయితే ఆధునిక కాలంలో అవి కనుమరుగు కావడం, వాటి స్థానంలో ఆధునిక క్రీడలు పాగా వేయడం కనిపిస్తుంది. ఈ విషయాన్ని అద్భుతంగా చిత్రించారు.

"శీనూ! ఏం చేస్తున్నావురా?" అడిగాడు అయిలయ్య. "రవీందర్ నేను గోలీలాడుకుంటున్నం". "అది కనబడుతూనే ఉందిగానీ నీకు ఈ దిక్కుమలాటే దొరికిందా?" "బాపూ! నువ్వు చిన్నప్పుడు బొంగరాలాట, చిర్రగోనె ఆడెటోనివని చెప్పినవు గద! ఇప్పుడా ఆటలెవ్వరాడుతలేరు". "కబడ్డో, వాలీబాలో ఆడుకోక గోలీలాడుడేంది?". కబడ్డీ ఆడెటోల్లు గూడ తక్కువే బాపు. కొంతమంది వాలీబాల్ మా ఆడుతంద్రు. అది బడున్నప్పుడు ఆడేటిదేనాయె. గ్రౌండవన్నీ కావాలి గద! ఇప్పుడు చాలామంది క్రికెట్ గూడ ఆడుతున్నారు. నువ్వేమొ క్రికెట్ బ్యాటన్న, టెన్నిస్ బ్యాటన్న కొనియ్యమంటె కొనియ్యక పోతివి' దేశీయ క్రీడలైన కబడ్డీ, ఖోఖో

లాంటివి పోతూ క్రమక్రమంగా గ్రామాల్లోకి క్రికెట్ లాంటి క్రీడలు వస్తుండటం గమనిస్తున్నాడు అయిలయ్య" (మల్లయ్య, కాలువ.2001:పుట.273). ఈ సన్నివేశం ద్వారా గ్రామాల్లోని క్రీడల్లో ఎంతటి మార్పు వచ్చిందో తెలుస్తుంది. కానీ రచయిత ఈ సన్నివేశ కల్పన ద్వారా మరొక విషయాన్ని కూడ తెలియజేస్తున్నాడు. అయిలయ్య చిన్నతనంలో ఉన్న బొంగరాలాట, చిర్రగోనెలు రద్దయిపోయి గోలీలాటల మీదుగా వాలీబాల్, క్రికెట్లు ప్రవేశించి స్థిరపడుతున్న సంధికాలం అది. అది కేవలం క్రీడలకు సంబంధించిన విషయమే కాదు ఒక సామాజిక పరిణామాన్ని కూడా రచయిత తెలియజేస్తున్నాడు.

### 3.2.3.8. మాతృభాషలో విద్యాబోధన:

సాంబయ్యకు తను చదివే రోజుల ఆదర్శాలు వాసన రూపంలో వెన్నంటే ఉంటాయి. అందుకే అతని ఆచరణలో ప్రతి విషయం ప్రయోజనం అనే చట్రంలోంచే ఆలోచిస్తాడు. పైగా స్థానిక సంస్కృతి మీద అతనికి ఎనలేని ప్రేమ ఉంటుంది. అందుకే తన పిల్లలకు మాతృభాషలోనే విద్య చెప్పించాలనుకుంటాడు. అలా అయితేనే పిల్లల మానసిక ఎదుగుదల సక్రమంగా ఉంటుందని భావిస్తాడు. తెలుగు పరిరక్షణకు ఇది కూడా ఒక ఆచరణాత్మక పరిష్కారమని నమ్ముతుంటాడు. అయితే అప్పుడున్న సామాజిక పరిస్థితులు దానికి సహకరించవు. దాంతో తన సహచరిణి శ్రేయోభిలాషులు కూడా ఆంగ్ల భాషలోనే బోధన చేయించాలని పట్టుబడతారు. దాంతో ఎంతో వేదనకు గురవుతాడు సాంబయ్య.

'తెలుగు తెలుగని, మాతృభాష మాతృభాషని చెప్పే పెద్ద పెద్ద అధికార హోదాల్లో ఉన్నవారే తమ పిల్లలను తెలుగు మీడియం పాఠశాలల్లో చదివించడం లేదు. అసలు తెలుగునే ఇంట్లో ఉండనీయడంలేదు. తెలుగు కథలు, కవిత్వం రాసే వాళ్ళ పిల్లలు కూడా తెలుగు మీడియంలో చదువుతున్నారని నేననుకోను' రాంరెడ్డి మాటలు విని సంబరపడింది సరస్వతి.

'అవును. చెప్పేదొకటి చేసేదొకటన్నట్టుగానే ఉంటాయి పెద్దోల్ల పనులు. నాకిష్టం లేకున్నా ఈ విషయంలో నువ్వు నీ అభిప్రాయాలతో రాజీపడటమే మంచిదని నా ఉద్దేశ్యం' అన్నాడు తిరుపతిరెడ్డి. 'బావా? పల్లెటూళ్ళ మాటెలా ఉన్నా ఇక్కడ తెలుగు మీడియం చదువులంటే కొంత తక్కువగానే చూస్తున్నారనిపిస్తోంది నాకు. ఊరివాళ్ళు కూడా ఇంగ్లీషు చదువులని మోజు పడుతుంటే ఇక్కడెలా ఉంటుందో నేను ఊహించుకోగలను. ఇంగ్లీషు, తెలుగు మీడియం రెండున్న బళ్ళలో తెలుగు మీడియం వాళ్ళనంతగా పట్టించుకోరు. పిల్లలు తక్కువతనంగా ఫీలయ్యే అవకాశముంది. పోగా చెల్లెమ్మను అసంతృప్తికి గురిచేస్తూ నువ్వు మాత్రం సాధించేదేముంది?

ఆనంద్ ను ఇంగ్లీషు మీడియంలోనే వేయి' అయిలయ్య కూడా సరస్వతికి మద్దతుగానే మాట్లాడాడు. తననెవరూ సమర్థించకపోవడం సాంబయ్యకు బాధాకరంగానే ఉంది" (మల్లయ్య, కాలువ.2001: పుట.280, 281). ఈ సన్నివేశ కల్పన ద్వారా రచయిత సమాజానికి గొప్ప గొప్ప ఉపాన్యాసాలిచ్చేవాళ్ల పిల్లల్ని మాత్రం ఇంగ్లీషు పాఠశాల్లోనే చదివిస్తున్నారని, వాళ్ల మాటలకు, ఆచరణకు పెద్ద అంతరం ఉందని, నిజంగా తెలుగును కాపాడాలనుకుంటున్నది ఉపాధ్యాయులే అని తెలియజేశాడు. నిజానికి ఇక్కడ సాంబయ్యనుగానీ, అతని పిల్లల్ని ఇంగ్లీషు మీడియంలో చదివించమని సలహా ఇస్తున్నవారిని ఇరువురిని తప్పుబట్టడానికి లేదు. ఎందుకంటే ఎక్కువ ఉద్యోగావకాశాలు ఏ భాషలో చదువుకుంటే వస్తున్నాయో సహజంగానే ఆ భాషలోనే చదువుకుంటారు. తెలుగులో చదువుకుంటే కూడ సరిపోయేటన్ని ఉద్యోగావకాశాలు ప్రభుత్వాలు కల్పించినప్పుడు ప్రత్యేకమైన భాషా పరిరక్షణ ఉద్యమాలు, ఉపన్యాసాలు లేకుండానే ప్రజానీకం తమ పిల్లల్ని తెలుగు మాధ్యమంలోనే చదివిస్తారు.

### 3.2.3.9. కులం – రిజర్వేషన్లు:

మాట్లాడే బొమ్మలు నవలలో ప్రస్తావించిన మరొక అత్యంత ముఖ్యమైన విషయం రిజర్వేషన్లు. భారత రాజ్యాంగం ఇక్కడి వ్యవస్థలో ఉన్న కుల వ్యవస్థను, అది సృష్టించిన అసమ సమాజాన్ని దృష్టిలో ఉంచుకొని అనేక రంగాలలో ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన కులాలకు కొన్ని రిజర్వేషన్లు కల్పించింది. వాటి అమలు ద్వారా సమస్త ప్రజానీకం మధ్య ఆర్థిక అసమానత్వం, సాంఘిక అసమానత్వాలు తొలగించాలన్నది స్థూల లక్ష్యం. అయితే రాజ్యాంగం అమలులోకి వచ్చి అర్ధ శతాబ్దం గడిచిపోయినా ఇంకా నిమ్న వర్గాల ప్రజలకు పూర్తి సమానత్వం సిద్ధించనే లేదు. గ్రామాల్లోను, పట్టణాల్లోను కులం పునాదులింకా అట్లే ఉన్నాయి. సమాజంలో ఉన్న కొన్ని అగ్రవర్ణ, అగ్రవర్ణ శక్తులు కులాల పట్ల వ్యతిరేక దృష్టితో ఉండడం కనిపిస్తుంది. మండల్ కమీషన్ వచ్చిన తర్వాత ఈ వైరుధ్యం మరింత ఎక్కువైనట్లు తెలుస్తుంది. ప్రధానంగా విద్యార్థి రాజకీయాలలో ఈ విషయం ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. ఆనాడు ప్రజా బాహుళ్యంలో రిజర్వేషన్ల విషయంలో ఉండినటువంటి భిన్నమైన అభిప్రాయాలను ఈ నవలలో చక్కగా వర్ణించారు.

" 'ఎంతైనా రిజర్వేషన్లు ఉండడం నాకైతే నచ్చడం లేదు'. నిజమేనోయ్ రెడ్డి! ఈ రిజర్వేషనొద్దు. అందుకోసం మనమంతా పోరాటం చేద్దాం. అయితే అంతకంటే ముందు ఈ కులాలే వద్దని పోరాటం చేయాల్సిన అవసరముంది. ఈ కులాలనేవి పోతే రిజర్వేషన్ల ప్రసక్తే ఉండదు కదా!'. చాల్తియ్యి నీ ధోరణి... మనుస్మృతి మన జాతికే తలమాణికం లాంటి గ్రంథం.

వేదాలు, మనుస్మృతి లాంటి వాటిపైనే నీలాంటివాళ్లకు నమ్మకం లేదు. ఇక నీ మాటలెలా ఉంటాయి? నీలాంటివాళ్ళు మనువాద వ్యతిరేకులమని దళితుల రాజ్యమే కావాలని గోల చేస్తున్నారు కదా! మీరొస్తే ఏం గొప్పగా చేస్తారో మేం చూడమా? ఇప్పటికే ఎన్నో సంకరాలు జరుగుతుంటే ఉన్న కులాలను భ్రష్టు పట్టించమంటావా? అయినా కులాలను నిర్మూలించేదెవరు?' 'కులం వద్దంటే నీకింత కోపమెందుకొస్తుందోయ్ రెడ్డీ! అయితే కులాలన్నీ ఇలాగే ఉండాలంటావు. కులం పేరు మీద జరుగుతున్నవన్నీ కొనసాగాలంటావు. రిజర్వేషన్లు మాత్రం వద్దంటావు అంతేనా?' 'కులాలు లేకుండా చేసేదెవరు?' 'మనం అంటే ప్రజలు. ప్రజలు ఉద్యమిస్తే సాధ్యం కానిదేముంది? దళితులు, ఇతరులు పోరాటాల ద్వారా ఎంతో కొంత జీవితాన్ని గెలుచుకున్నారా లేదా? మనమంతా కులాలు వద్దని మొత్తుకుందాం. స్వాతంత్ర్య పోరాటం లాంటి పోరాటం సాగిద్దాం. ప్రజలుద్యమిస్తే సాధ్యం కాదా' " (మల్లయ్య, కాలువ.2001:పుట.305, 306). ఈ సంభాషణలో ఉన్న ఇద్దరు వ్యక్తులు రెండు భిన్నమైన దృక్పథాలకు ప్రతినిధులు. ఒకటి మనువాదం ఉండాలని, కులాలు పోవని వాదించేదైతే, మరొకటి మనువాదం, దాని ద్వారా వ్యవస్థీకరించబడ్డ కులం రెండూ పోవాలని, దానికి పోరాటాలే మార్గమని, ప్రజల ప్రమేయంతో జరిగే ఉద్యమాల ద్వారానే సమానత్వం వస్తుందని నమ్మేది. అయితే కుల వ్యవస్థ ఉండడం ద్వారా, ఒక జాతిని మరొక జాతి పీడించుకు తినే సాంఘిక ధర్మం ఆ అవకాశం ఇస్తుంది. కాబట్టి దోపిడీ చేసే వర్గాలు కులాలు ఉండాలనే కోరుకుంటాయి. దాని కోసం తమకు అనుకూలమైన భావజాలాన్ని తయారుచేసి వదులుతాయి. చాలామంది ప్రజలు తమ ఆలోచనలపై ఈ భావజాలం పనిచేస్తుందని తెలియకనే అట్లా ప్రవర్తిస్తుంటారు. పైగా రిజర్వేషన్ల గురించి మాట్లాడే వారిపట్ల, కులాలు పోయి సమానత్వం రావడం కోసం ఉద్యమాలు చేయవల్సిందే అని వాదించే వారిపట్ల తీవ్రమైన ఉద్వేశ్యాలు కూడా ఉండటం కనిపిస్తుంది. ఈ విషయాన్ని కూడా నవలలో వివరించారు.

" 'ఇవన్నీ తీవ్రవాద భావాలే. కులాలనేవి మన దేశంలో తరతరాల్నుంచి వస్తున్నాయి. ఏ దేశంలోనైనా ఏదో మేరకివి ఏదో రూపంలో ఉండనే ఉన్నాయి. అలాంటప్పుడు పూర్తిగా కులాలను నిర్మూలించాలనడం కాని పని'. 'ఎలాగోయ్ శర్మ! కులం వద్దంటే తీవ్రవాద భావమంటిరి. రిజర్వేషన్లుండాలంటే మనువాద వ్యతిరేకంటివి. అంటే? కులాల పేరుమీదున్న సాంఘిక అసమానతలు, కుమ్ములాటలు, హెచ్చుతగ్గులు అలాగే ఉండాలి కాని రిజర్వేషన్లు మాత్రముండొద్దంటావు. అంతే కదా! ఎవరెంత గింజుకున్నా, కల్లిబొల్లి మాటలు చెప్పిన కులాలనేవి ఉన్నంతవరకు, ఈ సాంఘిక అసమానతలు కొనసాగుతున్నంతవరకు రిజర్వేషన్లుండక తప్పదు.

వీటికి అనుకూల వ్యతిరేక ఉద్యమాలు తప్పవు. రిజర్వేషన్లు తొలగించడానికన్నా కుల నిర్మూలన జరగాలన్న ఉద్యమం రావాలి" (మల్లయ్య, కాలువ.2001:పుట.306). ఈ సంభాషణలో భిన్న అభిప్రాయాల మధ్య ఉన్న వైరుధ్యాన్ని వివరించారు. రిజర్వేషన్లు ఏర్పాటు చేయడంలో ఉన్న ఉద్దేశాన్ని స్పష్టం చేశారు. భారతీయ సాంఘిక వ్యవస్థ వాస్తవిక రూపాన్ని ఎత్తిచూపారు. దాంతోపాటే అన్నిటికంటే ఒక ముఖ్యమైన విషయాన్ని ఇక్కడ ప్రస్తావించడం విశేషం. అది అన్ని కుల రిజర్వేషన్ వ్యతిరేక ఉద్యమాలకు సరిపోయే సమాధానం కూడ అనిపిస్తుంది. రిజర్వేషన్లు తొలగించడమనే అభిప్రాయం కంటే కులాలు తొలగించడం కోసం ఉద్యమం చేయడం ప్రజాస్వామికం అని చెప్పడం ప్రాముఖ్యత కలిగినది. ఏ రచయిత అయినా సమస్య స్థితిగతులు చెప్పడం వాటికి మూలాలను అన్వేషించడం మాత్రమే కాదు దానికి తనదైన పరిష్కార మార్గాల్ని సూచించడమన్నది సామాజిక బాధ్యత. ఈ రచయిత పై మాటలు తెలియజేయడం ద్వారా ఆ పనిని సమర్థవంతంగా చేశారని చెప్పాలి.

### 3.2.3.10. పాతకొత్తల సంధికాలం:

1980ల నుండి 2000 సంవత్సరం వరకు గల మధ్యకాలంలో తెలుగు నేలమీద కొత్తగాలులు వీయడం ప్రారంభమైంది. 1982 మార్చి నెలలో నందమూరి తారక రామారావు తెలుగు దేశం పార్టీని స్థాపించడం, స్థాపించిన తొమ్మిది నెలల్లోనే ప్రభుత్వాన్ని ఏర్పర్చడం, కాంగ్రెస్ అప్రతిహత ప్రయాణానికి బ్రేక్ పడడం జరిగాయి. మాతృభాష తెలుగునే ఆదరించాలనే, ఆత్మగౌరవంతో తెలుగులోనే మాట్లాడాలనే, తెలుగును జీవింపజేయాలనే ప్రచారంతోపాటు, అప్పటికే ప్రభావవంతంగా విస్తరిస్తున్న విప్లవోద్యమాన్ని ఉద్దేశిస్తూ నక్సలైట్లే నిజమైన దేశభక్తులు అనే నినాదంతో రాజకీయ వేదిక మీదికి వచ్చింది తెలుగుదేశం పార్టీ. కొత్త కొత్త పథకాలు, సంస్కరణలు చేపట్టడం, కొత్త సంస్కృతి వ్యాప్తిలోకి రావడం జరిగాయి. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన కొద్ది కాలంలోనే విప్లవోద్యమాన్ని అణచివేయడం, రూపాయి సంస్కృతికి దారులు తెరవడం, రైతాంగం, భూస్వామ్యం మధ్యన ఒక మధ్యతరగతి వర్గం ఎదగడం జరిగాయి. ఈ సంధికాలాన్ని గూర్చి నవలాకారుడు మాట్లాడే బొమ్మలు నవలలో చక్కగా ప్రస్తావించారు. నిజానికి అదొక విశ్లేషణగా అనిపిస్తుంది.

" 'స్వతంత్ర్యం వచ్చినప్పటినుండీ ఒకే పార్టీ అధికారంలో ఉండటం, నాలుగేళ్ళలో నలుగురు ముఖ్యమంత్రుల మార్పు. ప్రజల అసంతృప్తి. ముఖ్యమంత్రి మారినప్పుడల్లా మత కలహాలు జరగడం పెల్లుబుకుతున్న ప్రజా పోరాటాలు, వీటినన్నటినీ దృష్టిలో పెట్టుకొని కొత్త

రాజకీయ పార్టీని స్థాపించాడు రామారావు. తన గంభీరోపన్యాసాలతో, హావభావాలతో, నటనా వైదుష్యంతో అంతకు ముందున్న పార్టీనెండగట్టాడు. రాష్ట్రమంతటా సుడిగాలిలా పర్యటిస్తూ ప్రజలను ఆకర్షించాడు. 'రైతులే అన్నదాతలు, నేను రైతు బిడ్డనే' అంటూ రైతు బాంధవుడిలా ఉపన్యాసాలు దంచాడు. 'నక్సలైట్లే దేశభక్తులు. వాళ్ళకు నా లాల్ సలామ్' అని చెప్పాడు. 'న్యాయపరమైన సమస్యలపై పోరాటం చేస్తున్న అన్నలకు నా మద్ధతుంటుంది. వాళ్ళను అణచివేస్తున్న ప్రభుత్వ చర్యలను ఖండించండి. వాళ్ళకు నా ఎర్రెర్ర దండాలు' అని తెలంగాణలోని ప్రతి సభలోను చెప్పాడు. ఎన్నికల సమయంలో మరో ప్రభంజనంలా మారుమూల పల్లెల్లో కూడా తిరిగాడు. ప్రజల్లో కొత్త ఆశలను రేకత్తించాడు. మూడున్నర దశాబ్దాలుగా దేశాన్ని పాలిస్తున్న పార్టీని తొమ్మిది నెలల క్రితం వచ్చిన పార్టీ ఓడించి గద్దెనెక్కడం అపూర్వమే" (మల్లయ్య, కాలువ.2001:పుట.288). తెలుగుదేశం పార్టీ ఎలా అధికారంలోకి వచ్చిందో ఇక్కడ వివరించడం, సామాజిక పరిణామాల విశ్లేషణగాను, రచయిత రాజకీయ వ్యాఖ్యానంగాను కనబడతాయి. ఇందులో మరొక విశేషం కూడా ఉన్నది. ఒక రాజకీయ పార్టీ బాహాటంగా విప్లవోద్యమాన్ని సమర్థించడం, విప్లవకారులే నిజమైన దేశభక్తులు అని ప్రకటించడం వారికి మా మద్ధతు ఉంటుందని తెలియజేయడం వీటి ద్వారా అప్పటి విప్లవోద్యమ ప్రాముఖ్యాన్ని తెలియజేస్తాయి. అంటే విప్లవ పార్టీని సమర్థిస్తేనేగాని అధికారంలోకే రాలేని పరిస్థితిని, పోరాటాలను విప్లవోద్యమం చేపట్టినట్లు, దానికి ప్రజల మద్ధతు కూడా ఆ స్థాయిలోనే ఉన్నట్లు తెలుస్తుంది. సమర్థించిన తర్వాత అధికారానికి రావడం కూడా దానినే తెలియజేస్తుంది. రచయిత అనేవాడు ఏదైన ఒక విషయాన్ని చెప్పదల్చుకున్నప్పుడు దాంట్లో స్పష్టత ఉండాలి. స్పష్టత అంటే తాను చెప్పదల్చుకున్న విషయం మీద అనేగాని, అన్నీ విప్పి చెప్పాలనడం కాదు. ఈ సన్నివేశంలో కాలువ మల్లయ్యగారికి చెప్పిన విషయం మీద పూర్తి పట్టుంది. అందుకే ఆయన తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత సంభవించిన పరిణమాలను సంక్షిప్తంగానే అయినా సూటిగా వివరించారు.

"కొత్త పార్టీ రాకతో రాజకీయాలు అందని మ్రానిపండ్లు కావని తేలిపోయింది. ఎన్టీఆర్ ముఖ్యమంత్రి అయిన తర్వాత ఆంధ్రుల ఆత్మగౌరవాన్ని కాపాడుతానని, దేశభాషలందు తెలుగు లెస్సయని, తేనెలొలుకు భాష తెలుగు భాషని, అధికార భాషగా తెలుగును అమలు చేస్తానని గంభీరంగా, ఆకర్షణీయంగా ఉపన్యాసాలిచ్చాడు. తెలుగు భాషా సంస్కృతులను పరిరక్షిస్తానని గంభీరోపన్యాసాలు ఇచ్చాడు. తెలుగు భాషా సంస్కృతులపై ప్రేమాభిమానాలున్నవారికి ఈ మాటలు

కొంతైనా ఊరటనిచ్చాయి. విద్యా సంస్కృతిక రంగాల్లోనైనా కొన్ని మార్పులు వస్తాయని ఆశించారు. ఆ మార్పుల మాటేమో కాని ప్రైవేట్ పాఠశాలల సంఖ్య గణనీయంగా పెరిగిపోయింది. ఎం.సెట్.పై మోజు ఎక్కువైంది. విద్యార్థుల్లో పోటీతత్వం ప్రబలుతోంది. కళాశాలల్లో ఇప్పుడు రాజకీయ చర్చలతోపాటు కెరియరిజంపై మోజు పెరుగుతోంది. నక్సలైట్లే దేశభక్తులని ఎన్నికల ముందు బహిరంగ సభల్లో చెప్పిన వ్యక్తే వాళ్ళపై ఉక్కు పాదాన్ని మోపాడు. 'అన్నలారా! మీరు చేయదలుచుకున్నవన్నీ నేను చేసి చూపెడతాను. మీరు హింస మానుకుని జన జీవన స్రవంతిలో కలవండి. మీకు ఉపాధి చూపిస్తాను' అని ప్రకటనలు ఇచ్చాడు. కొత్తగా అధికారం స్వీకరించిన పార్టీపై ప్రజల ఆశలు... అన్నల కార్యక్రమాలు... పెరుగుతున్న రూపాయి సంస్కృతి... తెలంగాణలో ఎదుగుతున్న మధ్యతరగతి... ఊళ్ళలో వస్తున్న చైతన్యం... అంబేద్కర్ సంఘాల కార్యక్రమాల్లో తెలంగాణ గ్రామాల్లో రకరకాల భావాల మధ్య సంఘర్షణ ఉంది. ఇదో సంధియుగంలా ఉంది" (మల్లయ్య, కాలువ.2001:పుట.283, 284). రాజకీయ పార్టీలు అధికారంలోకి రాకముందు ఎలా ఉంటాయి, వచ్చాక ఎలా ఉంటాయో; వాటి ఊసరవెల్లి స్వభావాల్ని వివరించడం విశేషంగా ఉంది. 'రకరకాల భావాల మధ్య సంఘర్షణ ఉంది' అని చెప్పడం ఆనాటి సామాజిక సంక్లిష్టతను, వైరుధ్యాలను తెలియజేస్తుంది.

### 3.2.3.11. మానవీయ విలువలు:

రచయిత కొత్తగా వస్తున్న పరిస్థితుల వల్ల జరిగిన పరిణామాలను చక్కగా వర్ణించారు. సాంబయ్య సహచరిణి సరస్వతి వారి పిల్లల్ని ఆంగ్ల మాధ్యమంలో చదివించాలని పట్టుబట్టి మాట్లాడిన మాటల్లోను, అయిలయ్య కొడుకు శ్రీనివాస్ సహచరిణి వారి పెళ్లి సందర్భంలో పెట్టిన షరతులలోను, ఆ తరువతా శ్రీనివాస్ ఆలోచనలలోను, ఆ తరువాత అయిలయ్య శ్రీనివాస్ గురించి ఎదురుచూస్తూ కరీంనగర్ బస్టాండులో ఎదురుచూస్తూ ఉన్నప్పుడు ఆయన బావ సాంబయ్యతో జరిపిన సంభాషణలోను, ఇంకా చాలా సందర్భాల్లో మానవీయ విలువల్లో వచ్చిన యాంత్రిక పద్ధతుల గురించి చక్కగా వివరించారు. నవలాంతంలో సాంబయ్య, అయిలయ్యతో ఇలా అంటాడు: " 'అయిలయ్య! త్వరలో మనం ఇరవై ఒకటవ శతాబ్దంలోకి అడుగిడబోతున్నాం. ఈ విధానం ఇలాగే కొనసాగితే మనముండం. మన సంస్కృతుండదు. మన భాషా సాహిత్యాలుండవు. మిగిలేవి తాత్కాలిక సుఖాలు. శూన్యం సైన్సు... ఇంకా... ఇంకా... అవైనా ఎందరికి అందుబాటులో ఉంటాయి?', 'బాగా ఆలోచిస్తే ఇది శ్రీనివాస్ తప్పు మాత్రమే కాదనిపిస్తోంది. అందరిలాగే చేస్తున్నారని కాదుగాని ఈ విధానంలో ఏదో లోపముంది. ఈ చదువులు పరాయీకరణకు

గురిచేస్తున్నాయి. మాట్లాడే బొమ్మలను తయారు చేస్తున్నాయి అయిలయ్య. రేపు నేను నీలాగే ఎదురుచూడాల్సి వస్తుందేమో' సాంబయ్య కంఠం పూడుకుపోయింది" (మల్లయ్య, కాలువ.2001: పుట.327). ఈ సంభాషణ ద్వారా ఆనాడు చదువుకున్నవారిలో ఏర్పడిన నూతన విలువలు, తల్లిదండ్రులపట్ల కొత్తగా ఏర్పరుచుకున్న కృత్రిమ ప్రేమలు మనిషిని ఎలా తయారుచేసాయో తెలియజేశారు. ఎప్పుడైనా కొత్త విలువలకు మధ్య సంఘర్షణ ఉంటుంది. పాత విలువల్లో జీవించే మనుషులకు కొత్త వాతావరణం జీర్ణం చేసుకోవడం చాలా కష్టంగా ఉంటుంది. ఆ పరిస్థితి కొత్త పరిస్థితులకు సమకాలీన సమాజం అలవాటుపడే వరకు కొనసాగుతుంది. అప్పటిదాకా ఈ వైరుధ్యం అలాగే కొనసాగుతుంది. అందుకే అన్ని మాటలు మాట్లాడిన సాంబయ్య కంఠం చివరికి పూడుకుపోయింది.

### 3.2.3.12. ముగింపు:

మాట్లాడే బొమ్మలు నవలలో అనేక సమస్యల్ని, పరిస్థితుల్ని వివరించడం కనిపిస్తుంది. స్థూలంగా ఈ నవల ద్వారా ఆనాడు ఉత్తర తెలంగాణలో ఎమర్జెన్సీ పర్యవసానాల దగ్గరి నుంచి తెలుగుదేశం ప్రభుత్వం పాలన దాకా ఉన్నటువంటి పరిస్థితులను కళ్లకు కట్టినట్లుగా చూపారు. కొత్త ప్రభుత్వాలు, కొత్త పరిస్థితులు మనిషిని ఒక యంత్రంగా చేసి, మానవీయ విలువల స్థానంలో కృత్రిమ సంబంధాలను ప్రతిక్షేపించిన వైనాన్ని తెలియజేశారు. ఏ మనిషి ఆలోచనల మీదనైనా తాను జీవించే సమాజ స్థితిగతుల ప్రభావం ఉంటుంది. ఆ పరిస్థితులకు తాను లోబడే ఆలోచిస్తాడు తప్ప భిన్నంగా ఏమి ఆలోచించడు. ప్రయత్నపూర్వక ఆచరణలో ఉంటే తప్ప అది సాధ్యమయ్యే విషయం కాదు. అందుకే ఈ నవలలో చాలా పాత్రలు వాటికవిగా ఉన్నట్లు కనిపించవు. భిన్నమైన సామాజిక బృందాలకు, భావజాలలకు ప్రాతినిధ్యం వహిస్తున్నట్లు కనిపిస్తాయి. కనిపించని శక్తులు ఏవో నడిపిస్తే నడిచినట్లు అనిపిస్తాయి. అందుకే నవలకు 'మాట్లాడే బొమ్మలు' అని పేరు పెట్టారు.

### 3.2.4. బతుకు పుస్తకం నవల:

'బతుకు పుస్తకం' నవల 2000 సంవత్సరంలో లైఫ్ లైన్ కమ్యూనికేషన్స్, హైదరాబాద్ ప్రచురణల ద్వారా ప్రథమ ముద్రణ పొందింది. ఇది 'ఆటా—వార్త 1999 సంవత్సరం నవలల పోటీ'లో మొదటి బహుమతి కూడా గెలుచుకుంది. స్వాతంత్ర్యానంతర ఐదు దశాబ్దాల తెలంగాణ గ్రామీణ జీవిత పరిణామాల్ని ఈ నవల చిత్రిక పట్టింది.

### 3.2.4.1. నవలా వస్తువు:

భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ప్రణాళికా ఫలితాలు కొద్దికొద్దిగా ప్రజలకు అందుతున్న తరుణం అది. తెలంగాణ ప్రాంతంలో నిజాం నిరంకుశ పాలన అంతమొంది, భూస్వాములు పట్టణాలకు పారిపోయి, తిరిగి కాంగ్రెస్ టోపీ పెట్టుకుని గ్రామాలకు వచ్చి తమ ప్రాబల్యాన్ని తిరిగి పునఃస్థాపించుకున్న కాలం. ఇదే సమయంలో పట్టణ, పారిశ్రామిక నాగరికతకు దూరంగా ఉన్నటువంటి ఒక ఊరిని దొరలు, పట్వారీలు, పోలీస్ పటేలులాంటి చిల్లర దేవుళ్ల జాబితాలో కలవనీయకుండా ప్రజాస్వామ్య పద్ధతిలో కొండలరావు పాలిస్తుంటాడు. ఈయన అగ్రకులానికి చెందినవాడైనప్పటికీ కుల, మత తారతమ్యం లేకుండా ఊరి అభివృద్ధి కోసమే శాయశక్తులా కృషి చేస్తుంటాడు. తను సర్పంచుగా ఎన్నికైనప్పటి నుండి గ్రామంలో స్వాతంత్ర్య, గణతంత్ర వేడుకల్ని ఊరంతా ఏకమై జరుపుకునేట్లు చేస్తాడు. వేడుకలకు అయ్యే ఖర్చులో కొంత మొత్తాన్ని గ్రామ పంచాయితీ నుండి ఇప్పిస్తాడు. ఈ వేడుకల్లో గ్రామస్తులే కాకుండా ఇతర గ్రామాలవారు కూడా పాల్గొంటారు. ఇందులో భాగంగా నాటకాలు వేయడం, కీర్తనలు పాడడం, జానపద గీతాలు, పగటి వేషాలు వేయటం, ఆటల పోటీలు మొదలైన కార్యక్రమాలు నిర్వహించి జాతీయ పండుగల్ని ఘనంగా జరుపుకుంటారు.

ఆ ఊరిలో లసుమయ్య సన్నకారు రైతు. రెడ్డి కులస్తుడు. పెద్దగా ఆస్తిపాస్తులేవీ ఉండవు. వ్యవసాయం ఆధారంగానే కుటుంబాన్ని పోషిస్తుంటాడు. కులమత పట్టింపులేవీ ఉండవు. అందరితో కలిసి ఉంటాడు. భార్య లింగవ్వ, కొడుకులు మల్లేశం, రాజయ్య, కూతురు రాజవ్వలు. వీరి వృత్తి వ్యవసాయం కావడంతో పనులన్నింటినీ కలిసికట్టుగా చేసుకుంటూ సమిష్టి నిర్ణయాలతో ముందుకు సాగుతారు. లసుమయ్య పెద్ద కొడుకు మల్లేశంకు చిన్న వయస్సులోనే పెళ్ళి చేస్తారు. ఊరిలో ఏడవ తరగతి వరకు మాత్రమే ఉండటంతో అక్కడికే చదువు ఆపేసి పూర్తిగా తండ్రితోపాటే వ్యవసాయం చేస్తాడు. చిన్న కొడుకు రాజయ్య చదువుకుంటూ వీలు దొరికినప్పుడల్లా వ్యవసాయపు పనుల్లో తండ్రికి చేదోడువాదోడుగా ఉంటాడు. లసుమయ్య రైతు కావడం కంటే ముందే పాలేరుగా పనిచేసిన అనుభవం ఉంది. అదే వ్యవసాయ పనులను చాకచక్యంగా, సందర్భోచితంగా చేయడం నేర్పింది. ఊరిలో కొంతమంది మాత్రమే పంటలను బావుల ఆధారంగా పండిస్తుంటారు. సగానికంటే ఎక్కువ మంది చెరువు నీటిపైనే ఆధారపడి జీవనం సాగిస్తుంటారు. వ్యవసాయం చేసుకునే వాళ్లతోపాటుగా వివిధ కులాలకు, వృత్తులకు చెందిన వారందరూ చెరువును ఆధారం చేసుకుని జీవనం కొనసాగిస్తారు. చెరువులో నీళ్లు ఉన్న కారణంగా ఊర్లోని అన్ని వృత్తుల వాళ్లకు చేతి నిండా పని

దొరుకుతుంది. దీని మూలంగా ప్రతి సంవత్సరం వచ్చే సంప్రదాయం పండుగల్ని ఆనందంగా జరుపుకుంటారు. పండుగల సమయంలోనే కాకుండా మిగతా సమయాల్లో గ్రామంలోని చాలామంది వస్తు మార్పిడి ద్వారా తమ అవసరాల్ని తీర్చుకుంటారు.

సమాజంలో వస్తున్న మార్పుల ప్రభావం వ్యవసాయం మీద పడుతుంది. దీంతో రైతులు అధిక దిగుబడి కోసం కృత్రిమ ఎరువుల్ని వాడడం మొదలుపెడతారు. ఇది గమనిస్తున్న లసుమయ్య కృత్రిమ ఎరువుల వాడకం వల్ల భూమి నిస్సారమవుతుందని, వాటిని వాడకూడదని కొడుకులకు చెప్తాడు. పెరుగుతున్న జనాభా దృష్ట్యా అవసరాలు తీర్చుకోవడం కోసం ఇలాంటివి తప్పవని వారు తండ్రితో వాదిస్తారు. ఇలాంటివి భవిష్యత్తులో ఇంకెన్ని చూడాల్సి వస్తుందో అని లసుమయ్య వాపోతాడు. ఇదిలా ఉంటే లసుమయ్య, లింగమ్మలు తమ కూతురు రాజవ్వకు పదేళ్లు కూడా నిండకముందే పెళ్లి చేయాలనుకుంటారు. మేనరికం పెళ్లి చేయాలనుకున్న లసుమయ్య, సమయం మించితే ఎక్కడ తన అక్క కొడుక్కి బయట అమ్మాయిని తెచ్చి పెళ్లి చేస్తారేమోనని ఆందోళన చెందుతాడు. కూతురు భారం దింపుకోవడం కోసం పెళ్లి చేసి పంపించాలని నిర్ణయించుకుంటారు. అలాగే ఊరి సర్పంచి కొండలరావు తన కూతురు అంజవ్వను డాక్టర్ కోర్సు చేసేవాడికిచ్చి వివాహం చేయాలనుకుంటాడు. రసజ్వల కూడా కాని అంజవ్వకు పెళ్లి చేయటం కొంతమందికి ఇష్టం లేనప్పటికి కొండలరావుకు ఉన్న పేరు, పలుకుబడి ముందు ఆ విషయాన్ని బయటకు చెప్పలేకపోతారు. పైగా అంతకు పూర్వం ఇంతకంటే చిన్న వయస్సుల్లోనే పెళ్లిలు చేసేవారని, ఇప్పుడు కాస్త నయం అని తమకు తామే సర్ది చెప్పుకుంటారు. ఇవేమీ పట్టించుకోకుండా కొండలరావు మాత్రం తన కూతురు పెళ్లిని అంగరంగ వైభవంగా చేస్తారు. ఈ పెళ్లికి కుల, మత భేదం లేకుండా అన్ని వర్గాల ప్రజల్ని ఆహ్వానిస్తాడు.

ఎండాకాలంలో చెరువు పూర్తిగా ఎండిపోతుంది. బావుల్లోని నీరు పాతాళానికి పోయి వ్యవసాయ పనులు తగ్గుముఖం పడతాయి. ఇదే క్రమంలో పాఠశాలలకు వేసవి సెలవులు ఇవ్వడంతో పిల్లలు చెట్ల నీడల్లో, ఇళ్ల ఆవరణలలో అనేక రకాల ఆటల్లో మునిగిపోయారు. పెద్దవాళ్లు కూడా వేసవి తాపానికి భయపడి బయటికి వచ్చే పరిస్థితి ఉండదు. ఇది ఇలా ఉంటే కొండలరావు ఊరి బాగోగులు తెలుసుకునే క్రమంలో అనేకమంది యువకులు చదువుసంధ్యలు లేక వ్యవసాయ, వ్యవసాయేతర పనులు చేస్తుండడం గమనిస్తాడు. ఎలాగైనా వారందరికీ విద్యను అందుబాటులోకి తేవాలని నిర్ణయించి, అందులో సఫలీకృతుడౌతాడు. ఆర్థికంగా కుటుంబ పరిస్థితులు బాగా

లేకపోయినా, కొండలరావు మాటమీద వాళ్ల పిల్లల్ని చదివించడానికి ఆ ఊరి ప్రజలు ఒప్పుకుంటారు. అటువంటి వాళ్లలో లసుమయ్య, సాంబయ్యలు కూడా ఉంటారు.

ఎండాకాలం పోయి వానకాలం వచ్చేస్తుంది. ఒకరోజు ఎవరూ ఊహించని విధంగా ఎడతెరపిలేని వర్షం కురుస్తుంది. ధారాళంగా కురుస్తున్న వర్షానికి చెరువు నిండు కుండలా మారుతుంది. జోరువానకు కొన్ని ఇళ్లు నేలమట్టమవుతాయి. గాలికి చెట్లు విరిగిపడతాయి. ఎండాకాలంలో ఇళ్లు బాగుచేసుకున్నవారికి కొంత బాగానే ఉన్నప్పటికీ మిగిలినవారికి మాత్రం కంటిమీద కునుకు లేకుండా అయింది. ఈ వర్షం కొంతమందికి ఆనందాన్ని ఇస్తే మరికొంత మందికి విషాదాన్ని మిగిలిస్తుంది. అప్పటి వరకు ఎండలతో ఉడికిపోయిన ఊరు ఒక్కసారిగా చెరువు నిండడంతో ఊరంతా ఆనందం వ్యక్తం చేస్తారు. చెరువులోని నీటి వినియోగం నిలువ ఎన్ని పంటలకు సరిపోతాయనే విషయంతోపాటు నిజాంసాగర్, రామప్ప దేవాలయం గురించి కొండలరావు తన సహచరులతో చెరువు కట్టమీద ఉన్నప్పుడు చర్చిస్తారు. అందివచ్చిన ప్రభుత్వ ఫలాల చర్చ చేస్తారు. భవిష్యత్తులో ప్రజాజీవనం మరింత మెరుగుపడాలని తన సహచరులు ఆశిస్తారు. ఇంతలో చెరువుకు గండిపడి కొన్ని ఎకరాల్లో పంట నాశనం అయిందన్న వార్త కొండలరావుకు చేరుతుంది. ఆనందకర వాతావరణంలో విషాదం చోటుచేసుకుంటుంది. ఇంజనీరు ఇచ్చిన సూచనను పాటించకుండా కాంట్రాక్టర్ చేసిన నిర్వాకం వల్లే ఇలా జరిగిందని అక్కడికొచ్చిన రైతులు వాపోతారు. ఇదంతా గమనించిన కొండలరావు ప్రకృతి వైపరీత్యాలను ఎవరు మాత్రం ఆపగలరని అంటూ, పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం నుండి నష్ట పరిహారం వచ్చేలా చేస్తానని మాటిస్తాడు. ఈ మాటతో నష్టపోయిన రైతులకు కొంత ఉపశమనం కలుగుతుంది. వానలు పడడంతో గ్రామంలో మరుసటి రోజు రైతులందరూ వ్యవసాయ పనుల్లో మునిగిపోతారు. చేతి వృత్తుల వాళ్లకు చేతి నిండా పని దొరుకుతుంది. బావుల్లో పాతాళానికి వెళ్లిన నీళ్లు మళ్లీ అందుబాటులోకి వస్తాయి. ఊరిలోని వ్యవసాయం ఆనందంగా సాగిపోతుంది. ఇదిలా ఉంటే కొండలరావు తన కొడుకు పురుషోత్తమరావుని ప్రయోజకున్ని చేయాలనే తపనతో రాజయ్యతో స్నేహం కలిపి చదువుకోవడానికి పంపిస్తాడు. తనలాగే తన కొడుకు కూడా ప్రజాస్వామ్య భావాలు కలిగి నలుగురికీ సహాయపడాలని ఆశిస్తాడు. కులమత భేదం లేకుండా అందరికీ విద్య అవసరం అని, దానివల్ల అనేక ప్రయోజనాలు చేకూరుతాయనే నమ్మకం ఉన్నటువంటివాడు కావడంవల్ల అనుకున్న విషయాన్ని అచరణలో పెడతాడు. కొండలరావు ఆలోచనలు ఇలా ఉంటే బడికి వెళ్లే పిల్లల్లో కొంతమంది ఉపాధ్యాయులు కుల బీజాలు నాటే ప్రయత్నం చేస్తారు. తరగతిలోని పిల్లల్లో

వారికి తెలియకుండానే కుల విభజన జరుగుతుంది. దీంతో ఒకరికొకరికి మధ్య భేదాభిప్రాయాలు మొదలవుతాయి. పాఠశాలలోని ఉపాధ్యాయులు అగ్రకులస్తులు, ఆస్తి ఉన్నవాళ్ల పిల్లలకే ప్రాధాన్యం ఇస్తారు. జూలై 20, 1969వ సంవత్సరం అమెరికా అంతరిక్ష యాత్రికుడు నీల్ ఆర్మ్ స్ట్రాంగ్ చంద్రుడిపై అడుగుపెడతాడు. ఈ వార్త ప్రపంచాన్ని ఆశ్చర్యానికి గురి చేస్తుంది.

గ్రామంలో మరొకసారి కరువు వస్తుంది. దాంతోపాటే కలరా, టీబీల్లాంటి ప్రాణాంతక వ్యాధులు ప్రబలుతాయి. వీటికితోడు మూఢ నమ్మకాలు, అపరిశుభ్రత పెచ్చుమీరుతాయి. ఇలాంటి సందర్భంలో కొండలరావు వీటిని నిర్మూలించడంలో సఫలమౌతాడు. కాని కరువు విషయంలో ఏం చేయలేకపోతాడు. మొత్తానికి తనవైపు ఎటువంటి లోపం లేకుండా ఏదో ఒక ప్రయత్నం చేస్తూనే ఉంటాడు. ఇదిలా ఉంటే లసుమయ్య తన కొడుకు రాజయ్యతో కరువు గురించి, కాలంలో వస్తున్న మార్పుల గురించి, సామాజిక, ఆర్థిక పరిస్థితుల గురించి, కుటుంబ స్థితిగతుల గురించి, వ్యవసాయం గురించి అనేక విషయాలు మాట్లాడతాడు.

పురుషోత్తం రాజయ్య దగ్గరకు వస్తాడు. రాజయ్య తన మిత్రుడు పురుషోత్తంతో కలిసి వ్యవసాయం చేయడానికి ఇష్టపడతాడు. పురుషోత్తంతో కలిసి యాతం పోయడానికి పొలం దగ్గరికి వెళ్తాడు. ఇదిలా ఉంటే కొండలరావు ఊరి అభివృద్ధిలో భాగంగా పాఠశాల భవన నిర్మాణం, ఊరికి రోడ్డు సౌకర్యం, బస్సు సౌకర్యం ఏర్పాటు గురించి ఊరివాళ్లతో చర్చించి వాటిని సమకూర్చడానికి ప్రయత్నం చేస్తాడు.

కాలంతోపాటు గ్రామంలో అనేక మార్పులు వస్తాయి. పెరుగుతున్న జనాభా కారణంగా నిత్యావసరాలు తీరడం కష్టమై వలసలు పెరుగుతాయి. మెల్లమెల్లగా పట్టణ నాగరికత పల్లెను ఆవహించడం మొదలవుతుంది. తన చుట్టూ వస్తున్న మార్పుల కారణంగా లసుమయ్య పెద్ద కొడుకు మల్లేశం సింగరేణి బొగ్గుబాయిలో పనికి వెళ్తాడు. ఊర్లో కొండలరావు తలచినట్లుగానే ఊరికి పెద్ద రోడ్డు వస్తుంది. బస్సు సౌకర్యం కూడా ఏర్పాటవుతుంది. అది కొంతమందికి నష్టం చేసినా చాలామందికి లాభం చేకూరుస్తుంది. నూతన మార్పుల్లో భాగంగా ఊర్లో ప్లాస్టిక్, రెడీమెడ్ దుస్తుల వాడకం మొదలవుతుంది. కులవృత్తులు విచ్ఛిన్నం కావడం మొదలవుతుంది. నిత్యావసర వస్తువుల ధరలు పెరగడం, పండించిన ధాన్యాలకు గిట్టుబాటు ధర రాకపోవడం మొత్తంగా ఊరిలో పెనుమార్పులు చోటుచేసుకుంటాయి. ఇందులో భాగంగా కులవృత్తుల వాళ్లతోపాటు మిగతా అగ్రకులాల ప్రజలు తమ అస్థిత్వాన్ని నిలుపుకోవడం కోసం ప్రయత్నిస్తుంటారు.

కాలం మారుతున్న కొద్ది పాతవాటి స్థానంలో కొత్తవి ఆక్రమిస్తుంటాయి. పల్లె పిల్లల ఆటలు, కళాకారుల కళారూపాలు కనుమరుగైపోతుంటాయి. సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా పెనుమార్పులు సంభవిస్తాయి. జీవన విధానం మౌలికంగా మారిపోతుంది. చదువులకోసం, ఉద్యోగాల కోసం చాలామంది పల్లె నుండి పట్టణానికి వెళతారు. రైతులు అధిక దిగుబడి కోసం కృత్రిమ ఎరువుల వాడకం, వ్యవసాయంలో యంత్రాల వాడకం పెరుగుతుంది. డబ్బుపై వ్యామోహం వ్యాపిస్తుంది. ఉమ్మడి కుటుంబాలు విచ్ఛిన్నమై మానవ విలువలు పడిపోతుంటాయి. ఒకవైపు ప్రజా ఉద్యమాలు, మరోవైపు ప్రభుత్వ అభివృద్ధి పథకాలు, సుఖాలకు అలవాటుపడే మనస్తత్వాలు పల్లె రూపరేఖల్ని మార్చేస్తాయి. భూస్వాములు సైతం గ్రామాలను వదిలి పట్టణాలకు వెళ్లిపోతారు. ప్రజాస్వామ్య భావాలతో పనిచేసిన కొండలరావుకు ఎన్ని బెదిరింపులు వచ్చిన ఊరిని మాత్రం వదలడానికి ఇష్టపడడు. కాని కాలంతోపాటు వచ్చిన మార్పులు, ఉద్యమాల ప్రభావం అతన్ని ఊరి నుండి వేరు చేస్తాయి. మరోవైపు ప్రపంచీకరణ ప్రభావం గ్రామాల్ని ముంచేస్తుంది. కులవృత్తులు మాయమవుతాయి. వ్యవసాయంలో కృత్రిమ ఎరువులు మాత్రమే వాడుతుంటారు. పట్టణాలకు వలస వెళ్లినవాళ్లలో ఒకరో ఇద్దరో తప్ప ఎవరూ తిరిగి పల్లె ముఖం చూడరు. ఉద్యమాల ప్రభావం, పెరిగిన జనాభా, అవసరాలు, డబ్బు వ్యామోహం, అధికార దాహం, ప్రపంచీకరణ, చదువు, ఉద్యోగాలతో పల్లె ప్రజలు పట్టణాలకు పయనమై ఊర్లు ఖాళీ అవుతుంటాయి. మొత్తంగా సాంఘిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితుల్ని శాసించే దేశానికి పట్టుగొమ్మలైన పల్లెల్ని, పల్లె జీవనాన్ని, అందులో వచ్చిన విధ్వంసాన్ని, మార్పుల్ని కాలువ మల్లయ్య తన 'బతుకు పుస్తకం'లో పొందుపరుస్తాడు.

### 3.2.4.2. వస్తు విశ్లేషణ:

బతుకు పుస్తకం నవల తెలంగాణలోని గ్రామీణ జీవితంలో ఐదు దశాబ్దాలుగా వచ్చిన మార్పుల్ని, అనేక పరిణామాల్ని చిత్రించింది. ఉద్యమాల వల్ల దొరలు, భూస్వాములు గ్రామాలను విడిచి, తిరిగి వచ్చి, పరిపాలనను పునఃస్థాపించడం, తర్వాత కాలం మారడం వల్ల మరల పట్టణాలకు వెళ్లడం, ప్రపంచీకరణ ప్రభావంతో వ్యవసాయంలో అనేక మార్పులు రావడం, ప్రజా జీవన విధానం కూడా పెనుమార్పులకు లోనుకావడం మొదలైన విషయాల్ని సూక్ష్మస్థాయిలో వివరించారు. గ్రామీణ వ్యవస్థలో నిచ్చెన మెట్ల కుల వ్యవస్థ అమలవుతున్న తీరుని సాధికారికంగా వివరించారు. ఈ నవల చెప్పదల్చుకున్న మౌలికమైన విషయాలివి.

### 3.2.4.3. కులం:

గ్రామీణ వ్యవస్థలో కులం ప్రత్యక్షంగాను, చాలా అమానవీయంగానూ అమలు జరపబడే వ్యవస్థగా కనిపిస్తుంది. పట్టణాల్లోలాగా కనిపించకుండా పనిచేయడం అన్నది ఉండదు. వేరువేరు కులాలవాళ్లు అత్తా, మామా, అన్నాచెల్లె అని ఎన్నెన్ని వరుసలు పెట్టి పిలుచుకుంటూ సఖ్యతగా కనిపిస్తున్నా కులం కట్టుబాట్లను పాటించే చోట్ల మాత్రం తప్పక పాటిస్తారు. తక్కువ కులంవారు, ఎక్కువ కులంవారు అనే తేడాను మాటల్లోనూ, చేతల్లోనూ స్పష్టంగానే చూపిస్తారు. అయితే ఈ విషయాన్ని ప్రఖ్యాత చరిత్రకారుడు డి.డి. కోశాంబి చెప్పిన మాటలకు అర్థం చెప్తూ బాలగోపాల్ ఇట్లా అంటారు. "మన దేశ చరిత్రలో వ్యవసాయ విస్తరణ బలప్రయోగం కంటే సామాజిక సంలీనం, సాంస్కృతిక సమ్మేళనాల ద్వారా ఎక్కువ జరిగిందనేది కోశాంబి అవగాహనలో అత్యంత ముఖ్యమైన విషయం. అప్పుడప్పుడు విస్తరణ 'శాంతియుతం'గా జరిగిందని గూడ అంటాడు. అంటే ఆయుధాల ప్రయోగం ఎక్కువగా జరగలేదని అర్థం. ఆటవీకులను మాల మాదిగలుగా లోబరచుకోవడం ప్రశాంతమైన సంలీనం అని అర్థం కాదు. భౌతిక బలప్రయోగం కంటే సామాజిక అణచివేత సాంస్కృతిక ఆధిపత్యాల ద్వారా వ్యవసాయ విస్తరణ ఎక్కువగా జరిగిందని విశదీకరిస్తే అది కోశాంబి విశ్లేషణకు తగిన వివరణ అవుతుంది" (బాలగోపాల్, కె.2009:పుట. 14). ఇవాళ గ్రామాల్లో కనిపించే ఈ వరుసల పిలుపులు వెనుక ఉన్న చారిత్రక కోణాన్ని కోశాంబి మాటల ద్వారా మనం అర్థం చేసుకోవచ్చు. అంతే కాకుండా ఇందులో ఆయన వాడిన మాటల 'సంలీనం' విలువైనది. అగ్రవర్ణాలు కింది కులాల్ని తమ నియంత్రణలో ఉంచుకునే సంలీనం అది. తమ ఉనికికి అవసరమైన భౌతిక శ్రమ చేయగలిగే శక్తుల్ని తమలోనే ఆధిపత్యపు నియంత్రణ కింద కలుపుకున్నారు. కనుక గ్రామాల్లో మనం నేడు చూస్తున్న అవకాశవాద ఐక్యత ఈ చరిత్ర పరిణామమే. "దొరా...! మీరు కరణం కులపోల్లుగద... అంటే బ్రాహ్మండ్లు అన్నట్టేనాయె... పెండ్లిల గొర్లను కొయ్యకుంటేం బోతుంది...? తన అనుమానాన్ని వ్యక్తం చేశాడు రాజవీరు. 'ఆ మాట నిజమేనోయ్ రాజవీరు...! కాని నేను ఊరందరి మనిషిని గదా! అన్ని కులాల వాళ్లు వస్తరు పెండ్లికి... వాళ్ళందరికి బ్రాహ్మల పెండ్లిళ్ళలో పెట్టే పప్పుచారన్నం బెడితే ఎట్లుంటది...? వెలుమలు, రెడ్లు ఇతర కులాలోల్లు గొణుగుతరు గద...! అందుకే మాంసం కూడా వండిస్తున్నా... మా భోజనాలు వేరే... మాంసం తినేవాళ్ళ కోసం వేరేచోట వండించి పెడతా... తప్పదుగదా మరి...!' అన్నాడు కొండలరావు" (మల్లయ్య, కాలువ.2000:పుట.38). అందరికీ భోజనాలు ఉంటాయిగాని

ఒక్క దగ్గర కాదు. భోజనాలు పెట్టడం అనేది సంలీనం చేసుకోవడం అయితే వేరేచోట పెట్టడం ఆధిపత్య నియంత్రణ.

తాను ఊరందరి మనిషినని చెప్పుకునే కొండలరావు, అందరిని సమన్యాయంగా చూస్తానని చెప్పుకునే కొండలరావు, మరి అందరికి ఒకేచోట భోజనం ఎందుకు పెట్టలేదు? ఎవరు తినే తిండి వాళ్లు తింటారుగాని, అందరిని ఒకేచోట కూర్చోబెట్టవచ్చు కదా! కాని అలా చేయలేదు. ఎందుకంటే అగ్రవర్ణాల వాళ్లు దానికి ఒప్పుకోరు. నిజానికి ఉత్పత్తి కులాల వాళ్లు అగ్రవర్ణాల వాళ్లతో కలిసి కూర్చుని తినడానికి ఎటువంటి అభ్యంతరం ఉండదు. అభ్యంతరం ఉన్నవాళ్లు అగ్రవర్ణాలవాళ్లే. ఇక్కడ కొండలరావు వేరువేరు చోట్ల తినే ఏర్పాటుచేసి, అగ్రవర్ణాల ప్రయోజనమే కాపాడుతున్నాడు. అంటే కుల కట్టుబాట్లను నిలిపి ఉంచుతున్నాడు. పైగా "మా భోజనాలు వేరే" అనడంలో ఉద్దేశ్యం కూడా అదే.

చిన్న పిల్లల మనస్సుల్లో కూడా కులం ప్రస్తావన ఎలా నాటుకుపోయిందో, ఆ భావజాలం ఎంత అమానవీయంగా అమలవుతున్నదో పాఠశాలలో జరిగిన సంఘటన ద్వారా రచయిత వర్ణించారు.

"కొట్టుండిరా... కొట్టుండ్రి వాన్ని కొట్టుండ్రి...' కిష్టారెడ్డి పక్కన నిల్చొని అందర్ని కొట్టమంటున్నాడు. అందరూ కొడ్తుంటే తామెందుకు కొట్టకూడదని రాజయ్య, పురుషోత్తమరావు రామయ్యను చెరో రెండు దెబ్బలేసారు. ఇంతలో హాజరు రిజిస్టర్ పట్టుకొని రామచంద్రం సారు ఆ గదిలోకి ప్రవేశించాడు. రామయ్య బట్టలన్నీ నలిగిపోయున్నాయి. వెక్కివెక్కి పడి ఏడుస్తున్నాడతను. సారును చూసి ఏడ్వడమాపాడు. 'ఏమైందిరా... ఏమైంది?... ఎందుకేడుస్తున్నావు...?' అని అడిగాడు సారు. 'మా తరగతోల్లంత కొడుతుండ్రు సార్... వర్తిగనే...' ఏడుస్తూ చెప్పాడు రామయ్య. 'ఏడ్వాపు' గద్దించగానే ఏడ్వడం మానుకున్నాడు. 'ఎందుకు కొట్టారు రామయ్యను?' వాళ్ళంతా తలలు వంచుకున్నారు. 'పురుషోత్తం... నువ్వెందుకు కొట్టావు?' 'అందరూ కొడ్తుంటే నేనూ కొట్టిన...'. 'అసలు విషయం చెప్పారు పిల్లలు. 'అరే కిష్టారెడ్డీ... రామయ్యనెందుకు కొట్టినవురా...?' 'వర్తిగనే కొట్టినసార్...!' 'సరిగ్గ జెప్పు... లేకుంటె బొక్కలిరుగుతయ్...' గద్దరించినట్టన్నాడు. 'వాళ్ళది మనూరి ఏక్కూరు కోనరావుపేట కదా సార్... వాళ్ళూరికి పెండ్లికి పోతే నన్ను కొట్టిండు సార్ రామయ్య... అంతే గాద్సార్... రామయ్య బెస్తకులపోడుగదా సార్...! బెస్తోనికి నాకంటె ఎక్కువ మార్కులొస్తేమన్నట్టు సార్... తనకెక్కువ మార్కులొచ్చినయని మా అమ్మతోని చెప్పిండు సార్. మా

అమ్మ నన్ను కొట్టింది సార్. అందుకే వాన్ని కొట్టిన సార్. కొట్టించిన సార్...' అసలు విషయం చెప్పాడు కిష్టారెడ్డీ" (మల్లయ్య, కాలువ.2000:పుట.91, 92).

ముక్కుపచ్చలారని పసిపిల్లల్లో కులాధిపత్యం ఎలా కనబడుతోంది? దీనికి కారణాలేమిటి అన్నది విశాలంగా అర్థం చేసుకోవాల్సిన అవసరమైన విషయం. ఒక బెస్తవానికి తనకంటే ఎక్కువ మార్కులు రావొద్దని కిష్టారెడ్డి భావన. తన కొడుకు కిష్టారెడ్డి కంటే ఎక్కువ మార్కులు తెచ్చుకున్న 'బెస్తోని' మీద కోపాన్ని కిష్టారెడ్డి మీద చూపిస్తుంది ఆయన తల్లి. ఆమె తనను కొట్టినందుకే ఆ 'బెస్తోన్ని కొట్టానని కిష్టారెడ్డి చెప్పాడు. ఈ విషయాలన్నీ సూక్ష్మంగా అర్థం చేసుకుంటే పిల్లలకు అగ్రకుల భావజాలాన్ని వంటపట్టిస్తున్నదెవరో బోధపడుతుంది. "అగ్రకులంలో జన్మిస్తే గౌరవం, హోదా, ఆధిపత్యం, ఇతర అవకాశాలు వారసత్వంగా చేరతాయి. కింది కులంలో జన్మిస్తే అవమానం, అంటరానితనం, పేదరికం వారసత్వంగా రుద్దబడతాయి. పిల్లల బాల్యంతో సంబంధం లేకుండానే, అగ్రకులంలో పుట్టిన బిడ్డలు నీతిగా, నిజాయితీగా ఉంటారని, అబద్ధాలు ఆడరని, దొంగతనాలు చేయరని, తెలివిగా, శుభ్రంగా ఉంటారని సహజంగా భావిస్తారు. క్రింది కులంలో పుట్టిన బిడ్డలు నిజాయితీగా ఉండరని, అబద్దాలు ఆడతారని, దొంగతనాలు చేస్తారని, తెలివి తక్కువగా ఉంటారని, మురికిగా ఉంటారని సహజంగా భావిస్తారు. పిల్లల పట్ల కులం నుండి ఏర్పడే ఈ అసమాన భావన పాఠశాలలోను, సమాజంలోను కనిపిస్తుంది. విద్యార్థులు ఈ అసమాన పరిస్థితుల, భావాల మధ్య పెరుగుతూ వాటి ప్రభావానికి గురవుతూ ఉంటారు. కుల సంప్రదాయాల గురించి, కుల కట్టుబాట్ల గురించి, అంటరానితనం గురించి, అంటే కుల భావజాలం హిందూమత సాహిత్యం ద్వారా, మీడియా ద్వారా, విద్యార్థికి చేరే అవకాశాలున్నాయి. పాలక వర్గాల, సామ్రాజ్యవాదుల అండతో హిందూమత ధర్మ సంస్థలు, పీఠాలు దేశవ్యాప్తంగా కోట్ల రూపాయల ఖర్చుతో చేపట్టే ప్రచారం ద్వారా కుల భావజాలం విద్యార్థులకు చేరే అవకాశాలున్నాయి. అన్నిటికీ మించి కులం విషయంలో పిల్లలకు శిక్షణ ఇవ్వడంలో నేడు కుటుంబానికి మించిన వ్యవస్థ లేదు" (సాగర్, సి.ఎస్.2006:పుట.24, 25). కనుక పిల్లల్లో కులపరమైన భేదాలు నింపేది తల్లిదండ్రులే. అది వారి ఆచరణ ద్వారా కావచ్చు, ఆలోచనల ద్వారా కావచ్చు, బోధనల ద్వారా కావచ్చు. నిజానికి ఇక్కడ కిష్టారెడ్డి తన తల్లికి ఉన్న కుల స్వభావాన్ని చెప్పకనే చెప్పాడు. అంటే రెడ్డి కులం వాడి కంటే బెస్తోడు కింద ఉండాలి. అలా ఉండనందుకు రామయ్యను కిష్టారెడ్డి కొట్టాడు, కొట్టించాడు. నిజానికి పాఠశాలల్లో ఇలాంటివి రోజుకు పదుల సంఖ్యలో కనిపిస్తాయి. కాని చాలామంది ఉపాధ్యాయులు చూసీ చూడనట్లు వదిలేస్తారు. ఎందుకంటే అది 'వ్యవస్థాగతం' కాబట్టి, అవి పిల్లల

స్వీయాభిప్రాయాలు కావు కాబట్టి. కొద్దిమంది అగ్రవర్ణ ఉపాధ్యాయులైతే నేరుగా కులం ఉండాలని ఉచ్ఛనీచాలు తప్పవని బోధిస్తారు.

పాఠం చెప్పడంలోను తమ కులాధిపత్యాన్ని కాపాడుకునే ప్రయత్నం చేస్తారు. బతుకు పుస్తకం నవల అటువంటి విషయాన్ని కూడా చెప్పింది. **“రంతి దేవుడి పాఠం చెబుతున్నాడు సారు. అతని దాన గుణం గూర్చి వర్ణిస్తున్నాడు. హీనుడు చంఢాలుండను మానవ కులనాథ దప్పిమానదు. యవలంబోనేర నీ జిక్కిన... పానీయము నాకు బోసి బతికింపగదే...!** పద్యం చదివాడు సారు. ‘చండాలురంటే ఎవరు సారు...?’ అడిగాడు రాజయ్య. ఆ ప్రశ్నకు జవాబు చెప్పడం అంత సులభం కాదన్న విషయం తెలుసు శర్మగారికి. అయితే అతనికి కులవిభజనపై స్పష్టమైన అభిప్రాయాలే ఉన్నాయి. కులాలు భగవంతునిచే సృష్టింపపడ్డాయనే చెబుతాడు శర్మ. ‘బ్రాహ్మణులు బ్రహ్మముఖం నుండి పుట్టారు. చెప్పులు కుట్టడం, డప్పు కొట్టడం, వీళ్ళే పంచములు...’ తన అభిప్రాయాన్ని నిస్సంకోచంగా చెప్పాడు శర్మ. ‘మరి వాళ్ళు ఎక్కన్నుంచి పుట్టారు సార్...!’ ‘ఊర్కొండి... మీకివన్నీ ఎందుకు...?’ వాళ్ళను బెదిరించి నోళ్ళు మూయించాడు” (మల్లయ్య, కాలువ.2000:పుట.94). శర్మ అనే ఉపాధ్యాయుడు కులం గురించి విద్యార్థులకు బోధించేది ఇది. పిల్లలకు, భావి భారత పౌరులకు ఇటువంటి కులభేదాలు తప్పక పాటించాలని చెప్తున్నాడు. ఇది ఒక తరగతి గదిలో జరిగిన తంతు. పక్క తరగతిలో ఇంకో స్థితి. “అరే బుకోడా...? నీకొక్క అక్షరం ముక్కన్నరాదు.... బుకమ్ముకోని బతుకక ఎందుకురా బడికొస్తున్నావు...’ అని మోటు మాటలు తిడుతున్నాడు రాజిరెడ్డి. అరేయ్ శంకరిగా... నీకెందుకురా చదువు? చప్పుడుజేక రొండు దున్నపోతుల కొనుక్కొని చెరువెనుక దున్నుకోక బడికొస్తున్నావుర...? పిల్లనిష్టమున్నట్టు తిడ్తున్నాడు రాజిరెడ్డి సారు” (మల్లయ్య, కాలువ.2000:పుట. 94). ఈ మాట్లలోను ఉపాధ్యాయుడి కుల అహంకారమున్నది. ఇక్కడ రెండు విషయాలు కీలకమైనవిగా గ్రహించాలి. మొదటి ఉపాధ్యాయుడు బ్రాహ్మణుడు, రెండవవాడు రెడ్డి. బ్రాహ్మణుడు కుల అహంకారాన్ని చాలా మృదువుగా అమలు జరుపుతున్నాడు. రెడ్డి కులస్తుడు మాత్రం తన అహంకారాన్ని బాహటంగానే చూపెడుతున్నాడు. సమాజంలో చూసినప్పుడు ఇది అంతటా కనిపించే విషయమే. బ్రాహ్మణులు భావజాల రంగంలో దాడి చేస్తే, రెడ్లు భౌతికంగా దాడి చేస్తారు. ఇది వర్తమాన చరిత్రలో అందరికీ పరిచయమైన విషయమే. రాజారెడ్డి సార్ చెప్పేదాంట్లో స్పష్టంగా మనువు బోధించిన విషయం కనబడుతోంది. అగ్రవర్ణాల వాళ్లు మేధావులు, చింతనాపరులు, వాళ్లు కూచోని తినాలి, ఆ తినే తిండిని నిమ్నవర్ణాల వాళ్లు ఉత్పత్తి చేయాలి. అంటే జ్ఞానం అగ్రవర్ణాలకు మాత్రమే అందదగినదిగాని నిమ్న వర్ణాలకు కాదు.

అందుకే చదువుకోవడానికి వచ్చిన బుకోడిని, శంకరయ్యను పని చేసుకోపొండి అంటున్నాడు. అంటే మీకు చదువు (జ్ఞానం) అవసరం లేదని, అది మీకు అంటరానిదని అంటున్నాడు. ఇక్కడ నవలా రచయిత భాష విషయంలో చాలా జాగ్రత్తగా ఉన్నాడు. అందుకే పదాలను వాడేటప్పుడు, పాత్రల పేర్లను ఎన్నుకునేటప్పుడు సామాజిక వాస్తవికతను ఎరుకలో ఉంచుకున్నాడు. కాల్పనిక సాహిత్యం అంటే కేవలం కల్పన కాదు, అది వాస్తవికతను మరింత వాస్తవికంగా చెప్పడం కోసం కల్పనను ఉపయోగించుకుంటుంది. ఇది ఈ నవలలో స్పష్టంగా రుజువైంది.

ఇంకా ఈ నవలలో చాలాచోట్ల చాలా ప్రధానంగా కుల అసమానతల గురించి రచయిత చిత్రించారు. అన్ని చోట్ల కల్పన కంటే ఎక్కువ మనచుట్టూ ఉన్న వాస్తవికతే గోచరిస్తుంది.

### 3.2.4.4. వలసలు:

తెలంగాణ వ్యాప్తంగా వలసలు కనిపిస్తాయి. ఆ వలసలకు కారణం ఉన్న ఊర్లో బ్రతుకుదెరువు లేకపోవడం. ఒకవేళ ఉన్న అది తమ కుటుంబం మొత్తానికి సరిపోకపోవడం కుటుంబం గడవాలంటే ఆ కుటుంబంలో శ్రమ చేయగలిగిన మనుషులందరూ ఏదో ఒక బ్రతుకుదెరువు దొరికే ప్రాంతానికి వలస వెళ్లిపోతారు. పండుగలకో, చావులకో తప్ప జీవితమంతా వలస వెళ్లినచోటే కాలం వెళ్లదీస్తారు. తెలంగాణ అంతటా ఈ పరిస్థితి ఉన్నది. “రోజురోజుకు తరిగిపోతున్న జీవనాధారాలు ప్రజలను అనివార్యంగా వలసపోవడానికి పురిగొల్పుతున్నాయి. ఉత్తర తెలంగాణ జిల్లాల నుండి ప్రజలు బొంబాయి, భివాండి, మాలేగావ్, సూరత్ వంటి నగరాలకు, దుబాయ్, మస్కట్, సౌదీ అరేబియా వంటి గల్ఫ్ దేశాలకు బతుకుదెరువు కోసం వలసపోతున్నారు. దక్షిణ తెలంగాణ జిల్లాల్లో ప్రజలు ముఖ్యంగా మహబూబ్ నగర్ జిల్లా నుంచి కూలీలుగా ఆంధ్రప్రదేశ్ లోని ఇతర జిల్లాలకే కాకుండా కాశ్మీర్ నుండి కన్యాకుమారి దాకా దేశదేశాలకు ఇంత కూడు కోసం వలస పోతున్నారు” (శ్రీధరరావు, దేశ్ పాండే.2008:పుట.85). ఈ సంభాషణను ఉదాహరణగా చెప్పవచ్చు. “అవ్వా... వ్యవసాయంల మనకు కూలి కూడా పడటం లేదు. అట్లని మనకున్నది పెద్ద వ్యవసాయం కాదు. దాన్నే నేనూ చేసుకుంట ఎంత కాలముండాలి. ఎదుగూ బొదుగూ లేని జీవితం బతకడం నాకిష్టం లేదు. వ్యవసాయంలో ఇంటి వాళ్ళంతా కలిసి పనిచేస్తే ఎంత కూలి పడ్తుందో బావి పనిలో నేనొక్కన్ని పని చేస్తే అంతకంటే ఎక్కువ పడుతుంది. కష్టమో, నిష్టూరమో మన కుటుంబం కోసం నన్ను ఈ పనికి పోనియ్యండ్రి... ప్రతిదానికి అడ్డు తలుగకుండ్రి” (మల్లయ్య, కాలువ.2000:పుట.139).

కన్న ఊరిలో ఉపాధి అవకాశాలు దొరికి ఇంత కూడు దొరికితే వలస వెళ్లాలని ఎవరికి ఉండదు. వలస వెళ్లడమంటే కేవలం ఊరినే వదిలి వెళ్లడం కాదు. కుటుంబాన్ని, ఆప్యాయతల్ని, పుట్టి పెరిగిన క్రమంలో ఏర్పడే అనేకానేక మానవ సంబంధాల్ని తెంచుకుని అపరిచిత ప్రాంతానికి వెళ్లడం. ఇది అనుభవిస్తే గాని అర్థం కానంత సున్నితమైన, గాఢమైన విషయం. కాని తప్పదు, బతుకు గడవాలంటే, భూమి మీద మిగిలి ఉండాలంటే వలస వెళ్లక తప్పదు. తెలంగాణ వ్యాప్తంగా కనిపించే ఈ వలస జీవితాల్ని బతుకు పుస్తకం నవలలో చాలా చోట్ల ప్రధానం చేసి చెప్పారు.

### 3.2.4.5. కృత్రిమ ఎరువుల వాడకం:

మనిషి సారవంతమైన నేల ఉన్నంత కాలం సహజమైన పద్ధతుల్లోనే వ్యవసాయం చేశాడు. కాని ఆధునిక కాలంలో ఇది సాధ్యం కావడం లేదు. సాగు భూమి తగ్గింది. భూమి ఉన్న చోట కూడా నీరు లేదు. ఉన్న భూమిలోనే అదును, పదును దొరికినప్పుడు వీలైనంత ఎక్కువ పంట తీయాలి. ఇదొక అనివార్యత. తర్వాత భూమి ఏమైపోతుంది, తాము ఎట్లా బతుకుదామనే ముందుచూపును కూడా కలిగించలేని దుర్భాగ్య స్థితి. కనుక రైతులు ప్రత్యామ్నాయం లేని స్థితిలో భూమిని నిస్సారం చేసే కృత్రిమ ఎరువుల వాడకం మొదలుపెట్టారు. ఈ పరిణామాన్ని బతుకు పుస్తకం నవల స్పష్టంగా అర్థం చేయించే ప్రయత్నం చేసింది.

"ఇంకో పదిహేను రోజులవుతుంది. ఈ యేడు పంట మంచిగనే పండేట్టుంది. వేసంగి వరిపంట బరకతుంటదనిపిస్తుంది. 'ఎరువులేసినంగద... పండకుంటేం జేస్తది...' అంది లింగమ్మ. 'చీపురు దుమ్ముపెంట, గొర్రెరువు, పందెరువు, పశువుల పేడలాంటివి కాక యూరియాలు, అమ్మోనియాలు తెచ్చి వేయబట్టె. గిట్ల మందులేస్తే మంచిదేనా...? ఎన్నడులేని మందుల వాడకం మొదలైంది' కదు బాపూ! జనాభా పెరిగినట్టే భూమేమి పెరుగదు గద...? ఉన్న భూమిలో అందరికి సరిపోయే పంట పండించాలంటే కొత్త కొత్త ఎరువులు వేయక తప్పదు బాపూ...!' చిన్నవాడే అయినా మల్లేశం అంత తార్కికంగా మాట్లాడటం లసుమయ్యకు ఆశ్చర్యం కలిగించింది. అవు బిడ్డా నువ్వన్నమాట నిజమే కాని బాగ మందులు వాడితే భూమి పాడైతదేమోనని భయం. రోజుకో బంగారు గుడ్డును పెట్టే బాతు లాంటిది భూమి... బంగారమంత ఒక్కసారే తీసుకుందామని బాతును కోసినట్టు బాగా మందులేసి భూమి సారాన్ని గుంజుతరేమోనని భయం. ఇప్పటివరకైతే భూమి పాడుగాకుండా పంటలు పండిస్తున్నం..." (మల్లయ్య, కాలువ.2000:పుట.25).

ఇది కృత్రిమ ఎరువుల వాడకం అప్పుడప్పుడే మొదలైన కాలంలో వ్యవసాయంలో బాగా పండిపోయిన పెద్దలు చెప్పిన మాట. ఒక్కసారే ఎక్కువ పంట తీసినా, ఆ తర్వాత భూమి పాడైపోయి

దిగుబడి ఏమాత్రం రాదని పెద్దవాళ్లకు తెలుసు. కాని తర్వాతి తరాల ఆలోచన దృక్పథమే వేరు. మారిన సామాజిక పరిస్థితుల కారణంగా కొత్త తరాలు ఏదైన తొందరగా అయిపోవాలనే ఆతృత కలిగినవి. తర్వాత ఏమైనా ఫరవాలేదుగాని, ప్రస్తుతానికి మంచిగుంటే సరి! ఈ వైఖరి అన్నిచోట్ల అభివృద్ధి చెందింది. ఈ రెండు భావనలకు తండ్రీ కొడుకులిద్దరు ఇక్కడ ప్రాతినిధ్యం వహించారు. కాలం గడిచే కొద్దీ కొడుకు మాట వట్టిపోయింది, తండ్రి మాటనే నిజమైంది. పెద్దల మాటలన్ని ఇవాల్టి సమాజం అందుకే గుర్తు చేసుకుంటుంది. కాలం గడిచాక, నవలలో చివరికి పోయాక జరిగిన విధ్వంసాన్ని రచయిత చిత్రించారు. "కొన్ని విషయాలు చెబితే మీరాశ్చర్యపోతారు నాన్నా...! తల్లిపాలలో కూడా డి.డి.టి. ఉందని పరిశోధనలో తేలింది. చివరకు ఆపిల్ పళ్లలోను మందుల అవశేషాలుంటున్నాయి. అంటే మందులను మనమెంత విపరీతంగా వాడుతున్నామో అర్థమైంది కదా...! మందులేని తిండే లేదన్నంత ఘోరంగా తయారైంది. విపరీత పరిణామాలను గుర్తించారు కాబట్టే రసాయనిక ఎరువులను, పురుగు మందులను కొంత తగ్గించమని ప్రచారం చేస్తున్నారు. మందు అలవాటు చేసి ఆ తర్వాత తగ్గించమనడం చేతులు కాలిన తర్వాత ఆకులు పట్టుకోవడంలాంటిదే" (మల్లయ్య, కాలువ.2000:పుట.339).

నిజంగా తల్లిపాలు కూడా విషపూరితం కావడం ఎంత విషాదం. ఈ మధ్య కొబ్బరి బోండాల్లో కూడా రసాయనాలు వస్తున్నాయని ప్రసార మాధ్యమాల్లో కనిపిస్తున్నది. పంట త్వరగా రావడం కోసం కొబ్బరి చెట్టు తల్లివేరుకు మోనోక్రోటోఫస్ ద్రావణాన్ని నింపిన పాలిథిన్ కవరును కడుతున్నారు. ఆ తల్లివేరు రసాయనాన్ని తాగి, అతి తక్కువ కాలంలోనే అధిక దిగుబడి ఇస్తోంది. కాని ఆ కొబ్బరి బోండాం నీళ్లలో మాత్రం ఎక్కువ మోతాదులోనే విషపూరితమైన రసాయనాలు ఉంటున్నాయి. అంటే సహజంగా ప్రకృతి మనిషికి ఇచ్చే ఆహారంలో మనమే విషం కలుపుకుంటున్నాం, మన భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నాం అన్న మాట. రచయిత ఈ 'కృత్రిమ ఎరువుల వాడకం, పర్యవసానాలు' అన్న విషయాన్ని నవలలో చాలా చోట్ల ప్రభావవంతంగా చిత్రించారు.

### 3.2.4.6. ప్రపంచీకరణ ప్రభావం:

చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో తొలిసారిగా ప్రపంచీకరణ అమలులోకి వచ్చింది. అది కూడా తెలంగాణను ప్రయోగశాలగా మార్చుకుంది. దానివలన ప్రపంచీకరణ పర్యవసానాలు తెలంగాణలోనే ఎక్కువ కనిపించాయి. అటు వ్యవసాయంతో పాటు

కులవృత్తులు ధ్వంసమైన కులాల వారు రోడ్డున పడ్డారు. చాలామంది ఆత్మహత్యలు చేసుకున్నారు. ఈ సామాజిక స్థితిని రచయిత పట్టుకున్నాడు.

"పంతులు...! మీకీ నడుస్తున్న వ్యవస్థ మీద విపరీతమైన నమ్మకం. రేపు ట్రాక్టర్లు గట్ర వస్తాయి... వ్యవసాయం బాగుపడుతుందా...? అవన్నీ వచ్చాయి నిజమే... కాని వాటివల్ల ఉపాధి కోల్పోతున్న వాళ్ళు ఎంతో మందున్నారు. ప్లాస్టిక్ వాడకం పెరిగిందా? మరి మన ఊళ్ళో మునుపటంత మంది కుమ్మరి వాళ్ళు మట్టి పాత్రలు చేసి బతుకుతున్నారా...? ఇంతకుముందు మన ఊరి వాళ్ళంతా మాదిగవాళ్ళు చేసిన చెప్పులనే వాడుకునేవారు. మరిప్పుడు? చాలామంది కరీంనగర్ల దుకాండ్లలో కొనుక్కొచ్చుకుంటున్నారు...! చెప్పులు చేసేవాళ్ళు తక్కువయ్యారా లేదా...? చాకలోల్ల పల్లకీలు చాలావరకు మూలకు పడ్డాయి... మరి వీళ్ళంతా ఏం చేసి బతకాలి పంతులు...? అందుకే అభివృద్ధి చెందినట్టు కనబడినా ఊర్నొదిలిపోవడం ఎక్కువైంది యువకుడైన రవీందర్ రెడ్డి విశ్లేషణకు ఆశ్చర్యపోయాడు కొండలరావు" (మల్లయ్య, కాలువ.2000:పుట.226).

ఈ మాటల్లో ఒక కీలకమైన విషయం చెప్పారు రచయిత. ప్రపంచమంతా కుగ్రామం అయిపోయి అన్ని సేవలు అందరికి అందుబాటులోకి వచ్చినప్పుడు అది అభివృద్ధే కదా అని అందరూ అనుకుంటారు. కాని వాస్తవంలో అది అలా ఉండదు. వేలాది మనుషుల స్థానంలో పదుల సంఖ్యలో యంత్రాలు వస్తాయి. యంత్రం రావడం తప్పు కాదుగాని, ఉపాధి కోల్పోయినవాళ్లకు ప్రత్యామ్నాయం ఉన్నప్పుడు, కల్పించినప్పుడు కాని ప్రత్యామ్నాయాలేవి లేకుండా కేవలం యంత్రాలను ప్రవేశపెట్టడం బతుకు మీద కొట్టడమే అవుతుంది. అది ప్రపంచీకరణ చేసింది.

వ్యవసాయ రంగంలో ప్రపంచీకరణ తీసుకొచ్చిన మార్పుల వల్ల చాలామంది ప్రాణాలు కోల్పోయారు. ఆ విషయాన్ని నవలాకారుడు చిత్రించాడు "వ్యాపార మాయలో పడ్డాడు రామయ్య. వ్యాపారపు పంట మాయలో పడ్డాడు. డబ్బు మాయలో పడ్డాడు. అందులోని ఒడిదొడుకుల గూర్చి తెలుసుకోకుండానే మిడిమిడి జ్ఞానంతోనే రంగంలోకి దిగాడు. త్వరగానే లక్షాధికారి కావాలనుకున్నాడు. ఉన్న నాలుగెకరాల భూమిలో పత్తి వేయాలని నిర్ణయించుకున్నాడు. తండ్రి చెప్పినా ఎవరు చెప్పినా వినదలుచుకోలేదు. భూమిని పొతం జేశాడు. తన ఒక్కడివల్ల కాకుంటే కిరాయి నాగండ్లను పెట్టి భూమిని సాగు చేశాడు. విత్తనాలు కొన్నాడు. వాటి శుద్ధి కోసం మందులు, నాటడం, కలుపుకు డబ్బులు, డబ్బులు, డబ్బులు అవి పెరుగుతున్న కొద్ది విలువైన మందులు, పురుగు మందులు, తెగుళ్ళకు మందులు, విపరీతంగా మందులు వాడాడు. బాగా మందులు వాడితే బాగా పంట వస్తుందనుకున్నాడు. వేయి, రెండు వేలు అప్పు చేయడానికే భయపడే రామయ్య లక్ష

రూపాయలు అప్పు చేశాడు. ఆ లక్ష రూపాయలు ఆ భూమిపాలే చేశాడు. ఆ పంటపాలే చేశాడు. ఆ పంట ద్వారా రెండు లక్షలు వస్తాయనుకున్నాడు. కాని అతని ఊహ తలకిందులైంది. అతని వ్యవసాయం లాటరీ అయ్యింది. అతడు కొన్న టికెట్ వృధా అయింది. అయితే ఆ టికెట్ విలువ ఒకటి, రెండు రూపాయలు కాదు లక్ష రూపాయలు. రామయ్య పత్తి పంట వేయడమనే జూదమాడాడు. అయితే అందులోని మెలకువలేం తెలియకుండా ఆడాడు. జోకరును ఎలా ఉపయోగించుకోవాలో తెలియకున్నా జూదమాడాడు. తెలిసి ఆడుతున్నవాళ్ళే ఓడిపోతుంటే రామయ్యెలా గెలుస్తాడు? రామయ్య జూదంలో ఓడిపోయాడు. పంట వచ్చే సమయానికి విపరీతంగా తెగులు, పంటను ధ్వంసం చేసే తెగులు. పంట దిగుబడి పూర్తిగా తగ్గింది. దానికితోడు ధర తగ్గింది. అరవై వేలు అప్పు రామయ్య పరమైంది. అప్పు చేయడానికి భయపడే రామయ్యకు భారీ అప్పు స్వంతమైంది. రామయ్యకు భూమిని అమ్మి అప్పు తీర్చాలంటే మనసొప్పలేదు. తన పిల్లలను, భూమిలేని వాళ్ళుగా చేయడం ఇష్టం లేదు. ఎన్నో విధాలుగా గడ్డం రామయ్య ఆలోచించాడు. తన అప్పుకు పరిష్కారం చావే అనుకున్నాడు. తనను తాను కడతేర్చుకోవడమే అనుకున్నాడు. ఇతర కొంతమంది రైతులు ఎన్నుకున్న మార్గాన్నే ఎన్నుకున్నాడు. పురుగులను చంపడానికి వేసే మందును తాగాడు. ఆ మందు పురుగులను చంపిందో లేదో కాని రామయ్యను మాత్రం చంపి ఊర్కుంది. ఆ మందులు భూమిని భూమి కాకుండా చేసినట్టే రామయ్యను ప్రాణాలు లేకుండా చేశాయి. మందులు కొనడానికి అప్పులు చేసిన రామయ్య ఆ మందు తాగే ప్రాణాలు వదిలాడు... రామయ్య వ్యాపారమనే కుట్రకు బలయ్యాడు" (మల్లయ్య, కాలువ.2000:పుట.310, 311). ఈ విధంగా నవలలో ప్రస్తావించిన రామయ్య కేవలం ఓ కల్పిత పాత్ర కావచ్చుగాని అందుకు పునాది అయిన తెలంగాణ పల్లెల్లో వేలాదిమంది రామయ్యలు చనిపోయారు. తమకు అలవాటు లేని వ్యవసాయ విధానాలను నూతన సరళీకృత ఆర్థిక విధానాలు అలవాటు చేశాయి. సాంప్రదాయక పద్ధతుల్లోనే తరాల తరబడి వ్యవసాయం చేస్తూ వస్తున్న రైతులకు నూతన వ్యవసాయ పద్ధతుల పట్ల అవగాహన కల్పించకుండా కేవలం వారికి ఊరించే పంటల రాబడిని, మిగులును ఎరగా వేస్తున్నారు. దాంతో వాస్తవంలోకి వచ్చినప్పుడు రైతులకు నూతన పరిస్థితులు అర్థం కాక, కష్టపడి పండించిన పంటల్లో దిగుబడి రాక, రాబడి రాక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. నిజానికి ఈ హత్యలన్ని రైతులను ప్రపంచీకరణ చేసిన హత్యలుగా చూడాలని ఈ నవల ప్రతిపాదిస్తున్నది.

### 3.2.4.7. పల్లె పట్నానికి తరలిపోవటం:

ఒకవైపు వ్యవసాయం సంక్షోభంలో చిక్కుకుంది. కొద్దో గొప్పో చదువున్న వాళ్లు గ్రామాల్లో ఉండడం లేదు. మరికొందరు ఉపాధి వెతుక్కుంటూ పట్టణాలకు వెళ్లిపోతున్నారు. మరికొందరు వలస వెళ్లిపోతున్నారు. మొత్తంగా ఊరు ఖాళీ అయిపోతున్నది. ఈ స్థితిని రచయిత కళ్లకు కట్టినట్లు వివరించారు. "మార్పులు... ఎన్నో మార్పులు... మంచికో చెడుకో తెలియని మార్పులు... గ్లోబలైజేషన్... హైటెక్ మార్పులు... కంప్యూటరైజేషన్... ఈ మార్పులన్ని ఎంతో కొంత పల్లె మీద ప్రభావాన్ని చూపుతూనే ఉన్నాయి. చాలా కుటుంబాలు చెల్లాచెదురై పోతున్నాయి. చిల్లర గత్తురమై పోతున్నట్లు ఎవరెక్కడ బతుకుతున్నారో తెలియనట్టు ఊళ్ళోదిలి పోవడం చేస్తున్నారు. చదువు పేరు మీద కొందరు, చదువుకొని ఉద్యోగం పేరు మీద కొందరు, బతుకుదెరువు పేరు మీద కొందరు, సుఖాల పేరు మీద కొందరు, పట్టణంలో ఉందామని కొందరు, అనేక కారణాల వల్ల ఊళ్ళొదిలి పోతూనే ఉన్నారు. ఉద్యమాలు ఉధృతమైనట్టనిపిస్తున్నా అవి ఒకర్నొకరు నిర్మూలించకోవడంగా మారినా ఇదివరకు ఊళ్ళొదిలిన మాజీ దొరలు, సంపన్నులు ఊళ్ళలోకి రావడానికి సిద్ధంగా లేరు. ఎంతో మందికి ఇది మా ఊరు అని చెప్పుకోవడానికి గుర్తులు కూడా మిగులకుండా అవుతున్నాయి" (మల్లయ్య, కాలువ.2000:పుట.353). అనివార్యతే మనిషిని పట్టణాల వైపు నడిపిస్తున్నదని ఈ నవల మనకు చెప్తుంది.

### 3.2.4.8. ముగింపు:

పెట్టుబడులు కేంద్రీకృతం కావడం, కేవలం పట్టణాల్లోనే ఆర్థిక అవకాశాలు అందుబాటులో ఉండడం, చదువుకున్నవారికి పట్టణాల్లో మాత్రమే ఉపాధి అవకాశాలు దొరుకుతుండడం, మరోవైపు 'వలసలు' వీటన్నింటి వలన గ్రామాలు ఖాళీ అయ్యే పరిస్థితి నెలకొన్నది. ఈ విషయం మామూలు సందర్భాల్లో అర్థం కాదుగాని, ఒకటీ రెండు దశాబ్దాలకు ముందు పండుగలప్పుడు ఊర్లకు వచ్చే జనాల సంఖ్యను, నేడు ఊర్లకు పండుగలకు వస్తున్న జనాల సంఖ్యను చూస్తే చాలా స్పష్టంగా బోధ పడుతుంది. ఈ పరిణామాలని బతుకు పుస్తకం నవల పూసగుచ్చినట్లుగా వివరిస్తుంది.

### 3.2.5. డబ్బు మైనస్ తృప్తి = దుఃఖం (లేదా) డబ్బు – తృప్తి = దుఃఖం నవల:

ఈ నవల స్వాతి సచిత్ర మాసపత్రికలో 2002వ సంవత్సరం ఆగస్ట్ నెలలో ప్రచురింపబడింది. మధ్యతరగతి కుటుంబానికి చెందినవారు డబ్బు సంపాదనే మార్గంగా ఎంచుకొని వారి బతుకుల్లో సుఖం, తృప్తి లేకుండా దుఃఖమవుతున్న వైనాన్ని ఈ నవల చిత్రించింది.

మధ్యతరగతివారు డబ్బును సంపాదించాలనే లక్ష్యంతో షేర్లు, ఫైనాన్స్ లలో పెట్టుబడులు పెట్టి మోసపోతూ, వారు జీవితాన్ని ఎలా దుఃఖమయం చేసుకుంటున్నారో ఈ నవల తెలియజేస్తుంది.

### 3.2.5.1. నవలా వస్తువు:

శివయ్య చిన్నతనంలో తండ్రి మరణించడంతో తల్లి సుమిత్రమ్మ పెంపకంలో పెరిగాడు. తండ్రిలేని కొడుకును ఎంతో ప్రేమగా చూసుకునేది. తల్లిచాటు పిల్లాడిలా పెరిగాడు. అతన్ని మేనమామైన మొండయ్య ఆదుకోకపోయినా చదువుకుంటూ హుషారుగా పెరిగాడు. శివయ్యకు జీవితంలోకి ప్రవేశించకముందే డబ్బు మీద మోజు పెరిగింది. సుఖంగా బతకడానికి ఎక్కువ డబ్బు సంపాదించాలనుకుంటాడు. చదువు పూర్తికాగానే ప్రభుత్వ ఉద్యోగంలో చేరుతాడు. ఎవరూ ఇంతవరకూ తీసుకోని కట్నం తీసుకోవాలని ఆశ పడతాడు. తల్లి కోరిక మేరకు మేనమామ కూతురైన మంజులను పెళ్లి చేసుకుంటాడు. అతనికి కట్నంగా ఎకరం భూమి, ముప్పై తులాల బంగారం, పెళ్లి ఖర్చులకు కొంత డబ్బును ఇచ్చారు.

శివయ్య భార్య మంజుల ఇంట్లో అడుగుపెట్టిన కొద్ది రోజుల్లోనే ఇంటి పెత్తనాన్ని తన గుప్పిట్లోకి తీసుకుంది. జీవితంలో సుఖంగా ఉండాలంటే డబ్బును సంపాదించాలని, అది లంచం రూపంలో ఉన్నా పర్లేదని శివయ్యకు హితబోధ చేస్తుంది. శివయ్య భార్య చెప్పిన మాటలు వింటూ డబ్బు సంపాదించాలనే ఆశతో తల్లికి దూరం అవుతాడు. సుమిత్రమ్మ మేనకోడలును చేసుకుంటే మంచిగా చూసుకుంటుందని తనకి అండగా ఉంటుందని అనుకున్నది, కాని మేనకోడలు తన కొడుకును తనకు దూరం చేయడాన్ని తట్టుకోలేక దుఃఖిస్తుంది.

శివయ్యకు సదానందం అనే మిత్రుడు ఉండేవాడు. సదానందం ఆర్థికంగా గొప్పగా లేకున్నా అంత ఆనందంగా ఎలా ఉండగలుగుతున్నాడో శివయ్యకు అర్థం కావటంలేదు. సదానందం సంతృప్తిని మించిన ధనం లేదని అంటాడు. డబ్బు సంపాదిస్తేనే సుఖం వస్తుందని శివయ్య అంటాడు. తృప్తి ఉంటే మనిషికి ఎదుగుదల ఉండదు అని సదానందంలాంటివారు తమకు తామే సుఖపడుతున్నామని మోసం చేసుకుంటున్నారని, డబ్బుతోనే సుఖం వస్తుందని మంజుల అంటుంది. ఒకవైపు తల్లి, మరొకవైపు భార్య, ఇంకొకవైపు మిత్రుడు, మేనమామ నాలుగు స్తంభాలాటలా ఒక్కొక్కరు ఒక్కో విధంగా చెప్పుతున్నారు. వీరి మాటల వల్ల శివయ్యలో సంఘర్షణ మొదలవుతుంది. రాబోయే పిల్లలు, వారి ఖర్చులు, అవసరాలు, బాధ్యతలు, సుఖం, డబ్బు సంపాదన మొదలైనవాటి గురించి ఆలోచిస్తాడు.

తాను సంపాదించే డబ్బు న్యాయబద్ధంగానే సంపాదిస్తానని, ఒక విభాగం నుండి లంచాలకు అవకాశంలేని విభాగానికి మారిపోతాడు. ఈ విషయం మంజులకు తెలియడంతో చేతగాని వాడంటూ ఎద్దేవా చేస్తుంది. చివరకు భార్య మంజుల, మామ మొండయ్య ప్రభావంతో తాను తప్పుడు మార్గంలో వెళ్లకున్నా డబ్బు డబ్బంటూ వెంపర్లాడుతున్నాడు. త్వరలోనే అతనికి పిల్లలు పుడతారు. ఖర్చులు పెరుగుతాయి. అందుకోసం వీలైనంత ఎక్కువగా సంపాదించాలని అనుకుంటాడు. శివయ్యకు మొదటి కాన్పులో కూతురు పుడుతుంది. రెండవ కాన్పులో కూడా కూతురు పుట్టడంతో శివయ్యకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయించుకోమని సదానందం సలహా ఇస్తాడు. కానీ మూడవ సంతానంలో కొడుకు పుడతాడని ఆశపడితే మళ్ళీ కూతురు పుడుతుంది. పెళ్లి జరిగి పదేళ్లు గడిచే సమయానికి ఐదుగురు బిడ్డల తండ్రవుతాడు. పట్టణంలో ఇల్లు కట్టుకుంటాడు. ఒక్కడి సంపాదనతో కుటుంబం గడపవలసి ఉంటుంది. మంజుల పొదుపు పాటించకుండా ఇంటిలోకి విలాసవంతమైన వస్తువులు కొంటుంది. పిల్లలు రోజురోజుకు పెరిగి పెద్దవారు కావడం వలన ఖర్చులు పెరుగుతాయి. శివయ్యకు ప్రమోషన్ వచ్చి జీతం పెరిగినా ఆర్థికంగా సతమతమవుతాడు. పిల్లలు భవిష్యత్తు కొరకు అతడు షేర్లు, ఫైనాన్స్ లలో పెట్టుబడులు పెడతాడు. కొంత కాలం గడిచిన తరువాత తల్లి, మేనమామ మరణిస్తారు. కుటుంబానికి పెద్ద దిక్కు కోల్పోయినందుకు దుఃఖిస్తాడు. శివయ్య ఇద్దరి కూతుర్లైన అశ్విని, భరణిలు పెండ్లికి ఎదగడంతో కొంత నష్టంతో షేర్ల నుండి డబ్బును తీస్తాడు. ఫైనాన్స్ డబ్బు కొరకు వెళితే ఫైనాన్స కంపెనీ వాళ్లు కంపెనీ దివాళా తీసినట్లు ప్రకటించి బోర్డు ఎత్తేసి ఐ.పి. లు తెచ్చుకుంటారు. అందులో పెట్టుబడిగా పెట్టిన చాలామంది మధ్యతరగతి వారు నష్టపోతారు. శివయ్య అధిక వడ్డీకి ఆశపడి బాబ్జీకి లక్ష రూపాయలు ఇస్తాడు. అతడు అప్పును ఇవ్వకుండా అందులో కొంత మొత్తాన్ని ఇస్తాడు. ఇందులో కూడా నష్టపోతాడు. కష్టార్జితమైన డబ్బును వృధా చేస్తాడు. ఊళ్లో ఉన్న ఇల్లును, ఎకరం పొలం అమ్మి ఉద్యోగస్థులైన ఇద్దరు కుర్రాళ్లను వెతికి భారీగా కట్నం ఇచ్చి కూతుర్ల వివాహం చేస్తాడు. మరి కొంత కాలానికి మిగతా ముగ్గురు కూతుర్లు కూడా ఎదుగుతారు. వారికి పెండ్లి ఎలా చేయాలో అర్థంగాక ఆత్మహత్య చేసుకోవాలనుకుంటాడు. అతని మిత్రుడు విలువైన సూచనలు ఇచ్చి అతన్ని కాపాడుతాడు. శివయ్య తాము ఉంటున్న ఇల్లును అమ్మి కూతురైన కృతిక వివాహం చేయాలని, పెన్షన్ డబ్బులతో మిగతా పిల్లల పెళ్లిళ్లు చేయాలని నిశ్చయించుకుంటాడు. కృతిక తాను ఉద్యోగం సంపాదించిన తరువాత పెళ్లి చేసుకుంటానని ఖచ్చితంగా చెప్పుతుంది. తరువాత కొద్ది రోజుల్లోనే ఉద్యోగం సంపాదించి తన సహద్యోగిగా ఉన్న యువకుడిని తల్లిదండ్రుల ఆమోదంతో పెళ్లి

చేసుకుంటుంది. శివయ్య అధిక సంపాదన అనే అత్యాశతో ఇంతకాలం దుఃఖాన్ని మూట కట్టుకున్నానని, ఇకనుండి ఉన్నంతలోనే తృప్తిగా, సుఖంగా ఉంటానని స్పష్టం చేస్తాడు.

శివయ్య మంజుల సుఖాన్ని కోరుకున్నాడు. ఆ సుఖం డబ్బుతోనే వస్తుందని అనుకున్నాడు. దురాశకు లోనయ్యాడు. కష్టపడి సంపాదించిన డబ్బును విచ్చలవిడిగా, అధిక వడ్డీల ఆశతో కంపెనీలలో పెట్టుబడి పెట్టి నష్టపోయాడు. తనను మోసం చేసిన బాబ్జీ సిటీలో హాస్టల్ నడుపుతూ బాగా సంపాదిస్తున్నాడు. ఫైనాన్సియర్లను నమ్మిన శివయ్య డబ్బును పోగొట్టుకొని దుఃఖంలో ఉంటాడు. బాగా సంపాదించాలన్న ఆశతో ఉన్నది పోగొట్టుకుంటాడు. డబ్బు అతన్ని సుఖంగా ఉంచకుండా దుఃఖంతో ఉండేటట్లు చేస్తుంది. సుఖంగా బతకడం అంటే బాగా డబ్బుతో బతకడం కాదని తెలుసుకుంటాడు.

### 3.2.5.2. వస్తు విశ్లేషణ:

మధ్యతరగతివారు ఎదిగే క్రమంలో కొన్ని ఆశలను పెంచుకొని డబ్బు సంపాదించాలనుకుంటారు. డబ్బును సంపాదించుకోవడంలో తప్పేమీ లేదు. కాని వీలైనంతవరకు న్యాయబద్ధంగా సంపాదించుకోవాలి. సంపాదిస్తూనే ఉన్న దానితో సంతృప్తి పడాలని, అధిక సంతానంతో ఆర్థిక పరిస్థితులు దిగజారడం, డబ్బు సంపాదనలో భాగంగా షేర్లలో పెట్టుబడులు, అధిక వడ్డీలకు ఆశపడి మధ్యతరగతివారు ఎలా తమ జీవితాలను దుఃఖమయం చేసుకుంటున్నారో ఈ నవల తెలియజేస్తుంది.

శివయ్య భార్య మంజలు అతనికి డబ్బు సంపాదించాలని ఒత్తిడిని పెంచింది. ఆ ఒత్తిడిలో అతడు దుఃఖాన్ని అనుభవిస్తాడు. మగ పిల్లవాడు కావాలని తాను వరుసగా పిల్లలను కంటాడు. మగవాడు ఏదో చేస్తాడనుకున్న ఆలోచన ఎంత తప్పుడు ఆలోచన. ఆడ, మగ మధ్య తేడా చూపడం ఘోరంగా ఉంటుంది. తన కూతురు కృత్తిక వల్ల తాను ఆ విషయం తెలుకుంటాడు. శివయ్య డబ్బు ఒక్కటే సుఖమివ్వదని అనుభవపూర్వకంగా తెలుసుకుంటాడు. సంపాదించుకుంటూ ఉన్నదానితో తృప్తి పొందాలి. మనిషికి తృప్తి అనేది ఉండాలి. తృప్తి లేకుంటే సుఖం లేదు. తనకు ఉన్న సంపాదనతో తృప్తి పొందక ఫైనాన్స్ లను నమ్మి నష్టపోయాడు. కట్నాలు, కానుకలు మరియు ఇతర కుటుంబ విషయాల్లో చాలామంది దుఃఖాన్ని కొనుక్కుంటున్నారు. డబ్బు అవసరం కావడంతో ఇలాంటివి చాలా వరకు స్వయంకృతాలుగా జరుగుతున్నాయి. ఆర్థిక పరిస్థితిని మెరుగుపరుచుకుంటూనే దుఃఖాన్ని దూరం చేసుకోవడం మంచింది. అందుకోసం సామాజిక జీవనం గడపాలన్నది ఒక్కటే మార్గం. సమాజానికి కొంతైనా మనం ఉపయోగపడితే అదే

జీవితానికి తృప్తినిస్తుంది. జీవితమంటే సుఖదుఃఖాల మిశ్రమం అని మనకు తెలిసిన కూడా దుఃఖాలను కొని తెచ్చుకోకూడదు. డబ్బు అవసరమే కాని డబ్బు మాత్రమే సుఖం కాదు.

### 3.2.5.3. అధిక వడ్డీల ఆశ – షేర్లు, ఫైనాన్స్ కంపెనీల మోసాలు:

మధ్యతరగతివారు అధికంగా డబ్బు సంపాదించాలనే ఆశతో డబ్బును అధికంగా వడ్డీలు వస్తాయని షేర్లు, ఫైనాన్స్ కంపెనీలలో పెట్టుబడులు పెట్టి మోసపతున్న వైనాన్ని ఈ నవలలో శివయ్య కుటుంబం ద్వారా తెలియజేశాడు. ఏదేమైనా డబ్బు సంపాదించాలనే ఆశతో మంజుల ఒత్తిడి మేరకు షేర్లలో పెట్టుబడి పెడతాడు. పెట్టుబడి పెట్టిన నెల రోజుల్లోనే నాలుగు రెట్లు అవుతాయి. అతనికి ఆశ పెరిగి అలానే మరికొంత పెట్టుబడి పెడతాడు. కొన్ని రోజుల్లోనే షేర్లు అన్ని కుప్ప కూలిపోతాయి. ఆ షేర్ల మాయాజాలాన్ని అతడు తట్టుకోలేకపోతాడు. పెట్టుబడి పెట్టిన దాంట్లో కొంత డబ్బును నష్టంతో తిరిగి పొందుతాడు. షేర్ల మాయాజాలం వల్ల కొంత డబ్బును నష్టపోయాడు. షేర్ల మోసాన్ని పసిగట్టి తన పని తాను చేసుకుంటూ జీవిస్తున్నాడు. ఎంతో మంది షేర్లలో లక్షలు సంపాదిస్తుంటే శివయ్య ఏమి చేయలేని అసమర్థుడని మంజుల శాపనార్థాలు పెట్టింది. అయినా తాను ఓపిక పట్టాడు. అతడు సంపాదించిన డబ్బును ఎన్నో రెట్లు పెంచాలని మంజుల ఆశ పడుతుంది.

ఫైనాన్స్ కంపెనీలు విపరీతంగా పుట్టుకొస్తున్నాయి. ఆకర్షణీయమైన బహుమతులు ఇస్తామని చెప్పుతూ ప్రకటనలు చేస్తున్నారు. ఒకటి, రెండు సంవత్సరాలలోనే డబ్బు రెట్టింపు అవుతుందని, ఇది అందరికి ఎంతో లాభసాటి అని ఇల్లిల్లు తిరుగుతూ ప్రచారం చేస్తున్నారు. శివయ్య నాలుగైదు ఫైనాన్స్ లలో డబ్బు పెట్టాలని అవి పిల్లల పెళ్లిళ్ల వరకు అనేక రెట్లు అయ్యేటట్టు చూడాలని అనుకుంటాడు. మిత్రుడు సదానందం సలహా అడుగుతాడు. సదానందం ఇలా అంటాడు "ఇన్వెస్టర్ల పెట్టుబడులను అనేక రెట్లు చేయడం కాదు, వాళ్ళు అనేక రెట్లు బలవడం... ఫైనాన్స్ లంటే ఎంజాయ్ విత్ అదర్స్ మనీ అన్నమాట. ఇతరుల డబ్బుతో జల్సా చేసుకోవడమే వాళ్ల పని. అందరూ అలాగే ఉంటారని కాదు గాని అవంతే" (మల్లయ్య, కాలువ.2002:పుట.62) అని చెబుతాడు. ఆ మాటలకు ఆశ్చర్యపోతాడు శివయ్య. సదానందంకు ఫైనాన్స్ కంపెనీల మీద సదభిప్రాయం లేదని అనుకుంటాడు. కాని పైసా పైసా కూడబెట్టి ఫైనాన్స్ లలో పెడితే అది తిరిగి రాకుంటే ఎలా అనుకోకుండా ఉండలేకపోయాడు. రిస్క్, ధైర్యం చేసి ఫైనాన్స్ లో పెట్టుబడిగా డబ్బును ఉంచాలని మంజుల చెబుతుంది. ఆకర్షణీయమైన బహుమతులు, అరచేతిలో వైకుంఠం చూపే ప్రకటనలు చూస్తూ ఊర్కోలేకపోయాడు. తన దగ్గరున్న చిట్ ఫండ్, ఇతర డబ్బుతోపాటు

ప్రావిడెంట్ ఫండ్ నుంచి కొంత డబ్బు తీసి నాలుగైదు ఫైనాన్స్ లలో పెడతాడు. అవి వాళ్లు చెప్పినట్లు గుణింపబడితే ఇద్దరు కూతుర్ల పెళ్లిళ్లు చేయోచ్చు అని అనుకుంటాడు. ఈ మధ్యకాలంలో సంపాదించే డబ్బుతో, ఉద్యోగ విరమణ సమయంలో వచ్చే డబ్బుతో, ఇన్సూరెన్స్ ఇతరత్రా వచ్చే డబ్బుతో మిగతా పిల్లల పెళ్లిళ్లు చెయ్యొచ్చు అని అనుకుంటాడు. అతడు ఏదో ఘనకార్యం చేసినట్టు భావిస్తాడు. తనకు తానే సంతృప్తిపరచుకుంటాడు. ఇంకా సంపాదన మార్గాల కోసం వెతుకుతూనే ఉంటాడు.

శివయ్య వడ్డీలకు డబ్బును ఇవ్వాలకుంటాడు. ఎక్కువ వడ్డీ వచ్చిన వాటిని వసూలు చేసుకోవడంలో ఇబ్బందులు ఎదుర్కోవాలి. వడ్డీకిచ్చి వసూలు చేసుకోలేడని మంజుల అంటుంది. అయినా శివయ్య లక్ష రూపాయలు మిత్రుడు బాబ్జీకి వడ్డీకి ఇస్తాడు. పెద్దమ్మాయి పెళ్లి వరకు మూడు పైసల వడ్డీ ఇస్తానంటే పత్రం రాసి అతనికి ఇస్తాడు. మరికొంత కాలానికి డబ్బు కావాలని బాబ్జీని అడుగుతాడు. కాని బాబ్జీ బాగా సంపాదించినా, అతడు కొంత సమయం కావాలని అడుగుతాడు. చివరికి బాబ్జీ ఊరు వదిలి పెట్టిపోయే ముందు కొంత డబ్బును ఇస్తాడు. శివయ్య నేను ఇవ్వలేను అని కోర్టుకు వెళ్లితే వెళ్ళండి మిగతా డబ్బు ఇవ్వడం నావల్ల కాదు అని బాబ్జీ చెబుతాడు. అధిక వడ్డీలకు ఆశపడి శివయ్య అసలునే నష్టపోతాడు.

శివయ్య డబ్బులు తీసుకోవాలని అనుకుంటూ ఉండగానే ఫైనాన్స్ కంపెనీల భాగోతం బయటపడుతుంది. గ్లోబలైజేషన్, ప్రైవేటైజేషన్, ఫైనాన్స్ ల వారు డబ్బులపై మోజు, మోసంతో దివాళ తీసినట్టు ప్రకటన చేస్తారు. వసూలు చేసిన డబ్బు దుర్వినియోగం అవుతుంది. ఫైనాన్స్ ల్లో పెట్టిన డబ్బు శివయ్య నష్టోపోతాడు. డిపాజిట్ చేసిన వారందరూ నష్టపోతారు. దివాలా తీసామని ప్రకటించి, ఫైనాన్స్ కంపెనీలు బోర్డులు తిప్పేశారు. శివయ్య కష్టార్జితమైన డబ్బును కంపెనీల పాలుచేశాడు. వాళ్ళు బాగానే ఉన్నారు. బాధపడేది మాత్రం శివయ్య కుటుంబం. గ్లోబలైజేషన్ పేరుతో ఫైనాన్స్ కంపెనీలు మధ్యతరగతి వారికి ఆశచూపి వారిని మోసం చేస్తున్నారు. షేర్లు, ఫైనాన్స్ కంపెనీల వారి మోసాలతో కోలుకొని శివయ్య డబ్బు సంపాదించాలనే ఆశను తగ్గించుకుని సుఖంగా బతకాలని నిర్ణయించుకుంటాడు.

### 3.2.5.4. ముగింపు:

డబ్బు, సుఖం, దుఃఖం, తృప్తి అనే పదాలు రెండక్షరాలే కాని అవి జీవితాన్ని మార్చగలిగేవి. డబ్బుతో మాత్రమే సుఖం ఉండదని ఈ నవల రుజువు చేసింది. ఈ నవలలో శివయ్యను అతని భార్య మంజుల డబ్బు డబ్బు అంటూ అతడిని ఒత్తిడికి గురిచేస్తుంది. అతనికి స్పష్టమైన

అభిప్రాయాలు లేకపోవడం వల్లనే దుఃఖం, ఒత్తిడిలను ఎదుర్కొంటాడు. ఉన్నదానితో సంతృప్తిగా ఉంటూనే సంపాదించుకోవాలి గాని దురాశతో దుఃఖాన్ని కొని తెచ్చుకోరాదు. ఎంతో కొంతైనా సమాజానికి ఉపయోగపడేలా జీవితాన్ని మలుచుకుంటే తప్పకుండా సుఖముంటుంది. దుఃఖమైతే ఉండదు. జీవితం అంటే సుఖదుఃఖాల మిశ్రమం కాని దుఃఖాలను కొని తెచ్చుకోకూడదు. డబ్బు అవసరమే కాని డబ్బు మాత్రమే సుఖం కాదు. సుఖమంటే ఇంకెన్నో ఉన్నాయి.

**సుఖం = తృప్తి + సామాజికత**

**సుఖం = డబ్బు + తృప్తి**

**ఎంత డబ్బున్నా తృప్తి లేకుంటే సుఖముండదు.**

**డబ్బు – (మైనస్) తృప్తి = దుఃఖం**

**ఎంత డబ్బున్నా తృప్తిగా లేకుంటే దుఃఖమే ఉంటుంది.**

### 3.2.6. తెలంగాణ దేవదాసు నవల:

ఈ నవల స్వాతి సచిత్ర మాసపత్రికలో 2011వ సంవత్సరం డిసెంబర్ నెలలో ప్రచురింపబడింది. తెలంగాణలో అగ్రవర్ణాలైన భూస్వాములు, పెత్తందార్లు అర్థబలంతో, అంగబలంతో అధికారం చెలాయించారు. భూస్వాములైన దొరల ఇండ్లల్లో ఉండే ఆడపడుచులు వెనుకబడిన దళిత వర్గాల యువకులపై ప్రేమగా వ్యవహరించేవారు. ఆ ప్రేమ పెండ్లి దాకా వెళ్ళకపోవడాన్ని గురించి విశ్లేషించిన నవల ఇది. అరవై సంవత్సరాల క్రితం తెలంగాణ గ్రామీణ సమాజాన్ని కాలువ మల్లయ్యగారు ఈ నవలలో చిత్రించారు.

### 3.2.6.1. నవలా వస్తువు:

తెలంగాణలో నిజాం కాలంలో గడీల పాలన కొనసాగింది. ఆంగ్లేయుల పాలనతో కోస్తా ప్రాంతంలో ప్రవేశించిన ఆధునిక విద్య తెలంగాణలో ప్రవేశించలేదు. అందువల్ల స్వాతంత్ర్యం వచ్చినా ఫ్యూడల్ సంస్కృతి నేపథ్యం ఇక్కడ పోలేదు. అలాంటి నేపథ్యంగల కుటుంబమే దొర వేణుగోపాలరెడ్డిది. అతని భార్య సుహాసినిదేవి, పెద్ద కొడుకు ప్రభాకర్ రెడ్డి, చిన్న కొడుకు రవీందర్ రెడ్డి, కూతురు రాజ్యలక్ష్మి. అందరూ రాజ్యలక్ష్మిని దొరసాని అని పిలుస్తారు. ఆమె సవారెడ్ల బండిలో బడికి పోతుంది. మధ్యతరగతి రైతు అయిన కాపు కొండయ్య కొన్ని సంవత్సరాల క్రితం దొర ఇంట్లో పాలేరుగా ఉండేవాడు. కొండయ్య కొడుకు రఘురాం పాఠశాలలో తెలివైన విద్యార్థిగా పేరు తెచ్చుకుంటాడు. రవీందర్ రెడ్డి, రఘురాంతో స్నేహంగా ఉంటాడు. దొర వేణుగోపాల్ రెడ్డి పిల్లలతో ఆడుకోవడానికి రఘురాం వస్తాడు. తన పిల్లలు కోపం తెచ్చుకుంటారని గడీలోనికి రావడానికి

అనుమతి ఇస్తాడు. ఒకే తరగతి వారైన ఈ ముగ్గురూ కలిసి ఆడుకుంటారు. రాజ్యలక్ష్మి రఘురాంకు ఆకర్షితురాలై ఆరాధిస్తుంది. చిన్ననాడు మొదలైన వారి స్నేహం ఊరిలో హెచ్.యస్.సి. పూర్తయ్యేనాటికి ప్రేమగా మారుతుంది. గడీకి పరిమితమైన రాజ్యలక్ష్మికి రఘురాం లాంటి వ్యక్తితో పరిచయం వల్ల ప్రపంచాన్ని చూడగలిగింది. రఘురాం స్నేహమే రాజ్యలక్ష్మిని మానవీయంగా మార్చింది. అతని కళ్లతోనే లోకాన్ని చూసి రాజ్యలక్ష్మికి అతనిపై తెలియని అనురాగం అంకురించిది.

కాలం తన పనిని తాను కానిస్తుంది. సంవత్సరాలు కాలగర్భంలో కలిసిపోయాయి. కరీంనగర్ లో రఘురాం పి.యు.సి. పూర్తి చేస్తాడు. ఆ తరువాత హైదరాబాదులో ఇంజనీరింగ్ లో చేరుతాడు. హాస్టల్లో ఉంటూ చదువుకుంటున్నాడు. రఘురాం రాజ్యలక్ష్మితో గడిపిన పాఠశాల రోజులను గుర్తు చేసుకుంటుంటాడు. హెచ్.యస్.సి.తోనే రాజ్యలక్ష్మి చదువు ఆపేస్తుంది. రాజ్యలక్ష్మి పెళ్లంటూ చేసుకుంటే రఘురాంని తప్ప మరొకరిని చేసుకోనని తండ్రితో అంటుంది. దొర రఘురాంపై కోపంతో ఆమెపై నిఘా పెడతాడు. వేణుగోపాల్ రెడ్డి రఘురాంని తనవైపు తిప్పుకొని కుటుంబాన్ని ఇబ్బంది పెడతానని బెదిరిస్తాడు. ఆ బెదిరింపులతో రఘురాం భయపడతాడు. రాజ్యలక్ష్మిని అతను పెళ్లి చేసుకోనని అంటాడు. రఘురాం చెప్పినా రాజ్యలక్ష్మి ఏకపక్షంగా ప్రేమతో ఉండిపోతుంది. దొర మాట విన్న రఘురాం తరువాత ఆ విషయాన్ని రాజ్యలక్ష్మికి తెలియజేస్తాడు. ఇంజనీరింగ్ ఫైనలియర్ పరీక్షలు రాయడానికి సిద్ధపడిన రఘురాంకు మిత్రురాలు సునిత ద్వారా రాజ్యలక్ష్మి లేఖ పంపిస్తుంది. తను వచ్చే వరకు ఎదురు చూస్తుంటానని అవసరమైతే తన వాళ్లను, ఆస్తులను వదులుకొని రావడానికి సిద్ధమే అని అంటుంది. తనకు తన తండ్రి తెచ్చే సంబంధాలను ఏదో ఒక రకంగా చెడగొడుతుంటానని, పరీక్షలు రాసి వచ్చాకే పెళ్లి చేసుకుందామని లేఖలో రాస్తుంది. రఘురాం పరీక్షలు రాస్తూనే రాజ్యలక్ష్మి పంపిన లేఖను చదువుకునేవాడు.

వేణుగోపాల్ రెడ్డికి ఆ లేఖ విషయం తెలుస్తుంది. హైదరాబాద్ లో రఘురాంను చంపాలని అనుకుంటాడు. తండ్రి పన్నిన పన్నాగం గురించి తెలుసుకొని రాజ్యలక్ష్మి తన వల్ల రఘురాంను చంపొద్దని వేడుకుంటుంది. చివరికి తండ్రితో వాదోపవాదాలు జరిగి తండ్రితో నువ్వు ఏ సంబంధం తెచ్చినా పెళ్లి చేసుకుంటానని అంటుంది. వేణుగోపాల్ రెడ్డి ఆస్తిపరుడు, పలుకుబడి గలవాడు. ప్రక్క ఊరి దొర కొడుకుతో పెళ్లి సంబంధం కుదుర్చుకుంటాడు. రఘురాంకు ఈ విషయం తెలియదు. రఘురాం పరీక్షలు రాసి రాజ్యలక్ష్మిని పెళ్ల చేసుకోవాలని మానసికంగా సిద్ధపడి బస్సులో బయలుదేరి వస్తాడు. రఘురాం కరీంనగర్ చేరుకొని ఊరికి వచ్చే బస్సులో కూర్చుంటాడు. ఆ బస్సు

ఊరు సమీపిస్తుండగానే ఒక పల్లకి వెనుక వందలాది ఎడ్ల బండ్లు పరుగులు తీయడం గమనిస్తాడు. ఆ పల్లకి రాజ్యలక్ష్మి పెండ్లిదేనని తెలిసి స్పృహ కోల్పోతాడు. రాజ్యలక్ష్మి పెండ్లి చేసుకోవడానికి వెనుక ఏదో ఒక బలమైన కారణం ఉండి ఉంటుందని అనుకుంటాడు. ఆ తరువాత ఇంటి దగ్గర ఉండలేక మళ్ళీ హైదరాబాద్ కు చేరుకుంటాడు. ఆమె జ్ఞాపకాలతో కొద్ది రోజులు అలాగే ఉండిపోతాడు. రఘురాం పరిస్థితిని చూసి విలువైన జీవితాన్ని మనోవ్యధతో కాలం గడపవద్దని అతని మిత్రుడు వీర రాఘవులు సలహా ఇస్తాడు.

నాలుగు సంవత్సరాలు కాలగర్భంలో కలిసిపోయాయి. రఘురాం హైదరాబాద్ లో, మిత్రుడు శంకర్ వరంగల్ లో ప్రభుత్వ ఉద్యోగులుగా పని చేస్తుంటారు. శంకర్ పెళ్లి చేసుకున్నాడు. రఘురాం మాత్రం రాజ్యలక్ష్మి జ్ఞాపకాలతో కాలం గడుపుతున్నాడు. ఏ పనిచేసినా, ఎక్కడున్నా రాజ్యలక్ష్మి ధ్యాసే. మిత్రులెంత ప్రయత్నించినా అతనిలో మార్పు రాలేదు. సునీత రఘురాం ఆఫీసుకు వస్తుంది. అతని చూసి ఆశ్చర్యపోతుంది. రఘురాంను చూస్తుంటే తెలంగాణ దేవదాసులా కనపడుతున్నాడు. తెలంగాణలో వివిధ ఉద్యమాలు, అనేక పోరాటాలు ఉండటం సహజమే కాని దేవదాసులు ఉండటం సహజం కాదని సునీత చెబుతుంది. ఆ మాటలు ఆలోచింపదగ్గవి గానే అనిపించాయి రఘురాంకు. ఐదు సంవత్సరాలు గడిచిపోయాయి. రఘురాంని పెళ్లి చేసుకోమని చిరకాల మిత్రులు శంకర్, సునీతలు ఒత్తిడి పెంచుతారు. ఒకరోజు సునీత కరీంనగర్ లో ఉంటున్న రాజ్యలక్ష్మిని కలుసుకోమని రఘురాంకు చెబుతుంది. రాజ్యలక్ష్మి ఇద్దరు పిల్లలతో ఉండటాన్ని చూస్తాడు. అర్థం చేసుకునే విద్యావంతుడైన భర్త దొరకడంతో తన జీవితం హాయిగా, సాఫీగా సాగిపోతుంది. జీవితంలో లభించని వాటిని ఆలోచిస్తూ పోతే జీవితం వృధా అవుతుందని ఇంత కాలం రఘురాం పెళ్లి చేసుకోకుండా ఉండటమే తనను బాధిస్తుందని రాజ్యలక్ష్మి అంటుంది. పవిత్రమైన ప్రేమ బలిని కోరదని, నీ ప్రాణాలను కాపాడటానికే పెళ్లి చేసుకోవలసి వచ్చిందని, నీవు బతికి ఉండటమే ముఖ్యమని భావించి అలా చేశానని రఘురాంకు చెప్పడంతో అతనిలో ఉన్న అపోహలు తొలగిపోతాయి. రాజ్యలక్ష్మి భర్త భూమారెడ్డి ఇంతలోనే ఇంట్లోకి వచ్చి రఘురాం రాకను స్వాగతిస్తాడు. ఆరోజు రాజ్యలక్ష్మి దంపతులు రఘురాంకు గొప్పగా ఆతిధ్యం ఇచ్చి కొసరి కొసరి వడ్డిస్తారు. రాజ్యలక్ష్మి సూచన మేరకు రఘురాంను ప్రేమిస్తున్న శంకర్ చెల్లి మహేశ్వరిని కొంత కాలం తరువాత పెళ్లి చేసుకుంటాడు. రఘురాం మహేశ్వరి దంపతులు ఇద్దరు కూతుర్లతో సుఖ సంతోషాలతో కాపురం చేస్తుంటారు. మరికొన్ని రోజుల్లోనే ఊరిలోని దొరైన తన తండ్రి గడీ (పెద్ద ఇల్లు) మావోయిస్టులు పేల్చేశారని తెలిసి రాజ్యలక్ష్మి తన భర్తతో కలిసి ఆ ఊరికి వస్తుంది.

శిథిలావస్థకు చేరిన  ఆ గడిని చూసి బాల్యస్మృతులను గుర్తుచేసుకుంటూ వెక్కి వెక్కి ఏడుస్తుంది. ఆరోజు అదే ఊరిలో ఉన్న రఘురాం, మహేశ్వరిలు వారిని పిలిచి ఆతిధ్యం ఇస్తారు. అందరూ కలిసిపోయి హాయిగా కాలం గడుపుతుంటారు. ఇక్కడ ప్రేమలు విఫలమవ్వడం కాదు జరిగింది, రెండు ప్రేమామయ కుటుంబాలు ఏర్పడటం అంది మహేశ్వరి. మనమంతా శ్రమైక జీవన సంస్కృతిని, సౌందర్యాన్ని ప్రేమించే వాళ్లం అని రఘురాం అనడంతో కథ ముగుస్తుంది.

### 3.2.6.2. వస్తు విశ్లేషణ:

దొరలు, భూస్వాములు, పెత్తందారీ వర్గాల వారు కుల వ్యత్యాసాలు, ఆర్థిక అంతరాలు, పరువు మర్యాదలకు ప్రాధాన్యతను ఇస్తారు. దొరలు వెనుకబడిన వర్గాలవారిలో వివాహ సంబంధం కలుపుకోవడాన్ని కలలోనైనా కలగనరు. అందుచేతనే రాజ్యలక్ష్మి విషయంలో వేణుగోపాల్ రెడ్డి క్రూరంగా ప్రవర్తించి ఆమెను వారి కులం వారికే ఇచ్చి వివాహం చేస్తాడు. వీరు అవసరమైతే పరువు హత్యలకు వెనుకాడక పోవడంతో తెలంగాణలో ప్రేమ వివాహాలకు ఆస్కారం లేకుండా పోయింది. అన్ని కులాల్లో కట్టుబాట్లు ఉండటం వల్ల ఆనాడు వీటిని అధిగమించే సాహసం చేయలేకపోవడంతో తెలంగాణ దేవదాసులుగా మారింది తక్కువేనని రచయిత ఈ నవల ద్వారా విశదీకరించారు.

వేణుగోపాల్ రెడ్డి ఇంట్లో నడిచేది నిరంకుశత్వం. కూతురునే గృహ నిర్బంధంలో ఉంచుతాడు.  ప్రజాస్వామ్య యుగంలోను ప్రేమలు సఫలం కాలేదు. ఎంతో ఎంతో నిరంకుశుడు వేణుగోపాల్ రెడ్డి. రాజ్యలక్ష్మి ఓ రోజు తన తండ్రి మాటలను విన్నది "వాని పేరు రఘురాం హైదరాబాద్ లో ఇంజనీరింగ్ చదువుతున్నాడు. ఇంకో రెండు నెలల్లో చదువైపోతుంది. వాడిక్కడికి వస్తే అమ్మాయిని ఆపడం కష్టం. వాడిక్కడికి రాకూడదు. అక్కడే ఖతం చేయండ్రి. అది హత్యని తెలియకూడదు. వాని దినచర్యను రెండు మూడు గంటలు గమనిస్తే చాలు. వాడు ఇంజనీరింగ్ కాలేజీ హాస్టల్లో ఉంటాడు. రోడ్డు మీద పరధ్యానంగా నడుస్తుంటాడు. వెనుక నుండో లేదా ముందునుండో వాని మీద నుంచి లారీ పోనియండ్రి... లేదా బస్సు కిందకు తోసేయండ్రి... అప్పుడది ప్రమాదంగా లెక్కింపబడుతుంది. ఎవరూ పట్టించుకోరు. పకడ్బందీగా  పని జరిగి పోవాలి. అది హత్య అనే అనుమానం ఎవరికీ రాకూడదు. ఇదుగో పదివేలు... పనైపోయాక మిగతావి గప్ చుప్ గా జరిగిపోవాలి" (మల్లయ్య, కాలువ.2011:పుటలు.87, 88) అని దొర వేణుగోపాల్ రెడ్డి మాటల ద్వారా తాను పరువు హత్యలను చేయించడానికైనా సిద్ధంగా ఉన్నాడు. ఆ ప్రాంతానికే దొరగా పేరు మోసిన దొర అనే భావన వారిలో ఉంది. అందుకే కులాంతర వివాహాలు ఒప్పుకోకుండా గర్వంగా మేము దొరలం అని చెప్పుకుంటున్నారు.

### 3.2.6.3. ముగింపు:

ఒకరిది దొరల కుటుంబం. మరొకరిది వెనుకబడిన పాలేరు కుటుంబం. వీరి మధ్య స్నేహం, ప్రేమలు ఉన్నాయి. వీరు పెళ్లి చేసుకోవాలనుకున్నారు. కాని సమాజంలో కులాంతర వివాహాలు కుదరవని వీరు అర్థం చేసుకున్నారు. కాని ఊళ్లలో పరువు కోసం పాకులాడే వ్యక్తులు కొందరు ఉంటారు. అందువల్లనే పరువు కొరకు ఏమైనా చేయడానికి ఇష్టపడతారు. కన్న కూతురని కూడా అర్థం చేసుకోకుండా పరువే ముఖ్యంగా భావించేవాళ్లు ఉన్నారని ఈ నవల తెలియజేస్తుంది. సమాజంలో వీరి సంఖ్య పెరుగుతుంది. కాని సమాజంలో మార్పు రావాలి. ప్రేమను అర్థం చేసుకోవాలి. వారి ప్రేమకు గల కారణాలను వారు అర్థం చేసుకొని కులాంతర వివాహాలను ప్రోత్సహించాలి. కాని చివరికి రెండు కుటుంబాలు సమాజంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా వారు మార్పు చెందారు. ప్రేమంటే ఏంటో తెలుసుకోవడానికి ఈ నవలలో రెండు కుటుంబాల జీవితాలే సాక్ష్యాలు. పెద్దలు వారి ప్రేమను విఫలం చేసినా వారి ఎదుగుదలలో క్రమంగా తమ స్వభావాల ద్వారా ప్రేమలు విఫలం కాకుండా రెండు ప్రేమామయ కుటుంబాలుగా ఏర్పడటాన్ని ఇక్కడ విశేషంగా చెప్పుకోవచ్చు.

## 3.3. దళిత నవలలు:

రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా, సాంస్కృతికంగా తరతరాల నుండి అణచివేతకు గురిచేయబడ్డవారు దళితులు. తరతరాలుగా అనుభవిస్తున్న అవమానాల్ని పోగొట్టుకోవాలని, అందరిలాగే తాము గుర్తింపబడాలని, ఆత్మ గౌరవాన్ని కాపాడుకోవాలని, సాంస్కృతికంగా తమకో అస్తిత్వాన్ని కల్పించుకోవాలని, సమాజంలో అన్ని రంగాలలో సమాన ప్రాతినిధ్యం కోసం పోరాడుతున్న వారి జీవితాలను గురించి తెలియజేసేదే దళిత నవల. దళిత నవల దళితుల జీవన విధానాన్ని ప్రతిబింబింప చేస్తుంది. ప్రతి దళితుడు కూడా వారి వారి జీవితాన్ని తొంగిచూసినట్లుగా ఉంటుంది. దళిత నవలల్లో సంస్కృతి, ఆచారవ్యవహారాలు, వృత్తులు, అంటరానితనం, ఆహారపు అలవాట్లు, దొరల పీడన, భూస్వాముల దౌర్జన్యాలు, స్త్రీలపై లైంగిక వేధింపులు మొదలైనవి ఉంటాయి.

దళితులు అనుభవిస్తున్న దైన్య స్థితిని ఎంత హృదయ విదారకంగా వివరిస్తారో అంతే స్ఫూర్తితో దళితుల్లో చైతన్యం రావాలనే విషయాన్ని కూడా అంత సూటిగా రచయిత చెప్తారు. కాలువ మల్లయ్య దళితులు సామాజికంగా ఎదుర్కొనే అవమానాలు, అన్యాయాల్ని,

నిరంకుశత్వాన్ని గురించి మాదిగ విజయం, గులాంగిరి చోడో, మంచి యన్నది మాల అయితే.., అస్పృశ్య కోయిల నవలల్లో తెలియజేశారు. ఈ నవలల్లోని వస్తువును తెలియజేసి విశ్లేషణ చేసాను.

### 3.3.1. మాదిగ విజయం నవల:

కాలువ మల్లయ్యగారి 'మాదిగ విజయం' నవలను సామాజిక భారత్ బి.వి.వి. ఛారిటబుల్ ట్రస్టు, హైదరాబాద్ వారు 2015 ఏప్రిల్ లో ముద్రించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ భాషా సంస్కృతిక శాఖ నిర్వహించిన నవలల పోటీల్లో (2013–2014) బహుమతి పొందిన నవల ఇది. ఈ నవలలో నాలుగు తరాల మాదిగల జీవితం, పరిణామం, అభ్యుదయం ప్రత్యక్షమవుతాయి. ఒక తరం బుచ్చయ్యది. రెండోతరం బుచ్చయ్య కొడుకు పేరయ్యది. మూడవ తరం బుచ్చయ్య మనవడు ఎల్లయ్యది (ఆనందరావుది). నాలుగవ తరం ఆనందరావు పిల్లలైన ఆజాద్, శ్రీకాంత్ లది. ఇది దాదాపు నూరేళ్ల మాదిగల జీవితాన్ని ప్రతిబింబించిన నవల. ఈ నవల దళిత బహుజన రాజ్యాధికారాన్ని కోరుతూ రాయబడిన నవల. యుగయుగాలుగా వేదనకు, పీడనకు, అంటరానితనానికి గురవుతున్న దళితులు చైతన్యం పొంది అభివృద్ధి పథంలో నడుస్తున్న వైనాన్ని ఈ నవల చిత్రీకరించింది. ఆ చైతన్యాన్ని ఉపయోగించుకొని మంద కృష్ణ మాదిగ, కృపాకర్ మాదిగ రాష్ట్రంలోని మొత్తం మాదిగల్ని కదలించగల నాయకులుగా ఎదిగారు. నిజంగా దళిత జీవితంలో ఎంతో వైవిధ్యముంది. కష్టపూరితమైన బ్రతుకే అయినా సర్వసంపదలకు సృష్టికర్తృత్వం వహించడం దళిత జీవితంలో ఉంది.

#### 3.3.1.1. నవలా వస్తువు:

తెలంగాణలోని కరీంనగర్ జిల్లా కేంద్రానికి దగ్గరలో ఉన్న ఒక ఊరు చివరన ఉన్న మాదిగవాడలో బుచ్చయ్య కుటుంబం నివాసముంటుంది. అతని పెద్ద కొడుకు లింగయ్య, చిన్న కొడుకు పేరయ్య, భార్య కనుకమ్మ. బుచ్చయ్య చెప్పులు కుట్టుకుంటూ, డప్పు వాయిస్తూ జీవనాన్ని గడుపుతున్నాడు. బుచ్చయ్య చిన్న కొడుకైన పేరయ్యను తీసుకొని దొర సూర్యారావు రమ్మంటే 'గడీ'కి పోతాడు. సూర్యారావు దొర ఎనిమిది సంవత్సరాలున్న పేరయ్యను పాలేరుగా ఉండమంటాడు. ఎద్దులు కాయడానికి పాలేరు పని చేయమంటాడు. పాలేరు పని చేయించడం అతనికి ఇష్టం లేదని అనడంతో దొర ఆగ్రహంతో నోటికి వచ్చినట్టు బూతులు తిడతాడు. ఓ మాదిగ కులస్థుడు తన మాటకు ఎదురు సమాధానం చెబుతాడా అని కోపంతో చెప్పు అందుకొని బుచ్చయ్య మీదకి వెళతాడు. దొర ఆగ్రహాన్ని చూసిన బుచ్చయ్య కొడుకును పాలేరుగా ఉంచుతాడు. బుచ్చయ్య పెద్ద కొడుకు లింగయ్య చిన్నప్పటి నుండి పాలేరుగా పనిచేసుకుంటూ బతుకుతున్నాడు. బుచ్చయ్య

మేనకోడలు దొరింట్లో దాసి అయింది. డప్పు కొడుతూ, తాళ్లు పేనే బుచ్చయ్య తాను డప్పుతో ఏ నినాదాన్ని పలికించినా తన బతుకులోని విషాదం మాత్రం పారదోల లేకపోయాడు.

మాదిగవాడకు మూడు కిలోమీటర్ల దూరంలో జూలపల్లి గ్రామం ఉంది. వ్యవసాయ పనులకు వెళ్లినప్పుడు రెండు గ్రామాల వారు కలుసుకునేవారు. పేరయ్య అటుగా వచ్చిన ఈరమ్మను చూసేవాడు. ఒకరంటే మరొకరికి ఇష్టం ఏర్పడటంతో ఇరు కుటుంబాల సభ్యులు పేరయ్య, ఈరమ్మల వివాహం జరిపిస్తారు. పేరయ్య దొర ఇంట్లో పనికి వెళ్లక పదిహేను రోజులు గడిచాయి. దొర కోపంతో పనికి రావాలని పేరయ్యను కోరాడు. అతను పనికి రానని జీతం కట్ చేసుకోమని చెబుతాడు. ఓ మాదిగ పాలేరు పనికి రాకపోగా కావాలంటే జీతం కోసుకోమని చెప్పడం సూర్యారావుకు తీవ్రమైన ఆగ్రహాన్ని తెప్పిస్తుంది. అతని అహం దెబ్బ తింటుంది. ఆ ఊర్లో కమ్యూనిస్టుల ప్రభావం ఉండటంచేత సమయం చూసి పేరయ్యను దెబ్బకొట్టాలనుకుంటాడు. పేరయ్య పాలేరు తనం మానేసి భార్యతో కలిసి పనిచేసుకుంటూ బ్రతకాలని నిర్ణయించుకుంటాడు. అతని మీద కోపంతో ఈరమ్మను దొర కొడుకు లక్ష్మణరావు బలవంతంగా ఆమె బతుకుతో ఆడుకుంటాడు. ఈ విషయం తెలిసిన పేరయ్య వెళ్ళేసరికి అంతా అయిపోతుంది. అవమాన భారంతో ఆమె ఆత్మహత్య చేసుకోపోతే ఆమెను ఆ ప్రయత్నం నుండి విరమింపజేస్తాడు. భార్యను చెడగొట్టిన ఆ దొరను నరికివేస్తా అని కత్తి తీసుకొని బయలుదేరతాడు. సూర్యారావు అతని మీద ఫిర్యాదు చేస్తే పోలీసులు అరెస్టు చేస్తారు. ఇలాంటి సమయంలో సూర్యారావు, లక్ష్మణరావులకు ఉద్యమకారుల నుండి హెచ్చరిక వచ్చింది. వారు ఊరొదిలి పెద్దపల్లికి పారిపోయారు. పేరయ్య భూమి సంపాదించే మార్గం కోసం వెతుకుతున్నాడు. కొన్ని ప్రయత్నాలు చేసిన తరువాత పట్వారీ ద్వారా ఊరి పొలిమేరలో ఉన్న పరంపోగు, బచంరాయి భూములను పొందుతాడు. అప్పుగా యాభై రూపాయలను తెచ్చి పట్వారీకి ఇస్తే మూడు ఎకరాలను అతనికి అప్పజెప్పుతాడు. ఆ భూమిని సాగుచేయడాన్ని తపస్సులాగా భావించి విశ్రాంతి లేకుండా ఆ భూమిలో పనిచేసి ఆ బీడు భూమిని సేద్యం అయ్యే విధంగా చేస్తారు. రెండు సంవత్సరాలు పంట సరిగ్గా పండక నష్టాలను ఎదుర్కొంటాడు. ఆ తరువాత కాలంలో పంట బాగా పండుతుంది. తరతరాలుగా ఎప్పుడు చూడనంత ధాన్యాన్ని చూస్తారు. అదే సమయంలో ఈరమ్మ పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. పేరయ్య, ఈరమ్మలు అతనికి ఎల్లయ్య అని పేరు పెట్టారు. ఒక్కవైపు పంటను, మరోవైపు మనవన్ని చూసిన బుచ్చయ్య ఆనందానికి అంతే లేదు.

సూర్యారావు మళ్లీ ఊళ్లోకి వచ్చాడు. తన ప్రక్కన ఉన్న బీడు భూమి ఇప్పుడు మొక్కజొన్న చేనుగా నిగనిగలాడుతుంటే అతని కళ్లలో నిప్పులు చెరిగాయి. దొర యొక్క అహంకారంతో పట్వారీ ప్రోద్బలంతో పేరయ్య భూమిని కోల్పోతాడు. దీనితో భూముల్ని ఎవరు సాగుచేస్తున్నారో తరువాత అవి దొరల పాలు ఎలా అవుతున్నాయో చదువురాని వాడైన పేరయ్యకు అర్థమవుతుంది. కష్టమో, నష్టమో స్వతంత్రంగా బ్రతుకుదామనుకున్న అతనికి దొర చర్య భరించరానిదిగా ఉంది. మళ్లీ పాలేరుగానో, కూలీగానో బ్రతకడానికి అతనికి మనసొప్పడం లేదు. దొరను చూస్తూ తనకు జరిగిన అవమానాలను మరచిపోతూ బతకడం తన వల్ల సాధ్యం కాదనుకున్నాడు. బాగా ఆలోచించి తల్లిదండ్రులను, భార్యను, పిల్లలను అక్కడే వదిలేసి బయట దేశంలో సంపాదించుకొని వస్తానని వెళ్ళిపోతాడు. ఆ ప్రాంతంలో ఉన్న ఊరు వదిలిపెట్టి కొంత దూర ప్రదేశానికి బతకడానికి పోతే దేశం విడిచి పోయాడనడం మామూలే. పొరుగు జిల్లాకు పోయినా దేశం పొయిండనే అంటారు. అతని కళ్ల ముందు మహత్తర లక్ష్యముంది. ఆ లక్ష్యాన్ని నెరవేర్చుకోవడానికి ఎన్ని కష్టాలైనా ఎదుర్కొవాలనుకుంటున్నాడు.

బుచ్చయ్య తన మనమన్ని బడికి పంపాలని దొరను అడుగుతాడు. చెప్పులు కుట్టుకుంటూ బతికే మాదిగవాళ్లకు కూడా చదువా? అంటాడు. దొరలు ఎప్పుడు మనలాంటి వాళ్ల అభివృద్ధిని కోరుకొరని, మనల్ని చదువనియ్యరని, చదువు  వల్ల అనేక ప్రయోజనాలు ఉన్నాయి అన్న నరసింహం మాటలకు తలూపి మనువడు ఎల్లయ్యను బడికి పంపిస్తాడు. ఎల్లయ్య బుద్ధిగా బాగా చదువుకుంటాడు. తమ వంశంలో మాత్రమే కాదు, తమ కులంలోని ఊర్నుంచి చదువుకుంటున్న మొదటి వ్యక్తి తన మనవడని బుచ్చయ్యకి ఆనందంగా ఉంది. భర్త ఊళ్లో లేకపోవడం వల్ల ఈరమ్మ పరిస్థితి అధ్వాన్నంగా ఉంది. ఊళ్లోని కొంతమంది ఆమెను అవమానించారు. తన భర్త తిరిగొచ్చి భవిష్యత్తులో తమకు మంచి రోజులను తీసుకువస్తాడన్న నమ్మకంతో ఉంది. తన మనవడు ఎల్లయ్యను బుద్ధిగా పెంచుతున్నాడు బుచ్చయ్య. తండ్రిలేని లోటు కనబడనీయకుండా తమకున్న దాంట్లో బాగానే చూసుకుంటున్నాడు. ఎల్లయ్య, రామక్క శారీరకంగాను, మానసికంగాను బాగానే ఎదుగుతున్నారు. ఇదే సమయంలో ఎల్లయ్య షోలాపూర్, భీవండి, బొంబాయి వెళ్ళి పనికే అంకితమై రాత్రింబవళ్లు కష్టపడి డబ్బు సాంపదించుకొని వచ్చాడు. తాను తెచ్చిన 2000 రూపాయలతో ఎకరం పొలం, ఎకరన్నర రేగడి, ఎడ్లు కొని వ్యవసాయం ప్రారంభించాడు. తన రెక్కల కష్టంతో సంపాదించుకున్న డబ్బుతో స్వంత భూమికి యజమాని అయిన పేరయ్యకు ఎంతో సంతృప్తిగా

ఉంది. ఇప్పుడు పేరయ్య ముందున్న లక్ష్యం తన కొడుకును బాగా చదివించుకోవడం అందుకోసం ఎన్ని కష్టాలు ఎదుర్కొవడానికైన సిద్ధంగా ఉంటాడు.

ఎల్లయ్యకు మాస్టారు తరగతి గదిలో గాంధీజీ గురించి అనేక విషయాలు చెప్పాడు. గాంధీజీని బాపూజీ అని జాతిపిత అని పిలుస్తారని చెప్పాడు. ఆ తరగతి గదిలోని కొంతమంది పిల్లలు వారి తండ్రులను బాపు అని పిలవడం ప్రారంభించారు. అలాగే ఎల్లయ్య కూడా 'బాపూ' అని తండ్రిని పిలిచాడు. ఎల్లయ్య ఆశ్చర్యపోతాడు. ఇలా పిలిస్తే మంచిదే కాని మన కులంల అలా పిలువరు అని కొడుకుకు చెప్తాడు. పేరయ్య, బుచ్చయ్యలు అతని చక్కని ఎదుగుదలను గమనిస్తున్నారు. ఎన్నో అవమానాలు ఎదుర్కొంటున్న వారికి చక్కని సంస్కారం, మానసిక వికాసంతో ఎల్లయ్య మాట్లాడటం చూసి వాళ్లకెంతో ఆనందంగా ఉంది. మరికొంత కాలం గడిచింది. స్వాతంత్ర్యం వచ్చి రెండు దశాబ్దాలు దాటింది. ఇందిరా గాంధీ ప్రధాన మంత్రిగా ఉన్నారు. ఎల్లయ్య ఎస్.ఆర్.ఆర్. కాలేజీలో డిగ్రీ చదువుతున్నాడు. గ్రామాల్లో కొంత చైతన్యం వెల్లువిరిచింది. పాత తరాన్ని ప్రశ్నించే యువతరం బయల్దేరింది. ఇతర కులాల యువకులు కొందరైనా దళిత యువకులతో కలిసి తిరుగుతున్నారు.

ఇందిరా గాంధీ 'గరీబీ హటావో' అంటూ దళితులకు ఇండ్లు ఇస్తానంటూ నినాదులు చేస్తుంది. వైశ్య కులానికి చెందిన వరమ్మ ఊరు మధ్యలో చిన్న హోటల్ నడుపుతుంది. అన్ని కులాల్లో చదువుకుంటున్న వారి సంఖ్య పెరిగిన కొద్ది హోటలుకు గిరాకీ పెరిగింది. ఆ హోటల్లో దళితులు టీ తాగడం, టిఫిన్లు చేయడం ప్రారంభించారు. కాలేజీలో ఎల్లయ్యను ఎల్లయ్య, ఓ ఎల్లయ్య అని వ్యంగ్యంగా పిలిచేవారు. ఊళ్లో కూడా ఎల్లిగాడు, మాదిగెల్లిగాడని పిలిచేవారు. కొందరు కించపరుస్తూ మాట్లాడేవారు. తన మిత్రులు పేరు మొరటుగా ఉందని చెప్పి మార్చుకోవాలని సలహా ఇస్తారు. చిన్నతనం నుండి కుల పీడనను, అస్పృశ్యతను, అనేక అవమానాలను ఎదుర్కొంటున్న ఎల్లయ్య కుటుంబానికి ఈ అవమానాలు లెక్కగాకున్నా పేరు మార్చుకోవాలని ఎల్లయ్య అనుకున్నాడు. కొంత కాలంగా కొడుకు మాట్లాడే విధానంలోను మార్పును గమనిస్తున్నాడు పేరయ్య. కాని పురిట్లో పెట్టిన పేరును మార్చడం పేరయ్యకు ఇష్టం లేదు. నేను పేరు మార్చుకోవడం నాలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడానికే తప్ప ఈ కులానికి, నా సంస్కృతిని, నా వాళ్లను దూరం కావడానికి మాత్రం కాదు అని నేనెంత చదువుకున్న ఉద్యోగినైనా, వీరందరిని మరిచిపోనని ఎల్లయ్య అంటాడు. నేను ఇలా మాట్లాడటం కావాలనే అలవాటు చేసుకుంటున్నాను. ఇంట్లోలాగా కాలేజీలో మాట్లాడితే ఎంతైనా మాదిగోల్ల భాష అని కొందరు

అవమానం చేస్తారు. అయిన మన భాష అద్భుతం అని తెలుసు కాని పట్టుపట్టి వారి భాషను నేర్చుకున్నాను. మనం మాట్లాడే భాష ద్వారా కూడా మనిషి విలువ నిర్ణయిస్తారు అని అంటారు. ఆ మాటలకు పేరయ్య, బుచ్చయ్యలు సంతృప్తి పొంది పేరు మార్పుకు అంగీకరిస్తారు. ఎప్పుడూ నవ్వు ముఖంతో ఆనందంగా కనబడే అతనికి ఆనందరావు అనే పేరు సరిగ్గా ఉందని చాలామంది అన్నారు. అప్పటినుండి 'ఆనందరావు'గా పిలువబడుతున్నాడు. ఈ పేరును కూడా దొరలు, రెడ్లు వ్యతిరేకించారు. అయినా అదే పేరును కొనసాగిస్తూ 'ఆనందరావు'గా ఉన్నాడు.

ఆనందరావు పి.జి. మొదటి సంవత్సరంలో ప్రత్యేక తెలంగాణ ఉద్యమం ప్రారంభమైంది. ఉద్యమ తీవ్రత వల్ల పాఠశాలలు, కళాశాలలు, యూనివర్సిటీలు మూసివేశారు. కళాశాల లేనందువల్ల ఆనందరావు ఇంటికి వెళ్ళాడు. విద్యా సంవత్సరం నష్టపోతున్నందుకు ఆనందరావుకు బాధాకరంగా ఉంది. అయినా చేసేదేంలేక తండ్రికి వ్యవసాయ పనుల్లో సాయం చేస్తున్నాడు. మనువడి అభివృద్ధిని చూడకుండానే జీవన సమరంలో అలసిపోయి కనుకమ్మ చనిపోయింది. భార్య మరణం బుచ్చయ్యను కృంగదీయడంతో మంచంపాలైన బుచ్చయ్య మరణించాడు. పేరయ్య అటు వ్యవసాయం ఇటు తండ్రి వృత్తి పనులు చేసుకుంటూ జీవనం గడుపుతున్నాడు. ఈరమ్మకు ఆరోగ్యం బాగుండటం లేదు. అత్త మామల మరణం ఆమెను ఇంటిలో ఒంటరిగా చేశాయి. ఆమె ఆరోగ్యం కుదుటపడగానే పేరయ్య ఆనందరావు పెళ్లి చేయాలని అనుకుంటాడు. ఆ తరువాత కాలంలో ఆమె ఆరోగ్య పరిస్థితి మంచిగా ఉండటంతో థామ్సన్ కూతురు మరియమ్మను, ఆనందరావుకిచ్చి పెళ్ళి చేస్తారు. ఆ పెళ్లిలో దళిత యువకులు ఉత్సాహంగా పాల్గొని బ్యాండ్ మేళంతో ఊరేగింపులో పాల్గొంటారు. బ్యాండ్ మేళం వాడటం ఆ ఊరిలో అదే మొదటిసారి అని చెప్పవచ్చు. అదే రోజు లక్ష్మణరావు కొడుకు పెళ్ళి జరుగుతుంది. ఇద్దరి ఊరేగింపులు ఒక్కటైనా చోట ఎవరూ ప్రక్కకు తొలగరు. దళితుల్లో వచ్చిన చైతన్యం వల్ల వారికి ఎదురు తిరుగుతారు. కొంత సమయం తరువాత ఇరువురు ప్రక్కకు జరుగుతారు.

ఆనందరావు కరీంనగర్ కు వెళ్ళి స్థిరపడ్డాడు. మరికొంత కాలం తరువాత ఉస్మానియా యూనివర్శిటీలో రీడరుగా ఉద్యోగమొచ్చింది. ఆనందరావు భార్య మరియమ్మ పిల్లలు శ్రీకాంత్, ఆజాదులతో కలిసి ఊరికి బయలుదేరారు. స్వంత స్కూటర్లపై స్వగ్రామం వెళ్లడం వల్ల వారికి ఆనందంగా ఉంది. సైకిళ్లను కూడ వాడని స్థితినుండి వచ్చిన వారికి స్కూటర్లపై పయనించడం సంతోషంగా ఉంది. ఊరి పొలిమేరల్లోకి ప్రవేశించగానే వారి శరీరాలు పులకింతకు గురవుతున్నాయి. ఊరు తన వాళ్లకెన్నో చేదు అనుభవాలనే మిగిల్చినా ఊరంటే ఆనందరావుకి

అభిమానమే. ఇప్పుడు అతని పరిస్థితి మెరుగ్గానే ఉంది. ఊర్లో తండ్రి కోరినట్టుగా రెండు ఎకరాల భూమి కొన్నాడు. తానెక్కడున్నా తన తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేయలేదు. స్వంత వాహనంపై కొడుకు, కోడలు, పిల్లలతో కలిసి రావడం చూసి పేరయ్య, ఈరమ్మ మురిసిపోయారు. ఉన్నత స్థితికొచ్చి హైదరాబాదులో ఉండబోతున్న కొడుకును హృదయానికి హత్తుకున్నారు. మనుమలు శ్రీకాంత్, ఆజాదులను ముద్దుపెట్టుకున్నారు. ఆ పిల్లలకు తాతయ్య, నానమ్మ, తాతయ్య, అమ్మమ్మల ఆప్యాయతలు వాళ్లకి ఎంతో సంతోషాన్నిచ్చాయి. పిల్లలు ఊర్లో పిల్లలందరితో కలిసిమెలిసి ఆడుకుంటున్నారు. ఆనందరావు పిల్లలు ఎలాగు పల్లె జీవితానికి దూరమవుతున్నారు. ఇక్కడికి వచ్చినప్పుడైనా ఆ జీవితాన్ని అనుభవించాలని భార్యతో అంటాడు. ఊరంటే కులాలు, అంటరానితనం, దొరలు, పాలేర్లు ఇంతే కదా? అయినా మీకు ఊరు మీద ఎందుకు ఆ ప్రేమ అని మరియమ్మ అంటుంది. ఊరంటే నువ్వన్న అవమానాలు మాత్రమే కాదు, ప్రేమలు, ఆప్యాయతలు ఎన్నో మరెన్నో ఊరు మనకిచ్చింది. మనకు బతుకునిస్తుంది. దళిత జాతి మూలాలు గ్రామాల్లోనే ఉన్నాయి అని సమాధానం చెప్పాడు.

శ్రీకాంత్, ఆజాదులు బాగా చదువుకుంటున్నారు. వారు ఒకరోజు తండ్రితో కలిసి చెప్పుల దుకాణానికి వెళ్ళారు. అక్కడ ఊరి దొర వామనరావు కొడుకు వెంకటరావును చూసి ఆశ్చర్యపోయారు. అతడు ఆ షాపులో పనిచేస్తున్నాడు. భూస్వాములమన్న గర్వం, కుల అహంకారంతో చదువును నిర్లక్ష్యం చేశారనుకొని వెంకటరావును చూసి ఆనందరావు జాలిపడ్డాడు. కాలగమనంలో వచ్చిన మార్పులవల్ల లక్ష్మణరావు కుటుంబం ఊరు వదిలి వెళ్లిపోయారు. తన వాళ్లను దొరలు ఘోరంగా హింసించారు. వారు చేసిన పాపానికి ఫలితాన్ని వెంకట్రావు అనుభవిస్తున్నాడు అని అనుకున్నాడు. తాను కార్లో రావడం, తన కుటుంబాన్ని ఘోరంగా హింసించిన దొర కుటుంబంలోని వ్యక్తి తన కాళ్ల ముందు చెప్పులు వేస్తుండటంతో జాలిపడ్డాడు. నగరంలో రాజారావు దొర కొడుకు తిరుమలరావు ఆజాద్ ని కులం పేరుతో దూషిస్తాడు. కుల పీడన తననేగాక తన కొడుకులను వెంటాడుతుండటం ఆనందరావుకి భరించరానిదిగా ఉంది. రాజారావు ఇంటికి వెళితే అతను చేసిన అవమానంతో అతని హృదయం దహించుకుపోయింది. దానితో దొరపై కేసు ఫైలు చేశాడు. వారికి కోర్టు నోటీసులు ఇచ్చింది. అప్పుడు రాజారావు కుటుంబం రాత పూర్వకంగా తన తప్పును ఒప్పుకుంటూ క్షమాపణలు కోరడంతో కేసు వాపసు తీసుకున్నాడు. అతను వివిధ రకాలైన చర్చాగోష్ఠులు, ఉపన్యాసాలు ఇస్తూనే ఉన్నాడు. దళిత సమాజం అభివృద్ధి కొరకు తాను శాయశక్తుల కృషి చేస్తూనే ఉన్నాడు. ప్రొఫెసర్ గా విద్యార్థులకు

తనవంతు కృషిగా కొంత సహాయం చేస్తున్నాడు. ఆనందరావు మాదిగ కులంలో పుట్టినందుకు గర్వపడుతున్నాడు. సర్వసంపదలకు సృష్టికర్తలైన దళిత జాతి నాది అని, ఆ జాతి వల్ల వచ్చిన కులం నాకు గర్వ కారణమే అంటాడు. దళిత కులాలకు వర్గీకరణ చేయాలని కొందరు ఆందోళనలు చేస్తున్నారు. పోరాటం ఉదృతం అవుతుంది. కొద్దిమంది దళిత కులాల్లోని వారు వైరుధ్యాలు సృష్టిస్తున్నారు. మాలమాదిగలు అనే విభజన చేస్తున్నారు. భారతదేశ ప్రథమ పౌరుడిగా దళితుడు ఎన్నిక కావడంతో వాళ్లలో ఆత్మవిశ్వాసం పెరిగింది. ఇంత కాలం ప్రత్యక్షంగానో, పరోక్షంగానో దళితులు చేసిన పోరాటాల ఫలితమే దళితుడు  రాష్ట్రపతి కావడం.

ఆనందరావు వారి పిల్లలైన ఆజాద్, శ్రీకాంత్ లకు భవిష్యత్తు గురించి ఇలా చెప్పాడు. అన్ని దళిత కుటుంబాలు మన కుటుంబంలా లేవని, ఎంతోమంది దళితులు హీనంగా, దీనంగా, బాధగానే బతుకుతున్నారు. అజ్ఞానం, అంటరానితనం వెంటాడుతునే ఉన్నాయి. ఇవన్నీ దృష్టిలో పెట్టుకొని ఆజాద్, శ్రీకాంత్ లు భవిష్యత్తు మార్గం ఎంచుకోవాలని సలహా ఇచ్చాడు. ఆనందరావు కుటుంబ సభ్యులు, బంధువులు, మిత్రుల సమక్షంలో శ్రీకాంత్, శ్రీలతల మరియు ఆజాద్, అనితల పెళ్లి చేస్తాడు. ఆ పెళ్లిలో కొన్ని ప్రత్యేకతలున్నాయి. ఆర్థికంగా, సామాజికంగా, ఇతరత్రా మంచి స్థితిలో ఉన్న ఆనందరావు తన కొడుకుల పెళ్లిళ్లను ఊర్లోనే చేశాడు. అంతేకాదు తాను ఆదర్శంగా ఉంటూ తన ఆదర్శాలకు అనుగుణంగా తన కొడుకులను తయారుచేయడం మరో గొప్ప విషయం. ఉద్యోగరీత్యా మంచి స్థితిలో ఉన్న శ్రీకాంత్, ఆజాద్ లు తమకెన్ని అవకాశాలు వచ్చిన, పెద్ద మొత్తంలో కట్నకానుకలు వచ్చే అవకాశాలున్న అన్నింటిని వదులుకొని తమ కులంలోని పేదింటి పిల్లలైన శ్రీలత, అనితలను జీవిత భాగస్వాములుగా ఎన్నుకున్నారు. ఈ పెళ్లికి వివిధ ప్రాంతాల నుండి దళిత మేధావులు, బంధువులు, మిత్రులు, ఉద్యోగులు చాలామంది వచ్చారు. మారుమూల పల్లెటూళ్లో జరుగుతున్న ఆదర్శ వివాహాలను చూడటానికి జనం వస్తూనే ఉన్నారు. పది గంటల సమయంలో శ్రీకాంత్—శ్రీలత, ఆజాద్—అనిత జంటలు ఒకరి మెడలో ఒకరు దండలు వేసుకున్నారు. మీ అందరి సమక్షంలో మేం భార్యభర్తలుగా కలిసుంటామని ప్రతిజ్ఞ చేస్తున్నమని, 'మా మూలాలను మరచిపోకుండా దళిత జాతి అత్యున్నతి సామాజిక బాధ్యతగా స్వీకరించి అందుకోసం మాకు చేతనైన కృషి చేస్తామని ప్రతిన బూనుతున్నాం' అని ప్రతిజ్ఞ చేయడంతో అక్కడున్న పెద్దలు వారిని భార్యభర్తలుగా ప్రకటించారు. వీరు విందు భోజనంలో ఒకప్పటి దళితుల తిండి గటిక, అంబలి, కుడుములు, గంజుపిండి, జొన్న రొట్టె, పచ్చి పులుసు, చేపల పులుసు మరియు మటన్, చికెన్, పూరీలు, అన్నం, ఇతర వంటకాలు పెట్టారు. అందరు కడుపు నిండా తిని

వెళ్ళాలని ఆనందరావు వేడుకున్నాడు. ఇంతటితో కథ ముగుస్తుంది. ఇది ఆనందరావు విజయం మాత్రమే కాదు. ఆనందరావు కుటుంబం విజయం. మాదిగ జాతి విజయం. మాదిగ విజయం.

### 3.3.1.2. వస్తు విశ్లేషణ:

ఈ దేశంలో అత్యధికంగా అణగారిన జాతియైన మాదిగలకు తద్వారా దళితులకు రాజ్యాధికారం వచ్చినప్పుడే దేశాన్ని పీడిస్తున్న కుల సమస్య తద్వారా అనేక సమస్యలకు పరిష్కారాలు లభిస్తాయి. తరతరాలుగా వేదనకు, పీడనకు, అంటరానితనపు దౌర్భాగ్యం అనుభవిస్తున్న దళితులకు, పేరయ్య, చిలుక రామయ్యలాంటి కుటుంబాలకు రాజ్యాధికారం రావాల్సిందే. తాము మాదిగవాళ్లమని చెప్పుకోవడానికి సంకోచించే దశ నుండి వారి పేరు వెనుక మాదిగ అని పెట్టుకోవడానికి తాము మాదిగలమని చెప్పుకోవడానికి గర్వకారణంగా భావించే స్థితికి కారణం ఈ నవలలోని ఆనందరావు కుటుంబ విజయం. అదే మాదిగ విజయం. వివిధ రకాల ఉద్యమాలు, ఆనందరావు లాంటివారు విజేతలుగా నిలువడం, చదువులతో ఉన్నత స్థితికి వెళ్ళిన శ్రీకాంత్, ఆజాద్ లు ఆదర్శంగా నిలవడం లాంటివి పీడిత జాతుల వెలుగుగా చెప్పవచ్చు. ఇరవై ఒకటవ శతాబ్దం ఖచ్చితంగా పీడిత జాతులదే అని నిరూపిస్తూ జరుగుతున్న పరిణామాల వెలుగులో ఇలాంటి విజయాలు ఎన్నో జరుగుతున్నాయి. అన్ని రంగాలలో ముందుకు వెళ్తూ దళిత రాజ్యాధికారం దిశగా అడులేస్తున్న దళిత చైతన్యపు వీరులు ఎంతోమంది ఉన్నారు. తెలంగాణలో ఆనందరావు తరంతో ప్రారంభమైన విజయ పరంపర దళితుల నుండి ఆచార్యులు, న్యాయవాదులు, కలెక్టర్లు, రచయితలు, రాజకీయ నాయకులు, కళాకారులు, తత్త్వవేత్తలుగా పరిణామం చెందుతూనే ఉన్నారు. ఒక్క ఆనందరావు విజయంతోనో అలాంటి కొద్దిమంది విజయంతోనో 'మాదిగ విజయం' పూర్తయినట్టు కాదు. విజేతలైన వారంతా అంబేద్కర్ పీడిత జన పక్షపాత సిద్ధాంతాల వెలుగులో ఇప్పటికీ హీనదశ స్థితిలో ఉన్న దళిత సోదర సోదరీమణులను విజేతలుగా నిలిపినప్పుడే మాదిగ విజయం పూర్తవుతుంది.

ఈ ఇరవై ఒకటవ శతాబ్దంలో దళితులదే జయమని ఒబామా, మాయావతి ఎన్నికలలో గెలువడం రుజువుగా కనబడుతుంది. ఓ దళితుడు దేశాధ్యక్షుడు కావడం వెనుక ప్రత్యక్ష, పరోక్ష పోరాటాల ఫలాలెన్నో ఉన్నాయి. తరతరాల పీడన అనుభవించిన దళితుడు రాజ్యాధికారం కొంతకాలమైనా చేయాల్సిందే. తెలంగాణలో మాదిగలు ఎక్కువగా ఉన్నారు. వివిధ ఉద్యమాలు తెలంగాణలో వచ్చిన తరువాత ఫ్యూడల్ దొరలతో పీడితులైన మాదిగల్లో చైతన్యం వచ్చింది. ఆ చైతన్యాన్ని ఉపయోగించుకొని మందకృష్ణ మాదిగ, కృపాకర్ మాదిగ రాష్ట్రంలోని మొత్తం

మాదిగల్ని కదిలించగల నాయకులుగా ఎదిగారు. మందకృష్ణ మాదిగ ఒక చారిత్రక స్థితిని ఉపయోగించు కోగలిగే చైతన్యవంతమైన పాత్రను నిర్వహిస్తున్నాడు. శాసనసభల్లోను వారి సమస్యలే ఎక్కువ చర్చకు వచ్చేంత స్థితికి ఉద్యమాన్ని తీసుకువెళ్లాడు. అందుకే దళిత కులాల వర్గీకరణ జరగాలన్న ఆందోళన తీవ్రమైంది. ఉన్న రిజర్వేషన్ సౌకర్యాలను కొద్దిమంది మాత్రమే ఎక్కువగా ఉపయోగించుకుంటున్నారని ఎవరి వాటా వారికి చెందాలని అందుకు కులాల వర్గీకరణయే మార్గమని పోరాటాలు చేసి వారిని ఎ, బి, సి, డి గ్రూపులుగా విభజించడం జరిగింది. వారి జనాభాను ఇతర పరిస్థితులను అనుసరించి రిజర్వేషన్ శాతాన్ని పెంచుతూ జి.వో. జారీ చేయడం జరిగింది. పీడితులు అయిన పల్లెల్లోని మాదిగలు భూమి, చదువు, అధికారం పొందటంవల్ల నలుగురితో సమానంగా గౌరవంగా నిలుస్తారని భావించి రచయిత ఈ నవల రాశాడు. స్వాతంత్ర్యం రాకముందు సూర్యారావు లాంటి దొరల ఆగడాలు తెలంగాణలో ఏ స్థాయిలో ఉండేవో తెలుసుకున్నాం. స్వాతంత్ర్యం వచ్చాక సమాజంలో వచ్చిన మార్పులు, అది దళితుల జీవితంలో వచ్చే పరిణామాలు జాగ్రత్తగా సమన్వయ దృష్టితో వ్రాశాడని చెప్పవచ్చు. ఒక మాదిగ కుటుంబం తెలంగాణలో ఈ శతాబ్దంలో పొందిన అభ్యుదయాలను చిత్రించిన నవల ఇది. ఇది దళితులకు మేలుకొలుపు వంటిది. ఇది సమాజం గ్రహించి విజయం పొందటానికి కరదీపిక లాంటిది.

### 3.3.1.3. దళితుల మత మార్పిడి విధానం:

నైజాం పాలనలో నిజాం నవాబు ఎలాంటి మత ప్రచారాలకు అనుమతించలేదు. పోచమ్మ, మైసమ్మలాంటి క్షుద్ర దేవతల గుళ్ళు కట్టుకోవడాన్ని ప్రోత్సహించారు. నిజాం ఎంత ప్రతిఘటించినా ఢిల్లీలో ఉన్న పాలకులది క్రైస్తవం కాబట్టి పరిమితంగానైనా క్రైస్తవ మత ప్రచారానికి అనుమతించక తప్పలేదు. అందుకే స్వాతంత్ర్యానికి పూర్వం కోస్తా ప్రాంతంలో స్వీకరించినంతగా తెలంగాణలో క్రైస్తవాన్ని స్వీకరించలేదు. అన్ని మతాలవారు మత మార్పిడిలకు దళితులనే ప్రోత్సహించారు. అన్ని ప్రాంతాల్లోను తమ మీద ఉన్న పీడనను, అంటరానితనాన్ని భరించలేక దళితులే ఎక్కువ మంది మతం మార్చుకున్నారు. క్రైస్తవ మత ప్రచారకులు ఊళ్లలో తిరిగి మత మార్పిడిని ప్రోత్సహించారు. తమ మతంలో చేరితే అంటరానితనం ఉండదని, అందరితోపాటు చర్చికి వెళ్లొచ్చని ప్రార్థనలు జరుపుకోవచ్చని, చదువుకోవడానికి కూడా అవకాశాలు కల్పిస్తామని ప్రచారం చేశారు.

ఆ ఊరి దళిత యువకులకి గుళ్లోకి ప్రవేశం లేదు, పండుగలనైనా తమ ఇష్టానుసారం చేసుకునే అవకాశంలేని మతంలో ఉండటం ఎందుకన్న ఆలోచన వచ్చి వారిలో తర్జన భర్జనలు

మొదలయ్యాయి. దసరా తరువాత వారం రోజులకి దళిత యువకులు, మిగతా కొంతమంది కొండయ్య ఇంటి ముందు చర్చించారు. అక్కడికి క్రైస్తవ మత ప్రచారకుడు ఒకరు వచ్చారు. అతని మాటలను అర్థం చేసుకొని కొందరు మత మార్పిడికి అంగీకరించారు. కొంతమంది నిజాం నవాబుకి భయపడి బాధలు అనుభవించడం ఎందుకు అని ఆలోచించి మత మార్పిడిని విరమించుకున్నారు. తమ మతంలో తారతమ్య భేదాలు లేవని చదువు, ఉద్యోగాల విషయంలో తమ సాయం ఉంటుందని ఇంకా అనేక విషయాలు ప్రచారకుడు చెప్పాడు. అయితే అతడెన్ని విషయాలు చెప్పిన చివరకు రెండు కుటుంబాల వాళ్లు మాత్రమే తమ మత మార్పిడికి అంగీకరించారు. ఆ కుటుంబ సభ్యులందరిని ఊరి బయట ఉన్న చెరువు దగ్గరికి తీసుకువెళ్ళి కొన్ని ప్రతిజ్ఞలు చేయించాడు. వాళ్లకు బాప్టిజం ఇప్పించాడు. ఆ రెండు కుటుంబాల వారు క్రైస్తవులయ్యారు. మంచి క్రైస్తవులు ఎలా ఉండాలో బైబిల్లోని వాక్యాలను కోడ్ చేస్తూ కొద్దిసేపు ప్రసంగించాడు. జానయ్య ఇప్పుడు జాన్సన్ గా పేరు మార్చుకున్నాడు. తిమ్మయ్య థామ్సన్ అయ్యాడు.

### 3.3.1.4. దళితుల జీవన విధానం:

చాలా ఊళ్ళకున్నట్టే ఆ ఊరికి ఓ దళితవాడ ఉంది. ఊరి చిట్టచివరన మాదిగవాడ ఉంది. ఆ వాడను ఆనుకునే మాలవాడ ఉంది. రెండింటిని కలిపి మాదిగమన్నేపొల్లవాడని, దళితవాడని అంటారు. ఆ వాడలో అన్ని పాకలే ఉన్నాయి. రెల్లుగడ్డి, వరిగడ్డి తాటాకు కప్పులతో ఉండే ఆ గుడిసెలను ప్రతి సంవత్సరం సదరాల్సిందే. ఆ వాడకున్న ప్రతి ఇంట్లో ఓ చేద బావుంది. ఆ బావుల్లో ఉండే నీళ్లు ఉప్పునీళ్లు అవి స్నానాలకు, ఇతర గృహావసరాలకు వాడుతారు. తాగడానికి, వంటకు మాత్రం చెరువు నీళ్లు వాడుతారు. ఆ ఊరిలో మంచి నీళ్ల బావి ఉన్న ఆ నీళ్ళను దళితులు ముట్టుకోకూడదు. వారి కోసం వేరే బావి తవ్వించడానికి ఏ అధికారి, నాయకుడు ముందుకు రాదు. ఉన్న మంచి నీళ్లబావి నీళ్లు తీసుకోవడానికి, వివాదం సృష్టించడానికి దళితులు సిద్ధంగా లేరు. ఆ వాడలోని వీధులన్ని మురికి మురికిగానే ఉంటాయి. ప్రతి గుడిసె ప్రక్కన ఉన్న పెంట దిబ్బలో మురికి పదార్థాలు, చెత్తచెదారం వేస్తారు. ఆ వాడలో చాలామంది శరీరాల మీద చొక్కాలు ఉండవు. మొలకు మాత్రం చిన్న పంచెలు ఉంటాయి. తలపాగాలు ఉంటాయి. స్త్రీలు బొంతల్లాంటి దొడ్డు చీరలు ధరిస్తారు. ఒక్కో స్త్రీకి రెండుకంటే ఎక్కువ చీరలుండటం అరుదు. పిల్లలకు గోచీలున్న వారు కొందరైతే అవి లేనివారు చాలామంది ఉంటారు. ఊళ్లో ఉన్న వందలాది ఎకరాల భూముల్లో దళితులెవరికి భూములున్న దాఖలాలు లేవు.

ఊరి వాళ్లందరికి మాలలు, మాదిగలు అంటరానివాళ్లే. మాదిగవాళ్లు తాకితే పెద్ద ముట్టుడుగా భావిస్తారు. దళితవాడకు వెళ్లితే వారి గుడ్డపీలికలు కాళ్లకు తగులకుండా జాగ్రత్త పడతారు. ఒకవేళ తగిలితే ఇంటికొచ్చి స్నానాలు చేస్తారు. దళితుల్లో చాలా ఉపకులాలు ఉన్న మాల, మాదిగల సంఖ్యే ఎక్కువ. ఊరంతటికి మాలమాదిగలు అంటరానివాళ్లు అయితే మాలలకు మాదిగలు అంటరానివారు. వీరి మధ్య కంచం, మంచం పొత్తుల్లేవు. ఈ కులాల వారికి గుళ్లోకి పోయే అవకాశం లేదు. దళితులంతా పోచమ్మ, మైసమ్మ, ఎల్లమ్మ లాంటి మాతృస్వామ్య దేవతలను పూజిస్తారు. కొన్ని క్షుద్ర దేవతల కొలుపులు చెప్తారు. మాదిగవారిలో చాలామంది తమ వృత్తి పనులు చేసుకుంటూనే బతుకుతున్నారు. చెప్పులు కుట్టడం, తాళ్లు పేనడం, వ్యవసాయదారులకు ఉపయోగపడే తలుగులు, దందెడలు, పగ్గాలు పేనడం లాంటి పనులు చేస్తూ బతుకుతున్నారు. కొంతమంది వెట్టివాళ్లుగా, పాలేర్లుగా, కూలీలుగా బతుకుతున్నారు. మాలలు పాలేర్లుగా, కూలీలుగా, సుంకర్లుగా, నీరటికాళ్లుగా వ్యవసాయాధారిత ఇతర పనులు చేస్తూ బతుకుతున్నారు. మాదిగవాళ్ల ఇంట్ల పందిర్లపై, గుడిసెలపై పశువుల తోళ్లు ఆరేసుకుంటారు. ఇంటి నిండా ఉత్పత్తితో సంబంధమున్న వస్తు సామాగ్రి ఉన్న, ఇంట్లో మాత్రం దుర్భర దారిద్ర్యం విలయతాండవం చేస్తూంటుంది. చాలాచోట్ల దళితవాడల పరిస్థితి ఇలాగే ఉంటుంది.

దళితులు వారి సాంప్రదాయం ప్రకారమే పెళ్ళి చేసుకుంటారు. దళితులకు పెళ్ళిళ్లు చేసే మిత్తిరయ్య వారి పురోహితుడు. జోడు నాగలెత్తుకొని వ్యవసాయానికి పోవడం, విత్తనాలు వేయబోవడం, అలుగు పోవడం లాంటి పెళ్లి తంతు కార్యక్రమాలు అన్ని పద్ధతి ప్రకారమే జరుగుతాయి. దళిత ముత్తైదువలు పాన్పులేసే పాటలు పాడుతారు. కల్లు, గుడాలతో విందు జరుగుతుంది. అప్పగింతల సమయంలో పెళ్లికూతురు వారి తరుపువారు ఏడుస్తూ ఆమెను అప్పగిస్తారు. దళితులకు ఇతర కులాలవారికి ఉన్నట్టుగా అన్ని పండుగలు జరుపుకునే అవకాశం లేకున్నా అవెప్పుడు తమవి కావని భావించలేదు. సంక్రాంతి పండుగ వీరు జరుపుకునేవారు. వ్యవసాయదార్లకు ఇది పెద్ద పండుగ.

దళిత కుటుంబాల్లో చాలావరకు తల్లే యజమానురాలుగా ఉండటం కనిపిస్తుంది. భార్యాభర్తలిద్దరూ పనిచేస్తూ సంపాదిస్తుండటం వల్ల ఇంటి యాజమాన్యంలో సగం వరకు స్త్రీ పాత్ర కూడా ఉంటుంది. దళిత కుటుంబాల్లో, మధ్యతరగతి కుటుంబాల్లోలాగా స్త్రీ మీద పురుషుడి ఆధిక్యం పెద్దగా కనిపించదు. దళితులు ఎక్కువగా గటిక, అంబలి, కుడుములు, గంజుపిండి, జొన్నరొట్టె, పచ్చి పులుసు, చేపల పులుసులతో తినేవారు. అప్పటితో పోల్చితే ప్రపంచీకరణ ప్రభావం వలన

ఇప్పుడు వారి జీవన విధానంలో చాలా మార్పులు వచ్చాయి. వారిలో వచ్చిన చైతన్యం కూడా వారి జీవ విధానాన్ని మార్చిందని చెప్పవచ్చు. వారిలో కొందరు ఈరోజు ఉన్నత స్థాయి జీవితాన్ని గడుపుతున్నట్లుగా మనం చూడవచ్చు. ఆనందరావుతో ప్రారంభమైన వారి మార్పు ఇంకా వారిలో చాలా మార్పులు రావాలని జీవన విధానంలో వీరు ఎంతో ఉన్నత స్థాయికి ఎదుగుతారని ఆశిద్దాం.

### 3.3.1.5. దళితుల సంస్కృతి:

ఎవరూ అనుకరించని సంస్కృతి ఏ విదేశీ వాసనలు, మోజులేని సంస్కృతి. దాన్ని కాపాడుకుంటున్నాడు దళితుడు. ఈ దేశంలోని ఆదిమ భారతీయుడు దళితుడే. నిజమైన జాతీయవాది దళితుడే. ఎంతో వైవిధ్యమున్న సంస్కృతి, సాంప్రదాయాలు, ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కొన్నాడు. నాగరికతను పెంపొందించినవాడు దళితుడు. హక్కుల కోసం, ఆత్మగౌరవ కోసం, రాజ్యాధికారం కోసం పోరాటాలు చేస్తున్నాడు దళితుడు. భూములను సస్యశ్యామలం చేయడానికి ఘర్మ జలాన్ని ధారబోస్తున్నవాడు. నాగరికత విలసిల్లడానికి చెమటోడ్చుతున్న శ్రమజీవి దళితుడు. ప్రాజెక్టులను కట్టినవాడు, కొండలను పిండిచేసేవాడు ధన్యజీవి దళితుడు. దళితులు చాలామంది పాలేర్లుగా, కూలీలుగా, చెప్పులు కుట్టేవాళ్లుగా, డప్పు కొట్టేవాళ్లుగా, నీరటికాళ్లుగా, తాళ్లు పేనేవాళ్లుగా, చిన్న చిన్న వ్యవసాయదారులుగా ఉంటూ రెక్కాడితే కాని డొక్కాడని పరిస్థితుల్లో ఉన్నారు. ఇప్పుడు ఆ వృత్తులకు కూడా విఘాతం ఏర్పడి సంక్షోభంలో ఉన్నారు. దుబాయికి వెళ్లడం, కమ్యూనిస్టులుగా మారడం లాంటి అనేక సంఘటనలు జరుగుతున్నాయి. ఓ దిక్కు చాపకింది నీరులా అంటరానితనం, మరోదిక్కు పోరాటాలు జరుగుతూనే ఉన్నాయి. సర్వ సంపదలకు సృష్టికర్తలైన దళితులకు తాము పోరాడి గెలుచుకున్న జీవితముంది. గెలుచుకోవాల్సింది ఇంకా ముందుంది.  మాతృస్వామ్య దేవతారాధన, ఇండ్లల్లో జంతువులను పెంచడం, పిడకల మీద అగ్గిని మండించడం వంటి పనులను దళితులు చేస్తూనే ఉన్నారు. దళితుల్లోంచి చదువుకొని ఉన్నత స్థాయికి చేరినవారు కొంతమంది తమ కుటుంబాల వారికి సహాయం చేస్తున్నారు. మరికొందరు తమ మూలాలను మరిచిపోయి రెక్కలొచ్చిన పక్షుల్లా ఎగిరిపోయారు. ఇంకొందరు మాత్రం తమ జాతి అభ్యున్నతి కోసం పాటుపడుతున్నారు. దళిత వనం వికసిస్తూనే ఉంది.

దళితులను అడుక్కోవడానికి చిందు భాగోతులవారు ఊళ్ళోకి వస్తారు. వారి రాకతో దళితవాడ సందడిగా ఉంటుంది. వారు భాగోతాలాడుతూ దళితుల దగ్గర బాపతులు వసూలు చేస్తుంటారు. వాళ్లకు చదువు రాదు. అయినా వంశపారంపర్యంగా భాగోతాలాడే కళ ఒకరి నుండి మరొకరికి సంక్రమిస్తుంది. నిరక్షరాస్యులే అయినా నాటకాలాడుతుండటం వల్ల వారి భాష కొంచెం

నాగరికంగా ఉంటుంది. అందులో ఓ ప్రత్యేకమైన యాస ఉంటుంది. వారి వల్ల దళితవాడలో రెండు నెలల వరకు పండుగ వాతావరణం ఉంటుంది.

### 3.3.1.6. భూస్వామ్య వ్యవస్థలో దొరల పీడన:

నిజాం పాలనలో నాలుగైదు శాతంగా ఉన్న భూస్వాముల చేతుల్లోనే భూములన్నీ ఉన్నాయి. మిగతా వారంతా భూమిలేనివాళ్లే. భూస్వాముల భూముల్లో పాలేర్లుగా, కౌలుదార్లుగా పనిచేస్తున్నవాళ్లు ఎక్కువగా దళితులే. నైజాం జారీ చేసిన కొత్త పన్నుల చట్టం 'సర్వే సెటిల్మెంట్ యాక్ట్' రాకముందు భూస్వాములే కాక కొంతమంది రైతులకు కూడా స్వల్పంగా భూములుండేవి. చాలాకాలం వరకు శిస్తులన్నీ వస్తురూపంలో చెల్లించేవారు. కొత్త పన్నుల విధానం అమల్లోకి వచ్చిన తరువాత పన్నులు డబ్బుల రూపంలో చెల్లించాల్సి వచ్చింది. అమాయకత్వం, చదువుకోకపోవడం, అణచివేత దుర్మార్గంగా ఉన్న సమయంలో ప్రజలు తమ ధాన్యాన్ని డబ్బులకు అమ్ముకునే పరిస్థితులు లేవు. ఇతర ప్రదేశాలతో సంబంధాలు అతి తక్కువ. మిగిలే పంటే తక్కువంటే దాన్ని అమ్ముకునే సౌకర్యాలు మరీ తక్కువ కావడం వల్ల చిన్న రైతు పరిస్థితి అస్తవ్యస్తమైంది. క్రమక్రమంగా పన్నులు చెల్లించడం సాధ్యంకాక భూములు వదులుకోవాల్సి వచ్చింది. పన్నులు చెల్లించలేని రైతుల నిస్సహాయతను ఆసరాగా చేసుకొని భూస్వాములు, దేశ్ ముఖ్ లు, పట్వారీలు పలుకుబడి ఉపయోగించి వాటిని స్వాధీనం చేసుకున్నారు. ఇలా భూమ్మీద పనిచేసే రైతులు భూమిలేని వారైతే పట్వార్లు, పటేళ్లు, దొరలు భూస్వాములయ్యారు. ఇందులో అగ్రకులాల వారే ఎక్కువ. వారికి నిజాంతో, అధికార్లతో సత్సంబంధాలు ఉండేవి. దొరలు, పటేళ్లు, పట్వార్లు తనకు అండగా ఉండటంతో నిజాం నిరంకుశంగా రాజ్యమేలాడు.

పైన చెప్పిన నేపథ్యం ఉన్న గ్రామంలో నర్సింగరావు భూస్వామి, పెద్ద దొరగా నిజాం అండదండలతో అపరిమితంగా ఆస్తి సంపాదించాడు. మాదిగ రామయ్య దొర గడీకే అంకితమయ్యాడు. దొర పశువుల కొట్టానికే పరిమితమయ్యాడు. దొర భూములకే తన ఘర్మజలాన్ని అంత ధారపోశాడు. దొర కుటుంబం కోసమే తన రక్తమాంసాలను ధారపోశాడు. ఇంటి వాకిట్లోనో, పొలాల దగ్గరో కావలిగా పడుకునేవాడు. అతడెంత పనిచేసినా దొరతో, అతని మనుషులతో తిట్లు తినడం తప్పడం లేదు. దొర కుటుంబం వాళ్లంతా బియ్యపు అన్నం తినేవారు. పాలేర్లకు, వెట్టివాళ్లకు పనిచేసేవారికి మాత్రం మొక్కజొన్న గటికే వండిపెడతారు. ఒక్కోసారి వారు తినగా మిగిలిన పాచిపోయిన అన్నం, కూరలు పెట్టేవారు. అతని బతుకంతా దొర దగ్గర వెట్టి బతుకులాగా ముగిసింది. అతని కొడుకు బుచ్చయ్య కూడా తండ్రిలాగే పాలేరుగా సూర్యారావు దొర దగ్గర

పనిచేశాడు. అతని కొడుకులైన లింగయ్య, పేరయ్యలను కూడా దొర దగ్గర పాలేరు పనికి ఉంచాడు. పేరయ్యను దొర దగ్గర పని చేయించడం ఇష్టం లేకున్న దొర ఆగ్రహానికి లోనై అతనిని కూడ ఎడ్లు కాయడానికి పాలేరుగా ఉంచాల్సి వచ్చింది. చిన్నవాడు అయిన పేరయ్య పెద్దవాళ్ల కంటే ఎక్కువ పనిచేసేవాడు. పేరయ్య కిరాయికో, గుత్తాకో భూములు దున్నుకుంటున్నాడంటా అని బుచ్చయ్య అనడంతో సూర్యారావు దొర ఆగ్రహంతో అన్న మాటలు ఇవి: "ఆహా... ఏమన్నావురా...? మాదిగ్గాడిది కొడుకులు గూడ భూములు దున్నుకుంటరంట... నీకేమున్నయని దున్నుతవురా...! మా మోచేతి కింది నీళ్లు తాక్కుంట బతికే మీకు భూములు కావాల్సి వచ్చినాయిర...? నీ యవ్వ మాదిగ పీసునా గొడుదు... బాగ కావురం మొచ్చిందిరా మీకు...? భూమి దున్నుతాడట... ఎవ్వరి భూమిరా నువ్వు దున్నేది...?" (మల్లయ్య, కాలువ.2015:పుట.6). ఈ సందర్భంలో దొర నోటికొచ్చినట్టు బూతులు తిట్టడం ద్వారా అతని యొక్క అహంకారం తెలుస్తుంది. ఓ మాదిగ కులస్థుడు సొంత వ్యవసాయం చేసుకుంటాననడం పెద్ద తప్పైనట్టు మాట్లాడడం చూసి పేరయ్యలాంటి దళితులు చైతన్యవంతులు కావడానికి ఒక ఉదాహరణగా దీన్ని తీసుకోవచ్చు. దొర దగ్గర పాలేరు పని మానేశాడు పేరయ్య. కమ్యూనిస్టుల ప్రభావంతో, ఉద్యమకారుల పోరాటాలతో కొంతకాలం తరువాత సూర్యారావు దొర, లక్ష్మణరావులు ఊరు వదిలి వెళ్ళిపోయారు.

### 3.3.1.7. దళిత సమస్యను చిత్రించే ఉపన్యాసాలు:

దళితవాడలో నిరుపేద కుటుంబంలో పుట్టాను. మాది బానిసల వంశం. మా తాత, ముత్తాతలు వెట్టిలాంటి పనులు చేస్తూ బతికారు. మా నాన్న పాలేరుగా, చిన్న వ్యవసాయదారుడిగా బతికాడు. నన్ను కష్టపడి చదివించాడు. సర్వ సంపదలను సృష్టించే దళితులకు ఆ సంపదలో ఏ మాత్రం భాగం లేదు. నేను చదువుకుంటూ ఎన్నో అవమానాలను ఎదుర్కొన్నాను. నా పూర్వీకులు నేను కూడా చాలాకాలం వరకు ఒక్కపూట బుక్కెడు మెతుకుల బువ్వ కోసం అలమటించాం. ఇప్పటికీ ఆ స్థితిలో ఉన్నవారు చాలామందే ఉన్నారు. ఫూలే, అంబేద్కర్, పెరియార్ లాంటి సంస్కర్తలు, మేధావుల కృషి వల్ల మనలో కొందరైనా ఓ తీరుగా బతికే స్థితికొచ్చాం. ఒడ్డు చేరాక తెప్ప తగిలేసినట్టు మనం బాగున్నామని ఇతరులను పట్టించుకోకుండా ఉండటం సరైంది కాదు. నా పరిశీలన ప్రకారమైతే ఇరవైయవ శతాబ్దం పీడిత జాతులకు అనుకూల దిశగా సాగింది. పీడిత జాతికి ఎంతో కొంత మేలు జరిగింది. ప్రలోభాలు, సుఖవాంఛలు, ఎంజాయ్ మెంట్, హింస, డబ్బు సంపాదన దిశగా సమాజం నడుస్తున్నట్టనిపిస్తుంది. సంపాదనలోను మానవతా స్పర్శ ఉండాలన్న విషయాన్ని గుర్తుంచుకుంటే ఏ ప్రలోభాలు మనల్ని ఏం చేయలేవు. ఈ శతాబ్దాన్ని మరింతి పీడిత

జాతికి అనుకూలంగా మార్చగలిగే శక్తి యువతరం పైనే ఉంది. నాకు ఈ తరం మీద నమ్మకం ఉందంటూ తన ఉపన్యాసాన్ని ఆనందరావు ముగించాడు.

"ఈ దేశంలో బట్టలు నేచేవాళ్ల ఒంటిమీద బట్టలుండవు... పంట పండించే వాళ్లకు తిండి దొరకదు... చెప్పులు కుట్టేవాడి కాళ్లకు చెప్పులుండవు... శ్రమ పరాయీకరణం చెందడం ఎప్పట్నుంచో ఉంది. అన్ని రకాల  పనులు చేసే దళితుడు ఇంకా ఇంకా పోరాటాలు చేయాల్సి రావడం దౌర్భగ్యమే... విశ్రాంతి వర్గాల వారి చేతుల్లో సంపదలు కేంద్రీకృతమై ఉండటమూ విచారింపదగ్గ విషయమే... తరతరాలుగా దళితుడు పీడితుడే... తన కష్టాన్ని తాను అనుభవించే అవకాశాలు లేనివాడు... భూమిని దున్నినవాడు దళితుడే... భూసార రక్షణ కోసం పశువుల ఎరువును భూమంతా చల్లినవాడు దళితుడే... ఎన్నో సంపదలను సృష్టించినవాడు దళితుడే... కాని ఆ సంపదలకు కర్తృత్వం మాత్రం అతనిది కాదు...

"నిజంగా దళితుల బతుకుల్లో ఎంతో వేదన ఉంది...? కాని వాళ్ల జీవితాల్లో ఎంత ఉపయోగత ఉంది...? దేశీయతను, భాషను, సంస్కృతిని కాపాడేది దళితులు... గ్రామాలు... అయితే అవన్నీ మటుమాయమై పోయే పరిస్థితులొస్తున్నాయి... దళితుల అభ్యున్నతి, అభివృద్ధి తమను తాము రక్షించుకోవడంలోనే ఉంది... ఎంతో మంది ఆకలితో అలమటిస్తుంటే కొంతమంది కోట్లాది ఆస్తులను నిలువ చేసుకుంటే శాంతి ఎలా ఉంటుంది...?" (మల్లయ్య, కాలువ.2015:పుట.316,317) ఇలా చాలా విషయాలు చెప్పి రాంరెడ్డి ముగించాడు. దళితుడు కాని ఓ వ్యక్తి దళిత సమస్యల పట్ల అంత అవగాహనతో ఆత్మీయంగా మాట్లాడటం చాలా గొప్పగా ఉందని చెప్పవచ్చు.

దళితవాదంతో సాహిత్యంలోకి దళిత సమస్యలు ఎక్కువగా చోటు చేసుకున్నాయి. దళితుల నుండి చాలామంది రచయితలుగా ఎదుగుతున్న క్రమాన్ని మనం చూడవచ్చు. ఎవరి చరిత్రను వారు లిఖించుకుంటే ఆ రచనకు మరింత వాస్తవికత ఉంటదని, జీవితంలో నుండి వచ్చిన సాహిత్యం జీవితమంతా స్వచ్ఛంగా ఉంటుందని ప్రొఫెసర్ ఇంద్రజిత్ గారు తెలిపారు. మొదటి తరంలో కోస్తా ప్రాంతం నుండి వచ్చిన మాలల ఉద్యమాల వల్ల మాలల గూర్చి రచనలు వచ్చాయి. తెలంగాణలో మాదిగల ఉద్యమం వల్ల మాదిగ జీవితాలు గూర్చి రచనలు వచ్చాయి. ఈ ఉద్యమాలు దళితుల్లో ఆత్మవిశ్వాసాన్ని కలిగించాయి. స్త్రీవాద ఉద్యమంలో అసలు దళిత స్త్రీ గురించి పట్టించుకోలేదని ఇంద్రజిత్ గారు తెలియజేశారు.

దళితుల ప్రత్యక్ష, పరోక్ష పోరాటాల ఫలితమే ఓ దళితుడు రాష్ట్రపతి కావడం. అతను విధులను నిర్వహించిన తీరు ప్రపంచంలోనే ఉత్తమ రాజనీతిజ్ఞునిగా నిలబెట్టింది. దేశవ్యాప్తంగా దళితుల హక్కుల గూర్చి, విద్యావకాశాల గూర్చి, రాజ్యాధికారం గూర్చి చైతన్యవంతమైన పోరాటాలు జరుగుతూనే ఉన్నాయి. దళిత చైతన్యం వెల్లివిరుస్తూనే ఉంది. ఎన్ని అడ్డంకులెదురైనా దర్బన్ సభలో దళితులు తమ కంఠస్వరాన్ని వినిపించగలిగారు. అంటరానితనం, వివక్షత, సాంఘిక రుగ్మతలను ప్రపంచం దృష్టికి తీసుకపోగలిగారు. డప్పు నాదాన్ని అందరి గుండెల్లో ప్రతిధ్వనించేట్లు చేయగలిగారు. ఇది మనదేశ దళితులు సాధించిన గొప్ప విజయం అని పాణిగారు చెప్పారు.

సిద్ధాంత నేపథ్యంతో కూడిన దళిత బహుజన పార్టీ సిద్ధాంత బలంతో దళిత రాజ్యాధికారం వస్తే తప్ప, మిగతా దళితులు కూడా విజేతలు కాలేరు. ఒక్క ఆనందరావు విజయంతోనో అలాంటి కొద్దిమంది విజయాలతోనో మాదిగ విజయం పూర్తైనట్టు కాదు. మందకృష్ణ మాదిగ, గద్దరు లాంటివారు తెలుగు నేల పగ్గాలు చేపడితినే సంపూర్ణమవుతుంది. అంబేద్కర్ చెప్పిన దళిత రాజ్యాధికార చర్యే అసలు సిసలు మాదిగ విజయాలవుతాయి అని సాంబయ్య చెప్పాడు.

### 3.3.1.8. ముగింపు:

ఒకే దళిత కుటుంబానికి చెందిన నాలుగు తరాల మాదిగల జీవితం, అభివృద్ధి ఇందులో ప్రత్యక్షమవుతుంది. ఇది దాదాపు వారి నూరేళ్ల చరిత్రను తెలియజేస్తుంది. సమాజంలో తరతరాలుగా అగ్రవర్ణాల చేత అణచివేయబడుతూ, దొరల దౌర్జన్యాలకు గురవుతూ వారి వద్ద పాలేర్లుగా పనిచేస్తూ అంటరానితనానికి, అణచివేతకు గురవుతున్న దళితుల జీవితాన్ని ఆవిష్కరింపజేశాడు. 21వ శతాబ్ది ఖచ్చితంగా పీడిత జాతులదే అని నిరూపిస్తూ రాయబడ్డ నవల ఇది. 21వ శతాబ్దం దళిత బహుజనులదేనని చెప్పవచ్చు. అన్ని రంగాల్లో ముందుకు వెళ్తూ దళిత రాజ్యాధికారం దిశగా అడుగులేస్తున్న దళిత చైతన్యపు వెలుగులు ఎంతో మందితో 21వ శతాబ్దిలో రాజ్యాధికరం దక్కుతుంది

### 3.3.2. గులాంగిరి చోడో నవల:

'గులాంగిరి చోడో' నవల 2019వ సంవత్సరంలో ప్రచురింపబడింది. ఈ నవలకు మొదటగా 'నీ బాంచెన్ కాల్మోక్తా' అనే పేరు పెట్టారు. ఆ తరువాత 'గులాంగిరి చోడో'గా పేరు మార్చారు. ఈ నవల 1997వ సంవత్సరంలో సాహిత్య సేవా సమితి ట్రస్టు, విశాఖపట్నం వారి నవలల పోటీలో మొదటి బహుమతి పొందింది. 'గులాంగిరి చోడో' అనగా బానిసత్వాన్ని వదులుకో

అని అర్థం. ఈ నవలలో తెలంగాణ పల్లెల్లో దళితుల జీవిత పరిణామ క్రమాన్ని చిత్రించాడు. ఈ నవలలో తెలంగాణ గ్రామాల స్వరూప స్వభావాలు, దళితుల జీవితం, సంస్కృతి, తెలంగాణ యాసను సహజంగా చిత్రించాడు.

### 3.3.2.1. నవలా వస్తువు:

స్వాతంత్ర్యం వచ్చిన కొత్తలో ఒకానొక మాదిగపల్లెలో కథ ప్రారంభమౌతుంది. మాదిగపల్లెలో మారయ్య, లింగమ్మ దంపతులు నివాసం ఉంటారు. వారికి కొడుకు కొంరయ్య, కూతురు వీరమ్మలు ఉన్నారు. నర్సింహారెడ్డి దొర దగ్గర మారయ్య పాలేరుగా పనిచేస్తాడు. ఊర్లో ఎవరు చనిపోయిన పాడిగట్టడం, బొందపెట్టడం, కాట్నం పేర్చడం, శవదహనం చేయడంతోపాటు చెప్పులు కుట్టడం, దప్పు కొట్టడంలాంటి పనులు వీరు చేస్తారు. మారయ్య కుమారుడైన కొంరయ్య జీవితమే ఈ నవలంతా ఉంటుంది. ఊరి దొర నర్సింహారెడ్డి కొట్టంలో బర్రె చనిపోతుంది. వారం రోజుల నుండి కురుస్తున్న వాన వల్ల అక్కడున్న మాదిగలు దానిని తియ్యరు. ఆ కళేబరాన్ని ఊరు బయట పడేయాల్సిన బాధ్యత ఆ ఊరి మాదిగలది. మాదిగలు గేదె కళేబరాన్ని మోసుకెళ్ళడం లేదని దొరకు విపరీతమైన కోపం వచ్చింది. మారయ్య తోటివారైన కొంతమందిని తీసుకువస్తాడు. అతి కష్టం మీద కళేబరాన్ని వారు అక్కడి నుండి తీసుకువెళ్తారు. ఇదంతా చూస్తూ దొరలు తిట్టే మాటలు వింటున్న చిన్నవాడైన కొంరయ్య దొరతో మాటమాట కలిపి బర్రెను మేమెందుకు తీయాలని ఎదురు తిరుగుతాడు. దొర ఆగ్రహంతో కొంరయ్యను బూతులు తిట్టి పాలేరు పని తన దగ్గర చేయ్యాలని ఆదేశిస్తాడు. కొంరయ్య నర్సింహారెడ్డి దొర దగ్గర పాలేరుగా పని చేస్తున్నాడు. మారయ్య తండ్రి చేసిన అప్పు తీర్చడం కోసం అతను పాలేరుగా ఉన్నాడు. ఎడ్లు మేపడానికి వెళ్తూ బడి దగ్గర జరుగుతున్న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను చూస్తాడు. అక్కడ ఉన్న పిల్లలను చూసి బడికి పోవాలనుకుంటాడు. కాని తండ్రి చేసిన అప్పు తీరలేదని అనుకుంటూ బాధపడతాడు. కానీ ఇంతలోనే అక్కడున్న నర్సింహారెడ్డి కొడుకు చంద్రారెడ్డి బడి దగ్గరున్న కొంరయ్యను చూసి దెబ్బలు కొడుతూ, పరుష పదజాలంతో తిడతాడు. అతనికి తిట్లు తినడం, దెబ్బలు పడటం లాంటివి మామూలు అయింది. ఒకరోజు కాలుకు ముల్లు గుచ్చుకొని విపరీతంగా నొప్పి పెట్టి కదల్లేని పరిస్థితుల్లో పనికి రాలేనని అంటాడు. పనిలోకి రావాల్సిందేనని దొర ఆగ్రహంతో అంటాడు. అప్పుడు కొంరయ్య, అతని తల్లి లింగమ్మ కూడా నీ బాంచెన్ కాల్మొక్తా దొర అని వేడుకున్న దొర ఏమాత్రం కనికరం చూపెట్టకపోగా మీదికి చెప్పులు విసిరేస్తూ బూతులు తిడతాడు. పండగయిన, పబ్బం అయినా ఎప్పుడూ దొరకు వెట్టిచాకిరి చేస్తూనే ఉండాలి. పాలేరుతనం చేసుకుంటూ ఎన్నో

చేదు అనుభవాలను పొందాడు. అతని చెల్లి వీరమ్మను సుధాకర్ దొర ఆగం చేసినందుకు కొందరు యువకులను తీసుకొని వెళ్లి అతనికి బుద్ధి చెప్తారు. ఊరిలో అప్పటికే కొంతమందిలో చైతన్యం ప్రారంభమయింది.

దొర దగ్గర కొంరయ్య పాలేరు పని మానేశాడు. వీరమ్మకు కూడా పెళ్లి చేశారు. బతుకమ్మ పండుగకు వీరమ్మ ఇంటికి వచ్చింది. పాలేరు పని మానేశాక కొంరయ్య మీద దొరకు కోపం వచ్చింది. ఆ కోపంతో చంద్రారెడ్డి దొర బతుకమ్మ పండుగ సంబరాన్ని దూరం నుండి చూసి సంతోషించాలన్న కోరికతో ఊరి బయటకి వెళ్ళిన వీరమ్మను బలత్కరిస్తాడు. తరువాత ఆమెను అత్తవారు నానామాటలు అని పుట్టింట్లోనే వదిలి వెళ్తారు. చెల్లెలు పడుతున్న బాధను చూసి కొంరయ్య దొర మీద పంచాయితీ పెడతాడు. పంచాయితీ పెద్దలు దొరకు మద్దతివ్వడంతో కొంత మంది దళిత యువకులు చెప్పిన మాటలు విని కోర్టులో కేసు వేస్తాడు. చంద్రారెడ్డిని, అతని స్నేహితులను నేరస్థుల్ని చేశారు. తోటి దళితుడైన శ్రీహరి మాటలు నమ్మి కేసు వేయడం, అతని నమ్మక ద్రోహం వల్ల కేసు ఓడిపోతారు. ఈ అవమానాన్ని సహించలేక వీరమ్మ ఉరేసుకొని చనిపోతుంది. పాలేరుతనం చేయలేక, చెల్లికి జరిగిన అవమానానికి ప్రతీకారం తీర్చుకోలేని నిస్సహాయత భరించలేక ఊరును విడిచిపెట్టి బయటికి వెళతాడు కొంరయ్య.

ఊరు విడిచి వచ్చిన తరువాత కొన్ని రోజులు దుకాణంలో పనిచేశాడు. కుల వివక్షకు గురయ్యి బయటకు వచ్చాడు. హమాలి పనిచేస్తే అక్కడున్న వారు దగ్గరికి రానివ్వలేదు. భీవండి, షోలాపూర్ లో కులం అక్కడ తిరిగుబాటు చేసింది. ఊరును వదిలితే ఎన్ని కష్టాలుంటాయో తెలుసుకున్నాడు. చివరికి మదనయ్య అనే వ్యక్తి సలహా మేరకు గోదావరిఖనిలో చెప్పులు కుట్టడం, బూట్లు పాలిష్ చేయడంలాంటి పని చేస్తున్నాడు. గోదావరిఖని దగ్గరలో ఉన్న కంపెనీలోని ఉద్యోగులు, కార్మికులు కొంతమంది అతనికి దూరంగా ఉంటూ బూట్లు పాలిష్ చేసుకుంటున్నారు. అతడు అక్కడ కూడా వివక్షను ఎదుర్కొన్నాడు. చిన్న గుడిసె వేసుకొని పనిచేసుకుంటున్నాడు. బిక్షపతి, చంద్రయ్యలు కార్మిక నాయకులుగా ఉన్న కొంరయ్యకు దగ్గరయ్యారు. అంబేద్కర్ గురించి, నక్సలైట్ల పోరాటల గురించి అతనికి తెలియజేస్తారు. ఆ మాటల ప్రభావంతో కొంరయ్యలో కొత్త ఉత్సాహం కనిపిస్తుంది. ఆ తరువాత కొంత కాలానికి ఇంటికి వెళ్లి మేనమామ కూతురు ముత్తమ్మను పెళ్లి చేసుకొని వచ్చాడు. కొంరయ్య ఆ కాలనీలో మంచిగానే స్థిరపడ్డాడు. వ్యాపారం మెలుకువలు తెలుసుకొని డైయింగ్ మిషన్, కుట్టు మిషనులు కొని బూట్లు కుట్టడం, బ్యాగులు

కుట్టడం నేర్చుకున్నాడు. పనిలో మంచి నేర్పు సంపాదించాడు. కొంరయ్యకు మొదటగా బిడ్డ లక్ష్మి తరువాత కొడుకు రాజేష్ లు పుట్టారు వారిని కష్టపడి చదివించాలని కొంరయ్య అనుకున్నాడు.

దొరలు తమ పోకడలను మార్చుకోవాలని లేకుంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కొంటారని కమ్యూనిస్టులు వారిని హెచ్చరిస్తారు. దానితో ఊరిలోని దొరలలో మార్పు వచ్చింది. అటు నక్సలైట్ల ప్రభావం, ఇటు అంబేద్కర్ సంఘాల కృషివల్ల ఊరి ప్రజలలో చైతన్యం వస్తుంది. అదే విధంగా కొంరయ్యలో కూడా చైతన్యం వచ్చింది. మరో పది సంవత్సరాలు గడిచాయి. సమ్మిరెడ్డి కంపెనీలో ఇంజనీరుగా పనిచేస్తున్నాడు. అతడు కొంరయ్య దగ్గరకు వెళ్లి బూట్లు పాలిష్ చేయించుకున్నాడు. డబ్బులు రెండు రూపాయలు అడిగితే ఒక్క రూపాయ ఇస్తానంటాడు. దానికి కొంరయ్య బదులుగా రెండు రూపాయలు ఇవ్వాల్సిందేనని అంటాడు. సమ్మిరెడ్డి కోపోద్రిక్తుడై కొంరయ్యను కులం పేరుతో దూషిస్తాడు. అలాగే వ్యక్తిగత జీవితం గురించి తిడతాడు. కొంరయ్యకు మద్దతుగా ప్రతాపరెడ్డి వచ్చి మాట్లాడతాడు. తన కులంవాడైన ప్రతాపరెడ్డి కొంరయ్యకు మద్దతు ఇవ్వడం అతనికి నచ్చదు. అయినా ఎంతకి సమ్మిరెడ్డి తగ్గకపోవడంతో నిమ్న జాతుల పరిరక్షణ చట్టం కింద కేసు పెడతా అన్నప్పుడు సమ్మిరెడ్డి క్షమాపణలు చెప్పి కొంరయ్యకు డబ్బును ఇచ్చి వెళతాడు. మరొక రెండు సంవత్సరాలు గడిచాయి. కొంరయ్య డబ్బు కూడబెట్టకున్నా మంచిగానే బతుకుతుండు. పిల్లలను చదివిస్తుండు. కుల చైతన్యం వల్ల మార్పులు వస్తూనే ఉన్నాయి. కొంరయ్య కొడుకు రాజేష్ కు కష్టాలు తెలియకుండా పెంచాడు. ఉద్యోగుల పిల్లలతో ఉండటంవల్ల అతనికి కష్టాలు తెలిసేవి కావు. కొడుకు రాజేష్ ఉద్యోగ ప్రయత్నాల్లో ఉన్నాడు. కంపెనీ మూతపడటంతో కొంరయ్య ఊరికి వెళ్ళాలనుకుంటాడు. అక్కడే పని చేసుకుంటూ బతకాలని నిర్ణయించుకున్నాడు. కాని మదనయ్య సలహాతో ఊళ్లో చెప్పుల దుకాణం పెట్టాలనుకుంటాడు. మదనయ్య తన స్నేహితుడి చెప్పుల దుకాణంను కొంరయ్యను చూపించి దానిలో ఉన్న స్థితిగతులను చూపిస్తాడు. అక్కడ చూసిన ప్రభావంతో కొంరయ్య ఊర్లో చెప్పుల దుకాణం పెట్టడానికి సిద్ధపడ్డాడు. ఊరికి రావడం రాజేష్ కు ఇష్టం లేదు. అందరూ పల్లె నుండి పట్నానికి పోతుంటే తన తండ్రి మాత్రం ఊరు వెళ్ళి అక్కడ ఉండటం ఏంది అని ఆలోచిస్తున్నాడు. ఇంజనీరింగ్ చేసిన తనకు ఆ పల్లెలో ఉండటం నచ్చడం లేదు. కొంరయ్య కొడుకును చూసి బాధపడుతున్నాడు. అతని మార్పుకు తన పెంపకమే కారణం అని బాధపడుతున్నాడు. కొంరయ్య ఊళ్లో చెప్పుల దుకాణం పెట్టి దాదాపుగా పది మందికి ఉపాధి కల్పించే స్థాయికి వచ్చాడు. రాజేష్ కు ఉద్యోగం వచ్చింది. అప్పుడప్పుడు ఊరికి వచ్చి వెళ్లుతున్నాడు. రాజేష్ కు పెళ్లి చేయాలనుకుంటున్న తరుణంలో ఏకంగా కోడల్ని తీసుకొని ఇంటికొచ్చాడు. చక్కగా

ఉన్న కోడలిని చూసి మురిసిపోవాల్నో, తమకు తెలియకుండా పెళ్లి చేసుకున్నారని విచారించాలో కొంరయ్యకు తెలవడంలేదు. వారిని ఏమన్న లాభం లేదని కడుపు తీపిని కాదనలేక ఆశీర్వదించాడు. కొంరయ్య ఉన్నత స్థాయికి చేరుకున్నాడు. ఒక్క పూట కూడా కడుపు నిండా దొరకని వాళ్లు, ఆకలితో అలమటిస్తున్న వాళ్లు దళితులలో ఇప్పటికీ ఉన్నారు. దళితుల మీద, సంస్కృతి మీద అక్కడక్కడ దాడులు జరుగుతున్నాయని కొంరయ్య బాధపడుతున్నాడు. కొడుకులో తెలిసి తెలియనితనం ఉందని అతనిలో మార్పు రావాలని కొంరయ్య కోరుకుంటున్నాడు. నీ బాంచెన్ సంస్కృతి మాత్రం చాలావరకు తగ్గింది.

కొన్ని సంవత్సరాలు గడిచిపోయాయి. కొంరయ్య డెబ్బై ఏళ్లకు చేరుకున్నాడు. సమాజంలో అనేక మార్పులు వస్తున్నాయి. దేశంలో అంబేద్కర్ పట్ల ఆరాధన మరింత పెరిగింది. రాజేష్ పదిహేను సంవత్సరాలు అమెరికాకు వెళ్లి బాగా సంపాదించుకుని అక్కడే ఉండిపోకుండా దేశానికి తిరిగి వచ్చిండు. దేశ విదేశీ అనుభవాలను జీర్ణించుకున్నాడు. ఊళ్లోకొచ్చిన కొడుకును చూసి కొంరయ్య సంబరపడ్డాడు. నాన్నా అవగాహన లేక నేనప్పుడు మీకు బాధ కలిగేటట్టు ప్రవర్తించిన. దేశ విదేశాలు తిరిగితే కాని నాకు కనువిప్పు కలుగలేదు. మార్క్స్, అంబేద్కర్, కొంత బుద్ధుణ్ని చదివిన తరువాత నా హృదయం విశాలమైంది. నన్ను నేను నా దేశానికి, నా జాతికి అర్పించు కోవడానికొచ్చిన పేబ్యాక్ టు సొసైటీని సాకారం చేసి నా జన్మకు సార్థకం చేసుకుందామని వచ్చిన. నేను ఎక్కడికి పోను, ఉద్యోగం చేసినా ఇక్కడే చేస్తా, నన్ను నేను ఈ దేశం కోసం, నా దళిత జాతి కోసం అంకితం చేసుకుంటాను అని రాజేష్ మాటలు విన్న కొంరయ్యకు కళ్లనిండా నీళ్ళు తిరిగినయి. భారం దించుకోవడానికి కొంతసేపు ఏడ్చిండు. కొడుకులో వచ్చిన మార్పును చూసి చలించిపోయాడు. నీ బాంచెన్ కాల్మొక్తా అనుకుంటూ బతికినవారు దళిత రాజ్యాధికారం కోసమే నా జీవితం అంకితం చేస్తాను అనడంతో కథ ముగుస్తుంది.

### 3.3.2.2. వస్తు విశ్లేషణ:

నీ బాంచెన్ కాల్మొక్తా అంటూ బతికే, బతికిన మాల మాదిగలు సర్వసంపదలను సృష్టించే సృష్టికర్తలు. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత నిజాం పాలనలో తెలంగాణలో దొరల కింద అణగారిన వర్ణాలు అనుభవించిన బానిసత్వం దుర్భరమైంది. ఈ బానిసత్వాన్ని నేపథ్యంగా తీసుకొని రచించిన 'గులాంగిరి చోడో' నవల ఇటీవల కాలంలో వెలువడ్డ రచనల్లోకి ప్రయోజనాత్మకమైంది. అత్యంత వాస్తవికంగా ప్రతిసృష్టి చేయడానికి మాండలిక భాష చాలా తోడ్పడింది. కాలం ఎప్పుడూ ఒకే విధంగా ఉండదు. బానిసత్వ యుగం దానికి మినహాయింపు కాదు. ఒక తరం బానిసత్వాన్ని ఒక

విధిరాతగానైనా స్వీకరిస్తుంది. రాజీ పడుతుంది. తరువాత తరం బానిసత్వాన్ని అంగీకరించకపోవచ్చు అని మరొకసారి ఈ నవలలో కొంరయ్య పాత్ర నిరూపించింది. ఈ నవలలో కూడా మారయ్య బానిసత్వాన్ని స్వీకరించాడు కాని అతని కొడుకు కొంరయ్య ప్రతిఘటించాడు. "నాయన్నా! మనమే ఎందుకు బర్రెనీడ్సుకపోవన్నే... అది దొర బర్రేనాయె అల్లదాల్లు బయట పారేసుకోరా? సచ్చిపోయిన బర్లను, గొడ్లను మనమే ఎందుకు తియ్యాలె" (మల్లయ్య, కాలువ.2019:పుట.6) అని ప్రశ్నించాడు. "గుర్రుమీదుండనీయి ఎట్లనన్న ఉండనీయి. ఇంక గా దొరలకు సేవజేసుడు నానుంచిగాదు. ఉపాసముండి సచ్చినా మంచిదేకాని గా పాలేరు తనమైతే ఉండలేను" (మల్లయ్య, కాలువ.2019:పుట.30) అని కొంరయ్య తన తండ్రితో ప్రాణం పోయిన సరే బానిసత్వం నాకొద్దంటాడు. ఈ విధంగా కొత్తతరం ప్రతిఘటన ధ్వనిస్తుంది.

దేశ కాలాలకతీతమైన విషయం ఒకటుంది. ఎప్పటి చైతన్యాన్ని అప్పటి సమాజం లేదా ఒకానొక వర్గం వ్యక్తీకరిస్తుంది. గులాంగిరి చోడో నవలలో తొలి భాగంలోని పెద్దతరం తమ నిరక్షరాస్యత, అజ్ఞాన, అంధకారం, తాము పుట్టిందే బానిసత్యం చేయడానికన్నట్లు సర్దుబాటుతత్త్వం కలిగినవారు. వీరి తర్వాత తరం కొంత అక్షరాస్యులై అజ్ఞానం తొలగడమే కాకుండా వాళ్లు ఎక్కువేమిటి మనం తక్కువేమిటి అని నిలదీసే చైతన్యాన్ని వ్యక్తీకరిస్తుంది. మంచి నీళ్ల బావి దగ్గర ఒక అగ్రవర్ణ స్త్రీకి వీరమ్మకు మాటామాటా పెరిగి వీరమ్మపై దుశ్శాసన పర్వానికి ఒడిగట్టిన దొర కొడుకు సుధాకర్ రావుపై బాహాటంగా దళిత యువకులు విరుచుకుపడటం కొత్తతరం చైతన్యాన్ని సూచిస్తుంది. రెండవ తరం విద్యావంతులు కావడం, అంబేద్కర్ సంఘాలు విస్తరించడం, ఉపాధి మార్గాలు ఏర్పడటం, గ్రామాల్లో నక్సలైట్ కార్యకలాపాలు, బలహీనులను పీడించే దొరలు నక్సలైట్లకు భయపడి ఊళ్లొదిలి పోవడం, ఉన్న కొద్దిమంది బలహీనుల జోలికి రాకుండా ఉండటం, దళితులు తమ శక్తి కొద్ది జీవన ప్రమాణాలను మెరుగుపడటం వెనుక అంబేద్కర్, పూలే వంటి మహనీయుల కృషి ఎంతో ఉందని, వారిని ఈ తరం విస్మరించకూడదని చెప్పడం గమనిస్తాం. అదే విధంగా దళితులను ఓట్ల రాజకీయాలు ఇంకా మభ్య పెడుతుండడాన్ని, దళితుల్లో ఇంకా స్థితిగతులు మారనివారు కూడా ఉన్నారన్న విషయాన్ని మనం తెలుసుకోవచ్చు. కులాన్ని తక్కువ చేసి దళితుల్ని దూషిస్తే హక్కుల పరిరక్షణ చట్టం కింద ఫిర్యాదు చేసి వారిని శిక్షించేలా చేయవచ్చునని కూడా మనకు ఈ నవల తెలియజేస్తుంది. గ్రామాల్లో కమ్యూనిస్టుల వల్ల కలిగిన మార్పులు స్వాగతించదగ్గవే.

ఒకప్రక్క సంపూర్ణ అక్షరాస్యత సాధిస్తామని ప్రభుత్వం గట్టిగా చెబుతుంటే గ్రామీణ దళితజనం అక్షరాస్యతకు ఇంకా దూరంగానే ఉన్నారని, అందులో దళిత స్త్రీలయితే ఇంకా చదువులకు ఆమడ దూరంలోనే ఉన్నారని ఈ నవల చాటి చెబుతుంది. ఒక తరంవారు నీ బాంచెన్ కాల్మొక్తా అని అంటే ఆ తరువాత తరం వారి సంతానం వింతగా ఈ నవల్లో కనబడుతుంది. నవలలో ఉన్నదే వాస్తవ సమాజంలో ఉన్నది. కొంరయ్య కొడుకు రాజేష్ గ్రామాలకు, అక్కడి తమ తండ్రి తాతల వద్దకు వెళ్లాలని అనుకోవడం లేదు. తాము ఎక్కడి నుండి వచ్చామనేది లోకానికి చెప్పుకునేందుకు వారు ఇష్టపడటం లేదు. అది అవమానంగా భావిస్తున్నారు. అయితే అది ఒకానొక ధోరణి మాత్రమే. దీనికి అతీతంగా తామెవరికీ తీసిపోమని ధైర్యంగా చాటుతున్నారు. ఈ ధైర్యం నేటి తరపు దళితుల్లో గాఢంగా ఉండటం ఆశావహమైన భవిష్యత్తుకు సూచిక. అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని నూటికి నూరు పాళ్లు అమలు చేస్తే 'మూలజాతుల రాజ్యాధికార సాధన' సాధ్యమవుతుంది.

### 3.3.2.3. దళితుల జీవిత పరిణామం–సంస్కృతి:

గులాంగిరి చోడో నవలలో తెలంగాణ పల్లెలో ఉన్న దళితులు జీవితాన్ని, సంస్కృతిని అత్యంత సహజంగా, వాస్తవికంగా కాలువ మల్లయ్య చిత్రించాడు. ఏ రచనకైనా అందలి సామాజిక జీవన చిత్రణ చేస్తున్నప్పుడు దానికి సహజత్వాన్ని సంతరించిపెట్టే వాతావరణం చాలా అవసరం. అటువంటి వాతావరణాన్ని చిత్రించడంలో రచయిత కనపరిచే సామర్థ్యాన్ని బట్టి రచన సాఫల్యం ఉంటుంది. ఈ నవలలో గ్రామీణుల జీవన శైలి చోటుచేసుకుంది. దానికి అనుగుణమైన వాతావరణం చక్కగా అమరింది. ఉదాహరణకు ఒక సందర్భం ఇది "పొద్దు పొడువకముందే లేసింది లింగమ్మ. పొయ్యిల బూడిదెత్తి పెంటబొందల పారేసచ్చింది... పొయ్యలికింది... ఇల్లూడ్సింది... మసుకు మసుకుండంగానే వాకిలూడ్చింది... పెండనీల్లతో నలుకు జల్లింది... వాకిట్ల ముగ్గేసింది... ముంత పట్టుకొని బిడ్డం దీసుకొని ఊరవుతలకి దొడ్డికి పోయ్యచ్చింది... కాల్లుజేతులు కడుక్కుంది... పిడుక బొగ్గేసుకొని మొంగూడ కడుక్కుంది... పొయ్యంటుపెట్టుటానికి కోశిశ్ జేత్తంది... వీరమ్మ తల్లికి పనిల సాయం జేత్తంది. తల్లి జెప్పిన పనిసేత్తంది" (మల్లయ్య, కాలువ.2019:పుట.26) ఇక్కడ ఇంట్లో వాతావరణాన్ని మనం అర్థం చేసుకోవచ్చు.

గ్రామాల్లో శిశువు పుట్టినప్పుడు బాలింత స్నానానికి కొల్లు గుంటలు తవ్వడం, వాయిలాకు తేవడం, పెళ్ళిళ్లలో, ఇతర శుభకార్యాలలో డప్పు కొట్టడం, అన్ని శుభకార్యాలకు పనులు చేయడం, చెప్పులు కుట్టడం, వ్యవసాయానికి అవసరమయ్యే తాళ్లు, తలుగులు, పగ్గాలు తయారుచేయడం,

చెప్పుల తయారీ, తోలు వస్తువుల తయారీ, ఎవరైనా చనిపోతే పాడిగట్టడం, బొంద పెట్టడం, కాట్నం పేర్చడం, శవ దహనం లాంటి పనులు చేస్తూ దేశ సంపదలకు మూల స్తంభాలుగా దళితులు ఉంటున్నారు. వీరు ఏ పని చేయని విశ్రాంతి కులాలకు మాత్రం బానిసలుగానే ఉంటున్నారు. దొరల పెత్తనం వల్ల దళితులకు బానిసత్వం పెరిగింది. ఈ బానిసత్వంలో పాలేర్లుగా మొదటితరం వారు పనిచేసేవారు. అంటరానితనాన్ని వారు అనుభవించేవారు. అంటరానితనం అనేది ఈ సమాజంలో ఉన్న ఓ జబ్బు. అది ఆ తరం వారికి ఒక రోగం లాంటిది. గాంధీ అంటరానితనం నేరమని పత్రిక నడిపి ఎంతో కృషి చేశారు. అంబేద్కర్, పూలే, పెరియార్ లాంటివారు ఎంతో మంది మహానుభావులు దళితుల కోసం కృషి చేశారు. ఆ తరువాత తరం వారిలో చాలామంది చదువుకున్నవారు తయారయ్యారు. అంబేద్కర్ యువజన సంఘాలు, కమ్యూనిస్టు పోరాటాల ప్రభావం వల్ల కొన్ని మార్పులు వచ్చాయి. ఇంతవరకు దళితులమని చెప్పుకోవడానికి చిన్నతనంగా భావించినవారు ఇప్పుడు గర్వంగా చెప్పుకుంటున్నారు. రిజర్వేషన్ సౌకర్యాలను ఉపయోగించుకొని చాలామంది ఉద్యోగాలలో స్థిరపడ్డారు.

వ్యాపార నాగరికత ఊళ్లలోకి ప్రవేశించింది. ఊళ్లలోకి కొన్ని మార్పులు వచ్చాయి. దాదాపు అన్ని ఊళ్లకు బస్సులు వచ్చాయి. అలాగే కరెంటు, రేడియోలు, టి.వి.లు, డబ్బున్నవాళ్లు స్కూటర్లు కొనడం లాంటివి రావడంతో మార్పులు కనిపిస్తున్నాయి. భూమికోసం, భుక్తి కోసం పోరాటాలు చేస్తున్నారు. దళితుల రాజ్యాధికారం కోసం పోరాడుతున్నారు. 'బాంచెన్ నీ కాల్మొక్తా' అంటూ బతికినవారే అన్ని రకాల పోరాటాలు వీరోచితంగా చేస్తున్నారు. చెప్పుకు దండం పెట్టే సంస్కృతిని స్థాపించడానికై తమను తాము అర్పించుకుంటున్నారు. చెప్పుకు దండం పెట్టే సంస్కృతి అంటే పనిని గౌరవించే సంస్కృతి. ఆ సంస్కృతి వచ్చినప్పుడే నీ బాంచెన్ కాల్మొక్తా సంస్కృతి అంతరిస్తుంది. ఇప్పుడు సమాజం అటువైపుగానే పయనం చేస్తుంది.

### 3.3.2.4. ముగింపు:

దేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుండి దాదాపుగా యాభై సంవత్సరాల కాలంలో దళితుల కష్టాలు, అవమానాలు, బాంచెన్ నీ కాల్మొక్తా దొర లాంటి బతుకులను తెలియజేసిన నవల ఇది. నవల అత్యంత వాస్తవికంగా రావడానికి మాండలిక భాష చాలా అపురూపంగా ఉపయోగపడింది. తెలంగాణలోని సంస్కృతి, పలుకుబడులు సహజ సుందరంగా రచన నిండా కనిపిస్తాయి. పల్లెల్లో పుట్టి తరువాత కాలంలో ఉన్నత విద్యాభ్యాసం, ఉద్యోగాలు నగర జీవితం గడపడం వల్ల చాలామంది మరిచిపోయిన మన మాటలను ఈ రచనలో మరోసారి చదువుకొని

పరిశీలించవచ్చు. ఈ నవల నిండా చక్కని సామెతలు కూడా ఉన్నాయి. ఎన్ని ఉద్యమాలున్నా దళితులు పీడిత ప్రజల ఆశాజ్యోతియైన అంబేద్కర్ ను మరువకూడదని హెచ్చరించే సందేశం ఈ నవలలో కనిపిస్తుంది. తెలంగాణ మాదిగ వాడలను కళ్లకు కట్టించే 'గులాంగిరి చోడో' దళితులకు మనో నిబ్బరాన్ని, పోరాట పటిమను నేర్పుతుంది.

### 3.3.3. మంచియన్నది మాల అయితే.. నవల:

కాలువ మల్లయ్యగారి 'మంచియన్నది మాల అయితే..' నవలను సామాజిక భారత్ ప్రచురణలు, హైదరాబాద్ వారు 2014వ సంవత్సరంలో ప్రచురించారు. ఈ నవలకు మరొక పేరు 'మాలపంకిడిగాడు'. కాలువ మల్లయ్య ఈ నవలను 1997–198 ప్రాంతంలో రచించాడు. ఎడ్లు పోవడం అనే సంఘటనను తీసుకొని 20వ శతాబ్ది చివరలో తెలంగాణ గ్రామాల్లో ఉన్న పరిస్థితులను, దళితులపై జరుగుతున్న అత్యాచారాలను చిత్రించిన నవల ఇది. రావి శాస్త్రి సొమ్ములు పోనాయండి నవల కథాకథనం తీసుకున్న తెలంగాణ నేటివిటితో మాలమాదిగల, అణగారిన జాతుల దృష్టికోణంలో నుండి రాయబడిన నవల ఇది అని కాలువ మల్లయ్యగారు తెలియజేశారు.

#### 3.3.3.1. నవలా వస్తువు:

కొండయ్య అనే రైతు ఎడ్లు పోయిన సంఘటనతో నవల ప్రారంభమవుతుంది. కరీంనగర్ జిల్లాలోని సుల్తానాబాద్ కు దగ్గర ఊరిలో మాల కులానికి చెందిన కొండయ్య కుటుంబం నివాసముండేది. అతడు మొదటగా దొరల దగ్గర నీటికాడుగా పాలేరుగా పనిచేసేవాడు. ఆ తరువాత కొంత కాలానికి భూమి కొనుక్కొని ఎడ్లతో వ్యవసాయం చేస్తున్నాడు. ఆ ఎడ్లు ఆ కుటుంబానికి అన్నం పెట్టేవి. వాటి పేర్లు పుల్లకేడెలు అవి ముట్టుకుంటే మాసిపోయేటట్టు తెల్లగా ఉంటాయి. నాగలు కట్టినా, బండి కట్టినా అవి బాగా పనిచేసేవి. ఆ ఎద్దులను వివిధ ప్రదేశాలు తిరిగి ఆదిలాబాద్ లో పదహారు వేలకు కొన్నాడు. కొండయ్య ఎడ్లను పైసా పైసా కూడబెట్టి అప్పు లేకుండా కష్టార్జితంతో కొన్నాడు. అతనికి ముగ్గురు కొడుకులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. అతని కొడుకులు రిజర్వేషన్ సౌకర్యంతో ఉద్యోగాలు చేస్తున్నారు. అతని కొడుకులు కొండయ్య దంపతులను హాయిగా విశ్రాంతి తీసుకోమని చెప్తారు. కాని చిన్ననాటి నుండి పనిచేసినవారు కాబట్టి కూసోని తినలేక వ్యవసాయం చేసుకుంటూ బతుకుతున్నారు. అలాంటి సమయంలో కొండయ్య ఎడ్లు పోయినవి మరి ఎడ్లు పోవడంతో దుఃఖంలో ఉన్నాడు. దొంగలు దొరకలేదు. అతనికి అసలు వాటిని దొంగలు ఎత్తుకెళ్ళారా, దొరలు ఎత్తుకెళ్ళారా అని ఆ దొంగలు ఎవ్వరో చెప్పే

ముందు దొరలు కొండయ్యను ఎలా ఇబ్బందులకు గురి చేసారో కోర్ట్ లో న్యాయమూర్తికి కొండయ్య తన గాథను తెలియజేశాడు.

కొండయ్య వ్యవసాయాన్ని ప్రారంభించి ఐదు సంవత్సరాలు అవుతుంది. భూమిని నమ్ముకుంటూ వ్యవసాయం చేస్తున్నాడు. పేసంగి మడికట్టు దున్నుతుంటే ఎద్దు ముసలిది కావడంతో నడవట్లేదు. మడికట్టు నాగలి దున్నడం కొద్దిగా కష్టం. అట్లానే దున్నుతూ సతమతమవుతున్న సమయంలో తన పొలాలను చూసుకోవడానికి వచ్చిన గోవిందరావు దొర అతని వైపు చూస్తాడు. గోవిందరావు ఆ ఎద్దును చూసి ముసలిదాన్ని కొని నాగలి పట్టి నడువు అని పొడిచి చంపితే నడుస్తుందా అని అంటాడు. అలాగే మాలపీసునా గొడుదు గొడ్లను తినే కులం రా మీది అని కొండయ్యను బూతులు తిడతాడు. అతనికి కులం పేరుతో దూషించిన ఎదురించే ధైర్యం లేదు. గోవిందరావు డబ్బులు ఇస్తా ఎద్దును కొనుక్కో అని సలహా ఇస్తాడు. మనుషులను పందిరి గుంజలకు, మొగరాలకు కట్టేసి కొట్టించే దొర జాలి చూపడంతో అతనికి అర్థమయ్యి డబ్బు వద్దంటాడు. ఇందులో ఏదో మతలబు ఉందని తెలిసినా చివరికి దొర మాట విని కొండయ్య ఎద్దును తీసుకుంటాడు. ఎంతైనా గోవిందరావు మంచోడే అని అనుకుంటాడు. కొన్ని రోజుల తరువాత తన పొలంలో నాగలి దున్నడానికి రావాలని గోవిందరావు కబురు పంపుతాడు. కొంత పొలాన్ని దున్ని తరువాత రోజు ఏదో ఒక పని చేపిస్తుండటంతో దున్నడానికి రానని కొండయ్య అంటాడు. పరుష పదజాలంతో అతన్ని తిడతాడు. దొర దగ్గర ఉన్న ఎద్దుకు రెండింతలు డబ్బు ఎక్కువ ఇచ్చి కొంటాడు. ఆ ఎద్దు అతని దగ్గరకు వచ్చిన తరువాత చిక్కిపోయింది. చివరకు పెద్దల ఒప్పందంతో ఆ ఎద్దుకు సగం డబ్బిచ్చి తీసుకున్నాడు. అతను తనకి తెలిసిన వైద్యంతో ఎద్దును మంచిగా చేసుకొంటాడు. అలా దొరను తన తెలివితో కొండయ్య దొంగ దెబ్బకొట్టాడు. మరికొన్ని సంవత్సరాలలో కమ్యూనిస్టుల ప్రభావం, అంబేద్కర్ సంఘాల ప్రభావంతో గోవిందరావు ఊరు విడిచి వెళ్లాడు. కమ్యూనిస్టుల పోరాటాలు తగ్గుముఖం పట్టాయి. గోవిందరావు, కిషన్ రావు, నర్సింహారెడ్డి దొరలు ఊరికి వస్తామని సర్పంచుకు కబురు పంపారు. ఊళ్లో ఉన్న యువకులు, సర్పంచ్, పెద్దలు కూర్చోని వారి గురించి విపరీతమైన వాదోపవాదాలు చేసి చివరికి వారిని ఊళ్లోకి రానివ్వాలని తీర్మానం చేశారు.

కొన్ని సంవత్సరాలు గడిచాయి. కొండయ్య కొడుకులు రిజర్వేషన్ సౌకర్యంతో ఉద్యోగాలు చేస్తున్నారు. వారు కొంత డబ్బును తండ్రికి పంపిస్తున్నారు. కొండయ్య మరికొంత భూమిని కొన్నాడు. అతడు వ్యవసాయం చేసుకుంటూ రంగయ్యను పాలేరుగా ఉంచుకున్నాడు. రంగయ్య

మాదిగ కులానికి చెందినవాడు. రంగయ్య రెండ్రోజుల క్రితం అత్తగారింటికి పోయాడు. అప్పటినుండి కొండయ్య ఎడ్లు కనిపించడం లేదు. కట్టేసిన పగ్గాలు కూడా కనిపించడం లేదు అంటే అవి తెంపుకొని పోలేదు అని అర్థమవుతుంది. రంగయ్య మంచోడు. అతన్ని దొంగ అనడానికి కొండయ్యకు మనస్సు ఒప్పడం లేదు. దొంగలు ఎత్తుకుపోయినారు అని అంటాడు. చుట్టుప్రక్కలవారు అందరూ వచ్చారు. కొండయ్య అల్లుడు గుండయ్య ఎక్కడికి పోవులే అవ్వేమన్నా దాసుకునేవా ఎక్కడో ఒక్కచోట ఉంటాయిలే అన్నాడు. అవి ఊర్లో కనిపించపోవడంతో కొండయ్య పంచాయితీ ఆఫీసులో ఫిర్యాదు చేశాడు. గోవిందరావు ఎడ్లు పోయినవి నిజమేనా! అంటూ ముసిముసిగా నవ్వాడు. నా ఎద్దులు పోతే నీకు నవ్వుగా ఉందా! అనడంతో ఆ మాటకు గోవిందరావు ముఖం చిన్నబోయింది. దొరలమనే అహంకారం తగ్గి అణిగిమణిగి ఉంటున్నారు. మిమ్మల్ని ఏమన్నామంటే కోర్టులు, కేసులు అంటారు. అయినా కమ్యూనిస్టులు మీవైపే ఉన్నారు. ఎంతయినా మీదే రాజ్యం అని గోవిందరావు అంటాడు. నీకు ఎవ్వరిమీదనైనా అనుమానం ఉందా? అని సర్పంచ్ అడిగాడు. ఎవ్వరి మీద లేదని సమాధానం చెప్పాడు. రంగయ్య ఊర్లో లేడుగా వాడు ఏమైనా చేసి ఉండొచ్చుగా అని ఉప సర్పంచ్ అనగా ఎవ్వరు చేసినా మీ దాంట్లోని వారే చేసి ఉంటారని గోవిందరావు అన్నాడు. కొండయ్య ఇయ్యాల రేపు దొరలు కూడా దొంగతనం చేస్తున్నారులే అని దొరకు చురకలంటిచ్చాడు. అతడు దొంగ దొరకలేదని ఎవ్వరి మీద నింద మోపలేదు. సర్పంచ్ మొదట చుట్టుప్రక్కల వెతికి చూడండి, దొరకకపోతే పోలీసులకు చెప్పుదాంలే అని అంటాడు.

కొండయ్య, అతని అల్లుడు గుండయ్య ఎద్దులను వెతకడం ప్రారంభించారు. సుల్తానాబాదులో తిరుగుతూ కొండయ్య కొడుకుల గురించి తలుచుకుంటూ, వారు అతన్ని చూసుకుంటున్న విధానాన్ని గుర్తు చేసుకుంటూ, వారి మంచితనాన్ని అల్లుడికి చెప్పుతూ, సడ్డకుడైన నర్సింహులు ఇంటికి చేరుకున్నారు. అటునుండి కరీంనగరుకు వెళ్ళారు. ఎటూ చూసిన జాడ దొరకట్లేదు. వారు దారిలో కనిపించిన వారిని అడుగుకుంటూ వెళ్తున్నారు. చొప్పదండి వైపు రెండు ఎడ్లు తోలుకొని పోవడం చూసానని దార్ల లచ్చయ్య అనగానే కొండయ్యకు సంతోషమనిపించింది. ఆ వ్యక్తి చెప్పిన ఆనవాళ్లతో పాలేరు రంగయ్య మీద అనుమానమొచ్చింది. ఆ తరువాత తిరుగుతూ వెళితే రాయపట్నంలో ఎడ్లు దొరికినవి. వాటిని చూడగానే కొండయ్య సంతోషంతో మునిగి తేలుతున్నాడు. కొండయ్య నమ్మకద్రోహం చేసిన రంగయ్య మీద కోపంతో ఆగ్రహానికి గురయ్యాడు. కుల పెద్దల సమక్షంలో రంగయ్య తన తప్పును ఒప్పుకున్నాడు. నేను చేసింది తప్పే అని ఇంకేమన్నా

దండుగయితే జీతంలో పట్టుకోండి అని వేడుకున్నాడు. మనమంతా అంబేద్కరిస్టులం మన పేగు మనం బయట పడేసుకోవద్దు రంగయ్యను క్షమించి ఇంటికి పంపమని కొండయ్య అంటాడు. రంగయ్య ఇలా చేసిండంటే ఏదో ఒక బలమైన కారణం ఉండొచ్చని కొండయ్య అనుకున్నాడు. అక్కడున్న సెక్రటరీ అడగగానే మా చెల్లి పెళ్లికి కట్నంగా పది వేలు అవసరం వచ్చి దొంగతనం చేశానని అంటాడు. నా చెల్లెలి కాపురం ఇబ్బందుల్లో పడొద్దని ఇలా చేశానని అంటాడు. రంగయ్య దొంగ కాదని అతనికున్న ఆర్థిక పరిస్థితులే కారణం అని అతన్ని పోలీసుల వద్దకు పంపారు. పోలీసులు కేసు నమోదు చేశారు. ఎద్దు దొరికినా దాంతో ముడిపడి ఉన్న కేసు మాత్రం నడుస్తుంది.

గోవిందరావు కులాలపై చిచ్చు పెట్టే ప్రయత్నం చేస్తుంటాడు. మాలమాదిగలలో వచ్చే విభేదాలను ఆధారంగా చేసుకొని చిచ్చు పెడుతున్నాడు. మాదిగొల్లు మొదటి నుండి బాగా కష్టాలు పడుతున్నారని, ఇప్పుడు రిజర్వేషన్ల అవసరం మాలోల్ల కంటే మాదిగలకే అవసరం ఉందని వారి మధ్యలో విభేదాలు వచ్చేటట్లు చేయాలని కిషన్ రావు పంతులు అనుకుంటున్నాడు. వీరి చర్చల అనంతరం కొండయ్య వీటన్నింటిని అర్థం చేసుకొని కుల తగాదాలు పెట్టే కార్యక్రమం నడుస్తుందని నాకెంత ఖర్చయినా రంగయ్యను ఇడిపిస్తానని చెప్పడంతో అందరూ వెళ్ళిపోయారు. కొండయ్య కేసు వాపసు తీసుకున్నాడు. కొండయ్య చివరి అస్త్రంగా ఎవ్వరికి చెప్పను గాని దొంగతనం చేసే ధైర్యం నీకు లేదని నాకు తెలుసు అని గట్టిగా అడగడంతో రంగయ్య అసలు నిజం బయటపెట్టాడు. గోవిందరావు దొర, కిషన్ రావు పంతుల్లే దొంగతనం చేశారని చెప్తుతాడు. కొండయ్య అనుకున్నట్టు దొరనే ఈ దొంగతనానికి కారకుడని అర్థం అయింది. ఒక సంవత్సరం తరువాత కిషన్ రావును కమ్యూనిస్టులు చంపారు. కమ్యూనిస్టులు దొరలను చంపడంతో కొండయ్య మీద కేసు అయింది. ఆ కేసు కొరకు కోర్టుకు తిరిగి తిరిగి అతనికి ఇబ్బందులు వస్తున్నాయని న్యాయమూర్తికి చెప్పడంతో కేసు కొట్టేస్తారు. అప్పటినుండి కొండయ్యను మాలపంకిడిగాడు అని పిలుస్తున్నారు. 'మాలపంకిడి' అంటే అదో రకమైన చేప. ఆ చేపలు చాలా రకాలైన ఉపాయాలు ఉంటాయి. ఆ చేపకు పట్టుకోవడం కష్టం. వలేసినా, గాలమేసినా తప్పించుకుని తిరుగుతుంది. కొండయ్య కూడా అటు దొరలు, పటేల్లు, పట్వార్లు ముందు తెలివితో తప్పించుకున్నాడు. ఎత్తుకు పై ఎత్తు వేశాడు. ఒక దళితుడు తెలివి ముందు దొరలు అందరూ బలాదూర్ అయ్యారు.

### 3.3.3.2. వస్తు విశ్లేషణ:

మంచియన్నది మాల అయితే.. నవలలో కొండయ్యకు చదువురాకున్నా అంబేద్కర్ సంఘాల ప్రభావం, కమ్యూనిస్టు పోరాటాల ప్రభావం వల్ల తనకున్న స్వల్ప పరిజ్ఞానంతో దొరలను

ఎదుర్కొనేవాడు. మూఢ నమ్మకాలను ఎదిరించేవాడు. కొడుకులను చదివించి ఉద్యోగస్తులను చేశాడు. అతడు దొరల నుండి తప్పించుకోవడానికి ఎత్తులకు పై ఎత్తులు వేసేవాడు. ఇరవై సంవత్సరాల క్రితం దొరలను ఎదుర్కోవాలంటే అంతకంటే చేయ్యాల్సిందేం ఉండేది కాదు. ఉత్తర తెలంగాణలో మొదలైన భూ పోరాటాలు కొండయ్య లాంటి వారిలో ఆత్మ విశ్వాసాన్ని నింపాయి. ఆ సమయంలో 1997 ప్రాంతంలో కొండయ్య వ్యవసాయపు ఎడ్లు పోయాయి. తన పాలేరు ఆ ఎడ్లను తీసుకెళ్లి అమ్ముకున్నాడు. దీన్ని ఆసరాగా చేసుకొని మాలమాదిగల వైరుధ్యాలను రెచ్చగొడుతూ, నక్సలైట్ల ముద్రవేసి కొండయ్య లాంటి వారిని నానా ఇబ్బందులకు గురిచేసింద్రు దొరలు. వాళ్ల ఎత్తులకు పై ఎత్తులు వేసి వారి నుండి తప్పించుకున్నాడు.

కొండయ్య చిన్నప్పుడు జరిగిన ఓ సంఘటన “అయ్యో సార్…! ఎన్ని అవమానాలు పడ్డం మేం… నా చిన్నప్పుడు మా వాడకెవ్వలన్న ఊరోల్లు వత్తె ముక్కుకు నొరుకు అడ్డంగ బట్టగట్టుకొనత్తురు… మా వాడకు బజార్లు బట్ట పీలిక కాలుకు తాకినా ఇంటికి పోయి తానం జేసేటోల్లు… మొన్న మొన్నటిదాక గూడ మాకు సవురం జేత్తె మంగలయినె గొంగడి కట్టుకొని చేసేటోడు… మమ్ములను వెలేసినట్టే సూత్తురు సారు…! గీ నడుమ రకరకాల లొల్లులతొని గా దొరలు తోకలు ముడిసింద్రు… లేకుంటే మమ్ములను కొద్ది గోస మచ్చుకున్నరా సారు…! గిప్పుడు దొరతనాలేం లెవ్వు కాని పాతదొరలు కొందరున్నరు సారు… గాల్లు ఏదో విధంగ పుల్లలేత్తనే ఉన్నరు సారు…!” (మల్లయ్య, కాలువ.2014:పుట.12,13) దళితుడైన కొండయ్య ఎదుర్కొన్న ఈ సందర్భం ద్వారా దళితవాడలో ఉన్న దళితులు సామాజిక ఎడబాటు, అవమానాలు ఎదుర్కొన్నారు అని తెలుస్తుంది. మంగలి వృత్తి చేసుకుంటున్న వారు కూడా వివిధ రూపాలలో దళితులను వివక్షకు గురిచేయడాన్ని మనం గమనించవచ్చు. దొరలు పీడనకు గురిచేసేవారు. అలాంటివారు కమ్యూనిస్టు ఉద్యమాలు, తెలంగాణ రైతాంగ పోరాటాల ఫలితంగా మార్పు చెందటం వల్ల దొరల దౌర్జన్యాలకు అడ్డుకట్ట వేయబడింది.

నిజానికి మాలపంకిడిగాడు ఒక వ్యక్తి కాదు. బలమైన ఆదర్శాన్ని సమాజ ధర్మం నిరంతరం నింపాలనే తపనతో ఉన్న సంస్కర్తగా కనిపిస్తాడు. అన్ని విషయాలు అనుభవాల ద్వారా జీర్ణించుకొని విశ్లేషణ చేయగల సమర్థుడిగా కనిపిస్తాడు. అతడు తన ఊరునే చూసిన ప్రపంచ సమాజాన్ని అవగతం చేసుకున్న విషయాలు అతడి మాటల్లో కనిపిస్తాయి. పెద్ద పెద్ద దొరలంతా ఊర్లు వదిలిపెట్టిపోతే అణగారిన వర్గాలవారు సంతోషపడ్డారు. కమ్యూనిస్టులు, పోలీసులు, అంబేద్కర్ సంఘాల కృషితో దొరల పీడన నాశనం అయింది. మాలమాదిగలు అంటే ఇంకా

బానిసలుగా బ్రతకాల్సిన అవసరం లేదని తెలుస్తుంది. సమాజంలో మాల మాదిగల మధ్య వైరుధ్యాలు అవసరం లేదని వాళ్లు దళిత రాజ్యాధికారం కొరకు పోరాటాలు చేయాలన్న సందేశాన్ని ఈ నవల మనకు అందిస్తుంది.

### 3.3.3.3. తెలంగాణ గ్రామీణ జీవితంపై కమ్యూనిస్టు పోరాటాల ప్రభావం:

కరీంనగర్ జిల్లాలోని ఓ పల్లెలో కొండయ్య జీవితం గడుపుతున్నాడు. ఆ ఊళ్లో కులాలు ఎన్ని ఉన్న వరుస పెట్టుకొని పిలుచుకునేవారు. బీద, ధనవంతులు అన్న తేడా లేకుండా బతికేవారు. చిన్న పెద్ద అనే గౌరవ మర్యాదలు ఇచ్చిపుచ్చుకునేవారు. పొలాల దగ్గరకు వెళ్తే కూరగాయలు ఇచ్చేవారు. ఎంతో ప్రేమతో ఉన్న ఊళ్లో మార్పులు సంభవిస్తున్నాయి. దొరలు, పట్వారీలు, పోలీసులు, పటేళ్లు, కమ్యూనిస్టు పోరాటాల ప్రభావంతో మార్పుచెంది దొరలు కొందరు వ్యాపారాలు చేస్తున్నారు. ఊళ్లో ఉన్న కొందరు పైరవీలు చేస్తున్నారు. దొరతనం, అధికారం లేకపోయేసరికి కొందరు రాజకీయాల్లోకి వచ్చి పదవులు సంపాదించుకున్నారు. బ్యాంకు అప్పుల కొరకు పైరవీలు చేయడం, పోలీసు స్టేషన్లలో కేసులయితే వారిని విడిపించడం కొరకు పైరవీలు చేయడం లాంటివి చేస్తున్నారు. ఆ ఊళ్లో  అన్నలు, పోలీసోల్లు చేస్తున్న హింస ఘోరంగా ఉంది. ఊళ్లో కమ్యూనిస్టులైన అన్నలు ఉండడం మరియు అంబేద్కర్ సంఘాల యువకులు ఉండడంతో పోలీసుల నిఘా కూడా ఎక్కువగానే ఉంది.

### 3.3.3.4. ముగింపు:

ఎడ్లు పోవడం అనే సంఘటనను తీసుకొని దాని ఆధారంగా గ్రామీణ సమాజంలో మాలమాదిగలలో వస్తున్న మార్పులను తెలియజేశారు రచయిత. దొరల పీడన కమ్యూనిస్టుల, అంబేద్కర్ సంఘాల ప్రభావంతో అణచివేయబడింది. దొరలు, పటేండ్లు, పట్వార్లు ఎన్ని పన్నాగాలు పన్నిన వాటిని తుడిచికొట్టి తెలివిగల వ్యక్తిగా కొండయ్య జీవితం ఆవిష్కరింపజేయబడింది. అతని తెలివిని మెచ్చుకొని ఊళ్లో ప్రజలు అతన్ని మాలపంకిడిగాడు అంటారు. అందరూ ఆ కులంలో ఉన్నవారు అతనిలాగా తప్పించుకోలేరు కాబట్టి తప్పించుకోవడమే కాదు సమాజాన్ని ఎదుర్కొవాలన్న సందేశాన్ని ఇస్తాడు. మాల మాదిగలల్లో వస్తున్న వైరుధ్యాలు తగ్గి దళిత రాజ్యాధికారం కొరకు కొట్లాడాలని, అప్పుడు శత్రువు రూపం మార్చుకొని రావచ్చని అందుకే రాజ్యాధికారం దక్కించుకోవాలని ఈ నవల చెప్పుతుంది. దళితులను మాలపంకిడిగాళ్లు అనడం మంచిగ లేదు, వారు కష్టజీవులు కాబట్టి మంచియన్నది మాల మాదిగోల్ల దగ్గరే ఉందని చెప్పవచ్చు.

గురజాడ 'మంచియన్నది మాల అయితే... మాలనేనయితే' అన్నట్టుగా 'మంచి యన్నది మాలనే' మాటను గుర్తించుకోవాలన్నాడు. దళితులు ఈ దేశపు మూలవాసులు, పీడుతులు, కష్టజీవులు.

### 3.3.4. అస్పృశ్య కోయిల నవల:

'అస్పృశ్య కోయిల' నవలను లిఖిత ప్రెస్, హైదరాబాద్ వారు 2017వ సంవత్సరంలో ప్రచురించారు. కాలువ మల్లయ్య తెలంగాణలోని గ్రామీణ జీవిత సంబంధాలు, అక్కడి ఆధిపత్య కులాల దురహంకారం, అణగారిన కులాలు ఎదుర్కొనే వివక్షను కళ్లకు కట్టినట్లు చిత్రించారు. అస్పృశ్యత కారణంగా సమాజానికి దూరం చేయబడ్డవారు ప్రధాన జీవన స్రవంతిలో కలిసిన విధానాన్ని వివరించారు. ఊరు ఊరంతా అంటరానివారంటూ కులవివక్ష చూపుతూ అణచివేతను అమలుచేస్తున్న కాలంలో పండుగలనే కాదు దేవాలయాల ప్రవేశాన్ని నిషేధించిన కాలంలో కులవివక్షను ప్రశ్నించిన స్త్రీ యొక్క జీవితాన్ని ఆవిష్కరింపజేశారు కాలువ మల్లయ్యగారు. దొరల చేతుల్లో బలైన ఒక స్త్రీ తన జీవన ప్రస్థానంలో ఏ మార్గం ఎంచుకుందో తెలిపే ఈ రచన దళిత, బహుజన సాహిత్యంలో ఒక మైలురాయిగా నిలుస్తుంది.

### 3.3.4.1. నవలా వస్తువు:

కరీంనగర్ జిల్లాలోని ఓ మారుమూల గ్రామంలో మాల కులంలో పుట్టినది కోకిలమ్మ. కోకిలమ్మ కష్టపడి పనిచేసే సామర్థ్యమున్న వ్యక్తి. రెక్కల కష్టంతోనే సంపాదించుకునే శక్తి కలది. ఆమె పేరుకు తగ్గట్లుగా ఆమె గొంతు కోకిల గొంతే. ఆమె గానకోకిలే. ఆమె పాటలు బాగా పాడుతుంది. ఆమె జానపద పాటలు, గౌరమ్మ పాటలు, పెండ్లి పాటలు, బతుకమ్మ పాటలు, శోభనం పాటలు మొదలైనవి పాడుతుంది. తనను వెంబడించిన మగవాళ్ళను కూడా ధైర్యంగా ఎదుర్కొని బామ్మర్ధి అని పిలిచి దొరలకే సవాలుగా నిలిచిన మాలపిల్ల కోకిలమ్మ. ఆ ఊరి దొర లక్ష్మణరావు, అతని కొడుకు శ్యాంరావులు పెద్ద జమీందార్లు. బాగా భూములున్న భూస్వాములు. వారికి పాలేర్లు ఉన్నారు. వారికి అంగబలం, అర్థబలం ఉంది. ఇంకా దొరల జులుం జరుగుతున్న కాలంలో ఆమె దొర కొడుకుని ఎదురించింది.

కోకిలమ్మను లోబరుచుకోవడం కోసం ఊరి పెద్ద దొర కొడుకు శ్యాంరావు చేయని ప్రయత్నమంటూ ఉండదు. అయినా కోకిలమ్మ ఆత్మగౌరవం కలిగినది. కులానికి తక్కువేమోగాని, గుణానికి కాదంటూ తనను కామించి లోబరుచుకోవడానికి ప్రయత్నించిన కామాంధులందర్నీ ధిక్కరించింది. ఊరు మొత్తం అంటరానివారిని పండుగలకు, దేవాలయాల ప్రవేశాన్ని నిషేధిస్తే వారిని ఎదురించి కులవ్యవస్థను ప్రశ్నించిన స్త్రీ. తల్లిదండ్రులు కాదన్నా ఊరి కట్టుబాట్లను బంధించే

ప్రయత్నం చేసినా ఊరి పంచాయితీలోనే నెగ్గి, తానే కాదు దళితులందర్నీ దేవాలయ ప్రవేశం చేయించగలిగిన వీర వనిత. ఆమె ప్రసన్నతల్లో, నిలువరింతల్లో, ధర్మాగ్రహంలో, విజయాల్లో ఉత్తర తెలంగాణలో ఉవ్వెత్తున ఎగిసిపడిన భూస్వాముల, దొరల కొమ్ములను విరిచిన విప్లవోద్యమ ప్రభావం ఉన్నది.

దొర కొడుకు శ్యాంరావు ప్రయత్నాలు విరమించుకోలేదు. తాను కోరితే కాదన్న స్త్రీ, అందునా ఒక మాలపిల్ల, తనను ఎదురించి నిలబడడాన్ని, పంచాయితీలకు ఈడ్చడాన్ని తట్టుకోలేకపోయాడు. నిరంతర పన్నాగాలు చేసి చివరికి పెళ్లి చేసుకుంటానని, దొంగమాటున తాళికట్టి కోకిలమ్మను లోబరచుకున్నాడు. నమ్మి మోసపోయిన కోకిలమ్మ న్యాయం కోసం పంచాయితీ కెక్కింది. డబ్బు, భూమి, బంగారం లాంటివి అడిగితే ఇస్తాం కాని కాపురానికి మాత్రం తీసుకపోనంటాడు శ్యాంరావు. కోకిలమ్మ ప్రేరణతో చైతన్యవంతులైన దళితులు, అంబేద్కర్ సంఘ ప్రతినిధులు, యువజన సంఘాల నాయకులు కోకిలమ్మకు జరిగిన అన్యాయాన్ని ప్రశ్నించి, అక్కడే ఉండాలని చెప్తారు. అయినా అగ్రవర్ణ బంటులుగా పనిచేస్తున్న పోలీసు పటేలు, సర్పంచ్ మొదలైన వారు కోకిలమ్మను దొర గడీలో కోడలిగా ఉంచుకోవడం సాధ్యం కాదంటారు. కోకిలమ్మ, ఊరి దళితులు మూకుమ్మడిగా పట్టుబట్టడం, గ్రామాల మీద పెరుగుతున్న విప్లవోద్యమ ప్రభావానికి భయపడడం కారణంగా కోకిలమ్మ దొర గడీలోకి ప్రవేశిస్తుంది. కోకిలమ్మ అత్త దొరసాని కోకిలమ్మను తాను కోడలిగా స్వీకరించడానికి సిద్ధంగాలేనని, బయటికి తలపట్టి గెంటేయమని కొడుకును ఆదేశిస్తుంది. అయినా ఊరి దళిత యువతరం, కోకిలమ్మ పట్టుదల కారణంగా గడీలోనే ఒక భాగంలో ఉండటానికి అత్త ఒప్పుకుంటుంది. ఆ తరువాత కోకిలమ్మ గడీలో ఉండనని, దొర కొడుకుకు, దొర కుటుంబం మొత్తానికి బుద్ధి చెప్పడం కోసమే తాను ఇంతవరకు వచ్చానని ఆత్మగౌరవంతో బతికే తాను ఈ దొర గడీలో ఉండనని, తను శ్రమ శక్తినే నమ్ముకొని, కడుపులో బిడ్డను కాపాడుకుంటానని, మన ఇంటికి వెళ్దాం పదమని తల్లిదండ్రులతో అంటుంది. కాని అట్లా వెళ్తే అది కోకిలమ్మ పరాజయంగా భావిస్తారని ఎన్ని కష్టాలెదురైనా కోకిలమ్మను గడీలోనే ఉండమని తన తరుపున నిలబడిన వాళ్లు నచ్చజెప్తారు. దాంతో కోకిలమ్మ గడీలోనే ఉండిపోతుంది.

నక్సలైటు ఉద్యమం తీవ్రరూపం దాల్చి, దొరలు భూస్వాముల్ని తరిమేసే పరిస్థితి రావడంతో శ్యాంరావు కుటుంబంతో కరీంనగర్ వెళ్లి స్థిరపడతాడు. రెండు దశాబ్దాలు గడిచిపోతాయి. దొర గడీలో శ్యాంరావుకు శృంగారం కోసం వినియోగించే వస్తువుగా మారిపోతుంది కోకిలమ్మ. వయస్సు మీద పడటంతో శరీరం శుష్కించి పోగానే పూర్తిస్థాయి నిరాదరణకు గురవుతుంది.

కడుపు నిండా తిండి, కంటి నిండా నిద్ర, కట్టుకోవడానికి సరైన బట్టలు కూడా ఉండవు. ఇటువంటి స్థితిలో మానేరు డ్యాంలోకి దూకి ఆత్మహత్య చేసుకుందామనే ప్రయత్నంలో ఉండగా గోపాలకృష్ణ శర్మ అనే సామాజిక ఉద్యమకారుడు ఆమెను కాపాడుతాడు. ఆమెను పెళ్లి చేసుకొని, చదువు చెప్పి ఉద్యమాల్లో భాగం చేస్తాడు. ఆయన ప్రోద్బలంతో అద్భుతమైన ప్రజా గాయనిగా, రచయిత్రిగా, ఉద్యమకారిణిగా ఎందరెందరికో ఆదర్శప్రాయమైన స్త్రీవాద ఉద్యమకారిణిగా, కుల నిర్మూలన పోరాట కార్యకర్తగా తయారవుతుంది.

### 3.3.4.2. వస్తు విశ్లేషణ:

ఒక దళిత యువతి వాస్తవ బ్రతుకు చిత్రాన్నే 'అస్పృశ్య కోయిల'గా వెలువరించారు రచయిత. ఈ నవల 1970 నాటి సామాజిక వాతావరణంలో మొదలై వర్తమాన రాజకీయ పరిస్థితులు, ప్రజా ఉద్యమాలను స్పృశించేలా ఉంది. ఈ నవలలో గ్రామాల్లో పాతుకుపోయిన కులాచారాలు, దళితుల శ్రమైక జీవితం, దళిత వర్గాలలో వస్తున్న చైతన్యాన్ని మనం గమనించివచ్చు. దళితులు ఏకమై ఉద్యమించి తమకు సామాజిక న్యాయబద్ధంగా దక్కవలసిన వాటాల్ని దక్కించుకోవడం కోసం పోరాటం చేయాలి, రాజ్యాధికారాన్ని దక్కించుకోవాలనుకుంటారు. అగ్రవర్ణాలతో కలిసి ఉంటున్న బహుజనులు కూడా తాము పీడితులం అని మరిచి అగ్రవర్ణాల సరసన చేరి దళితులను హీనంగా చూడటం, వారికి రావాల్సిన అవకాశాలను కొద్దిమేరకైనా తామే పొందడం అన్నవి అన్యాయమైనది అని మనం ఈ నవల ద్వారా తెలుసుకోవచ్చు. ఈ నవలలోని గ్రామంలో మాల మాదిగలే కాదు అందరూ విభిన్నమైన కులాలవారు ఉన్నారు. భూస్వాముల ఆధిపత్యంలోనే గ్రామం ఉంది. దళితులు గ్రామానికి వెలుపలనే ఉన్నారు. దళితులు శ్రమచేసి గ్రామానికి అవసరమైన ఉత్పత్తి చేస్తుంటే ఈ ఉత్పత్తిని వినియోగించుకొని లాభాలు గడించి గడీల్లో నివసించేవాడుగా లక్ష్మణరావు దొర ఉన్నాడు. ఆ దొర అదుపు ఆజ్ఞల్లోనే ఊరి సర్పంచ్, పోలీసు పటేల్, ఇతర గ్రామ పెద్దలు ఉన్నారు. శ్యాంరావు కోకిలమ్మకు అన్యాయం చేసిన విషయంలో కులాధిపత్యమే నెగ్గింది. చివరగా కోకిలమ్మ దొరను ఎదురించి దళితవాడల వైపు చూస్తున్న దొరల అహంకారాన్ని అణగగొట్టి దళిత స్త్రీవాద శక్తిగా ఎదిగిన క్రమాన్ని మనం గమనించవచ్చు.

### 3.3.4.3. దళితుల సామాజిక జీవితం:

మానవ సమాజం ఈరోజు అనుభవిస్తున్న అత్యంత ఆధునిక సదుపాయాల వెనుక 'మానవ శ్రమ' అనే శక్తి ఉంది. ఆ శ్రమలో పాల్గొంటున్నది దళిత బహుజనులే. వారే లేకుంటే ఈ సమాజం

ఒక్క పూట కూడా గడవలేదని అస్పృశ్య కోయిల నవల తెలియజేస్తుంది. ఈ నవలలో మనోజ్ అనే పాత్ర తన బావమరిదియైన ఓదెల్ కు మాలమాదిగల సామాజిక జీవితం గురించి తెలుపుతున్న ఓ సందర్భాన్ని గమనించవచ్చు. "నిజానికి మాలమాదిగల్లో ఉండే మంచితనం, కష్ట సహిష్ణుత, కఠినమైన పనులు చేయడం ఎవరిలో ఉంది వాళ్ళెన్ని పనులు చేస్తారు. ఈ దొరలు కూర్చుండి తింటారు. అసలు దళితులు లేందీ సమాజం నడుస్తుందా?"

"అవు బావా... వాళ్ళు అదొక్క పని చేస్తరు".

"ఎవరింట్లో శిశువు పుట్టినా, మనిషి చనిపోయినా దళితులు పని చేయంది వెళ్ళదు. అంటే మనిషి పుట్టుక నుండి చనిపోయేవరకు వివిధ దశల్లో అన్ని కార్యాల్లో దళితుల ప్రమేయం ఉంటుంది. నన్నడుగుతే వాళ్ళు పని చేయకుంటే ఈ సమాజమే ఆగిపోతుంది. శిశువు పుట్టినప్పుడు కొల్లు గుంటలు తవ్వడంతో మాల మాదిగల పని మొదలవుతుంది. శిశువు పురుడుకు అందరిని పిలువడం, వెట్టి చేయడం, వాయిలాకు తక్కలాకు తెచ్చియడం లాంటి పనులన్ని చేస్తరు. చెప్పులు కుట్టడం, డప్పు కొట్టడం, తాళ్ళు పేనడం చేసి ఊరి అవసరాలు తీరుస్తారు. జంతు కళేబరాలను తీయడం, పశువులను కోసి పారేయడం చేసి ఊరిని శుభ్రంగా ఉంచుతారు. బజార్లు ఊడుస్తారు. పాయఖానాలు కడుగుతారు. శుభ కార్యాల్లో అన్ని రకాల పనులు చేస్తారు. పెళ్ళి డప్పు కొట్టడం, శోభనం డప్పు వాయించడం, చావు డప్పు కొట్టడం, వ్యవసాయపు పనులన్ని చేయడం, వెట్టిగా వెనుకంతులు చేయడం మామూలే. శవాలను కాల్చడం, ఊరును శుభ్రంగా ఉంచడం వాళ్ళ పనే. వాళ్ళు ఎన్నెన్ని పనులు చేస్తారు. సుంకర్లుగా ఉండి ఊరును కాపలా కాయడం, నీరటికాళ్ళుగా పనిచేస్తూ పొలాలను పారించడం వీళ్ళు చేసే పనులే. పాలేర్లుగా ఉండి అన్ని పనులు చేస్తారు. ఇలాంటి వాళ్ళను, ఇంత కష్ట జీవులను ఊరి అవతల ఉంచడం ఎంత ఘోరం? కొన్ని పండుగలు జరుపుకోనీయకపోవడం ఎంత దౌర్జన్యపూరితమైంది. వీళ్ళు బతుకమ్మ ఆట ఎందుకాడగూడదు. అందరికీ పూలు తెంపుకవచ్చి ఇచ్చి వీళ్ళు బతుకమ్మలను దూరం నుండి చూడాలా? ఇదెక్కడి అన్యాయం? ఇంతేకాదు వీళ్ళు పశు వైద్యం చేస్తారు. ఊళ్ళో మంత్రగాల్లుగా వైద్యం చేస్తారు. బైండ్లుగా జమిడికె వాయిస్తారు. ఇలా మన సామాజిక అవసరాలు తీర్చే అన్ని పనులు చేసేవాళ్ళు మాల మాదిగలే. ఇన్ని పనులు చేసే వీళ్ళను ఊరు బయటుంచి మన సమాజం ఎంత తప్పు చేసింది? వీళ్ళు పండించిన పంటకు, తయారుచేసిన చెప్పులు, తలుగులు, తాళ్ళకు, చీపుర్లకు ముట్టులేదు. వాళ్ళకేమో ముట్టుడు. ఇదెంత ఘోరం, ఓదెలూ...! నాకయితే అనిపిస్తుంది ఈ అంటరానితనమనేది దేశానికో శాపం లాంటిది" (మల్లయ్య, కాలువ.2017:పుట.35, 36).

సమాజ గమనంలో దళితులు చేసే శ్రమ గురించి చేసిన వర్ణన ఇది. మనిషి పుట్టింది మొదలు చనిపోయేదాకా, చనిపోయాక కూడా ఏ మనిషి జీవితంలోనైనా దళితుల పాత్ర విడదీసి చూడరాదు. ప్రత్యక్షంగా కనిపించే పనుల్ని ఇక్కడ ప్రస్తావించారు కాని ఇవి మాత్రమే కాకుండా సమాచార వ్యవస్థకు పురుడు పోసింది, తొలిసారిగా వాయిద్యాల తయారీని చేసింది కూడా దళిత సమాజమే. దేశానికి స్వాతంత్ర్య వచ్చిన, స్వపరిపాలన ఉన్నప్పటికీ దళితులలో ఎటువంటి మార్పు లేకుండా, వారి అభివృద్ధి అనేది ఎక్కడి గొంగడి అక్కడే అన్న చందంగా తయారైందని అస్పృశ్య కోయిల నవల మనకు తెలుపుతుంది.

### 3.3.4.4. బతుకమ్మ పండుగ – కులవివక్ష:

బతుకమ్మ పండుగను తెలంగాణ రాష్ట్రంలో మాత్రమే జరుపుకుంటారు. ఈ పండుగకు సంబంధించిన కథలు జానపద సాహిత్యంలో, జీవితంలో అనేకం ఉన్నాయి. తెలంగాణ వ్యాప్తంగా వేరు వేరు ప్రాంతాల్లో కొద్దికొద్ది మార్పులతో బతుకమ్మను గురించి కథలున్నా, అన్నింట్లో ఉండే ఒకే ఒక విషయం బలైపోయిన ఒక శ్రామిక మహిళ జీవితం. సామాజిక సమస్యలు ఒక స్త్రీని చిత్రవధ చేస్తే, ఆ స్త్రీ చెరువు నీటిలో మునిగి ఆత్మహత్య చేసుకుంటుంది. ఆ స్త్రీ బంధువులు, ఆత్మీయులు, ఆమె ఆత్మహత్య చేసుకున్న చెరువులో పూలు విడిచి 'అమ్మా నువ్వు మళ్లీ బతుకు' అని వేడుకుంటారు. అలా వచ్చిందే బతుకమ్మ పండుగ. ఈ పండుగను జరుపుకునే అవకాశం దళితులకు లేకపోవడం అత్యంత దారుణమైన విషయం. ఈ విషయాన్ని కూడా 'అస్పృశ్య కోయిల' నవల ప్రధానంగా చర్చించింది.

"మాల మాదిగలకు బతుకమ్మ పండుగను జరుపుకునే అవకాశం లేదు. ఊరంతా బతుకమ్మలాడుకుంటుంటే వీళ్ళు మాత్రం వాళ్ళకవసరమయ్యే పువ్వులు తెచ్చి ఇస్తారు. తంగేడు పువ్వులు, గుమ్మడి పూలు, గునుగుపూలు, గోరింట పూలు, బంతి పూలు, కాకరపువ్వులు లాంటి అనేక రకాలు పువ్వులు ఏరుకొచ్చి ఇస్తారు. ఊరివాళ్ళు బతుకమ్మలాడుతుంటే చూస్తారు. పెద్ద బతుకమ్మ నాడు అంటే సద్దుల బతుకమ్మ నాడు మాత్రం మాలలు ఒక్కరోజు బతుకమ్మ ఆడుతారు. మాదిగలకు అదీ లేదు. ఊరి వాళ్ళంతా సంబరంగా బతుకమ్మ లాడుతుంటే మాల యువకులు కోలాటమేస్తారు. చిరుతల రామాయణం ఆడుతారు. మాదిగలు దూరంగా ఉండి చూస్తారు. సద్దులను అడుక్కుంటారు. పూర్వకాలం నుంచి ఇదే ధోరణి కొనసాగుతుంది. ఒకటి రెండు సార్లు మాలమాదిగలు బతుకమ్మ ఆడుకుందామని ముందుకొచ్చినా దొరల జోక్యంతో మానుకున్నారు. తర్వాత ఆ విషయం మరిచిపోయారు. మా కర్మ ఇంతేలే అని ఊరుకున్నారు. ఎప్పటిలాగే

ఊరివాళ్ళకు పువ్వులేరుకొచ్చి ఇస్తుంటారు. అయితే ఊళ్ళో ఈ మధ్య కొంత చైతన్యం వచ్చింది. యువజన సంఘాలు, అంబేద్కర్ సంఘాలు, భూపోరాట ఉద్యమాలు ఊళ్ళలో కొంత చైతన్యాన్ని తీసుకొచ్చాయి. మేమెందుకు బతుకమ్మ ఆడకూడదన్న వాదం బయటకొచ్చింది. అయినా ధైర్యం చేయలేదు" (మల్లయ్య, కాలువ.2017:పుట.48). బతుకమ్మ పండుగ ఒక వేడుక. ఉత్పత్తి కులాలు సంబురంగా జరుపుకోవాల్సిన ఒక పండుగ. పండుగ ఏదైనా ప్రజలకు ఆనందాన్ని ఇస్తుంది. కాని దళితులు ఆనందంగా ఉండడం, వారు వేడుక చేసుకోవడం ఊరి దొరలకు ఇష్టం ఉండదు. కనుకనే బతుకమ్మ పండుగ ఆడుకోవడానికి దళితులకు అవకాశం లేదు. పండుగ జరుపుకోవడం మీద నిషేధాజ్ఞను కట్టుబాటుగా చిత్రించారు.

### 3.3.4.5. అంటరానితనం – దొరల దౌర్జన్యం:

'అస్పృశ్య కోయిల' నవలలో దళితుల ఇళ్లు (దళితవాడ) ఊరికి చివరన ఉంటాయి. ఈ నవలలో ఒక సందర్భంలో మనోజ్ దళితవాడల గురించి బాధపడిన విషయాన్ని గమనించవచ్చు. "దళితవాడ ఊరి చివర ఉండటం గమనించాడు. మా ఒక్క ఊర్లోనే కాదు మా చుట్టూ ఊళ్ళలోనూ ఇదే పరిస్థితి. మా అమ్మగారి ఊళ్ళోనూ, నాకు తెలిసిన అన్ని ఊళ్ళలోనూ మాలమాదిగల ఇండ్లు ఊరి చివర్నే ఉంటాయి. ఇదేం దుర్మార్గమో నాకర్థమయ్యేది కాదు. మా ఊళ్ళో గౌండ్ల నానుకొని మాలలు, వాళ్ళ దగ్గరే మాదిగలిండ్లున్నాయి. ఆ ఇండ్లు చాలావరకు గుడిసెలు, లేదా కూలడానికి సిద్ధంగా ఉన్న చిన్న పెంకుటిండ్లు. ఇందిరాగాంధీ ప్రధానిగా ఉన్న కాలం అది. ఆమె మాలమాదిగలకు ఇండ్లు కట్టిస్తున్నారని విన్నాను. అయితే అవి కూడా ఊరు బయటేనని తెలుసుకొని బాధపడ్డాను. అసలీ అంటరానితనమంటే? మనుషుల్లో కొందరిని అస్పృశ్యులను దూరం ఉంచడమేమిటి? ఇదెంత అన్యాయం? నాలో నేను అనుకొని బాధపడ్డాను" (మల్లయ్య, కాలువ.2017:పుట.14). ఇది కేవలం తెలంగాణ రాష్ట్రంలోని కరీంనగర్ జిల్లాలోని ఓ మారుమూల పల్లెలో మాత్రమే కనిపించే విషయమే కాదు, భారతదేశంలోని చాలా గ్రామాల్లో ఇలాగే ఉంటుంది. మాలమాదిగలు, ఊరివాళ్ళంతా తమ పరిధిలోనే ఉండి తాము చెప్పిన పనులు చేయాలని, తమ దేవుళ్ళకే మొక్కాలి కాని దూరంగా ఉండాలి. అంటరానితనం ఉండాలనేది దొరల పన్నాగంగా మనం భావించవచ్చు. దళితవాడ నిండా పనులే. అదో పనుల కార్ఖానా. అందరూ దేశ సౌభాగ్యానికి, ఊరు నడవడానికి సమాజ గమనానికి ఉపయోగపడతారు.

సామాజిక అవసరాలను తీర్చి అన్ని పనులు చేసేది మాలమాదిగలు. గొప్ప సృష్టికర్తలు. ప్రతి వస్తువు ఉత్పత్తిలో వాళ్లకు స్థానముంది. గ్రామాన్ని శుభ్రంగా ఉంచడంలో, పాయఖానాలు

శుభ్రం చేయడంలో వాళ్ళ పాత్ర ఉంది. చాలా పనుల్లో వాళ్ళకు స్థానముంది. దేశ సంపద పెంచడంలో వాళ్ళకు ముఖ్యపాత్ర ఉంది. అటువంటి వారిని సమాజానికి దూరంగా అంటరానివాళ్లుగా ఉంచడం పెద్ద పొరపాటు. అందుకే వాళ్లలోనే కొందరు ఇతర మతాలను ఆశ్రయిస్తున్నారు. క్రైస్తవులుగా మారుతున్నారు. దళితులు గుడికి కూడా పోలేని పరిస్థితులున్నప్పుడు సహజంగానే మతం మారుతున్నారు. ఈ అంటరానితనం అనే దుర్మార్గం, వివక్ష లేకుంటే మన దేశంలో ఈ క్రైస్తవ మతం ఇంతగా వ్యాప్తి చెందేది కాదేమో. మన ప్రాంతంలో అయితే మతం మార్చుకున్నది చాలా వరకు మాలమాదిగలే. పందిర్లు వేయడంలో, చెప్పులు కుట్టడంలో, తాళ్లు పేనడంలో అద్భుతమైన పని నైపుణ్యాన్ని చూపిస్తారు మాదిగలు. పెళ్లి డప్పు, పోచమ్మ డప్పు, చావు డప్పు, ఎన్నో రకాల డప్పు వాయిద్యాలు వినిపిస్తూ ఊరివాళ్ల అవసరాలు తీర్చడానికి తమను తాము సమిధలుగా అర్పించుకునే వెట్టి పనివాళ్ళు మాదిగలు.

దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన రెండు మూడు దశాబ్దాల తర్వాత కూడా తెలంగాణ సమాజంలో అమలైన అమానవీయ భూస్వామ్యాన్ని అస్పృశ్య కోయిల నవలలో చిత్రించడం కనిపిస్తుంది. ఈ నవలలో లక్ష్మణరావు దొర, అతని కొడుకు శ్యాంరావులు భూస్వాములకు జాగీర్దార్లకు ప్రతిరూపం. దొరలు తన కంటికి నచ్చిన స్త్రీని ఎత్తుకుపోయి బలాత్కారం చేయడం, అది కూడా సరిపోకపోతే గడీలోనే బంధించి తాను మాత్రమే కాకుండా తన బంధువులకు కూడా శృంగార వస్తువుగా చేయడం, కొన్నిసార్లు కోరికలు తీరాక చంపేయడం మొదలైనవన్ని భూస్వాములైన దొరలకు వికృతి రూపాలుగానే గుర్తించారు. ఈ విషయాల్నే దృశ్యమానం అయ్యేటట్లు ఈ నవలలో రాజవ్వ, కోకిలమ్మ ఉదంతాలను చిత్రించడం ద్వారా కనిపిస్తుంది.

మాల కులంలో పుట్టిన రాజవ్వ వాళ్ళ మేనబావను పెళ్లి చేసుకుంటుంది. రాజవ్వకు చిన్నప్పుడే పెళ్ళవుతుంది. రాజవ్వ మీద దొర కండ్లు పడతాయి. ఆమెను ఉంపుడుగత్తెగా ఉంచుకుంటానని చెప్పి సుంకర్లను పంపించాడు. ఆమెను పంపడానికి రాజవ్వ తల్లిదండ్రులు ఒప్పుకోరు. రాజవ్వ భర్త కొండయ్య వచ్చి నా పెళ్లాన్ని తీసుకుపోవద్దని సుంకర్లను వేడుకుంటాడు. సుంకర్లు మేము దొర చెప్పినట్లు చేసేవాళ్ళం. మీరు దొరను బ్రతిమిలాడుకొండి అని చెప్పి ఆమెను దొర ఇంటికి తీసుకువెళ్తారు. కొండయ్య ఉగ్రనరసింహుడు రూపంలో దొర ఇంటికి వెళ్తాడు. కొండయ్యకి మాట్లాడటానికి సమయం ఇవ్వడు లక్ష్మణరావు దొర. పాలేర్లకు సైగ చేసి కొండయ్యను కొట్టిస్తాడు. అతన్ని ఎత్తుకెళ్లి ఎక్కడికో తీసుకువెళ్తారు. ఆ తరువాత కొండయ్య జాడ తెలియదు. ఏమైందో ఎవరికి తెలియదు. రాజవ్వ లక్ష్మణరావుకు ఉంపుడుగత్తెగా మారుతుంది. అతని కామ

దాహనికి బలవుతుంది. ఆమె బతుకు నాశనం అవుతుంది.ఆ తరువాత కొంత కాలానికి చనిపోతుంది. రాజవ్వ కేవలం ఒకానొక పాత్రనే కాదు. తెలంగాణ సమాజంలో దొరల కామానికి బలైపోయిన వేలాది స్త్రీ జీవితాలకు మచ్చు తునక.

ఊరి పెద్ద దొర లక్ష్మణరావు, అతని కొడుకు శ్యాంరావు. శ్యాంరావు మాల పిల్లయైన కోకిలమ్మను వేధిస్తుంటాడు. అతని వేధింపులు భరించలేక ఆమె అతన్ని గల్లా పట్టి లాగుతుంది. అతడు ఆమె నుండి విడిపించుకోవడానికి ప్రయత్నం చేస్తాడు. చివరికి విడిపించుకుంటాడు. అతను కోపంతో, అవమానంతో రగిలిపోతుంటాడు. ఓ మాల స్త్రీ అయిన కోకిలమ్మ తనను గల్లాపట్టి పదిమంది ముందు ఇజ్జత్ తీసిందని అవమాన భారంతో వెళ్తాడు. నిరంతర పన్నాగాలు చేసి చివరికి పెళ్లి చేసుకుంటానని దొంగమాటున తాళికట్టి కోకిలమ్మను లోబరచుకుంటాడు. నమ్మి మోసపోయిన కోకిలమ్మ పంచాయితీకి ఎక్కుతుంది. మావోయిస్టులు, యువజన సంఘాల వారి వల్ల కోకిలమ్మను దొర ఇంట్లోనే ఉండేటట్లు తీర్పు చెబుతారు. దర్జాగా, వీరనారిగా, ఎవరికి లొంగకుండా, పాటలు పాడుకుంటూ స్వతంత్ర్యంగా బతికిన కోకిలమ్మ దీనాతిదీనంగా మారుతుంది. ఆమె దొర ఇంట్లో పాత ముతుక చీర కట్టుకొని పేదరికానికి ప్రతిరూపంగా ఉండేది. దొర ఇంట్లో ఆమెను బాధించడంతో ఆమె ఓ అస్థిపంజరంగా తయారవుతుంది. ఆమె దొరసానిలా కాకుండా దొరకో సానిగా మారింది. దొర ఉంచుకున్న ఉంపుడుగత్తెగా ఓ చెడిపోయిన స్త్రీ బతుకు ఎలా ఉంటుందో ఆమె బతుకు కూడా అలానే ఉంది. ఆమెను  దొరకు కామ కోరికలు తీర్చే ఆడదానిగా మార్చారు. అయితే దొరల ఆగడాలను మానుకోలేదు. మావోయిస్టుల నుండి వచ్చిన హెచ్చరికతో దొర కుటుంబం కరీంనగరుకు చేరుతుంది. దొర ఇంటికి వచ్చిన వాళ్లందరి కండ్లు ఆమె మీదనే. ఆమె శ్యాంరావుకు, అతని స్నేహితులకు, బంధువులందరికి ఒక ఆటబొమ్మగా తయారైంది. అలా ఆమె బతుకుకు అర్థం లేకుండా పోయింది. దొర ఇంట్లోనే జీవచ్ఛవంలా బతికింది. ఆమె జీవితం సర్వనాశనమైందని చనిపోవడానికి నిర్ణయించుకుని మానేరు డ్యాంలోకి దూకే సమయంలో గోపాలకృష్ణ శర్మ అనే ఉద్యమకారుడు ఆమెను కాపాడుతాడు. ఆత్మహత్యలు పిరికివాళ్ళ లక్షణం అని చెప్పి ఆమెను తనతో తీసుకువెళ్తాడు. ఆ తరువాత నుండి ఆమెకు దొరల కుటుంబం నుండి విముక్తి లభించింది. పెళ్లి చేసుకొని కాపురం చేస్తానని మాటిచ్చిన దొర కొడుకు శ్యాంరావు కోకిలమ్మను చెరబడతాడు. కాని పెళ్లి ప్రస్తావన వచ్చేటప్పటికి అది సాధ్యం కాదంటాడు. మరి కోరిక తీర్చడానికి పనికి వచ్చే దేహం కాపురానికి ఎందుకు పనికి రాదనే సహేతుకమైన ప్రశ్న అంటరానితనంలోని భావజాలాన్ని ఎండగడుతుంది.

### 3.3.4.6. విప్లవోద్యమ పోరాటం – పీడిత కులాలకు రక్షణ:

అస్పృశ్య కోయిల నవలలో ప్రధాన పాత్ర అయిన కోకిలమ్మ సాధించిన విజయాల్లో విప్లవోద్యమ ప్రమేయం ఉన్నదని ప్రత్యక్షంగానే తెలుస్తుంది. కోకిలమ్మ దళిత ప్రజల ఆకాంక్షలకు నిలువెత్తు రూపం. ఎన్నాళ్లుగానో తాను దేవాలయంలోకి వెళ్లి దేవుణ్ని దర్శించుకోవాలని అనుకుంటుంది. కాని ఆ ఊరి పూజారి ఆమెను అడ్డుకుంటాడు. ఆమెను జుట్టు పట్టిలాగి పంచాయితీలోకి తీసుకువస్తాడు. ఊరి భూస్వామి లక్ష్మణరావు, పోలీసు పటేలు, సర్పంచ్ మొదలైన వారంతా దాన్ని ఖండిస్తారు. దళితులు దేవాలయంలోకి వెళ్లడం అన్నది కుల అంతరాలను పాటించే ఊరి కట్టుబాట్లకు విరుద్ధమని, ఆమెకు ఏదైనా శిక్ష వేయాలుకుంటారు. అట్లా ఆ ఊరి దళితులందరి ఆకాంక్షకు అడ్డుకట్ట పడుతుంది. కాని ఆ క్షణంలోనే అన్నలు పంపిన లేఖతో వారి కోరిక ఫలించి ఊరి దళితులంతా దేవాలయ ప్రవేశం చేస్తారు. నిజానికి మావోయిస్టుల ప్రమేయం లేకపోయి ఉంటే దళితుల కోరిక కోరికగానే మిగిలిపోయి ఉండేది. అలాగే ఆ ఊరి దళితులకు బతుకమ్మ పండుగ జరుపుకునే హక్కును కల్పించడంలోను, కోకిలమ్మకు పెళ్లి పేర అన్యాయం చేసి వదిలేద్దమనుకున్న సందర్భంలోను మావోయిస్టుల ప్రభావం వల్లనే ఊరి దళితులకు న్యాయం జరుగుతుంది. దీని ద్వారా ప్రాథమిక స్థాయిలోనైనా పీడిత కులాల రక్షణ కోసం విప్లవోద్యమం పోరాడి విజయం సాధించింది అని ప్రతిపాదించదల్చుకున్న విషయం.

### 3.3.4.7. ముగింపు:

దళితుల సామాజిక జీవితం, అంటరానితనం, బతుకమ్మ పండుగలో దళితులకు జరిగే అన్యాయం, దేవాలయాల్లోకి దళితులకు ఆలయ ప్రవేశం, పీడిత కులాలను దొరలు దౌర్జన్యంతో శ్రమ దోపిడీకి గురిచేయడం లాంటి అనేక సమస్యల్ని, పరిస్థితుల్ని అస్పృశ్యకోయిల నవల వివరిస్తుంది. దొరలు స్త్రీలను, పీడిత కులాల వారిని ఎలా ఇబ్బందులకు గురిచేస్తున్నారో ఈ నవల కళ్లకు కట్టినట్లుగా చూపిస్తుంది. దళిత యువతి కోకిలమ్మ దొరలను ఎదిరించి దళితవాడల వైపు చూస్తున్న దొరల అహంకారాన్ని అణగగొట్టి దళిత స్త్రీవాద శక్తిగా ఎదిగిన క్రమాన్ని మనం గమనించవచ్చు. కోకిలమ్మ దళిత ప్రజల ఆకాంక్షలకు నిలువెత్తు రూపం. కోకిలమ్మ సాధించిన విజయాల్లో విప్లవోద్యమ ప్రమేయం కూడా ఉందని చెప్పవచ్చు.

## 3.4. వృత్తి నవల:

ఆదిమకాలంలో మానవులు ఒక్కొక్కరు ఒక్కొక్క వస్తువును ఉత్పత్తి చేసి, ఒకరికి మరొకరు వస్తు వినిమయం చేయడం ద్వారా సంఘ జీవనం కొనసాగింది. ఈ వస్తూత్పత్తి ఒక వారసత్వంగా

మారి కాల పరిణామ క్రమంలో వృత్తులుగా ఏర్పడ్డాయి. ధనం అనేది మారక ప్రమాణం అయిన తరువాత వృత్తి ధనాన్ని సంపాదించే సాధనమైంది. ఇలా వృత్తి అనేది సామాజిక జీవితంలో ఉత్పత్తి పంపిణీ విధానలో అతి ముఖ్యమైన అంశంగా మారింది. ఈ వృత్తులే తరువాతి కాలంలో కులాలుగా మార్పు చెందాయి.

వృత్తులను ఆధారంగా తీసుకొని కొన్ని నవలలు కూడా వచ్చాయి. కాలువ మల్లయ్య వృత్తిని ఆధారంగా చేసుకొని 'గువ్వల చెన్నా' నవల రచించాడు. ఈ నవలలో పద్మశాలీల చేనేత వృత్తి గురించి తెలియజేశాడు. ఈ నవలలోని వస్తువును పరిచయం చేసి వస్తువును విశ్లేషణ చేశాను.

### 3.4.1. గువ్వలచెన్నా నవల:

కాలువ మల్లయ్యగారి 'గువ్వలచెన్నా' నవల చతుర మాసపత్రికలో ఫిబ్రవరి 2005వ సంవత్సరంలో ప్రచురించబడింది. పద్మశాలీల కులవృత్తిని గూర్చి, చేనేత కార్మికుల కష్టాలను వివరించిన నవల ఇది. ప్రపంచీకరణ నేపథ్యంలో అంతరించిపోతున్న కులవృత్తులలో ప్రముఖంగా నేత కార్మికులను కూడా పేర్కొనవచ్చు. కాలువ మల్లయ్యకు యదార్థ జీవిత చిత్రణ చేయడం చాలా ఇష్టం. 'వెలి విద్యలెన్నియైనను కులవిద్యకు సాటిరావు గువ్వల చెన్నా' అనే పద్యపాదంలోని చివరి పాదాన్ని తీసుకొని ఔచిత్యవంతంగా నవలకు 'గువ్వలచెన్నా' అనే పేరు పెట్టాడు. తెలంగాణ ప్రజల బతుకులను కరీంనగర్ మాండలికంలో సహజంగా చిత్రించిన విధానం వలన ఈ నవల మనలని ఆకట్టుకుంటుంది.

### 3.4.2. నవలా వస్తువు:

కరీంనగర్ జిల్లాలోని ఓ గ్రామంలో చిప్పమల్లయ్య, అతని భార్య లింగమ్మలు రాట్నం వడుకుతూ నేత పనిచేస్తారు. వారికి ముగ్గురు కుమారులు. వారు రాజమల్లు, వీరయ్య, శంకరయ్యలు. వారు తల్లిదండ్రులకు చేదోడువాదోడుగా ఉంటారు. వీరిలో ఇద్దరు నేత పనిచేస్తారు. కొడుకులందరిని చదివించే స్థోమత లేని చిప్పమల్లయ్య చిన్నవాడైన శంకరయ్యను చదివిస్తాడు. వీరు కడు పేదరికంలో ఉండి పనిచేస్తూ బతుకుతారు. వీరు ఒకపూట వరి అన్నం మరొకపూట మొక్కజొన్న గటికన్నము తింటారు. ఇవి సరిపోని పక్షంలో ప్రక్క ఇంటి నుండి గంజి తెచ్చుకుంటారు. బుద్ధిగా బడికిపోతూ బాగా చదువుకుంటున్న శంకరయ్యకు పని చెప్పడం లింగమ్మకు ఇష్టం ఉండదు. కాని రెక్కాడితే కాని డొక్కాడని బతుకుల్లో చదువుకుంటున్న కొడుక్కు పని చేయడం తప్పదని ఆమెకు తెలుసు. సబ్బుకొని స్నానం చేయలేని పేద కుటుంబం వారిది. చిన్నప్పటి నుండి కులవృత్తిలో తండ్రికి సహాయంగా ఉంటూ చదువుకుంటాడు. చిప్పమల్లయ్య చేసే

పనిలో ఏమాత్రం వృద్ధి కనిపించని కొడుకులు తండ్రి అనుభవించే క్షోభను చిన్నప్పటి నుండి గమనిస్తుంటారు. కులవృత్తిని నమ్ముకొని నిజాయితీగా బతుకుతున్న తండ్రి ఆర్థికంగా నిలదొక్కుకోకపోవడం వాళ్ళను కలచివేస్తుంది. చిప్పమల్లయ్య చీరలు నేస్తున్న, పట్టుచీరలు నేస్తున్న అంత ఖరీదైన చీరను భార్యకు ఇవ్వగలిగేవాడు కాదు. తాను నేసిన చీరల్లోంచి అమ్ముడుపోగా మిగిలిపోయినవి, ఎవరూ కొననివి భార్యకు ఇచ్చేవాడు. తనకు భార్య కోరిన పట్టుచీర కొనిచ్చే శక్తి లేదన్నది వాస్తవం. ఒక పట్టుచీర కట్టుకోవాలనే కోరిక కూడా తీర్చుకోలేని తల్లి లింగమ్మ పరిస్థితికి కొడుకులు అర్థం చేసుకునే ప్రయత్నం చేస్తుంటారు.

ఊరిలోని రాజారావు దొరకు ధోతులు నేసుకొని వెళ్ళారు చిప్పమల్లయ్య అతని కుమారులైన రాజమల్లు, శంకరయ్యలు. చిప్పమల్లయ్య దొర ముందు వినయ విధేయతలతో ఉంటాడు. దొర చెప్పినట్టు బట్టలు నేసుకొని వచ్చాడు. వారు అడిగిన ధరకే ఇచ్చారు. అయినా దొర అహంకారంతో శ్రామిక వర్గాన్ని గుర్తించకుండా 'సాలెసంకుటం గోచితిరుకుటం' అని అవమానించడం రాజమల్లు, శంకరయ్యలను బాధపెడుతుంది. కుటుంబ పరిస్థితులను అర్థం చేసుకున్న చిప్పమల్లయ్య పెద్ద కుమారుడు రాజమల్లు సంపాదించాలనే కోరికతో 'భీవండి' వెళ్తానంటాడు. రాజమల్లు అవమానాలు పడుకుంటూ, బతుకుదెరువు లేకున్నా ఎందుకు ఇక్కడ ఉండాలని తల్లిదండ్రులకు ఇష్టం లేకున్నా బలవంతంగా భీవండికి వెళ్తాడు. అక్కడికి వెళ్ళిన ఆరు నెలల్లోనే అక్కడ జరిగిన మత ఘర్షణల్లో హత్య కావించబడతాడు. అప్పటికే లచ్చవ్వను పెళ్ళి చేసుకొని వెళ్లిన రాజమల్లు ఆ తరువాత తన కొడుకు శ్రీరాంను చూసుకోకుండానే కన్ను మూస్తాడు. కొడుకు మరణాన్ని తట్టుకోలేని చిప్పమల్లయ్య, లింగమ్మలు చాలాకాలం తరువాత కోలుకుంటారు. మనవడు శ్రీరాంలోనే కొడుకును చూసుకుంటారు. చిన్న వయస్సులో భర్తను కోల్పోయిన లచ్చవ్వకు పునర్వివాహం చేస్తామంటారు తల్లిదండ్రులు. కాని లచ్చవ్వ కొడుకుండగానే వితంతు వివాహం చేసుకోవడానికి ఇష్టపడదు. ఆ పసివాడిలోనే తన భర్తను చూసుకుంటూ నేత పనిచేస్తూ కాలం గడుపుతుంది.

చిప్పమల్లయ్య రెండవ కుమారుడైన వీరయ్య ఆదిలాబాదుకు వెళ్ళి సంపాదించుకుంటూ ఉంటాడు. వీరయ్య, అతని భార్య లక్ష్మి వద్దన్నా తల్లిదండ్రుల కుటుంబ పరిస్థితులు చూసి పెద్ద కొడుకు రాజేశం సంపాదించాలనే ఆశతో దుబాయికి వలస వెళతాడు. రెండోవాడు లక్ష్మిరాజం చదువబ్బక తండ్రి చేసే కులవృత్తితో సంతృప్తి చెందకుండా కాలంతోపాటు మనమూ మారాలని

వేల రూపాయలు అప్పుతెచ్చి యంత్రాలు కొనుగోలు చేస్తాడు. లాభాలు రాకపోగా నష్టాలపాలై ఆత్మహత్య చేసుకుంటాడు.

శంకరయ్య తన కులవృత్తి పనిచేసుకుంటూ చదువుకుంటాడు. కాని తన కుల పనుల్లో స్థిరపడటం అతనికి ఇష్టంలేదు. ఓవైపు దొరలతో తిట్లు, అవమానాలు, మరొదిక్కు ఆర్థిక ఇబ్బందులు అతన్ని ఆ పనిలో స్థిరపడకూడదని చెబుతున్నాయి. చదువులో చురుకైనా తాను బాగా చదువుకొని గవర్నమెంట్ టీచర్ ఉద్యోగం సంపాదిస్తాడు. ఉద్యోగం చేస్తూ సమాజంలో జరిగే మార్పుల్ని నిశితంగా పరిశీలిస్తూ, సమాజ తత్వాన్ని, మారుతున్న కాలాన్ని అర్థం చేసుకుంటాడు. శంకరయ్య శారదను వివాహం చేసుకుంటాడు. తన ఇద్దరు కొడుకుల్ని బాగా చదివిస్తాడు. విదేశాలకు వెళ్ళే అవకాశం వచ్చినప్పుడు తనకు ఇష్టం లేకున్నా సమాజానికి అనుకూలంగా మారి తండ్రిలా ప్రవర్తిస్తాడు. ప్రపంచీకరణ దుష్పరిణామాలకు దారి తీస్తుందని భావిస్తూనే తాను మారక తప్పని పరిస్థితి వచ్చినందుకు బాధపడతాడు.

గువ్వల చెన్నా నవలలో రెండు తరాల వారి జీవన స్థితిగతులు ఉన్నాయి. చిప్పమల్లయ్య నేత పనిచేస్తూ ఆర్థికంగా వెనుకబడి బతుకుదెరువు భారంగానే భావిస్తూ గడిపేవాడు. అతని కుమారులు కొంతవరకు ఆర్థికంగా, సామాజికంగా నిలదొక్కుకుంటారు. అతని మనుమలైన రాజేశం, శ్రీరాం, రమేష్, సురేష్ లు ప్రపంచాన్ని మరింత విస్తృతంగా చూడటానికి డబ్బు సంపాదించుకోవడానికి దేశాన్ని వదిలి వెళ్లతారు.

నేత కార్మికులవి నిజంగా పరాధీన బతుకులు. బట్టలు నేసినా ఒంటినిండా బట్టలు కట్టుకోలేని స్థితి. ఒకే దుప్పటి కింద కుటుంబ సభ్యులందరూ పడుకునే దయనీయ పరిస్థితి. శంకరయ్య తల్లిది ఒక పట్టుచీర కట్టుకోవాలనే కోరిక తీర్చుకోలేని బతుకు ఆమెది. జీవితాంతం ఆమె ఆ కోరికతోనే ఉంటుంది. కాని ఎవ్వరూ ఆమె  కోరికను తీర్చలేకపోయారు. ఉద్యోగం చేస్తున్న శంకరయ్య కూడా ఆ పని చేయలేకపోయాడు. ఉద్యోగం చేస్తున్నంతమాత్రాన తాను ఆర్థికంగా గొప్పగా ఏమి మారలేదు. దుర్భరమైన ఆర్థిక స్థితి నుండి , ఓ తీరుగా బతికే స్థితికి ఎదిగాడు. బట్ట, పొట్టకు ఇబ్బంది లేకుండా బతుకుతున్నాడు. అయినా తన తల్లి కోరిన ఒక పట్టుచీర కొనివ్వలేకపోయాడు.

### 3.4.3. వస్తు విశ్లేషణ:

పద్మశాలీల బతుకు చిత్రాన్ని అద్భుతంగా చిత్రించిన నవల గువ్వలచెన్నా. సాలెల మగ్గాలు నేడు పట్టించుకునే నాధుడు లేక దయనీయమైన స్థితిలో మూలకు పడిఉన్న వైనం, చేనేత కార్మికుల

బతుకువెతలకు మెతుకు కరువై చితికిపోయిన బతుకులు చితిమంటలలో తెల్లారిపోతున్న వైనాన్ని నవలలో చూపించిన తీరు పాఠకులను ఆలోచింపజేస్తుంది. గ్లోబలైజేషన్ పేరుతో పల్లెటూళ్లలోకి వచ్చే ఫ్యాషన్ డిజైనింగులు పేద బతుకులను ఎలా కడతేర్చుతున్నదో చక్కగా తెలియజేశాడు. రోజుకో రకమైన ఫ్యాషన్ దుస్తులు మార్కెట్ లోకి ప్రవేశించినప్పుడు వాటిని అందుకోలేని దౌర్భాగ్యంతో చేనేత కార్మికులు అప్పులపాలై అసువులు బాయడం మనసున్న వారిని కంటతడి పెట్టించక మానదు. అగ్గి పెట్టెల్లో పట్టే చీరలు నేసి విదేశాలకు సైతం పంపించగల నైపుణ్యం గల వీరు ప్రపంచీకరణ భూతానికి కనుమరుగై పోతుండటం ఈ నవలలో చూస్తాం.

పద్మశాలీలు శ్రమజీవులు. వీరు బట్టలు తయారుచేసే పనితోపాటు ఇతర పనులు కూడా చేసి బతుకుతున్నారు. జగిత్యాల నుండి నిజామాబాద్ వరకు గల ప్రాంతాలలో చాలామంది సాలెలు బీడీ పరిశ్రమలో పనిచేస్తూ దానిని వారి వృత్తిగా చేసుకొని బతుకుతున్నారు. ఇందులో స్త్రీలే ఎక్కువగా పనిచేస్తున్నారు. ఇంటి పనులు చేసుకుంటూ వాళ్లు ఈ పని చేస్తుంటారు. ఇంట్లో బీడీలు చేస్తూ తమ పిల్లలను చదివించుకుంటున్నారు. కరీంనగర్, కొత్తపల్లి ప్రాంతాలలోని బీడీ పరిశ్రమలో చాలామంది పనిచేస్తున్నారు. ఇంట్లో బీడీలు చేస్తూ కుటుంబ ఆదాయం పెంచడానికి కృషి చేస్తుంటారు. ప్రపంచీకరణ ప్రభావం వలన కొత్త రకాల ఫ్యాషన్ డిజైనులు రావడం వల్ల వీరు ఆర్థికంగా వెనుకబడుతున్నారు. అందువల్లనే మరో రకమైన ఆదాయం కొరకు వీరు ప్రయత్నాలు చేస్తున్నారు. నేత బట్టల స్థానంలో ఫ్యాషన్ రంగం ముందుకు రావడం వల్ల పద్మశాలీల జీవనం కొంతవరకు వెనుకబడింది. కొంతమంది ఫ్యాషన్ బట్టలు అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్నారు.

### 3.4.4. చేనేత కార్మికుల జీవిత చిత్రణ:

పద్మశాలీల ఇండ్లలో దారాలు, నూలు, లడీలు, కండెలు, రాట్నం లాంటి వస్తువులు ఉంటాయి. చేనేత కార్మికులు ధోతులు, చీరలు, దుప్పట్లు నేస్తారు. అన్ని రకాల బట్టలు తయారుచేసిన వారింట్లో కప్పుకోవడానికి దుప్పట్లు కూడా ఉండని ఆర్థిక పరిస్థితి వారిది. చేనేత కార్మికులు దొరల, భూస్వాముల దగ్గర వినయవిధేయతలతో ఉంటారు. వారు చెప్పినట్లుగా బట్టలు నేసిస్తారు. వాళ్లు అడిగిన ధరకే ఇస్తారు. అయినా దొరలు అహంకారంతో వారిని దూషిస్తారు. అలాంటి అవమానాలు పడుతూ కూడా వారు పేదరికాన్ని అనుభవిస్తూ వృత్తిని కొనసాగిస్తున్నారు. రాట్నం వడుకుతూ బట్టలు నేస్తారు. క్రమక్రమంగా చేనేత కార్మికుల నేత పనులు కొంత దెబ్బతింటున్నాయి. ప్రపంచీకరణ నేపథ్యంలో ఫ్యాషన్ డిజైనుల మిల్లులు రావడంవలన వారి ప్రాధాన్యత తగ్గింది. మిల్లు బట్టలు వచ్చిన తరువాత కొంతమంది లాభపడినా, చాలామంది ఉపాధి

కోల్పోయారు. పదిమంది చేసే పనిని ఓ యంత్రం చేస్తుంది. నూలు దొరకని దుర్భర పరిస్థితి ఏర్పడగా, పెట్టుబడులు లేక పద్మశాలీలు కూలీ నేతగాళ్లగా మారారు. రైతు తన భూమిలో తానే పాలేరు అయినట్టే నేత కార్మికులు కూలీ నేతగాళ్ళు అవుతున్నారు. స్వయంగా బట్టలు నేసుకుంటూ బతికే మగ్గం యజమాని కూలీగా మారాడు. కొన్ని సహకార సంఘాలు ఏర్పడినా, కొంచెం చదువుకున్నవాళ్లు, తెలివైన వాళ్ళు కొత్త కొత్త తెల్ల బట్టల వాళ్లు స్వల్పంగా లాభపడ్డారు. ఆప్కో సంస్థలు, ఇతర సంస్థల వల్ల కూడా కొందరు లాభపడ్డారు. పట్టణాల్లోకి మరమగ్గాలు వచ్చాయి. సిరిసిల్ల లాంటి ప్రాంతంలో మరమగ్గాలతో చాలామంది అభివృద్ధి చెందారు. నేతవృత్తి మాత్రం మూలకు పడినట్టనిపిస్తుంది. సాంచాల పనితో పైకొచ్చినట్లనిపించినా, వాటిమీద కూలీలు పద్మశాలీలే. అందులో నుండి వెళ్లే దుమ్ము, ధూళి, మట్టల మసి గోంతులోకి పోయి చాలామంది క్షయ వ్యాధికి గురై దుర్మరణం పాలవుతున్నారు. ఈ మధ్యకాలంలో దేశం విడిచి మస్కట్, భీవండి లాంటి దేశాలకు వలస వెళ్ళే వారిలో పద్మశాలీలు కూడా ఉంటున్నారు.

పద్మశాలీలపై ఆధారపడి బతికే ఉపకులం సాధనాశూరులు. వాళ్ళు జానపద కళాకారులు. ఊళ్లో ఉన్నన్ని రోజులు వాళ్ళ పోషణ భారం పద్మశాలీలదే. సాధనాశూరులు ఊళ్లోకొస్తే సాలెలకు పండుగలాగే ఉంటుంది. కులాలు అంతరించే క్రమంలో కులాలపై ఆధారపడి బతుకుతున్న ఉపకులాల మనుగడ ప్రశ్నార్థకమవుతుంది. చిప్పమల్లయ్య తరానికి చెందినవారు వారికి తోచినంత సహాయంచేసి ఆదుకునేవారు. ఊరిలో నేడు సాధనాశూరుల విద్యలు కనుమరుగైపోయాయి. చొప్పబండ్ల పల్లకిపై నిల్చోవడం, మనిషిని మాయం చేయడం వంటి అద్భుతమైన కళారూపాలు అంతరించిపోవడం మరొక విషాదకర విషయం. కబీర్, గురునానక్ లాంటివారు పద్మశాలీ వంశానికి చెందినవాళ్లని చెప్తారు. ఒకప్పుడు ఎంతో ఉన్నతంగా ఉన్న పద్మశాలీలు చేతివృత్తులు కోల్పోయిన తరువాత పరిస్థితి దిగజారింది. రైలు మార్గాలు వచ్చి సాలెల వృత్తిని దెబ్బతీశాయి. 'సాలె సంకుటం గోచితిరుకుటం' అన్న అవమానాల నుండి జీవితాన్ని గెల్చుకొని, స్థిరపడి, అగ్రవర్ణాల వారికి ధీటుగా విదేశాలకు సైతం తమ పిల్లలను పంపించే స్థాయికి ఉదాహరణగా శంకరయ్య కుటుంబాన్ని చెప్పుకోవచ్చు. అమెరికాకు కొడకులను పంపించడమంటే పద్మశాలీలు జీవితాలను గెల్చుకుంటున్నారని చెప్పడమే. పద్మశాలీలకు ఇష్టమైన పండుగ వినాయక చవితి. ఆరోజు తమ సాధనాలను చెరువులో కడిగి బొట్టుపెట్టి తమ ఇష్టదైవాన్ని కొలుస్తుంటారు. తమ పనిముట్లు బాగుండాలని పని బాగా దొరకాలని దేవుణ్ని ప్రార్థిస్తారు.

నిజాంకు బట్టలు నేసి ఇచ్చిన ఘనత పద్మశాలీలది. అగ్గిపెట్టెలో పెట్టగలిగే చీరలు నేసిన గొప్పతనం పద్మశాలీలకుంది. ఈ ఘనతకు మెచ్చి భూములు ఇనాంగా ఇచ్చేవాడట నిజాంగారు. అలాంటి నేతన్నలు నేడు ఆత్మహత్యలు చేసుకోవడం విషాదం. ఒక కులంలో పుట్టినవారు కులవృత్తి చేసుకొని బతికే పరిస్థితి లేకపోవడం విచారకరం. కొందరు వ్యవసాయం, కొందరు వ్యాపారం, కొందరు ఉద్యోగం చేస్తూ బతుకుతున్నారు. మగ్గం గుంటలు మూలకు పడుతున్నాయి. షరి గుంజలు పుచ్చుపట్టినవి. మగ్గాలు పోయి సాంచాలు వచ్చినవి. బతుకుదెరువు కోసం రకరకాల మార్గాలు వెతుక్కుంటున్నారు. జగిత్యాల, సిరిసిల్ల ప్రాంతాల్లో చాలామంది పద్మశాలీలు బీడీలు చేసుకుంటూ బతుకుతున్నారు. కుండలు పోయి ప్లాస్టిక్ వస్తువులు వచ్చినట్టు నేత బట్టల స్థానంలో ఫ్యాషన్ రంగం ముందుకొచ్చింది. ఫ్యాషన్ బట్టలు అమ్ముకుంటూ కొంతమంది జీవనం సాగిస్తున్నారు. కొంతమంది చదువుకున్నోళ్లు ఉద్యోగాలు చేస్తున్నారు. మరికొంత మంది ఆర్.యం.పి, పి.యం.పి వైద్యులుగా స్థిరపడుతున్నారు. ఊళ్లలో వృత్తిపనులు నశిస్తున్నాయి అని అర్థం చేసుకోవచ్చు.

### 3.4.5. వలసలు:

చేతివృత్తులను నమ్ముకొని దీనస్థితికి దిగజారుతున్న ఉదంతాన్ని గువ్వల చెన్నా నవలలో రాజమల్లు పాత్ర ద్వారా తెలియజేశాడు. రాజమల్లు తమ తల్లిదండ్రుల ఆర్థిక పరిస్థితి కుదుటపడకపోవడం వల్ల తమ జీవన విధానంలో మార్పు కోరి వలస వెళ్ళాలనుకుంటాడు. తల్లిదండ్రులు, భార్య ఎంత చెప్పినా వినకుండా తమ వృత్తితో ఉపయోగంలేదని భీవండి వలస వెళ్లి సంపాదించుకొని రావాలనుకుంటాడు. చివరకు తల్లిదండ్రులను ఒప్పించి భీవండికి వలస వెళతాడు. రాజమల్లు భీవండికి వెళ్లిన ఆరు నెలల తరువాత మతకలహాలు ప్రారంభమవుతాయి. మతకలహాల్లో రాజమల్లు కత్తిపోట్లకు గురయ్యి అక్కడే ప్రాణాలను కోల్పోతాడు. బతకుదెరువు కొరకు వెళ్లిన రాజమల్లు జీవితం అర్థాంతరంగా ముగుస్తుంది.

పారిశ్రామిక ప్రగతి వల్ల సిరిసిల్ల నుండి జగిత్యాల నుండి మహారాష్ట్రకు పద్మశాలీలు వలసపోతున్నారు. పెద్దపల్లి నుండి కూడా ఎక్కువ సంఖ్యలో వలస వెళ్లుతున్నారు. పద్మశాలీలు తమ వృత్తి పతనంతో కలకాలంగా బతుకుతున్న వృత్తి పనిని వదిలి దేశాన్ని విడిచి మస్కట్ దేశానికి వలస పోతున్నారు. ఊర్లలో వృత్తి పనులు నశించిపోవడంవల్ల వలసలు వెళుతున్నారు. పద్మశాలీలు పోచంపల్లి, గద్వాల, వనపర్తి లాంటి ప్రదేశాల్లో అద్భుతమైన పట్టు చీరలు నేసేవారు. మెట్టుపల్లి ఖాదీ భండార్, వావిరాల ఖాదీ బండారులు ఎంతో ప్రసిద్ధి చెందినవి. కొంతమంది కరీంనగర్,

నిజామాబాదుల నుండి నాందేడ్, ఔరంగబాదుకు వలస వెళ్లి బతుకుతున్నారు. పారిశ్రామికీకరణ పేరుమీద నాగరికత పెరిగిపోతుంటే ఊర్ల నుండి పట్టణాలకు వలస వెళ్లే వారి సంఖ్య కూడా పెరుగుతుంది.

### 3.4.6. ముగింపు:

ఒకప్పుడు ఎంతో ఉన్నతంగా ఉన్న పద్మశాలీలు చేతివృత్తులు కోల్పోయిన తరువాత వారి పరిస్థితి దిగజారింది. వృత్తి పతనంలో చాలామంది వలసలు వెళుతున్నారు. ఊళ్లలో వృత్తి పనులు నశిస్తున్నాయి. పారిశ్రామీకకరణ ప్రభావం వల్ల చేనేత కార్మికులు కులవృత్తి చేసుకొని బతికే పరిస్థితి లేకపోవడం విచారకరం. సామాజిక అవసరాలు తీరడానికి అన్ని వృత్తులు అవసరమే. అన్ని వృత్తులు సమానమే. పెద్ద కులం, చిన్న కులం అన్న భావనలు ఉండకూడదు. ఉత్పత్తి శక్తులకు, ఉత్పత్తి కులాలకు గౌరవం, విలువ ఉంటే కుల వ్యత్యాసాలు తొలగిపోతాయి. పని సంస్కృతికి గౌరవాన్ని పెంచాలి. పద్మశాలీల కొరకు ఈ మధ్యకాలంలో కృషి చేసినవారు ఉన్నారు. సోమయ్యగారు చేనేత సహకార ఉద్యమానికి బలానిచ్చారు. కొందరు ఆర్థికంగా, చదువుల్లో బాగా ఎదిగినా, ఎదుగుతున్నా, రాజకీయంగా మాత్రం అంతగా ఎదుగలేదు. కులవృత్తుల మనుగడకు ఇంకా కృషి జరగాలి. సామాజికంగా రాజకీయంగా ఎదగడానికి ఆ దిశగా ఇంకా ప్రయత్నాలు జరగాలని కాలువ మల్లయ్య గారు 'గువ్వల చెన్నా' నవలలో తెలియచేశారు.

## 3.5. కార్మిక నవల:

పారిశ్రామిక రంగం ద్వారా మనదేశంలో లక్షలాది మందికి ఉపాధి దొరుకుతుంది. అందులో పనిచేసే కార్మికులు తమ హక్కుల కొరకు పోరాటాలు చేసి వాటిని సాధించుకుంటున్నారు. కార్మికుల యొక్క జీవితాలను గురించి కాలువ మల్లయ్య 'మెతుకు పుస్తకం' నవలలో తెలియజేశాడు. ఈ నవలలో వస్తువును తెలియజేసి వస్తువును విశ్లేషణ చేశాను.

### 3.5.1. మెతుకు పుస్తకం నవల:

ఈ నవలను 2017వ సంవత్సరంలో బి.వి.వి. ప్రచురణలు, హైదరాబాద్ వారు ప్రచురించారు. ఇది ఒక ఫెర్టిలైజర్ ఫ్యాక్టరీలో పనిచేసే కార్మికుల కథ. ఫెర్టిలైజర్ సిటీలో పనిచేసే కార్మికులకు అన్నం పెట్టిన మెతుకు పుస్తకం కథ ఇది. మెతుకు పుస్తకంగా ఉండాల్సిన ఫెర్టిలైజర్ సిటీ 'మాయమవుతున్న పట్నం'గా మారుతున్న కథ ఇందులో ఉంది. కరీంనగర్ జిల్లా రామగుండంలో 'ఫెర్టిలైజర్ కార్పోరేషన్ ఆఫ్ ఇండియా' కేంద్ర ప్రభుత్వ సంస్థను 1971లో స్థాపించారు. అందులో పనిచేసే కార్మికుల యొక్క ఆలోచనలు, వారి ఉపన్యాసాలు, యూనియన్

ఎన్నికలు, పరిశ్రమల మూసివేత, సింగరేణి, NTPC కాలనీలలో ఉండే కహానీలు, తెలంగాణ పండుగలను ఈ నవలలో చిత్రించారు.

కాలువ మల్లయ్యగారు టీచరుగా పనిచేసి కొంత కాలం తరువాత ఉద్యోగం వదిలిపెట్టి ఫెర్టిలైజర్ కంపెనీలో ఒక కార్మికుడిగా 1976లో ల్యాబ్ ఆపరేటర్ ఉద్యోగంలో చేరాడు. “2002 డిసెంబర్ 31వ తేదీన బలవంతపు వాలంటరీ రిటైర్మెంట్ తీసుకొని 2003 జనవరి నుండి 2003 మే వరకు ఫెర్టిలైజర్ సిటీలో ఉన్న సమయంలో రాసిన నవల ఇది. రోజుకు కొన్ని ఇండ్లు ఖాళీ అవుతుంటే చూస్తూ, షాపింగ్ సెంటర్, బ్యాంకు దగ్గర జరిగే చర్చలు, ఏడ్పులు, సాగతోలడాలు చూస్తూ దుఃఖమాగక కొన్నిసార్లు అక్కడే, ప్రతిరోజు ఇంటికొచ్చి నా గదిలో గొడ గొడా ఏడుస్తూ ఆ కన్నీటి సిరాతో రాసిన నవల ఇది” అని ఈ నవల కృతజ్ఞతలలో కాలువ మల్లయ్య తెలియజేశాడు.

### 3.5.2. నవలా వస్తువు:

కాలువ మల్లయ్య ‘ఫెర్టిలైజర్ కార్పోరేషన్ ఆఫ్ ఇండియా’ కంపెనీలో 27 సంవత్సరాలు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగిగా పనిచేసాడు. తాను ఆ కంపెనీలో ఉన్నప్పుడు కార్మిక వర్గంతో ఉన్న పరిచయాలను, ఫ్యాక్టరీ చుట్టు ప్రక్కల జరుగుతున్న అభివృద్ధి గురించి ఈ నవలలో చిత్రించాడు. తెలంగాణలో బొగ్గు వనరులున్న రామగుండంలో 1971లో ఫెర్టిలైజర్ కార్పోరేషన్ ఆఫ్ ఇండియా ఫ్యాక్టరీ స్థాపించబడింది. ఇది బొగ్గు నుండి ఎరువును ఉత్పత్తి చేసే కర్మాగారం. నల్ల బంగారమైన బొగ్గు నుండి తెల్ల ముత్యాల్లాంటి ఎరువును ఉత్పత్తి చేస్తుంది. ఈ కర్మాగారంలో రెండు వేల మంది ఉద్యోగులుగా మరో రెండు వేల మంది కాంట్రాక్టు వర్కర్లుగా పనిచేస్తున్నారు. రోజురోజుకు నల్లబంగారం ప్రాముఖ్యత పెరుగుతుంది. గని కార్మికులుగా ఇంకా చేరుతూనే ఉన్నారు. రోజూ వేలాది టన్నుల బొగ్గును తోడుతున్నారు. నేలను బొయ్యరంలా మారుస్తున్నారు. టన్నుల కొద్ది బొగ్గు ఏదో ఒక రూపంగా మండిపోతుంది. ఆ బొగ్గు మండటం వల్ల కార్బన్ డై ఆక్సైడ్, కార్బన్ మోనాక్సైడ్లు వాతావరణంలో కలిసిపోతున్నాయి. అయినా ఎఫ్.సి.ఐ. చుట్టూ పెద్ద పెద్ద బిల్డింగులతో అందమైన రోడ్లతో, పార్కులతో, షాపింగ్ సెంటర్లు, రిక్రియేషన్ క్లబ్బులతో అందమైన టౌన్షిప్ ఏర్పడింది. ఫ్యాక్టరీ చుట్టుప్రక్కల వ్యాపారం అభివృద్ధి చెందింది. దాదాపు 30 సంవత్సరాలు పనిచేసిన కర్మాగారం మూతపడింది. ఉద్యోగ భద్రతలేని ప్రైవేట్ వ్యవస్థలను ప్రోత్సహించడం, నిత్యం ఒత్తిడి, కొత్త కొత్త ఆర్థిక విధానాలు, సంక్షేమాన్ని తుంగలో తొక్కడం లాంటి కారణాల వల్ల ఫ్యాక్టరీ మూసివేయబడింది.

దివాకర్ రెడ్డి ఫ్యాక్టరీలో 30 సంవత్సరాలు ఉద్యోగ జీవితం గడిపాడు. మంచి జీతం, ఇల్లు, రోడ్లు, మిత్రులు, బంధువులు అన్ని రకాల సౌకర్యాలతో ఉండేవాడు. ఫ్యాక్టరీలో గడిచిన జీవితాన్ని గురించి తన కొడుకైన శ్రీనివాస్ కి తన తోటి ఉద్యోగ మిత్రులైన సారయ్య, అరుణ్ కుమార్, కొంరెల్లి, బిక్షమయ్య యొక్క బతుకు చిత్రాన్ని తెలియజేశాడు. వారందరూ కర్మాగారంలో చేరి వారి జీవితానుభవాలను ఎలా పంచుకున్నారో తెలియజేశాడు.

దివాకర్ రెడ్డి సింద్రీలోని ఎరువుల పరిశ్రమలో కొంత కాలం పనిచేసిన తరువాత రామగుండంలోని ఉన్న పరిశ్రమకి బదిలీపై వచ్చాడు. అతడు అకౌంట్స్ డిపార్ట్ మెంటులో ఉద్యోగంలో చేరాడు. అదే విధంగా కరీంనగర్ కు ముప్పై కిలోమీటర్ల దూరంలో ఉన్న తేలుకుంట గ్రామం నుండి సారయ్య ఎరువుల కంపెనీలో ఉద్యోగం సంపాదించుకున్నాడు. సారయ్యది తరతరాలుగా భూమిని నమ్ముకొని బతికిన కుటుంబం. సారయ్య ప్రభుత్వ ఉద్యోగంలో చేరి కుటుంబాన్ని ఆదుకోవాలనుకుంటాడు. తాను ఉద్యోగం చేస్తే తన కుటుంబ పరిస్థితులు మారే అవకాశాలున్నాయని భావించి మంచి జీతంతో అన్ని సౌకర్యాలు ఉండే ఫెర్టిలైజర్ కంపెనీలో చేరతాడు. పుట్టెడు పనిచేసి డొక్కలు నింపుకోవడానికి మరొక గ్రామం నుండి కొంరెల్లి మెకానికల్ టెక్నిషియన్ గా కర్మాగారంలో చేరుతాడు. అదే విధంగా అరుణ్ కుమార్ మంచి వక్త, రచయిత. తను ల్యాబ్ ఆపరేటరుగా ఉద్యోగంలో చేరుతాడు. పేద దళిత కుటుంబం నుండి భిక్షమయ్య క్రాఫ్ట్ మన్ ట్రైయినీగా ఉద్యోగంలో చేరుతాడు. ఆ తరువాత కాలంలో కార్మికులను చైతన్యపరిచి కార్మిక నాయకుడు అవుతాడు. భిక్షపతి ట్రేడ్ యూనియన్ స్థాపించి కార్మిక హక్కుల కొరకు పోరాడాడు. సమావేశాలు, బహిరంగ సభలు పెట్టి అందరికి పని విభజన చేసాడు. వీరందరూ ఉద్యోగరీత్యా ఎవరి పనుల్లో వారు బిజీగా ఉన్నారు. కొంత కాలం తరువాత వీరంతా గోదావరిఖనిలో కలుసుకొని ఈ ఫ్యాక్టరీ వచ్చిన తరువాత ఈ ప్రాంతానికే కళ వచ్చిందని మన జిల్లాలో అయిన బయట జిల్లాలో అయినా ఇక్కడ పనిచేయడం గౌరవంగా భావిస్తున్నామని అనుకుంటారు. వీరంతా గోదావరిఖని వీధుల్లో తిరుగుతూ ఫ్యాక్టరీ చుట్టుప్రక్కల కాలనీలు అభివృద్ధి చెందాయని, టౌన్ షిప్ అభివృద్ధి చెందిందని, పండుగల సమయంలో వ్యాపారం ఇక్కడ కళకళలాడుతుందని చర్చించుకుంటారు.

గోదావరిఖని పారిశ్రామిక నగరంగా ఏర్పడుతుంది. కర్మాగారం చుట్టుప్రక్కల గ్రామాల నుండి కొందరు వచ్చి పాలు, పెరుగు, కూరగాయలు తెచ్చి అమ్మేవారు. కొందరు చిన్న చిన్న దుకాణాలు పెట్టుకునేవారు. వేలాదిమందికి ఉపాధి దొరుకుతుంటే గోదావరిఖని లక్ష్మీనగర్ వీధి

వ్యాపార కార్యకలాపాలతో కళకళలాడేది. ఇక్కడ అన్ని రకాల బట్టల దుకాణాలు ఉండేవి. అలాగే బంగారు షాపుల వారికి గిరాకీ ఉండేది. ఎఫ్.సి.ఐ లో ఉత్పత్తి ప్రారంభమైన తరువాత ఆ పారిశ్రామిక ప్రాంతం అంతా అభివృద్ధి చెందింది. కొత్త కొత్త బొగ్గు గనులు రావడంతో కార్మికులుగా చేరేవారి సంఖ్య పెరిగింది. గోదావరిఖనిలో వ్యాపారం జోరు మరింత పెరిగింది. అందరి దృష్టి వ్యాపారం వైపు మళ్లింది. సంగం కిష్టయ్య, వెంకటేశం తలలపై బట్టల మూటలు పెట్టుకొని వచ్చారు. ఇంటింటికి తిరిగి అమ్మేవారు. గోదావరిఖని స్వరూపస్వభావాలను అర్థం చేసుకొని బట్టలమ్మితే వచ్చిన డబ్బుతో భూములు కొన్నారు. అలాగే తమ వ్యాపారాన్ని అభివృద్ధి చేసుకొని బట్టల దుకాణాల యాజమానులు అయ్యారు. క్వార్టర్స్ అందరికి అందుబాటులో లేకపోవడంతో ప్రైవేట్ ఇళ్ల కిరాయిలు పెరిగాయి. ప్లాట్ల వ్యాపారం అభివృద్ధి చెందింది. చిన్న చిన్న దుకాణాలతో వ్యాపారాలు ప్రారంభమయ్యాయి. ఈ ప్రాంతంలో ఫర్నీచర్ షాపులు తెరిచారు. కూరగాయల మార్కెట్, మాంసం, చేపల అమ్మకం, బీరు బ్రాందీ షాపులు, టెంట్ హౌసుల నాగరికత పెరిగింది. జనాభా పెరగడంతో, పరిశ్రమ అభివృద్ధి చెందడంతో షేర్ల వ్యాపారం బలం పుంజుకుంది. షేర్లు అంటే తెలియనివారు కూడా షేర్ మార్కెట్ లో పెట్టుబడులు పెడుతున్నారు. బ్రోకర్ల సంఖ్య పెరిగింది. పారిశ్రామిక ప్రాంతమంతా ప్రౌఢ గంభీరంగా మారింది. గోదావరిఖనిలో ప్రైవేట్ పాఠశాలలు, జూనియర్ కళాశాలల జోరు పెరిగింది. రోజురోజుకు వాటి సంఖ్య పెరుగుతూనే ఉంది. పారిశ్రామిక ప్రాంతంలో ఫైనాన్సుల వ్యాపారము పెరిగింది. వీటన్నిటితోపాటు వస్తు వినిమయ సంస్కృతి ప్రభావం ఆ ప్రాంతంలో ఉంది. చేతిలో డబ్బులు ఉండటంతో ప్రలోభాల మాయలో వస్తువులు కొనుకుంటున్నారు. కేబుల్ టి.వి. వస్తు వినిమయ సంస్కృతి మోజు, సుఖ సంతోషాలతో మాకేం పర్వాలేదు అంటూ ఎఫ్.సి.ఐ కార్మికులు ఉన్నారు.

'మే'డే కార్మికులకు పండుగ దినం. కార్మికులు నిరంతర పోరాటాలు చేసి హక్కులు సాధించుకున్న దినం. ఎఫ్.సి.ఐ లో మేడే ఉత్సవాలు జోరుగానే చేశారు. ఎఫ్.సి.ఐ ఉత్పత్తితో మంచి లాభాలతో ఉన్న సమయం అది. కార్మికులంతా మంచి జీతాలతో, విపరీతమైన ఓవర్ టైంతో బాగా సంపాదించుకుంటున్న కాలం అది. కార్మికులు, ఆఫీసర్లు మేడే సంబరాల్లో పాల్గొన్నారు. భిక్షపతి లాంటి వ్యక్తి కార్మిక నాయకుడు అయ్యాడు. సమాజానికి సేవ చేయాలనే దృక్పథం ఉన్న వ్యక్తి. ఎన్నో పరిశ్రమలకు కారణభూతమైన బొగ్గు గని కార్మికుల బతుకులలోని చీకటిని చూశాడు. వారి హృదయాల్లో పరకాయ ప్రవేశం చేశాడు. స్పష్టమైన దృక్పథంతో యూనియన్ స్థాపించాడు. అతను కార్మికుల చైతన్య స్థాయిని పెంచడానికి అన్ని విధాల కృషి చేశాడు. చైతన్యవంతమైన కార్మిక

వర్గాన్ని తయారుచేశాడు. తాను పార్లమెంట్ మెంబర్ గా పోటీ చేయగలిగే స్థాయికి ఎదిగాడు. అతని కృషి వల్ల పారిశ్రామిక ప్రాంతంలో ఉత్పత్తికి మూలకారకుడైన కార్మికుడిదే పైచేయి అనే వాతావరణం ఏర్పడింది. నూతన పారిశ్రామిక విధానం అమల్లోకి వచ్చింది. రామగుండంతోపాటు అనేక ఎరువుల కంపెనీలు మూతపడ్డాయి. లక్షల టన్నుల యూరియా ఉత్పత్తి చేస్తున్న నష్టాలు వస్తున్నాయన్న లెక్కలు కార్మికులను అయోమయానికి గురిచేశాయి. ఆ తరువాత కొంత కాలం పాటు కార్మిక సంఘాలు కొట్లాడినా ఫలితం లేకుండా పోయింది. వేలాది కుటుంబాలకు మెతుకు పుస్తకంగా ఉన్న ఫెర్టిలైజర్ సిటీ పారిశ్రామిక పట్నం, దాని చుట్టు ఉన్న కాలనీలు 2003 సంవత్సరం చివరి నాటికి బోసిపోయినట్టు తయారయ్యాయి. అందరూ ఖాళీ చేస్తే ఆ పట్నం మాయమవుతున్న పట్నంగా మారింది. వేలాది కుటుంబాలు క్రమక్రమంగా మాయమయ్యాయి. బలవంతంగా వి.ఆర్.ఎస్ ఇచ్చి పంపబడిన ఉద్యోగుల్లో కొంతమంది ఆ పరిస్థితిని తట్టుకోలేక గుండెపోటుతో మరణించారు. మరికొందరు బతుకు పోరాటం సాగిస్తున్నారు. అప్పటికే పిల్లల చదువులు ముగిసి ఉద్యోగాలు లభించిన వాళ్లు కొందరు బాగానే స్థిరపడ్డారు. కాని చాలామంది జీవన సమరం సాగిస్తూనే ఉన్నారు. అటు పెన్షన్ లేక ఇటు ఉద్యోగం పోయి, మరోవైపు పిల్లల చదువులు కూడా ముగియని వారు కష్టాలు పడుతున్నారు. ఐదారు వేలు పెన్షన్ వచ్చిన బాగుండునని అలమటిస్తున్నారు. తమ దురదృష్టానికి తమను తామే నిందించుకుంటున్నారు.

ఇతర రాష్ట్రాలవారు తమ తమ రాష్ట్రాలకు వెళ్ళిపోయారు. కోస్తాంధ్ర, రాయలసీమ ప్రాంతం నుండి వచ్చినవారు చాలామంది హైదరాబాదులోను, తమ తమ జిల్లాల్లో స్థిరపడ్డారు. భిక్షపతి హైదరాబాదులో కార్మిక నాయకుడిగా ఉన్నాడు. హైదరాబాదులో ఎఫ్.సి.ఐకి చెందిన మాజీ ఉద్యోగులు రెండు వందలకు పై చిలుకు సంఖ్యలోనే స్థిరపడ్డారు. కరీంనగర్ జిల్లాలో దాదాపు రెండు వందల మంది బతుకుపోరాటం సాగిస్తున్నారు. అరుణ్ కుమార్ హైదరాబాదులో స్థిరపడి తనకున్న రచన అనుభవాన్ని ఉపయోగించుకొని రచనలు చేస్తూ జీవనం గడుపుతున్నాడు. కొంరెల్లి కరీంనగర్ లో స్థిరపడితే, సారయ్య తన ఊళ్ళో కుటుంబంతో వ్యవసాయం చూసుకుంటూ గడుపుతున్నాడు. దివాకర్ రెడ్డి కరీంనగర్ లో స్థిరపడ్డాడు. ఊరిలో ఉండే బాల్యమిత్రులను, పాత బంధువులను, ఊరివారిని కలువవచ్చని కరీంనగర్ లో స్థిరపడ్డాడు. రామగుండం ఎరువుల కర్మాగారాన్ని పునరుద్ధరించడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలపడంతో సారయ్య లాంటి మాజీ ఉద్యోగుల్లో ఆశలు చిగురించాయి. పాత ఉద్యోగుల్లో చాలామంది రిటైర్మెంట్ వయస్సు దాటినా తమ పిల్లలకైనా ఉద్యోగాలు దొరకవచ్చని, ఉద్యోగాలతో కొందరికైనా ఉపాధి అవకాశాలు

లభిస్తాయని ఆశపడుతున్నారు. మాయమవుతున్న పారిశ్రామిక కాలనీలు మెతుకు పుస్తకంగా మారాలన్న ఆశాభావంతో ఈ నవలకు 'మెతుకు పుస్తకం' అని పేరు పెట్టారు.

### 3.5.3. వస్తు విశ్లేషణ:

ఇది ఫెర్టిలైజర్ ఫ్యాక్టరీలో పనిచేసే కార్మికుల కథ. ఫెర్టిలైజర్ సిటీలో పనిచేసే కార్మికులకు అన్నం పెట్టిన మెతుకు పుస్తకం కథ ఇది. కాలువ మల్లయ్య గారు ఫెర్టిలైజర్ ఫ్యాక్టరీలో పనిచేయడం వల్ల కార్మిక వర్గంతో ఉన్న పరిచయాలను, ఫ్యాక్టరీ చుట్టు ప్రక్కల జరుగుతున్న అభివృద్ధి గురించి ఈ నవలలో చిత్రించాడు. కార్మికుల యొక్క స్థితిగతులు, కార్మిక యూనియన్ ఎన్నికలు, పరిశ్రమల మూసివేత, సింగరేణి, ఎన్టీపిసి కాలనీలో ఉండే వస్తు సంస్కృతి, తెలంగాణ పండుగలను గురించి తెలియజేశాడు.

### 3.5.4. పారిశ్రామిక ప్రాంతం కార్మిక దినోత్సవం:

ఆసియా ఖండంలోనే అతి పెద్ద బొగ్గు ఆధారిత ఎరువుల పరిశ్రమ ఫెర్టిలైజర్ కార్పోరేషన్ ఆఫ్ ఇండియా కర్మాగారం. అక్కడ ఆధునిక సౌకర్యాలు కలిగిన టౌన్ షిప్ ఏర్పడింది. అందుకే ఆనాడు దానిలో ఉద్యోగం దొరకడం అదృష్టంగా అందరూ భావించేవారు. ఆ భారీ పరిశ్రమలో విశాలమైన రోడ్లు, పార్కులు, రంగు రంగుల లైట్లు చూడటం కోసమే సందర్శకులు వచ్చేవారు. ఊరును వదిలిపెట్టి పట్నాల్లో ఉద్యోగం చేయడమే అభివృద్ధి కాదని, ఎంత కాలానికైనా ఊరికి రావాల్సిందే. ఊరు తల్లి ఒడి లాంటిది. తల్లి ఒడి కంటే సురక్షితమైన స్థలమే లేదు. ఎవరు ఆదుకున్నా ఆదుకోకపోయినా తల్లి లాంటి ఊరు ఆదుకుంటుందని రచయిత చెప్పిన మాటలు ఎంత కఠోర నిజమో ఉపాధి కోల్పోయిన కార్మికులందరికి అనుభవ సత్యం. అందుకే ఊరిలో సంబంధాలను సజీవంగా ఉంచుకుంటూనే ఎదగాలి. చదువు ద్వారా ఎంత ఎదిగినా కన్నతల్లి లాంటి ఊరితో సంబంధాలు తెంచుకోవద్దు.

అభివృద్ధి ఏదైనా మానవజాతి మనుగడకు తోడ్పడాలి. ప్రకృతిని కాపాడాలి. అలా కాని పారిశ్రామిక విధానం ఏదైనా విధ్వంసం అవుతుంది తప్ప మరొకటి కాదు. బొగ్గు ఆధారిత ఎరువుల పరిశ్రమను స్థాపించడం దాని ద్వారా ప్రయోగం సత్ఫలితాలను ఇవ్వడం లేదని పరిశ్రమను మూసివేయడం ప్రభుత్వ వైఫల్యంగా చెప్పవచ్చు. దీని వలన ప్రకృతికి నష్టం జరిగింది. పరిశ్రమలు మూయబడి పదుల సంవత్సరాలు గడవడంతో యంత్రాలు తుప్పుపట్టాయి. బిల్డింగులు, రోడ్లు పాడుబడి కూలిపోయాయి. టౌన్ షిప్ అడవులను, ఎడారులను తలపిస్తున్నాయి. కోట్లాది ప్రజల ఆస్తి, దేశ సంపద మట్టిపాలు అయ్యింది. అయినా మన పాలకులకు చీమ కుట్టినట్లు ఉండదు. ఆ

పరిశ్రమలో ఎటూ కాని వయస్సులో ఉద్యోగాలు కోల్పోవడం వలన వారి బతుకులు ఛిద్రమయ్యాయి. యూజ్ అండ్ థ్రో సంస్కృతి ప్రపంచమంతటా వ్యాపించింది. అందులో భాగంగా ఊళ్లకూళ్లు మాయం కావడం, కర్మాగారాలు మూత పడటం జరుగుతున్నాయి.

పారిశ్రామిక ప్రాంతమంతా కార్మిక దినోత్సవం జరుపుకుంటుంది. మేడే కార్మికులందరికి పండుగ. కార్మిక వాడల నిండా ఎర్రజెండాల రెపరెపలు, ఊరేగింపులు, మేడే ఉత్సవాలు కార్మికుల్లో నూతనోత్సాహాన్ని నింపాయి. గోదావరిఖని పారిశ్రామిక ప్రాంతంలోని అన్ని కర్మాగారాల్లోను మేడే సెలవు దినమే. ఇప్పుడు దుకాణాల్లో పనిచేసే కూలీలకు కూడా సెలవు ఇస్తున్నారు. ఇవన్నీ భిక్షపతి లాంటి నాయకుల ప్రయత్నం వల్లే జరిగింది. మేడే ప్రాముఖ్యాన్ని, దాన్ని పండుగ కంటే ఎక్కువగా జరుపుకోవాల్సిన అవసరాన్ని వివరించాడు భిక్షపతి. పని గంటలు తగ్గింపు కోసం చికాగోలో కార్మికులు చిందించిన రక్తం నుండే మేడే పుట్టిందని, అది ప్రపంచ కార్మికులందరికి పండుగ దినమైందని తెలిపాడు. కొందరు కార్మికులు చేసిన వీరోచిత పోరాటాల ఫలితమే పని గంటల తగ్గింపు వాళ్లు అమరులై భవిష్యత్ తరాలకు ఉపయోగపడ్డారు. స్పార్టకస్ తమ జాతి విముక్తి కోసం పోరాడాడు. నెల్సన్ మండేలా పోరాటాలు, దక్షిణాఫ్రికాలో జరుగుతున్న పోరాటాలు మనందరిని ఉత్తేజానిచ్చేవి. కార్మిక వర్గమే మిగతా వర్గం కంటే చైతన్యవంతమైనది. ప్రపంచ పోరాటాలకు మార్గ దర్శకత్వం వహించేది కార్మికులే. కార్మికుల చేతుల్లోనే దేశ, ప్రపంచ భవిష్యత్తు ఉంది. స్వల్పంగా జీతాల పెంపు కోసం, ఇంక్రిమెంట్ల కోసం, ప్రమోషన్ల కోసం మన పోరాటాలను పరిమితం చేయకూడదు. మన పోరాటాలు చైతన్యవంతమైన కార్మిక వర్గాన్ని సృష్టించడానికి ఉపయోగపడాలి. ఈరోజు కార్మిక వర్గం పరిస్థితి బాగానే ఉంది. గత పోరాటాల స్ఫూర్తితో కార్మిక వర్గం తమ హక్కుల సాధన కోసం నిరంతరం పోరాడుతూనే ఉంది.

“మార్క్స సిద్ధాంతాల ప్రభావంతో ప్రపంచవ్యాప్తంగా మానవతా పరిమళం పరిఢవిల్లుతుంది. సహోదర తత్త్వం ప్రబలుతుంది. ప్రపంచ కార్మికులారా ఏకం కండి అనడంలో ఎంత విశాలత ఉంది... మనుషుల్లోని తేడాలను రూపుమాపే ఈ విధానం ప్రపంచ వ్యాప్తంగా పుంజుకుంటుంది. అందుకు వీరోచిత పోరాటాలే శరణ్యం... త్యాగాలే పరమావధి... ప్రపంచ వ్యాప్తంగా జనాలు కార్మిక వర్గాల దిక్కే చూస్తున్నారు... బొంబాయిలో దత్తా సామంత్ మిల్లు కార్మికుల గురించి పోరాటాలు చేస్తున్నాడు. లక్షలాది మంది బట్టల మిల్లుల కార్మికులకు నాయకత్వం వహిస్తున్నాడు. మధ్యప్రదేశ్ లో శంకర గుహ నియోగి చేస్తున్న పోరాటాలు పెట్టుబడిదారుల గుండెల్లో రైళ్లు పరిగెత్తేలా చేస్తున్నాయి. అతడు కార్మిక వర్గానికి పూజ్యనీయుడు.

మనం సత్యజిత్ రే సినిమాలను చూస్తున్నాం... అవి మన దేశాన్ని కించపరిచే విధంగా ఉన్నాయనే వాళ్ళున్నారు. పేదరికాన్ని గ్లామరైజ్డ్ చేసి చూపుతున్నాడని అనే వాళ్ళున్నారు... అవి వాస్తవికతకు దర్పణాలు... దేశ పరిస్థితులను మన కళ్ళముందుంచే సజీవ దృశ్యాలు... మనదేశం ఇలా ఉందని చెప్పడానికి సిగ్గుపడే బదులు అలా ఉండకుండా చూసుకోవడం మంచిది కదా...!" (మల్లయ్య, కాలువ.2017:పుట.74) అని భిక్షపతి మార్క్స్ సిద్ధాంతాలను ఒక సందర్భంలో కార్మికులతో అంటాడు. పైన చెప్పిన వాటికి పరిష్కారం పోరాటాలే అని అర్థం అవుతుంది. మనలాంటి వాళ్ళం పోరాడాలని సూచించాడు. నిరంతర పోరాటాలతో, రాజీలేని పోరాటాలతో మనం చాలా సాధించుకున్నాం. చాలావరకు ఫ్యాక్టరీలలో కార్మికులు తమ హక్కుల కొరకు పోరాడి సాధించుకున్నారు.

ఎఫ్.సి.ఐ లోను మేడే ఉత్సవాలు జరిపారు. ఉత్పత్తి పెరగడంతో లాభాలతో నడుస్తున్న కాలం అది. కార్మికులంతా మంచి జీతాలతో, విపరీతమైన ఓవర్ టైంతో పనిచేస్తూ సంపాదించు కుంటున్నారు. అన్ని పార్టీల అనుబంధ ట్రేడ్ యూనియన్లు స్థాపించబడి నిలదొక్కుకోవడానికి ప్రయత్నిస్తున్నాయి. వాటి మధ్య పోటీ విపరీతంగా ఉంది. అలాంటి సమయంలో మేడే ఉత్సవాల ఊరేగింపులో మాత్రం కొందరు నాయకులు తప్ప ఉద్యోగులేవరు పాల్గొనలేదు. కాంట్రాక్టు కార్మికులు ఈ సంబరాల్లో పాల్గొన్నారు. ఈ కార్మిక దినం సందర్భంగా మరెన్నో పోరాటాలు చేసి మరిన్ని హక్కులను సాధించుకోవాలని ప్రతిజ్ఞ చేశారు. పోరాటమే మనకు ఆయుధం అని మేడే స్ఫూర్తితో కార్మిక వర్గం ముందుకు సాగాలి.

### 3.5.5. వస్తు వినిమయ సంస్కృతి:

గోదావరిఖని పారిశ్రామిక ప్రాంతంలో ఎఫ్.సి.ఐ.లో ఉత్పత్తి పెరగడం, ఎన్టీపిసి పూర్తిస్థాయి ఉత్పత్తిని ఇవ్వడంతో సంపూర్ణతను సంతరించుకుంది. గోదావరిఖనిలో వ్యాపారం జోరు మరింత పెరిగింది. అందరి దృష్టి వ్యాపారం వైపు మళ్లింది. ఎఫ్.సి.ఐ., ఎన్టీపిసిలలో షేర్ల వ్యాపారానికి అంతే లేకుండా పోయింది. కార్మికులుగా పనిచేస్తున్నవారు తమకు తాము వైట్ కాలర్స్ ఉద్యోగమనుకుంటున్నారు. సంపాదన మీద మోజుతో ఉన్నారు. లక్షలాది రూపాయలు షేర్లలో పెట్టారు. ఉత్తర భారతదేశానికి చెందిన ఉద్యోగులు ఈ షేర్ల వ్యాపారాన్ని తెలుగు వారికి పరిచయం చేశారు. వాళ్లు ఇతరులకు అంటించారు. దాని బలం పుంజుకుంది. రోజూ బ్యాంకుల్లో లక్షలాది రూపాయలు డి.డి.లు కట్టి కోట్లు సంపాదించే ప్రయత్నంలో ఉన్నారు. పారిశ్రామిక ప్రాంతమంతా వ్యాపార సంస్కృతిని స్వంతం చేసుకుంది. ప్లాట్ల వ్యాపారం జోరుగానే సాగుతుంది. ఎకరం

భూములకు వందల్లో ఉన్న ధర కుంట భూమికి వేలల్లోకి మారింది. ఇక్కడ ప్రైవేట్ కళాశాలలు, జూనియర్ కళాశాలల జోరు పెరిగింది. రోజురోజుకు వాటి సంఖ్య పెరుగుతూనే ఉంది. ఫీజులు కట్టి పిల్లలను చదివించే వాళ్ళు పెరిగారు. వీటన్నింటిని డబ్బున్నవారు, రాజకీయ పార్టీలతో సంబంధమున్న వారు నడుపుతున్నారు. పారిశ్రామిక ప్రాంతంలో ఫైనాన్స్ ల వ్యాపారం పెరిగింది. వెహికిల్స్ కొనుక్కోవడానికి లోన్లు ఇవ్వడం, ప్లాట్లు కొనుక్కోవడానికి బాకీలు ఇవ్వడం లాంటి ప్రలోభాలు ఇక్కడ నడిచాయి. మధ్యతరగతి వారి ఆశలు వారిని అటు పోయేటట్లు చేస్తున్నాయి.

వస్తు వినిమయ సంస్కృతి ప్రభావం ఈ ప్రాంతంలో విరివిగానే ఉంది. చేతిలో డబ్బులు ఉండటంతో ప్రలోభాల మాయలో పడి వస్తువులు కొనే అలవాటు పెరిగింది. ఎన్.టి.పి.సి, ఎఫ్.సి.ఐ లలో ఇది మరీ ఎక్కువ. ఎక్కడ లేని కేబుల్ టి.వీ.ల సంస్కృతి మొట్టమొదటగా ఈ ప్రాంతంలోనే వచ్చింది. రంగురంగుల జీవితం, అవాస్తవిక సుఖ వాంఛలు పెరగడంతో ప్రతి ఇంటిని టి.వి. ఆక్రమించుకోవడంతో ప్రకటనల ప్రభావం పెరిగింది. ఫ్రిజ్, కూలర్ కొనడం, కొందరు సంపన్నులైతే ఎ.సి.లు కొనుక్కోని ఇండ్లల్లో పెట్టుకుంటున్నారు. వినిమయ సంస్కృతి జోరు పెరగడంతో వ్యాపారాలు పెరిగాయి. బీరు, బ్రాందీ షాపులు ప్రారంభం అయ్యాయి. నర్సింగ్ హోంలు, మెడికల్ షాపులు విపరీతంగా పెరిగాయి. రెడిమేడ్ బట్టల దుకాణాలు లక్ష్మీనగర్ లో ఉన్నాయి. సూపర్ బజార్లు, జనరల్ స్టోర్ల సంఖ్య గణనీయంగా పెరిగింది. జిరాక్స్ సెంటర్స్ ఉన్నాయి. వస్తు సంస్కృతి సుఖ వాంఛ మాయలో పడి ఎన్.టి.పి.సి, ఎఫ్.సి.ఐ కార్మికులంతా తమ ఇండ్లను వస్తువులతో నింపేశారు. వస్తు సంస్కృతిలో పారిశ్రామిక ప్రాంతం మునిగితేలింది. ట్రేడ్ యూనియన్ల బలం పెరగడంతో, కార్మిక చైతన్యం పెరగడంతో వారిని సుఖ వాంఛల వైపు తిప్పే ప్రయత్నాలు జరిగాయి. అందులో భాగంగానే వస్తు సంస్కృతిని విపరీతంగా ప్రోత్సహించడం జరిగింది. కేబుల్ టి.వీ. మాయ, వస్తు వినిమయ సంస్కృతి మోజులో ఎఫ్.సి.ఐ కార్మికులు సుఖసంతోషాలతో జీవనం గడుపుతున్నారు.

### 3.5.6. పరిశ్రమ మూసివేత – కార్మికుల సమస్యలు:

పండిట్ జవహర్ లాల్ నెహ్రూ భారతదేశ తొలి ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు ప్రభుత్వ రంగాల్ని ప్రోత్సహించాడు. అతడు భారీ పరిశ్రమల ఆవశ్యకతను గుర్తించాడు. దేశ అవసరాలను తీర్చడమే కాదు, దేశ ప్రజలకు ఉపాధి కల్పించడం లక్ష్యంగా, లాభాపేక్ష లేకుండా అదొక బాధ్యతగా పరిశ్రమల స్థాపనను ప్రోత్సహించి ఎంతో మందికి ఉపాధి కల్పించాడు. ఈ పరిశ్రమల వల్ల మధ్యతరగతి కుటుంబాలలో కొంతవరకు అభివృద్ధి కనిపించింది. రామగుండంలో 1971లో

ఫెర్టిలైజర్ కార్పోరేషన్ ఆఫ్ ఇండియా కర్మాగారాన్ని స్థాపించారు. దాదాపుగా 30 సంవత్సరాలు కర్మాగారం పని చేసింది. 1999 ఏప్రిల్ 1న కార్మిక వర్గానికి కొలుకోలేని దెబ్బ తగిలింది. కార్మిక వర్గం మీద ఉక్కు పాదం మోపి, వీరోచిత పోరాటాలు చేసి సాధించుకున్న హక్కులను కబలిస్తూ, కార్మిక వర్గ అనుకూల భావాల నుండి మార్పులతో మరో తొమ్మిది నెలల్లో న్యూ మిలినియం కానుకగా ఫ్యాక్టరీ మూసివేత అని యాజమాన్యం ప్రకటించింది.

కార్మికులు అందరూ బతుకు భయంతో ఏమి చేయాలో తెలియక ధిక్కు తోచని పరిస్థితుల్లో ఉన్నారు. అగమ్యగోచరంగా ఉన్న భవిష్యత్తును భయంకరంగా ఊహించుకుంటూ ఆందోళన చెందుతున్నారు. తమ పిల్లల భవిష్యత్తు గురించి ఆలోచిస్తున్నారు. తాము ఇంతవరకు సుఖమనుకునేవి పేకమేడల్లా కూలిపోతుంటే ఆగాధంలో పడి కొట్టుమిట్టాడుతున్నారు. పిల్లల చదువు, జబ్బు చేస్తే దవాఖానకు వెళ్లడం, ఉండటానికి ఇల్లు లాంటి సౌకర్యాలతో నెలకు కొంత జీతం వస్తున్నప్పుడే బతుకు అంతంత మాత్రంగా ఉండేది. ఇవన్నీ ఆగిపోయే పరిస్థితి రావడంతో ఆందోళనలో ఉన్నారు.

వాలంటరీ సెపరేషన్ స్కీంని ప్రకటించి ఉద్యోగులందరికి తప్పనిసరిగా దరఖాస్తు చేసుకునేటట్లు చేశారు. ఒక్కొక్కరికి మూడు లక్షల నుండి ఆరు లక్షల వరకు ఇచ్చారు. ఈ స్కీమ్ కింది అందరిని పంపించేశారు. రామగుండం ఫ్యాక్టరీ ఉద్యోగుల్ని మాత్రమే కాదు దేశంలో ఉన్న ఇలాంటి పన్నెండు ఫ్యాక్టరీల ఉద్యోగుల్ని బలవంతంగా పంపించేశారు. ఫెర్టిలైజర్ కార్పోరేషన్ ఆఫ్ ఇండియా, హిందూస్థాన్ ఫెర్టిలైజర్ లాంటివి శాశ్వతంగా మూతపడ్డాయి. కరీంనగర్ జిల్లా మొత్తాన్ని కన్నీటిలో ముంచింది. వేలాది కుటుంబాలకు జనవరి ఒకటవ తేదీ 2003 నుండి ఇక జీతాలు రావనడం భరించరానిదిగా ఉంది. త్వరలోనే క్వార్టర్లు ఖాళీ చేయమనడం కడుపు తరుక్కుపోయేటట్లు చేసింది. ఇంతవరకు అనుభవించిన వైద్య సౌకర్యం ఇక లేదనడం దుఃఖకరంగా మారింది. పారిశ్రామిక ప్రాంతమంతా విచారం అలుముకుంది. వ్యాపారాలు రాజకీయాలు చేసి షేర్లలో పెట్టుబడి పెట్టి చాలామంది నష్టపోయారు. మధ్యలో ఉద్యోగాలు పోవడం ఘోరం. ఇది ఈ శతాబ్ద విషాదంగా పేర్కొనవచ్చు. ఉద్యోగులు రిలీవింగ్ ఆర్డర్ కాపీని తీసుకొని భోరుమని దుఃఖించారు. ట్రేడ్ యూనియన్లు వీరోచిత పోరాటాలు చేసి సాధించుకున్న హక్కుల్ని ఒక్కొక్కటిగా కాలరాస్తున్నారు. ఇప్పుడు కార్మికలోకమే ప్రమాదంలో పడింది. ట్రేడ్ యూనియన్ల మీద ఉక్కుపాదం మోపబడి మేనేజ్ మెంట్ అనుకూల యూనియన్లు ప్రారంభం కావడంతో ఇది వ్యాపించిందని చెప్పవచ్చు. వెనుకబడిన ప్రాంతంలో కొంతమందికి ఉద్యోగాలు కల్పించడానికి ఎరువుల

అవసరాన్ని తీర్చడానికి ఫ్యాక్టరీ కట్టారు. ఉత్పత్తి ఉన్న ఫ్యాక్టరీని మూసివేయడం దుర్మార్గంగా చెప్పవచ్చు. ప్రభుత్వాల నూతన ఆర్థిక విధానాలే ఇలాంటి పరిశ్రమలు మూతపడటానికి కారణాలుగా చెప్పవచ్చు.

### 3.5.7. ముగింపు:

మెతుకుపుస్తకం నవల ద్వారా ఫెర్టిలైజర్ ఫ్యాక్టరీలో పనిచేసే కార్మికుల యొక్క ఆలోచనలు, యూనియన్ ఎన్నికలు, సింగరేణి, ఎన్టీపిసి కాలనీలలో ఉండే కహానీలు, తెలంగాణ పండుగలను గురించి తెలుసుకోవచ్చు. ముఖ్యంగా ఈ నవల గ్రామాలు బతుకుపుస్తకాలుగా ఉన్నాయని, ఫెర్టిలైజర్ ఫ్యాక్టరీలో పనిచేసే ఉద్యోగులకు, కార్మికులకు ఫ్యాక్టరీయే అన్నం పెట్టే 'మెతుకుపుస్తకం' అని తెలియజేస్తుంది. ప్రభుత్వ నూతన ఆర్థిక విధానాలు ఫ్యాక్టరీని మూతపడేట్లు చేశాయి. కార్మికుల ట్రేడ్ యూనియన్ కార్మికుల హక్కుల కొరకు పోరాడినా ఫలితం లేకపోవడంతో కార్మిక లోకం ప్రమాదంలో పడిందని తెలుసుకోవచ్చు. అభివృద్ధి ఏదైనా మానవజాతి మనుగడకు తోడ్పడాలి. ప్రకృతిని కాపాడాలి. అలా కాని పారిశ్రామిక విధానం ఏదైనా విధ్వంసం అవుతుంది అని ఫ్యాక్టరీ ఋజువు చేసింది. బొగ్గు ఆధారిత ఎరువుల పరిశ్రమను స్థాపించడం, దాని ద్వారా ప్రయోగం సత్ఫలితాలను ఇవ్వడం లేదని పరిశ్రమను మూసివేయడం ప్రభుత్వ వైఫల్యంగా చెప్పవచ్చు.

## 3.6. చైతన్య స్రవంతి నవల:

మానవుడిలోని చైతన్యం ఒక ప్రవాహంలాంటిది. మనిషి చేతనావస్థలోని ప్రేరణలను, కోరికలను, ఆలోచనలను కాలనియతి క్రమం లేకుండా యథాతథంగా చిత్రించేవి చైతన్య స్రవంతి నవలలు. "సుప్త చేతనలో ఉండే జ్ఞాపకాలు, భావనలు, ఆలోచనలు మానవ సంకల్పంతో నిమిత్తం లేకుండా – బాహిరమైన ప్రేరణ ఉన్నా లేకపోయినా – అవిచ్ఛిన్న స్వభావంతో ఒక క్రమం అనేది లేకుండా అన్నీ ఒక్కుమ్మడిగా బయటకు దూకడాన్ని చైతన్య స్రవంతి అంటారు" (రామారెడ్డి, ఘంట.2002:పుట.3).

కాలువ మల్లయ్య రచించిన 'తపస్సు' నవల చైతన్య స్రవంతి కథనంలో ఉంది. ఈ నవలలో ఉన్న సాహితీ తపస్సు గురించి విశ్లేషణ చేశాను.

### 3.6.1. తపస్సు నవల:

తపస్సు నవలను కాలువ మల్లయ్య 2017వ సంవత్సరంలో విశాల సాహితీ శ్రీ బి.యస్. రాములు సాహిత్య స్వర్ణోత్సవ నవలల పోటీల కోసం రాశారు. ఇది అముద్రిత నవల. ఈ నవలను చైతన్య స్రవంతి కథనంలో రాశారు. కాలువ మల్లయ్యగారు మూడు దశాబ్దాలకు పైగా సాహితీ

తపస్సు చేస్తున్నాడు. తన రచనా వ్యాసంగం ద్వారా సామాజిక స్పృహను తెలియజేశాడు. మానవ సంబంధాలు పరిఢవిల్లేటట్లు , మానవ సంబంధాలు పెంపొందే రచనలు చేయాలని అందు కోసమే మనమంతా సాహితీ తపస్సు తెలియజేయాలి అని అంటాడు. పదిహేను గంటల వ్యవధిలో మహేష్ అనే రచయిత జీవితం, సాహిత్య ప్రస్థానం ఇతివృత్తంగా ఈ నవల సాగుతుంది. మహేష్ పాత్రలో కాలువ మల్లయ్యగారు ఉన్నట్లుగా మనం భావించవచ్చు.

### 3.6.2. నవలా వస్తువు:

తపస్సు నవలలోని కథనం చైతన్య స్రవంతి ధోరణి ద్వారా నడుస్తుంది. మహేష్ అనే రచయిత యొక్క సాహితీ ప్రస్థానం అతని జీవితం, తెలుగు సాహిత్యం గురించి ఇందులో తెలియజేయబడింది. ఉదయం ఆరు గంటలకు కథ ప్రారంభమవుతుంది. మహేష్ పల్లెలో పుట్టి పెరిగి బాల్యాన్నంతా అక్కడే గడిపాడు. అతని తండ్రికి అక్షర జ్ఞానం ఉండటంతో ఊరిలోని దొరను ఎదురించి బడికి పంపించాడు. అతనికి చదువు జ్ఞానాన్ని ఇచ్చి ప్రపంచం గురించి ఆలోచించేటట్టు చేసి అతడిని రచయితను చేసింది. ఆ చదువే లేకుంటే అతడు వ్యవసాయదారుడిగానో, గొర్రెల కాపరిగానో ఉండేవాడు. ఉదయం అయింది నిద్ర లేవాలి.  లే... లే... లేపమంటవా అని పాట పాడుకునే వయస్సు కాదు అతనిది. అతనికి ఇప్పుడు 56 సంవత్సరాలు. అతను జీవితంతో తపస్సు చేస్తున్నాడు. అదే సాహితీ తపస్సు. అతని తపస్సుకు చివరంటూ లేదు. అతను రాయడం ప్రారంభించిన సంవత్సరంలో ఘోరమైన ప్రతిజ్ఞ చేశాడు. అతని రాతలు సమాజానికి అవసరంలేని రోజు చనిపోతాను అన్నాడు. ఒక్క సంవత్సర కాలం తన పేరు కాని, రచన కాని ఏ పత్రికలోనూ, ఏ భాషల్లోనూ రాకుంటే తాను చనిపోతానన్నాడు. అదే మాట మీద ముప్పై సంవత్సరాలుగా నిలుచున్నాడు. ప్రతి సంవత్సరం కొన్ని రచనలు చేస్తూనే ఉన్నాడు. సమయం గడుస్తుంది. అతడు కొంతమంది మిత్రులను కలిసి అటునుండే సన్మాన సభకు వెళ్ళాలి. అతని భార్య వరలక్ష్మి లేచి ఇంటి పనిని ప్రారంభించింది. అతడు ఫర్టిలైజర్ కార్పోరేషన్ ఆఫ్ ఇండియా కంపెనీలో పని చేసినప్పుడు సిస్టమెటిక్ జీవితం గడిపేవాడు. డ్యూటీకి వెళ్ళడం, పిల్లలను బడికి పంపించి రావడం, కొంత సాహిత్యం రాసుకోవడం, అధికారిగా, కార్మికుడిగా అన్ని పనులు సమయానికి చేసుకునేవాడు. ఇప్పుడు బద్ధకంతో సమయానికి పనులు చేయట్లేదు. వేలాది పేజీల సాహిత్యాన్ని రాసి వివిధ పత్రికలకు పంపి బహుమతులు పొందేవాడు. తాను దాని ద్వారా పెద్దగా డబ్బు సంపాదించుకోలేదు. సామాజిక స్పృహతో రచనలు చేస్తున్నాడు. భార్య వరలక్ష్మి నుండి నిద్ర లేవాలని బెదిరింపు వచ్చింది. కాని అతడు ఆలోచనల్లో విహరిస్తూనే ఉన్నాడు. నన్నయ కంటే

ముందే భాష ఉందని అది శాసనాల్లో, జానపదుల ప్రజల నాలుకలపై ఉందని అందువల్లే నన్నయ మహాభారతాన్ని రాశాడు అంటాడు. తెలుగుకు ప్రాచీన హోదాను సాధించాం. అలాంటి భాష అధికార భాషగా ఉండాలని మన నేలపై తెలుగు భాష దూరమైపోతుందేమోనని బాధపడతాడు. ప్రజల భాషతో ప్రభుత్వాలు పాలన చేయాలి అని అలా చేసినప్పుడు భాష ఉనికిలో ఉంటుందని అంటాడు. ఇప్పటికి మూడు వేలకు పైగా భాషలు కనుమరుగయ్యాయి. ఇంకో మూడు తరాల్లో తెలుగులో మాట్లాడేవారు కూడా కరవవుతారేమోనని బాధపడుతూ తన తెలుగు భాష శాశ్వతంగా ఈ భూగోళం ఉన్నంత వరకు ఉండాలని, దానిని కాపాడుకోవడానికి అతను ఏలాంటి ఉద్యమాలు చేయడానికైనా సిద్ధమే అంటాడు.

సమయం ఏడయింది తన ఆలోచనా పరంపర కొనసాగుతూనే ఉంది. ఎలక్ట్రానిక్ మీడియా, ప్రింట్ మీడియాలు తమ విధులు చక్కగా నిర్వర్తిస్తున్నాయి అని చెబుతాడు. అతను 'మానవ స్వప్నం' కథలో భూమి, రైతులు అలిగినట్టు కలగన్నాడు. అవి అలిగితే సమస్త విశ్వం ఆగిపోతుంది. తినడానికి తిండి ఉండదు. కంప్యూటర్ విద్యను కాని ప్రొడక్టివిటీ కాని పనుల మీద ఆధారపడితే సంక్షోభం వస్తుంది. ప్రపంచీకరణ కార్పోరేట్ సంస్కృతిని పెంచింది. వృత్తులను నాశనం చేసింది. బలహీన వర్గాల వారి ఆదాయ మార్గాలను నాశనం చేసింది. తెలుగులో అభ్యుదయ, దిగంబర, చేతనావర్త, పైగంబర, విప్లవ సాహిత్యాలు రావడంతో శ్రీశ్రీ ప్రభావం 20వ శతాబ్ది రచయితలు, కవులపై చాలా ఎక్కువ. ఏ రచన అయిన జీవితాన్ని ప్రేమించేటట్టు చేయాలి. జీవితంలో ఆశా భావాన్ని కలిగించాలంటాడు. అతని భార్య వరలక్ష్మి కూతురుని ఆడిపిస్తూ, టిఫిన్ తినిపిస్తుంది.

సమయం ఎనిమిది అయిన లేవలేదు. ఆదివారం అయినంత మాత్రాన తొమ్మిది వరకు పడుకోవాలా అని భార్య వరలక్ష్మి మందలించింది. ఆమె ఈరోజు ఇచ్చే అవార్డు విలువెంత అని అడుగుతుంది. అతడు పదివేల రూపాయలు, జ్ఞాపికను అందిస్తారని చెప్పుతాడు. మీ రచనకు నా ప్రోత్సాహం ఉందా? అని భార్య అడిగిన ప్రశ్నకు అతడు ప్రతి పురుషుడి విజయం వెనుక ఓ స్త్రీ ఉందన్న విషయం మరిచి పోవద్దంటాడు. ఎఫ్.సి.ఐ.లో ఉద్యోగం పోవడంతో అతను చిన్న ఉద్యోగం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. భార్యాభర్తలు సినిమాలు, సీరియల్స్ గురించి వాదోపవాదాలు చేసుకుంటారు. అతను తొమ్మిది గంటలకు లేచి స్నానం చేసి, ఇంటి పనులు చేస్తాడు. సమయం పదయింది. అతని పదేళ్ల క్రితం సంఘటనలను గుర్తు చేసుకున్నాడు. నువ్వు ఎప్పుడు పేదల గురించి, అలాగే జనం గురించి, అట్టడుగు వర్గాల గురించి, దోపిడీ గురించి రాస్తావుగా అసలు నీకు శృంగార కథలు రాయొచ్చా? అని ఒక మిత్రుడు సవాలు విసురుతాడు. తన సవాలు స్వీకరించి

రెండు శృంగార కథలు రాశాడు. ఆ కథలపై కొందరు అభిమాన పాఠకులు తమ స్పందనను ఇలా తెలియజేస్తారు. ఎంతో కాలం నుండి మిమ్మల్ని అభిమానిస్తున్నాం. మీ ఈ కథల వల్ల మా అభిమానుల పేర్ల నుండి మీ పేజీని చింపేసాం అని రాశారు. అలాంటి కథలు మీరు రాయొద్దని మరో ఉత్తరం రాశారు. కొందరు ఆ కథలు బాగున్నాయి కాని అవి మీ నుండి రావాల్సినవి కావు అంటారు. మన నుండి సామాజిక దృక్పథంతో ఉన్న సాహిత్యాన్ని పాఠకులు ఆశిస్తున్నారు అని అతనికి అర్థమయింది. పత్రిక ద్వారా బహిరంగంగా పాఠకులకు క్షమాపణ చెప్పాడు. ఇంట్లోకి సరిపోయేన్ని మార్కెట్లో కూరగాయలు తీసుకున్నాడు.

సమయం పదకొండయింది. అతడు ఆలోచనల్లోనే ఉన్నాడు. ఆకలి యుగంలో ప్రపంచంలో ఆర్థిక మాంద్యం విపరీతంగా ఉన్న సమయంలో అభ్యుదయ కవిత్వం వెలువడింది. ఆ తరువాత వచ్చిన మైనారిటీ, దిగంబర, దళిత, స్త్రీవాద సాహిత్య ఉద్యమాలలో వచ్చిన మార్పులను తలుచుకున్నాడు. సమయం పన్నెండయింది. అతడు మార్కెట్ నుండి ఇంటికి వెళ్ళాడు. అయినా ఆలోచనలు ఆగట్లేదు. తెలుగు సాహిత్యంలో వచ్చిన బహుజన ఉద్యమం ఎంతో మంది రచయితలను చేసింది. అతడు బహుజన దళితుల కొరకు శక్తివంచన లేకుండా రచనలు చేస్తున్నాడు. తాను కష్టజీవుల గురించి రాస్తున్నాడు. తన కథల్లో చాలావరకు హీరోలు పేదవాళ్లే. ఎడతేగని ఆలోచనలు వస్తూనే ఉన్నాయి. ఈరోజు అతనికి అవార్డు ఏమోగాని ఆలోచనలు మాత్రం వదలడం లేదు. సమయం ఒంటి గంట అయింది. అతడు భూమిపుత్రుల గురించి రాసినందుకే అవార్డు వస్తుంది. రైతు సమస్యలను ప్రపంచానికి తెలియజేస్తున్నాడు. వారి జీవన సంఘర్షణను చిత్రిస్తున్నాడు కాని రైతు జీవితాల్లో మార్పులు మాత్రం అతి స్వల్పంగా వస్తున్నాయి. అతడు సాహిత్య ప్రయోజనం ఉపదేశం కొరకే అంటాడు. సామాజిక మార్పు కోసమే అంటాడు. ఆనందం కోసం కావాలంటే కళలు ఉన్నాయి అంటాడు.

అతడు 'అవ్వతోడు గిది తెలంగాణ' శీర్షికతో కథలు రాశాడు. అన్ని కులాల బతుకు వ్యథలున్న రచన అది. అతని అనుభవం నుండి కొన్ని పాత్రలు తీసుకొని రాసిన రచన అది. అతని ఈ రచన నుండి అతనికి పాఠకుల సంఖ్య పెరిగింది. వరలక్ష్మి మహేష్ లు కలిసి ప్రక్కప్రక్కనే ఉన్నారు. తెలుగు సాహిత్యం గురించి ఇంతలా తపిస్తున్నారు, మన పిల్లలు వాటిని చదవడం లేదు కదా? అని భార్య అంటుంది. అతడు అదే కదా నా బాధ, మన పిల్లలు కూడా చదవాలన్నదే నా కోరిక. కాని వారిని ఒత్తిడి చేయాలనుకోట్లేదు. వారికి ఇష్టం వచ్చింది వారిని చదువుకోనివ్వాలి అని అంటాడు. అతని తరంలోని విద్యావంతులైన పిల్లలు చదవడం చాలా తక్కువ. మన తరువాత

తరంలో మొదటితరంగా విద్యను అభ్యసిస్తున్న శ్రామిక కులం నుండి వచ్చిన వారు సాహిత్యాన్ని చదువుతున్నారు ఇది సత్యం అని అంటాడు. ఇద్దరూ అన్నం తిని నిల్చున్నారు. సమయం రెండయింది. బెడ్ రూంలోకి వెళ్లి సాహిత్యం గురించి ఆలోచిస్తూనే ఉన్నాడు. ఆమెకు సాహిత్యమంటే ప్రేమే. అతని రచనలు చదువుతుంది. అతడు డబ్బు కొరకు తాపత్రాయపడటం లేదు. తన సాహితీ వ్యాసంగం 'విధి వ్రాలా' అనే నవల రాయడంతో ప్రారంభమైంది. ఆ నవల ఇప్పుడు దొరకడం లేదు. ఎక్కడ పోయిందో తెలియదు. అతడు తన బాల్యం, విద్యాభ్యాసంలోని జీవితాన్ని గురించి ఆలోచించాడు. సమయం మూడయింది. తన పిల్లలు బడిలోని పాఠ్యపుస్తకాలకు పరిమితమయ్యారు. వారి కార్పోరేట్ చదువు ప్రవాహంలా కొనసాగుతుంది. అతడు వారిని సాహిత్యం చదవమని ఒత్తిడి చేయలేదు. బెడ్ రూం తలుపులు తీసి చూస్తే భార్య పిల్లలు టి.వి. చూస్తున్నారు. వారిని సన్మానానికి రావాలని అడిగితే వారు రానంటారు. తానొక్కడే వెళ్తున్నాడు. అతనికి రాజకీయాలు అంటే ఇష్టముండదు. ఒకప్పుడు విప్లవ రాజకీయాలను నమ్మేవాడు. ఆ తరువాత ప్రజాస్వామ్యాన్ని నమ్మాడు. ఇప్పుడు మానవతను నమ్ముతున్నాడు.

సమయం నాలుగయింది. మిత్రుడి ఇంటికి బయలుదేరాడు. అతనికి ఆలోచనలు వస్తూనే ఉన్నాయి. అతనికి మొదటగా టీచర్ ఉద్యోగం వచ్చింది. వరలక్ష్మి అతనికి ఉద్యోగం రావడంతో సంతోషపడింది. ఆ తరువాత కొంత కాలానికి ఫర్టిలైజర్ కార్పోరేషన్ ఆఫ్ ఇండియా కంపెనీలో చేరాడు. అక్కడ కథలు, నవలలు, కవిత్వం, వ్యాసాలు రాస్తూ పత్రికలకు పంపేవాడు. స్పష్టమైన ప్రాపంచిక దృక్పథంతో రాస్తున్నాడు. అతడు ఐదు గంటలకు మిత్రుని ఇంటికి చేరుకున్నాడు. సామాన్య ప్రజల కోసం రాయాలి. వృత్తుల గురించి రాయాలి. మనకు సంస్కృతి, జీవితం, సామాజికత, సంస్కారం, సభ్యత, సాంఘిక జీవనం అన్ని ఉన్నాయి. అతడు వాటన్నింటిని సాహిత్యంలో ప్రతిబింబింపజేశాడు. సామాజిక చరిత్రను నిక్షిప్తం చేశాడు. కవితా సౌరభం, కవితాఝురి, కట్నం కథలను కొంత మార్క్సిజం ప్రభావంతో రాశాడు. అతనికి విరసం అంటే ఇష్టం, సరసం అంటే చుట్టరికం. మొదటి కథ 'వెలి' సృజన పత్రికలో ప్రచురింపబడింది. ఆ తరువాత కొన్ని కథలు రాసి వివిధ పత్రికలకు పంపాడు. వాటిని చదవడం ద్వారా పాఠకుల సంఖ్య పెరిగింది అని అనుకుంటుండగానే బయలుదేరుతామని స్నేహితుడు వాఘ్రేష్ అంటాడు.

సభాప్రాంగణానికి ఆరు గంటలకు చేరుకున్నారు. సాహితీమిత్రులు ఒక్కొక్కరుగా వస్తున్నారు. తన కంటే పెద్దవారికి, చిన్నవారికి నమస్కారం పెట్టాడు. సభ ప్రారంభం అవ్వగానే మళ్ళీ ఆలోచనల్లోకి వెళ్ళాడు. వరకట్న వేధింపులు, ప్రపంచీకరణ ప్రభావం, మధ్య తరగతి జీవితం

గురించి రాశాడు. సన్మాన కార్యక్రమంలో ఎందుకు అవార్డు ఇస్తున్నారో చెప్పారు. తెలంగాణ గ్రామీణ జీవితం గురించి వాస్తవిక దృక్పథంతో రాసారని చెప్పారు. తన రచనకు ప్రాణం వాస్తవికత అన్నారు. తెలంగాణ మాండలికానికి సాహిత్య గౌరవం తీసుకువచ్చారన్నారు. శాలువా కప్పి, జ్ఞాపికతోపాటు పది వేల రూపాయలు నగదు రూపంలో ఇచ్చారు. తనకు సన్మానం చేసి గౌరవించారు.

పద్మశాలీలు వలసలు పోయే క్రమాన్ని గురించి రచనలు చేశాడు. ప్రపంచీకరణ ప్రభావం వల్ల వారి బతుకుల్లో వచ్చిన కల్లోలాన్ని వివరించాడు. దళితుల జీవితం గురించి రచనలు చేశాడు. అంబేద్కర్ ప్రభావంతో వచ్చిన కుల చైతన్య ఉద్యమాలు, కమ్యూనిస్టుల ఉద్యమాలతో దళితుల బ్రతుకుల్లో వచ్చిన మార్పులను చిత్రించాడు. అతన్ని గ్రామీణ రచయితని, పల్లెల మూలాలు తెలిసిన రచయితని, వాస్తవ దృక్పథంతో రాసేవారని పొగిడారు. అతడు కృతజ్ఞతలు తెలియజేశాడు. ఈ అవార్డుతో నామీద నాకు కొంత బాధ్యత పెరిగేటట్టు చేశారని ఆ బాధ్యతలను సవినయంగా స్వీకరిస్తున్నాను అని అంటాడు. నాది సమన్వయ దృక్పథం అని చివరికి మిగిలేది మంచి, మానవత్వం మాత్రమే అంటాడు. నేను మానవాంశను ప్రేమిస్తాను. ఎన్నో మార్గాలు, నా మార్గం నాదే... అదే మానవతా మార్గం. తిక్కన, వేమన, శ్రీశ్రీ, గురజాడలు నాకు మార్గదర్శకులు. నాకు అభినవ కవివర్యులు. భాషలో తిక్కన, ప్రజల ధ్యాసలో వేమన, భావంలో గురజాడ, ప్రజానీకంలో శ్రీశ్రీ... నా మార్గం అనితర సాధ్యం అంటూ చెప్పి సభను ముగించాడు. సమయం రాత్రి తొమ్మిదయింది. తన పదిహేను గంటల ఆలోచన ధార ఆగిపోయింది. వాఘ్రేష్, మహేష్ ఇద్దరూ కారులో పోతున్నారు. ఇలా రచయిత తన జీవితానుభవాలను, సాహిత్యాన్ని గురించి ఆలోచనల ధోరణితో తెలియజేశాడు.

### 3.6.3. వస్తు విశ్లేషణ:

తపస్సు నవలలో మహేష్ అనే రచయిత పాత్రలో కాలువ మల్లయ్య ఉన్నట్టుగా మనం భావించవచ్చు. ఈ నవలలో రచయిత తన పీడిత కుటుంబ నేపథ్యంను తెలియజేస్తూ తాను గత నలభై సంవత్సరాలుగా రాస్తున్న రచనా వ్యాసంగాన్ని తెలియజేశాడు. అతను సాహితీ తపస్సు చేస్తున్నాడు. తన తపస్సుకు ఆరంభం తప్ప అంతం లేదు. జీవితాంతం తన తపస్సు కొనసాగుతూనే ఉంటుంది. అతను రాయడానికి తరగని వస్తువు ఇంకా చాలా ఉంది. రచయితకు ఉన్న పీడిత కుటుంబ నేపథ్యం వలన దళిత, బహుజన వర్గాల వారి తరుపున రచనలు చేసి సాహిత్యంలో మహోన్నత దశకు చేరుకున్నాడు. మధ్యతరగతి ప్రజల సమస్యలు, రైతు సమస్యలు, దళిత,

బహుజనుల సమస్యలు, స్త్రీల సమస్యలు, కార్మిక, గ్రామీణ, వివిధ కుల వృత్తుల వారి సమస్యలను ప్రస్తావిస్తూ రచయిత తన రచనల ద్వారా గ్రామీణ వర్గ సంస్కృతిని, దళిత, బహుజనుల సమస్యలను ఉన్నతీకరించాడు.

ప్రజాస్వామ్యంలో ప్రజల భాషను ప్రభుత్వ పాలనలో ఉపయోగించాలి. ప్రజలకు తెలుగులో రాస్తే అందరికి అర్థమవుతుంది, వారికి చేరువవుతుంది కాబట్టి ప్రభుత్వం ఉత్తర్వులను కూడా తెలుగులో ఇచ్చేట్టు కృషి చేయాలి. ప్రపంచీకరణ ప్రభావంతో కార్పోరేట్ సంస్కృతి పెరుగుతుంది. దాని వలన వృత్తులు నాశనం అవుతున్నాయి. బలహీన వర్గాల వారి ఆదాయం తగ్గుతుంది. ఈ ప్రభావంతోనే కులవృత్తుల వారు వలసలు పోతున్నారు. డెబ్బై ఏళ్ల స్వాతంత్ర్యంలో ఆకలిచావులు, రైతుల ఆత్మహత్యలు, నేత కార్మికుల ఆత్మహత్యలు, విద్యార్థుల చావులన్నింటిని సాహిత్యం ద్వారా రచయితలు తెలియజేస్తూనే ఉన్నారు. ప్రభుత్వాలు పట్టించుకొని ఆకలిచావులు లేని సమాజాన్ని తయారుచేయాలి. ప్రపంచీకరణ దశాబ్దంలో అద్భుతమైన సాహిత్యం వచ్చింది. ముఖ్యంగా దళిత, బహుజన, మైనారిటీ సాహిత్యం బాగా వచ్చింది. ఇంకా వస్తూనే ఉంది. బహుజనుల కులాల్లోంచి చదువుకొని రచయితలుగా ఎదిగిన తర్వాత తమ మూలాల్లోకి వెళ్ళి రచనలు చేస్తున్నారు. మానవ సంబంధాలన్ని డబ్బు సంబంధాలుగా మారిపోతున్నాయి. మానవ విలువలు ధ్వంసమవుతున్నాయి. మానవత్వం పరిఢవిల్లేటట్టు మానవ సంబంధాలు పెంపొందేటట్టు రచనలు రావాలి. మానవత్వాన్ని పరిమళింపచేయాలి. అందుకోసమే మనమంతా తపస్సు చేయాలి.

### 3.6.4. ముగింపు:

తపస్సు నవలలోని రచయిత సాహితీ వ్యాసంగం ద్వారా తాను సృష్టిస్తున్న సామాజిక ప్రయోజనాలను మనం గమనించవచ్చు. సమాజంలో జరిగే మార్పులకు తాను స్పందిస్తున్నాడు. నిజాం పాలన నుండి ఇప్పటి వరకు సమాజంలో ఉన్న సమస్యలైన గ్రామీణ రైతు జీవితం, దళితుల సమస్యలు, వృత్తి కులాల వలసలు, మధ్యతరగతి ఇలా వరుసగా అనేక సమస్యలపై స్పందిస్తూ తన రచనా వ్యాసంగాన్ని కొనసాగిస్తూ ఉన్నాడు. తాను కార్మిక వర్గంలో ఉండటంవల్ల వారికి సంఘీభావం తెలుపుతూ వారి పోరాట హక్కుల గురించి స్పందిస్తూ ఉన్నాడు. తాను చిన్నప్పటి నుండి చూసిన సంఘటనలు, సన్నివేశాల ఆధారంగా సామాజిక దృష్టిలో రచనలు చేస్తున్నాడు. అతని రచనా వ్యాసంగం ద్వారా బడుగు, బలహీన వర్గాలలో చైతన్యం వస్తుంది. అతని సాహితీ తపస్సు ఇలానే కొనసాగాలని కొరుకుందాం.

## 3.7. అలభ్య నవలలు:

కాలువ మల్లయ్య రచించిన 'విధివ్రాలా?', 'ఊరంటే?', 'చీకట్లో చిరుదీపం' నవలలు నా పరిశోధన కాలంలో లభించలేదు. కాబట్టి ఆ నవలలను అలభ్య నవలలుగా పేర్కొంటున్నాను. డా॥ బండి మల్లికార్జున్, కాలువ మల్లయ్య గార్లు తెలిపిన ప్రకారం ఈ మూడు నవలల సమాచారాన్ని కింద పొందుపరుస్తున్నాను.

'విధివ్రాలా?' 'ఊరంటే?' నవలల సమాచారం డైరీలో ఉందని, ఆ డైరీ ప్రస్తుతం కనిపించపోవడంతో ఈ నవలలు అందుబాటులో లేవని కాలువ మల్లయ్య తెలియజేశాడు. బ్రహ్మరాతను బట్టి కాదు మనం చేసుకున్న పనులను బట్టే మన భవిష్యత్తు, జీవన విధానం, అభివృద్ధి ఉంటుందనేది 'విధివ్రాలా?' నవలా సారాంశం అని కాలువ మల్లయ్య తెలియజేశాడు.

ఊరంటే? తమదే అన్న సమిష్టి భావన, ప్రశాంత జీవన విధానం, కల్లాకపటాలెరుగని అమయాకత్వం, ప్రకృతి లాలన, జ్ఞాపకాల లొగిలి, తరతరాల వారసత్వ ఆనవాలు, కట్టుబాట్లు, ఆచార వ్యవహారాలు, సంస్కృతి సాంప్రదాయాలకు నిలువుటద్దమని కాలువ మల్లయ్య తెలియజేశాడు.

### 3.7.1. చీకట్లో చిరుదీపం:

ఈ నవల ఆంధ్రజ్యోతి ప్రచురణ నవ్య వీక్లిలో 15-12-2010 సీరియల్ గా ప్రచురితమైంది. కాలువ మల్లయ్య తన వ్యక్తిగత జీవనాన్ని ఈ నవలలో ప్రతిఫలింపజేశారు. నాలుగు తరాల జీవితాన్ని చిత్రించడం జరిగింది. ఈ నవల సి.పి. బ్రౌన్ నవ్య వీక్లి నవలల పోటీలో ప్రత్యేక బహుమతి పొందింది.

కాలువ మల్లయ్యగారు ఈ నవలలో మనోహర్ పాత్రలో కనిపిస్తాడు. అతడి తండ్రి పాత్రలో లసుమయ్య కనిపిస్తాడు. తాత, ముత్తాతల కాలం నుండి గొర్రెల కాపరి వృత్తిలో కొనసాగుతున్నారు లసుమయ్య కుటుంబం. ఆ వృత్తిలో వారు ఎంతో పీడనం అనుభవించారు. లసుమయ్య తండ్రి నుండి సంక్రమించిన గొర్రెల కాపరి వృత్తిని స్వీకరించి కొంత వ్యవసాయ భూమిని సాగు చేస్తాడు. 'గొల్లెక్కిరి... ఇల్లెక్కిరి' అంటూ అవమానాలు పడతాడు. గొల్లని సాహిత్య విద్య అంటూ చులకనగా చూడబడతాడు. తనలాగా తన కొడుకు అవమానాలు పడొద్దని చదివించి ప్రయోజకుడిని చేయాలకుంటాడు. వెనుకబడిన దళిత వర్గాలకు అందకుండా ఉంటూ వచ్చిన చదువును స్వాతంత్ర్యానంతరం చదువుకునే అవకాశాలు పెరుగగా లసుమయ్య మనోహర్ ని బడిలో

చేర్పిస్తాడు. మనోహర్ ఎంతో క్రమశిక్షణగా చదువుకొని పట్టభద్రుడవుతాడు. ప్రతిభతో ఉద్యోగాన్ని కూడా సంపాదిస్తాడు.

మనోహర్ ఉద్యోగరీత్యా అన్ని వసతులున్న పట్టణంలో ఉండటం వలన క్రమంగా ఊరికి దూరంగా ఉండవలసి వస్తుంది. మనోహర్ పిల్లలు పట్టణ జీవితానికే అలవాటుపడి పెరుగుతారు. అతని కొడుకు క్రాంతి ఉద్యోగాన్ని వెతుక్కుంటూ విదేశాలకు వెళ్తాడు. తన తరంలోనైనా, తన కొడుకు తరంలోనైనా ఉద్యోగరీత్యా ఎదిగే క్రమంలో బయట దేశాలకు వెళ్ళవలసి వస్తుంది. వారు అక్కడ స్థిరపడటం వల్ల ఇక్కడికి రాలేకపోతున్నారు. ఫలితంగా తమ తల్లిదండ్రులు కొడుకుల కోసం ఇంటి వద్ద ఎదురు చూసే ధోరణి కొనసాగుతూనే ఉన్నదని, తరతరానికి మనుషుల మధ్య ప్రేమరాహిత్యం చోటు చేసుకోవడాన్ని ఈ నవలలో కాలువ మల్లయ్య చక్కగా చిత్రించారు.

★★★

# నాల్గవ అధ్యాయం

# కాలువ మల్లయ్య నవలలు – పాత్ర చిత్రణ

# నాల్గవ అధ్యాయం

# కాలువ మల్లయ్య నవలలు – పాత్ర చిత్రణ

## 4.0. పాత్రలు – పాత్ర చిత్రణ పరిచయం:

తెలుగు ప్రక్రియల్లో అత్యంత విస్తృత పరిధి ఉన్న నవలను పరిశీలిస్తే అందులోని పాత్రలు ముఖ్యమైనవని చెప్పవచ్చు. కథలేని నవలలు, కథావస్తువు లేని నవలలు ఉంటాయి కాని పాత్రలు లేకుండా నవలలు రాయటం సాధ్యం అయ్యే పనికాదు.

ప్రముఖులు చెప్పిన పాత్రల నిర్వచాలను కింది విధంగా ఉన్నాయి.

“కథావస్తువును భరించేవారు, కథను నడిపించేవారు పాత్రలు”(వెంకటసుబ్బయ్య, వల్లంపాటి.1994:పుట.27)

“నవలకు ప్రాణభూతమైనవి పాత్రలు. పాత్రలు లేని నవలలు ఉండవు. నవల అనే సాహితీ ప్రక్రియ పాత్రల కోసమే ఉద్భవించిందని వర్జీనియా ఉల్ఫ్ మాటలు ఈ విషయాన్ని బలపరుస్తున్నాయని మృణాళిని గారు పేర్కొన్నారు” (మృణాళిని, సి.1988:పుట.50)

నవలకు ఇతివృత్తం అస్థిపంజరమైతే పాత్రలు జీవం లాంటివి. పాఠకుడిలో సానుభూతిని రేకేత్తించి రసానందాన్ని కలిగించేందుకు ప్రధానంగా పాత్రలే తోడ్పడతాయి. అందుకే నవలల్లో రచయితల భావ ప్రకటనకు పాత్రలు కేంద్రాలు. చక్కటి శిల్పి అయిన నవలాకారుడు ప్రతి పాత్రను ప్రయోజనపేక్షతో చిత్రిస్తాడు. నవలలోని కథకు మానవ జీవితం ఆధారమైనట్లే పాత్రచిత్రణకు వ్యక్తులే ఆధారం. కథాగమనానికి, వ్యక్తీకరణకు పాత్రలే సాధకాలు. నవలలోని పాత్రలను బట్టి కథ ఉంటుంది. ఆ పాత్రల గుణగణాలకు అనుగుణంగానే సన్నివేశ కల్పనలు కూడా చేయబడతాయి. నవలకు ఒక రూపాన్ని సార్ధకతను చేకూర్చేవి పాత్రలే.

“జీవితమంటే సుఖదుఃఖాలు ఒక మనిషి జీవితంలో అవి సంప్రాప్తిస్తున్నవి? ఆయా సందర్భాలలో ఆ మనిషి ఎలా ప్రవర్తిస్తున్నాడు? ఈ విషయాల్ని బట్టి మనిషిలో వ్యక్తి వైశిష్ట్యం గోచరమవుతుంది. జీవితాన్ని కథగా మలిచే ప్రక్రియయైన నవలలో నిరూపింపబడే వ్యక్తి వైశిష్ట్యాన్నే పాత్రచిత్రణం అంటారని ఆర్.యస్ సుదర్శనం తెలిపారు” (సుదర్శనం, ఆర్.యస్.1972: పుట.104). నవల ప్రధానంగా సమకాలీన యథార్థ జీవితాన్ని చిత్రిస్తుంది కాబట్టి పాత్రలు సజీవంగా యథార్థంగా కనిపించాలి. సామాన్యంగా రచయిత నిత్య జీవితంలో తాను ఎదుర్కొనే వ్యక్తులను నవలలో పాత్రలుగా చిత్రిస్తాడు. అప్పుడు నవలలోని ఇతివృత్తం ఆ పాత్రల చర్యలే కాని వేరే కాదు. రచయిత యథార్థ వ్యక్తును వారి చర్యలను, సంఘటనలను నవలలో ఇతివృత్తంగా

మలచవచ్చు. ఇతివృత్తం కల్పన అయినా అందులోని కొన్ని పాత్రలను నిత్య జీవితంలో తాను చూసిన తనకు తటస్థపడిన వ్యక్తులకు ప్రతిబింబంగా చిత్రించవచ్చు. నవలలోని ఇతివృత్తానికి వాస్తవికతను తీసుకురావాలంటే సజీవ పాత్రచిత్రణ చాలా అవసరం.

నవలల్లో పాత్రలు అన్ని చూడటానికి ఒకటిగా అనిపించినా వ్యక్తులలో ఎలా వైవిధ్యముందో అలాగే పాత్రలలో కూడా అనేక రకాలు ఉన్నాయి. పాత్రలను వారి వారి స్వభావాలను బట్టి పరిశోధకులు, సాహిత్యకారులు, విమర్శకులు, పాశ్చాత్యులు వివిధ రకాలుగా విభజించారు.

పాశ్చాత్యుడు E.M. Forster పాత్రల్ని ప్లాట్ క్యారెక్టర్స్, రౌండ్ క్యారెక్టర్స్ అని రెండు రకాలుగా విభజించాడని వాటికి సమనార్థకమైన పదాలు దొరకడం కష్టం కావడంతో ఆ పదాలకు బదులుగా 'క్లిష్టతలేని పాత్రలు', 'క్లిష్టత ఉన్న పాత్రలు' అన్న పదాలను మన సౌలభ్యం కోసం ఉపయోగించుకుందామని 'నవలాశిల్పం' గ్రంథంలో వల్లంపాటి వెంకట సుబ్బయ్యగారు తెలియజేశారు.

మానసిక శాస్త్రవేత్తలు నవలల్లోని పాత్రల్ని టైప్స్, ఇండివిజువల్స్ అని వర్గీకరణ చేశారని వల్లంపాటి వెంకటసుబ్బయ్య గారు పేర్కొన్నాడు.

"నవలల్లోని పాత్రలను విలియం హార్వే అనే ఆంగ్ల పాశ్చాత్యుడు నాలుగు విభాగాలుగా విభజించాడని సి. మృణాళిని గారు పేర్కొన్నారు" (మృణాళిని,సి.1988: పుట.52).

1) నాయకీనాయకులు
2) అసంఘ జీవిత ప్రతినిధులు
3) మధ్యవర్తులు
4) సహాయక పాత్రలు

ఆచార్య జి. యోహన్ బాబు గారు రాసిన "బలివాడ కాంతారావు నవలలు – పరిశీలన" అనే గ్రంథంలో పాత్రలను 10 రకాలుగా వర్గీకరించారు. అవి:

1) ఆదర్శోన్ముఖ పాత్రలు
2) ఉదాత్త పాత్రలు
3) సంప్రదాయోన్ముఖాలు – సంప్రదాయ విరుద్ధాలు
4) సందేశాత్మక పాత్రలు
5) గాంధీ ప్రభావాత్మకాలు
6) కళలకు అంకితమయిన పాత్రలు

7) తీవ్రవాద భావాలు గల పాత్రలు

8) ప్రతినాయక రాజకీయ పాత్రలు

9) అప్రధాన పాత్రలు

10) మనో విశ్లేషణాత్మక సిద్ధాంతగత పాత్రలు.

పైన పేర్కొన్న వర్గీకరణే కాకుండా స్త్రీ పాత్రలు, పురుష పాత్రలు, పాత్ర ప్రాముఖ్యాన్ని బట్టి ప్రధాన పాత్రలు, అప్రధాన పాత్రలని వర్గీకరించడం జరిగింది. పాత్రలలో ఉండే వైవిధ్యం, విభజన ఎంతో విస్తృతమైనది. అందుకే రచయిత యొక్క జీవితానుభవాన్ని బట్టి, చిత్రించిన విధానాన్ని బట్టి పాత్రలను విభజించడం జరుగుతుంది.

సాహితీకారులు, విమర్శకులు, పరిశోధకులు పైన తెలిపిన వర్గీకరణను ఆధారంగా చేసుకొని నేను కాలువ మల్లయ్య నవలల్లోని పాత్రలను నాలుగు రకాలుగా వర్గీకరిస్తున్నాను. అవి:

1) ప్రధాన పాత్రలు

2) ఆదర్శ పాత్రలు

3) సందేశాత్మక పాత్రలు

4) సహాయక పాత్రలు

పాత్ర చిత్రణలోనే పాత్ర స్వభావం, ప్రయోజనం, వైశిష్ట్యం, వైవిధ్యం ఇమిడి ఉన్నాయి.

## 4.1. కాలువ మల్లయ్య నవలల్లో పాత్రల పేర్లు – వర్గీకరణ:

నవలల్లో పాత్రల సంఖ్య ఇన్నే ఉండాలి అనే నియమం ఏమి లేదు. నవలా విమర్శకులు ఈ నియమం ఉన్నట్లు కూడా ఎక్కడా ప్రస్తావించలేదు. కథానిర్వహణకు అవసరమైన సంఖ్యలో పాత్రలను రచయిత ఒక నిర్దిష్టమైన ప్రయోజనం ఉంటుంది. కథ కొరకు పాత్రలను సృష్టించడం వలన రచయిత ప్రతి పాత్రకు న్యాయం చేకూర్చుతాడు. పాత్ర విధానాన్ని బట్టి ప్రధాన పాత్రలు తక్కువగానూ, అప్రధాన పాత్రలుగా ఉండే సహాయక పాత్రలు అధికంగా ఉంటాయి.

కాలువ మల్లయ్య నవలల్లో పాత్రలను చిత్రించడంలో సిద్ధహస్తుడు. సమాజంలోని వివిధ మనస్తత్వం గల వ్యక్తుల మనోభావాలను పరిశీలించి ఆ వైవిధ్యాన్ని అంతా పాత్రలతో నిక్షిప్తం చేస్తాడు. కాలువ మల్లయ్య తన ఊరిలోని మట్టి మనుషులైన వారిని తీసుకొని తన రచనల్లో ఆ పాత్రలకు జీవం పోశాడు. తన చుట్టూ ఉన్న సమాజంలోని వ్యక్తులను చూసి వారి గుణాల ఆధారంగా వారిని రచనల్లో పాత్రల రూపంలో చిత్రించాడు.

కాలువ మల్లయ్య తన ఊరిలో చూసిన, అనుభవించిన, సంఘటనల ఆధారంగా ఎక్కువగా పీడిత కులాల పాత్రలే తీసుకొని ఆ పాత్రల ద్వారా సమాజంలో చైతన్యాన్ని పెంపొందించాడు. కాలువ మల్లయ్య పల్లెలోని వృత్తి పనివారు, దళితులైన మాల మాదిగల జీవితాలు పాత్రల రూపంలో సృష్టించి తన నవలల్లో పాత్రచిత్రణ చేశాడు. ఆ పాత్రలు ఆ నవలల్లో సజీవంగా ఉండటం గమనించవచ్చు. సృష్టికర్తలైన వృత్తిపని వారి జీవితాలను అతను కళ్లారా చూడటంతో ఆ పాత్రలను నవలల్లో చిత్రించాడు. వెలివేత బాధలను అనుభవించిన మాల మాదిగ వారి వేదనలను తన గ్రామంలో ప్రత్యక్షంగా చూసిన అనుభవాలను అనుభవించినవాడిగా ఆ పాత్రలను నవలలో ప్రవేశపెట్టి పాత్రచిత్రణ చేశాడు.

కాలువ మల్లయ్య ఊరిలో ఉన్న కొందరి వ్యక్తులను యథాతథంగా అవే పేర్లతో పాత్రలుగా మలిచాడు. పాత్రలు మాట్లాడే మాటలు, చేసే ప్రవర్తనలు, వ్యక్తపరిచే మనోగత భావాలు, ఆయా పాత్రల స్వభావాల అనుగుణంగా తీర్చిదిద్దిన విధానం వాస్తవికంగా ఉంది. పాత్రలతో కథను కొనసాగించిన తీరు బహు రమ్యంగా ఉందని చెప్పవచ్చు. కాలువ మల్లయ్య సృష్టించిన పాత్రలు సాహితీలోకానికి చాలాకాలం పాటు గుర్తుండే విధంగా ఉంటాయి.

భూమిపుత్రుడు నవలలో  కొండ మల్లయ్య, తిరుపతయ్య, నర్సమ్మ, రాజయ్య, లక్ష్మీ, షావుకారి రాజేషం, మల్లేశం, పద్మశాలి అంజయ్య, లస్మయ్య, రామారావు, నర్సయ్య, కాంతమ్మ, జగ్గయ్య, రాంరెడ్డి, లింగమ్మ, కొంరయ్య, వెంకటయ్య, కొండయ్య, బీరయ్య, శాస్త్రి, కిష్టయ్య మొదలైన పాత్రలు ఉన్నాయి.

సాంబయ్య చదువు నవలలో  చిలుకయ్య, సాంబయ్య, వెంగళరావు, వెంకటయ్య పంతులు, ఈశ్వర్, రాజయ్య, రాజిరెడ్డి, నర్సయ్య, రాజమ్మ, రంగారావు, రామనర్సు, లసుమయ్య, గంగయ్య, చంద్రారెడ్డి, వెంకటేశ్వరరావు, బక్కమ్మ, కొండల్ రెడ్డి, కొంరయ్య, బాలయ్య, నర్సయ్య, హనుమయ్య, బుచ్చయ్య, షావుకారి, దుర్గయ్య, రామయ్య, ఆగయ్య షావుకారి, కిషన్ రెడ్డి, ఐజాక్, పేరయ్య, మల్లమ్మ, భూమానందం, శివయ్య, లింగయ్య, కమ్మరి బక్కయ్య, వడ్ల ఈరయ్య, కత్తెర్ల భూమయ్య, ప్రభాకర్, వేణు, వెంకటేశం, గట్టయ్య, మల్లేశం, రామచంద్రం, బలరాం మొదలైన పాత్రలు ఉన్నాయి.

మాట్లాడే బొమ్మలు నవలలో అయిలయ్య, సాంబయ్య, శాంతమ్మ, సరస్వతి, లసుమయ్య, వెంకమ్మ, రాజమ్మ, సరోజిని, శ్రీనివాస్, కొమరయ్య, వీరమల్లు, విజయేందర్ రెడ్డి సార్, సంజీవరెడ్డి, విజయసారథి, చక్రపాణి, వేణుమాధవ్, వెంకటస్వామి, ఆనంద్, తిరుపతిరెడ్డి, రాంరెడ్డి,

కిష్టారెడ్డి, రాజిరెడ్డి, సత్యకుమార్, జగ్గయ్య, నర్సయ్య, తిరుపతయ్య, శంకర్రావు, రామచంద్రం, రవీందర్ మొదలైన పాత్రలు ఉన్నాయి.

మంచియన్నది మాల అయితే.. నవలలో  కొండయ్య, వీరమ్మ, గోవిందరావు, రంగయ్య, కిషన్ రావు, రాజయ్య, ఎద్దులు, సార్, పొరగాండ్లు, చంద్రయ్య, నర్సింహారెడ్డి దొర, పోలీసు పటేలు, వీరమల్లు, చంద్రారెడ్డి, శంకరయ్య, వెంకటనర్సు, మనోహర్ రెడ్డి, భూమయ్య, గుండయ్య, ఉప–సర్పంచ్, మురళయ్య, షడ్డకుడు, మరదలు, మల్లేశం, ఎల్లయ్య, పోలీసులు, ఎస్సై, అన్నలు, రంగయ్య పెండ్లాం, వీరయ్య, పాలేర్లు, పంతులు, పెద్ద మనుషులు, నడిపోడు, ఉపసర్పంచ్, సర్పంచ్ పట్వారీ మొదలైన పాత్రలు ఉన్నాయి.

గులాంగిరి చోడో నవలలో మారయ్య, లింగమ్మ, కొంరయ్య, వీరమ్మ, ముత్తమ్మ, నర్సింహారెడ్డి, చంద్రారెడ్డి, రమణారెడ్డి, సుధాకర్ రావు, వీరేశం, లక్ష్మీ, రాజేష్, శ్రీహరి, మధునయ్య, అంజయ్య, భిక్షపతి, చంద్రయ్య, లలిత, రాజన్న, మాదిగ నర్సయ్య, బాలగౌడ్, సర్పంచ్, కనుకయ్య, రాజలింగు, నర్సమ్మ, లస్మమ్మ, వెంకటమ్మ, పుల్లిగాడు, కోమట్ల మణవ్వ, ఎల్లమ్మ, రాజేశ్వరమ్మ, సుందరమ్మ, హరిజన యువకులు, రాజయ్య, లచ్చుమ్మ, లక్ష్మారెడ్డి, రామస్వామి, పెద్ద మనుషులు, చంద్రారెడ్డి స్నేహితుడు, దొర, లాయరు, జడ్జిగారు, దొర పాలేర్లు, ప్రతాపరెడ్డి, సమ్మిరెడ్డి, రాజనర్సు, జగదీశ్ చందర్, అన్నలు మొదలైన పాత్రలు ఉన్నాయి.

గువ్వలచెన్నా నవలలో చిప్ప మల్లయ్య, లింగమ్మ, శంకరయ్య, వీరయ్య, శ్రీరాం, రాజేశం, లక్ష్మీరాజం, రాజమల్లు, లచ్చవ్వ, శారద, రమేష్, రాజారావు దొర, వెంకట్ రెడ్డి, బెస్త కొంరయ్య, రాజిరెడ్డి, వెంకటేశ్వరరావు, ఓదయ్య, వడ్ల గట్టయ్య, రంగయ్య, మచ్చయ్య, రామయ్య పటేలు, తిరుపతయ్య, లసుమయ్య, సత్తయ్య, నారాయణ, చంద్రమ్మ, అంకయ్య, లక్ష్మీ, వెంకటనర్సు, రామలింగం, మల్లీశ్వరి, లక్ష్మారావు, తిరుపతయ్య, వెంకటేశం, చంద్రమౌళి, సుంకరి, పట్వారీ మొదలైన పాత్రలు ఉన్నాయి.

బతుకు పుస్తకం నవలలో  కొండల్ రావు, లసుమయ్య, పురుషోత్తమరావు, భూమయ్య, గడ్డం రామయ్య, శివయ్య, రాజిరెడ్డి, లింగమ్మ, రాజయ్య, అంజనవ్వ, గంగయ్య, గోపాల రత్నారెడ్డి, రామచంద్రారెడ్డి, బాలయ్య, కొండయ్య, ఓదేలు, భూమయ్య, మల్లేశం, సాంబయ్య, పట్వారీ, వెంకటేశ్వరరావు, ఎల్లమ్మ, పోలీసు పటేలు, కనుకయ్య, కిష్టారెడ్డి, గడ్డం లింగయ్య, నారాయణరెడ్డి, వెంకటరెడ్డి, లక్ష్మి, రవీందర్ రెడ్డి, మనోహర్ రెడ్డి, రాజవ్వ, వెంకటేశం, రాజన్న, రాజమల్లు, వీరమల్లు, రాజేశం, నర్సిరెడ్డి, నర్సయ్య, రామస్వామి, సర్పంచ్, బేతి లక్ష్మారెడ్డి, రమేష్, రామయ్య

పటేలు, ఆనంద బాయమ్మ, మెండె పోచాలు, హనుమంతరెడ్డి, మల్లయ్య పటేలు, కవిత, చైతన్య, రవీందర్ రెడ్డి, దామెరపల్లి రాజిరెడ్డి, రాజమౌళి, నీలయ్య మొదలైన పాత్రలు ఉన్నాయి.

మెతుకు పుస్తకం నవలలో సారయ్య, అరుణ్ కుమార్, కొంరెల్లి, శ్రీనివాస్, దివాకర్ రెడ్డి, భిక్షపతి, రాంకిషన్, లసుమయ్య, తుక్కయ్య, చంద్రమౌళి, ప్రభాకర్ రెడ్డి, సత్యనారాయణ, సర్పంచ్, సంగం కిష్టయ్య, వెంకటేశం, నర్సయ్య, రాజిరెడ్డి, మెండె రాజయ్య, బేతి లక్ష్మారెడ్డి, వీరమ్మ, గౌండ్ల వెంకటయ్య, విజయేందర్ రెడ్డి, శంకరయ్య, గొట్టం రామయ్య, భూమయ్య, కొచ్చాల మచ్చయ్య, వడిగొప్పుల మల్లమ్మ, కిష్టారెడ్డి, జుట్టు భూమానందం, గీట్ల జనార్ధన్ రెడ్డి, పోచవ్వ, డాక్టర్ రాజం, శ్రీరాంరెడ్డి, చిప్ప ఓదెలు, మాధవరెడ్డి, సర్వర్, రవీదంర్ రెడ్డి, వెంకటశాస్త్రి, శంకరాచారి, ఉపేందర్, చిప్ప సత్యనారాయణ, మేనేజర్, ఈశ్వర్, రాజేశం, రాజమ్మ, వీరయ్య, సత్యకుమార్, కట్ల మల్లేష్, మహేందర్, మహేష్, రచయిత రఘు, శ్రీనివాసరావు మొదలైన పాత్రలు ఉన్నాయి.

అస్పృశ్యకోయిల నవలలో కోకిలమ్మ, మనోజ్, లక్ష్మణరావు, శ్యాంరావు, కిష్టయ్య, ఓదెలు, మనోజ్ తాత, గోపాలకృష్ణశర్మ, మనోజ్ తల్లి, అన్నలు, కోటయ్య, మల్రెడ్డి, మంకయ్య సారు, మ్యాకల సాంబయ్య, కొంరెల్లి, రాజవ్వ, రామమ్మ, కొండయ్య, దానయ్య, బుచ్చమ్మ, వెంకటశాస్త్రి, నారాయణ, రామస్వామి, వెంకటనర్సు, రాజయ్య, పేరయ్య, కొండల్ రావు, చిలుక రాజయ్య, బుచ్చమ్మ, దానయ్య, పట్వారీ, పోలీసు పటేలు, సర్పంచ్, లక్ష్మీదేవి, రాజలింగయ్య, లాలయ్య, రంగయ్య మొదలైన పాత్రలు ఉన్నాయి.

తపస్సు నవలలో మహేష్, వరలక్ష్మి, చరిత, తిరుపతిరెడ్డి, రామచంద్రారెడ్డి, నిశాపతి, శర్మ, D.E.O., పోచన్న, మలయశ్రీ, నాన్న, వెంకటేశ్, వ్యాఘ్రేష్ మొదలైన పాత్రలు ఉన్నాయి.

తెలంగాణ దేవదాసు నవలలో రఘురాం, రాజ్యలక్ష్మి, వేణుగోపాలరెడ్డి, రవీందర్ రెడ్డి, సునీత, రాఘవరెడ్డి, లసుమమ్మ, కొండయ్య, శంకర్, భూమారెడ్డి, రంగయ్య, ప్రభాకర్ రెడ్డి, పోలీసు పటేలు, పట్వారీ, దానమ్మ, చంద్రం సారు, నరహరి సారు, తెలుగు పండిట్ సారు, సుహాసిని దేవి, మహేశ్వరి మొదలైన పాత్రలు ఉన్నాయి.

డబ్బు–తృప్తి= దుఃఖం నవలలో శివయ్య, మంజుల, సుమిత్రమ్మ, మొండయ్య, సదానందం, మాధవరావు, శివయ్య అత్త, ఆఫీసర్, అశ్విని, భరణి, కృత్తిక, రోహిణి, మృగశిర, మహేష్ మొదలైన పాత్రలు ఉన్నాయి.

మాదిగ విజయం నవలలో బుచ్చయ్య, పేరయ్య, మరియమ్మ, ఎల్లయ్య (ఆనందరావు), ఆజాద్, శ్రీకాంత్, సూర్యారావు, వెంకటరెడ్డి, రాజలింగం, నర్సింగరావు, రామయ్య, కనుకమ్మ,

మదార్ సాబ్, లక్ష్మణరావు, రాజయ్య, రాజారావు, నర్సమ్మ, రామారావు, కాపు నర్సిరెడ్డి, కొండయ్య, జానయ్య, తిమ్మయ్య (థామ్సన్), గట్టయ్య, చిలుకయ్య, ఖాన్, రంగమ్మ, బొత్తయ్య, ఉద్యమకారులు, కోటయ్య, పట్వారీ, బొత్తయ్య, వీరేశం, శరభయ్య, రాజవీరు షావుకారి, ఈరమ్మ, రంగారావు, లసుమయ్య, రామక్క, బాలయ్య, సోమయ్య, చంద్రమ్మ, రాజయ్య, సుబ్బారావు, పోచాలు, వెంకట్ నర్సు, బర్ల హనుమయ్య, రాజవ్వ, నర్సింగం, చెన్నయ్య, కిషన్ రావు, మల్లేశం, రుక్కమ్మ, పోలీసులు, సబ్–ఇన్స్పెక్టర్, ఇమామ్, రాంరెడ్డి, నర్సు బాయమ్మ, అరవింద్, సర్వోత్తమరావు, శాస్త్రి, శ్రీలత, అనిత, రామస్వామి, ఇంద్రజిత్, పాణి మొదలైన పాత్రలు ఉన్నాయి.

సాహితీకారులు, విమర్శకులు, పరిశోధకులు తెలిపిన వర్గీకరణను ఆధారంగా చేసుకొని నేను కాలువ మల్లయ్య నవలల్లోని పాత్రలను నాలుగు రకాలుగా వర్గీకరిస్తున్నాను. అవి:

1) ప్రధాన పాత్రలు
2) ఆదర్శ పాత్రలు
3) సందేశాత్మక పాత్రలు
4) సహాయక పాత్రలు

పాత్ర చిత్రణలోనే పాత్ర స్వభావం, ప్రయోజనం, వైశిష్ట్యం, వైవిధ్యం ఇమిడి ఉన్నాయి.

## 4.2. ప్రధాన పాత్రలు:

### 4.2.1. కొండ మల్లయ్య (భూమిపుత్రుడు):

భూమిపుత్రుడు నవలలో కొండ మల్లయ్యది ప్రధాన పాత్ర. కొండ మల్లయ్య ఓ రైతు బిడ్డ. శ్రమైక జీవన సౌందర్యానికి సమానమైంది ఏదీ లేదని నమ్మిన భూమిపుత్రుడు. భూమినే జీవనాధారంగా ఎంచుకొని వ్యవసాయాన్ని నమ్ముకొని బతుకును వెళ్ళదీస్తున్నాడు. అతనికి 50 సంవత్సరాలకు పైనే వయస్సు ఉంటుంది. అతడి కళ్లు లోతుకుపోయి, తల నెరసి, ముఖం మీద ముడతలు, శరీరంపై ఎముకలే తప్ప కండలేని బిడ్డ. అతని మొలకు దొడ్డు ధోవతి ఉంటుంది. తలకు రుమాలు లాంటి గుడ్డముక్క ఉంటుంది. ఛాతీపై అంగీ ఉంటుంది. అంగీ ఆ ఊరి పద్మశాలీ నేసినది. బట్టలెప్పుడు చెమట వాసనతోనే ఉంటాయి.

మల్లయ్యకు తండ్రి నుండి భూమి సంక్రమించింది. ఆ భూమి సారవంతమైనది కాదు. ఆ భూమితోనే వ్యవసాయం చేస్తున్నాడు. అతనికి ఏ రాజకీయాలు తెలియవు. కోడి కూతతోనే లేచి పనికి వెళ్లడం, మళ్లీ ఏ రాత్రికో వచ్చి పడుకోవడం అలా 40 సంవత్సరాలుగా మట్టిలో మట్టై రెక్కలు ముక్కలు చేసుకుంటూ నాగేటి చాళ్ళకే అంకితమై ఘర్మజలాన్ని భూదేవికి అర్పిస్తూ బతుకుతాడు.

తండ్రి నుండి సంక్రమించిన ఎనిమిది గజాల పొడవు, అయిదు గజాల వెడల్పు ఉన్న పెంకుటింట్లో కాపురముంటున్నాడు. శిథిలావస్థలో ఉన్న ఆ పెంకుటింట్లో ఓ మూల ధాన్యం పోసుకోవడానికి రెండు గుమ్ములున్నాయి. వాటి ప్రక్కనే పార, పలుగు, తట్టలు, తాళ్లు లాంటి వ్యవసాయ పనిముట్లు ఉన్నాయి. ఇంట్లో గుమ్ములున్నా అందులో ధాన్యముండేది చాలా స్వల్ప కాలం మాత్రమే.

రైతు కుటుంబాల్లో ఏ రోజు తీరక ఉండదు. పండుగ దినాల్లో కూడా ఎంతో కొంత పనిచేస్తారు. రెండేళ్లు వరుసగా కరువు రావడంతో కొండ మల్లయ్య తిండి దినుసులు కూడా కొనుక్కొన్నాడు. రెండేళ్ల అనావృష్టి తరువాత ఆ సంవత్సరం సమృద్ధిగా వర్షాలు కురిశాయి. కుంటలు, చెరువులు అన్ని నిండాయి. వరి పంట బాగా పండింది. పంట గూర్చి అతనికెంతో సంతృప్తిగా ఉంది. ఆరు నెలల కష్టానికి ఫలితంగా కళ్ళ ముందు కనబడుతున్న వడ్ల రాశిని చూస్తుంటే అతనికి ఎంతో సంతోషానిచ్చింది. కొండ మల్లయ్య వేసవిలో కూతురు పెళ్లి చేయాలనుకున్నాడు

రాజేషం షావుకారి కొండ మల్లయ్య పొలంలోని వడ్లరాశి దగ్గరకు చేరుకున్నాడు. తన అప్పు తీర్చాలని ఇద్దరిని వెంటబెట్టుకొని వచ్చాడు. కొండ మల్లయ్య ఎంత బతిమిలాడినా రాజేషం వినలేదు. ఖచ్చితంగా వడ్లు తీసుకవెళ్లడానికే వచ్చాడు. అప్పు కిందికి వడ్లను కొలుచుకున్నాడు. తను పండించిన పంటపై తనకే అధికారంలేక చేతికొచ్చిన పంట నోటికిరాక ధీనంగా చూస్తూ కొండ మల్లయ్య నిల్చున్నాడు. కొలతల్లో తేడాలున్న తన కళ్ళముందే బహిరంగంగా దోపిడీ జరుగుతున్నా గమనించే స్థితిలో లేడు ఆ రైతుబిడ్డ. ఆ వడ్లు పెళ్లి ఖర్చులకు సరిపోకున్నా మరికొంత అప్పుజేసి ఆ శుభకార్యం చేయాలనుకున్న కొండ మల్లయ్యకు ఆశాభంగమే అయింది. రాజేషం తన పని తాను కానిస్తుంటే తరుగుతున్న రాశిని, పెరుగుతున్న వడ్ల బస్తాలను చూస్తూ లోలోపల మౌనంగా రోదిస్తూ కొండ మల్లయ్య నిల్చున్నాడు. రాజేషం ఆరు నెలలు మట్టిలో మట్టై పనిచేసిన కొండ మల్లయ్యకు కల్లంలో తిండికి సరిపోయే గింజలు కూడా మిగల్చకుండా తీసుకవెళ్లాడు. ఇలా జరగడం రైతులకు కొత్తేంకాదని కొండ మల్లయ్య పాత్ర ద్వారా తెలుసుకోవచ్చు. తాను పండించిన పంట వడ్డీలకు కూడా సరిపోకున్నా, ఏ భూమినైతే తాకట్టు పెట్టి అప్పు తీసుకున్నాడో ఆ భూమి అప్పు కిందికి పోయే స్థితి వచ్చినా రైతు భూమిని అమ్ముకోవడానికి సంకోచిస్తాడు. అయినా ధరల సుడిగుండం, ప్రకృతి వైపరీత్యాలు, రాజకీయ, సాంఘిక పరిస్థితులు లాంటి మరెన్నో విషయాలు భూమిపుత్రుడి భూమిని అతనికి గాకుండా చేస్తున్నాయి. వడ్డీ వ్యాపారులు తమ దౌర్జన్యాలతో కొండ మల్లయ్యను పీడించారు. రెక్కలు ముక్కలు చేసుకొని భూమాత సేవకే అంకితమైన రైతుకు ఆ భూమే లేకుండా చేస్తున్నారు.

అప్పుల బాధను భరించలేక భూమిని అమ్మాలని కొడుకులు కొండ మల్లయ్యకు చెప్తారు. కొండ మల్లయ్యకు భూమిని అమ్మడానికి మనసొప్పడం లేదు. వారు అమ్మాలంటున్న రెండెకరాల భూమి తండ్రి పంచి ఇచ్చినప్పుడు ఏమంత సారవంతమైందిగా ఉండేదికాదు. కొండ మల్లయ్య ఆ భూమిని సారవంతంగా మార్చడానికి ఎంతో కష్టపడ్డాడు. అతడు ఆ భూమిని తన శరీరంలోని భాగంగానే తలచాడు. అక్కడే చాలాకాలం గడిపాడు. అందులో ఉన్న చెట్లను, కంపను నరికేశాడు. రాళ్లు, రప్పలు తీసేశాడు. అతడు ఎత్తు పల్లాలను సరిచేశాడు. అందులో గొర్రెల, పశువుల పెంటను పెట్టించాడు, బావిని తవ్వించి, మోట పెట్టించాడు. రాత్రనక, పగలనక ఆ భూమిని సారవంతం చేయడానికి మట్టిలో మట్టయ్యాడు. ఆ భూమిని సాగు చేయడంలో శ్రమలోనే ఆనందాన్ని చూశాడు. శ్రమకు సమానమైంది లేదని భావించి పనిచేశాడు. అయినా రెండేళ్లు అందులో పెట్టిన విత్తనాలు కూడా తిరిగి రాలేదు. ఆ తరువాత అది పండటం జరిగింది. ఆ భూమితో మల్లయ్యకు ఎంతో అనుబంధముంది. దానిపై చెప్పలేని ప్రేమ ఉంది. దాన్ని అమ్మాలంటే తన శరీరంలోని ఓ భాగాన్ని అమ్ముకున్నట్లుగా భావిస్తాడతను. కొండ మల్లయ్య కొడుకులు ఇద్దరు భూమి అమ్మడానికి మొగ్గు చూపారు. చివరికి అప్పుల బాధ భరించలేక కొండ మల్లయ్య కొంత పొలం అమ్ముతాడు.

కొండ మల్లయ్య పోయిన భూమి ఎలాగూ పోయిందని ఉన్నదాన్ని దక్కించుకోవాలని ఆలోచిస్తుంటాడు. కొడుకు ఉద్యోగానికి వెళితే అతడు ఎంతలేదన్నా కొంతయినా నెలకు డబ్బు పంపుతాడని ఆలోచించాడు. రైతు హాయిగా, సుఖంగా తిని తాగేది ఉండదు. మండుటెండల్లో మాడిపోతూ పని చేయాలి. కడవల కొద్ది ఘర్మజలాన్ని ధారపోయాలి. రైతు శరీరంపై ఎప్పుడూ చెమట కంపు, పేరుకున్న ఉప్పే ఉంటుంది. కాళ్లు పగుళ్లు తేలి దుబ్బమయమై ఉంటాయి. ఎముకలు కొరికే చలిలోను వణకుతూ పనిచేయాలి. చలికి శరీరమంతా తెల్లగా బూడిద రాసుకున్నట్లు ఉంటుంది. కుండపోత వర్షాలు పడుతున్నా రైతన్నకు ఈ బాధలు తప్పవు అని తన జీవితాన్ని మననం చేసుకుంటున్నాడు కొండ మల్లయ్య.

ఎన్నోసార్లు ప్రభుత్వ బ్యాంకుల రుణాలు చెల్లించలేక తాను, తనలాంటి రైతులు అవమానాలపాలైనా, బ్యాంకు రుణాలు ఇకముందు తీసుకోవద్దంటూనే తీసుకునేవాడు, తీసుకోక తప్పేది కాదు. ఓసారి అతడు మోటబావిలో పూడిక తీయడానికి తీసుకున్న బ్యాంకు రుణం తీర్చలేక భార్యమీదున్న బంగారు కడియం అమ్మాడు. పండిన పంట అప్పులకే సరిపోకపోవడంతో కొండ మల్లయ్య అప్పులు తీర్చలేక బాధపడుతున్నాడు. కొండ మల్లయ్య చిన్న కొడుకైనా తిరుపతయ్యకు సింగరేణి కాలనీలో ఉద్యోగం రావడంతో కొండ మల్లయ్య భూమిని, చిన్నప్పటి నుండి చేస్తున్న

వృత్తిని, మట్టితో ఉన్న అనుబంధాన్ని వదిలి వెళ్లలేకపోతున్నాడు. కొంద మల్లయ్యకు అక్కడ ఖాళీగా తింటూ కూర్చోవడానికి మనస్సొప్పడం లేదు.

రోజురోజుకు దిగజారుతున్న ఆర్థిక పరిస్థితులు ఉన్న భూమిని అమ్మందే బాకీ తీర్చడం సాధ్యం కాని పరిస్థితులు, అగ్నిగుండంలా ఉన్న ఆ ప్రదేశంలోని పరిస్థితులు వెంటాడంతో కొంద మల్లయ్యను రెండెకరాల భూమి అమ్మేలా చేశాయి. అలాగే ఎడ్లు, బండి అమ్మేశాడు.

కొంద మల్లయ్య రోజూ తాను అమ్మిన భూమిలోకి వెళ్తున్నాడు. ఆప్యాయంగా అందులో తిరుగుతున్నాడు. అతడు మట్టిని చేతిలోకి తీసుకుంటున్నాడు. ఆ మట్టిలో మట్టయిన శరీరాన్ని చూసుకుంటున్నాడు. ఆ మట్టిలో కార్చిన ఘర్మజలాన్ని జ్ఞాపకం చేసుకుంటున్నాడు. ఆ మట్టితో తనకున్న అనుబంధాన్ని నెమరు వేసుకుంటున్నాడు కొంద మల్లయ్య. ఆ మట్టితో బంధాన్ని తెంచుకొని ఊరును వదిలిపెట్టిబోతున్న అతనికి ఆ మట్టిని చూస్తుంటే కన్నీరు ఆగడం లేదు. కొన్ని సంవత్సరాలుగా తన చెమటతో ఆ నేలను తడిపిన కొంద మల్లయ్య ఇప్పుడు కన్నీటితో తడుపుతున్నాడు. పరిస్థితులు వికటించి, ఆర్థిక పరిస్థితులు తరిమివేయగా ఊరును వదిలిపెట్టి కొంద మల్లయ్య కొడుకుతోపాటు వెళ్ళాడు. పుట్టి పెరిగిన ఊరును, ఐదు దశాబ్దాలకు పైగా జీవించిన నేలను, పీల్చిన గాలిని వదిలి వెళ్లిపోయిన  ఆ రైతుబిడ్డ కొంద మల్లయ్య కడుపులో అనంతమైన శోకముంది.

కొంద మల్లయ్యను ఒక రైతుగా, అప్పుల బాధతో భూమిని అమ్ముకొని ఆ భూమితో ఉన్న మమకారాన్ని వదులుకోలేని వ్యక్తి పాత్రగా, పల్లెల్లో భూమిని నమ్ముకొని బతుకుతున్న ఎందరో అన్నదాతలకు ప్రతీకగా కొంద మల్లయ్య పాత్ర నిలుస్తుంది.

## 4.2.2. తిరుపతయ్య (భూమిపుత్రుడు):

భూమిపుత్రుడు నవలలో తిరుపతయ్యది ప్రధాన పాత్ర. కొంద మల్లయ్య పెద్దవారైన ఇద్దరి కొడుకులను చదివించలేదు కాబట్టి చిన్న కొడుకైన తిరుపతయ్యను చదివించాలనుకుంటాడు. ఊరిలో బడి లేకున్నా చదివించాడు. తిరుపతయ్య ప్రైవేట్ పాఠశాలలో ఒక సంవత్సరం చదివిన తరువాత అమ్మమ్మ ఇంటి దగ్గర పదవ తరగతి వరకు చదివాడు. అతడు సెలవుల్లో ఇంటికి వచ్చినప్పుడు వ్యవసాయపు పనులు చేసేవాడు. తిరుపతయ్య సుల్తానాబాదులో ఇంటర్ పూర్తి చేశాడు. కాలేజీలో చదివేటప్పుడు ఖర్చులు పెరగడం వల్ల తల్లిదండ్రులు ఇచ్చిన డబ్బుతో చదువుకునేవాడు. కొంద మల్లయ్య కుటుంబ పరిస్థితి ఎలా ఉన్నా అప్పుచేసి తిరుపతయ్యను చదివించాడు. అతడు కరీంనగర్లో ప్రవేశం పొందుతాడు. అతనికి ఖర్చులు మరింత పెరగడంతో, ఆ

ఖర్చులను భరించలేక రాజయ్య తమ్ముడైన తిరుపతయ్యను చదువు మానిపిద్దామనుకుంటాడు. తిరుపతయ్య తండ్రి కుటుంబంలో ఒక్కడైనా చదువుకున్నవాడు ఉండాలని పట్టుబట్టి చదివిస్తాడు. అతనికి డిగ్రీ పూర్తి చేసిన నాలుగేండ్లు గడిచినా ఉద్యోగం రాదు. అటు ఉద్యోగం లేక ఇటు వ్యవసాయం పని చేతగాక తిరుపతయ్య సతమతమయ్యేవాడు. అతడు నాలుగు సంవత్సరాలుగా ఇంటి వద్దనే ఉండి తన కుటుంబం, తనలాంటి రైతు కుటుంబాలు పడుతున్న బాధలను గమనించాడు. పంట పండించడానికి తన కుటుంబం ఎంత కష్టపడుతుందో గమనించేవాడు. అతడు పదిహేను సంవత్సరాల చదువుకు ఫలితం లభించలేదని చింతించాడు. తనపై తల్లిదండ్రులు పెట్టుకున్న ఆశలు తీర్చలేక పోతున్నందుకు ఆవేదన చెందాడు. అతడు తనలో తానే నలిగిపోతూ బాధపడేవాడు.

తిరుపతయ్య అప్పుల బాధలో ఉన్న కుటుంబాన్ని చూసి పొలం అమ్మాలని సలహా ఇస్తాడు. అతని సలహా మేరకు కొండ మల్లయ్య కొంత పొలం అమ్ముతాడు. తిరుపతయ్య తండ్రి పడుతున్న కష్టాన్ని చూసి బాధపడతాడు. తిరుపతయ్య ఉద్యోగం కొరకు ప్రయత్నాలు చేస్తూ ఉంటాడు. ఎన్ని ప్రయత్నాలు చేసినా ఉద్యోగం రాకపోవడంతో ప్రైవేట్ స్కూల్లో పనిచేద్దామనుకుంటాడు. కాని ఆ పని దొరకలేదు. చివరికి అన్న రాజయ్య లాగే బావిపనికి వెళ్తానని తండ్రితో అంటాడు. ఓ కొడుకుని బలి తీసుకున్న బొగ్గుగని పనికి ఉన్న ఒక్క కొడుకుని పంపించడం కొండ మల్లయ్యకి ఇష్టం ఉండదు. ప్రమాదాలు జరుగుతాయని బాధపడితే ఏ పనీ కాదని తిరుపతయ్య తండ్రికి తెల్పుతాడు. చివరికి తిరుపతయ్య తండ్రిని ఒప్పించి బొగ్గుగని పనికి వెళ్లడానికి సిద్ధపడతాడు. తిరుపతయ్య సింగరేణిలో అపాయింటుమెంట్ కొరకు నాలుగైదు రోజులకొకసారి గోదావరిఖనికి వెళ్లి వచ్చేవాడు. కొన్ని రోజుల్లో తిరుపతయ్యకు రాజయ్య స్థానంలో 'కోల్ ఫిల్లర్'గా బొగ్గుగనిలో అతి కష్టంమీద ఉద్యోగం వచ్చింది. ఇద్దరు కొడుకులను తలుచుకుంటూ బాధపడుతున్న తల్లిదండ్రులను గోదావరిఖనికి తీసుకువెళ్ళాలని తిరుపతయ్య నిర్ణయించుకుంటాడు. రోజురోజుకు దుర్భరమవుతున్న పరిస్థితులు మీకు మనశ్శాంతి లేకుండా చేస్తున్నాయని చెప్పి వారిని తీసుకువెళ్ళాలని నిర్ణయించుకుంటాడు. తల్లిదండ్రులను తీసుకొని గోదావరిఖనికి వెళ్తాడు. వ్యవసాయం చేసేవారి కుటుంబంలో ఉన్న బాధలు చూస్తూ పెరిగినవాడిగా, చదువుకున్నా ఉద్యోగం రాకపోవడంతో చాలాకాలం నిరుద్యోగిగా ఉండి కష్టాలు పడినవాడిగా, తన కుటుంబాన్ని ఎలాగైనా ఉన్నత స్థితిలో ఉంచాలని తపన పడిన వ్యక్తిగా, చివరికి చదువుకి తగిన ఉద్యోగం రాకపోయినా బతుకుదెరువు కొరకు ఉద్యోగం చేసేవాడిగా తిరుపతయ్య పాత్ర కనిపిస్తుంది.

### 4.2.3. సాంబయ్య (సాంబయ్య చదువు):

సాంబయ్య చదువు నవలలో సాంబయ్యది ప్రధాన పాత్ర. చిలుకయ్యకు మొట్టమొదటి ఎలక్షన్స్ జరిగిన రోజున సాంబయ్య పుడతాడు.  తన తండ్రి ప్రోత్సాహంతో సాంబయ్య పాఠశాల చదువు ప్రారంభించాడు. అతడు పాఠశాలలో అనేక అవమానాలను ఎదుర్కొంటాడు. దళిత విద్యార్థి రాజయ్య ప్రక్కన కూర్చున్న సాంబయ్యను రాజిరెడ్డి సార్ కొడతాడు. దళితులకి దూరంగా ఉండాలని సార్ చెప్పేవాడు. అతడు బొంగురాలాట, ఖోఖో, చిర్రగోన ఆటలు బాగా ఆడేవాడు. పుస్తకాలు, నోటు పుస్తకాలు చంకలో పెట్టుకొని బడికి పోయేవాడు. పాఠశాలలో అన్ని వసతులున్న దొరల పిల్లలు అంతగా చదువుకునేవారు కాదు. వెంగళరావు దొర కొడుకు ఐదవ తరగతిలోనే చదువు ఆపేశాడు. కొండల్ రెడ్డి దొర తన కొడుకు కిషన్ రెడ్డిని సాంబయ్యతో కలిసి చదువు కొమ్మని చెప్తాడు. దొర కొడుకునే తన దగ్గరకు పంపించేంత జ్ఞానం సంపాదిస్తాడు సాంబయ్య. కొండల్ రెడ్డి ఇంటికి వెళ్ళి చదువుకొని రావడంవల్ల సాంబయ్యకు అంతవరకు తమ లాంటి కుటుంబాల వాళ్ల స్థితిగతులు, సంస్కృతి, సాంప్రదాయాలు మాత్రమే తెలిసేవి. ఇప్పుడు ఆర్థికంగా, అధికారంగాను బాగున్నవారి కుటుంబాల గూర్చి తెలుసుకునేందుకు అవకాశం కలిగింది. కిషన్ రెడ్డితో కలిసి సాంబయ్య పట్వారింటికి, వెంగళరావు ఇంటికి, రాజారావు ఇంటికి వెళ్లేవాడు. అందువల్ల మరిన్ని విషయాలపై అతనికి అవగాహన కలిగింది.

సాంబయ్య తన తండ్రి ద్వారా కీర్తనలు నేర్చుకున్నాడు. అలాగే పోతులూరి వీరబ్రహ్మంగారి కథలు కూడా నేర్చుకున్నాడు. అలాంటి సమయంలో మల్లేశం అనే ఉపాధ్యాయుడు సాంబయ్యకు వీరేశలింగం, రాజారాం మోహన్ రావు, గురజాడల గూర్చి చెప్పేవాడు. మల్లేశం బోధనల వల్ల సాంబయ్యలో హేతువాద బీజాలు నాటుకున్నాయి. ఎనిమిదివ తరగతి కాగానే సాంబయ్య సుశీలను పెళ్లి చేసుకుంటాడు. తరువాత మళ్లీ సాంబయ్య చదువటం మొదలుపెడతాడు.

ఇందిరా గాంధీ కరీంనగర్ కు వచ్చిన రోజున కొంతమంది పిల్లలతో కలిసి కాలి నడకన ఆమెను చూడటానికి వెళ్తాడు.  కబుర్లు చెప్పుకుంటూ ఉత్సాహంగా నడుస్తున్న ఆ పిల్లలు ఊర్లకూర్లే దాటి వెళ్ళుతున్నారు. పచ్చని పొలాలు, చేలు, చిన్న చిన్న కాలువలు దాటుతూ వెళ్తూనే ఉన్నారు. చదువుకుంటూ వ్యవసాయపు పనులు చేసే అలవాటున్న ఆ పిల్లలకు ఆ నడక లెక్కలోకే రావడంలేదు. కాళ్లు నొస్తున్న, దుమ్ముధూళితో పాదాలు నిండిపోతున్న వాళ్ల గమ్యం చేరడానికి నడుస్తూనే ఉన్నారు. పోలీస్ గ్రౌండుకు చేరుకున్నారు. ఇందిరా గాంధీని చూసి, ఆమె ఉపన్యాసం విని వచ్చారు. సాంబయ్యకు ఆ ప్రయాణం గొప్ప అనుభవంగా, జీవితంలో ఒక ముద్ర వేసింది.

సాంబయ్య తండ్రి చెప్పిన పనులు చేసుకుంటూ HSC చదివే సమయంలో జై తెలంగాణ ఉద్యమం ప్రారంభమయ్యింది. ఆ ఉద్యమంలో పాల్గొంటూ కొన్ని విషయాలను తెలుసుకున్న సాంబయ్య ఒక్కోసారి ప్రత్యేక తెలంగాణ అవసరమేమో అని కూడా అనుకోకపోలేదు. ఇటు చదువుతో సతమతమవుతున్న సాంబయ్యకు బడి మూతపడటం వల్ల విరామం దొరికింది. ఓ దిక్కు దుర్భరమైన కరువు, మరో దిక్కు పాఠశాల బంద్ వల్ల సాంబయ్య పరిస్థితి గందరగోళంగా మారినట్లు అనిపిస్తుంది. అతనికి సంవత్సర కాలంగా దొరికిన విశ్రాంతి, గడించిన అనుభవాలు, ఇంత కాలంగా చూసిన జీవితం, తండ్రి బతుకు, ఊళ్లో జరుగుతున్న సంఘటనలు, చదువుకున్న పుస్తకాలు సాంబయ్యలో ఎన్నో ఆలోచనలను కలిగిస్తున్నాయి. గ్రామాల్లో వస్తున్న మార్పును, క్లిష్టతరమవుతున్న ఆర్థిక పరిస్థితులు మననం చేసుకున్నాడు. కరీంనగర్లో PUCలో ప్రవేశం పొందాడు. అప్పటివరకు తెలుగు మీడియం చదివిన అతనికి ఇంగ్లీష్ మీడియంలో చేరడం కొంత ఇబ్బందిగానే ఫీలయ్యాడు. సాంబయ్య పట్టణ జీవితానికి అలవాటు పడ్డాడు. వివిధ ప్రాంతాలనుండి వచ్చిన వారితో పరిచయం పెంచుకున్నాడు. లైబ్రరీలో అతడు వివిధ పత్రికలను చదివేవాడు. విద్యార్థి యూనియన్ ఎన్నికలలో జరుగుతున్న ఘర్షణలను చూస్తూ సాంబయ్య చదువే ధ్యేయంగా పెట్టుకొని ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా చదువుకున్నాడు. అతడు PUCలో ఉత్తీర్ణుడై కరీంనగర్ లోనే B.Sc.లో చేరాడు. సాంబయ్యతోపాటు ఈశ్వర్, వేణు, సారథి, చక్రపాణిలు రూములో ఉండేవారు. సాంబయ్య తల్లిదండ్రులకు బాసటగా నిలవాలని గుర్తు చేసుకుంటూ చదివేవాడు. సాంబయ్యను అతడి స్నేహితుడు ఈశ్వర్ కమ్యూనిస్టు భావజాలం ఉన్న పుస్తకాలు చదవాలని చెప్పుతుంటాడు. కానీ సాంబయ్యకు అవంటే భయమని చెప్పి వాటికి దూరంగా ఉండేవాడు. తను వేణు వల్ల అవసరాల్లో ఆర్థిక ఇబ్బందుల్లో పుట్టి పెరిగిన పిల్లలకు మెంటల్ మెచ్యూరిటీ తొందరగా వస్తుందన్న విషయాన్ని గ్రహించాడు. సాంబయ్య కాలేజీలో అనేక అనుభవాలను పొంది డిగ్రీ పూర్తిచేశాడు. నిరుద్యోగిగా ఉన్న సాంబయ్య జిల్లా పరిషత్ ఎంప్లాయిమెంట్ ఆఫీసుకు వెళ్లి ఉద్యోగం కోసం ప్రయత్నం చేస్తాడు. అతన్ని ఇంట్లోని ఆర్థిక పరిస్థితులు ఇబ్బంది పెడుతున్నాయి. అతడు తల్లిదండ్రుల కోరిక మేరకు పెళ్లి చేసుకుంటాడు. సాంబయ్య ఎంతో మానసిక వేదనను అనుభవిస్తాడు. పెళ్లయిన రెండు నెలల్లో అతనికి ఉపాధ్యాయునిగా ఉద్యోగం వస్తుంది. అతడు కుటుంబ కష్టాలను తీర్చాలనుకుంటాడు. కొంత కాలం ఉద్యోగం చేసిన తరువాత భార్య ప్రోద్బలంతో ఉన్నతంగా బతకాలన్న భార్య వేధింపులను భరించలేక మరో ఉద్యోగానికి అప్లై చేస్తాడు. అతడు గోదావరిఖని ఫెర్టిలైజర్ ఫ్యాక్టరీలో ఉద్యోగం

సంపాదిస్తాడు. ఉపాధ్యాయ వృత్తికి రాజీనామా చేసి ఆ ఉద్యోగంలో చేరుతాడు. మంచి జీతం రావడం వల్ల ఉన్నత స్థాయికి చేరుకుంటాడు. కొన్ని సంవత్సరాలు గడిచాయి. సాంబయ్యకు పిల్లలు పుడతారు. సాంబయ్య తండ్రి ఊరిలోనే వ్యవసాయం చేసుకుంటూ బతుకుతుంటాడు. అతడు కొంత అప్పు ఉంటే తీరుస్తాడు. తల్లిదండ్రులకు అతడు నామమాత్రంగానే డబ్బు పంపిస్తుంటాడు. అతడు పిల్లలు, భార్య, ఉద్యోగం అని వాటివరకే పరిమితం కావడం సాంబయ్యకు ఇబ్బందిగా అనిపిస్తుంది. ఉద్యోగం చేస్తూ పదేళ్లు గడిచాయి. సాంబయ్య అప్పుడు చాలామంది మధ్యతరగతి జీవుల్లాగే తాను మధ్యతరగతి ఊబిలో దిగి బతుకుతున్నాడని అర్థం చేసుకుంటాడు. అతడు దీపం వెలుతురులో చదివాడు కాని అతని కొడుకును ట్యూబులైట్ వెలుతుర్లో చదివిస్తున్నాడు. అతనికి లేని వసతులను కొడుకుకు కల్పిస్తున్నాడు. సాంబయ్య ఈ చదువులు పరాయికరణకు గురి చేస్తున్నాయని గమనిస్తుంటాడు. అతడు మంచి ఉద్యోగం రావాలనే లక్ష్యాన్ని దృష్టిలో పెట్టుకొని పిల్లలను చదివిస్తున్నాడు. సాంబయ్య పిల్లలను ఒకరిని డాక్టరును, మరొకరిని కలెక్టరును చేయాలని కలలు కంటూ జీవిస్తుంటాడు.

వెనుకబడిన తరగతికి చెందిన సాంబయ్య చదువుకొని దొరల చేత గౌరవం పొందినవాడిగా, తల్లిదండ్రులకు తగిన సౌకర్యాలు కల్పిస్తూ వారిని గౌరవంగా చూసుకున్న వ్యక్తిగా, చదువు వల్ల ఉన్నత స్థాయికి ఎదిగిన ఒక వెనుకబడిన తరగతి వర్గానికి చెందిన వ్యక్తిగా, పిల్లల భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దాలని తపనపడే వ్యక్తిగా సాంబయ్య పాత్ర చిత్రించబడింది.

### 4.2.4. వెంగళరావు (సాంబయ్య చదువు):

సాంబయ్య చదువు నవలలో వెంగళరావుది ప్రధాన పాత్ర. వెంగళరావు ఊరిలో ఒక దొరగా ఉండేవాడు. వెంగళరావుని చుట్టుప్రక్కల ఉన్న నాలుగైదు ఊర్లవారు జమీందారని, దొరని పిలుస్తారు. అతనికి ధనబలంతోపాటు, అంగబలం కూడా ఉంది. అతనికి ఎదురుగా మాట్లాడటానికి అందరూ భయపడేవారు. వెంగళరావు కొడుక్కి చదువు చెప్పడానికి వెంకటయ్య పంతులుతో బడిని అతని ఇంటి వద్దనుండే నడిపించేవాడు. అతడి కొడుకు శ్యాంరావుకు బడికి పోవడం ఇష్టం ఉండదు. అతడు కొడుక్కి చదువు రాకపోవడం వల్ల తిడితే ఏమంటాడో అని వెంకటయ్య పంతులు భయపడేవాడు. దొరకు కోపమొస్తే పట్టపగలే చంపి నడిబజార్లో పాతిపెట్టినా అడిగే నాథుడే లేడని వెంకటయ్య భయపడేవాడు. దొర ఆగ్రహానికి గురై ఎంతో మంది దెబ్బలు తినడం చూశాడు. వెంగళరావు పడక కూర్చీ నుండి లేచి గంభీరంగా నడుస్తూ బడి దగ్గరకు వస్తాడు. అతని మొలకు ధోతుంది. శరీరంపై ఆపారం అంగీ ఉంది. అతడి మీసాలు పెద్దవిగా

ఉంటాయి. వెంకటయ్య దొరను చూసి వినయంగా నిలుచున్నాడు. వెంగళరావు స్వాతంత్ర్యం వచ్చిందని చిన్న పెద్ద లేకుండా అందరి పిల్లలను ఒక్కటే స్థలంలో కూర్చోపెట్టావు అని, మాదిగ పిల్లలను దూరంగా కూర్చోబెట్టు అని, వారు ఎప్పుడు దూరంగా ఉండాల్సిందేనని కోపంతో వెంకటయ్యకు చెప్తాడు. వెంకటయ్య దొర కోపాన్ని చూసి వెంటనే మాదిగ పిల్లవాడైన నరసింహను దూరంగా కూర్చో పెడ్తాడు. వెంగళరావు నెలరోజుల్లో శ్యాంరావుకు అక్షరాలు రావాలని అతడు మంచిగా చదివేటట్లు చెప్పు అని వెంకటయ్యకి చెప్పి వెళ్ళిపోతాడు. ఉద్యోగి అయిన వెంకటయ్య పంతులుని కూడా దొరలు తిట్టడం వారి అహంకారానికి నిదర్శనంగా అనిపిస్తుంది.

చాకలి బక్కమ్మ భర్త చనిపోతే మేనమామ కొంరయ్యతో చనువుగా ఉంటూ గర్భవతి అవుతుంది. ఆమె కులంవారు పంచాయితీ పెట్టడంతో దానికి పెద్దగా వెంగళరావు వస్తాడు. కొంరయ్య ఆమెను పెళ్లి చేసుకుంటానని చెప్తాడు. కొంరయ్య మాటలు వినకుండా వెంగళరావు ఊరికి కొన్ని కట్టుబాట్లు ఉంటాయని చెప్పి కొంరయ్య, బక్కమ్మలను కులం నుండి బహిష్కరించాలని అంటాడు. వీరిని ఊరికి దూరంగా వెళ్లమని తీర్పు చెప్పుతాడు. వారు వెంగళరావు కాల్ల మీద పడి బతిమిలాడితే కొంత డబ్బును కట్టి ఉండమని వెంగళరావు మరల తీర్పు చెబుతాడు. కొంరయ్య వెంగళరావుకి ఎదురుతిరుగుతాడు. వెంగళరావు కోపంతో కొంరయ్యను ఇష్టమొచ్చినట్లు కొట్టిస్తాడు. కొంరయ్యకు అన్నం, నీళ్లు పెట్టకుండా రాత్రంతా అలాగే ఉంచాలని, సంవత్సరం వరకు వారిని కులంలోకి రానివ్వొద్దని చెప్పి వెంగళరావు వెళ్లిపోతాడు.

చిలుకయ్య కొడుకైన సాంబయ్యను చదివించాలని వెంగళరావు అనుమతి తీసుకోవడానికి వెళతాడు. వెంగళరావు చిలుకయ్యను అరగంటపాటు ఇంటి ముందరే కూర్చునేటట్లు చేస్తాడు. వెంగళరావు పిల్లలు చదువుకుంటే మన మాట వినరని, మురికి ఇండ్లలో ఉండరని చెప్తాడు. చిలుకయ్య ఎన్ని విధాలుగా చెప్పినా వెంగళరావు సాంబయ్యను చదివించకుండా ఉండాలనే ప్రయత్నం చేస్తుంటాడు. సాంబయ్యను నాకు పాలేరుగా ఉంచు నీకు ఆర్థికంగా ఇబ్బంది లేకుండా చేస్తానని చెప్తాడు. చివరికి చిలుకయ్య వెంగళరావుని ఒప్పించి సాంబయ్యను చదివిస్తానని చెప్పి వెళతాడు. వెంగళరావు అతడు చదువుకుంటే జ్ఞానాన్ని పొందుతాడని వద్దని చెప్తాడు. కొన్ని సంవత్సరాలు తరువాత గ్రామంలో వచ్చిన చైతన్యం వల్ల వెంగళరావు ఊరి వదిలి పారిపోతాడు. జమీందారుగా, దొరగా చదువుకొని ఉద్యోగంలో ఉన్న వ్యక్తిపై మర్యాదగా ప్రవర్తించలేనివాడిగా, అహంకారిగా తప్పుడు తీర్పు చెప్పే పెద్ద మనిషిగా వెంగళరావు పాత్ర చిత్రించబడింది.

### 4.2.5. అయిలయ్య (మాట్లాడే బొమ్మలు):

మాట్లాడే బొమ్మలు నవలలో అయిలయ్యది ప్రధాన పాత్ర. అయిలయ్య దిగువ మధ్యతరగతి వ్యవసాయ కుటుంబానికి చెందినవాడు. అతడు పదవ తరగతి వరకు చదువుకున్నాడు. అతని తండ్రి చనిపోవడం వల్ల ఆర్థిక పరిస్థితి బాగాలేక చదువు మానేశాడు. అతడు వ్యవసాయం చేస్తూ స్థిరపడ్డాడు. గ్రామాల్లో ఉధృతమవుతున్న ప్రత్యేక తెలంగాణ, ఆంధ్ర ఉద్యమాలను చూశాడు. అయిలయ్యకు రాజమ్మ, సరోజిని కూతుర్లు. శ్రీనివాస్ కొడుకు. అయిలయ్య తన చెల్లి సరస్వతిని సాంబయ్యకిచ్చి వివాహం చేస్తాడు. అయిలయ్యకు చెల్లెల్ని బాగా చూసుకుంటున్న బావ సాంబయ్య పై ఎనలేని గౌరవ మర్యాదలు ఉంటాయి.

అయిలయ్య పిల్లలను బాగా చదివించాలనుకుంటాడు. చదువుతోనే తెలివి, జ్ఞానం పెరుగుతుందని నమ్మిన వ్యక్తి అయిలయ్య. అతని ఇద్దరు ఆడపిల్లలు తొమ్మిది వరకు చదివారు. వారికి చదువుపై ఆసక్తి లేకపోవడంతో చదువు మాన్పించాడు. కొంత కాలం తరువాత అయిలయ్య ఇద్దరికి పెళ్లి చేశాడు. అయిలయ్య ఎంత కష్టపడయినా సరే కొడుకును మంచిగా చదివించాలనుకుంటాడు. అతడు వ్యవసాయం చేస్తూ కొడుకు చదువు గురించి అంతగా పట్టించుకోలేకపోతాడు. కొడుకు అంతంత మాత్రంగా చదువుతుంటాడు. తమ ప్రాంతంలో జరుగుతున్న పోరాటాల ప్రభావం అతని కొడుకుపై పడుతుంది. ఉద్యమ పోరాటాల ద్వారా ఎంతో మంది యువకులు బలైపోతారు. దొరతనాలు తగ్గాయి. కాని అయిలయ్య లాంటి వ్యవసాయదారుడి పరిస్థితిలో ఏ మార్పు కనిపించడం లేదు. అయిలయ్య కొడుకు హైస్కూల్ చదువుతూ పోరాటాలకు దగ్గర అయ్యాడు. అయిలయ్యకి కొడుకు శ్రీనివాస్ ప్రవర్తనలోని మార్పు నచ్చడం లేదు. పోరాటాలు, ఎన్నికలు, యూనియన్లు వంటి వాటిలో పాల్గొనకుండా బాగా చదువుకొని ఉన్నత స్థితికి రావాలని అయిలయ్య కొడుక్కి చెప్పేవాడు. శ్రీనివాస్ బాగా చదవకపోవడంతో అయిలయ్య చదువు మాన్పించాలనుకుంటాడు. తండ్రి కొడుకులు వాదోపవాదాలు చేసుకుంటారు. ఎవరికి వారు సమర్థించుకోవడానికి రకరకాలుగా ప్రయత్నిస్తుంటారు. చివరికి అయిలయ్య కొడుకుని చదివిస్తాడు.

అయిలయ్యకు కొడుకుపై ఎంతో ప్రేమ ఉన్నా ఉద్యోగాలు వచ్చిన తరువాత తల్లిదండ్రులను వదిలిపెట్టి వెళ్తున్న పిల్లలను చూస్తుంటే అతనికి భయంగా ఉండేది. శ్రీనివాస్ పెద్ద చదువులు చదివి తనకు అందకుండా దూరంగా వెళ్తాడేమోనని అయిలయ్య భయపడేవాడు. అయిలయ్య ఆర్థికంగా ఇబ్బంది పడుతూనే శ్రీనివాస్ ను డిగ్రీ మరియ పి.జి. చదివించి బ్యాంకు కోచింగుకి పంపిస్తాడు. శ్రీనివాసుకు ఉద్యోగం వచ్చిన తరువాత కుటుంబాన్ని పట్టించుకోడు. అయిలయ్య అనుకున్నట్టుగానే

కొడుకు దూరం అవుతున్నాడని బాధపడేవాడు. అయిలయ్య కొడుకు కోడలు వస్తున్నారని తెలుసుకొని బస్టాండుకు బావను తీసుకొని వెళ్తాడు. వారు ఎంతసేపు చూసిన కొడుకు కోడలు రాకపోవడంతో బాధపడతాడు. అయిలయ్య వృద్ధాప్యంలో ఉన్నాడు. కొడుకు గురించి ఆలోచిస్తూనే ఉంటాడు. చదువు కొరకు వెళ్లి ఉద్యోగాలు వచ్చిన తరువాత రెక్కలొచ్చిన పక్షుల్లా ఎగిరిపోతూ ఊరికి, తల్లిదండ్రులకు దూరం అవుతున్న ఎంతో మంది మాదిరిగానే శ్రీనివాస్ కూడా అలానే చేశాడని అయిలయ్య బాధపడ్డాడు. అయిలయ్యకు కొడుకు పెళ్లి చేసుకున్నప్పుడే అతని మీద నమ్మకం పోయింది. తన అదృష్టం ఎలా ఉంటే అదే అవుతుందని అనుకొని తనను తాను సంతృప్తిపరుచుకోవడానికి ప్రయత్నిస్తున్నా అది సాధ్యం కావడం లేదు. అయిలయ్య చదువు తరాల మధ్య అంతరాన్ని పెంచుతుందని బాధపడ్తాడు. అయిలయ్య కొడుకు కొరకు ఇంటి ముందర కూర్చొని ఎదురుచూస్తునే ఉంటాడు.

వ్యవసాయదారునిగా, కుటుంబాన్ని పోషిస్తున్న వ్యక్తిగా, చదువుకుంటే జ్ఞానం, తెలివి వస్తాయని నమ్మిన వ్యక్తిగా కష్టపడి కొడుకును చదివించిన తండ్రిగా అయిలయ్య పాత్ర తీర్చిదిద్దబడింది.

### 4.2.6. సాంబయ్య (మాట్లాడే బొమ్మలు):

మాట్లాడే బొమ్మలు నవలలో సాంబయ్యది ప్రధాన పాత్ర. సాంబయ్య గ్రామంలో తల్లిదండ్రులతో ఉంటూ చదువుకుంటాడు. అతడు బాగా చదువుకొని ఉన్నతంగా బతకాలని సమాజానికి సేవ చేయాలని అనుకునేవాడు. తెలంగాణ ఉద్యమం, కమ్యూనిస్టుల పోరాటాలు జరుగుతున్న సమయంలో అతడు డిగ్రీ పూర్తి చేశాడు. అతని మిత్రులు కొంతమంది చదువును వదిలివేసి వెళ్లారు. సాంబయ్య పుట్టి పెరిగిన వాతావరణం, గ్రామంతో, తల్లిదండ్రులతో ఉన్న సంబంధాలు అతనిలో చోటు చేసుకున్న భయాలు సాంబయ్యను పోరాటాల వైపు వెళ్లకుండా చేశాయి. అతని పై చారిత్రక పురుషుల, సంఘ సంస్కర్తల ప్రభావముంది. ఆ ప్రభావంతోనే సమాజానికి ఉపయోగపడాలనుకుంటాడు. ఆదర్శాలను అమలుచేయడం కష్టమని అతనికి అర్థమయితుంది. పోరాటాల వల్ల సానుభూతి, ఆదర్శాల వేడి, ఉద్యోగాన్వేషణలో కలుగుతున్న అనుభవాలతో తాను చదివిన చదువు గురించి ఆలోచిస్తాడు. సాంబయ్యను తండ్రి పెళ్లి చేసుకోమని పోరు పెడుతాడు. అయిలయ్య చెల్లెలు సరస్వతిని సాంబయ్య వివాహం చేసుకుంటాడు. అతనికి ఆర్థిక కష్టాలు పెరుగుతాయి. ఉద్యోగం చేయాలని ప్రయత్నాలు చేస్తుంటాడు.

సాంబయ్య ఎంప్లాయిమెంట్ ఆఫీసులో ఉద్యోగం కొరకు దరఖాస్తు చేసుకుంటాడు. అతనికి పెళ్లయిన కొంత కాలానికి ఉపాధ్యాయ ఉద్యోగం వస్తుంది. అతడు నిజామాబాద్ జిల్లా పరిషత్ పాఠశాలలో ఉపాధ్యాయునిగా ఉద్యోగంలో చేరుతాడు. అతడు కాపురాన్ని అక్కడికి మారుస్తాడు. అతడిని ఊరివాళ్లు చులకనగా చూస్తుంటారు. బతకలేనివాడు బడిపంతులు అంటూ అవమానిస్తారు. అయినా అతడు మనస్ఫూర్తిగా ఉద్యోగ బాధ్యతలను నిర్వర్తిస్తాడు. సాంబయ్య భార్య, ఆమె కుటుంబంలోని వారు మరొక ఉద్యోగానికి ప్రయత్నం చేయమని చెప్పి అతన్ని ఇబ్బంది పెడ్తారు. భార్య కొరకు ఫెర్టిలైజర్ ఫ్యాక్టరీలో ఓవర్ మెన్ గా ఉద్యోగంలో చేరుతాడు. సాంబయ్య ఉపాధ్యాయ వృత్తికి రాజీనామా చేస్తూ బాధపడతాడు.

సాంబయ్య కాలేజీలో విద్యార్థిగా ఉన్నప్పుడు ఆదర్శ భావాలు ఉండేవి అవి క్రమక్రమంగా తగ్గుతున్నాయి. అలాగే ఉపాధ్యాయుడిగానైనా స్థిరపడదాం అనుకుంటే అది సాధ్యం కాలేదు అని బాధపడేవాడు. అతడు ఫ్యాక్టరీలో ఉద్యోగిగా మంచి జీతంతో కెరియర్ అనే ఊబిలోకి వెళ్లాడు. అతనికి ఉద్యోగం వచ్చిన తరువాత తల్లిదండ్రులను దూరం పెడతాడు. క్రమక్రమంగా వారి మధ్య దూరం పెరుగుతుంది. చదువుకోని కుటుంబం నుండి వచ్చిన అతను చదువు వల్ల లభించిన ఉద్యోగంతో ఓ మాదిరిగా బతుకుతున్నాడు. అతడు పిల్లలను బాగా చదివించాలని నిర్ణయించుకుంటాడు. చదువుల్లో పోటీ పెరగడంతో పిల్లలను ఉన్నతస్థితిలో చూడాలని తపన పడతుంటాడు. అతని చదువు కుటుంబ సమస్యలకు గల మూలాలను గూర్చి మాత్రం చెప్పలేదు. వాటికి పరిష్కార మార్గాలను కూడా చూపలేదు.

అతడు కుటుంబానికే పరిమితమై పిల్లల చదువు, ఆర్థిక పరిస్థితి మెరుగుదల గురించి కలలు కంటున్నాడు. పిల్లలకు అమ్మ నాన్న అని పిలిస్తే ఆ పిలుపులోనే సామీప్యం ఉన్నదని చెప్పేవాడు. అతడు పల్లెలో పుట్టి పెరిగినా, తనకు పల్లెంటే ప్రేమాభిమానాలు ఉన్నా తన పిల్లలు క్రమక్రమంగా పల్లె జీవితానికి దూరం అవుతున్నారని బాధపడేవాడు. ఈ చదువుల్లో వస్తున్న మార్పులు మన సంస్కృతినే పరాయికరిస్తున్నట్లు ఉందని సాంబయ్య అంటాడు. కృత్రిమ సంస్కృతి వ్యామోహంలో కొట్టుకుపోతున్నట్లు ఉందని అనేవాడు.

సాంబయ్య కుటుంబంతో కలిసి బామ్మర్ది అయిలయ్య ఇంటికి అప్పుడప్పుడు వెళ్లి వచ్చేవాడు. అతని పిల్లలతో కలిసి సాంబయ్య పిల్లలు ఆడుకునేవారు. వారు సరదాగా కొన్ని రోజులు అక్కడ గడిపి వచ్చేవారు. సాంబయ్య తీరిక సమయాల్లో అవసరమైతే పిల్లలకు పాఠాలు బోధించేవాడు. పోటీతత్వాన్ని పెంచే దిశగా సాగుతున్న పిల్లల చదువు గూర్చి అసంతృప్తిగా ఉండేవాడు.

రోజురోజుకు ప్రైవేట్ పాఠశాలలు పెరగడంతో పిల్లల చదువులు కాస్తా తల్లిదండ్రుల చదువులుగా మారడం చూస్తున్నాడు. కొంతకాలం గడిచింది. సాంబయ్య పిల్లలు కవిత డాక్టర్ కోర్స్ పూర్తి చేస్తుంది. ఆనంద్ I.A.S. కోచింగ్ తీసుకుంటున్నాడు. సాంబయ్య పిల్లల విషయంలో, కుటుంబం ఎదుగుదల విషయంలో సంతృప్తికరంగానే ఉంటాడు. సాంబయ్య లాంటివారు పిల్లలు, కుటుంబం అంటూ ఇంటికే పరిమితమై ఉండటం ఎంతవరకు సమంజసమోనని అతనికి అర్థం కావడం లేదని అనుకుంటాడు. సాంబయ్య చదువు పరాయీకరణకు గురి అవుతుందని, మాట్లాడే బొమ్మలను తయారుచేస్తున్నాయని అనుకుంటాడు. సాంబయ్య బామ్మర్ది అయిలయ్య కొడుకు కొరకు వెళ్లి అక్కడే అతని రాక కోసం ఎదురు చూస్తాడు. కొంత కాలం తరువాత సాంబయ్య నా పరిస్థితి కూడా ఇలాగే ఉంటుందేమోనని అనుకుంటాడు.

ఉద్యోగిగా, గ్రామంపై అప్యాయతానురాగాలు కలవాడిగా, మంచి భర్తగా, పిల్లల ఎదుగుదలను కాంక్షించిన తండ్రిగా, చదువుకొని సంస్కారంగా బతుకుతున్న వ్యక్తిగా సాంబయ్య పాత్ర చిత్రించబడింది.

### 4.2.7. బుచ్చయ్య (మాదిగ విజయం):

'మాదిగ విజయం' నవలలో ప్రధాన పాత్ర బుచ్చయ్యది. సూర్యారావు దొర దగ్గర పాలేరుగా ఉంటూ గ్రామంలో చెప్పులు కుట్టుకొని బతికేవాడు. కష్టపడుతూ తన పిల్లలను చైతన్యవంతం చేసిన పాత్ర బుచ్చయ్యది. భూమే తమ విముక్తి మార్గమని నమ్మిన బుచ్చయ్య ఆ నమ్మకాన్ని కొడుకు పేరయ్యలో బలంగా నాటగలిగాడు. పీడితుడు అయిన బుచ్చయ్య పాత్రను ఎంతో చక్కగా కాలువ మల్లయ్య చిత్రించాడు.

బుచ్చయ్య ఇల్లు మాదిగవాడ మధ్యలో ఉండేది. అతడు ఇంటి ముందర పందిరి కింద కూర్చొని చెప్పులు కుట్టుకునేవాడు. సూర్యారావు ఆదేశాల మేరకు కొడుకును తీసుకొని బుచ్చయ్య అతని ఇంటికి వచ్చాడు. అతని కాళ్లకు చెప్పులు లేవు. ఊరందరికి చెప్పులు కుట్టిచ్చేవాడయినా దొరల దగ్గరకు వచ్చేటప్పుడు చెప్పులు వేసుకునేవాడు కాదు. బుచ్చయ్య సూర్యారావు దొర దర్వాజ దాటుతూనే తలమీదున్న తలపాగా (రుమాలు)ను తీసి చేతిలో పట్టుకున్నాడు. దండాలు బాంచెన్ అంటూ నమస్కరించి ఓ మూలన కూర్చొన్నాడు. దొరల దగ్గర పాలేర్లు, వారికి బానిసలుగా ఎలా ఉంటారో ఈ పాత్ర తెలియజేస్తుంది. దొరకు తాళ్లు, తలుగులు, చీపుర్లు, పగ్గాలు మొదలైనవి బుచ్చయ్య తెచ్చి ఇచ్చేవాడు. ఎన్నో సంవత్సరాలుగా బుచ్చయ్య కుటుంబం పాలేర్లుగా ఉంటున్నా వారికి పీడన మాత్రం ఆపడం లేదు. దొర తన తండ్రి రామయ్య చేసిన అప్పును సాకుగా చూపి

బుచ్చయ్యతో పనిచేయించుకుంటున్నాడు. ఏండ్లకు ఏండ్లు గడిచిపోతున్నాయి కానీ అప్పు మాత్రం తీరడం లేదు. బుచ్చయ్య పెద్ద కొడుకు వెట్టివాడుగా చేరాడు. చిన్న కొడుకు పాలేరు అయ్యాడు. మేనకోడలు దొరింట్లో దాసీ అయింది.

నిజాం నవాబు పన్నులు కట్టించుకోవడానికి సుంకరి, పటేల్లను పంపేంచేవాడు. సుంకరి సాయిలు బుచ్చయ్యకు పన్నులు కట్టించుకోవడానికి అధికారులు వస్తున్నారని చెప్పి డప్పు చాటింపు చెయ్యమని చెప్పుతాడు. అప్పుడు బుచ్చయ్య చాటింపు ద్వారా ఈ విధంగా తెలియజేస్తాడు "విన్నోల్లైవలో, విననోల్లైవలో... అందరు చెవులు వెట్టి మండిగినుండ్రి... మల్ల మాకు తెలువదంటె పెద్దోల్లూ కుండరు... రేపు నిజాం నవాబు మనుషులు తాసీలు వసూలు కత్తున్నరట... నాలుగైదు రోజులుంటరట... అందరు తాసీలు కట్టన్నట... కట్టనోల్లకు దండుగ లేత్తరట... ఏ కులపోల్లేం జెయ్యన్నో దొరలు సెప్పుతరట... రేపు కులానికిద్దరన్న కచ్చీరు కాడికచ్చి పోలీసు పటేలు దొరను కలుసుకోవన్నటో హో..." (మల్లయ్య, కాలువ.2015:పుట.53) అంటూ డప్పు చాటింపు చేస్తూ ఊరంతా తిరుగుతాడు.

బుచ్చయ్య తన మనవన్ని ఎంతో ఇష్టంగా చూసుకునేవాడు. తన కొడుకు పేరయ్య డబ్బు సంపాదించడానికి ఇతర ప్రాంతానికి వెళ్లిన తరువాత వారి బాధ్యతలను మొత్తం బుచ్చయే చూసుకునేవాడు. వారిని బడికి పంపించేవాడు. బుచ్చయ్య బడికిపోతున్న మనవన్ని భుజాలమీద ఎక్కించుకొని తీసుకొనిపోయేవాడు. తమ వంశంలోనే కాదు ఆ ఊరి నుండి చదువుకుంటున్న మొదటి వ్యక్తి తన మనవడు ఎల్లయ్య అని ఆనందపడేవాడు. బడికి పోతున్న కొద్దికాలంలోనే ఎన్నో విషయాలు నేర్చుకున్న మనువడు చాలా తెలివిగలవాడు అవుతాడని బుచ్చయ్య అనుకునేవాడు. అతని కోరిక నెరవేరి చివరికి కొడుకు, మనువడు ఉన్నత స్థితికి వెళతారు. దొర ఆదేశాలతో చెప్పిన పనులు చేసేవాడిగా, నమ్మకమైన పాలేరుగా ఉంటూ, తమ కుటుంబానికి భూమి ద్వారానే విముక్తి వస్తుందని నమ్మిన పాత్ర బుచ్చయ్యది. ఈ పాత్ర తన కుటుంబంలో కొంత చైతన్యం తీసుకువచ్చి మరొక తరానికి ఆదర్శంగా నిలిచింది.

### 4.2.8. పేరయ్య (మాదిగ విజయం):

పేరయ్య మాదిగ విజయం నవలలో ప్రధాన పాత్రధారుడు. మాదిగ విజయం నవలలో దొరల దౌర్జన్యాన్ని ఎదుర్కొని, వారి పీడన నుండి విముక్తి పొందిన ముఖ్యమైన పాత్ర పేరయ్యది. తన తండ్రి బుచ్చయ్య ఒక తరంలో పీడనకు గురయ్యాడు. కొడుకైన పేరయ్యను కూడా సూర్యారావు దొర పాలేరుగా ఉండాలని చెప్పి తన కోపంతో తన తాత చేసిన అప్పుని కారణంగా చూపడంతో

పేరయ్య పాలేరుగా పనిచేస్తాడు. పేరయ్య పాలేరుగా ఉండకూడదనుకున్నా తప్పట్లేదు. పాలేర్ల బతుకులు పాడుగాను పండుగలేదు, పబ్బం లేదు రోజూ అదే పని అని తనలో తాను అనుకుంటూ పేరయ్య నాగలి దున్నేవాడు. పండుగరోజు దొర రాక కోసం పొలంలో ఎదురుచూసేవాడు. పండుగరోజు కూడా పని చెప్పిన దొరను లోలోపలే తిట్టుకుంటాడు. ఇంతలోనే దొర కొడుకు లక్ష్మణరావు అక్కడికి వస్తాడు. పేరయ్య నాగలి దున్నడం ఆపి అతని దగ్గరి కొచ్చాడు. పేరయ్య ఈరోజు పండుగ కాబట్టి తొందరగా ఇంటికి వెళ్తానని అంటాడు. లక్ష్మణరావు వినకూడని మాటలు విన్నట్టుగా ఆగ్రహంతో పేరయ్యను పరుష పదజాలంతో తిడతాడు. పేరయ్యకు ఈ తిట్లు అలవాటే అన్నట్టుగా ఉంటాడు. దొర వాకిట్లో పాలేరు తింటుంటే దొరలు అరుగుమీద కూర్చొని నీచంగా మాట్లాడుతుంటారు. పేరయ్య ఈ అవమానాలను, పీడనను ఎదుర్కొంటూ ఉంటాడు. తన పని తాను చేసుకుంటూ పీడనకు గురయిన ఈ పాత్రను ఎంతో చక్కగా చిత్రించాడు రచయిత.

పేరయ్య, ఈరమ్మను వివాహం చేసుకుంటాడు. పేరయ్య తన వివాహ సందర్భంగా పదిహేను రోజులు దొర ఇంటికి పనికి వెళ్లడు. దొరకు కోపం వచ్చి వెంటనే పనికి రావాల్సిందిగా పట్వారీతో కబురు పంపుతాడు. అయినా పనికి రానని కావాలంటే జీతం తగ్గించుకోమని బహిరంగంగా పేరయ్య చెప్పుతాడు. సూర్యారావు దొరకి తీవ్రమైన ఆగ్రహం వచ్చినా సమయం కొరకు వేచి చూస్తాడు. పేరయ్యను చావుదెబ్బ కొట్టాలని చూస్తాడు. పేరయ్య పాలేరు పని విరమించుకున్నాడు. పేరయ్యను వదులుకోవడం సూర్యారావుకి ఇష్టంలేదు. సుబ్బారావు నీకు జీతం పెంచుతా, పెద్ద పాలేరు జీతమిస్తా అని అంటాడు. ఇన్ని సంవత్సరాలు పాలేరుతనంతోనే గడిచిపోయింది అని, నేను పాలేరుగా ఉండనని కొంత భూమిని సంపాదించుకొని దున్నుతా అని అంటాడు. ఇప్పటినుండి నా ఇష్టమున్నట్లు బతుకుతా అని అంటాడు. దొర అదును చూసి పేరయ్యను దెబ్బతీయాలనుకుంటాడు. ఒకరోజు అదును చూసి పేరయ్య భార్య ఈరమ్మని లక్ష్మణరావు బలత్కరిస్తాడు. ఊళ్లో దొర, అతని కొడుకు చేసిన అవమానం భార్య రూపంలో పేరయ్యకు కనబడుతుంది. దొర కొడుకు ఈరమ్మను చెడగొట్టాడని ఊరంతా తెలియడంతో పేరయ్య వారిని ఎదురిస్తాడు. పేరయ్య బానిస బ్రతుకును వదిలేసి తన బతుకు తాను బతుకుతున్నాడు. కొంతైనా భూమి సంపాదించుకోవాలి అని భూమి సంపాదించే మార్గం కోసం వెతుకుతుంటాడు. పేరయ్య పట్వారీని బ్రతిమిలాడి, అతని సహాయంతో బీడు భూమిని కొంత తీసుకొని సేద్యం చేసుకుంటాడు. పేరయ్య ఇప్పుడు భూమికి యజమాని అయ్యాడు కాని ఇంతలోనే దొరకు తెలవడంతో ఆ భూమిని తన పలుకుబడిని ఉపయోగించుకొని లాక్కుంటాడు. పేరయ్య కష్టపడి

సాగుచేసిన భూమి అతనికి కాకుండా పోవడంతోపాటు, ఆ భూమి ఫలితం అందకుండా పోతుందని పేరయ్య నిరాశకు గురయ్యాడు. అతడు దొరను ఎదురించిన తన మనస్సు మనస్సులా ఉండట్లేదు. కష్టమో, నిష్ఠూరమో స్వంత వ్యవసాయంతో బతుకుదామనుకున్నా పేరయ్యకు దొర చర్య భరించరానిదిగా ఉంది. మళ్లీ పాలేరుగానో, కూలీగానో ఆ ఊళ్లోనే బతకడానికి పేరయ్యకు మనస్సు ఒప్పడంలేదు. దొరను చూస్తూ తనకు జరిగిన అవమానాలను మరిచిపోతూ బతకడం తన వల్ల సాధ్యం కాదనుకుంటాడు. బాగా ఆలోచించి ఓ నిర్ణయానికొచ్చాడు. తన కుటుంబాన్ని వదిలి బయటి ప్రాంతానికి వెళ్లి సంపాదించుకోవాలని అనుకుంటాడు.

ఉదయం నుండి రాత్రిదాక పనికే అంకితమై కష్టపడి కొంత డబ్బును సంపాదించుకొని ఊరికి వస్తాడు. అతను ఆ డబ్బుతో ఎకరం పొలం, ఎకరన్నర రేగడి, ఎద్దులను కొని వ్యవసాయం ప్రారంభిస్తాడు. తన రెక్కల కష్టంతో సంపాదించుకున్న డబ్బుతో స్వంత భూమికి యజమాని అయిన పేరయ్యకు ఎంతో సంతృప్తిగా ఉంది. ఇప్పుడు పేరయ్య ముందున్న మరో లక్ష్యం తన కొడుకును బాగా చదివించి ఉన్నతస్థాయికి తీసుకువెళ్లడం. పేరయ్య చాలా కష్టాలు ఎదుర్కొని కొడుకు ఎల్లయ్యను బాగా చదివించి ఉన్నత స్థాయికి చేరుకునేటట్లు చేశాడు. పేరయ్య ఎన్నో అవమానాలను ఎదుర్కొని సమాజంలో మంచి స్థితికి వచ్చాడు. తరతరాలుగా పీడితులైన దళితుల జీవనంలో వచ్చిన మార్పులు ఈ పాత్ర ద్వారా తెలుసుకోవచ్చు. దళితుల నిరంతర పోరాట పటిమను, సామాజిక గమనంలో దళితుల పాత్ర ఎలా ఉండాలో పేరయ్య పాత్ర ద్వారా తెలుసుకోవచ్చు. దొరల చేత అణచివేయబడి వారి పీడనకు గురై పోరాట స్ఫూర్తితో ఎదిగి దొరను ఎదిరించి దళితుల గమనాన్ని మార్చిన పాత్ర ఇది. దళితుడు నిరంతరం పోరాటం చేస్తూనే ఉంటాడని ఈ పాత్ర తెలియజేస్తుంది.

### 4.2.9. సారయ్య (మెతుకు పుస్తకం):

మెతుకు పుస్తకం నవలలో ప్రధాన పాత్ర సారయ్యది. సారయ్యకు భూమంటే ఇష్టం. తరతరాలుగా భూమిని నమ్ముకొని బతికిన కుటుంబం వారిది. సారయ్య డిగ్రీ చదివినా భూమితో ఉన్న అనుబంధాన్ని వదులుకోకుండా కష్ట సమయం వచ్చినప్పుడల్లా పనిచేశాడు. సారయ్య రైతు పరిస్థితి ఘోరంగా ఉండటంతో ప్రభుత్వ ఉద్యోగంలో చేరి కుటుంబాన్ని కొంతయినా ఆదుకోవాలనుకున్నాడు. అతను ఉద్యోగం చేస్తే కుటుంబ పరిస్థితులు మారే అవకాశాలున్నాయని భావించాడు. సారయ్య తండ్రి లసువయ్య కొడుకును ఉపాధ్యాయ వృత్తిలో స్థిరపడాలని చెప్పాడు. కాని సారయ్యకి ఉపాధ్యాయ వృత్తి చేయడం ఇష్టం లేదు. మంచి జీతంతో అన్ని సౌకర్యాలున్న

ఫ్యాక్టరీ ఉద్యోగంలో చేరడం అతనికిష్టం. సారయ్య తండ్రిని ఒప్పించి ఫ్యాక్టరీలో ఉద్యోగం చేయాలనుకుంటాడు. సారయ్య తన కోరికను నెరవేర్చుకున్నాడు. అతడు ఫ్యాక్టరీలో ఉద్యోగం పొందాడు. సారయ్యకు ఉద్యోగం వచ్చిందన్న ఆనందం ఒకవైపు మరోవైపు పుట్టి పెరిగిన ఊరును వదిలిపోతున్నానన్న దుఃఖంతో ప్రయాణం సాగించాడు.

సారయ్య ఫెర్టిలైజర్ ఫ్యాక్టరీలో కార్మికుడిగా చేరాడు. సారయ్య ఉద్యోగంలో చేరిన నాలుగు నెలల తరువాత తన మిత్రుడు కొంరెల్లిని కలిసి గోదావరిఖనిలో ఉన్న తన మిత్రులను కలుసుకుందామని బయలుదేరాడు. వారు దివాకర్ రెడ్డి, అరుణ్ కుమార్ లతో కలిసి గోదావరి ప్రాంతమంతా తిరిగారు. ఆ ప్రాంత అభివృద్ధి గురించి వారు మాట్లాడుకున్నారు. సారయ్య మిత్రులతో మనమంతా పల్లెటూరి నుండి వచ్చిన వాళ్లమే ఇప్పటికి మన ఊళ్లోని ఇళ్లల్లో ఫ్యాన్లు కూడా లేవు. మనం అన్ని వసతులున్న కాలనీకి రావడం గొప్పే అని అంటాడు. సారయ్య ఎఫ్.సి.ఐ.లో ఉద్యోగం దొరకడం అదృష్టంగా భావిస్తాడు. ఎఫ్.సి.ఐ. ఉత్పత్తి ప్రారంభిస్తే ఆసియాలోనే అతి పెద్ద కోల్ బెస్డ్ టెక్నాలజీతో యూరియాను ఉత్పత్తి చేసే కర్మాగారమవుతుంది. వెనుకబడిన ప్రాంతమైన తెలంగాణలో కట్టబడిన ఈ కర్మాగారం రామగుండం ఎరువు తెలంగాణకు పరువవుతుందని మిత్రులతో సారయ్య చెప్పాడు. సారయ్య మిత్రులతో కలిసి తిరుగుతూ అక్కడున్న అందమైన పార్కులు, రోడ్లు, వెలుగులతో ఉన్న ఫ్యాక్టరీ, నూతన వసతులున్న కాలనీలు చూస్తున్నాడు. ఉద్యోగం చేస్తూనే జవహార్ నగరులో  షాపింగ్ చేయడం, షేర్లు, మార్కెట్ కంపెనీలు, వెహికిల్స్ కొనుక్కోవడానికి లోన్లు ఇవ్వడం లాంటివి, వస్తు వినిమయ సంస్కృతితో పారిశ్రామిక ప్రాంతం కళకళలాడటం చూస్తున్నాడు. సారయ్య కార్మికులలో వచ్చిన చైతన్యం గురించి,  టౌన్ షిప్ అందాలను గురించి  మిత్రులతో చర్చిస్తున్నాడు. అతడు ఉద్యోగంలో చేరిన తరువాత సారయ్య కుటుంబ ఆర్థిక పరిస్థితి కొంత మెరుగుపడింది. గత కొన్ని సంవత్సరాలుగా కార్మిక వర్గంపై పడుతున్న వేట్లు, ఎవరికీ అర్థంకాని ఆర్థిక విధానాలు కార్మిక వర్గాన్ని సంక్షోభంలోకి నెట్టాయి. దాని ఫలితంగానే పారిశ్రామిక ప్రాంతం కళను కోల్పోతుంది. అందులో భాగంగానే ఎఫ్.సి.ఐ. ఫ్యాక్టరీ మూసివేత కార్యక్రమం జరిగింది. ఫ్యాక్టరీ మూతపడటంవల్ల సారయ్య ఉద్యోగాన్ని కోల్పోయాడు. వాలంటరీ సెపరేషన్ స్కీమ్ కింద కొంత డబ్బును ఫ్యాక్టరీ అధికారులు అతనికి అందజేశారు.

సారయ్య ఇరవై ఏడు సంవత్సరాల తరువాత ఉపాధి కోల్పోయి ఊరిలోకి బతకడానికి అడుగుపెట్టాడు. ఒక తరం కూడా పూర్తిగా గడవకముందే మళ్ళీ ఊళ్లోకి రావడం సారయ్యకు

బాధగా అనిపించింది.  ఉద్యోగం వచ్చిన తరువాత ఊరుతోని ఉన్న సంబంధాలను వదులుకోలేదు. బతుకుదామని పోయిన సారయ్యకు బతుకుదెరువు కరువయితే పుట్టినూరే మళ్లీ అప్యాయంగా దగ్గరకు తీసుకుంది. సారయ్య ఊళ్లో వస్తున్న మార్పులను గమనిస్తున్నాడు. ఊరు అభివృద్ధిని చూసి మురిసిపోయాడు. సారయ్య కొంతకాలం తరువాత తన తండ్రి కాలంనాటి పెంకుటిల్లుకు కొన్ని మార్పులు చేశాడు. సారయ్య రెండు ఎకరాల భూమి కొన్నాడు. గృహప్రవేశానికి మిత్రులందరిని పిలిచాడు. సారయ్య మిత్రులతో తన యాభై ఏళ్ల కాలంనాటి జ్ఞాపకాలను వారితో పంచుకున్నాడు. సారయ్య కుటుంబంతో ఆనందంగా గడుపుతున్నాడు. సారయ్యకు భూమితో ఉన్న అనుబంధం వల్ల ఉద్యోగాన్ని కోల్పోయిన తరువాత వ్యవసాయం చేసుకుంటూ కాలం గడిపేవాడు. సారయ్య పాత్ర మన మూలాలను మరవకూడదని సందేశాన్ని ఇస్తుంది. తండ్రి మాటను జవదాటనివాడిగా, స్నేహానికి విలువనిచ్చే వ్యక్తిగా, ఫెర్టిలైజర్ ఫ్యాక్టరీలో ఉద్యోగిగా, ఉద్యోగం కోల్పోయిన తరువాత భూమిని నమ్ముకొని వ్యవసాయం చేస్తున్నవాడిగా సారయ్య పాత్ర చిత్రించబడింది.

### 4.2.10. అరుణ్ కుమార్ (మెతుకు పుస్తకం):

మెతుకు పుస్తకం నవలలో అరుణ్ కుమార్ ప్రధాన పాత్రధారుడు. అరుణ్ కుమార్ ఫర్టిలైజర్ కార్పోరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ కర్మాగారంలో ఉద్యోగిగా చేరాడు. అక్కడ అతడు ఉద్యోగ జీవితంలో కొంత మంది మిత్రులను ఏర్పర్చుకున్నాడు. దివాకర్ రెడ్డి, సారయ్య, కొంరెల్లి, భిక్షపతి మొదలైనవారితో కలిసి ఫ్యాక్టరీ చుట్టూ ఉన్న టౌన్ షిప్ తిరిగి వచ్చాడు. అక్కడున్న బంగ్లాలను, పార్కులను, రోడ్లను, బడులను చూస్తూ తిరుగుతుంటే వారికి అదో అనుభూతి. అతని మామ టౌన్ షిప్ కు వచ్చినప్పుడు వాటిని చూసి తన కూతురు ఎంతో అదృష్టవంతురాలు కాబట్టే అతనికి ఫ్యాక్టరీలో ఉద్యోగం దొరికిందని మురిసిపోయాడు. పల్లెటూరిలో క్వార్టరును చూసి మరీ ఆనందించాడు. పెంకుల ఇంటిలో ఉన్న అరుణ్ కుమార్ కు ఇవి గొప్పగానే కనిపిస్తున్నాయి. అరుణ్ కుమార్ మిత్రులతో కలిసి మనలాంటి లోయర్ మిడిల్ క్లాస్ సెక్షన్ నుంచి వచ్చిన వాళ్లకి ఈ ఉద్యోగం దొరకడం అదృష్టంగానే భావించాలని అంటాడు. ఉద్యోగం చేస్తూనే తనకు సాహిత్యం అంటే ఇష్టం ఉండటంతో రాస్తునే ఉంటాడు. అతడు క్వార్టర్సులో ఉంటూ అక్కడే కథలు రాసేవాడు. అతని ఇంటికి ప్రతిరోజు పోస్ట్ మ్యాన్ వచ్చేవాడు. రోజు ఒకటో రెండో ఉత్తరాలు ఇచ్చేవాడు. అతనికి రోజూ ఉత్తరాలు రావడం చూసి చాలామంది అసూయపడేవాళ్లు.

అతనికి క్వార్టర్సులో కిటికీ దగ్గర టేబులు ఉండేది. ఓ ఇనుప కూర్చీ ఉండేది. అరుణ్ కుమార్ ఇరవై సంవత్సరాలు ఆ కూర్చీ మీదనే కూర్చొని కథలు రాశాడు. అతడు అందర్ని నవ్వుతూ

పలకరించేవాడు. అరుణ్ కుమార్ తెలంగాణ తెలుగు సామాజిక, సాంఘిక, చారిత్రక విషయాలను అన్నింటిని అక్షరీకరించాడు. తెలంగాణ ప్రాంతానికి తన కథల ద్వారా శాశ్వతత్వం తీసుకొచ్చాడు. అతని అనేక కథల్లో ఎఫ్.సి.ఐ. ప్రసక్తి ఉండేది. ఈ పారిశ్రామిక ప్రాంతం కవులకు, రచయితలకు కేంద్రం అయింది. గోదావరిఖని, ఎఫ్.సి.ఐ., ఎన్టీపిసిలలో మిత్రులతో సరదాగా తిరుగుతూ అరుణ్ కుమార్ అన్ని గమనించేవాడు. అప్పుడే రాయడం ప్రారంభించిన అరుణ్ కుమార్ ఎన్నో విషయాలను గమనిస్తూ కార్మిక వర్గంలో 'మే'డే పట్ల ఉన్న ఆరాధనాభావం మాత్రం అతనికెంతో సంతృప్తినిచ్చింది. అరుణ్ కుమార్ షేర్లు, ఫైనాన్స్ కంపెనీలను నమ్మేవాడు కాదు. అతని మిత్రులు కొందరు వాటిలో పెట్టుబడులు పెట్టినా తాను మాత్రం ఆ కంపెనీలను నమ్మేవాడు కాదు. కొంతమంది మిత్రుల కోరిక మేరకు అరుణ్ కుమార్ ఆఫీసర్స్ ప్రెసిడెంట్ ఎన్నికలలో నామినేషన్ వేస్తాడు. అరుణ్ కుమార్ ఆఫీసర్స్ కి రావాల్సిన ప్రమోషన్లు ఇప్పించడానికి కృషి చేస్తానని, ఆఫీసర్ల ఆత్మగౌరవం కోసం పోరాడతానని ప్రచారం చేస్తాడు. న్యాయబద్ధమైన సమస్యల పరిష్కారం కోసం సర్వశక్తులా కృషి చేస్తానని అరుణ్ కుమార్ తెలియజేశాడు. కుల, మత, స్వార్థ రాజకీయాలకు అతీతంగా పోటీ చేసిన అరుణ్ కుమార్ ఓడిపోయాడు. కాని అతని పోటీ వల్ల కార్మికుల్లో చైతన్యం పెరిగిందని చెప్పవచ్చు. కొంత కాలం తరువాత ఎరువుల కర్మాగారం మూసివేయడంతో అరుణ్ కుమార్ చాలా బాధ పడ్డాడు.

అరుణ్ కుమార్ ఇరవై ఏడు సంవత్సరాలు టౌన్ షిప్ కాలనీలోనే ఉన్నాడు. అతడు ఎంతో కొంత సంపాదించుకున్నాడు. రచయితగా ఇక్కడే నిలదొక్కుకున్నాడు. కష్టాల్లో ఉన్న కాలనీవారికి కొంత సహాయం చేశాడు. అతనికున్న పరిచయాలు, విద్యార్హతలతో ఖర్చులకు సరిపడ సంపాదించు కోగలను అనే నమ్మకం అరుణ్ కుమార్ కు ఉండటంతో అక్కడ ఉన్న వారందరినీ తొందరగా వదిలిపెట్టి రాలేకపోయాడు. చివరి వరకు వారితో ఉండి అందరూ ఖాళీ చేసిన తరువాతే అతడు ఖాళీ చేశాడు. అతని రచనలకు వస్తువును ఇచ్చిన స్థానికతను వదులుకోవడం అరుణ్ కుమార్ కు ఇష్టం లేదు అయినా భవిష్యత్ గురించి ఆలోచించి హైదరాబాద్ వెళ్లాలనుకుంటాడు. అక్కడయితే పిల్లల చదువులకు ఇబ్బంది ఉండదని, ఖర్చుల కోసం ఎంతో కొంత సంపాదించుకోవచ్చని అనుకుంటాడు. అతడు నేనెక్కడున్నా రచయితగా రచనలు చేస్తానని కాలనీ వాసులకి వీడ్కోలు చెప్తాడు. అతనికి ఉద్యోగం చేయడం ద్వారా అత్యంత చైతన్యవంతమైన కార్మికవర్గం గూర్చి తెలుసుకునే అవకాశం కలిగింది. రచయితగా పేరు తెచ్చి పెట్టిన ప్రాంతాన్ని, రచనలకు ముడిసరుకును ఇచ్చిన ప్రాంతాన్ని వదిలిపోతున్నందుకు అరుణ్ కుమార్ బాధపడ్డాడు.

అరుణ్ కుమార్ హైదరాబాదులో స్థిరపడ్డాడు. అరుణ్ కుమార్ కర్మాగారానికి దూరమై ఏడు సంవత్సరాలు గడిచాయి. అయినా అతని మనస్సు నిండా ఫెర్టిలైటజర్ సిటీ, గోదావరిఖని పారిశ్రామిక ప్రాంత జ్ఞాపకాలే. మరల కర్మాగారం పునరుద్ధరణ ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలవడంతో అతడు ఆనందపడ్డాడు. అతడు ముప్పై సంవత్సరాలుగా కార్మికుల మధ్య గడిపిన జీవితాన్ని గుర్తు చేసుకుంటూ అక్కడి విషయాలన్నింటిని కలిపి నవలగా రచించాడు. అరుణ్ కుమార్ ని కలవడానికి అతని మిత్రుడు దివాకర్ రెడ్డి మరియు అతని కొడుకు శ్రీనివాస్ లు వస్తారు. శ్రీనివాస్ మాయమవుతున్న పట్నం మళ్లీ కళకళలాడబోతుంది. అది మాయమవుతున్న పట్నమా? లేక మెతుకు పుస్తకమా? చెప్పండి అంకుల్ అంటూ  అరుణ్ కుమార్ రాసే నవల గురించి అడుగుతాడు. మాయమవుతున్న పారిశ్రామిక కాలనీలు మెతుకుపుస్తకంగా మారాలన్న ఆశాభావంతో, మారాయన్న నమ్మకంతో నా నవలకు 'మెతుకుపుస్తకం' అని పేరు పెట్టాను. దాన్ని పూర్తిచేసి చాలా కాలమయినా ఇంతవరకు బయటకు తీయలేదు, ప్రచురించలేదని దానిని ప్రచురించబోతున్నాను అంటూ తండ్రీకొడుకుల ముందు ఆ నవలను అరుణ్ కుమార్ పెట్టాడు. ఆ పుస్తకాన్ని తీసుకొని తండ్రీకొడుకులు చూస్తారు. గ్రామాలు బతుకు పుస్తకాలుగా, పారిశ్రామిక పట్టణాలు, కాలనీలు మెతుకు పుస్తకాలుగా మారే సమయం దగ్గరలోనే ఉందని అరుణ్ కుమార్ వారికి తెలియజేస్తాడు.

తనకు తెలియని కార్మిక వర్గాన్ని పరిచయం చేసే పాత్రగా, పీడితుల చరిత్రను, సంస్కృతిని రాస్తూ రచయితగా ఎదిగిన పాత్రగా అరుణ్ కుమార్ పాత్ర చిత్రించబడింది. పాత్ర ఏదేమైనా పారిశ్రామిక ప్రాంతం అరుణ్ కుమార్ కు ఎంతో జీవితానిచ్చింది. సాహిత్యానికి వస్తువును ఇచ్చింది. తనకు తెలియని కార్మిక వర్గాన్ని పరిచయం చేసింది. నిర్విరామంగా రాయడానికి అవకాశానిచ్చింది. అతనికి సాహిత్యకారుడిగా ఎంతో భవిష్యత్తునిచ్చింది. కాలువ మల్లయ్య ఈ పాత్ర ద్వారా కార్మికుల జీవితాన్ని తెలియజేశాడు. అతడు కర్మాగారంలో పనిచేసే ఉద్యోగిగా, సామాజిక సమస్యలను స్పృశిస్తూ రచనలు చేస్తున్న రచయితగా అరుణ్ కుమార్ పాత్ర తీర్చిదిద్దబడింది.

### 4.2.11. దివాకర్ రెడ్డి (మెతుకు పుస్తకం):

మెతుకుపుస్తకం నవలలో దివాకర్ రెడ్డిది ప్రధాన పాత్ర. ఈ పాత్రనే ఫెర్టిలైజర్ ఫ్యాక్టరీలో కార్మికుల జీవితం ఎలా ఉంటుందో తెలియజేస్తుంది. దివాకర్ రెడ్డి సింద్రీ ఎరువుల ఫ్యాక్టరీలో అకౌంటెంటుగా ఉద్యోగంలో చేరాడు. అతడు దేశంలోనే రెండవ స్థానంలో ఉన్న ఎరువుల

కర్మాగారంలో పనిచేయడం తన అదృష్టమని భావించేవాడు. అతడు సింద్రీలో రెండు సంవత్సరాలు పనిచేసిన తరువాత రామగుండానికి బదిలీ ద్వారా వచ్చాడు. దివాకర్ రెడ్డి తన మిత్రులతో కలిసి గోదావరిఖని, టౌన్ షిప్ మొత్తం తిరిగేవాడు. ఉద్యోగరీత్యా తన మిత్రులైన సారయ్య, అరుణ్ కుమార్, భిక్షపతి, కొంరెల్లితో కలిసి ఫెర్టిలైజర్ ప్యాక్టరీలో జరిగే ఉత్పత్తి, తమ జీవన విధానానికి సంబంధించిన విషయాలను చర్చించుకునేవారు. ముఖ్యంగా వారు గ్రామాల నుండి రావడం వల్ల టౌన్ షిప్ అందాలను ఆస్వాదించేవారు. దివాకర్ రెడ్డి టౌన్ షిప్ లో పారిశ్రామికీకరణ విధానం పెరుగుతుందని దానివల్ల కార్మికులకు కొంత నష్టం జరిగే అవకాశం ఉందని మిత్రులకు తెలియజేస్తాడు. ఆర్థిక విధానంలో వచ్చిన మార్పుల వల్ల ఫెర్టిలైజర్ ఫ్యాక్టరీని మూసివేయాలని ప్రభుత్వ నిర్ణయిస్తుంది. ఫ్యాక్టరీ మూతపడటంతో వాలంటరీ సెపరేషన్ స్కీమ్ కింద పనిచేసే వారందరిని ఉద్యోగాల నుండి తొలగిస్తారు. అందులో భాగంగానే దివాకర్ రెడ్డి ఉద్యోగం పోవడంతో బాధపడ్డాడు. అతడు దాదాపుగా ముప్పై సంవత్సరాలు ఉద్యోగ జీవితం గడిపాడు. మామూలుగా రిటైర్ అయి వెళ్లిపోతే వేరేలా ఉండేది. కానీ ఉద్యోగం పోవడం చేత పదవీ విరమణ చేయడం దివాకర్ రెడ్డికి బాధగా ఉండేది. ఒక తరం కూడా పదవీ విరమణ పొందేంత వరకు ఉద్యోగం చేయకుండానే పదవీ విరమణ పొందాల్సి వచ్చింది. ఇలాంటి దారుణమైన అనుభవం బహుశా దివాకర్ రెడ్డి తరానిదే మెదటిది.

దివాకర్ రెడ్డి ఫ్యాక్టరీ నుండి బయటికి వచ్చిన తరువాత హైదరాబాద్ లో ఇల్లు ఉన్న అక్కడ ఉండకుండా, కరీంనగర్ లో గ్రామానికి దగ్గరగా ఉండేవాడు. కరీంనగర్ లో అతడు బంధువులు, మిత్రులను కలిసేవాడు. అతనికి అమ్మనాన్నలు లేకున్నా గ్రామానికి వెళ్లి బాల్యమిత్రులను కలిసి వచ్చేవాడు. దివాకర్ రెడ్డి ఉద్యోగ విరమణ చేసిన ఎనిమిది సంవత్సరాలు తరువాత రామగుండం ఎరువుల కర్మాగారం పునరుద్దరణ పనులు జరుగుతున్నాయని తెలుసుకుంటాడు. ఆ విషయం తెలవడంతో అతడు సంతోషపడ్డాడు. ఏది ఏమైనా ఆ ఎరువుల కర్మాగారాన్ని ఇప్పుడు కాకుంటే రేపైనా, కొత్త ప్రభుత్వం వస్తే ప్రారంభిస్తుందని, అప్పుడు అది అందరికి మెతుకుపుస్తకం అవుతుందేమోనని దివాకర్ రెడ్డి ఆశపడ్డాడు. ఆ ఎరువుల కర్మాగారం ప్రారంభమైతే కొందరికైనా ఉపాధి అవకాశాలు లభిస్తాయని దివాకర్ రెడ్డి ఆశ.

దివాకర్ రెడ్డి ఎరువుల కర్మాగారంలో అకౌంటెంటుగా, మిత్రుల దగ్గర మంచి పేరును సంపాదించిన వ్యక్తిగా, నలుగురి క్షేమాన్ని కోరే వ్యక్తి పాత్రలో కనిపస్తాడు.

### 4.2.12. కొంరయ్య (గులాంగిరి చోడో):

'గులాంగిరి చోడో' నవలలో కొంరయ్యది ప్రధాన పాత్ర. దళితుడైన కొంరయ్యది బానిసత్వాన్ని ప్రతిఘటించిన పాత్ర. దొర ద్వారా కుల వివక్షకు, పీడనకు గురైన పాత్ర కొంరయ్యది. దొరను ఎదురించి చైతన్యవంతంగా కొత్త వెలుగును తీసుకువచ్చిన పాత్ర కొంరయ్యది. కాలువ మల్లయ్య కొంరయ్య పాత్ర ద్వారా దళితులలో వచ్చిన చైతన్యాన్ని సమాజానికి చాటి చెప్పాడు. కొంరయ్య పాత్ర నీ బాంచెన్ కాల్మొక్తా దొర అనే సంస్కృతిని అంతరింపజేసింది.

మాదిగ కులానికి చెందిన మారయ్య కొడుకు కొంరయ్య. కొంరయ్య తన చిన్నతనంలో తండ్రితోపాటు దొర ఇంట్లో చనిపోయిన బర్రెను బయటకు తీసుకురావడానికి వెళ్తాడు. అప్పుడే మీ ఇంట్లో చనిపోయిన బర్రెను మేమెందుకు తీయాలి? అని దొరను ప్రశ్నించిన పాత్ర కొంరయ్యది. దొరకు ఆ మాటలకు కోపం వచ్చి కొంరయ్యను చెప్పుతో కొడతాడు. మారయ్య నీ బాంచెన్ కాల్మొక్తా దొర అన్న తరువాత అతన్ని ఇంటికి పంపిస్తాడు. తన కుటుంబం చేసిన అప్పు వలన నర్సింహారెడ్డి దొరకు కొంరయ్య పాలేరుగా ఉంటాడు. అతని తల్లిదండ్రులు పెట్టిన పేరు కొంరయ్యే అయినా చాలామంది కొంరడు అని పిలుస్తారు. కొంరయ్య ఎడ్లను మేపుకు రావడానికి వెళ్తూ బడిలో జరిగే జండా వందనం కార్యక్రమాన్ని చూస్తాడు. అది గమనించిన దొర కొడుకు చంద్రారెడ్డి అరే కొంరిగాఅనగానే కొంరయ్య గజగజ వణుకుతూ దొర ఏమి అంటాడో అని బయపడేవాడు. చంద్రారెడ్డి దొర తిట్టి పంపిస్తాడు. కొంరయ్యకు తండ్రి మీద కోపం వచ్చి తండ్రిని తిడతాడు. కొంరయ్యకు చదవాలన్న కోరిక ఉన్నా తన ఇంట్లో ఆర్థిక పరిస్థితులు బాగా లేకపోవడంతో పాలేరు పని చేయవలసి వచ్చింది. కొంరయ్య పనిలో చేరి మూడు సంవత్సరాలు గడిచాయి. కొంరయ్య పాలేరుగా ఉంటూ ఎన్నో చేదు అనుభవాలను పొందుతాడు. తిట్లు, దెబ్బలు, బూతులు తినుడు అతనికి మామూలే అయింది. పదేండ్ల వయస్సున్న కొంరయ్య నాగలి దున్నే పాలేరు అయిండు. అతడు పునాస నాగలి, మడికట్టు నాగలి, మోకాళ్ల లోతు దిగవడుట్ల నాగలి దున్నేవాడు. కొంరయ్య బంతి, మోట, నాగలి, ఒడ్లు చెక్కుడు, కోత, మోత లాంటి అన్ని పనులు చేసేవాడు.

ఊరిలో చైతన్యం రావడంతో కొంరయ్య పాలేరుతనం మానేశాడు. స్వంతంగా ఏదైనా పని చేసుకోవాలని అనుకుంటాడు. అతని బాల్యం అంతా దుర్భరంగా గడిచిపోయింది. దొరల కుట్రల వల్ల చెల్లి వీరమ్మకు అన్యాయం జరుగుతుంది. కొంరయ్య పంచాయితీ పెడ్తాడు. దొరలకు పంచాయితీలో పెద్దలు అమ్ముడుపోవడంతో న్యాయం జరుగదు. అతడు చివరకు కోర్టులో శ్రీహరి అనే మిత్రుడి సహాయంతో కేసు వేస్తాడు. శ్రీహరి చేసిన నమ్మకద్రోహం వల్ల సాక్ష్యాధారాలు లేక కేసు

ఓడిపోతాడు. వీరమ్మ ఆ బాధను భరించలేక మరణిస్తుంది. చెల్లెకు న్యాయం చేయలేకపోయానని బాధపడుతూ కొన్ని రోజులు బయటికి వెళ్లి సంపాదించాలని తల్లిదండ్రులకు తెలియజేస్తాడు. అతడు రెండు అంగీలు, ఓ తువ్వాలను సంచిలో పెట్టుకొని యాభై రూపాయలు తీసుకొని వెళతాడు. అతడు హమాలీ పని చేస్తాడు. రిక్షా తొక్కుతాడు. భీవండికి వెళ్ళితే అక్కడ కుల వివక్ష గెంటేస్తుంది. ఊరు వదిలిపెడితే ఎన్నో కష్టాలుంటాయని తెలుసుకుంచాడు. అతడు ఎన్నో అనుభవాలను సంపాదించుకొని తిరిగి గోదావరిఖని ప్రాంతానికి వస్తాడు. గోదావరిఖని ప్రాంతంలో పని చేస్తుండగా మధునయ్యతో పరిచయం ఏర్పడుతుంది. తన అనుభవాలను మధునయ్యతో చెప్తాడు. మధునయ్య కొంరయ్యలో ఆత్మవిశ్వాసం పెంపొందించాడు. మధునయ్య సలహా మేరకు ఫ్యాక్టరీ ఉండే ప్రాంతంలో చెప్పులు కుట్టడం, బూట్లు పాలిష్ చేయడం లాంటి పనులు చేయాలని నిర్ణయించుకుంటాడు. ఫ్యాక్టరీ దగ్గర చెప్పులు కుట్టుకుంటూ ఉంటాడు. ఫ్యాక్టరీలో ఉండే ఉద్యోగులు, కార్మికులు, అక్కడ పనిచేసేవారు వస్తుంటారు. ఇక్కడ కూడా కొందరు అతని దగ్గరకు రాకుండా దూరంగా ఉండి  ఇచ్చి వెళ్తుంటారు. ఊళ్లో పీడనను, అవమానాలను భరించలేకనే ఊరు వదిలిన కొంరయ్యకు ఇక్కడ కూడా వివక్ష తప్పడం లేదు. కొంత కాలం గడిచింది. అప్పుడప్పుడే కొద్దిగా గిరాకీ పెరుగుతుంది. కొంరయ్య తనలాంటి వారి బతుకులు కొంచెమైనా బాగుపడతాయనుకుంటాడు. కొంరయ్యలో కొంత ఉత్సాహం పెరిగింది. అప్పుడప్పుడు ఇంటికి వెళ్లి తల్లిదండ్రులను చూసి వస్తుంటాడు. కొంరయ్య మేనమామ బిడ్డను పెళ్లి చేసుకుంటాడు. కొంరయ్య దంపతులు పెళ్లి అయిన తరువాత కాలనీకి వస్తారు. భార్యాభర్తలు ఇద్దరూ పని చేసుకుంటూ బతుకుతున్నారు.

కొంరయ్య ఆ కాలనీలో మంచిగానే స్థిరపడ్డాడు. అతడు గుడిసె నుండి పెంకుల ఇంటికి మారాడు. వ్యాపారంలో చాలా మెళుకువలను నేర్చుకున్నాడు. డైయింగ్ మిషన్, కుట్టు మిషన్ కొన్నాడు. బూట్లను, బ్యాగులను కుట్టడం, సొల్యూషన్ పెట్టి అతికించడం లాంటివి నేర్చుకున్నాడు. రకరకాల పాలిషులు చేయడం నేర్చుకున్నాడు. పనిలో మంచి నేర్పును సాధించాడు.  అతడు వివిధ రకాలైన మనుషులతో స్నేహం చేస్తున్నాడు. అతని కులాన్ని కించపరిచేవారికి ధీటుగా ఎదురు తిరిగి జవాబిస్తున్నాడు. రోజురోజుకు ఉద్యోగులు పెరగడం, బడికి పిల్లలు వస్తుండటంతో కొంరయ్యకు మంచిగానే గిరాకి ఉంటుంది. అతడు ఆదాయన్ని పెంచుకుంటున్నాడు. అప్పుడప్పుడు కొంత డబ్బును కొంరయ్య తల్లిదండ్రులకు పంపిస్తున్నాడు. కొంరయ్యకు ఇద్దరు పిల్లలు పుట్టారు. ఒకరు లక్ష్మి, మరొకరు రాజేష్. పిల్లలను బడికి పంపిస్తున్నాడు. ఈ కాలంలోనే గ్రామాల్లో మార్పు

వచ్చాయి. నీ కాల్మొక్తా దొర అనుకుంటూ బతుకుతున్న వారే ఇప్పుడు పులులై ఎదురు తిరుగుతున్నారు. మావోయిస్టుల ప్రభావంతో కొందరు దొరలు, వడ్డీ వ్యాపారస్తులు ఊరు వదిలి వెళ్ళిపోయారు. దళితులు గుడికి వెళుతున్నారు. కొంరయ్యకి ఇవన్నీ చూస్తుంటే ఆనందంగా ఉంది. ఆర్థికపరమైన సంగతులు ఎలా ఉన్నా సాంఘికంగానైతే కొంచెమైనా మార్పులు వచ్చాయని కొంరయ్య సంబరపడ్డాడు. నర్సింహారెడ్డి దొర ఊరు విడిచి పోయాడని తెలుసుకుంటాడు. గ్రామాల్లో మార్పులు వస్తుండటంతో కొంరయ్యకు ఎంతో ఉత్సాహం కలుగుతుంది.

సమ్మిరెడ్డి అనే ఇంజనీర్ కొంరయ్య దగ్గర చెప్పులు కుట్టించుకుంటాడు. వాటిని కొంరయ్య మంచిగానే కుట్టాడని అతడు తృప్తిపడతాడు. కొంరయ్య రెండు రూపాయలు అడుగుతాడు. ఈ చిన్న పనికే రెండు రూపాయలా? అని ఒక్క రూపాయే ఇస్తాడు. దానికి కొంరయ్య మరొక రూపాయి ఇవ్వాల్సిందేనని అంటాడు. నేను ఒక పెద్ద ఇంజనీర్ అని కొంరయ్యను కులం పేరుతో దూషిస్తూ బెదిరిస్తాడు. కొంరయ్య అతన్ని ఎదిరించి డబ్బును వసూలు చేసుకుంటాడు. సమ్మిరెడ్డి కులం పేరుతో కొంరయ్య దూషించాడని అతన్ని వదిలిపెట్టడు. చివరకు సమ్మిరెడ్డి కొంరయ్యకు క్షమాపణలు చెప్తాడు. కొంరయ్య కొడుకును మంచిగా చదివిస్తున్నాడు. చిన్నతనంలో రాజేష్ ఇంగ్లీష్ పదాలు మాట్లాడుతుంటే కొంరయ్య ఎంతో సంబరపడేవాడు. ఈ ఇంగ్లీష్ చదువులే కొడుకుని తనకు దూరం చేస్తున్నాయని కొంరయ్య గ్రహించాడు. రాజేష్ కు అన్ని తెలిసేటట్టు పెంచకపోవడం వల్ల కొంరయ్యను అతను అర్థం చేసుకోలేకపోతున్నాడు. ఆ వయస్సులో కొన్ని ప్రలోభాలకు అలవాటుపడ్డా కొన్ని అనుభవాలైతే రాజేష్ మారతాడని కొంరయ్య అనుకుంటాడు.

ఫ్యాక్టరీ మూతపడటంతో కొంరయ్య ఆ కాలనీ వదిలి ఊళ్లో స్థిరపడటానికి ప్రయత్నం చేస్తాడు. మధునయ్య సలహాతో ఊళ్లో కూడా చెప్పుల దుకాణం పెట్టాలనుకుంటాడు. మధునయ్య తన మిత్రుడైన అంజయ్య చెప్పుల దుకాణం యజమానిగా ఎలా సక్సెస్ అయ్యాడో కొంరయ్యకు చూపిస్తాడు. కొంరయ్యకు తనమీద తనకు నమ్మకం కలిగుతుంది. అంజయ్య చెప్పులు, గూడులు తయారుచేసే చర్మాల్ని, స్పాంజి సీటులను చూపిస్తాడు. చర్మాన్ని కఠినంగా మార్చడం ఇంకా కొన్ని రకాలైన మిషన్లు, పనిముట్ల గురించి తెలియజేశాడు. అందులో చాలా విషయాలు తనకు తెలిసినవే అయినా శ్రద్ధగా వింటాడు కొంరయ్య. కొంరయ్యకు ఆ పనితోనే తన ఊళ్లో బతకవచ్చని నమ్మకం ఏర్పడి ధైర్యమొస్తుంది.

కొంరయ్య కొడుకు రాజేష్ ఉన్నతంగా ఆలోచిస్తూ ఊరికి రావడానికి ఇష్టపడటంలేదు. కొంరయ్య కొడుకుని పట్టణంలో ఉంచి వెళ్ళిపోతాడు. అతడు ఇంటి ముందర షెడ్డు వేసుకొని

చెప్పుల దుకాణం పెడతాడు. భార్యాభర్తలు ఇద్దరూ కలిసి పని చేసుకుంటారు. వారు ఇంటింటికి తిరిగి ముఖ్యంగా వ్యవసాయానికి అవసరమయ్యే పనిముట్ల ఆర్డర్లు తీసుకుంటారు. కొంతకాలంలోనే చుట్టుప్రక్కల ఊళ్లో వారు అతని దగ్గరకు రావడం ప్రారంభిస్తారు. కొంరయ్య చెప్పులు తక్కువ ధరకు అమ్మడంతో గిరాకీ పెరుగుతుంది. యాభై సంవత్సరాల వయస్సున్న కొంరయ్య బాగానే కష్టపడతున్నాడు. రోజురోజుకు గిరాకీ పెరుగుతుంది. కొంరయ్యకు వ్యాపారంలో మెళుకువలు తెలియడంతో వ్యాపారాన్ని అభివృద్ధి చేశాడు. కొంరయ్య చెప్పుల షాపును పెద్దదిగా చేస్తాడు. అతని షాపులో ఎనిమిది మంది పనిచేసేవారు ఉంటారు. కొంరయ్య అభివృద్ధి చెందుతున్నాడు. కొంత కాలంలోనే రాజేష్ లో మార్పు వస్తుంది. కొంరయ్య జీవితం ఏ ఒడిదుడుకులు లేకుండానే నడుస్తుంది. బాంచెన్ నీ కాల్మొక్తా అంటూ బతికినవారు వివిధ రకాల పోరాటాలు వీరోచితంగా చేస్తున్నారని తెలుసుకొని కొంరయ్య ఆనందపడ్డాడు. నీ బాంచెన్ సంస్కృతి తగ్గిపోయిందని సంతోషిస్తాడు. కొంరయ్య పీడితుడిగా ఉంటూ దొరను ఎదురించి సమాజంలో ఒక చైతన్యాన్ని తీసుకువస్తాడు. కుల వివక్షను ఎదుర్కొన్న చివరికి తన చైతన్యంతో సమాజంలో ఒక మార్పును తీసుకువస్తాడు. పీడనను, వివక్షను, బానిసత్వాన్ని ఎదుర్కొని చైతన్యవంతంగా వెలుగునిచ్చిన పాత్ర కొంరయ్య పాత్ర. దళితుడైన కొంరయ్య పాత్ర సమాజంలో ఒక మైలురాయిగా నిలుస్తుంది.

### 4.2.13. మారయ్య (గులాంగిరి చోడో):

మారయ్యది బానిసత్వాన్ని, దొరల దౌర్జన్యాలను భరిస్తూ తన బతుకు ఇంతేనని సరిపెట్టుకున్న పాత్ర. దొరలకు బాంచెన్ కాల్మొక్తా దొర అంటూ జీవితం కొనసాగించిన పాత్ర మారయ్యది. తన కుటుంబం చేసిన అప్పుకి దొరల దగ్గర పాలేరుగా చేస్తూ పీడనకు గురైన పాత్ర మారయ్యది. మారయ్య తరం పీడనను భరించింది.

మారయ్య మాదిగ కులానికి చెందినవాడు. దొర కొట్టంలో బర్రె చనిపోయింది. అప్పటికే రెండు రోజులైంది. ఆ కళేబరాన్ని బయటపడేయాల్సిన బాధ్యత ఆ ఊరి మాదిగలది. మరోవైపు వారం రోజులుగా ఎడతెరిపిలేని వాన. ఇంకోవైపు మాదిగలు గేదె కళేబరాన్ని మోసుకెళ్ళడం లేదని దొరకు కోపం వస్తుంది. దొర మారయ్యను పిలిచాడు. మారయ్యతోపాటు మరి కొంతమంది వెళ్తారు. మారయ్య వాన రావడం వల్ల లేటు అయిందని అంటాడు. దొర వారి మీద కోపంతో గాడిద కొడుకుల్లారా, వానవస్తే బువ్వ తింటలేదా అంటూ బూతులు తిడతాడు. నర్సింహారెడ్డి దొర ఏదో మాట్లాడబోయిన మారయ్య మీదికి చెప్పు విసిరేస్తాడు. అది మారయ్య భుజానికి తగులుతుంది.

మారయ్య చెప్పును తీసుకొని దొర కాళ్ల దగ్గర వేస్తాడు. ఊరిలో ఎవ్వరు చనిపోయిన పాడె కట్టెడం, కాట్నం పేర్వడం, బొంద తీయడం, శవం ముందు డప్పు కొట్టుకుంటూ నడవడం, ఊర్లో సాటింపు వేయడం, పోశమ్మ, మైసమ్మల దగ్గర, లగ్గం దగ్గర, కాళ్లగోల్ల డప్పుని మాదిగ కులానికి చెందిన మనమే ఈ పనులు చేయాలని కొడుక్కి చెప్తాడు.

మారయ్య చెప్పులు, తొండాలు కుట్టడం, తాళ్లు పేనడం, చీపుర్లు కుట్టడం లాంటి పనులు చేస్తుంటాడు. తన పని తనకు మంచిగనే అనిపిస్తున్న పెద్దల వల్ల అవమానాలు పడుతున్నాడు. కొడుకును దగ్గరగా తీసుకొని దొరకు పాలేరు ఉంచానని బాధపడతాడు. దొరకు వెయ్యి రూపాయలు బాకీ ఉండటంతో కొడుకును పాలేరుగా ఉంచాల్సి వస్తుంది. మారయ్య దొర కాళ్లు మొక్కినా వినలేదు. నీ బాంచెన్ కాల్మొక్తా అని మొత్తుకున్నా దొర వినడు.

మారయ్య కూతురు వీరమ్మకు వివాహం జరిపించాడు. వీరమ్మను అత్తగారింటి దగ్గర నుండి తీసుకువచ్చాడు. మారయ్య బతుకమ్మ పండుగ తరువాత వీరమ్మను పంపించాలి అనుకుంటాడు. బతుకమ్మ పండుగ రోజున వీరమ్మను దొరలు అనుభవిస్తారు. ఈ విషయం బయటకు తెలవొద్దని మారయ్య ఇంట్లో వాళ్లకి చెప్తాడు. ఆమె సంసారం ఇబ్బందుల్లో పడుతుందని, కడుపు పోవడానికి ఏదో ఒక కారణం చెప్పొచ్చని అనుకుంటాడు మారయ్య. దొరను ఏమి చేయలేనని మారయ్య బాధపడుతూ అలాగే ఉండిపోతాడు. తనకున్న జీవితానుభవంతోని బలవంతుడైన దొరను ఏమి చేయలేనని మారయ్య బాధతో కుమిలిపోతుంటాడు. పండుగ అయిపోయిన తరువాత వీరమ్మను తీసుకుపోవాలని మారయ్య తన వియ్యంకుడికి కబురు పంపుతాడు. ఒకవైపు కొడుకు పాలేరు పనిలో ఉండటం, మరోవైపు కూతురు జీవితం ఇబ్బందుల్లో ఉండటంతో మారయ్య బాధపడుతున్నాడు. ఒకవైపు కొడుకు స్థిరపడకపోవడం మరొకవైపు వీరమ్మ మరణం అతన్ని దిగ్భ్రాంతికి గురిచేసింది. దొరల చేతుల్లో ఎంతో పీడనను అనుభవించిన పాత్ర ఇది.

### 4.2.14. రాజేష్ (గులాంగిరి చోడో):

కొంరయ్య కొడుకు రాజేష్. రాజేష్ మూడు సంవత్సరాలు పూర్తికాగానే బడికి వెళ్ళాడు. అతడు బడికిపోతూ ఇంగ్లీష్ పదాలు మాట్లాడుతుంటే కొంరయ్య ఆనందపడేవాడు. రాజేష్ కష్టమంటే ఎందో తెలువకుండా సుఖంగా పెరిగాడు. రాజేష్ ఉద్యోగుల పిల్లలతోపాటు హుషారుగా వారితో తిరిగేవాడు. రాజేష్ కు ఏది కావాల్నంటే అది కొంరయ్య తెచ్చి ఇచ్చేవాడు. రాజేష్ కాలేజీ చేస్తూ హుందాగా ఉండేవాడు. కొంరయ్యను డాడీ అని పిలిచేవాడు. ఇంగ్లీష్ పత్రికలు చదువుతూ ఉన్నతంగా ఉండాలనే ఆశతో పెరుగుతున్నాడు. రాజేష్ తన తండ్రి చెప్పులు కుట్టడాన్ని

అవమానంగా భావిస్తాడు. రాజేష్ ఆలోచనలు పెద్దగా ఉన్నాయని కొంరయ్య బాధపడేవాడు. చదువుకుంటున్నప్పుడే ఇలా ఉంటే ఉద్యోగం వస్తే ఎలా అయిపోతాడోనని బాధపడేవాడు. ఊరిలో చాలా మార్పులు వస్తున్నాయి. వ్యాపార నాగరికత మెల్లమెల్లగా ఊళ్లోకి ప్రవేశిస్తుంది. రాజేష్ ఉద్యోగ ప్రయత్నంలో ఉన్నాడు. కొంరయ్య ఊళ్లో ఉండి చెప్పులు కుట్టడానికి, అమ్మడానికి ప్రయత్నాలు చేస్తున్నాడు. అయితే రాజేష్ కు మాత్రం తండ్రి ప్రయత్నాలు నచ్చడం లేదు.

అందరూ ఊరు నుండి పట్టణాలకు వెళ్తుంటే తన తండ్రి మాత్రం ఎక్కడో మూలకున్న పల్లెకు వెళతాననడం రాజేష్ కి నచ్చట్లేదు. తన ఊరు కూడా రాజేష్ కు నచ్చడం లేదు. ఇంజనీరింగ్ చదివిన రాజేష్ కు పల్లెలో ఉండటం నచ్చడం లేదు. ఇంజనీరింగ్ చదివాడు కాబట్టి పట్టణంలోనే ఉద్యోగం చేయాలనుకుంటాడు. ఓ ఇంజనీర్ తండ్రి చెప్పులు కుట్టేవాడని తాను అవమానకారంగా భావిస్తున్నాడు. రాజేష్ తల్లిదండ్రులతో మీకు ఊరు మీద అంత ఇష్టముంటే వెళ్లి ఉండండి. నేను మాత్రం రానని ఖరాఖండిగా చెప్తాడు. కొంరయ్య వాళ్లు ఊరికే వెళ్లడానికి సిద్ధపడుతుండగా రాజేష్ కు ఉద్యోగం వచ్చి హైదరాబాద్ వెళతాడు. రాజేష్ అప్పుడప్పుడు ఊరికి వస్తూ వెళ్తున్నాడు. తండ్రికి చెప్పులు కుట్టే పనిని బంద్ చేయమని చెప్పేవాడు. కొంరయ్య రాజేష్ పెళ్లి చేయాలనుకుంటున్న సమయంలో ఏకంగా కోడల్నే తీసుకొని రాజేష్ ఇంటికొచ్చాడు. రాజేష్ భార్య లలిత కూడా ఉద్యోగం చేస్తుంది. కొంరయ్య, ముత్తమ్మలు వారిని ఏమని లాభం లేదని కడుపుతీపిని కాదనుకోలేక వాళ్లను ఆశీర్వదిస్తారు.

రాజేష్ పదిహేనేళ్లు అమెరికాకు వెళ్లి బాగా సంపాదించుకొని వచ్చాడు. రాజేష్ కుటుంబ సభ్యులందరిని ఎంతో ప్రేమగా పలకరించాడు. నాన్న అవగాహన లేనప్పుడు మీ అందరిని బాధ కలిగించేటట్లు ప్రవర్తించాను. దేశ విదేశాలు తిరిగితే కాని నాకు కనువిప్పు కలుగలేదు. మార్క్స్, అంబేద్కర్, బుద్ధున్ని చదివిన తరువాత నాకు కొంత అవగాహన వచ్చిందన్నాడు. నేను ఎక్కడికి వెళ్ళను. ఉద్యోగం చేసిన ఏం చేసిన ఇక్కడే ఉండి చేస్తాను. నన్ను నేను ఈ దేశం కోసం నా దళిత జాతి కోసం అంకితం చేసుకుంటాను అన్న రాజేష్ మాటలు విని కొంరయ్య ఏడ్చాడు. తాత తరంలో నీ బాంచెన్ కాల్మొక్తా అనుకుంటూ బతికినాం. నీ తరంల కొంచెం దొరలను ఎదురించి స్వతంత్ర్యంగా బతికావు. నాకు కొన్నేండ్ల వరకు నీ వేదన, నా మూలాలు అర్థం కాలేదు అని రాజేష్ ఏడ్చుకుంటూ తండ్రితో చెప్తాడు. దళిత రాజ్యాధికారం కోసమే రాజేష్ జీవితాన్ని అంకితం చేస్తానంటాడు.

ఎంతో పీడనను అనుభవించిన కుటుంబంలో కూడా ఉన్నతంగా బ్రతకాలన్న ఆశ ఉన్న వ్యక్తి రాజేష్. తన మూలాలను మరిచిపోయి ఉన్నతంగా బతకాలనుకున్నాడు. తన కులాన్ని అవమానకరంగా భావించే పాత్ర రాజేష్ ది. చెప్పులు కుట్టే వృత్తిని నామోషిగా భావిస్తూ ఉండేవాడు. రాజేషుకు ఇంజనీర్ అనే గర్వం ఉండేది. చివరకు రాజేష్ పాత్రలో కొంత మార్పు రావడంతో తన మూలాలను అర్థం చేసుకోవడంతో గొప్పగా అనిపిస్తుంది. చివరలో రాజేష్ పాత్ర యొక్క ఔన్నత్యం పెరుగుతుంది. తన కులాన్నే అవమానంగా భావించిన వ్యక్తి దళిత రాజ్యాధికారం కోసమే నా జీవితం అంకితం అనడం ఈ పాత్ర స్థాయిని పెంచింది.

### 4.2.15. నర్సింహారెడ్డి (గులాంగిరి చోడో):

ఒక పల్లెలో నర్సింహారెడ్డి భూస్వామి. భూమినంతా తన గుప్పిట్లో పెట్టుకొని దళితులతో పాలేరు పని చేయించుకుంటూ వారిని పీడనకు గురిచేసిన పాత్ర నర్సింహారెడ్డిది. నర్సింహారెడ్డి దొర అన్న అహంకారంతో దళితులను బూతులు తిట్టేవాడు. నర్సింహారెడ్డి కొట్టంలో రెండు రోజుల నుండి బర్రె చనిపోయి ఉంటే దానిని బయట పడేయ్యలేదని ఆ పల్లె మాదిగలను తిడతాడు. మారయ్య కొంత మంది మాదిగవాళ్ల సహాయంతో ఆ బర్రెను బయట పడేస్తారు. బర్రెను పడేసి వచ్చిన తరువాత వారు దొర కొట్టాల దగ్గర కూర్చుంటారు. నర్సింహారెడ్డి దొర బాలగౌడ్ దగ్గర కల్లు తాగండి అని చెప్పుతాడు. దొర గిరాకీ వచ్చిందని బాలగౌడ్ వారికి కల్లు పోసి పంపాడు. నర్సింహారెడ్డి కొడుకు చంద్రారెడ్డి కూడా గర్వంతో ఉండేవాడు. పాలేరు పనిచేస్తున్న కొంరయ్యను బండ బూతులు తిట్టేవాడు. పండగయినా పబ్బమయినా పాలేరు పని చేయాల్సిందే అనేవాడు. నర్సింహారెడ్డి దొర కొంరయ్య ఎడ్లను ఎంత మంచిగా మేపినా తిడ్తనే ఉంటాడు. ఎంత పనిచేసినా కొడుతానే ఉంటాడు. దొర నోట్లో నుండి మెచ్చుకున్నది, మంచి మాటలు వచ్చింది లేదు. దొరకు పాలేరుగా చేయడం అంటే గొడ్డు చాకిరి చేయడమే. మాటమాటకు  తిట్లు, ఏమన్నంటే దెబ్బలు కొడతారు. దొరల ముందు ఏమనకూడదు.

నర్సింహారెడ్డి దొర మారయ్య తండ్రి చేసిన బాకీ గురించి అతనికి చెప్తాడు. మారయ్య తండ్రి కొన్ని సంవత్సరాలు పైసలు కట్టినా అప్పు తీరలేదన్నాడు. ఇంక వెయ్యి రూపాయలు బాకీ ఉందని చెప్తాడు. మారయ్య నర్సింహారెడ్డి కాళ్లు పట్టుకొని వేడుకున్నా, నీ బాంచెన్ కాల్మొక్తా అని మొత్తుకున్న వినడు. నర్సింహారెడ్డి తన బాకీ కట్టాలంటాడు. ఐదు సంవత్సరాలు పాలేరుగా ఉంటే మీ బాకీ తీరుతుందని చెప్పడంతో కొంరయ్య దొరకు పాలేరుగా ఉంటాడు. దొరలు పాలేర్లను ఎన్నో అవమానాలకు గురిచేస్తారు. కొన్ని సంవత్సరాలు తరువాత గ్రామాలలో మార్పులు వచ్చాయి.

మావోయిస్టుల ప్రభావంతో దొరలు ఊళ్లు వదిలి వెళ్ళిపోయారు. నర్సింహారెడ్డి కూడా ఊరు వదిలి వెళ్ళిపోయాడు. దొరను అన్న అహంకారంతో దళితులను ఎన్నో అవమానాలకు గురిచేశాడు. దళితులు దొరల పీడనకు అణచివేయబడ్డారు. నర్సింహారెడ్డి పాత్ర ద్వారా దొరల యొక్క అహంకారం, దౌర్జన్యాలు ఎలా ఉంటాయో తెలుసుకోవచ్చు. దళితులను దొరలు ఎన్నో అవమానాలకు గురిచేసేవారని ఈ పాత్ర ద్వారా తెలుసుకోవచ్చు. దొర అన్న అహంకారం కలిగినవాడిగా, పాలేర్లపై దౌర్జన్యంగా ప్రవర్తిస్తూ వారిని కించపరిచేవాడిగా, దళితులను, వెనుకబడిన వర్గాల వారిని అవమానపరిచేవాడిగా నర్సింహారెడ్డి పాత్ర తీర్చిదిద్దబడింది.

### 4.2.16. కొండయ్య (మంచియన్నది మాల అయితే..):

'మంచియన్నది మాల అయితే..' నవలలో ప్రధాన పాత్ర కొండయ్యది. దొరలు, పటేండ్లు, పట్వార్లు ఎన్ని పన్నాగాలు పన్నిన వాటిని తుడిచివేసే తెలివిగల పాత్రగా కొండయ్య పాత్ర ఆవిష్కరింపబడింది. అతని తెలివిని మెచ్చుకొని ఊళ్లో ప్రజలు అతన్ని మాలపంకిడిగాడు అంటారు. 'మాలపంకిడి' అంటే అదో రకమైన చేప. ఆ చేపకు చాలా రకాలైన ఉపాయాలు ఉంటాయి. ఆ చేపను పట్టుకోవడం చాలా కష్టం. గాలమేసినా, వలేసినా తప్పించుకొని తిరుగుతుంది. కొండయ్య కూడా ఆ రకమైన తెలివితోనే దొరల ముందు తప్పించుకొని తిరిగేవాడు.

మాల కొండయ్య గోవిందరావు దొర దగ్గర పాలేరుగా పనిచేసేవాడు. ఉదయాన్నే లేచి తూము దగ్గరకు పోయి నీళ్లను పొలంలోకి వచ్చేటట్టు చేసేవాడు. నీళ్లకు అడ్డంగా ఉన్నవాటిని తీసివేసి నీళ్లతో పొలం పారేటట్లు చేసేవాడు. అతని కాళ్లు తడిసి పుండ్లయ్యేవి, చేతులు తడిసి పాలిపోయినట్లు తెల్లగా అయ్యేవి. ఉదయం నుండి రాత్రి వరకు అదే పని చేసేవాడు. దొరలు పొలంలో సరిగ్గా నీళ్లు లేకుంటే తిట్టేటోళ్లు, బెదిరించేటోళ్లు, ఎంత మంచిగా పనిచేసినా దొరల చేత అతనికి తిట్లు తప్పేవికావు. కొన్నిసార్లు దెబ్బలు కూడా తిన్నాడు. కొన్ని సంవత్సరాలు గడిచిన తరువాత కొండయ్య స్వంతంగా వ్యవసాయం చేయడం ప్రారంభించాడు. కొంత భూమి కొనుక్కొని వ్యవసాయం చేశాడు. కొండయ్యకు ముగ్గురు కొడుకులు. కొండయ్య వారిని చదివించాడు. రిజర్వేషన్ సౌకర్యం వల్ల కొండయ్య ముగ్గురు కొడుకులు ఉద్యోగాలు చేస్తున్నారు. కొండయ్య ఇద్దరి కూతుర్లను కూడా మంచిగా చదివించి వాళ్లకు పెళ్లి చేసి పంపాడు. కొండయ్య కొడుకుల సంపాదనతో కొంత భూమి కొన్నాడు. కొండయ్య కూడా ఓ పాలేరుతో పనిచేయించుకుంటున్నాడు.

కొండయ్యకు వ్యవసాయ పనుల్లో ఉపయోగపడడానికి రెండు ఎద్దులు ఉన్నాయి. ఎద్దులతో వ్యవసాయం చేస్తూ ప్రాణం కంటె ఎక్కువగా వాటిని చూసుకునేవాడు. ఆ ఎద్దులకు పుల్ల కోడెలు

అని పేరు పెట్టాడు. ఎద్దులు కడుపు నిండా తినకపోతే కొండయ్యకు అన్నం తినబుద్ధి అయ్యేది కాదు. అందుకే వాటిని తాను దగ్గరుండి పొలాల చుట్టూ తిరుగుతూ మేపేవాడు. అలాంటి ఎద్దులు దొంగిలించబడతాయి. ఎద్దులు పోవడంతో కొండయ్య బాధపడతాడు. ఎద్దులు ఎటు వెళ్ళాయో తెలియక తర్జన భర్జన పడుతుంటాడు. కొండయ్యకు పాలేరుగా రంగయ్య ఉండేవాడు. రంగయ్య విరామం తీసుకొని ఊరికి వెళ్తాడు. రంగయ్య దొంగతనం చేసినాడని కొంతమంది అంటారు. అయినా అతని మీద కొండయ్య నింద వేయదలుచుకోలేదు. ఎడ్లు పోయ్యాయని కొండయ్య, అతని భార్య వీరమ్మ బాధపడతారు.

కొండయ్య ఎద్దులు పోయిన విషయాన్ని పంచాయితీ పెద్దల దృష్టికి తీసుకువెళ్లాడు. గోవిందరావు దొర ఈ విషయం తెలుసుకొని సంబరపడుతాడు. సర్పంచ్ నీకు ఎవ్వరిమీదనైనా అనుమానమున్నదా కొండయ్య? అని అడిగాడు. నాకెవ్వరి మీద అనుమానం లేదు. నా పని నేను చేసుకుంటా బతికెటోన్నని కొండయ్య సమాధానం ఇస్తాడు. "ఎవ్వరు చేసినా మీ యింట్లోల్లే చేసుంటరు" అన్నాడు గోవిందరావు. "చేస్తే చేసింద్రు... అయినా దొంగ దొరుకంది ఎవ్వలమీదనైన నింద మోపుడేం బాగుంటది... ఇయ్యాల రేపు మీదికి దొరలోలున్నోల్లు గూడ దొంగతనాలు జేత్తున్నరు" (మల్లయ్య, కాలువ.2014:పుట.38) అని కొండయ్య గోవిందరావుకు చురకలంటిచ్చాడు. అందరి మాటలు విన్న సర్పంచ్ ఎద్దులను వెతకాలని అవి దొరక్కపోతే చూద్దాం అని చెప్పి వెళ్ళిపోయాడు.

కొండయ్య అతని అల్లుడు గుండయ్య చుట్టుప్రక్కల గ్రామాలు మొత్తం తిరిగారు. రాయపట్నంలో ఎద్దులు దొరికాయి. రంగయ్య అక్కడ వాటిని అమ్మినట్టు తెలిసింది. నమ్మకద్రోహం చేసిన రంగయ్య మీద కొండయ్య కోప్పడ్డాడు. రంగయ్య ఎద్దులు అమ్మినానని నేరం ఒప్పుకుంటాడు. రంగయ్యను పోలీసులు తీసుకువెళ్తారు. ఎడ్ల కథ రోజురోజుకు మలుపు తిరుగుతుంది. దొరలు మాల మాదిగల మధ్య చిచ్చుపెట్టే ప్రయత్నం చేస్తుంటారు. రంగయ్య మాదిగ, కొండయ్య మాల కావడంతో వారికి అవకాశం దొరికినట్టుగా భావించి, కులాల మధ్య చిచ్చుపెడుతారు. కిషన్ రావు దొర రంగయ్యను పోలీస్ స్టేషనుకు పంపించి మరల నువ్వే అతన్ని విడిపించాలనుకుంటున్నావు. ఇందులో ఏదో మతలబు ఉందని అంటాడు. కొండయ్యకు దొరల యొక్క పన్నాగం అర్థమయింది. అలాగే గోవిందరావు దొర కూడా మాదిగోల్లు కుల విభజన చేయించారని మాలోల్లకు కోపంగా ఉంటుందని అన్నాడు. ఈ మాటలు కొండయ్యకు అర్థమయ్యి రంగయ్య మీద కేసులు లేకుండా

బయటకు తీసుకువస్తానని చెప్పాడు. అంతటితో దొరల పన్నాగాలకు అడ్డుకట్ట వేయబడింది. కొండయ్య తెలివితో దొరలను ఢీకొట్టి రంగయ్యను బయటకు తీసుకువచ్చాడు.

రంగయ్య నువ్వు మంచివాడివి, నమ్మకస్తుడివి. నీకు దొంగతనం చేసే ధైర్యం లేదని నాకు తెలుసు. ఈ దొంగతనం ఎవరు చెయ్యమన్నారో చెప్పు అని కొండయ్య రంగయ్యను అడిగాడు. దొర మనుషులు అతన్ని బెదిరించడంతో దొంగతనం చేశానని కొండయ్యతో రంగయ్య చెప్తాడు. కొండయ్యకు కోపం వచ్చినా అణుచుకున్నాడు. కొండయ్య మొదటినుండి ఎవ్వరికి భయపడకుండా బతికేవాడు. దొరలకు మాలోడు ఇలా బతకడమేందని లోలోపల కోపంగా ఉండేది. కొండయ్య దర్జాగా బతుకుతుండటంతో దొరల కండ్లు మండాయి అందుకే కొండయ్యను బురిడి కొట్టించాలని చూశారు. కాని కొండయ్య తన తెలివితో వారి పన్నాగాలను చిత్తు చేశాడు. దొరలు ఎన్ని ఎత్తులు వేసినా అతడు పై ఎత్తులు వేశాడు. దొరల ఉచ్చులో చిక్కుకోకుండా వారిని ఎదురించి పోరాడిన పాత్ర కొండయ్యది. దళితుడైన కొండయ్యది తెలివిగల పాత్ర. దొరల పీడనను తన తెలివితో తప్పించుకొని స్వంతంగా ఎదిగిన పాత్ర ఇది. ఈ పాత్ర ఎదుగుదల దళితుల్లో చాలామందికి స్ఫూర్తిగా నిలుస్తుంది.

### 4.2.17. గోవిందరావు (మంచియన్నది మాల అయితే..):

మంచియన్నది మాల అయితే.. నవలలో ప్రధాన పాత్ర గోవిందరావుది. గోవిందరావు భూస్వామి. దొరగా ఊళ్లో చలామణి అవుతూ దళితులను పీడిస్తుంటాడు. అతనికి ఎకరాల కొద్ది భూమి, స్థలాలు ఉన్నాయి. పాలేర్లే గాక వివిధ వృత్తి పనిచేసేవారు గోవిందరావు దగ్గర ఉన్నారు. అందుకే ఊర్లో దొరంటే అందరికి భయమే. గోవిందరావు తన పొలాలను చూడటానికి వెళ్తాడు. గోవిందరావు పొలం ప్రక్కనే కొండయ్య పొలం దున్నుతున్నాడు. అది చూసిన గోవిందరావు ఒక ఎద్దు కుంటుకుంటూ నడుస్తున్న సంగతిని గమనిస్తాడు. ముసలి ఎద్దుతో వ్యవసాయం చేస్తున్నావు అందుకే అది నడవలేకపోతుందని కొండయ్యను కులం పేరుతో దూషిస్తాడు. కొండయ్యకు ఎదురించే ధైర్యం లేక తలకాయ కిందకు వేసుకొని నిల్చుంటాడు. ఎద్దును చూస్తే పాపమనిపిస్తుంది. సాయంత్రం ఇంటికి వచ్చి పైసలు తీసుకొని కొత్త ఎద్దును కొనుక్కోమని గోవిందరావు అంటాడు. కొండయ్యకు ఇష్టంలేక అలానే ఉంటాడు. చివరకు దొర నా ఎద్దును తీసుకువెళ్లి వ్యవసాయం చేసుకో అని కొండయ్యతో అంటాడు. కొండయ్య నా పనికి సహాయం చేస్తున్నందుకు చర్మం ఒలిచి చెప్పులు కుట్టిస్తా దొర అని అంటాడు. గోవిందరావు దొర మనలాంటి వారికి ఊరికే సహాయం చెయ్యడు. జర జాగ్రత్తగా ఉండు అని కొండయ్యకు మిత్రుడు సలహా ఇస్తాడు. గోవిందరావు దొర

తన తెలివితో కొండయ్యను పొలం దున్నమని పాలేరుతో చెప్పి పంపిస్తాడు. గోవిందరావు పొలంలోనే కొండయ్య ఎక్కువగా ఉండాల్సి వస్తుంది. ఒకసారి పనికి రానంటే దొర కోపగించుకొని బూతులు తిడతాడు. పంటలు పండిన తరువాత ఎద్దును తోలడానికి వస్తాడు. గోవిందరావు పనులన్ని తీర్చుకొని ఎద్దును బక్కగా చేసుకొని వచ్చినవు అని కొద్దిగా బలిచిన తరువాత తీసుకోని రమ్మని అంటాడు. రెండు మూడు నెలలు కొండయ్య దానిని మేపుతాడు. ఎద్దుకు జబ్బు చేయడంతో దొరకు కొంత డబ్బు ఇచ్చి కొండయ్య ఎద్దును తీసుకుంటాడు. కొండయ్య తెలివితో ఎద్దు విషయంలో గోవిందరావును బురిడీ కొట్టిస్తాడు. కొంతకాలంలో గ్రామాలలో మార్పులు వచ్చాయి. దొరల పీడన కొంతవరకు తగ్గిపోయింది.

మావోయిస్టుల ప్రభావంతో గోవిందరావు ఊరి విడిచి వెళ్లిపోతాడు. మరల కొన్ని సంవత్సరాలలో మావోయిస్టుల ప్రభావం తగ్గడంతో ఊరి పెద్దమనుషుల ఒప్పందంతో గోవిందరావు ఊరికి వస్తాడు. పుట్టిన ఊరు మీద ప్రేమతో వచ్చామని అందరికి చెబుతాడు. దొరల పీడన తగ్గడంతో ఎలాగైనా ఊరిలో గోవిందరావు పెత్తనం చేయాలని భావిస్తాడు. చాలావరకు ఊళ్లో మార్పులు వచ్చాయి అయినా అతని ప్రభావం ఉండాలని అనుకుంటాడు. కులాల మధ్య చిచ్చుపెట్టి ఊరిలో తన ఆధిపత్యం చెలాయించాలనుకుంటాడు. ఊళ్లో అతనికి అధికారం లేకపోవడంతో తల్లడిల్లిపోతాడు. గోవిందరావు ఒక సందర్భంలో కొండయ్యపై ఊరు పంచాయితీలో ఇలా మాట్లాడాడు “కొండయ్య! నువ్వు బాగుషారుగానే ఉన్నవుర... ఎంతయిన నువ్వు చాలుగానివే... మాదిగోల్లు కులాల విభజన చేయించిండ్రని మాలోల్లకు మంటుందిగదుర... మీరు కక్ష గట్టిండ్రు... ఎంతైన వాళ్ల కంటె మీరు ముందున్నరు గద...? గిట్ల కక్ష గడితేమన్నట్టు...? నువ్వు రంగయ్య నిడిపిచ్చినట్టే చేసి అన్నల ఉత్తరమచ్చిందని చెప్పి మల్ల కొంచవోయెటట్టు జేత్తివి... నువ్వు చాలుగానివి కాకుంటె పోలీసోల్లు నిన్ను తీసుకుపోరా...?” (మల్లయ్య, కాలువ.2014:పుట.201) అన్న గోవిందరావు మాట కొండయ్యకు కోపం తెప్పించాయి. మాల మాదిగల మధ్య చిచ్చుపెట్టాలని గోవిందరావు చూసేవాడు. అలాగే కొండయ్య ఎదుగుదలని చూసి ఓర్వలేక తన ఎడ్లను పాలేరైన రంగయ్య చేత దొంగతనం చేయించిన వ్యక్తి గోవిందరావు. గోవిందరావు దళితుడైన వ్యక్తి ఎదుగుదలను ఓర్వలేక అతని మీద కక్ష్యకట్టి ఏదైనా చేయాలనుకుంటాడు. కొండయ్య తెలివి ముందు దొర తెలివి తేలిపోయింది. గోవిందరావు దళితులకు అన్యాయం చేయాలని కంకణం కట్టుకున్నాడు. గోవిందరావు తన తెలివితో బురిడి కొట్టించాలనుకుంటాడు. గోవిందరావుది ఒక

స్వార్థపూరిత పాత్ర, ఒకరి ఎదుగుదలను ఓర్వలేని వ్యక్తిగా అతన్ని అభివర్ణించవచ్చు. గోవిందరావు పాత్ర చివరికి తన ఆధిపత్యాన్ని కోల్పోతుంది.

### 4.2.18. లసుమయ్య (బతుకు పుస్తకం):

బతుకు పుస్తకం నవలలో లసుమయ్యది ప్రధానపాత్ర. లసుమయ్య కాపు కులానికి చెందినవాడు. అతడు కత్తెర్ల రాజన్నకు కొన్ని సంవత్సరాలు పాలేరుగా ఉంటాడు. లసుమయ్యకు తండ్రి రెండెకరాల భూమితోపాటు కొంత అప్పునిచ్చిపోయాడు. మరికొంత బీడు భూమున్నా అది ఎందుకు పనికిరాని భూమి కావడంతో తాను పెళ్లయి పిల్లలు పుట్టినంత వరకు పాలేరుగా పనిచేశాడు. పాలేరులో అవమానాలు భరించాడు. లసుమయ్య స్వంతంగా వ్యవసాయం చేసుకుంటూ రెండెకరాల భూమి కొన్నాడు. లసుమయ్య కుటుంబం అంతా కష్టపడి పనిచేయడం వల్ల ఇప్పుడో మాదిరిగా బతుకుతున్నారు. ఆ బీడు భూమిని కూడా సాగు చేస్తున్నాడు. బట్టపొట్టకు ఢోకా లేదన్నట్టుగా బతుకుతున్నాడు. కాపు బలిస్తే రెడ్డి అని అంటారు కాని అతనికి అలా పిలిపించుకోవడం ఇష్టం లేదు. అందుకే తన కొడుకులకు మల్లయ్య, రాజయ్యని పేరు పెట్టాడు. అతడు వ్యవసాయాన్ని నమ్ముకొని బతుకుతున్నాడు. లసుమయ్య పటేలా అని మల్లయ్య పటేలు పిలవడంతో ఇప్పుడు ఒక రకంగా బతుకుతున్నా, ఒకప్పుడు పాలేరు కావడం వల్ల అలా పిలవొద్దని చెప్పుతాడు. వ్యవసాయంలో ఉన్న కష్టనష్టాలను గూర్చి కొడుకులకు చెబుతాడు. లసుమయ్య తన పిల్లలను కొండల్ రావు పంతులు సూచనల మేరకు పాఠశాలకు పంపిస్తాడు. వర్షాలు బాగా రావడంతో లసుమయ్య ఆనందపడతాడు. ఇల్లు కురుస్తున్న అంతగా ఇబ్బంది పడకుండా వర్షం రావడంతో పంటలు బాగా పండించుకోవచ్చని సంబరపడేవాడు.

లసుమయ్యకి వ్యవసాయం పని అంటే ఇష్టం. ఒకప్పుడు తవ్వెడు మానెడు కావాలని ధాన్యాన్ని తీసుకుపోయిన షావుకార్లు, రైతులకే అప్పులు ఇచ్చే స్థాయికి రావడంతో లసుమయ్యకు రైతు పరిస్థితి గురించి ఏం చేయాలో అతనికి అర్థమవ్వడం లేదు. రైతు పరిస్థితి ఎప్పటిలాగే ఉందని బాధపడతాడు. అలాగే వ్యవసాయం పరిస్థితి లాటరీ లాగనే అయిందని కొడుకుకి చెప్తాడు. వాతావరణం అనుకూలించి వానలు పడితే పంట మంచిగా పండుతుంది. లేకపోతే విత్తనాలు దెబ్బతిని రైతులు అప్పులపాలు అవుతాడని చెప్తాడు. లసుమయ్య తండ్రిని కొండల్ రావు తండ్రి ఎన్నో ఇబ్బందులకు గురిచేస్తాడు. అయినా కొండల్ రావు మంచిగా, న్యాయబద్ధంగా ఉండి అన్ని రకాలుగా లసుమయ్యకి సాయంగా ఉండటంతో వాళ్లిద్దరు స్నేహితుల్లా ఉంటారు. ఆర్థిక పరిస్థితి వేరువేరుగా ఉన్నా వారి స్నేహం కొనసాగుతూనే ఉంటుంది. లసుమయ్య కొడుకు మల్లేశం

బొగ్గుబావి పనికి వెళ్ళాలనుకుంటాడు. అప్పుడు వ్యవసాయ కుటుంబంలో పుట్టిన కొడుకు పొట్టచేతిలో పట్టుకొని బతుకుదెరువు కొరకు వెళ్తున్నాడని అక్కడెలా బతుకుతాడోనని లసుమయ్య భయపడేవాడు. అతని చిన్న కొడుకు రాజయ్య బాగా చదువుకొని రచయితగా ఎదుగుతాడు. లసుమయ్య తన కొడుకును కొండల్ రావు పొగడటంతో సంతోషపడ్డాడు. తన కొడుకు కథలు రాస్తున్నాడని తెలిసినా తనకు చదువురానందువల్ల వాటి స్వరూప స్వభావాలేంటో అతనికి తెలియవు. రాజయ్య, పురుషోత్తమరావులతో చిన్ననాటి స్నేహాన్ని కొనసాగించడం లసుమయ్యకి ఎంతో అమితానందంగా ఉంది. కొండల్ రావుని ఊరి పెద్దల సమక్షంలో దోపిడీదారుడని అనడం లసుమయ్యకి ఇష్టం ఉండదు. కొండల్ రావు ఊరిని అభివృద్ధి చేశాడని, ఎంతో కొంత జనాలకి అండదండగా ఉన్నాడని లసుమయ్య పెద్దల సమక్షంలో చెప్తాడు. కొండల్ రావు ఊరిని వదిలివెళ్లి పోవడంతో లసుమయ్య బాధపడ్డాడు. లసుమయ్య పంచాయితీ సమయంలో కొండల్ రావుతోనే ఉండేవాడు.

లసుమయ్య కొడుకులు ఆర్థికపరమైన పంపకాలు జరగాలని పంచాయితీ పెడతారు. ఊరు పొమ్మంటుంది, కాడు రమ్మంటుంది. నేనింకా ఎన్ని రోజులు బతికుంటానో తెలియదు. నా కొడుకులిద్దరికి ఒకరిమీద మరొకరికి కోపం ఉంటే నాకయితే తెలియదు. నా ఇద్దరు కొడుకులు నాకు రెండు కళ్ల లాంటివారే మీరు ఎలా చెబితే అలాగే అని లసుమయ్య సర్పంచ్ రాజన్నతో అంటాడు. భూమి ఆలాగే ఉంచి దానిమీద వచ్చే ఆదాయం లసుమయ్యకే అని సర్పంచ్ ఆమోదయోగ్యమైన తీర్పును ఇస్తాడు. లసుమయ్యని కొడుకులు తమ దగ్గర ఉండమని అంటారు. లసుమయ్య ఊరు వదిలిపెట్టి ఎక్కడికి రాను. అప్పుడప్పుడు వచ్చి వెళ్తాను. నేను పోయేవరకు ఊళ్లోనే ఉంటానని అంటాడు. ఊరంటే ప్రేమతో దానితో ముడిపడి ఉన్న సంబంధాన్ని వదులుకోవాలనుకోవట్లేదు లసుమయ్య. కొంతకాలం గడిచింది. పత్తి రైతు రామయ్య ఆత్మహత్య చేసుకొని చనిపోయాడు. అతని మరణానికి చలించిపోయి లసుమయ్య దగ్గరికి రాజయ్య వచ్చి రామయ్య గూర్చి తెలుసుకుంటాడు. డబ్బు మీద ప్రేమతో మనిషి భ్రమలోపడి బతుకుతున్నాడని ఓవైపు మంచి వ్యవసాయాలు మూలన బడుతున్నాయి. అట్లే ఇంకో దిక్కు రైతులు ఆత్మహత్యలు జరుగుతున్నాయని లసుమయ్య కొడుక్కి చెప్పుకుంటా బాధపడుతున్నాడు. ఆ తరువాత కాలంలో కొడుకులు, కోడళ్లు, వారి పిల్లలు లసుమయ్యకి దగ్గరయ్యారు. అప్పుడప్పుడు వారు వచ్చిపోతూంటే లసుమయ్యకి ఆనందంగా ఉండేది. ఊళ్లోనే ఉంటూ కొడుకుల భవిష్యత్ ఉన్నతంగా ఉండటంతో లసుమయ్య హాయిగా జీవిస్తున్నాడు. లసుమయ్య పాత్ర ద్వారా రైతు యొక్క జీవితాన్ని

తెలుసుకోవచ్చు. ఊళ్లో రైతు పరిస్థితి కాలానికి తగినట్టుగా మారుతుందని తెలుస్తుంది. గ్లోబలైజేషన్ ప్రభావంతో రైతు ఇబ్బందుల్లో ఉన్నాడని లసుమయ్య పాత్ర ద్వారా తెలుసుకోవచ్చు. పాలేరుగా, రైతుగా, కుటుంబ పెద్దగా, కొడుకులను ఉన్నతంగా తీర్చిదిద్దినవాడిగా, దొరతో స్నేహం చేసినవాడిగా లుసమయ్య పాత్ర తీర్చదిద్దబడింది. రైతుకు పండించిన పంటకు ధరను నిర్ణయించుకునే రోజు రావాలని ఈ పాత్ర కోరుకుంటుంది.

### 4.2.19. కొండల్ రావు (బతుకు పుస్తకం):

బతుకు పుస్తకం నవలలో కొండల్ రావుది ప్రధాన పాత్ర. కొండల్ రావు పంతులు మొదటి పంచాయితీ ఎన్నికలప్పటి నుండి ఊరి సర్పంచుగా ఉంటున్నాడు. ఊరును అభివృద్ధి చేయడానికి తన శాయశక్తులా ప్రయత్నిస్తున్నాడు. అతను సర్పంచ్ అయినప్పటి నుండి స్వాతంత్ర్య, గణతంత్ర దినోత్సవ వేడుకల్ని ఘనంగా జరిపించేవాడు. కొండల్ రెడ్డి చిన్న కూతురైన అంజనవ్వ పెళ్లి ఘనంగా జరిపించాడు. ఆ ప్రాంతంలో అంతవరకు ఎవరు జరుపనంత గొప్పగా పెళ్లి జరిపించాడు. ఊళ్లో కులవృత్తులన్ని సజీవంగానే ఉన్నాయి. అన్ని కులాల నుండి కొద్దిమందైనా చదువుకుంటున్నారు. వారిని చదివించడం కొంతమంది పట్వారీలకు, రెడ్డి, వెలమ దొరలకు ఇష్టం లేదు. వారందరితో పోలిస్తే ఎంతో కొంత ప్రజాస్వామిక భావాలున్న కొండల్ రావు చదువు విషయంలో అందర్ని ప్రోత్సహిస్తున్నాడు. అతడు ఊరి స్వరూప, స్వభావాలను ఆకలింపు చేసుకున్నాడు. అన్ని కులాలవారు ఐక్యంగా ఉండటం చూసి వారిని చదువుకోవడానికి ప్రోత్సహిస్తూ వారికి చేదోడువాదోడుగా ఉండేవాడు. అతడు వారిలో కొంతమందిని పంచాయితీ మెంబర్లుగా తీసుకున్నాడు. అతడు కొడుక్కి ఒక మంచి ఇల్లు కట్టించాడు. అతను లసుమయ్య, భూమయ్య కొడుకులను చదివించాలని ప్రోత్సాహించేవాడు. చదువు వల్ల చాలా జ్ఞానం పొందొచ్చని చెప్పి వారు తమ పిల్లలను చదివించడానికి ప్రేరేపించాడు. అతనికి వ్యవస్థపై చాలా నమ్మకం ఉంది. ప్రజాస్వామ్య ప్రభుత్వాలపై అపరిమిత విశ్వాసం ఉంది. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత దేశం ఏదో విధంగా అభివృద్ధి పథంలోనే నడుస్తుందని అతని నమ్మకం. అతనిది దొరల కుటుంబమే అయినా ప్రజాస్వామిక భావాలతో ఉండేవాడు. కొందరు కొండల్ రావుని దొరా! మీరు అందరు దొరల్లాగా కాదు, ఏ దొరయినా రాజ్యాన్ని ఏలేవారు, కాని మీరు అలా కాదు, అందరిపై ప్రేమగా ఉంటారని అనేవారు.

ఊరిలో వానకు చెరువు నిండింది. ఆ చెరువు నీరే ఆ ఊరి వాళ్లందరికి జీవనాధారం. ఆ చెరువుకు గండి పడటంతో కొంతమంది పొలాలకు నష్టం కలిగింది. ఆ నష్టాన్ని పూడ్చడానికి

కొంతైనా ప్రయత్నం చేస్తానని కొండల్ రావు ప్రజలకు ధైర్యాన్నిచ్చాడు. కొండల్ రావు కొడుకుని చదివిస్తున్నాడు. ఇప్పుడున్న దొరతనం, వ్యవహారాలు, హోదా అన్ని శాశ్వతంగా ఉండవన్న నమ్మకంతో కొడుకైన పురుషోత్తమరావుని జీవితంలో స్థిరపడేటట్లు చేసే ప్రయత్నంలో ఉన్నాడు. అలాగే ఊరి వ్యవహారాలను కొండల్ రావు చూసుకుంటూనే ఉంటాడు. ఊరిలోని పెద్ద మనుషులతో చర్చించి పోచమ్మ బోనాల పండుగ చేయాలని నిర్ణయించారు. ఆ పండుగను ఘనంగా నిర్వహించారు. ఆ తరువాత ఊరిలో పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని కొండల్ రావు ప్రచారం చేస్తాడు. ఊళ్లో జ్వరాలు తగ్గడానికి వైద్య అధికారులతో చర్చించి వైద్య సాయం చేయించాడు. కొండల్ రావు ఊరి ప్రజల మన్ననలను పొందాడు. ఊళ్లో కొండల్ రావు బడిని ప్రారంభించాడు. అలాగే ఊరికి బస్సు కావాలని ప్రయత్నాలు చేస్తాడు. కొండల్ రావు ప్రయత్నాలు ఫలించి బస్సు ప్రారంభమవుతుంది. కొండల్ రావు తెలివితో హైస్కూలు, కరెంట్, బస్సు, పొచంపల్లి నీళ్లను తీసుకువచ్చి ఊరిని అభివృద్ధి వైపు నడుపుతుంటాడు. జూనియర్ కాలేజీ కొరకు ప్రయత్నం చేసినా ఊరు మెయిన్ రోడ్డుకు లోపల ఉండటం వల్ల కాలేజీ మంజూరు చేయించుకోలేకపోయాడు.

కొన్ని సంవత్సరాలు గడిచాయి. ఊళ్లో భూపోరాటాల ఉద్యమాల ఉధృతి తీవ్రంగా ఉంది. మావోయిస్టుల ప్రభావంతో చాలామంది దొరలు ఊళ్లను వదిలి వెళ్లిపోయారు. కొండల్ రావుకు మూడుసార్లు హెచ్చరికలు వస్తాయి. అతని కుటుంబ సభ్యులంతా ఊరొదిలి పోదామని అంటారు. కాని కొండల్ రావు మాత్రం ఊరు వదిలి వెళ్ళడానికి సిద్ధంగా లేడు. అతని మీద వ్యతిరేకత పెరుగుతుంది. యువకులు తిరుగబడుతున్నా ఊరు వదలకుండానే వస్తున్న మార్పులను కొండల్ రావు బేరీజు వేసుకుంటున్నాడు. అతని మీద వ్యతిరేకత పెరుగుతున్న కొద్దీ అతనికి మాత్రం ఊరు మీద ప్రేమ పెరుగుతుంది. ప్రభుత్వాలు తీసుకున్న చర్యల వల్ల వివిధ పథకాల అభివృద్ధి జరుగుతుందని అతని విశ్వాసం. మరి కొన్నేండ్లు కాలగర్భంలో కలిసిపోయాయి. కాలంతోపాటు అనేక మార్పులు సంభవించాయి. యువతరం వృద్ధతరాన్ని ప్రశ్నించడం ఎక్కువైంది. కొండల్ రావు వృద్ధుడయ్యాడు. వయస్సు పెరగడంతో సర్పంచుగా పోటీ చేయలేదు. కొండల్ రావు ఊళ్లోనే ఉండటంతో అన్నల నుండి బెదిరింపులు వస్తున్నాయి. చాలామంది అతన్ని ప్రశ్నిస్తూనే ఉన్నారు. ఎన్నో పంచాయితీలు చేసిన కొండల్ రావు మీద దోపిడీదారుడిగా ముద్రవేసి రచ్చబండ దగ్గర పంచాయితీ పెట్టారు. అయినా అతను ఊరును వదలడానికి సిద్ధంగా లేడు. అతని మనసంతా వేదనాభరితమై ఉంది. కడుపు నిండా దుఃఖముంది. అతను ఎంతో ప్రేమించిన తన గ్రామానికి చెందినవాళ్లే తనని ఘోరాతి ఘోరంగా అవమానాలకు గురిచేయడం అతనికి భరించరానిదిగా

ఉంది. అతడు మట్టిలో పనిచేయకున్న మట్టితో తనకెంతో అనుబంధముంది. పాతతరం వారు అతనికి కొంతమంది ఇప్పటికీ మద్ధతు ఇస్తున్నారు. నేను సాధ్యమైనంత వరకు ఊరిని కొంత అభివృద్ధి చేశాను. నేను ఊరి సొమ్మును తినలేదు. నా తల్లిదండ్రుల కష్టార్జితాన్నే తిన్నాను అయినా ఎందుకు నన్ను దోపిడీదారునిగా చిత్రిస్తున్నారు అని కొండల్ రావు ఆవేదనగా వారితో అంటాడు. యువకులు అతనితో వాదిస్తూనే ఊరు వదిలి వెళ్ళమని చెప్పుతుంటారు. ఏ విషయాల్లోనూ పాల్గొనకుండా గ్రామంలోనే ఉంటాను. బయటకు రాకుండా మట్టిలో కలిసిపోయేవరకు ఈ ఊళ్లోనే ఉంటాను అని చెప్పి కొండల్ రావు ఇంటికి వెళ్తాడు. చివరికి యువకుల బెదిరింపులతో కొండల్ రావు కుటుంబంతో కలిసి ఊరు వదిలి వెళ్ళిపోతాడు. కొంతకాలం తరువాత ఊరుమీద బెంగపెట్టుకొని మనోవేదనకు గురయ్యి చనిపోతాడు. ఊరి మీద ఎంతో ప్రేమ ఉన్నవాడు కొండల్ రావు. కొండల్ రావు మరణవార్త విని అతని తరంవారు బాధపడతారు.

కొండల్ రావు పాత్రను కాలువ మల్లయ్య ఎంతో చక్కగా చిత్రించాడు. కొండల్ రావు పాత్ర దొరల కుటుంబంలో కూడా ప్రజాస్వామిక భావాలున్నాయని నిరూపించింది. ఊరు అభివృద్ధి కోసం తపించిన పాత్ర కొండల్ రావుది. ఊరులోని వివిధ కులాల వారిని కలుపుకుపోతూ వారి క్షేమం కోసం పాటుపడిన పాత్ర ఇది. ఊరిలో సర్పంచుగా ఉంటూ ప్రభుత్వ పథకాలను దోపిడీకి గురికాకుండా అమలు చేసిన ఏకైక పాత్ర ఇది. సమాజంలో వచ్చిన మార్పులు అతన్ని దోపిడీదారున్ని చేయడం దారుణం. అందరూ చదువుకోవాలని వారి అభివృద్ధి చూడాలని తపించిన పాత్ర అది. సమాజంలో ప్రతి మార్పుకి స్పందించి ఆ మార్పును స్వాగతించిన వ్యక్తి కొండల్ రావు. దొర అయిన దోపిడీ, పీడనలు లేకుండా తన సొమ్మునే ఖర్చుపెట్టి సమాజానికి ఆదర్శంగా ఉన్న పాత్ర.

### 4.2.20. రాజయ్య (బతుకుపుస్తకం):

లసుమయ్య చిన్న కొడుకు రాజయ్య. రాజయ్య తండ్రికి పనిలో సహాయం చేస్తూ చదువుకుంటాడు. రాజయ్య మంచిగా చదువుతుండటంతో కొండల్ రావు అతన్ని ప్రోత్సహిస్తాడు. కొండల్ రావు ప్రోత్సాహంతో రాజయ్యకు, తన కొడుకైన పురుషోత్తమరావుతో స్నేహం ఏర్పడుతుంది. రాజయ్య, పురుషోత్తమరావులు ఎంతో చక్కగా ఆడుతూ పాడుతూ చదువుకుంటున్నారు. రాజయ్య ఆదర్శంగా జీవించాలనుకుంటాడు. రాజయ్య చదివే క్రమంలో ఇంజనీరింగులో సీటు వస్తే వెళ్లడు. ఆ తరువాత డిగ్రీ పూర్తిచేసి ఉపాధ్యాయ వృత్తి చేస్తాడు. ఆ ఉద్యోగం కూడా వదిలి  ఫ్యాక్టరీలో ఉద్యోగం చేస్తాడు. రాజయ్య ఉద్యోగం చేస్తూ కథలు

రాస్తుంటాడు. అతడు తనకు తెలియని కార్మిక వర్గం గురించి తెలుసుకునే అవకాశం లభించిందని సంతోషపడేవాడు. గోదావరిఖని పారిశ్రామిక ప్రాంతంలో ఉంటున్న సమయంలో కమలతో రాజయ్యకు పెళ్ళైంది. అక్కడ ఉన్న వివిధ మనస్తత్వాలకు చెందిన మనుషులను చూడటమూ, వైవిధ్యపూరితమైన బతుకులు, ఎన్నో అనుభవాలను పొందాడు. ఇవన్నీ అతన్ని రచయితను చేయడానికి ఉపయోగపడ్డాయి. ఆకలి మనుషులు కనబడితే చాలు రాజయ్య కథకు వస్తువు దొరికినట్టే. అతడు ఊరిలో చూసిన సంఘటనలను, వృత్తులను ఆధారంగా చేసుకొని రచనలు చేస్తూనే ఉన్నాడు. ఆ ప్రాంతంలో జరుగుతున్న ఉద్యమాల గూర్చి వీరావేశంతో సమర్థిస్తూ రాస్తాడు. గ్రామాల్లో ఉద్యమాలు తెచ్చిన మార్పులను వాస్తవికంగా చెబుతూ కథలు రాస్తాడు. రాజయ్య సాహిత్యంలో ఒక్కో మెట్టు ఎదుగుతుంటే లసుమయ్య ఆనందించేవాడు. రాజయ్య కథలు రాస్తూనే చిన్ననాటి మిత్రుడైన పురుషోత్తమరావుతో స్నేహం కొనసాగిస్తుంటాడు. రాజయ్య తన అన్నతో వైరాన్ని, తన కుటుంబంలోని చిన్న సమస్యలను పరిష్కరించుకోలేకపోతున్నందుకు సిగ్గుపడేవాడు. కొంత కాలం తరువాత అన్నదమ్ములు కలిసిపోతారు. రాజయ్య సమాజాన్ని అర్థం చేసుకొని అతడు అన్నతో కలిసిపోతాడు. రాజయ్య అప్పుడప్పుడు ఊరికి వెళ్లి వస్తుంటాడు. అక్కడి జీవితాలను గమనిస్తుంటాడు. కాని తన పిల్లలకు ఊరుతో సంబంధాలు లేకుండా పోతున్నాయని అతడు బాధపడేవాడు. రాజయ్య భార్య కమల లోకం ఎంతో వేగంతో పరిగెడుతుంటే తాను మాత్రం పల్లెలంటూ కలవరిస్తున్నాడని తిడుతుంది.

ఊళ్లో పత్తి రైతు రామయ్య చనిపోవడం రాజయ్యకు బాధగా అనిపించింది. అతనికి దగ్గరివాడైన రామయ్య రైతు ఆత్మహత్య చేసుకోవడం, మరోవైపు భూపోరాటాలు జరగడం చూసి రాజయ్య చలించిపోతుంటాడు. ఓవైపు వ్యవసాయం మూలనపడటం, మరోవైపు ఆత్మహత్యలు జరగడం గురించి తండ్రితో చర్చించేవాడు. లసుమయ్య తండ్రి రాజయ్యకు తన జీవితానుభవాలను తెలియజేస్తాడు. రాజయ్యకి కొండల్ రావు చనిపోయిన విషయం తెలియడంతో వారి కుటుంబాన్ని పరామర్శిస్తాడు. కుటుంబానికి అండగా ఉండమని పురుషోత్తమరావుకి చెప్తాడు. అలాగే ఊరంటే బతుకుపుస్తకమని, ఆ ఊరి ద్వారా మరెన్నో విషయాలు తెలుసుకోవచ్చని చెప్పి రాజయ్య వెళ్తాడు. కాలచక్రం గిర్రున తిరుగుతుంది. రాజయ్య పిల్లలను తీసుకొని ఉగాది పండుగకు ఒక రోజు ముందే ఊరికి వస్తాడు. తండ్రి కొడుకులు ఊరి గురించి చర్చించుకుంటారు. రాజయ్య చిన్నతనంలో గ్రామాల్లో చక్కని సమతుల్యమైన వ్యవసాయం ఉండేదని, వ్యవసాయం కొంతవరకు లాభంగా ఉండేదని తండ్రితో అంటాడు. ఈ ఇరవై ముప్పై సంవత్సరాలలో విపరీతమైన మార్పు వచ్చిందని,

వ్యాపార సంస్కృతి ప్రవేశిస్తుందని, భవిష్యత్తులో వీటి ఫలితాలు ఎన్ని అనర్థాలకు దారితీస్తాయో అని తండ్రితో అనడంతో కొడుకు మాటలకు లసుమయ్య ఆశ్చర్యపోతాడు. కాలం పరిగెడుతూనే ఉంది. కాలంతోపాటు అదే వేగంతో మార్పులు చోటు చేసుకున్నాయి. రాజయ్య గ్రామాలపై పరిశోధన చేస్తున్నాడు. రాజయ్య ఈ శతాబ్ది ఆరంభంలో పల్లె స్వరూప స్వభావాల గూర్చి అనేక విషయాలను సేకరించాడు. తన గ్రామ నేపథ్యంగా తనకు తెలిసిన జీవితాల ఆధారంగా అనుభవాలను క్రోడీకరించాడు. అందులో భాగంగానే మిత్రులతో కలిసి ఊరెళ్లాడు. పురుషోత్తమరావు, భూమయ్యలతో కలిసి రాజయ్య పల్లెను తిరిగి వాతావరణాన్ని ఆస్వాదిస్తాడు. ఒకప్పుడు ఉన్నవాటిని పోల్చుకుంటూ తిరిగారు. ప్రతి కుటుంబంలో నలుగురు ఉన్న ఇంకా చాలామంది ఉద్యోగాలు చేస్తూ పట్టణాల్లో ఉండటం వల్ల ఇళ్ల సంఖ్య పెరగలేదని రాజయ్య అంటాడు. పురుషోత్తమరావు ఇంటి దగ్గరకు రాగానే అప్పుడు ఉన్న వైభవం లేదని ఇల్లు శిథిలావస్థలో ఉందని అనుకుంటూ తిరుగుతూనే ఉంటారు. చాలా ఇళ్లకు తాళాలు ఉండటం గమనించాడు. ఊరు మొత్తం తిరిగి ఎన్నో విషయాలు తెలుసుకున్నాడు. 19వ శతాబ్ది చివరి మూడు దశాబ్దాల్లో వలసలు పెరిగినవని ఇది ఎంతో కాలముండదని ఎందుకంటే పల్లెలుండకుంటే పంటలుండవు, జీవితం ఉండదు అని మిత్రులతో రాజయ్య చెప్తాడు. ఊరు బతుకుపుస్తకమే. బతుకు తెరువు పుస్తకం. ఊరు గురించి ఎంత చదివిన తక్కువే అని రాజయ్య పాత్ర ద్వారా తెలుసుకోవచ్చు. రైతు కొడుకుగా రైతు జీవితాన్ని ఇష్టపడే వ్యక్తిగా, గ్రామాలను బతుకుపుస్తకాలుగా భావించే వ్యక్తిగా, పల్లెల స్వరూప స్వభావాలను అర్థం చేసుకున్న వ్యక్తిగా రాజయ్య పాత్ర చిత్రించబడింది.

### 4.2.21. రాజ్యలక్ష్మి (తెలంగాణ దేవదాసు):

రాజ్యలక్ష్మిది తెలంగాణ దేవదాసు నవలలో ప్రధాన పాత్ర. రాజ్యలక్ష్మి వేణుగోపాల్ రెడ్డి దొర కూతురు. ఆమెను చిన్న దొరసానిగా పిలిచేవారు. ఆ గడీలో ఆమె మాటకు తిరుగుండదు. ఆమెను కుటుంబంలోని వారు గారాబంగా చూడటం వల్ల పెంకి ఘటంగా ఉంటుంది. ఆమె ఎడ్ల బండిలో బడికి పోయేది. ఆమెకు రఘురాంతో బడికి పోయే సమయంలో పరిచయం ఏర్పడుతుంది. తండ్రి అనుమతితో ఆమె రఘురాంతో స్నేహం చేస్తూ ఆటలు ఆడేది. ఆమెకు చదువు విషయంలో చాలా విషయాలు రఘురాం చెప్పేవాడు. అతని పరిచయం వల్ల ఆమెలో కొన్ని మార్పులు వచ్చాయి. గడీలో ఉన్నప్పుడు ఆమెకు కోపం ఎక్కువగా ఉండేది. అతని స్నేహం వల్ల ఆమెకు జాలి, దయ, ప్రేమ అనేవి తెలిశాయి. ఆమెకు గడీలో ఉంటే ఇబ్బందిగా ఉందని తండ్రిని అడిగి రఘురాంతో కలిసి ఊరు మొత్తం తిరుగుతుంది. ఊళ్లో ఉన్న వివిధ వృత్తుల వారిని, వారి జీవన విధానాన్ని

చూస్తుంది. వారు పడుతున్న బాధలను గమనిస్తుంది. రఘురాంతో పరిచయం ఆమెకు గడీకే పరిమితమయ్యేలా కాకుండా ప్రపంచాన్ని చూసే అవకాశం కలిగింది. అతని స్నేహమే ఆమెను మానవీయంగా మారుస్తుంది.

రఘురాంతో ఉండటంవల్ల ఆమె తెలివితేటల్లో మార్పు వస్తుంది. అతని కళ్లతోని లోకం చూడటం వల్ల ఆమెకు అతనిపై ప్రేమ పెరుగుతుంది. అతనిపై ఆమెకు ఆరాధనాభావం పెరుగుతుంది. అతని వల్ల ఆమె అహంకారాన్ని పోగొట్టుకుంటుంది. జీవితం అంటే ఏమిటో తెలుసుకుంటుంది. అతని ప్రభావం ఆమెపై విశేషంగా ఉండేది. అతనితో ప్రేమలో ఉండటంతో ఆ విషయాన్ని తండ్రికి చెప్పాలనుకుంది. తండ్రికి విషయం తెలిసాక కోపానికి గురై ఆమెను తిడతాడు. రాజ్యలక్ష్మి ఎలాగైనా తండ్రిని ఒప్పించాలనుకుంటుంది. కాని చివరకు తండ్రి బెదిరింపుతో తలదించుకొని బాధపడుతూ ఉంటుంది. రఘురాం కూడా ఆమెకు అనేక విషయాలు చెప్పి సర్ది చెప్పాలనుకుంటాడు. కాని ఆమె ప్రేమ ముందు అవి ఏమి చేయలేకపోయాయి. ఆమె ఎంతో గాఢంగా అతన్ని ప్రేమిస్తుంది. రఘురాంను చంపుతా అని తండ్రి బెదిరించడంతో రాజ్యలక్ష్మి ఆ బెదిరింపులకు భయపడి రఘురాం జీవితాన్ని నాశనం చేయవద్దనుకోని తనపై ఉన్న ప్రేమను వదలుకోవాలని నిర్ణయించుకుంటుంది. ఆమె ఇష్టం లేకున్నా ప్రక్క ఊరి దొర అయిన భూమారెడ్డిని పెళ్లి చేసుకుంటుంది. చివరకు భర్త మంచి సంస్కారవంతుడు కావడంతో రఘురాంతో మాట్లాడి అతని జీవితాన్ని నిలబెడుతుంది. ప్రేమ అంటే ఏమిటో ఈ పాత్ర ద్వారా తెలుసుకోవచ్చు. ప్రేమించిన వ్యక్తిగా, ప్రేమను పొందుతున్న వ్యక్తిగా రాజ్యలక్ష్మి పాత్ర చిత్రించబడింది.

### 4.2.22. రఘురాం (తెలంగాణ దేవదాసు):

తెలంగాణ దేవదాసు నవలలో రఘురాం ప్రధాన పాత్రధారుడు. పాలేరు కొండయ్య కొడుకు రఘురాం. అతడు చిన్నప్పటి నుండి చదువుకుంటూ ఉత్సాహంగా ఉంటాడు. రాజ్యలక్ష్మి, రవీందర్ రెడ్డిలు అతనికి బడిలో స్నేహితులు. రఘురాం వారి ఇంటికి వెళ్లి ఆడుకుంటూ ఉండేవాడు. రఘురాం రాజ్యలక్ష్మికి ఊరి గురించి చాలా విషయాలు తెలిసేటట్టు చేస్తాడు. గడీలలో ఏముండదని ఊళ్లోని ప్రకృతిలో అందం ఉంటుందని తెలియజేస్తాడు. గడీలలో ఉన్న రాజ్యలక్ష్మికి ఊరుపై మమకారం ఏర్పడేటట్లు చేయడంలో రఘురాం పాత్ర అమోఘమైంది. రఘురాం, రాజ్యలక్ష్మిలు దాదాపుగా పదకొండు సంవత్సరాలు కలిసి చదువుకోవడం జరుగుతుంది. అతడు చదువుకుంటూ రాజ్యలక్ష్మిపై ప్రేమను పెంచుకుంటాడు. ఆమెకు ప్రకృతిని పరిచయం చేస్తాడు. ఆమెకు చిన్న ముల్లు కుచ్చుకున్న విలవిలలాడేవాడు. ఆమెపై ఎంతో ప్రేమను పెంచుకుంటాడు.

కొంత కాలం గడిచింది. అతడు చదువును పూర్తి చేస్తాడు. అప్పుడప్పుడు ఊరికి వెళ్లి రాజ్యలక్ష్మిని, రవీందర్ రెడ్డిని కలిసి వచ్చేవాడు. వేణుగోపాల్ రెడ్డి దొర అతని పై కోపంతో నిఘా పెడతాడు. ఈ విషయం తెలిసిన అతను అటువైపు వెళ్లడం మానుకుంటాడు. రఘురాం రాజ్యలక్ష్మిని మరిచిపోవాలని దొర బెదిరిస్తాడు. అలాగే వేణుగోపాల్ రెడ్డి రాజ్యలక్ష్మితో రఘురాంను ప్రేమించట్లేదని చెప్పిస్తాడు. రఘురాం రాజ్యలక్ష్మిని మరిచిపోవాలనుకుంటాడు. రాజ్యలక్ష్మి కూడా తనను మరిచిపోయేటట్టు చేయాలనుకుంటుంది. ఇది సినిమా కాదు, జీవితం అని, ఫ్యూడల్ బీజాలు ఉన్న ఈ ఊళ్లో ప్రేమలు గీమలు అసలే ఇక్కడ కుదరవని ఎంతో బాధతో ఆమెకు చెప్తాడు. మన మధ్య పెళ్లి జీవితానుబంధం కాదని, పాలేరు యజమానుల సంబంధం అని తెలియజేస్తాడు. చిన్ననాటి స్నేహాన్ని ప్రేమగా భ్రమపడటం సరైందికాదని చెప్తాడు. అలాగే తాత్కాలిక ఆవేశంలో ప్రేమ వివాహం చేసుకున్నా సమస్యల సుడిగుండంలో కొట్టుమిట్టాడాల్సి వస్తుందని ఆమెకు చెప్పి రఘురాం బాధతో వెళతాడు. కాని ఆమెను మాత్రం మరిచిపోలేకపోతాడు. నాలుగు నెలలు గడిచాయి. ఆమె తన స్నేహితురాలైన సునీతతో లేఖ పంపిస్తుంది. ఆమె అతన్ని మరిచిపోలేక బాధపడుతూ కలిసి జీవించి ఉందామని చెప్పుతూ లేఖ రాస్తుంది. ఆ లేఖను చదివి విపరీతంగా రఘురాం ఏడుస్తాడు. తాను చేస్తున్నది ఆత్మవంచనే అని అంగీకరించి ఆమెను స్వీకరించడానికే నిర్ణయించుకుంటాడు. రాజ్యలక్ష్మిని పెళ్లి చేసుకోవాలన్న ఆరాటంతో, ఆశతో, ఆమెతో గడపబోయే జీవితాన్ని ఊహించుకుంటూ ఊళ్లోకి అడుగుపెడ్తాడు. కాని ఊళ్లో ఆమె పెళ్లి పల్లకి ఎదురవడంతో ఎంతో వేదనకు గురవుతాడు. ఆ బాధతో ఊరిని వదిలి పట్టణానికి వెళతాడు. రోజుకొక్కసారైన ఆమె ఉత్తరాన్ని చదువుతూ ఆమె గురించి ఆలోచిస్తూ గడిపేవాడు. మిత్రులు ఎంత ప్రయత్నించినా అతనిలో మార్పు రావడం లేదు. అతడు ఆమెను మరిచిపోలేక తెలంగాణ దేవదాసుగా మారుతాడు.

అతని పరిస్థితిని చూసి తల్లిదండ్రులు బాధపడేవారు. ఆమె పై బాధ, కోపం, ప్రేమ, జాలి ఉండటంతో అతడు మనిషి కాలేకపోతున్నాడు. అతని స్నేహితులైన సునీత రాజ్యలక్ష్మితో మాట్లాడే ప్రయత్నం చేసి అతన్ని రాజ్యలక్ష్మి ఇంటికి పంపిస్తుంది. రఘురాం ఆమెనుంచి నిజాన్ని తెలుసుకుంటాడు. వేణుగోపాల్ రెడ్డి అతన్ని చంపిస్తాననడంతో పెళ్లికి ఒప్పుకోవలసి వచ్చిందని ఆమె చెబుతుంది. ఆమెను అర్థం చేసుకోలేకపోయానని రఘురాం బాధపడతాడు. ఆమె భర్త మంచితనం గురించి తెలుసుకుని ఆమె అదృష్టవంతురాలు అని చెప్పి వెళతాడు. ఆమెకు సంస్కారవంతమైన భర్త దొరికిందని తెలిసి అతడు ఆనందిస్తాడు. ఆమె కోరిక మేరకు అతన్నే ప్రేమిస్తున్న మహేశ్వరిని పెళ్లి చేసుకుంటాడు. పెళ్లి తరువాత రాజ్యలక్ష్మి కుటుంబంతో రఘురాం

అన్యోన్యంగా ఉంటాడు. రఘురాం పాత్ర ద్వారా ప్రేమలో విఫలమైన తెలంగాణ దేవదాసుగా, పెద్దలు రఘురాం ప్రేమను విఫలం చేసిన అతడు ఎదుగుతూ ప్రేమామయమైన కుటుంబాన్ని నిర్మించినవాడిగా ఈ పాత్ర మనకు కనిపిస్తుంది. జీవితానికి లక్ష్యం అంటూ ఉంటే అన్ని విషయాలు చిన్నవిగానే ఉంటాయని ఈ పాత్ర తెలియజేస్తుంది.

### 4.2.23. వేణుగోపాల్ రెడ్డి (తెలంగాణ దేవదాసు):

తెలంగాణ దేవదాసు నవలలో వేణుగోపాల్ రెడ్డిది ప్రధాన పాత్ర. అతను ఊరికి దొర. అతడు ఆ ఊరికి మకుటంలేని మహారాజు. అతడి రెండు వందల ఎకరాల భూమికి యజమాని. అతడు గడీ ఎప్పుడూ సందడిగానే ఉంటుంది. అతని గడీలో పాలేర్లు, పనివాళ్లు చాలామంది పనిచేస్తుంటారు. అతని కుటుంబాన్ని అందరు దొరా నీ బాంచెన్ కాల్మొక్తా అని పిలుస్తారు. వేణుగోపాల్ రెడ్డికి పాలేరుగా పనిచేసిన కొండయ్య కొడుకుని అతని కూతురు రాజ్యలక్ష్మి ప్రేమిస్తుంది. రఘురాం, రాజ్యలక్ష్మిలు చదువుకుంటూ ఉన్నప్పుడు వేణుగోపాల్ రెడ్డి రఘురాంను చాలాసార్లు కోపగించుకునేవాడు. వేణుగోపాల్ రెడ్డి రఘురాంపై నిఘా పెట్టి అతని విషయాలను తెలుసుకునేవాడు. ఈ ప్రాంతానికి పేరు మోసిన దొరలం అని, మన ఆస్తిని ఓ అనామకుడికి అప్పచెప్పాలా అని, మన హోదాకు తగిన గొప్ప సంబంధం తీసుకొస్తానని కూతురుతో చెప్పి రఘురాంను శాశ్వతంగా మరిచిపోకపోతే అతన్ని చంపేస్తానని రాజ్యలక్ష్మిని బెదిరిస్తాడు. తండ్రి మాటలు విన్న రాజ్యలక్ష్మి తండ్రి మూర్ఖంగా ఏదైనా చేస్తాడని బాధను దిగమింగుకుంటూ తండ్రి నిర్ణయానికి అంగీకరిస్తుంది. అలాగే మరోవైపు రఘురాంను కూడా వేణుగోపాల్ రెడ్డి అవమానాలకు గురిచేస్తాడు. అతడు పరువు కోసం కూతురు ప్రేమని కూడా కాదంటాడు. పరువే ప్రాణంగా బ్రతుకుతున్న పాత్ర వేణుగోపాల్ రెడ్డిది. ఇంజనీరింగ్ చదివినవాడిని కూడా చులకనగా చూడటం అతని నైజానికి నిదర్శనం అనిపిస్తుంది. దొర అన్న అహంగారం గలవాడిగా, పరువు కోసం తపించే వ్యక్తిగా, డబ్బుతో ఏదైనా చేయొచ్చన్న వ్యక్తిగా వేణుగోపాల్ రెడ్డి పాత్ర చిత్రించబడింది.

### 4.2.24. శివయ్య (డబ్బు – తృప్తి = దుఃఖం):

'డబ్బు మైనస్ తృప్తి = దుఃఖం' నవలలో శివయ్యది ప్రధానపాత్ర. శివయ్య సుమిత్రమ్మ కొడుకు. అతడు బాగా కష్టపడి చదువుకునేవాడు. తండ్రి లేకపోవడంతో సుమిత్రమ్మ అతన్ని మంచిగా చూసుకునేది. అతడు హుషారుగా ఉంటూ తల్లిచాటు కొడుకుగా పెరిగాడు. శివయ్య భోళాశంకరుడిలాంటివాడని అతనికి ఆ పేరు పెట్టారు. అతడు చదువు పూర్తిచేసి జీవితంలోకి

ప్రవేశించాడు. అతడు డబ్బు సంపాదించాలనుకుంటాడు. సుఖంగా బ్రతకడానికి ఎక్కువగా సంపాదించాలనుకుంటూనే ఉద్యోగంలో చేరాడు. మంచి జీతమున్న ప్రభుత్వ ఉద్యోగం అది. ఉద్యోగం చేస్తూ కొంతకాలం తరువాత మేనమామ కూతురైన మంజులను పెళ్లి చేసుకుంటాడు. భార్యతో కలిసి సుఖంగా జీవిస్తుంటాడు. భార్య డబ్బు గురించి చెబుతూ, మార్గం ఏదైనా డబ్బు సంపాదించాలంటుంది. ఆమె జీతంతోపాటు ఇతర సంపాదన కావాలంటుంది. శివయ్య భార్య, తల్లి, స్నేహితుడు, మేనమామ ఈ నాలుగు స్థంభాలాటలో నలుగుతుంటాడు. స్నేహితుడి హితబోధ నచ్చక అతన్ని, తల్లికి ముసలితనం వచ్చిందని పట్టించుకోవాల్సిన అవసరం లేదని వారి ఇద్దరిని ప్రక్కకు పెడతాడు. డబ్బును సంపాదించాలని ఉద్యోగాన్ని ఒక సెక్షన్ నుండి మరొక సెక్షనుకు మార్చుకుంటాడు. అతనికి పెళ్ళై పదేళ్లు గడిచేసరికి ఐదుగురు కూతుర్లను కంటాడు. అతను కష్టాల ఊబిలో కురుకుపోతూ కుటుంబ భారాన్ని మోయలేక సంపాదన ఎక్కువగా ఉండాలని ప్రయత్నం చేస్తుంటాడు. అతడు ఒత్తిడితో బతుకుతుంటాడు. కొడుకు కావాలని ఆశపడి దుఃఖానికి లోనవుతున్నాడని తల్లి సుమిత్రమ్మ బాధపడేది. కొన్ని సంవత్సరాలు గడిచాయి. శివయ్య పిల్లలు పెరుగుతున్నారు. ఖర్చులు పెరుగుతున్నాయి. శివయ్య జీతం కూడా కొంత పెరిగింది. అయినా అవి వారి ఖర్చులకు సరిపోవడం లేదు. భవిష్యత్తు అవసరాలు అతన్ని భయపెడుతున్నాయి. పిల్లల కొరకైనా అతడు సంపాదించాలనుకుంటాడు. వారి పెళ్ళిళ్ల కొరకు సంపాదించాలని అనుకుంటాడు.

అతడు బాగా సంపాదించాలని షేర్లలో పెట్టుబడి పెడతాడు. అందులో నష్టపోతాడు. ఆ మాయలోకంలో కొంత డబ్బును కోల్పోతాడు. ఆ తరువాత ఫైనాన్స్ కంపెనీలో పెట్టుబడి పెట్టి నష్టపోతాడు. అలాగే బాబ్జీ అనే స్నేహితుడికి కొంత డబ్బును వడ్డీ రూపంలో ఇస్తే అతడు కొంత డబ్బు ఇచ్చి మిగతాది ఇవ్వకపోవడంతో చాలా నష్టపోతాడు. అతడు సంపాదించుకోవాలనుకుంటూ నష్టాల పాలవుతాడు. అతని కూతుళ్లు ఎదగడంతో వారికి పెళ్లిళ్లు చేయాలని అనుకుంటాడు. అతని భార్య మంజుల ఎంత కట్నం ఇచ్చైనా సరే మంచి సంబంధాలను చూసి పెళ్లి చేయాలని చూస్తుంది. అతని భార్య అత్యాశ వల్ల కష్టార్జితమైన డబ్బును కోల్పోతాడు. అతడు ఇద్దరు కూతుళ్లకు తనకున్న కొద్దిపాటి ఆస్తులను విక్రయించి పెళ్లి చేస్తాడు. అతడు వారి పెళ్ళిళ్లను ఘనంగానే చేస్తాడు. కూతురు అశ్విని సంసారం అంతంత మాత్రంగా కొనసాగుతున్నా, మరొక కూతురు భరణికి కట్నం గురించి వేధింపులు మొదలయ్యాయి. శివయ్య భారీ కట్నాలు కూతుళ్లకు ఇచ్చిన కూడా వారు సుఖంగా లేకపోవడంతో బాధపడుతుంటాడు. అతడు డబ్బును కోరుకున్నాడు. ఆ డబ్బు ద్వారా సుఖం

వస్తుందనుకుంటాడు. కాని డబ్బు, సుఖం లేకపోవడంతో బాధపడుతుంటాడు. అతడు ఆత్మహత్య చేసుకోవాలనుకుంటాడు కాని సమాజం అతన్ని పిరికివాడు అంటుందని చనిపోదలుచుకోలేదు.

స్నేహితుడు సదానందం జీవితంలో సామాజికత, జీవితానికో లక్ష్యం లేకపోవడం, మీ కుటుంబ దుఃఖానికి కారణం నువ్వే అని చెప్తాడు. సదానందం చెప్పిన విషయాన్ని గూర్చి ఆలోచించి మిగతా కూతుర్ల విషయంలో, భవిష్యత్తు జీవితం గురించి సరైన నిర్ణయం తీసుకోవాలని శివయ్య మధనపడుతుంటాడు. తనను తాను ప్రక్షాళన చేసుకుంటాడు. మంచి చెడుల గురించి ఆలోచిస్తాడు. అతడు పిల్లల బతుకులు సుఖవంతంగా ఉండాలని అనుకుంటాడు. కొని తెచ్చుకున్న దుఃఖాలను పోగొట్టుకుంటూ, సాధ్యమైనంత ప్రశాంతంగా బతకాలనుకుంటాడు. అతనికి సంపాదనపై స్పష్టమైన అభిప్రాయాలు లేకపోవడంతో దుఃఖం, ఒత్తిడిలను ఎదుర్కొన్నాడు. సుఖంగా బ్రతకడమంటే బాగా డబ్బుతో మాత్రమే బతకడం కాదని తెలుసుకుంటాడు. అతడు డబ్బు ఒక్కటే సుఖమివ్వదని అనుభవపూర్వకంగా తెలుసుకుంటాడు. సంపాదించుకుంటూనే తృప్తి పొందాలి. మనిషికి తృప్తి అనేది ఉండాలి. తృప్తి లేకుంటే సుఖం లేదని తెలుసుకుంటాడు. అతనికి చివరికి జీవితం గురించి స్పష్టమైన అభిప్రాయం వస్తుంది.

తల్లిచాటు కొడుకుగా, పెండ్లాం చాటు మొగుడిగా ఉంటూ జీవితం, సంపాదన మీద స్పష్టమైన అభిప్రాయాలు లేక జీవితాన్ని దుఃఖమయం చేసుకున్నవాడిగా, జీవితం అంటే సుఖదుఃఖాల మిలితం అని తెలుసుకున్నవాడిగా శివయ్య పాత్ర తీర్చిదిద్దబడింది.

### 4.2.25. మంజుల (డబ్బు – తృప్తి = దుఃఖం):

మంజులది నవలలో ప్రధాన పాత్ర. ఆమె మేనబావ అయిన శివయ్యను పెళ్లి చేసుకుంటుంది. ఆమె భర్తకు భవిష్యత్తు అవసరాలు గురించి చెప్పి డబ్బు సంపాదించాలనే సూచన ఇస్తుంది. భర్తను తన గుప్పిట్లో పెట్టుకొని తన మాట వినేలా చేయాలని ప్రయత్నాలు చేస్తుంది. అందులో భాగంగానే లంచాలు తీసుకోమని చెబుతుంది. తమ పనులు తొందరగా కావాలని, వాళ్ళేదో కొంత డబ్బు ఇస్తే అది లంచం కాదని, అది వారి పనుల కొరకు ఇచ్చే పారితోషికం అని చెబుతుంది. అమాయకంగా బ్రతకవద్దని జీతం డబ్బుతో చాలీచాలని బతుకు బ్రతకవలసి వస్తుందని, అవకాశం ఉన్నప్పుడే సంపాదించుకుంటే తప్పులేదు అని భర్తతో చెబుతుంది. ఎలా సంపాదించామన్నది ముఖ్యంకాదని ఎంత సంపాదించామన్నదే ముఖ్యమని భర్త శివయ్యతో అంటుంది. తల్లిచాటు కొడుకులా అనిపించుకోకుండా ఉండాలంటే కొంచెం జాగ్రత్తగా ఉండాలని, ప్రవర్తనలో మార్పు రావాలని భర్తకు చెబుతుంది. ఆమె కన్నతల్లికి దూరం కావాల్సిన పనిలేదు అని

చెప్పుతూనే భర్తను తన దారిలోకి తెచ్చుకోవడానికి ప్రయత్నిస్తుంటుంది. మంజుల ఆకర్షణలో శివయ్య పడిపోతాడు. మంజులకు తృప్తి ఉండదు. తన భర్త సంపాదించట్లేదని బాధపడుతూ ఉంటుంది.

సంపాదన దుఃఖానికి నివారణ మార్గం అని మంజుల భావిస్తుంది. అతను ఎంత సంపాదించినా అంతకంటె ఎక్కువ సంపాదించిన వారిని ఉదాహరణగా చూపెడుతూ అతనికి దుఃఖం పెంచుతుంది. మంజుల ఇంటినంతా ఖరీదైన వస్తువులతో నింపుతుంది. ఆమెకు ఏది అవసరం ఉన్నా లేకున్నా కొంటుంది. భర్తకు కష్టాల్లో, సుఖాల్లో చేదోడువాదోడుగా ఉండకుండా అతన్ని కష్టాలకు గురి చేస్తుంది. ఆమె వస్తు సంస్కృతి ప్రభావంతో డబ్బును ఖర్చు పెడుతుంది. అధిక సంతానంతో ఖర్చులు పెరిగినా ఆమె తన స్వభావాన్ని మార్చుకోదు. పైగా బాగా సంపాదిస్తేనే సమస్యలు ఉండవని అంటుంది. సమాజంలో గౌరవం పొందడానికి ఇంటి నిండా వస్తువులు, డబ్బే సాధనాలు అంటుంది. మంజుల ఆ దిశలోనే పయనిస్తుంది. మంజుల భర్తను చేతగాని వాడంటూ తిడుతూ సంపాదించాలని కోరుతుంది. ఆమె ఏమి చేసిన కుటుంబం కొరకేనని, సంసారం కొరకేనని అంటూ భర్తను బాధలకు గురిచేస్తుంది. భర్త సంపాదిస్తున్నా ఇంకా సంపాదించాలని తన స్వభావాన్ని మార్చుకోవడం లేదు. కుటుంబం ఎంత నష్టపోయినా ఆమె మాత్రం మారడంలేదు. భర్తను కించపరుస్తూ ఏదో ఒకటి అంటూనే సంపాదించాలని అంటుంది. కొంత కాలం తరువాత ఇద్దరి కూతుళ్ల పెళ్ళిళ్లు జరుగుతాయి. అప్పటినుండి ఆమెలో కొంత మార్పు వస్తుంది. జీవితానుభవాలు, పరిస్థితులు, కూతుళ్ల పెళ్ళిళ్లు ఆమెలో ఆ మార్పును తీసుకువచ్చాయి. కాని డబ్బు విషయంలో మాత్రం ఆమె అభిప్రాయం మారలేదు. తమకున్నవి కష్టాలే అయితే ఆ కష్టాలకు తమ దగ్గర విపరీతంగా డబ్బు లేకపోవడమే కారణమని ఆమె అభిప్రాయం. మంజుల సుఖాన్ని కొరుకుంది కాని ఆమెకు దుఃఖమే మిగిలింది. కష్టపడి సంపాదించిన డబ్బు, షేర్లు, ఫైనాన్సుల్లో పెట్టుబడులు పెడితే లాభాలు వస్తాయని అనుకుంది. కాని అవి చివరికి గుండు సున్నాలయ్యాయి. ఆమె చాలా అత్యాశతో బతకడంవల్ల ఆమె కుటుంబం దుఃఖమయం అయింది. ఆమె తీసుకున్న నిర్ణయాలు కుటుంబాన్ని దుఃఖానికి గురిచేశాయి. దాంతో ఆమెలో కొంత మార్పు వస్తుంది. ఆమె ఇప్పుడు ఉన్న డబ్బుతో తృప్తిగా బతుకుతూ సంసారాన్ని నడుపుతుంది.

కుటుంబ భవిష్యత్తు గురించి అతిగా ఆలోచించే ఇల్లాలిగా, భర్తను కొంగుచాటుగా మలుచుకున్న వ్యక్తిగా, అత్తని వేధించిన మేనకోడలిగా, భర్త ఎంత సంపాదించిన తృప్తి పొందని వ్యక్తిగా, డబ్బులోనే సుఖం ఉంటుందని నమ్మిన వ్యక్తిగా మంజుల పాత్ర చిత్రించబడింది.

### 4.2.26. కోకిలమ్మ (అస్పృశ్య కోయిల):

అస్పృశ్యకోయిల నవలలో కోకిలమ్మ ప్రధాన పాత్రధారి. దళిత మాల కుటుంబంలో జన్మించిన కోకిలమ్మ అత్యంత తెలివైన, ధైర్యవంతురాలైన, ఆత్మగౌరవం కలిగిన ధీరవనిత. ఆమె చక్కని రూపవతి. ఎందరో మగవాళ్లు ఆమెను కామించి ఏడిపిస్తే ఏందిరా బామ్మర్దీ అని హేళన చేసి, పెళ్లి చేసుకుంటావా అని సవాల్ విసిరిన స్త్రీ. దొర కొడుకు శ్యాంరావ్ వెంటపడి వేధిస్తే రచ్చకీడ్చిన వనిత. ఊరు ఊరంతా అంటరానివారంటూ కుల వివక్ష చూపుతూ అణచివేతను అమలు చేస్తున కాలంలో పండుగలనే కాదు దేవాలయ ప్రవేశాన్ని నిషేదించిన కాలంలో కులవ్యవస్థను గురించి ప్రశ్నించిన స్త్రీ. దళితులందరిని దేవాలయ ప్రవేశం చేయించిన స్త్రీ. దొర కొడుకు శ్యాంరావ్ విసిరిన పెళ్లి వలలో చిక్కుకొని, మోసపోయి దొర గడీలో దాసిగా ఉంటుంది. ఆమె అక్కడ కడుపు నిండా తిండి, కంటి నిండా నిద్ర లేకుండా ఎన్నో అవమానాలను భరిస్తూ బతుకుతుంది. ఇటువంటి స్థితిలో ఆమె మానేరు డ్యాంలో దూకి ఆత్మహత్య చేసుకుంటుండగా గోపాలకృష్ణశర్మ అనే సామాజిక కార్యకర్త ఆమెను కాపాడుతాడు.

గోపాలకృష్ణ శర్మ అందించిన ప్రోత్సాహంతో, జీవిత సహచర్యంతో పడిలేచిన కెరటంలా నిలదొక్కుకుంటుంది. కోకిలమ్మ అతన్ని పెళ్లి చేసుకుంటుంది. సామాజిక కార్యకర్తగా, స్త్రీవాద ఉద్యమకారిణిగా, ప్రజా వాగ్గేయకారిణిగా జీవితాన్ని గెలచుకున్న స్త్రీ. దళితులంటే చేతకానివారు కాదని, శ్రమ శక్తే ఆయుధంగా కలిగినవారని, వీరు అత్యంత ఆత్మగౌరవం కలిగిన ప్రజాస్వామ్య భావాలు కలిగిన సమాజానికే ఆదర్శవంతమైన జీవితాన్ని గడుపుతున్న వారు అని చాటిచెప్పి కుల నిర్మూలన పోరాట కార్యకర్తగా ఉన్న మహిళ కోకిలమ్మ. దొరల దౌర్జన్యాలను ఎదురించిన ధీరవనితగా, కులవివక్షతో ఎన్నో అవమానాలు ఎదుర్కొన్న స్త్రీగా, చివరికి తానే ఒక ఆదర్శవంతమైన వ్యక్తిగా మారి సామాజిక కార్యకర్తగా ఎదిగిన స్త్రీగా కోకిలమ్మ పాత్ర చిత్రించబడింది.

### 4.2.27. లక్ష్మణరావు (అస్పృశ్య కోయిల):

ఊరిలో పెద్ద దొర భూస్వామి లక్ష్మణరావు. దొర అనే అహంకారం గల వ్యక్తి. కంటికింపైన ఏ స్త్రీనైనా బలాత్కారం చేసిన అమానవీయుడు. కొత్తగా పెళ్ళైన రాజవ్వపై అఘాయిత్యం చేస్తాడు. అతనికి ఎదురు తిరిగిన రాజవ్వ భర్త కొండయ్యను దొరకే ఎదురు తిరుగుతావురా అని బండ బూతులు తిట్టి, కొండయ్యను కట్లు కట్టి పడేశారు. అయినా కట్లు విప్పుకున్న కొండయ్యను దొర పాలేర్లు, సుంకర్లతో కొట్టిస్తాడు. అతన్ని ఎత్తుకెళ్లి వాళ్ల ఇంటిముందు పడేస్తాడు. ఆ తరువాత

కొండయ్య కనిపించలేదు. రాజవ్వ దొర కామానికి బలయింది. ఆమె అవమానాలను భరించలేక ఆత్మహత్య చేసుకుంటుంది. దొర దౌర్జన్యం వల్ల ఒక అమాయకురాలు బలయింది. ఊరి దళితుల శ్రమను ఉత్పత్తుల్ని దోచుకొని, వారి పట్ల తీవ్రమైన కుల వివక్షను చూపేవాడు. లక్ష్మణరావు కొడుకు పెళ్లి చేసుకుంటానని కోకిలమ్మను శారీరకంగా వాడుకొని, గర్భవతిని చేసి వదిలేస్తే దాని కొరకు పంచాయితీ జరిగితే డబ్బు, పొలం వంటివి ఇచ్చి ఆమెను వదిలించుకోవాలని చూసిన దుర్బుద్ధి కలవాడు లక్ష్మణరావు.

భూస్వామ్య వ్యవస్థలో నిరంకుశమైన దొరగా, దళితులను అవమానాలకు, పీడనకు గురిచేసేవాడిగా, దళిత స్త్రీల పై అఘాయిత్యానికి పాల్పడే ఒక దుర్మార్గుడిగా లక్ష్మణరావు పాత్ర చిత్రించబడింది.

## 4.2.28. శ్యాంరావు (అస్పృశ్య కోయిల):

శ్యాంరావుది అస్పృశ్య కోయిల నవలలో ప్రధానమైన పాత్ర. లక్ష్మణరావు దొర కొడుకు శ్యాంరావు. శ్యాంరావు బండి మీద పోతున్నాడు. ఆ బండికి ఎదురుగా ఒక హరిజన ముసలాయన నడుస్తున్నాడు. బండి ఆ వృద్ధుడి మీద నుండి పోయింది. శ్యాంరావు బండి ఆపకుండానే వెళ్తాడు. ఆ వృద్ధుడు చనిపోతే చావు ఖర్చులకు డబ్బు ఇస్తాలే అని దుర్మార్గంగా ప్రవర్తించిన వ్యక్తి శ్యాంరావు. అదే విధంగా అతడు తండ్రి బాటలో నడుస్తూ స్త్రీలపై అఘాయిత్యాలు చేస్తూ, దళితులను అవమానపరుస్తూ, శ్రమను దోచుకుంటూ గడుపుతుంటాడు. కోకిలమ్మ అనే యువతిని లోబరుచుకోవాలని చూస్తున్న కామాంధుడు శ్యాంరావు. శ్యాంరావు కోకిలమ్మను లోబరుచుకోవాలని చూస్తే ఆమె అతని గల్లా పట్టి నిలదీస్తుంది. అతడు ఆమె మీద కోపంతో నలిగిపోతున్నాడు. అవమానంతో రగిలిపోతున్నాడు. ఓ మాల స్త్రీ అందరి ముందు నా ఇజ్జత్ తీసిందని బాధపడుతున్నాడు. అతడు ఎలాగైనా ఆమెపై అఘాయిత్యం చేయాలని కోపంతో సమయం కొరకు ఎదురుచూస్తున్నాడు.

అతడు కోకిలమ్మను లొంగదీసుకోవాలన్న ప్రయత్నాలు చేస్తూనే ఉంటాడు. చివరికి ఆమెను బెదిరించి, ప్రమాణం చేసి కాపురం చేస్తానని పెళ్లి చేసుకుంటాడు. శ్యాంరావు ఆమెపై కక్ష కట్టి ఆమెను బలత్కారించి మోసం చేస్తాడు. పెద్దలు పంచాయితీ ద్వారా కోకిలమ్మను శ్యాంరావు ఇంట్లో ఉండమని చెప్పుతారు. కాని శ్యాంరావు ఆమె మీద కోపంతో ఆమెను చిత్రహింసలు పెడతాడు. ఆమెను కామం తీర్చుకోవడానికే ఉపయోగించుకునేవాడు. ఆమెకు శ్యాంరావు నరకం చూపిస్తాడు. శ్యాంరావు ఆమెను ఒక ఉంపుడుకత్తెగా మారుస్తాడు. శ్యాంరావు ఆమెను ఇంట్లోనే జీవచ్ఛవంలా

బతికేటట్లు చేస్తాడు. శ్యాంరావు దళిత స్త్రీల పట్ల అమానుషంగా ప్రవర్తించేవాడు. కోకిలమ్మ వంటి ధైర్య సాహసాలు కలిగిన స్త్రీని తాను మోసపూరితంగా లోబరుచుకొని వాడుకోవడమే కాదు, తన మిత్రులందరికీ శృంగార వస్తువుగా చేసి, ఆమెను నిర్వీర్యం చేయడంతో, నైరాశ్యంలో మునిగిపోయి ఆత్మహత్యాయత్నం చేసుకోవడానికి కారణం కూడా ఈ పాత్రనే. కామాంధుడిగా, అహంకారిగా, స్త్రీల పట్ల అమానుషంగా ప్రవర్తించేవాడిగా శ్యాంరావు పాత్ర చిత్రించబడింది.

### 4.2.29. చిప్ప మల్లయ్య (గువ్వలచెన్నా):

గువ్వలచెన్నా నవలలో చిప్ప మల్లయ్య ప్రధాన పాత్రధారుడు. చిప్ప మల్లయ్య అతని భార్య లింగమ్మలు రాట్నం వడుకుతూ నేత పనిచేస్తారు. అతని తాతముత్తాతల కాలం నుండి వారు బట్టలు నేసుకుంటూ, బట్టలు అమ్ముకుంటూ బ్రతుకుతున్నారు. అతనికి ముగ్గురు కుమారులు. వారు కూడా అతనికి పనిలో సహాయం చేస్తుంటారు. భార్య లింగమ్మ ఒక పట్టుచీర కొనియ్యమని అతన్ని కోరేది. కాని అతడు వేలకొద్ది బట్టలు నేస్తున్నా, అతని ఆర్థిక పరిస్థితులు మాత్రం సహకరించలేదు. భార్యకు ఒక్క పట్టుచీర కూడా కొనే పరిస్థితులు లేవు అతడికి. భార్య కోరిన కోరిక తీర్చకపోవడం మల్లయ్యకు బాధాకరంగా ఉండేది. అంత ఖరీదైన చీరను భార్యకు ఇవ్వగలిగే స్తోమత అతనికి లేదు. అతడు నేసిన చీరల్లోంచి అమ్ముడుపోగా మిగిలినవి భార్యకు కట్టుకునేందుకు ఇచ్చేవాడు. అతడు ధోతులు నేసుకొని దొరకు ఇవ్వడానికి వెళ్తాడు. దొర రాజారావు తక్కువ కొలతలతో ధోతులు తీసుకువచ్చావని తన కులాన్ని, వృత్తిని కించపరుస్తూ అందరి ముందు సాలె సంకుటం గోచి తిరుకుటం అంటూ రాజారావు నవ్వుతాడు. ఆ మాటకు చిప్పమల్లయ్య వేదనతో బాధపడతాడు. అతడు దొరల ముందు ఎంతో వినయ విధేయతలతో ఉండేవాడు. దొరలు చెప్పినట్టు బట్టలు నేసేవాడు. వారు అడిగిన ధరకే ఇచ్చేవాడు. అయినా అవమానాలు తప్పకపోవడం చిప్ప మల్లయ్యకు బాధాకరంగానే ఉంది. అతడు మగ్గం మీద ధోతులు, చీరలు, పంచెలు, రవిక బట్టలు, అంగీ బట్టలు, తువ్వాలలు వంటివన్ని నేయడంలో నేర్పరి. అతడు రకరకాల నాణ్యత గల బట్టలు నేసేవాడు. చిప్ప మల్లయ్య పెద్ద కొడుకు వీరయ్య నేత పనిచేసుకుంటూ చుట్టుప్రక్కల ప్రాంతాలకు వెళ్లి బట్టలు అమ్ముకునేవాడు. అలాగే రెండవ కొడుకు రాజమల్లు బతుకుదెరువు కొరకు భీవండికి వలస వెళ్లి అక్కడ జరిగిన మతకలహాలలో కత్తిపోట్లకు గురయ్యి చనిపోతాడు. చిన్న కొడుకైన శంకరయ్య చదువుకొని ఉద్యోగం చేస్తూ ఉన్నతంగా బ్రతుకుతున్నాడు. అతడు ఎన్ని అవమానాలు పడ్డా చివరికి పిల్లలను ఏదో ఒక రకంగా జీవితంలో ఎదిగేటట్టు చేశాడు.

చిప్ప మల్లయ్య దొరతనాన్ని చూశాడు. ఫ్యూడల్ దొరల ఆధిపత్యాన్ని అనుభవించాడు. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత చిల్లర దేవుళ్ల పాలనను చూశాడు. కొంచెం కొంచెం తిరుగుబాటు తత్త్వాన్ని అలవరుచుకున్న కొడుకుల తరాన్ని చూశాడు. నేత మగ్గాల, మర మగ్గాలను చూశాడు. పారిశ్రామికీకరణ పేరుమీద వృత్తులు పతనమై రోడ్లమీద నిల్చున్న వారిని చూశాడు. పారిశ్రామికీకరణ మాయతోపాటు గ్లోబలైజేషన్ ప్రభావం పూర్తిగా చూడకముందే మరణిస్తాడు. ఒక రకంగా కుటుంబంలో జీవితాలను గెలుచుకునే క్రమం అతనితోనే ప్రారంభమైంది. అతని కొడుకులు, మనుమళ్లు జీవితాలను గెలుచుకునే క్రమాన్ని మరింత విస్తృతం చేస్తున్నారు.

దొరల దగ్గర అవమానాలను భరించినవాడిగా, భార్య కోరిక తీర్చలేనివాడిగా, కొడుకుల జీవితాల్లో ఎదుగుదల నింపినవాడిగా, నేతపని చేసుకుంటూ వృత్తిని నమ్మినవాడిగా, రెక్కల కష్టంతో కుటుంబాన్ని పోషించినవాడిగా చిప్ప మల్లయ్య పాత్ర చిత్రించబడింది.

### 4.2.30 శంకరయ్య (గువ్వలచెన్నా):

గువ్వలచెన్నా నవలలో శంకరయ్యది ప్రధానపాత్ర. చిప్ప మల్లయ్య, లింగమ్మల చిన్న కొడుకు శంకరయ్య. శంకరయ్య భార్య శారద. కొడుకులు రమేష్, సురేష్ లు. శంకరయ్య ఒక రచయితగా రచనలు చేస్తూ ఉద్యోగం చేస్తున్నాడు. అతడు సాహిత్య, సామాజిక, తాత్త్విక పుస్తకాలను చదివి ఒక దృక్పథాన్ని ఏర్పరచుకుంటాడు. శంకరయ్యకు చిన్నప్పటి నుండి చదువంటే ఆసక్తి. చదువుకుంటూనే తండ్రికి వృత్తి పనిలో సహాయం చేస్తుండేవాడు. శంకరయ్య తండ్రి అనుభవిస్తున్న పేదరికం, అవమానాలను చూసి ఉద్యోగం చేయాలని నిర్ణయించుకుంటాడు. ఎంతో కష్టపడి చదివి ఉద్యోగం సంపాదిస్తాడు. అతడు ఉద్యోగం వస్తే తల్లికి పట్టుచీర కొంటానని తల్లి కోరిక తీరుస్తానని చెప్పేవాడు. అతడు ఉద్యోగం వచ్చిన తరువాత భార్యకు పట్టుచీర తీసుకువస్తాడు. రెండు పట్టుచీరలు కొనే ఆర్థిక పరిస్థితి లేకపోవడంవల్ల ఒక పట్టుచీర మాత్రమే తీసుకువస్తాడు. ఇక ముందయినా తప్పకుండా తల్లికి పట్టుచీర కొనాలని నిర్ణయించుకుంటాడు. మరి కొంతకాలం గడిచింది. లింగమ్మ వృద్ధురాలైంది. ఆమెను బాగానే చూసుకుంటున్నాడు. కాని ఆమె పట్టుచీర కోరిక మాత్రం తీరలేదు. చివరికి అతడు తీసుకువచ్చిన పట్టుచీర తల్లి శవం మీద కప్పడానికి ఉపయోగపడుతుంది. ఈ సంఘటనతో తన గురించి తనవారి వెనుకబాటుతనం గురించి ఆలోచిస్తాడు.

శంకరయ్య తండ్రిని మంచిగా చూసుకునేవాడు. తండ్రి మరణించాక శంకరయ్య సాంప్రదాయంగా కాకుండా ఒక మీటింగ్ ఏర్పాటుచేసి తిండి లేని పేదలను పిలిచి భోజనాలు

ఏర్పాటు చేస్తాడు. వారితోపాటు బంధుమిత్రులను, కొందరు రచయితలు, మేధావులను పిలుస్తాడు. ఆ మీటింగులో తన తండ్రి జీవితంలో అనుభవించిన కష్టాలను చెప్పి, నేటి సమాజంలో ఉన్న ఇలాంటి పరిస్థితులను గురించి చర్చిస్తారు.

శంకరయ్య కొడుకు రమేష్ కంప్యూటర్ ఇంజనీరుగా పనిచేస్తుంటాడు. రమేష్ ఉన్నత కుటుంబానికి చెందిన మల్లీశ్వరిని ప్రేమిస్తుంటాడు. ఆ విషయం తెలుసుకున్న శంకరయ్య కులాంతర ప్రేమ వివాహాలకు అతడు వ్యతిరేకి కాడు. కాని అవి పైపై మెరుగులతో, ఆకర్షణలతో అవగాహన లేకుండా చేసేవి కాకూడదని తల్లిదండ్రులను ఒప్పించి అందరి సమక్షంలో పెళ్లి చేయాలని అనుకుంటాడు. శంకరయ్య కొడుక్కి ఆదర్శ వివాహం చేస్తాడు.  శంకరయ్య ఎదిగిన కొడుకులను ఉన్నత చదువురీత్యా, ఉద్యోగాల కొరకు అమెరికాకు పంపిస్తాడు. శంకరయ్య కొడుకులు మళ్లీ తిరిగి వస్తారో లేక అక్కడే స్థిరపడిపోతారో అని ఆలోచిస్తూ ఉంటాడు. తల్లిదండ్రుల ఆశలు నేరవేర్చినవాడిగా, పీడిత కుటుంబాన్ని ఉన్నత స్థితికి తీసుకువచ్చిన వ్యక్తిగా, వృత్తి పనిచేసేవాడిగా, ఒక రచయితగా, కుటుంబ సభ్యులను గౌరవించేవాడిగా, తల్లి కోరికను తీర్చలేనివాడిగా, తండ్రి నుండి కొడుకుల వరకు మారుతున్న కాలాన్ని చూసి ఎదిగినవాడిగా, కొడుక్కి ఆదర్శ వివాహం చేయించిన వ్యక్తిగా కొడుకుల భవిష్యత్తు గురించి ఆలోచించి వారిని ఇతర దేశాలకు పంపిన వ్యక్తిగా శంకరయ్య పాత్ర తీర్చిదిద్దబడింది.

## 4.3. ఆదర్శ పాత్రలు:

### 4.3.1. నర్సమ్మ (భూమిపుత్రుడు):

భూమిపుత్రుడు నవలలో నర్సమ్మది ఆదర్శవంతమైన పాత్ర. కొండ మల్లయ్య భార్య నర్సమ్మ. ఆమె కుటుంబంలోని వారు వ్యవసాయం చేస్తూ ఉంటారు. ఆమె కూడా వ్యవసాయ పనులు చేస్తూ కుటుంబాన్ని మంచిగా చూసుకుంటుంది. ఆమెకు కొండ మల్లయ్యతో ఎనిమిదేళ్ల వయస్సులోనే పెళ్లి జరిగింది. శ్రమ జీవనంలోనే అందాన్ని చూస్తుంది నర్సమ్మ. ఆమె భర్తకు కష్టాల్లో, సుఖాల్లో చేదోడువాదోడుగా ఉంటూ కాపురం చేస్తుంది.

నర్సమ్మ ఒక ఇల్లాలిగా ఉగాది, బతుకమ్మ పండుగలను ఎంతో ఆనందంగా కుటుంబంతో కలిసి చేసుకునేది. నర్సమ్మ ఉగాది పండుగ రోజున బూరెలు చేసింది. కొత్త చింతపండుతో పులుసు చేసి అందులో బెల్లం, మామిడి ముక్కలు, వేపపువ్వు, కొబ్బరి ముక్కలు వేసి ఉగాది పులుసు తయారుచేసేది. నర్సమ్మ కుటుంబంలోని వారు అందరూ వాటిని తీసుకున్న తరువాతే ఆమె

తీసుకునేది. రైతు కుటుంబాల్లోని స్త్రీలు సాధారణంగా భర్త, పిల్లలు, అతిథులు తిన్న తరువాతే వారు తింటారు. ఉగాది పండుగను నర్సమ్మ ఎంతో ఉత్సాహంతో చేసుకుంది.

బతుకమ్మ పండుగను నర్సమ్మ కుటుంబంతో కలిసి చేసుకుంది. నర్సమ్మ కోడలుతో కలిసి బతుకమ్మను పేర్చింది. పెద్ద బతుకమ్మను ఆమె తలపై ఎత్తుకుంది. చిన్న బతుకమ్మను చిన్న కోడలు లక్ష్మీ చేతిలో పెట్టింది. మొక్కజొన్న పేలాలతో వేయించిన పల్లీలతో, నువ్వుల పిండితో తయారుచేసిన సద్దులను ఒక గుడ్డలో కట్టి కూతురు కాంతమ్మ చేతిలో పెట్టింది. ఆమె బతుకమ్మను తీసుకొని ఆడి పాడింది. చివరికి ఆ బతుకమ్మను చెరువులో వేస్తుంది. ఒక ఇల్లాలిగా ఎంతో నేర్పుతో, ఉత్సాహంతో పండుగను జరుపుకుంటుంది. నర్సమ్మ భర్తతో కలిసి వరి, పెసర పంటలలో ఉన్న కలుపు మొక్కలను తీస్తుంది. పొలానికి సంబంధించిన అన్ని రకాల పనులను భర్తతోపాటు చేసేది. నర్సమ్మ విరామం లేకుండా నేల తల్లికే అంకితమై పనిచేస్తుంది. పని రాక్షసి నర్సమ్మ.

ఒక ఇల్లాలిగా, భర్తకు వ్యవసాయపు పనుల్లో అండగా ఉండే వ్యక్తిగా, పండుగ రోజుల్లో కుటుంబాన్ని ఉత్సాహంగా, అందంగా ఉంచే వ్యక్తిగా, కుటుంబాన్ని మంచి మార్గంలో నడుపుతూ ఒకరికి హాని చేయకుండా నలుగురికి సహాయం చేసేలా ఒక ఆదర్శవంతమైన జీవితాన్ని గడుపుతున్న పాత్ర నర్సమ్మది.

### 4.3.2. ఎల్లయ్య (ఆనందరావు) (మాదిగ విజయం):

సర్వసంపదలకు సృష్టికర్తలైన దళితులకు తాము పోరాడి గెలుచుకున్న జీవితం ఉందని, గెలుచు కోవాల్సింది ఇంకా ముందుంది అనే తెలియజేసే పాత్ర ఇది. దళితుల్లో చదువుకొని ఉన్నత స్థితికి చేరినవారు కొంతమంది తమ కుటుంబాల వరకైనా ఉపయోగపడుతున్నారని ఈ పాత్ర తెలియజేస్తుంది. తమ జాతి అభ్యున్నతి కోసం పాటుపడుతూ దళిత వనంలో వికసిస్తున్న పాత్ర ఆనందరావుది.

మాదిగ విజయం నవలలో ఇది ప్రధానమైన పాత్ర ఎల్లయ్య పేరయ్య కొడుకు. పేరయ్య కుటుంబం తమకున్న దాంట్లో పరిస్థితులకు అనుగుణంగా బాగానే బతుకుతున్నారు. ఎల్లయ్యను బాగా చూసుకుంటున్నారు. ఎల్లయ్య ఆటలాడుతూ హుషారుగా ఉండేవాడు. ఎల్లయ్య గోలీలాట, చిర్రగొన, మామిడి పిక్కలాటలను ఆడటంలో మంచి నేర్పరి. పసివాడైన ఎల్లయ్య తన తల్లిదండ్రులను గూర్చి నీచంగా దొర తిడితే దొర మీదికి రాయి విసిరి దొరను ఎదురిస్తాడు. తన చిన్నతనం నుండే వివక్ష, పీడనలను ఎదుర్కొని చైతన్యం పొందాడు. ఎల్లయ్య బడికిపోతూ

కొద్దికాలంలోనే చాలా విషయాలు నేర్చుకున్నాడు కొందరు. ఎల్లయ్యను తండ్రి డబ్బు సంపాదించడం కొరకు బయటకు వెళితే తండ్రి ఉన్నా లేనట్టేనని అవమానపరిచారు. ఎల్లయ్యకు ఊహ తెలియకముందే ఊరొదిలి వెళ్ళి కొంతకాలానికి వచ్చిన తండ్రిని చూసి దుఃఖిస్తాడు. ఎల్లయ్య వయస్సుకు మించి మాటలు మాట్లాడుతుండటం చూసి పేరయ్య సంతోషించేవాడు. ఎల్లయ్య తరగతిలోని కొంతమంది పిల్లలు వారి తండ్రులను బాపు అని పిలవడం చూసి అతను పేరయ్యను బాపు అని పిలిచేవాడు. ఆ పిలుపు కొత్తగా ఉన్న అతని హృదయానికి తాకినట్టుగా ఉంది. అలా పిలవడం పేరయ్యకు ఎంతో ఆనందంగా ఉంది. అతడు తరగతి గదిలో చెప్పిన పాఠాల నుండి స్ఫూర్తి పొందుతూ చక్కగా ఎదుగుతున్నాడు. అతని కుటుంబంలోని వాళ్లు చక్కని సంస్కారం, మానసిక వికాసంతో మాట్లాడుతున్న ఎల్లయ్యను చూసి ఎంతో ఆనందించేవారు.

స్కూల్లో చదువు ముగిసిన వెంటనే కరీంనగర్ జిల్లాలో ఇంటర్ పూర్తిచేసి, డిగ్రీలో చేరాడు. కాలేజీలో తనను ఎల్లయ్య, ఓ ఎల్లయ్య అని వ్యంగ్యంగా పిలిచేవారు. ఊళ్లో కొందరు ఎల్లిగాడు, మాదిగెల్లిగాడని పిలిచేవారు. మరికొందరు కావాలని పరోక్షంగా కించపరిచేవారు. అతడు తన తల్లిదండ్రులను ఒప్పించి పేరు మార్చుకోవాలని అనుకుంటాడు. నేను పేరు మార్చుకోవడం నాలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకోవడానికే తప్ప నా కులానికి, నా సంస్కృతికి, నావాళ్లకి దూరం కావడానికి ఏ మాత్రము కాదు. నేనెంత చదువుకున్న, ఉద్యోగినైనా, నావాళ్లనెవరిని మరిచిపోను అని ఎల్లయ్య అనడంతో అతని మాటలను స్పష్టంగా అర్థం చేసుకొని అతని పేరు మార్పుకు తల్లిదండ్రులు అంగీకరించారు. కొందరు ఎప్పుడు నవ్వు ముఖంతో ఆనందంగా ఉంటావు కాబట్టి నీకు 'ఆనందరావు' అనే పేరు సరిగ్గా ఉంటుందని సలహా ఇచ్చారు. అప్పటినుండి ఆనందరావుగా పిలవబడుతున్నాడు. మనం మాట్లాడే భాష ద్వారా మనిషికి విలువను నిర్ణయిస్తారని తెలుసుకొని ఆనందరావు ఎంతో తెలివితో మాట్లాడేవాడు. ప్రత్యేక తెలంగాణ ఉద్యమ సమయంలో ఆనందరావు ఖాళీగా ఉండేవాడు. ఆ సమయంలో తండ్రికి వ్యవసాయపు పనుల్లో సాయం చేసేవాడు. జీవితమంతా కష్టాల కడలిలోనే గడుపుతున్న తన తల్లిదండ్రులను ఆదుకోవాలని తనకు ఉద్యోగం వస్తే తప్ప అది సాధ్యం కాదని ఉద్యోగ ప్రయత్నాలు చేస్తాడు. మరికొంత కాలంలోనే ఆనందరావు ఉద్యోగి అయ్యాడు. తనవాళ్లను కొంతైనా పట్టించుకోవాలని, అంబేద్కరును ఆదర్శంగా తీసుకోని జీవిస్తున్నాడు. సమాజంలో ఉన్నతంగా ఉంటూ నలుగురికి ఆదర్శంగా నిలబడాలని తెలియజేస్తున్న పాత్ర ఆనందరావుది.

ఆనందరావుకి తన పెళ్లి గురించి స్పష్టమైన అభిప్రాయాలు ఉన్నాయి. ఎన్నో కష్టనష్టాలను ఎదుర్కొని అతన్ని చదివించి ఇంతవాడిని చేసిన తల్లిదండ్రులకు తన పెళ్లి వల్ల సమస్యలు రాకూడదని అనుకున్నాడు. తాను చేసుకునే అమ్మాయి తన తల్లిదండ్రులను తనవాళ్లుగా స్వీకరించాలని, తనను వారికి దూరంగా చేయకూడదని అనుకున్నాడు. తల్లిదండ్రుల అభిప్రాయాలను గౌరవిస్తూ థామ్సన్ కూతురైన మరియమ్మను ఆనందరావు పెళ్లి చేసుకున్నాడు. ఆ తరువాత 'కులాల వేళ్లు' అనే అంశంపై డాక్టరేట్ కొరకు పరిశోధన చేశాడు. తన అనుభవంలోకి వచ్చిన అనేక విషయాలు సేకరించాడు. కులం పునాదులు ఉండేవి గ్రామాల్లో కాబట్టి గ్రామాలను కేంద్రంగా చేసుకొని పరిశోధన కొనసాగించాడు. మరికొంత కాలం గడిచింది. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఆనందరావుకి రీడరుగా ప్రమోషన్ వచ్చింది. ఉద్యోగ జీవితంలో ఎంతో బిజీగా ఉండటంతో కొంత విరామం తీసుకొని పిల్లలతో ఊరేళ్లాడు. గ్రామాల్లోని పరిస్థితులు పిల్లలకు తెలియాలని వారిని అప్పుడప్పుడు సొంత గ్రామానికి తీసుకెళ్ళేవాడు. గ్రామంలోని చాలా విషయాలను గురించి వారికి తెలియజేసేవాడు.

దళితులు, ఇతర పీడిత కులాలవారు చదువుకొని, కొంతమంది అయినా జీవితాలను గెలుచుకోవడం శుభపరిణామమే. అలాగే ఆనందరావు కూడా చదువుకొని ఉన్నతంగా బతుకుతున్నాడు. ఒకానొక సందర్భంలో ఊరి దొర కొడుకు చెప్పుల దుకాణంలో పనిచేయడం చూసి ఆనందరావు ఆశ్చర్యపోతాడు. భూస్వాములన్న గర్వం, కుల దర్పంతో చదువును నిర్లక్ష్యం చేయడం వల్లనే ఇలా జరిగింది అని అతన్ని చూసి జాలి పడతాడు. ఆనందరావు జీతం, ఉద్యోగ హోదాతోపాటు అతడు చేస్తున్న పనుల వల్ల సమాజంలో అతని స్థానం పెరుగుతుంది. అయినా సరే ఆనందరావు తనవాళ్లను మరిచిపోకుండా నెలకోసారి గ్రామంలో ఉన్న తల్లిదండ్రులను చూసి వస్తున్నాడు. ఉద్యోగంతో లభిస్తున్న సుఖవంతమైన జీవితంతో అతనిలో కొన్ని మధ్యతరగతి ఆలోచనలు చోటు చేసుకుంటున్నాయి. తన మార్గం గూర్చి ఆలోచిస్తున్నాడు.

ఆనందరావులాంటివారు ఈ మాత్రంగా బతకడానికి వెనుక ఎంతో సంఘర్షణ ఉంది. ఆనందరావు తన పిల్లలతో మీ జీవితాన్ని మీరు ఎలా మలుచుకోవాలో నిర్ణయించుకోండని కొన్ని సలహాలు ఇస్తాడు. మీరు ఎక్కడో ఉద్యోగాలు చేస్తూ, ఏ పరిస్థితుల్లో ఉన్నా, ఎంత ఎదిగినా, పల్లెలతో మీ మూలాలను సజీవంగా పెట్టుకొండి అని ఆనందరావు అన్నాడు. ఆర్థికంగా, సామాజికంగా మంచిస్థితిలో ఉన్న ఆనందరావు కొడుకుల పెళ్లిళ్లను ఊర్లోనే చేయడం మెచ్చుకోదగినది. అంతేకాదు తాను ఆదర్శంగా ఉంటూ తన ఆదర్శాలకు అనుగుణంగా కొడుకులను తయారుచేయడం గొప్ప

విషయం. చదువు, పోరాటాలతో ఆనందరావు విజేతగా నిలిచాడు. ఆనందరావు అభ్యుదయం సాధించిన సమర్థుడైన పాత్ర. ఆనందరావు పాత్ర 21వ శతాబ్ది పీడిత జాతుల వెలుగు అని నిరూపించింది. మాదిగ కులస్థుడిగా పడిన అవమానాలు, ఉన్నత ఉద్యోగి అయినా తప్పని అవమాన పరంపర, దళితుల జీవితాల్లో ఎంత విషాదముందో, వేదనుందో, పీడనుందో ఈ పాత్ర ద్వారా తెలుసుకోవచ్చు. ఆనందరావు పాత్ర సాహితీ లోకంలో చిరస్థాయిగా అత్యున్నత స్థానంలో నిలిచి ఉంటుంది.

### 4.3.3. శ్రీకాంత్, ఆజాద్ లు (మాదిగ విజయం):

ఆనందరావు, మరియమ్మల కొడుకులు ఒకరు శ్రీకాంత్ మరొకరు ఆజాద్. వీరు తల్లిదండ్రులతో కలిసి పట్టణంలో ఉండేవారు. అప్పుడప్పుడు తల్లిదండ్రులతో కలిసి సరదాగా గ్రామానికి వెళ్ళేవారు. ఊళ్లో ఎంతో ఆనందంగా గడిపేవారు. తాత, నాయనమ్మల ప్రేమ, అమ్మమ్మ తాతల ఆప్యాయతలు వీళ్లకి ఎంతో సంతోషానిచ్చాయి. వీరు ఊర్లోని కొంతమంది పిల్లలతో కలిసి వేపచెట్టు, చింతచెట్టు కింద ఆడుకునేవారు. వారిలో చాలామంది చీమిడి ముక్కులతో, చిరిగిన నెక్కర్లతో పేదరికానికి ప్రతినిధులన్నట్టుగా ఉండేవారు. వారితో ఆడుకోవడానికి కొంత వెనుకంజ వేసినా తన తండ్రి ఆదర్శ జీవితాన్ని జ్ఞాపకం చేసుకొని వారితో కలిసి శ్రీకాంత్, ఆజాదులు ఆడేవారు. చెంగు చెంగున ఎగురుతూ ఆడుకునేవారు. కుటుంబంతో కలిసి శ్రీకాంత్, ఆజాద్ లు పోచమ్మ పండుగ సంబురాల్లో పాల్గోనేవారు. శ్రీకాంత్, ఆజాద్ లు పట్టణంలో ఉండటం వల్ల ఊరికి దూరమవుతారు అన్న ఉద్దేశ్యంతో అప్పుడప్పుడు ఊరికి వచ్చి వెళ్ళేవారు. శ్రీకాంత్, ఆజాదులు గ్రామాల్లోని పరిస్థితులను కూడా అవగాహన చేసుకుంటారు. ఊర్లో కప్పతల్లి ఆటను ఆడేవారు. శ్రీకాంత్, ఆజాదులు బాగానే చదువుకుంటున్నారు. ఆనందరావు తనకున్న పరిస్థితులను, రిజర్వేషనులను ఉపయోగించి పిల్లలను డాక్టరునో, ఇంజనీరునో చేయవచ్చు కాని పిల్లలపై బలవంతంగా చదువులు రుద్దదలుచుకోలేదు. శ్రీకాంత్, ఆజాద్ లు వారి అభిరుచికి అనుగుణంగానే శ్రీకాంత్ ఇంటర్ పూర్తిచేసి డిగ్రీ చేస్తాడు. ఆజాద్ ఇంటర్ చదువుతున్నాడు.

కాలేజీలో ఆజాదును దొర మనువడైన తిరుమలరావు కులం పేరుతో దూషిస్తూ అవహేళన చేస్తాడు. ఆజాద్ తిరుమలరావు మీద చర్య తీసుకోకుంటే కాలేజీకి పోనని ఆనందరావుతో అంటాడు. తిరుమలరావు ఇంటికి వెళ్ళి తగిన బుద్ధి చెబుతామనుకుంటే అక్కడ తిరుమలరావు తండ్రి ఆనందరావును కులం పేరుతో దూషిస్తూ అవమానపరుస్తాడు. కులపీడన తనతోపాటు తన పిల్లలను కూడా వెంటాడుతుండటం ఆనందరావుకి భరించరానిదిగా ఉంది. ఆనందరావు

హృదయం అవమానంతో రగిలిపోతుంది. ఆనందరావు, ఆజాదులు దొరలైన తిరుమలరావు, రాజారావులపై కేసు వేస్తారు. చివరికి దొరలు తమ అహంకారాన్ని ప్రక్కకు పెట్టి ఆనందరావుకి క్షమాపణలు చెప్పడంతో కేసు వాపసు తీసుకుంటారు. అనతి కాలంలోనే శ్రీకాంత్ జిల్లా పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసరుగా, ఆజాద్ M.R.O.గా ఉద్యోగాలలో చేరుతారు. వీరిద్దరు చిన్న వయస్సులోనే ఉన్నత స్థాయికి వెళ్లే అవకాశాలున్నాయి. సమాజానికి, దేశానికి ఉపయోగపడే విధంగా ఉండాలని తండ్రి ఆనందరావు వారికి సలహా ఇస్తాడు. తండ్రి మాటలను ఆదర్శంగా తీసుకొని వారు ఉన్నతంగా బతుకుతున్నారు.

శ్రీకాంత్, ఆజాదులు ఆదర్శ వివాహాన్ని చేసుకోవాలనుకుంటారు. శ్రీకాంత్ శ్రీలతను, ఆజాద్ అనితలను పెళ్లి చేసుకోవాలని నిశ్చయించుకుంటారు. వీరి వివాహానికి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుండి దళిత మేధావులు, బంధువులు, మిత్రులు చాలామంది వచ్చారు. వీరి ఆదర్శ వివాహాన్ని చూడటానికి చుట్టుప్రక్కల గ్రామాలవారు కూడా వస్తారు. ఉద్యోగరీత్యా మంచి స్థితిలో ఉన్న శ్రీకాంత్, ఆజాదులు తమకెన్ని అవకాశాలు వచ్చినా, పెద్ద మొత్తంలో కట్నం వచ్చే అవకాశాలున్న, అన్నింటిని వదిలిపెట్టుకొని తమ కులంలోని పేదింటి పిల్లలను పెళ్లి చేసుకోవడానికి నిశ్చయించుకోవడం అభినందించదగ్గ విషయం. పెళ్లంటే కట్నం, చదువు, ఇంత ఎత్తు, రంగు అని చూస్తున్న సమయంలో ఈ యువకులు తీసుకున్న నిర్ణయం మెచ్చుకోదగినది. వీరు అందరి సమక్షంలో దండలు మార్చుకొని ప్రతిజ్ఞ చేసి ఆదర్శ వివాహం చేసుకున్నారు. ఎంత ఎదిగినా ఒదిగి ఉండాలని శ్రీకాంత్, ఆజాద్ ల పాత్రలు ఋజువు చేస్తున్నాయి. ఉన్నత స్థాయిలో ఉండి తమ ఊరు మూలాలను మరిచిపోకుండా ఉన్న ఈ పాత్రలు మన సమాజంలో ఉన్నతమైనవే. ఆదర్శవంతమైన జీవితానికి ఈ పాత్రలు ఒక పునాదిగా నిలుస్తాయి.

### 4.3.4. ఈరమ్మ (మాదిగ విజయం):

జూలపల్లి గ్రామంలోని బొత్తయ్య కూతురు ఈరమ్మ. ఈమె వ్యవసాయం చేస్తుంది. ఈరమ్మ, పేరయ్యలు వ్యవసాయపు పనులలో కలుసుకునేవారు. కొన్నిసార్లు వారు మాట్లాడుకునేవారు. ఒకరంటే మరొకరికి ఇష్టం ఏర్పడటంతో పెద్దల సమక్షంలో ఈరమ్మ, పేరయ్యల వివాహం జరిగింది. ఈరమ్మ బుచ్చయ్య, కనుకమ్మల కోడలు అయ్యింది. ఈరమ్మ పేరయ్యకు పాలేరుతనం మానుకోమని సలహా ఇస్తుంది. ఇద్దరూ చెరో కష్టం చేసుకుంటే ఇంతకంటే బాగానే బతకొచ్చని ఆలోచించారు. ఈరమ్మ అప్పుడప్పుడు అత్తతో కలిసి కూలీ పనులకు పోయేది. పేరయ్య మీద కోపంతో సూర్యారావు దొర ఏ తండ్రీ ఏ కొడుక్కి ఇవ్వని సలహా లక్ష్మణరావుకి ఇచ్చాడు. ఒకరోజు

చీకటి పడుతున్న సమయంలో ఊరు బయట పిడుకలు ఏరుకుంటున్న సమయంలో ఈరమ్మను సూర్యారావు మనుషులు ఎత్తుకెళ్లారు. నోట్లో బట్ట కుక్కి ఎత్తుకొచ్చారు. ఊరి చివరనున్న దొర కొట్టంలో పడేసారు. దొర కొడుకు ఆమె బతుకుతో ఆడుకున్నాడు. అతని కామ దాహానికి, ప్రతీకార వాంఛకు ఆమె శీలం ఫలహారమయింది. ఈరమ్మ అవమానభారంతో ఆత్మహత్య చేసుకోబోతుంటే ఆమెను ఆ ప్రయత్నం నుండి పేరయ్య విరమింపజేసి హృదయానికి హత్తుకొని ఇంటికి తీసుకువెళ్తాడు. ఊరంతా ఈ విషయం తెలిసినా ఆమె ఎంతో ధైర్యంగా ఉండేది. ఈరమ్మ దగ్గరున్న పుస్తెలు, నల్లపూసల గుండ్లు, చేతికున్న వెండి కడియం, కాళ్ల కడియాలు అమ్మేసి పేరయ్య అప్పులు తీర్చాడు.

ఈరమ్మ పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. కడుపులో అడ్డం తిరిగిన శిశువును నేర్పుగా బయటకు లాగి కాన్పు చేసింది సాయమ్మ. ఈరమ్మ సొమ్మసిల్లినట్టు పడిపోయింది. ఆ తరువాత తల్లి పిల్ల సంతోషంగా ఉన్నారు. కొంత కాలం తరువాత ఈరమ్మ భర్త పేరయ్య డబ్బు సంపాదించడానికి వెళితే తాను మాత్రం ఏమనకుండా తన భర్తకు మద్దతు తెలుపుతుంది. భర్త ఊళ్లోలేని సమయంలో ఈరమ్మ పరిస్థితి అధ్వానంగా ఉండేది. కాని ఈరమ్మను అత్తమామలు తల్లిదండ్రుల కంటె ఎక్కువగా చూసుకునేవారు. లోకులు పలుకాకులై కూస్తున్నా తనను కడుపులో పెట్టుకొని దాచుకున్నారు. తన భర్త తిరిగొచ్చి భవిష్యత్తులో తమకు మంచి రోజులు తీసుకవస్తాడన్న నమ్మకంతో కాలం గడిపేది. భర్త, తన జీవితం, అత్తమామలు, పిల్లలు జ్ఞాపకం వచ్చి ఈరమ్మ ఏడ్చేది. భర్త తిరిగొచ్చి తన కుటుంబాన్ని సుఖంగా, ఆనందంగా ఉండేటట్లు చేస్తాడన్న నమ్మకంతో ఈరమ్మ కాలం గడుపుతుంది. ఈరమ్మ పాత్ర తన కుటుంబానికి చేదోడువాదోడుగా ఉండే విధంగా ఉండేది. ఈరమ్మ ఎన్నో అవమానాలను ధైర్యంగా ఎదుర్కొని కుటుంబం అండతో నిలిచి పోరాడింది. ఆమెకు భర్త ఇచ్చిన ప్రోత్సాహం మరవలేనిది. ఆప్యాయతను పంచుకునే ఇల్లాలిగా, తనకు జరిగిన అవమానాలను ఎదుర్కొని నిలబడ్డ వనితగా, నిజమైన మాతృమూర్తిగా, ఉదాత్తమైన పాత్రగా ఈరమ్మ పాత్ర తీర్చిదిద్దబడింది.

### 4.3.5. భిక్షపతి (మెతుకు పుస్తకం):

భిక్షపతి ఫెర్టిలైజర్ ఫ్యాక్టరీలో క్రాఫ్ట్ మెన్ ట్రైయినీగా ఉద్యోగం పొందాడు. బీహార్ లోని సింద్రీ కర్మాగారంలో ట్రైనింగ్ చేయడానికి వెళ్లాడు. భిక్షపతి అక్కడి పరిస్థితులను చక్కదిద్దాలని కొందరు మిత్రులతో కలిసి సమ్మె చేయాలని అనుకుంటాడు. ట్రైనింగ్ సమయంలో ట్రైయినీసుతో ఎక్కువగా పని చేయించడం, స్టైఫండ్ సరిగ్గా ఇవ్వకపోవడం, తిండి సరిగ్గా పెట్టకపోవడంతో మన

హక్కుల కోసం మనం పోరాడుదాం అని మిత్రులకు తెలియజేశాడు. మనతో పని చేయించుకొని ఒక్క పైసా ఇవ్వకున్నా ఎందుకు నోరు మూసుకొని ఉండాలి అని, ఏదో నష్టం జరుగుతుందన్న భయంతో న్యాయం కోసం పోరాడటం తప్పు కాదని భిక్షపతి దయచేసి నాకు సహకరించండని మిత్రులకు తెలియజేశాడు. కొంత మంది మిత్రులు వద్దని చెప్పారు, మరికొంత మంది వెనుకంజ వేశారు. అయినా భిక్షపతి ముందుకు వెళ్లాడు. భిక్షపతికి సమ్మెలని, హక్కులని, పోరాటాలని లొల్లిజేస్తే నీ ఉద్యోగం పోవచ్చు అని ఒక తెలుగాఫీసర్ సలహా ఇచ్చాడు. భిక్షపతి తన స్వార్థం కోసం చేయడం లేదని, మనందరి కొరకు చేస్తున్నానని అంటాడు. ఆకలి కంటె ఆత్మగౌరవం ముఖ్యమని మనిషికి సహనం అవసరమే కాని ఆ సహనం గాడిద సహనం కాకూడదని, మనం చేయబోయేది న్యాయమైందని, సమ్మె కార్మికుడి ఆయుధం అని తెలియజేశాడు. అందరినీ సమ్మెకు సన్నద్ధం చేసాడు. భిక్షపతికి చీఫ్ ట్రైనింగ్ ఆఫీసర్ అనేక రకాలుగా నచ్చచెప్పాలని ప్రయత్నిస్తాడు. కాని భిక్షపతి ఆధ్వర్యంలో సమ్మె జరుగుతుంది. భిక్షపతి అక్కడుంటే ప్రమాదంగా మారుతాడని రామగుండం ఎరువుల ఫ్యాక్టరీకి పంపిస్తారు. ట్రైనింగ్ పూర్తిచేసుకొని మీరంతా అక్కడికి రండి ఈలోగా నేనక్కడ పరిస్థితులను అవగాహన చేసుకుంటాను. అందరం కలిసి అక్కడ మంచి ట్రేడ్ యూనియన్ నిర్మాణం చేద్దాం అని బయలుదేరి రామగుండంలో చేరాడు.

భిక్షపతి ఆరు నెలల కాలంలో రామగుండంలోని పరిస్థితులను అధ్యయనం చేశాడు. అదే సమయంలో వివిధ ప్రాంతాల్లో ట్రైనింగ్ చేస్తున్న వాళ్లంతా వచ్చి ఉద్యోగులుగా చేరారు. ఇరవై సంవత్సరాలు కూడా లేని ఆ యువకుల రాకతో భిక్షపతికి మరింత బలమొచ్చింది. అతనికి సమాజానికి ఉపయోగపడాలనే తపన ఉంది. అతనిలో ఆవేశముంది, ఆలోచన ఉంది. ఇది చైతన్యవంతమైన కార్మిక వర్గం తయారుచేయడానికి ఉపయోగపడుతుంది. అతడు కార్మిక నాయకుడు కావడానికి శ్రీశ్రీ రచనలు చదివాడు. గోర్కీ, గురజాడ, కారల్ మార్క్స్ రచనలు చదివాడు. ఎమర్జెన్సీలో అరెస్టయ్యి జైలు జీవితం గడిపాడు. యువకులైన అతని సహోద్యోగులు అతనికి అండదండగా నిలిచారు. భిక్షపతి ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శిగా పోటీ చేశాడు. సీనియర్ నాయకులను ఓడించి ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యాడు. అతని నాయకత్వంలో కార్మికుల్లో ఆత్మవిశ్వాసం పెరిగింది. రెండు సంవత్సరాలలో ఆదర్శప్రాయమైన ట్రేడ్ యూనియన్ ను నిర్మించాడు. అతడు రెండేళ్లలోనే చాలావరకు హక్కులను సాధించి పెట్టాడు. ఆ ప్రాంతానికే ఎఫ్.సి.ఐ. ఎంప్లాయిస్ యూనియన్ ఉదాహరణ ప్రాయమైంది. గోదావరిఖని నుండి కొంతమంది కార్మికులు వచ్చి దేశ అవసరాలకు ఉపయోగపడే బొగ్గు తవ్వే కార్మికులకు

మీలాంటివారి నాయకత్వం అవసరం అని చెప్పడంతో గోదావరిఖనిలో యూనియన్ ప్రారంభించాడు. గోదావరిఖని స్వరూప స్వభావాలను అర్థం చేసుకున్నాడు. అతడు ఎవరు దోపిడీదారులో గుర్తించాడు. అక్కడున్న రాజకీయాలను గమనించాడు. ప్రతి కార్మిక వాడను తిరిగాడు. పని పరిస్థితులను అవగాహన చేసుకున్నాడు. ఎన్నో పరిశ్రమలకు కారణభూతమైన బొగ్గు గని కార్మికుల బతుకుల్లోని చీకటిని చూశాడు. భిక్షపతి స్పష్టమైన దృక్పథంతో యూనియన్ స్థాపించాడు. సభలు, సమావేశాలు పెడుతూ పని విభజన చేశాడు. అతనిపై రాజకీయ నాయకులు, గుండాలు దాడులు చేశారు. కత్తులతో దాడిచేస్తే మిత్రుని సమయస్ఫూర్తి వల్ల భిక్షపతి గాయాలతో బయటపడ్డాడు. ఆ తరువాత కార్మికుల కొరకు పోరాటాలు చేశాడు. చైతన్యవంతమైన కార్మికవర్గాన్ని తయారుచేశాడు. కార్మికుల అండతో భిక్షపతి పార్లమెంట్ మెంబరుగా పోటీచేసే స్థాయికి ఎదిగాడు.

ఫ్యాక్టరీ మూతపడే సమయంలో భిక్షపతి ప్రధాన కార్యదర్శిగా లేడు. అతడు ప్రతిపక్షంలో ఉంటూ యాజమాన్యంపై ఒత్తిడి తెచ్చాడు. అయినా కొంత కాలంగా కార్మిక వర్గంపై విపరీతమైన ఒత్తిడి ఉండటంతో కార్మికశక్తి ఏం చేయలేకపోయింది. అతడు చివరి వరకు పోరాడాడు. అయినా ఏం చేయలేక పోయాడు. భిక్షపతి వాలంటరీ సపరేషన్ స్కీమ్ కింద ఉద్యోగ విరమణ చేయాల్సి వచ్చింది. పని చేయకుండా జీతం తీసుకోవడం ఇష్టం లేక ముందుగానే భిక్షపతి వి.ఆర్.ఎస్. తీసుకొని బయటకు వెళ్లాడు. వివిధ రాజకీయ పార్టీలలో ఉంటూ సమాజ సేవ చేశాడు.

కాలువ మల్లయ్య భిక్షపతి పాత్రను ఎంతో చక్కగా చిత్రించాడు. కార్మిక నాయకుడిగా, హక్కుల కొరకు పోరాడే యోధుడుగా, సమాజానికి సేవ చేయాలన్న తపన ఉన్న వ్యక్తిగా అతని పాత్రను తీర్చిదిద్దాడు. కార్మికులలో చైతన్యాన్ని పెంచిన పాత్ర అది. భిక్షపతి కృషి వల్ల పారిశ్రామిక ప్రాంతంలో ఉత్పత్తికి మూలకారకుడైన కార్మికుడిదే పైచేయి అనే వాతావరణం ఏర్పడింది. కార్మికులకు నాయకత్వం వహిస్తూనే రాజకీయాల్లో అడుగుపెట్టాడు. భిక్షపతి కార్మిక నాయకుడిగా, మంచి పేరున్న వ్యక్తిగా, రాజకీయ నాయకుడిగా ఎదిగాడు.

### 4.3.6. లింగమ్మ (గులాంగిరి చోడో):

మారయ్య భార్య లింగమ్మ. గుడిసెల కూర్చొని అన్నం తింటున్నారు లింగమ్మ కుటుంబ సభ్యులు. మారయ్యకు ఓ ప్రక్కకు కొండయ్య ఉన్నాడు. ఇంకో ప్రక్కకు కూతురు వీరమ్మ ఉంది. అందరూ కలిసి తింటుంటే వారికి లింగమ్మ వడ్డిస్తుంది.

"ఏం దొరలో తియ్యి... వీళ్ళ ఇచ్చంత్రాలు గని గీ వానల బర్రెనీద్సుకపోవుట... దాన్ని కోసుడట... ముడ్డి నాది గాకుంటె పట్నందాక దేకమన్నడట ఎనుకటికెవ్వడో... గట్లుంది సంగతి..." (మల్లయ్య, కాలువ.2019:పుట.6) అంది లింగమ్మ. దొర మీద కోపంతో ఆమె అన్న సందర్భం అది.

లింగమ్మ ఇంట్లో చేసే పని వాతావరణాన్నే చక్కగా తెలియజేశాడు కాలువ మల్లయ్య. ఉదయం లేవగానే లింగమ్మ చేసిన ఇంట్లో పనిని ఈ సందర్భం ద్వారా తెలుసుకుందాం. "పొయ్యిల బూడిదెత్తి పెంటబొందల పారేసచ్చింది. పొయ్యలికింది... ఇల్లూడ్చింది... మసుకు మసుగుండంగానే వాకిలూడ్సింది. పెండ నీల్లతో నలుకు జల్లింది. వాకిట్ల ముగ్గేసింది... ముంత పట్టుకొని బిడ్డం దీసుకొని ఊరవుతలికి దొడ్డికి పొయ్యచ్చింది... కాల్లు చేతులు కడుక్కుంది... పిడుక బొగ్గేసుకొని మొకం గూడ కడుక్కుంది... పొయ్యంటువెట్టటానికి కోశిశ్ జేత్తంది... వీరమ్మ తల్లికి పనిల సాయం జేత్తంది... తల్లి జెప్పిన పనిసేత్తంది..." (మల్లయ్య, కాలువ.2019:పుట.26).

లింగమ్మ ఉన్న ఒక కొడుకైన కొంరయ్యను చదివించాలన్న కోరికతో ఉంది. మనం బతికినట్టే కుక్కలోలె, పందులవలె బతుకుమంటవా? పోరగాన్ని అని భర్త మారయ్యతో అంది. మారయ్య కోపంతో లింగమ్మను బూతులు తిట్టాడు. భర్త కోపం చూసిన లింగమ్మ అక్కడి నుండి వెళ్లిపోయింది.

లింగయ్య పాలేరు పనికి వెళ్లి కుంటుకుంటూ వస్తున్న కొడుకును చూసింది. కాలుకు ముల్లు కుచ్చుకుందని తెలిసి పిన్నీసుతోని నొప్పి తెలువకుంట కొడుకును మాటల్లో పెట్టి ముల్లు దీసింది. కొంరయ్యకు తెల్లవారు జామున జ్వరం వచ్చింది. లింగమ్మ కొడుకు మంచం మీద కూర్చొని పరిగడుపునే గోలీ మింగించింది. అతని ఆరోగ్యం గురించి జాగ్రత్తలు తీసుకుంటుంది. దొర కొడుకు రమణారెడ్డి వచ్చి కొంరయ్యను పనికి రమ్మన్నాడు. లింగమ్మ ఈ ఒక్కరోజు అతనికి జ్వరం వచ్చింది రాలేదని వేడుకుంది. ఆమెను రమణారెడ్డి బండ బూతులు తిడతాడు. ఆమె ఎంత బతిమిలాడినా వినకుండా రెచ్చిపోయి తిడుతున్న రమణారెడ్డిని చూస్తుంటే ఆమెకు కోపం వస్తుంది. లోపలెంత భయమున్నా తన ఇంట్లో వాళ్లందరిని ఇష్టమున్నట్లు తిడుతుంటే ఆమెకు కోపం వచ్చింది. "ఓ నువ్వితున్నవు తియ్యి గుమ్మలకొద్ది మక్కల జీతం... ఎన్నడన్న పోరడు పనికి రాడన్నడా...? ఓ దిక్కు సత్తుంటే సెక్కల గులి సేసినట్లు అన్నం మీదికెల్లి తన్నవడ్తివి... కొట్టవడ్తివి... గింతన్నాలముంటదా దొర...?" (మల్లయ్య, కాలువ.2019:పుట.200) అని రమణారెడ్డితో లింగమ్మ అన్నది. లింగమ్మ ఎదురించి మాట్లాడటం అతనికి నచ్చలేదు. రమణారెడ్డి ఆమెను బూతులు తిడుతూ కాలుకున్న

చెప్పు తీసి ఆమె మీదకి విసిరేస్తాడు. ఆమెకు ఆ చెప్పు కడుపులో తగులుతుంది. కింద పడ్డ చెప్పును రమణారెడ్డి కాళ్ల దగ్గర వేసి తన చేతగానితనానికి తననే నిందించుకున్న మారయ్య దొరను ఏమనలేక పెండ్లాంను తిట్టాడు. వీరమ్మకు జరిగిన అన్యాయాన్ని ఎదురించే సమయంలో కూడా లింగమ్మ దొరకు ఎదురు తిరిగింది. దొర చేతిలో అన్యాయమైన బిడ్డ చనిపోతే లబోదిబోమని ఏడ్చింది.

లింగమ్మ తన పని తాను చేసుకుంటూ నీ బాంచెన్ కాల్మొక్తా అని దొరను వేడుకున్నా వినని సమయంలో దొరను ఎదురించింది. ఆమె దొర దౌర్జన్యాన్ని ప్రశ్నించింది. లింగమ్మ కొడుక్కి ధైర్యం చెప్పి దొరను ఎదురించేంతగా అతన్ని ప్రోత్సహిస్తుంది. అతనిలో కొత్త వెలుగును నింపిన తల్లిగా, నీ బాంచెన్ కాల్మొక్తా అని వేడుకున్నా తగిన సమయంలో దొరను ఎదురించిన వనితగా ఆమె పాత్ర ఉంది. నిజమైన భారతీయ గ్రామీణపు ఇల్లాలుగా ఆమె పాత్ర ఉంది.

### 4.3.7. వీరమ్మ (గులాంగిరి చోడో):

మారయ్య కూతురు వీరమ్మ. వీరమ్మది దొరలచేత బలైన స్త్రీ పాత్ర. దొరల యొక్క అహంకారానికి బలైపోయిన స్త్రీ పాత్ర ఆమెది. వీరమ్మ మంచినీళ్లు తీసుకురావడానికి బావి దగ్గరకు వెళ్తుంది. మాదిగవాడ దాటి, రెడ్డి దొరలు ఎక్కువగా ఉండే వాడ నుండి నడుస్తుంది. ఆ వాడకు రాగానే ఆమెకు భయమైతుంది. వీరమ్మ తలవంచుకొని నడుస్తుంది. అక్కడున్న కొందరు ఆమెను బూతులు తిడుతూ హింసిస్తారు. ఆమె బావి దగ్గరకు చేరుకుంటుంది. అక్కడున్న సుధాకర్ రావు వీరమ్మ మీద కన్నేశాడు. వీరమ్మ దగ్గరికి వచ్చి ఆమెను బలవంతంగా చెట్టు కిందకి ఈడ్చుక వెళతాడు. బావి దగ్గరున్న స్త్రీలు ఎవ్వరూ దొరకు ఎదురుతిరిగి మాట్లాడటానికి ధైర్యం చెయ్యలేదు. సుధాకర్ రావు దుశ్శాసనుడిగా రెచ్చిపోయి ఆమెను బలత్కరిస్తాడు. అప్పుడే కొందరు హరిజన యువకులు అక్కడికి వస్తారు. వారిని చూసి అతడు వీరమ్మను వదిలిపెడతాడు. ఆమె ఎంతో బాధపడుతుంది. ఆ తరువాత వీరమ్మ పెళ్లి చేస్తే బాగుంటదని ఇంట్లోనివారు అనుకున్నారు.

రెండేడ్లు గడిచిన తరువాత వీరమ్మకు పెళ్లవుతుంది. మారయ్య తండ్రి బతుకమ్మ పండుగ కొరకు ఆమెను అత్తవారింటి నుండి తీసుకువచ్చాడు. అదే విధంగా వీరమ్మ గర్భవతి కావడంతో సంతోషంగా గడపాలని ఇంటికి తీసుకువస్తాడు. బతుకమ్మ పండుగను చూద్దామని వీరమ్మ వెళ్లింది. ఆమె బతుకమ్మలాడే గుంపులకు దూరంగా ఉండి చూస్తుంది. వీరమ్మ మీద చంద్రారెడ్డి కన్నేశాడు. సమయం కోసం ఎదురుచూస్తున్నాడు. బతుకమ్మ దగ్గర వీరమ్మను గమనిస్తూ తిరుగుతున్నాడు. ఆమెను చంద్రారెడ్డి అతని స్నేహితులు బలవంతంగా బయటకు తీసుకొని వెళ్లారు. వీరమ్మ మీ

కాల్మొక్తా దొరా అంటూ ధీనంగా వేడుకుంది. అయినా వినకుండా ఆమెను పశువువోలె చంద్రారెడ్డి అనుభవించాడు. జీవచ్ఛవమోలె ఇంటికి వచ్చిన వీరమ్మను చూసి అందరూ బాధపడ్డారు. వీరమ్మకు జరిగిన అవమానాన్ని తట్టుకోలేక కొంరయ్య దొర మీదకు వెళ్తాడు. వీరమ్మ అత్తవారికి ఈ విషయం తెలిసి నానా మాటలు అని పుట్టింట్లోనే ఉంచి వెళ్తారు. కొంరయ్య వీరమ్మకు జరిగిన అవమానాన్ని తట్టుకోలేక పంచాయితీ పెడతాడు. అయినా అక్కడ న్యాయం జరగలేదు. కోర్టులో కేసు వేసినా తోటి మిత్రుని నమ్మకద్రోహం వల్ల కేసులో సాక్ష్యాధారాలు లేక కేసు ఓడిపోవడం జరుగుతుంది. వీరమ్మ తనకు జరిగిన అవమానాన్ని భరించలేక ఉరిపెట్టుకొని చనిపోతుంది. దొరల కామవాంఛకు బలైన స్త్రీ వీరమ్మ.

## 4.3.8. మల్లేశం (బతుకు పుస్తకం):

లసుమయ్య పెద్ద కొడుకు మల్లేశం. పదకొండు వరకు చదువుకున్నాడు. అతడు వ్యవసాయం పనిలో తండ్రికి సహాయం చేస్తాడు. వ్యవసాయం చేస్తూ తన తండ్రి పడుతున్న కష్టాలను గమనిస్తుంటాడు. తన తండ్రి పూర్వీకులు, తన కులం వాళ్లంతా తరతరాలుగా వ్యవసాయానికే అంకితమై బతకడం గమనిస్తాడు. తన తండ్రి మాత్రమే చేస్తే సరిపోయే భూమిలో తాను పూర్తి సమయం వ్యవసాయానికే కేటాయించడం ఎంతవరకు సమంజసమని అనుకుంటాడు. అతని ఆలోచనలకు తోడు భార్యతో కాపురం పెట్టిన తరువాత ఆమె పోరు పెడుతుంది. అతడు చదివిన చదువుకు ఏ ఉద్యోగం దొరకడం వీలుకానందున బొగ్గు గని పనికి వెళ్లాలనుకుంటాడు. కాని అతన్ని బొగ్గు గనుల పనికి పంపడం తల్లిదండ్రులకు ఇష్టం లేదు. అతడు ఇంటి దగ్గర ఉంటే జీవితంలో ఎదుగుదల ఉండదని అనుకుంటాడు. ఇప్పుడున్న ఆదాయంతో తమ్ముని చదివించడం కష్టమవుతుంది కాబట్టి తాను ఉద్యోగానికెళితే తమ్ముడినైనా బాగా చదివించవచ్చని తల్లిదండ్రులకు చెప్తాడు. ఇప్పుడు మనం ఓ మాదిరిగా బతుకుతున్నం కాని ఈ ఆదాయం మారుతున్న పరిస్థితుల్లో ఏ మూలకు సరిపోదని బాధపడుతూ తల్లిదండ్రులకు చెప్పుతుంటాడు. కొంత సమయం వరకు వారికి వాదోపవాదాలు జరుగుతాయి. చివరకు తల్లిదండ్రులు ఒప్పుకోక తప్పలేదు. మల్లేశంకు పుట్టి పెరిగిన ఊరును వదిలిపెట్టి వెళ్లడం బాధాకరంగా ఉంటుంది. మల్లేశం, అతని భార్య లక్ష్మీలు గోదావరిఖనికి పని కొరకు వెళ్తారు. ఉద్యోగం దొరకడం వల్ల బతుకుతెరువును వెతుక్కుంటూ వలస వెళ్ళడం మల్లేశంతో ఉధృతమవుతుంది.

మల్లేశం బొగ్గు బావిలో పనిచేస్తూ సంపాదిస్తున్నాడు. అతడు తల్లిదండ్రులను పట్టించుకోవట్లేదు. అతడు కరీంనగర్ లో ఇల్లు కట్టుకొని తమ్మున్ని చదివించేవాడు. అతనికి

ముగ్గురు ఆడపిల్లలు ఉన్నారని ఊళ్లో ఉన్న భూమిని పంచుకోవాలని పంచాయితీ పెడతాడు. పంచాయితీలో పెద్ద మనుషులు మల్లేశం తల్లిదండ్రులకు భూమిని ఉంచి మిగతా ఆస్తులు అన్నదమ్ములకు పంచుతారు. మల్లేశం కొంతవరకు తమ్ముడు రాజయ్యకి అన్యాయం చేయాలనుకుంటాడు. మల్లేశం పెళ్లి అయిన తరువాత ఎక్కువగా స్వార్థపూరితంగా ఉండేవాడు. కొన్ని సంవత్సరాలు గడిచిన తరువాత మల్లేశంలో మార్పులు వచ్చి తన ఊరులోని తల్లిదండ్రులను చూసి వస్తున్నాడు. అదే విధంగా అన్నదమ్ములు కలిసిపోయి ఆనందంగా గడుపుతున్నారు. ఉగాది పండుగకు అందరూ కలిసి తల్లిదండ్రుల వద్ద సంతోషంగా పండుగను జరుపుకున్నారు. బతుకుదెరువు కోసం ఊరిని వదిలి వలస వెళ్లుతున్నారని మల్లేశం పాత్ర తెలియజేస్తుంది. మానవ సంబంధాలు డబ్బు సంబంధాలుగా మారుతూ స్వార్థపూరితంగా తయారవుతున్నాయని, అలాగే ఊరు అప్యాయత, అనురాగాలను పంచిందని ఈ పాత్ర తెలియజేస్తుంది.

### 4.3.9. వెంకటయ్య (బతుకు పుస్తకం):

వెంకటయ్య ఊరిలో ప్రైవేట్ పాఠశాల ఉపాధ్యాయుడు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా అతని ఇంట్లో పగటివేషాలు వేసేవారు. రెండు సంవత్సరాలుగా అతడు అనేక వేషాల కోసం రాసిస్తున్నాడు. వెంకటయ్య రామసింహకవి శిష్యుడు. రామసింహకవి వందలాది కీర్తనలు రాశాడు. ఆ కీర్తనలో సమాజ ధిక్కరణ కూడా ఉంది. రామసింహకవి కీర్తనలు బహుళ ప్రచారంలో ఉన్నాయి. అందులోని సామాజికాంశాలను గుర్తించి వెంకటయ్య వాటిని వెలుగులోకి తెచ్చే ప్రయత్నం చేస్తుంటాడు. దానితోపాటు అతడు కీర్తనలు రాస్తున్నాడు. అతనిలో కొంత సృజనాత్మకత ఉండటం వల్ల ఏకపాత్రాభినయంలాంటివి రాస్తుంటాడు. అతడు వేడుకల్లో పాల్గొని ఊరి వారందరిని ఉత్సాహపరిచాడు. ఊరిలో వెంకటయ్యకు బడిపంతులు అని, మంచివాడనే పేరు ఉంది. వెంకటయ్య ఊరిలో పిల్లలకు చదువును అందిస్తూ నలుగురికి మార్గదర్శిగా ఉంటున్నాడు. సమాజంలో నలుగురికి మంచి చేసే ప్రయత్నం చేస్తున్నాడు. వెంకటయ్యది ఒక ఆదర్శవంతమైన పాత్ర అని చెప్పవచ్చు.

### 4.3.10. భూమారెడ్డి (తెలంగాణ దేవదాసు):

భూమారెడ్డి ఒక జమీందార్. అతడు రాజ్యలక్ష్మిని పెళ్లి చేసుకుంటాడు. రాజ్యలక్ష్మితో అతడు కొత్త జీవితాన్ని ప్రారంభిస్తాడు. ఇరవై సంవత్సరాలుగా మీ ఇంటి దగ్గర ఎలా ఉన్నావో ఇక్కడ కూడా అలాగే ఉండొచ్చని అతడు రాజ్యలక్ష్మితో చెప్తాడు. తన భర్త సామాన్యుడు కాదని రాజ్యలక్ష్మిని అర్థం చేసుకుంటుంది. అతడు మామూలుగా, నిజాయితీగా, దాపరికాలు లేకుండా మాట్లాడుతూ

ఉండేవాడు. డిగ్రీతోపాటు సమాజాన్నే చదివినవాడు కావడంతో అతనికి గర్వం లేదు. దొరల కుటుంబాల్లో అన్నల ప్రభావం వల్ల మార్పులు వస్తున్నాయని తెలుసుకొని భవిష్యత్తు గురించి ఆలోచించి ఊరిలో ఉన్న కొన్ని భూములను అమ్మి పట్టణంలో ఇళ్లు, స్థలాలు కొంటాడు. రాజ్యలక్ష్మి తనకు, రఘురాంకు మధ్యగల ప్రేమ విషయాన్ని అతనికి చెబుతుంది. అతడికి దాపరికం లేకుండా ఉన్న విషయాన్ని చెప్తుంది. అతనికి ఆమెపై మరింత గౌరవం పెరిగింది. అతడు ఆమె రూపాన్ని పెళ్లిరోజు నుండి పదిలంగా భద్రపరచుకుంటాడు. భార్యాభర్తల మధ్య రహస్యాలు ఉండకూడదని నమ్మిన వ్యక్తి భూమారెడ్డి. భూమారెడ్డి సంస్కావంతమైన భర్తగా భార్యతో అన్యోన్యంగా ఉండేవాడు. రఘురాం కుటుంబంతో భూమారెడ్డి కుటుంబం సత్సంబంధాలు కలిగి ఉండేది. రఘురాం, భూమారెడ్డిల కుటుంబాలు కలిసి ఎన్నో విషయాల గురించి చర్చించుకుంటూ ఉండేవారు.

సమాజంలో చదువుకున్న వ్యక్తిగా, దొరతనపు అహంకారం లేనివాడిగా, ఆధిపత్య భావాలు లేని వ్యక్తిగా, ఒక సంస్కారవంతమైన భర్తగా, మంచి ఆదర్శ భావాలు గలవాడిగా భూమారెడ్డి పాత్ర చిత్రించబడింది.

### 4.3.11. మనోజ్ (అస్పృశ్య కోయిల):

మనోజ్ పాత్ర అస్పృశ్య కోయిల నవలలో ఆదర్శ పాత్ర. మనోజ్ చదువుకుంటున్న సమయంలో ముఖ్యంగా శ్రీశ్రీ మహాప్రస్థానం గురించి చదివి, సాంఘిక దురాచారాల గురించి ఇంకా చాలా విషయాలు తెలుసుకుంటాడు. అతడు నూనూగు మీసాల నూతన యవ్వనపు వయస్సులో ఉన్నప్పుడు వీరేశలింగం, రాజా రాంమోహన్ రాయ్ లాంటి సంఘ సంస్కర్తల గూర్చి చదువుకుంటూ వారిలా అతడు ఆదర్శవంతమైన జీవితం గడపాలని అనుకుంటాడు. తన ఊరిలోని దళితులు దొరల దౌర్జన్యాలకు బలవుతున్నారని తెలుసుకుంటాడు. వారిపై ఎందుకు వివక్ష ఉందో అర్థం చేసుకోవడానికి ప్రయత్నిస్తుంటాడు. అంటరానితనం ఏమిటనే ప్రశ్న అతనిలో ఉదయించింది. అంటరానితనం అనేది ఎంత అవమానకరమో తెలిసింది. కోకిలమ్మ జీవితాన్ని చూస్తూ, ఆమెకు ఎలా అవమానాలు ఎదురవుతున్నాయో మనోజ్ ప్రత్యక్షంగా చూసేవాడు. ఆమె ఆలోచనలే అతని మనసు నిండా ఉన్నాయి. ఆమె ధైర్యాన్ని చూసి ఆశ్చర్యపోతాడు. ఆమెకు అండగా ఉండాలని అనుకుంటాడు. కాని సమాజంలో పరిస్థితులు, తల్లిదండ్రుల కోపం వల్ల అతడు ఆలోచనలో పడతాడు. ఆదర్శాల వేడిలో ఆమెను పెళ్లి చేసుకోవాలనుకోవడం అసహజం అనిపిస్తుంది. ఆ విషయాన్ని తలుచుకొని మనోజ్ భయపడుతుంటాడు. మనోజ్ తాతతో, నాన్నతో వెళ్లి దళితవాడ చూసి వస్తాడు. చాలా ఇళ్లలో దారిద్ర్యం తాండవిస్తుందని, ప్రతి దళిత ఇల్లు ఓ

కర్మాగారము అని, వస్తు ఉత్పత్తి చేసే ఫ్యాక్టరీ అని అనుకుంటాడు. అన్ని పనులు చేసేవారు తినడానికి తిండిలేక ఎందుకు ఇబ్బందులు పడుతున్నారో అతడు తెలుసుకుంటాడు. మనోజుకు రోజురోజుకి సంస్కరణ భావాలు పెరుగుతున్నాయి. కోకిలమ్మతో పరిచయం అతన్ని దళితుల పట్ల మరింత అంకితభావంతో ఉండేటట్టు చేసింది. అతడు ఏదైనా ఆదర్శమైన పని చేయాలనుకుంటాడు. ఆ ఆలోచన వచ్చినప్పుడల్ల దృష్టి చదువు మీదికి మరల్చి తప్పించుకుంటాడు. కాని తల్లిదండ్రులను ఒప్పించే శక్తిలేక అలాగే ఉండిపోతాడు. పదేండ్ల కాలం గడిచింది. ఈ పదేళ్లలో మనోజుకు పెళ్లైంది. ఉద్యోగం వచ్చింది. పిల్లలు పుట్టారు. రచయితగా కొంత పేరు సంపాదించుకున్నాడు. ఊరికి దూరంగా ఉండటం వల్ల కోకిలమ్మ విషయాలు అంతగా తెలుసుకోలేకపోయాడు. దళితుల సమస్యలపై పోరాడాలనుకుంటాడు. వారిని ఎవరైనా తిడితే వారిపై మనోజ్ కోప్పడేవాడు. వారిని గవర్నమెంట్ అల్లుళ్లు అనే వారిని తిట్టేవాడు. కోకిలమ్మ దొర ఇంట్లో పడుతున్న కష్టాలను తెలుసుకొని ఆమెను దగ్గరకు తీసుకోవాలనుకుంటాడు. కాని అతని కుటుంబంలోని వారికి తెలిస్తే నా పరిస్థితి ఏమిటని అనుకోకుండా ఉండలేకపోతాడు. ఆమెతో మాట్లాడి వెళ్లిపోతాడు. కొంత కాలం గడుస్తుంది. సమాజంలో చాలా మార్పులు వస్తాయి. అతడు దళిత అభ్యుదయం కోసం పోరాడుతున్నాడు. దళిత, దళితేతర కుటుంబాల్లో, ప్రేమల్లోని తేడాను అర్థం చేసుకుంటాడు. కోకిలమ్మ గురించి ఆలోచిస్తూనే ఉంటాడు. కోకిలమ్మ ఎదుగుదలను చూస్తాడు. ఆమెను ఎందుకు ప్రోత్సహించలేకపోయానా అని, ఆమె బాగా పాడుతుందని తెలిసి కూడా ఎందుకు గుర్తించలేకపోయాను? దొర కుటుంబం నుండి ఆమెను ఎందుకు బయటకు తీసుకరాలేకపోయిన అని ఆమె ఎదుగుదలను చూస్తూ తనకు తానే ప్రశ్నించుకున్నాడు. అంటరాని కోయిలమ్మగా ప్రారంభమైన ఆమె జీవితం దళిత, బహుజన ఉద్యమ నాయకురాలిగా ఎదిగిన క్రమం అతనికి ఆనందాన్నిచ్చింది. ఆమె మాటలు, ఆశయాలు ఆశయసాధన కోసం అంకితం కావాలని అతన్ని ప్రేరేపించాయి. కోకిలమ్మ జీవితాన్ని నవలగా రాసి కోకిలమ్మకు సాహిత్యంలో చోటు కల్పిస్తాడు. అతన్ని దళిత జీవితం వైపు ఆలోచించేటట్టు చేసిన కోకిలమ్మను సాహిత్యంలో శాశ్వతంగా ఉండేటట్టు చేస్తాడు.

శూద్ర కులస్థుడుగా, చదువుకున్నవాడిగా, రచయితగా, కవిగా, ఆలోచనపరుడిగా దళితులతో ఎలా మెలగాలి వారితో కలిసి కుల నిర్మూలన ఉద్యమం ఎలా చేయాలో తెలియజేసిన పాత్ర మనోజుది. బహుజనులంతా పీడితవర్గం వారేనని, వారంతా ఐక్యంగా ఉండి పోరాడి

విముక్తిని సాధించాలని బోధించిన పాత్ర ఇది. కోకిలమ్మ ద్వారా దళితుల గురించి తెలిసినవాడిగా, ఆమె జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని తాను ఆదర్శప్రాయంగా మారిన పాత్ర ఇది.

### 4.3.12. గోపాలకృష్ణశర్మ (అస్పృశ్య కోయిల):

గోపాలకృష్ణశర్మ స్వయంగా అగ్ర కులంలో పుట్టినా, అభ్యుదయ భావాలు కలిగిన సామాజిక కార్యకర్త. శ్యాంరావు చేసిన ద్రోహంతో మానేరు డ్యాం మీద నుండి దూకి ఆత్మహత్య చేసుకుందామనుకున్న కోకిలమ్మను కాపాడి, ఆమెను వివాహం చేసుకొని, అధ్యయనం చేయించి, సామాజిక ఉద్యమకారిణిగా, వాగ్గేయకారిణిగా మలిచింది ఇతడే. గోపాలకృష్ణశర్మ పాత్ర నవలాంతంలో కొంతమేర మాత్రమే కనిపించినా అత్యంత ఆదర్శవంతమైన పాత్రగా గోచరిస్తుంది.

### 4.3.13. లింగమ్మ (గువ్వలచెన్నా):

లింగమ్మ చిప్ప మల్లయ్య భార్య. రాట్నం వడుకుతూ, కండెలు చుడుతూ భర్తకు వృత్తిపనిలో సహకరిస్తుంది. ఆర్థిక పరిస్థితులు బాగాలేకున్నా ఎలాగైనా కొడుకు శంకరయ్యను చదివించాలని పట్టుబట్టి చదివిస్తుంది. కొడుకును బాగా చదివించడంతో ఉన్నత స్థాయికి వెళ్తాడు. లింగమ్మ నేత పనివారి కుటుంబంలో పుట్టి పెరిగింది. ఆ వృత్తి పని చేస్తున్న చిప్ప మల్లయ్యను పెళ్లి చేసుకుంటుంది. తనవారు వేల కొద్ది గజాల చీరలు నేశారు. వేలాది మందికి బట్టల అవసరాలను తీర్చారు. తాను తన తండ్రి, అన్నయ్య, భర్త, కొడుకు నేచిన వస్త్రాలనే ధరించేవారు. ఆమెకు పదేళ్ల వయస్సు ఉన్నప్పుడు దొర కూతురు కట్టుకున్న పట్టుచీర చూసి అలాంటి పట్టుచీరను ఒక్కసారైనా కట్టుకోవాలని అనుకునేది. లింగమ్మ పెళ్లి తరువాత ఆర్థిక పరిస్థితులు బాగాలేక భర్త పట్టుచీర కొనియ్యలేకపోయాడు. కొడుకు శంకరయ్య అయినా ఉద్యోగం వస్తే పట్టుచీర ఇప్పిస్తాడని అనుకుంటుంది. కాని అతడు ఉద్యోగం రాగానే భార్యకు పట్టుచీర తెస్తాడు కాని డబ్బు లేకపోవడం వల్ల మళ్లీ ఎప్పుడైనా తల్లికి పట్టుచీర తెద్దామనుకుంటాడు. కొన్ని సంవత్సరాలు గడిచాయి. ఆమె వృద్ధురాలై మంచంలో పడుతుంది. అయినా తనకు పట్టుచీర కావాలని కొడుకుని కోరింది. అతడు పట్టుచీర తీసుకువచ్చేసరికి ఆమె చనిపోతుంది. చివరకు ఆ పట్టుచీరనే శవంపై కప్పుతారు.

మంచి ఇల్లాలిగా, పిల్లలను ప్రేమించే తల్లిగా, శంకరయ్యను చదివించి అతని ఎదుగుదలను చూసిన తల్లిగా, సగటు స్త్రీ కోరుకునే చిన్న కోరికైన పట్టుచీర కట్టుకునే అదృష్టం లేకుండానే మరణించిన పాత్రగా లింగమ్మ పాత్ర చిత్రించబడింది. .

### 4.3.14. రమేష్ (గువ్వలచెన్నా):

రమేష్ శంకరయ్య కొడుకు. రమేష్ కంప్యూటర్ ఇంజనీరుగా ఇరవై వేలకు పైగా జీతంతో బెంగుళూరులో పనిచేస్తుంటాడు. రమేష్ ఉన్నత కుటుంబానికి చెందిన మల్లీశ్వరిని ప్రేమిస్తాడు. రమేష్ తండ్రి సలహా మేరకు మల్లీశ్వరి తనను చూసా లేక తన సంస్కృతిని చూసి ప్రేమించిందా అని తెలుసుకోవాలనుకుంటాడు. రమేష్ మల్లీశ్వరితో అమెరికాకు వెళ్లడం ఇష్టం లేదని చెప్పుతాడు. దానికి ఆమె వ్యతిరేకిస్తుంది. దాంతో రమేష్ బాధపడతాడు. ఇంటికి వచ్చిన తరువాత రమేష్ తండ్రితో జరిగిన విషయం చెప్పి మీరు చూసిన అమ్మాయినే పెళ్లి చేసుకుంటానంటాడు. అంతల్లోనే మల్లీశ్వరి రమేష్ వాళ్ల ఇంటికి వచ్చి అసలు విషయం చెబుతుంది. తన మూలాలు మరిచిపోకుండా తన వారి కోసం ఎంతో కొంత చేద్దామనుకుంటున్న రమేష్ అంటే నాకిష్టం అని మల్లీశ్వరి అంటుంది. మీ కుటుంబ నేపథ్యం, మీ గురించి తెలుసుకొని మీలో ఒకరిగా కలిసిపోయి జీవించాలనే రమేష్ ను ఇష్టపడ్డాను అంటుంది. రమేష్ అమెరికా వెళ్లినా, వెళ్లకున్నా అతనితోనే జీవితం పంచుకుంటానని మల్లీశ్వరి అనడంతో రమేష్ ఎంతో ఆనందంతో ఉప్పొంగిపోతాడు. తల్లిదండ్రుల కోరిక మేరకు ఆమెను ఆదర్శ వివాహం చేసుకుంటాడు.

కుటుంబంపై ప్రేమను కలిగినవాడిగా, కులాంతర వివాహం చేసుకున్న వాడిగా, కంప్యూటర్ ఇంజనీరుగా తండ్రి ఆలోచనల్ని, ఆశయాల్ని, తమ సంస్కృతులను గౌరవించేవాడిగా, ఆదర్శవంతుడిగా రమేష్ పాత్ర చిత్రించబడింది.

## 4.4. సందేశాత్మక పాత్రలు:

### 4.4.1. వీరేశం (మాదిగ విజయం):

మాదిగ విజయం నవలలో వీరేశంది ఒక సందేశానిచ్చే పాత్ర. వీరేశం దళిత ఉపకులాల్లో ఒక్కటైన నేతకాని కులానికి చెందినవాడు. వీరేశం పరిగేరుకుంటూ, కల్లాలు చెక్కుతూ జీవితాన్ని గడిపేవాడు. వీరేశం చిన్నతనంలోనే ఊరి విడిచి వెళ్ళిపోయాడు. ఎన్నో కష్టాలు ఎదుర్కొని హైదరాబాదులో చిల్లర పనులు చేస్తూ బతికేవాడు. వీరేశం కొంతకాలం తరువాత చార్మినార్ సిగరెట్ ఫ్యాక్టరీలో ఉద్యోగం సంపాదించాడు. కొంత చదువుకోవడం వల్ల కార్మిక చైతన్యాన్ని అలవర్చుకున్నాడు. గత ఐదారేళ్లుగా ఊరికి వచ్చి పోతున్నాడు. అతని మేనమామ కూతురు దుబ్బమ్మను పెళ్లి చేసుకొని తీసుకుపోవాలనే ప్రయత్నంలో ఉన్నాడు. అతడు ఊరికి వస్తూ పోతున్న సందర్భంలో దొరలు మాల మాదిగల మధ్య వైరాన్ని రగిలించడం గూర్చి తెలుసుకున్నాడు. మాలమాదిగలను ఒక్క దగ్గరికి చేర్చి కొన్ని విషయాలు తెలియజేశాడు.

మనకు స్వతంత్ర్యం వచ్చింది. నిజాం నవాబు వెళ్లిపోయాడు. అయినా మన జీవితాలు మారలేదు. అప్పుడు ఊరును దొరలే పాలించారు. ఇప్పుడు దొరల చేతిలోనే ఊర్లు ఉన్నాయి. అయినా మన జీవితాల్లో తేడాలు రాలేదు. మనమంతా ఒక్కటిగా కలిసుండటం దొరలకు నచ్చదు. మాలమాదిగల కులాల మధ్య కొట్లాటలు పెడుతున్నారు. ఇవన్నీ మీరు గమనించాలి అని అనేక విషయాలు వీరేశం చెప్పాడు. వీరేశం మాటలకు దళితులు ఆకర్షితులయ్యారు. అంబేద్కర్ మనకోసం ఎన్నో పోరాటాలు చేశాడు. చదువుల్లో, ఉద్యోగాల్లో మనకు రిజర్వేషన్లు ఉన్నాయి. వాటిని ఉపయోగించుకొని విద్యావంతులం కావాలి అని, దొర మాటలు వినవద్దని, మనం ఐక్యంగా ఉంటే ఎవరు ఏం చేయలేరు అన్న వీరేశం మాటలు వారికి కొత్తగా ఉన్నాయి. ఇంతవరకు ఎవరూ ఇలాంటి మాటలు విన్లేదు. తమ గురించి చెప్పినవాళ్లు లేనేలేరని వీరేశంను తమ శ్రేయోభిలాషిగా, నాయకుడిగా స్వీకరించారు దళితులు. వీరేశం ఒక్కొక్క ఇంటికి వెళ్లి ఒక్కొక్కరిని సముదాయించాడు. వాళ్లకున్న భయాలను తొలగించాడు. శరభయ్య, శంకరమ్మల కులాంతర వివాహం జరిపించడానికి ఇరుపక్షాల వారిని అంగీకరింపజేశాడు. కొద్ది రోజుల్లోనే వారి పెళ్లిని జరిపించాడు.

దొరలు అతను చేస్తున్న పని గురించి తెలుసుకున్నారు. తమ పునాదులు కదులుతున్నట్టు గ్రహించారు. సూర్యారావు, లక్ష్మణరావుల కోపానికయితే అంతే లేదు. తమ అభీష్టానికి వ్యతిరేకంగా మాలమాదిగలు ఏకం కావడం శంకరమ్మ శరభయ్యలు పెండ్లి చేసుకోవడం తమ అధికారాలను ధిక్కరిస్తున్నట్టుగానే భావించారు. దళితుల చైతన్యానికి కారణభూతుడైన వీరేశంను చంపాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. అందుకొరకు మనుషులను నియమించారు. కరీంనగర్ కు వెళ్ళి వస్తున్న వీరేశంను ఊరు బయట ఉన్న గుట్టల మధ్యలో చంపారు. వీరేశం శవాన్ని పక్కనే ఉన్న లోయలోకి వేసి వెళ్లిపోయారు. కొన్ని రోజుల తరువాత అతని చావుకు కారణం ఎవరో దళితులకు తెలిసినా ఏమి చేయలేకపోయారు. వారం రోజుల్లో తన బావతో పెళ్లి జరుగుతుందనుకున్న దుబ్బమ్మ బతుకు అగ్గిపాలైంది. వీరేశం దళితుల్లో చైతన్యం తీసుకవచ్చాడు. వీరేశం పాత్ర ఎంతో చైతన్యవంతంగా కనిపిస్తుంది. ఎన్ని అవమానాలు ఎదురైనా ఎదురించి పోరాడాలని ఈ పాత్ర తెలియజేస్తుంది. దొరల ప్రయత్నాలకు ఎదురొడ్డి పోరాడిన పాత్ర ఇది. అంబేద్కర్ యొక్క పోరాట స్ఫూర్తిని ఈ పాత్రలో చూడవచ్చు. మాలమాదిగలు పీడితులే అయినా అవగాహనాలోపం, అవిద్య, అజ్ఞానం ఒకరి నుండి మరొకరు దూరం చేసుకుంటున్నారని ఈ పాత్ర ద్వారా తెలియజేయడం జరిగింది. మాల మాదిగల మధ్య ఉన్న వైరుధ్యాన్ని తగ్గించి వారిని చైతన్యపరిచినవాడిగా, దొరలను ఎదుర్కొని

వారిచేత హత్య చేయబడ్డ వ్యక్తిగా, దళితుల్లో చైతన్యాన్ని తీసుకవచ్చి సమాజానికి అంబేద్కర్ పోరాట స్ఫూర్తిని తెలియజేసే పాత్రగా వీరేశం పాత్ర చిత్రించబడింది.

### 4.4.2. అంజయ్య (గులాంగిరి చోడో):

అంజయ్య చదువుకోకపోయినా చెప్పుల తయారీ వృత్తిని చేపట్టి ఉన్నతంగా బతుకుతూ నలుగురికి ఉపాధిని కల్పిస్తున్న ఓ అద్భుతమైన పాత్ర. అంజయ్య మెదక్ జిల్లాలోని ఓ ఊరిలో దొరల బాధలు పడలేక ఊరు వదిలి వస్తాడు. అతడు బతుకుదెరువు వెతుకుతూ హుస్నాబాదుకు చేరి అక్కడే స్థిరపడ్డాడు. పొట్ట తిప్పల కోసం ఎన్నో పనులు చేశాడు. వరంగల్ లో కొన్ని నెలలు ఓ చెప్పుల దుకాణంలో పనిచేశాడు. అతనికి పనిలో అనుభవం ఉండటంతో హుస్నాబాదులో చెప్పుల దుకాణం పెట్టాడు. మొదట్లో అంజయ్య, అతని భార్య అందులో పనిచేసేవారు. చెప్పులకు గిరాకీ పెరగడంతో ఇప్పుడు అతని దగ్గర పదిమంది పనిచేస్తున్నారు.

మొదట్లో అంజయ్య ఇంటింటికి తిరిగి ఆర్డర్లు తెచ్చుకొని చెప్పులు తయారుచేసేవాడు. అతని దగ్గర చెప్పుల నాణ్యతను బట్టి గిరాకీ నిదానంగా పెరిగింది. అతని దగ్గర 30, 40, 50 రూపాయలకు చెప్పులు కొనుక్కొని కొందరు వాటిని బయట షాపుల్లో కొంత మెరుగులు దిద్ది మూడు రెట్లు ఎక్కువకు అమ్ముకునేవారు. ఇప్పుడు అతను కరీంనగర్, నిజామాబాద్, కోరుట్ల, జగిత్యాల, పరకాల ప్రాంతాలలోని చెప్పుల దుకాణాలకు చెప్పులను సరఫరా చేస్తున్నాడు. మంచి నాణ్యతతో తయారుచేయడం వలన అతనికి గిరాకీ క్రమక్రమంగా పెరిగింది. అంజయ్య చెప్పుల దుకాణాన్ని చూసి కొంరయ్య తనకు తెలిసిన తెలివితో కొన్ని మార్పులతో, అంజయ్య సలహాలు పాటిస్తూ చెప్పుల దుకాణం పెట్టాడు.

ఏమాత్రం చదువుకోకున్నా చెప్పులు తయారుచేస్తూ ఉన్నత స్థాయికి చేరుకున్న అంజయ్యది గొప్ప పాత్ర. తాను బతకడమే కాకుండా ఓ పల్లెలో ఆ పనితోనే ఇంకో పదిమందికి ఉపాధి చూపెట్టిన ఓ అద్భుతమైన పాత్ర అతనిది. అతనికి ఉన్న దీక్ష, పట్టుదలతో ఉన్నత స్థాయికి చేరుకున్నాడు. దొరల అవమానాలు భరించలేక స్వంతంగా బ్రతకవచ్చు అనే పట్టుదలతో కష్టపడి ఎదిగిన పాత్ర అంజయ్యది.

### 4.4.3. మధునయ్య (గులాంగిరి చోడో):

మధునయ్య గోదావరిఖనిలో ఉపాధ్యాయ వృత్తి చేస్తున్నాడు. అతనిది కొంరయ్య ఊరు. ఉపాధ్యాయ వృత్తిలో ఉండటం వల్ల చాలామంది అతన్ని మధునయ్య సార్ అంటారు. మధునయ్యకు పేదోల్లంటే ప్రేమ. మధునయ్య సార్ ను గోదావరిఖనిలో కలిసి కొంరయ్య అతని

గతాన్నంత తెలియజేశాడు. కొంరయ్య బాధను అర్థం చేసుకున్న మధునయ్య అతనికి బతుకుదెరువు కొరకు ఒక మార్గం చూపించాలనుకుంటాడు. మధునయ్య కొంరయ్యను తన వృత్తి పనియైన చెప్పులు కుట్టడం పని చెయ్యమని చెప్పుతాడు. కొంరయ్య అతని మాటలకు బదులుగా ఆ పనిని వదిలిపెట్టి చాలామంది ఊరు వదిలిపెట్టి వెళ్ళుతుంటే మళ్లీ అదే పనిచేస్తే ఏం లాభం లేదని కొంరయ్య అంటాడు. ఓ పని గొప్పది, ఓ పని తక్కువని అనుకోవడం మన ఆలోచనల్లోనే ఉంది. ఏ పని కూడా హీనమైంది కాదు. ఎవరి పని వాళ్లకు గొప్పదే అని కొంరయ్యకు చెప్తాడు. నీకు అవమానం జరిగింది వాస్తవమే కాని చెప్పులు కుట్టే పనితోనే రాలేదని, ఇప్పుడు నిదానంగా సమాజంలో మార్పులు వస్తున్నాయని, నీకు ఆవేశం, పట్టుదల, కష్టపడే స్వభావం ఉన్నాయి కాబట్టి వృత్తి పనిచేసుకుంటే మంచిగానే బతకవచ్చని కొంరయ్యకు మధునయ్య సలహా ఇస్తాడు. మధునయ్య మాటలతో కొంరయ్యకి ఆత్మవిశ్వాసం పెరిగింది. అతని సలహాలు విని చెప్పుల దుకాణం పెట్టి మంచిగానే బతుకుతాడు కొంరయ్య. మధునయ్య సలహాలు కొంరయ్యకు ఎంతగానో ఉపయోగపడ్డాయి.

ఏ పని కూడా తక్కువది కాదని, హీనమైనది కాదని తెలియజేసిన పాత్ర ఇది. కష్టపడే స్వభావం, పట్టుదల ఉంటే ఎంతైనా ఎదగొచ్చని తెలియజేస్తుంది ఈ పాత్ర. సమాజంలో మార్పులు రావడం సహజం అని తెలియజేసే పాత్ర ఇది. కొంరయ్య ఒక స్థాయికి రావడంలో ఈ పాత్ర తోడ్పాటు కూడా కొంత ఉందని మనం తెలుసుకోవచ్చు. కొంత కాలానికి కులాలే పోవచ్చు అని తెలియజేస్తున్న పాత్ర ఇది. అంటరానితనమనేది ఈ సమాజంలో ఉన్న జబ్బు అని ఈ పాత్ర తెలియజేస్తుంది.

### 4.4.4. పురుషోత్తమరావు (బతుకుపుస్తకం):

కొండల్ రావు కొడుకు పురుషోత్తమరావు. పురుషోత్తమరావు బడికి వెళ్ళేవాడు. బడిలోనే రాజయ్యతో అతనికి స్నేహం ఏర్పడింది. వారిద్దరు కలిసి బడికిపోవడం చూసి ఊళ్లోని చాలామంది అసూయపడేవారు. పురుషోత్తమరావు ఎంతో సుఖంగా బతుకుతున్నాడు. అతనికి దొర అనే గర్వం లేకపోవడం వల్ల రాజయ్యతో స్నేహం కొనసాగించాడు. ఆర్థికపరమైన విషయాల్లో వారి మధ్య అంతరాలు ఉన్నా, ఎంతో మంచిగా ఉంటూ వాటిని పట్టించుకోకుండా ఉంటున్నారు. రాజయ్య, పురుషోత్తమరావులు ఇద్దరూ కలిసి ఒకరోజు వ్యవసాయపు పని చేసి కష్టం విలువ తెలుసుకుంటారు.

పురుషోత్తమరావు ఎం.ఏ. పూర్తి చేస్తాడు. అతడు ఉద్యోగం చేయకుండా తండ్రిచ్చిన డబ్బుతో ఏదైనా వ్యాపారమైనా లేదా కాంట్రాక్ట్ పనైనా చేయాలనుకుంటున్నాడు. అతడు సమాజాన్ని అర్థం చేసుకుంటున్నాడు. కొంతకాలం కిందటి వరకు వెనుకబడిన వర్గాల వారింట్లో అన్నం తినడానికి అతడు ఇష్టపడేవాడు కాదు. అతని ఆలోచనల్లో మార్పులు వచ్చి ఇప్పుడు అందరితో ఉంటూ అవసరమైన చోట తింటున్నాడు. తన తండ్రి ఊరికి ఎన్నో అభివృద్ధి పనులు చేస్తే వాటిని గురించి పట్టించుకోకుండా అతని కుటుంబాన్ని దోపిడీదారుని కుటుంబం అని అన్నలు, గ్రామ యువకులు వెళ్లగొట్టడం అతనికి బాధను కలిగించింది. అతడు తన తండ్రి ద్వారా ఎన్నో మంచి విషయాలు తెలుసుకుంటాడు. పురుషోత్తమరావు తండ్రిని ఆదర్శంగా తీసుకొని సమాజ సేవ చేయాలనుకుంటాడు. ఊరి మీద ప్రేమతో మిత్రులతో ఆనందంగా గడుపుతూ, కుటుంబంలో ఉన్న మానవతా విలువలను, ఊరిలో వచ్చిన మార్పులను తలుచుకుంటూ కాలం గడుపుతున్నాడు. ఊరంటే బతుకుపుస్తకం అనే విషయాన్ని స్నేహితుడైన రాజయ్య ద్వారా తెలుసుకుంటాడు. అతడు బతుకు పుస్తకాన్ని బాగా చదవాలని అనుకుంటాడు.

పురుషోత్తమరావు ఊరిలో దొర కొడుకుగా ఉంటూ ప్రజలతో ప్రేమగా ఉండేవాడు. అన్ని వర్గాల వారితో స్నేహం చేసే ఒక స్నేహశీలిగా, ఊళ్లోనే అప్యాయతలు, అనురాగాలు ఉంటాయని నమ్మినవాడుగా, ఆదర్శవంతమైన తండ్రికి తగ్గ తనయుడిగా, ప్రేమ, జాలిగలవాడుగా, ఊరిని బతుకుపుస్తకం అని నమ్మినవాడుగా పురుషోత్తమరావు పాత్ర తీర్చిదిద్దబడింది.

### 4.4.5. లచ్చులు (బతుకుపుస్తకం):

లచ్చులు కొండల్ రావు పంతులు భూముల్ని చూడటానికి వచ్చి, ఆ ఊరిలోనే శేరిదారుగా (నమ్మకంగా పనిచేసే వ్యక్తి) ఉంటాడు. అతడు ఆ ఊరికి వచ్చిన సమయంలో తనకెవ్వరు ఆశ్రయమివ్వలేదు. కట్టుబట్టలతో వచ్చిన అతన్ని కొండల్ రావు ఆదుకుంటాడు. కొండల్ రావు అతనికి అండగా నిలబడ్డాడు. అతడు కొండల్ రావు ఇంటి దగ్గరున్న స్థలంలో చిన్న పెంకుటిల్లు కట్టుకొని ఉంటున్నాడు. కొండల్ రావు పొలాల్లో తానే వ్యవసాయం చేసేవాడు. అతను ఎప్పుడూ కొండల్ రావు వ్యవసాయాన్ని పరాయిదిగా భావించలేదు. ఆదాయంలో ఆరవ భాగం వాటా కొండల్ రావు అతనికి ఇచ్చేవాడు. అతను ఎంతో నమ్మకంగా వ్యవసాయం చేస్తాడు. అతడు కొండల్ రావుని గురువుగా, యజమానిగా భావించేవాడు. కొండల్ రావుకు నమ్మకమైన పనివానిగా ఉండేవాడు. అతనికి కొండల్ రావు వల్ల ఆధారం దొరికిందని తను కొండల్ రావు వల్ల నష్టపోయింది ఏమిలేదని అనుకుంటాడు. అతని కుటుంబానికి బట్టకు పొట్టకు ఢోకా లేకుండా

వెళ్లిపోతుంది. అతని వల్ల కొండల్ రావు వ్యవసాయం మరింత అభివృద్ధి అయింది. అతనికి పాలేర్ల అందరిపై అజమాయిషీ పెరిగింది. బతుకే లేని తనకు ఈ బతుకైన దొరికినందుకు సంతోషంగా ఉంటాడు. లచ్చులు ఎంతో సంతృప్తిగా బతుకుతుంటాడు. ఒక నమ్మకస్థుడిగా, ఆదుకున్నవారిని మరవలేనివాడిగా, నమ్మినబంటుగా లచ్చులు పాత్రని చిత్రించడం జరిగింది.

### 4.4.6. రవీందర్ రెడ్డి (తెలంగాణ దేవదాసు):

రవీందర్ రెడ్డి జమీందారు కొడుకైనా గర్వమన్నదే లేనివాడు. రాజ్యలక్ష్మికి అన్న. రఘురాంకు స్నేహితుడు. అతడు చెల్లెల్ని ఎంతో ప్రేమగా చూసుకునేవాడు. రవీందర్ రెడ్డి చదువుకునే సమయంలో ఎంతో ఉత్సాహంగా ఉండేవాడు. పాఠశాల విద్యార్థి యూనియన్ ఎన్నికల్లో ప్రెసిడెంటుగా ఎన్నికయ్యాడు. రఘురాంను ఇంజనీరింగ్ చేయమని ప్రోత్సహిస్తాడు. రాజ్యలక్ష్మి రఘురాంతోనే సుఖంగా ఉంటుందని చెప్పి, వారిద్దరి మధ్య స్నేహాన్ని ప్రోత్సహిస్తాడు. సుఖంగా బతకడానికి డబ్బు కంటె మనసు, మనిషి ముఖ్యమని చెప్పి, ఆమె ప్రేమ విషయంలో అన్ని రకాలుగా సహకరిస్తాను అని రాజ్యలక్ష్మితో చెబుతాడు. తనకు ప్రాణ స్నేహితుడైన రఘురాంతో ఉంటే ఆమె సుఖంగా ఉంటుందని తండ్రితో చెప్పి తిట్లు తింటాడు. తల్లిదండ్రుల మూర్ఖత్వంవల్ల చెల్లె ఓ మంచి మనిషితో జీవితం పంచుకోకుండా ఉందని బాధపడేవాడు.

రవీందర్ రెడ్డి ఒక చెల్లికి అన్నగా, ఒక ప్రాణ స్నేహితుడిగా, తల్లిదండ్రుల విశ్వాసాలను నమ్మని వ్యక్తిగా కనిపిస్తాడు.

### 4.4.7. సదానందం (డబ్బు మైనస్ తృప్తి = దుఃఖం):

సదానందం పాత్ర 'డబ్బు మైనస్ తృప్తి = దుఃఖం' నవలలో సందేశానిచ్చే పాత్ర. అతడు శివయ్యకు మిత్రుడు. అతడు సార్థకనామధేయుడు. సదా ఆనందంగానే ఉంటాడు. ఆర్థికంగా గొప్పగా ఏం లేకున్నా సదానందం అంత ఆనందంగా ఎలా ఉండగలుగుతున్నాడో శివయ్యకు అర్థంగాక అతని ఆనంద రహస్యాన్ని చెప్పమంటాడు. "వెరీ సింపుల్... డబ్బు సంపాదించుకోవడంలో తప్పేం లేదు... వీలైనంత వరకు న్యాయ పద్ధతిలో సంపాదించుకోవాలి... సంపాదించుకుంటూనే ఉన్నదానితో సంతృప్తి పడటం నేర్చుకోవాలి... సంతృప్తిని మించిన ధనం లేదు. అంతకన్న సుఖమూ లేదు. ఇది అందరికీ వర్తిస్తుందని, అందరూ ఒప్పుకోవాలని చెప్పడం లేదు కాని నాకయితే హాయిగా జీవించడానికి అవసరమయ్యే డబ్బు కంటే ఎక్కువ అవసరమనిపిస్తుంది... డబ్బు... డబ్బు... డబ్బంటూ అవసరాలను మించిన డబ్బు సంపాదన మోజులో పడితే సుఖముండదు. నాకు సుఖమెందుకుందంటే తృప్తి ఉంది కాబట్టి... నా ఆనంద

రహస్యమిదే" (మల్లయ్య, కాలువ.2002:పుట.24). ఆ మాటలు శివయ్యకు సరిగ్గా అర్థం కాలేదు. బాగా డబ్బు సంపాదించాలని డబ్బుతోనే సుఖమొస్తుందని తాననుకుంటుంటే తృప్తితో సుఖమొస్తుందని సదానందం చెప్పడం శివయ్యకు అదోలా ఉంది.

సదానందం ఎవరి సొమ్ము తినేవాడు కాదు. ఎవరితో స్నేహం చేసినా తనదే ఓ రూపాయి ఖర్చు పెట్టేవాడు. చాలా మామూలుగా, జాగ్రత్తగా బతుకుతున్నాడు. డబ్బు సంపాదన విషయంలో అతడు ఖచ్చితమైన అభిప్రాయంతోనే జీవితాన్ని గడుపుతున్నాడు. ఫైనాన్స్ లంటే ఎంజాయ్ విత్ అదర్స్ మనీ అని, ఇతరుల డబ్బుతో జల్సా చేయడమే వారి పని అని శివయ్యతో సదానందం చెబుతాడు. ఫైనాన్స్ కంపెనీలు నడిపేవారు మోసం చేస్తారనే నమ్మకంతో ఉన్న వ్యక్తి సదానందం. ఆర్థిక పరిస్థితిని మెరుగుపరుచుకుంటూనే దుఃఖాన్ని దూరం చేసుకోవడం మంచిది. అందుకొరకు సామాజికత ఉన్న జీవితం గడపడం ఒక్కటే మార్గం అని, నువ్వు ఇప్పటి నుండైనా నువ్వు నిర్ణయించుకున్న అభిప్రాయాలను ఖచ్చితంగా అమలు చేస్తే దుఃఖం నీ దగ్గరికి రాదు అని శివయ్యకు సదానందం చెప్తాడు. జీవితానికి నిబద్ధత ఏర్పరుచుకుంటే దుఃఖం దూరమవుతుందని, చిన్న చిన్న సమస్యలు ఉన్నా అవి కష్టాలుగా కనపడవని నమ్మిన వ్యక్తి సదానందం. జీవితమంటే సుఖదుఃఖాల మిశ్రమం అని స్నేహితుడికి తెలియజేసిన వ్యక్తే సదానందం.

తృప్తిగా బ్రతికితే సుఖంగా ఉండవచ్చని చెప్పే వ్యక్తిగా, డబ్బు సంపాదన మోజులో సుఖముండదని చెప్పే వ్యక్తిగా, మిత్రుడికి సలహాలు ఇస్తూ మిత్రున్ని సరైన సమయంలో ఒక మంచి మార్గం వైపు మళ్లించిన వ్యక్తిగా, సామాజిక జీవితం గడిపితే దుఃఖం దూరమవుతుందని తెలిపే పాత్రగా సదానందం పాత్ర తీర్చిదిద్దబడింది.

## 4.5. సహాయక పాత్రలు:

### 4.5.1. రాజయ్య (భూమిపుత్రుడు):

భూమిపుత్రుడు నవలలో రాజయ్యది ఒక సహాయక పాత్ర. కొండ మల్లయ్య కొడుకు రాజయ్య. రాజయ్య తన మామ ఇంటి దగ్గర చదువుకోవడానికి వెళ్ళి అక్కడ ఉండలేక తిరిగి ఇంటికి వచ్చేస్తాడు. రాజయ్యకు చదువంటే ఇష్టం లేక బడికి వెళ్ళేవాడు కాదు. రాజయ్య ఆరు సంవత్సరాల వయస్సు నుండి తండ్రికి అన్ని విధాలుగా సహకరిస్తూ ప్రతి పనిలో సహాయపడుతున్నాడు. ఎడ్లను మేపక రావడం, కొట్టంలో కట్టేయడం, వాము నుండి గడ్డి తెచ్చి వాటికి మేతగా వేసేవాడు. అతడు పది సంవత్సరాలు నిండేసరికి తండ్రితో సమానంగా పనులు చేసేవాడు. రాజయ్యకు పన్నెండేళ్ళ వయస్సులో పెళ్లి జరిగింది. తన మామ బిడ్డైన లక్ష్మిని పెళ్లి చేసుకున్నాడు. భార్య లక్ష్మీ ఒత్తిడి మేరకు

రాజయ్య క్రమక్రమంగా మారుతున్నాడు. రాజయ్య బావి పనిమీద మోజుతో కొద్ది రోజుల నుండి వ్యవసాయ పనుల మీద ఆసక్తి చూపడం లేదు. వ్యవసాయంలో ఎంత కష్టపడ్డ ఫలితం లేదని బావి పనికి వెళతానని తల్లిదండ్రులకు చెప్పుతాడు. రాజయ్య అయిదారు నెలలు ఒత్తిడి చేసి తల్లిదండ్రులను ఒప్పిస్తాడు.

సింగరేణి గనుల్లో పని చేయడం వల్ల ప్రతి నెలా 1500 రూపాయల వరకు సంపాదించవచ్చు. ఊళ్లో మట్టిబతుకు బతికే అవసరముండదు. గనుల లోపల పని ఎలా ఉన్నా బయటకు వచ్చిన తరువాత ఇస్త్రీ బట్టలు వేసుకోని ఊళ్లో తిరగవచ్చు. నౌకరి చేస్తున్నవాడంటే ఊరివాళ్లు గౌరవిస్తారు. తన చేతిలో ఇప్పట్లా కాకుండా ఎంతో కొంత డబ్బు ఉండేది. ఇన్ని విధాలుగా బావి పనికి పోవడం వల్ల లాభాలు ఉన్నాయని రాజయ్య ఆనందపడ్డాడు. ఇరవై ఐదు సంవత్సరాలుగా ఉన్న ఊరును, కన్నవారిని, ప్రాణ స్నేహితులను వదిలిపోవాల్సి వస్తుందని అతనికి వేదనగా ఉంది. బావుల్లో జరిగే ప్రమాదాల గురించి విన్న కొంత భయం ఉన్న ఎక్కడున్నా పోతారని తనను తాను సమాధానపరుచుకున్నాడు. రాజయ్య సింగరేణి బొగ్గు గనుల్లో పని ఇప్పించమని పైరవీకారున్ని కలుస్తాడు. అతనికి ఆరు వేలు ఇచ్చి పనిలో చేరడానికి సిద్ధపడతాడు. రాజయ్య తండ్రి కొంత భూమిని అమ్మి రాజయ్యను పనికి పంపిస్తాడు.

రాజయ్య బొగ్గు గనిలో కోల్ ఫిల్లర్ ఉద్యోగంలో చేరాడు. రాజయ్యకు బొగ్గు గనుల్లో పనిచేయడం దినదిన గండంగా ఉండేది. మైళ్ల తరబడి భూగర్భంలోకి నడవడం, లోపల జారుడు, నీళ్ల తడి, ఉక్కపోత, బొక్క టోపీలు తలలపై పెట్టుకొని లోపలికి వెళ్ళడం, లోపల రాత్రిపగలుకు తేడా లేకుండా ఉండటం, చీకటి, విపరీతమైన వేడి, ప్రతి క్షణం గండంగా భావించడం, ఎంత పని చేసినా పై అధికార్లతో మాటలు, బొగ్గుతో స్నానమాడి నల్లని ఆకారాలతో చెమట కంపుతో బయటకు రావడం, ముక్కుల్లో, నోట్లో, శరీరమంతా బొగ్గుపోడి, సైకిల్ తొక్కడం లాంటి పనులు చేస్తాడు.

బొగ్గుగని పనిలో చేరిన తరువాత రాజయ్య పండుగలకు వచ్చి వెళ్లేవాడు. అతడు తల్లిదండ్రుల బాధలను పట్టించుకోవట్లేదు. అతనికి కొండ మల్లయ్య ఇంటి పరిస్థితి గురించి తెలిపాడు. కాని రాజయ్య తనకేం సంబంధం లేనట్టుగా మాట్లాడాడు. ఉన్న భూమిని అమ్మి అప్పులు తీర్చమంటాడు. కొన్నేళ్ల తరువాత డ్యూటీకి వెళ్లిన రాజయ్య పనిచేస్తుండగా ప్రమాదంలో చనిపోతాడు. పుట్టి పెరిగిన నేలను వదిలిపెట్టి బతుకుతెరువు కొరకు వెళ్ళిన రాజయ్య చివరకు తనకు చిరపరిచితమైన మట్టిలోనే కలిసిపోతాడు. వ్యవసాయపు పనులు చేసేవాడిగా, భార్య

మాటలు నమ్మి వలస వెళ్లినవాడిగా, సంపాదన మోజులో పడి చివరికి ప్రాణాలు పోగొట్టుకున్న వ్యక్తిగా రాజయ్య పాత్ర తీర్చిదిద్దబడింది.

### 4.5.2. షావుకారి రాజేషం (భూమిపుత్రుడు):

రాజేషం కట్టుబట్టలతోనే ఊరికి వలస వచ్చిన వ్యక్తి. అతడు మొదటగా కల్లు దుకాణాల దగ్గర మిరపకాయ బజ్జీలు అమ్మేవాడు. పొలాల్లోని కల్లాల దగ్గర ఫలాలు అమ్మాడు. ఆ తరువాత ఉప్పు, మిరపకాయలతో దుకాణం పెట్టాడు. దుకాణం ద్వారా డబ్బు సంపాదించి వడ్డీలకియ్యడం ప్రారంభించాడు. ఆ తరువాత వడ్ల దినుసుల వ్యాపారం మొదలుపెట్టాడు. మొదట్లో అందరి కాళ్లు పట్టుకున్న అతడు డబ్బు సంపాదన పెరిగి ఇప్పుడు అందరితోను కాళ్లు పట్టించుకుంటున్నాడు. షావుకారి రాజేషం సగం ఊరును కొనేటట్లు అయ్యాడు.

దాయాదులు తరిమేస్తే, ఊరి దొర మోసం చేస్తే కోరుట్ల ప్రాంతం నుండి కడుపు చేతిలో పట్టుకొని ఆ ఊరికొచ్చాడు. అతడు మొదట్లో అందరిని అవ్వా బాంచెన్, అయ్యా బాంచెన్ అని పిలిచేవాడు. అతడు ఊరి పటేల్, పట్వారీ, దొరలకు దగ్గరయ్యాడు. అతడు మొదట చిన్న దుకాణం పెట్టి, వటుడింతై, ఇంతింతై అన్నట్టు ఊరంతా ఆక్రమించుకున్నాడు. దొరలాగా డబ్బు వడ్డీకిచ్చే స్థాయికి ఎదిగాడు. ఇల్లు కట్టుకొని, భూములు కొన్నాడు. అతడు ఊళ్లోని ప్రముఖుల్లో ఒకడయ్యాడు.

షావుకారి రాజేషంకు కొండ మల్లయ్య అప్పు ఉన్నాడు. కొండ మల్లయ్యకు పంట మంచిగా పండిందని తెలుసుకొని వచ్చిన రాజేషం తన అప్పును తీర్చాలని బలవంతం చేస్తాడు. ఎంత బ్రతిమిలాడిన వినని రాజేషం పొలంలో ఉన్న వడ్లను కొలుచుకొని పోవాలనుకుంటాడు. పంట పండించినప్పుడు బాకీ కట్టవు. వచ్చే సంవత్సరం కడతా అంటావు అని వచ్చే సంవత్సరం పంట ఇలా పండుతుందని నమ్మకం లేదు అని వడ్లు కొలుచుకున్నాడు. "సరే షావుకారి! నీ బాకీ కడుతా. కాని వడ్లు మార్కెట్లో అమ్ముకొచ్చి కడుతా. అప్పటిదాకనన్న ఓపిక పట్టు" అని కోపంగా మల్లయ్య అంటాడు. అయినా వినకుండా "అక్కడ మీ చుట్టమున్నాడా ఎక్కువ పైసలివ్వటానికి? అక్కడ కొనేటోనికి పొట్ట లేదనుకుంటున్నవా? మచ్చులు చూసేటోని కాన్నుంచి జోకెటోడు, లెక్కలు గట్టెటోడు అందరూ ముంచుతే గప్పుడేర్పడుద్ది గదా!" (మల్లయ్య, కాలువ.2001:పుట.28) అని వ్యంగ్యంగా అన్నాడు రాజేషం. షావుకారి మాటలకు విసుగు చెంది వడ్లు కొలిచిచ్చాడు కొండ మల్లయ్య. షావుకారి రాజేషం పెద్ద కుంచెలో వడ్లు కొలుచుకొని వెళ్ళాడు. ఇక్కడ ఈ పాత్ర అప్పటి సమాజంలో ఉండే షావుకార్ల పీడన ఎలా ఉండేదో తెలియజేస్తుంది. ఈ పాత్ర చిత్రణలో, భాషలో మంచి ఒరవడి ఉంది. ఈ పాత్ర తాలూకా కసిని రచయిత చక్కగా వివరించాడు.

### 4.5.3. లక్ష్మీ (భూమిపుత్రుడు):

భూమిపుత్రుడు నవలలో లక్ష్మీది సహాయక పాత్ర. లక్ష్మీ రాజయ్యను పెళ్లి చేసుకుంది. మొదట్లో అత్తమామలను గౌరవిస్తూ చెప్పిన పనులు చేసేది. భర్తతో కలిసి సమానంగా పోటీపడి పని చేసేది. లక్ష్మీ ఎక్కువగా తల్లి గారింటి దగ్గరే ఉండేది. ఆమెను రాజయ్య తీసుకొని వచ్చిన గొడవ పెట్టుకొని మళ్లా తల్లిగారింటికీ వెళ్ళిపోయేది. కష్టపడి పనిచేసే లక్ష్మీ ఆ ఊర్లో ఉండటానికి ఇష్టపడట్లేదు. మొదట్లో లక్ష్మీకి షోకులంటే తెలియవు. పద్మశాలి అంజయ్య బొగ్గుబావికి పనికిపోవడం మొదలైనప్పటి నుండి లక్ష్మీ మనసు మారింది. అంజయ్య భార్య వేసుకునే బట్టల్లాంటివి తనకూ కావాలనుకుంది. ఊరికొచ్చినప్పుడు మంచి బట్టలేసుకొని, మంచిగా దువ్వుకొని అందంగా కనిపించే అంజయ్య భార్యలాంటి బతుకు తనకు కావాలనుకునేది. అంజయ్యలాగే తన భర్త రాజయ్యకు కూడా ప్యాంటు, షర్టు తీసుకోవాలనుకునేది. బొగ్గుబావి జీవితాల్లో ఏదో అందమైన జీవితం ఉందనుకొని లక్ష్మీ తన భర్తను బొగ్గు బావిపనికి పోమ్మని రోజూ పోరు పెడుతుంది. రాజయ్య మొదట్లో ఆమె మాటలు వినేవాడు కాదు. అందుకే ఆమె తల్లిగారింటికి ఎక్కువగా వెళ్ళేది. చివరికి ఆమె తల్లిదండ్రులు చెప్పిన వినేది కాదు. ఓసారి తండ్రి తిడితే బావిలోకి దూకింది. అక్కడున్నవారు ఆమెను రక్షించారు. భార్య ఒత్తిడికి తట్టుకోలేక రాజయ్య క్రమక్రమంగా మారుతూ బావిపనికి వెళ్ళడానికి మొగ్గు చూపాడు.

లక్ష్మీ మాత్రం ఊహల్లో తేలిపోతుంది. తాను వ్యవసాయం పనిచేస్తూ బతకాల్సిన అవసరం లేదని సంబరపడుతుంది. తనమీద అత్తమామల పెత్తనముండదు. తాను భర్త మాత్రమే అక్కడ ఉండడంవల్ల తనకు ఇష్టం ఉన్నట్లు బతకవచ్చని నిర్ణయించుకుంది. తాను, తన భర్త మంచి బట్టలు వేసుకోవచ్చు. మంచి తిండి తినోచ్చు. తనకిష్టమైన ఖర్చు పెట్టవచ్చు. ఇంట్లో పని చేసుకొని హాయిగా ఉండవచ్చని ఊహాల్లో తేలుతుంది. లక్ష్మీ హుషారుగా రాజయ్యతోపాటు వెళ్లింది. పనికి వెళ్లి వచ్చిన భర్తకు లక్ష్మీ సంసారం గూర్చి, తమ భవిష్యత్తు గురించి తెలియజేసేది. ఈ రోజులలో ఎవరికి వారేనని, ఒకర్నొకరు చూసే పరిస్థితి లేదని అలా చేయడం వల్ల చేతికి చిప్పలే వస్తాయని చెప్పింది. తమ భవిష్యత్తు సుఖమయం చేసుకోవడానికి ఇప్పటి నుండే ముందుచూపు ఉండాలని భర్త రాజయ్యకు తెలియజేసేది. లక్ష్మీ మరిది అయిన తిరుపతయ్య డిగ్రీ వరకు చదువుకున్నాడు. ఎప్పుడో ఓ రోజు అతనికి ఉద్యోగం వస్తుందని తన స్వార్థం చూసుకోకుండా కుటుంబానికి సాయం చేయడని, మరి తాము ఎందుకు కుటుంబానికి సాయం చేయాలని భర్తతో అంటుంది.

లక్ష్మీ భర్త బొగ్గుగనిలో జరిగిన ప్రమాదం వల్ల చనిపోతాడు. లక్ష్మీ నుండి దుఃఖంలో వచ్చిన మాటలు "నేను నిన్ను చంపినయ్యా! ఊళ్లో ఉండేటోన్నుండనియ్య లేదయ్యా! బలవంతం చేసి తీసుకపొతినయ్యా!" (మల్లయ్య, కాలువ.2001:పుట.120). తన భర్త చావుకు తానే కారణమని తనను తాను నిందించుకుంటూ చేతులతో తలకొట్టుకుంటూ, తలను నేలకేసి కొట్టుకుంటూ ఏడుస్తుంది లక్ష్మీ. భర్త చితిలో దూకడానికి వెళుతున్న లక్ష్మీని ఆపడం అక్కడున్నవారికి కష్టమైంది. పెద్ద ఖర్మ అయిపోయిన తరువాత లక్ష్మీ తండ్రి, లక్ష్మీని వెంటబెట్టుకొని తీసుకువెళతాడు.

డబ్బు, అవసరాలు, పరిస్థితులు, మనుషుల్లోని ప్రేమానురాగాలు, బంధుత్వాలను, మమకారాలను ఎలా దూరం చేస్తాయో ఈ పాత్ర ద్వారా తెలుస్తుంది. లక్ష్మీ మొదట్లో కష్టపడి పనిచేసిన వ్యక్తిగా, ఆమెకు ఉన్నతంగా బ్రతకాలన్న ఆలోచనలు రావడంతో ఆమెలో ఉన్న సహజ లక్షణాలు కనుమరుగైన వ్యక్తిగా, డబ్బు, ప్రేమానురాగాలు, బంధుత్వాలను వదులుకున్న వ్యక్తిగా, భర్తను కోల్పోయిన తరువాత ప్రేమానురాగాలు, బంధుత్వాల విలువ తెలుసుకున్న వ్యక్తిగా లక్ష్మీ పాత్ర చిత్రించబడింది.

### 4.5.4. ఈశ్వర్ (సాంబయ్య చదువు):

ఈశ్వర్ సాంబయ్యకు స్నేహితుడు. డిగ్రీ చదివేటప్పుడు ఈశ్వర్, సాంబయ్యలు ఒకే గదిలో ఉంటూ చదువుకునేవారు. ఈశ్వర్ కాలేజీ ప్రారంభమైనప్పుడు ఎంతో అమాయకంగా ఉండేవాడు. తన చదువు గురించి తానే ఆలోచించుకునేవాడు. అతడు వేసవి సెలవులకు ఇంటికి వెళ్లేవాడు. అక్కడ కొంతమంది స్నేహితుల పరిచయంతో కమ్యూనిస్టు భావజాలం ఉన్న పుస్తకాలు చదవడం అలవాటు చేసుకున్నాడు. ఆ పుస్తకాలను రూంకి కూడా తెచ్చుకున్నాడు. ఈశ్వర్ స్నేహితులను కూడా ఆ పుస్తకాలను చదవమని ప్రోత్సహించేవాడు. ఆ పుస్తకాల ద్వారా ప్రేరేపితుడై చదువులు విశ్వవిద్యాలయాల్లో లేవని, అవి సమాజం నుండి వచ్చాయని, వాటిని నేర్చుకోవాలని మిత్రులతో చెప్పేవాడు. కొంతమంది మిత్రులు అతన్ని వారి రూముకి రానిచ్చేవారు కారు. సాంబయ్య వ్యాస రచన పోటీ కోసం స్వాతంత్ర్యం మీద వ్యాసం రాస్తున్న సందర్భంలో మన దేశానికి వచ్చిన స్వాతంత్ర్యం బూటకపు స్వాతంత్ర్యం అని, కేవలం అధికార మార్పిడి జరిగి తెల్లవాడుపోయి నల్లవాడు వచ్చాడని ఈశ్వర్ రాస్తాడు. వ్యవస్థలో దోపిడీని మార్చి దేశానికి విముక్తి తెవాలన్నది నా ఆకాంక్ష అని ఈశ్వర్ అంటాడు. ఈశ్వర్ మాటలు విన్న సాంబయ్యకు ఈశ్వర్ మారడానికి కారణాలు అతని పరిస్థితులే అని అర్థం చేసుకున్నాడు. పోలీసు గ్రౌండులో కలెక్టర్ ఉపన్యాసం జరుగుతున్న సమయంలో ఆగస్టు 15న కరపత్రాలు పంచి ఈశ్వర్ అరెస్ట్ అయ్యాడు. అతడు

పోలీసులతో దెబ్బలు తిని నాలుగు రోజుల తరువాత బయటికి వస్తాడు. అతడు ఎప్పటిలాగే తన కార్యక్రమాలను కొనసాగిస్తూ వ్యవస్థలో మార్పు కొరకు పోరాడుతుంటాడు. ఈశ్వర్ తోపాటు కొందరు విద్యార్థులు ఉద్యమంలో పాల్గొనటం వల్ల అతనిలో ఎక్కువ ఉత్సాహం వచ్చి పోరాడుతుంటాడు. ఈ చదవులు పనికి రావని, ఈ వ్యవస్థ మనది కాదని ఈశ్వర్ మిత్రులతో చెప్పుతూ పోరాటం కొనసాగిస్తున్నాడు.

కమ్యూనిస్టుల ప్రభావం అతన్ని పోరాడే వ్యక్తిగా నిలబెట్టింది. వ్యవస్థ మార్పు కొరకు తపించే వ్యక్తిగా, పోరాట యోధుడిగా, సమాజం నుండి జ్ఞానం పొందాలని స్ఫూర్తి పొందే వ్యక్తిగా, కమ్యూనిస్టు భావజాలం ఉన్న వ్యక్తిగా ఈశ్వర్ పాత్ర చిత్రించబడింది.

### 4.5.5. సరస్వతి (మాట్లాడే బొమ్మలు):

సాంబయ్య భార్య సరస్వతి. సరస్వతి వ్యవసాయ కుటుంబంలో నుండి వచ్చిన నాగరికంగా ఉంటుంది. సరస్వతి, సాంబయ్యలు ఎంతో అన్యోన్యంగా ఉండేవారు. సరస్వతికి అత్త వ్యవసాయం పని చేయమని చెప్పేది, కాని సరస్వతి ఆ పని చేసేది కాదు. అత్త ఇంట్లో, వ్యవసాయం పనులు చేయమంటే నా భార్త కాబోయే ఉద్యోగి అని నేను ఆ పనులు చేయనని అత్తతో గొడవ పెట్టుకునేది. ఆమె చదువుకోవడం వల్ల ఇలాంటి పనులు చేయనని మొఖమాటం లేకుండా చెప్పేది. చిన్న చిన్న విషయాలకు అత్త కోడళ్లు గొడవ పడేవారు. సరస్వతి భర్త సాంబయ్యకు ప్రభుత్వ ఉద్యోగం రావడంతో కాపురాన్ని పట్టణానికి మార్చింది. సాంబయ్య ఉపాధ్యాయుడిగా పనిచేస్తుంటే ఆ ఉద్యోగం తనకి ఇష్టం లేదని మరో ఉద్యోగం చూసుకోమని భర్తను వేధించేది. సరస్వతి వార్తా పత్రికల్లో వచ్చే ఉద్యోగాలకు దరఖాస్తు పెట్టేది. ఆమె ఉద్యోగం వచ్చిన తరువాత మంచి జీతం వస్తుందని కారు కొనుక్కోవాలని తాపత్రయ పడేది. సాంబయ్య ఆమెకు నచ్చినట్లుగా ఉంటూ ఆమెను బాధ పెట్టేవాడు కాదు. పల్లెలో ఉంటే పిల్లలు మంచిగా చదువరని పట్టణంలోని ఇంగ్లీషు మీడియం పాఠశాలకు పిల్లలను పంపించేది. సరస్వతికి ఎక్కువ పట్టుదల ఉండటంతో భర్త సర్దుక పోయేవాడు. ఆమెను పిల్లలు మమ్మీ అని పిలవడం ఆమెకు ఇష్టం. సాంబయ్య పిల్లలకు పల్లెల గొప్పతనాన్ని తెలియజేస్తాడు. పిల్లల చదువుకునే సమయాన్ని వృధా చేస్తూ అనవసరపు మాటలు చెప్పుతున్నావని భర్తను కోపగించుకునేది. ఇప్పుడు ఊళ్లో పరిస్థితులు బాగాలేవని ఒకరిని చూసి మరొకరు ఓర్వట్లేదు. కొంచెం ఆర్థికంగా ఉన్నామని అందరి కండ్లు మన వైపే అని సరస్వతి పిల్లలకు చెప్పుతుంది. పిల్లలను చదువు పేరుతో పల్లెలకు, బంధుత్వాలకు దూరం చేస్తుంది సరస్వతి. ఆమె పిల్లలను ఊరికి తీసుక వెళ్లేదికాదు. పిల్లలకు ఆటలమీద ఉన్న శ్రద్ధ చదువు మీద ఉండాలని వారిని

తిడుతూ ఉంటుంది. ఆమె సమాజంలో వస్తున్న పారిశ్రామిక మార్పులకు లోనై వాటి వైపే మొగ్గు చూపుతుంది. ఆమె పైపై మెరుగులనే చూస్తూ ఆనందపడుతుంది. ఆమె ఇంటికి అవసరమున్న ఫర్నీచరును, వస్తువులను కొని ఇంట్లో ఎన్ని వస్తువులు ఉంటే అంత గౌరవం అని భావిస్తుంది. గౌరవం, మర్యాదలు పట్టు చీరలతోనో, వస్తువులతోనో రాదని ఆమెకు అర్థం కావట్లేదని భర్త వాపోయేవాడు. ఆమె వస్తు వినిమయ సంస్కృతిలో మునిగి తేలేది.

సరస్వతి ఉన్నతంగా ఆలోచిస్తూ నాగరికంగా బతుకుతున్న వ్యక్తి. పల్లెలకు, బంధుత్వాలకు దూరంగా ఉండాలని అనుకున్న వ్యక్తిగా, ఎప్పుడు నాగరికంగానే బతకాలనే భ్రమలో ఉన్న వ్యక్తిగా సరస్వతి పాత్ర చిత్రించబడింది.

## 4.5.6. శ్రీనివాస్ (మాట్లాడే బొమ్మలు):

అయిలయ్య, శాంతమ్మల కొడుకు శ్రీనివాస్. చిన్నప్పటి నుండి శ్రీనివాస్ చురుగ్గా ఉంటూ చెడు విషయాల జోలికి వెళ్లేవాడు. దొర పిల్లలతో స్నేహం చేస్తూ దళిత పిల్లల దగ్గరకు వచ్చేవాడు కాదు. చిన్న పిల్లలు అలాంటి విషయాలకు దూరంగా ఉండాలని అయిలయ్య ఎన్నో ప్రయత్నాలు చేసినా శ్రీనివాస్ వాటికే దగ్గరయ్యేవాడు. శ్రీనివాస్ ఓ మాదిరిగా చదివేవాడు. శ్రీనివాస్ కొంతమంది స్నేహితులను ఏర్పరుచుకొని సమాజం, కులాల గూర్చి కొంత అవగాహన పెంచుకుంటాడు. అతడు తండ్రి చేసే వ్యవసాయ పనులను ఇష్టపడేవాడు కాదు. అప్పుడప్పుడు మావయ్య సాంబయ్య ఇంటికి వెళ్లినప్పుడు వారి పిల్లలతో ఆడుకునేవాడు. కాలం గడుస్తున్న కొద్ది శ్రీనివాస్ లో మార్పులు వస్తున్నాయి. ప్రజా పోరాటాలు, అంబేద్కర్ సంఘాల కార్యక్రమాలకు దగ్గర అవుతున్నాడు. వివిధ సిద్ధాంతాలు, భావాలు అతనిపై ప్రభావం చూపుతున్నాయి. అతడు కాలేజీలో విద్యార్థి యూనియన్ ఎన్నికల్లో పోటీ చేసి యూనియన్ అధ్యక్షునిగా ఎన్నికవుతాడు. అతడు గ్రంథాలయాల వార్షికోత్సవంలో భాగంగా ఒక్కరోజు కార్యక్రమం నిర్వహిస్తాడు. అలాగే అతడు కాలేజీలో లీడర్ షిప్ చేసేవాడు. అయిలయ్యకు కొడుకు ప్రవర్తన నచ్చక మందలించేవాడు. అలాగే అతడు సాంబయ్య మావయ్య కోరిక మేరకు ఉద్యమాల్లో పాల్గొనకుండా డిగ్రీ పూర్తి చేశాడు.

అతడు ఏదైనా బిజినెస్ చేసి సంపాదించాలనుకుంటాడు. ఫైనాన్స్ కంపెనీలో పార్టనర్ షిప్ తీసుకుంటానని తండ్రితో అంటాడు. అప్పుడు తండ్రి, మామ ఇద్దరు బిజినెస్ వద్దని చెప్పి చదువుకోమంటారు. శ్రీనివాస్ పి.జి. పూర్తిచేసి ఉద్యోగం కొరకు ప్రయత్నాలు చేస్తూనే, హైదరాబాదులో బ్యాంక్ కోచింగ్ తీసుకుంటున్నాడు. అతడు ఉద్యోగం కొరకు తీవ్రంగా కష్టపడి చదువుతాడు. అతనికి ఉద్యోగం వస్తుంది. అతడు ఊరికి వెళ్లడానికి సుముఖత చూపేవాడు కాదు.

శ్రీనివాస్ ఉద్యోగంలో చేరినా తండ్రికి కష్టాలు తప్పడం లేదు. అతడు తల్లిదండ్రులను పట్టించుకోవడం లేదు. సామాన్య వ్యవసాయ కుటుంబం నుండి వచ్చిన శ్రీనివాసుకి జీవితం రంగులమయంగా ఉండటంతో ఇంటిని మరిచిపోతాడు. అతనికి తన పాత జీవితాన్ని నెమరు వేసుకోవడానికి మనసొప్పడం లేదు. అతడు అదే బ్యాంకులో పనిచేస్తున్న మానసతో పరిచయం పెంచుకుంటాడు. ఆమెతో పరిచయం కాస్త ప్రేమగా మారి పెళ్లి చేసుకుంటాడు. తల్లిదండ్రులకు తెలవకుండానే శ్రీనివాస్ పెళ్లి చేసుకుంటాడు. శ్రీనివాస్ పెళ్లి అయిన మూడు నెలల తరువాత ఒంటరిగానే ఇంటికి వెళ్తాడు. అయిలయ్య, శాంతమ్మలు పెళ్లి విషయం తెలుసుకొని బాధపడ్తారు. తండ్రికి ఐదు వందల రూపాయలు ఇచ్చి శ్రీనివాస్ వెళ్లిపోతాడు. శ్రీనివాస్ మరల తిరిగి ఇంటికి రాడు. అతని రాక కోసం తల్లిదండ్రులు ఎదురుచూసేవారు.

వ్యవసాయ కుటుంబంలో పుట్టి పెరిగినా నాగరికంగా, ఉన్నతంగా బ్రతుకుతూ తల్లిదండ్రులను మోసగించిన కొడుకుగా, తెలివిగలవాడిగా, ఉన్నత కుటుంబానికి అల్లుడిగా శ్రీనివాస్ పాత్ర చిత్రించబడింది.

### 4.5.7. సోమయ్య (మాదిగ విజయం):

మాల కులంలో పుట్టి చదువుకొని ఉన్నత స్థితికి చేరిన పాత్ర సోమయ్యది. అతను తన కులం పేరు చెప్పుకోవడం చిన్నతనంగా భావించేవాడు. సోమయ్య తన మూలాలను మరిచిపోయి గర్వంగా బతుకుతున్నాడు. అతడు పేదరికంతో ఉన్న తల్లిదండ్రులను చూసుకునేవాడు కాదు. చదివించిన తల్లిదండ్రులను దూరం చేసుకున్నాడు. అలాగే భార్యతో కొంత విసుగు చెందేవాడు. అటు భార్య, ఇటు తల్లిదండ్రుల మధ్య నలిగిపోతూ అంతర్మథనానికి గురయ్యాడు. సోమయ్య ఊరితో తమ సంబంధాలను సరిచేసుకోకపోవడం ఆనందరావుకి బాధాకరంగా ఉంది. అతని భార్యతో మాట్లాడినా పరిస్థితి అలాగే ఉంది. సోమయ్యను ఆనందరావు తన ఇంటికి పిలిచి కొన్ని విషయాలను తెలియజేస్తాడు.

మన తల్లిదండ్రులు చదువురానివాళ్లు. పని చేసుకుంటూ బతుకుతున్న వారికి మనకి మధ్య ఓ తరం అంతరం ఉందని మరిచిపోవద్దు. తాము పెంచి పెద్ద చేసిన కొడుకు తమకే ఉపయోగపడాలని వారు ఆశిచండంలో తప్పు లేదు. తనవాడు అనుకున్న కొడుకుని కోడలు మారుస్తుందేమోనని వారికి భయం ఉంది. చదువుకున్న కోడలు ఇంట్లో ఇమడదనుకున్న సంకోచం ఉంది. ఇవన్నీ అర్థం చేసుకోని జాగ్రత్తగా ఉండాల్సిన సమయంలో నువ్వు అజాగ్రత్త చేశావు. పోనీ నీ భార్య అయినా అర్థం చేసుకొని జాగ్రత్త పడిందా అంటే అదీ లేదు. ఆమెకు మనలాంటి కుటుంబాల

పట్ల అవగాహన లేదు. ఆమె కాలేజీ లెక్చరర్ కావడంతో నిన్ను ఆమె భర్తగా స్వీకరించిందే కానీ నీ వారిని ఆమె తన వాళ్లగా స్వీకరించలేదు. ఇలాంటి స్థితి చాలా కుటుంబాల్లో ఉంది. నువ్వు రెండు తరాల మధ్యనున్న అంతరాన్ని గమనించకపోవడం వల్ల వాళ్ళ మధ్య దూరం పెరిగింది అని పరిస్థితులను విశ్లేషణాత్మకంగా ఆనందరావు సోమయ్యకు చెప్పాడు. ఆనందరావు చెప్పిన మాటలతో ఏకీభవించి తనను తాను మార్చుకొని కుటుంబాన్ని మార్చాలకున్నాడు సోమయ్య.

సోమయ్య భార్యను సముదాయించడానికి చాలా కష్టపడ్డాడు. ఆమెకు తన పునాదుల గూర్చి వివరించాడు. విద్యావంతురాలైన ఆమెకు ఇవన్నీ అర్థం కావడానికి ఎక్కువ సమయం పట్టలేదు. సోమయ్య కుటుంబ సమస్యలను పరిష్కరించడానికి ప్రయత్నం చేసి వారిలో మార్పు వచ్చేటట్లు చేశాడు. కొంతకాలం తరువాత సోమయ్య భార్యపిల్లలతో కలిసి ఊరెళ్ళాడు. స్కూటరుపై బయలుదేరిన సోమయ్య బాల్యంలోని జ్ఞాపకాలను తలుచుకుంటూ, తనను తల్లిదండ్రులు చదివించి ఉండకపోతే చాలామంది తన కులస్థుల్లాగే పాలేరుగానో, కూలీగానో బతికేవాడినని, తన తల్లిదండ్రులను చాలా నిర్లక్ష్యం చేశానని ఆలోచిస్తూ బండి నడుపుతున్నాడు. సంతోషంతో సోమయ్య ఊర్లోకి అడుగుపెట్టాడు. అందరూ కుటుంబంతో కలిసిపోయి ఆనందంగా కొన్ని రోజులు అక్కడే గడిపారు. రిజర్వేషన్ ద్వారా ఉద్యోగం పొందిన వ్యక్తిగా, ఉద్యోగం రాగానే తన మూలాలను మరిచి ఉన్నతంగా బ్రతికినవాడిగా, కుటుంబాన్ని అర్థం చేసుకోలేనివాడిగా, చివరికి అన్ని తెలుసుకొని గ్రామం వైపు పయనించి తల్లిదండ్రుల దగ్గరికి చేరిన పాత్రగా సోమయ్య పాత్ర తీర్చిదిద్దబడింది.

### 4.5.8. కొంరెల్లి (మెతుకు పుస్తకం):

కొంరెల్లి పదవ తరగతి వరకు చదివాడు. కొంరెల్లిని తల్లిదండ్రులు ఆర్థిక పరిస్థితి బాగాలేదని ఇంటర్ చదివించి మాన్పించారు. కొంరెల్లి కష్టపడి చదివినా ఏం ఉద్యోగం దొరుకుతుందో తెలియని పరిస్థితి అని ఎరువుల కంపెనీలో క్రాఫ్ట్ మెన్ ట్రైయినీ ఉద్యోగానికి అప్లై చేశాడు. అతనికి క్రాఫ్ట్ మెన్ ట్రైయినీ ఉద్యోగం వచ్చింది. ఉద్యోగం వచ్చిన తరువాత కొంరెల్లి గర్వంగా బ్రతకడం ప్రారంభించాడు. అతడు ఎవరినీ లెక్క చేసేవాడు కాదు. సంపాదన పెరగడంతో అతనిలో మార్పులు వచ్చాయి. బంధువులు ఎవరైనా శుభకార్యాలకు పిలిస్తే వెళ్లేవాడు కాదు. కొంరెల్లి ఊరిలోని పాఠశాల ప్రహరీ గోడ నిర్మాణానికి ఊరి పెద్దలు చందా అడిగితే ఇవ్వనని వారిని అవమానించి పంపించాడు. అతడు ఊరితో సంబంధం లేదనట్టు ఉండేవాడు. అతని స్వభావానికి తగ్గట్టుగా జీతం, సౌకర్యాలు అతన్ని భూమి మీద నిలువనీయకుండా చేశాయి. అతడు కుటుంబాన్ని పట్టించుకోవడం మానేశాడు. అందర్నీ గంజిలో ఈగను తీసేసినట్టు తీసేశాడు. తనతో

సరితూగేటోళ్లు ఎవ్వరూ లేరని గర్వంగా ఉండేవాడు. ఊర్లో ఉన్న ఇల్లు, భూమి అమ్ముకున్నాడు. తన పిల్లలను కూడా ఊళ్లోకి తీసుకుపోలేదు. ఎవరితో సంబంధం లేనట్టు ప్రవర్తించాడు. కొంరెల్లి ఫ్యాక్టరీ మూతపడటంతో ఆలోచనల్లో పడ్డాడు. షేర్లు, ఫైనాన్సుల్లో ఉన్న డబ్బును పెట్టుబడిగా పెట్టి నష్టపోయాడు. చివరికి అతని పరిస్థితి అగమ్యగోచరంగా తయారయింది. కొంరెల్లి తాను చేసిన పాపాలకు శిక్ష అనుభవించాల్సిందే అనుకున్నాడు. చివరికి కరీంనగర్ వెళ్లి పనిచేసుకుంటూ బతుకుతున్నాడు. మనం సంపాదిస్తున్నాం అనే అహంకారం ఉండొద్దని ఈ పాత్ర తెలియజేస్తుంది. పల్లెలను మరిచి ప్రకృతికి దూరంగా జరిగితే జరిగే ప్రమాదాలేంటో ఈ కొంరెల్లి పాత్రను చూస్తే అర్థమవుతుంది. మనిషికి అసలు అవసరాలేంటో మనం పడుతున్న ఉరుకులాటలెందుకో అని కొంరెల్లి పాత్ర ఆలోచింపజేస్తుంది. ఫ్యాక్టరీలో ఉద్యోగం చేస్తూ ఉన్నతంగా బ్రతకాలని అనుకున్నవాడిగా, పల్లెలను మరిచి తాను కోల్పోయిన జీవితాన్ని తెలుసుకున్నవాడిగా కొంరెల్లి పాత్ర తీర్చిదిద్దబడింది.

### 4.5.9. రంగయ్య (మంచియన్నది మాల అయితే..):

మాదిగ కులానికి చెందిన రంగయ్య కొండయ్యకు పాలేరుగా ఉంటాడు. రంగయ్యది ఈ నవలలో సహాయక పాత్ర. కొండయ్య రంగయ్యను చాలామంచిగా చూసుకునేవాడు. కొండయ్యకు అతనంటే ఎంతో నమ్మకం. అతన్ని నిజాయితీగల మనిషి అని అనేవాడు. రంగయ్య సెలవు పెట్టి అత్తగారింటికి వెళతాడు. రంగయ్య వెళ్లిన తరువాత నుంచి కొండయ్య ఎద్దులు కనిపించడం లేదు. కొండయ్యకు అతని మీద అనుమానం ఉండదు. కొండయ్య ఎద్దులను తీసుకురావడంతో రంగయ్య దొంగతనాన్ని దాచలేకపోయాడు. చివరకు తానే ఎడ్లను దొంగతనం చేసిన అని రంగయ్య ఒప్పుకుంటాడు. అతడు చెల్లె పెళ్లికి పది వేలు కట్నంగా ఇస్తానని ఒప్పుకుంటాడు. తన బావ కట్నం డబ్బు ఇవ్వాలని తన చెల్లెని ఇంటికి పంపిస్తాడు. అప్పుడు అతడు ఏం చేయాలో తెలియక బాధపడతాడు. ఆ సమయంలో దొర గోవిందరావు శిష్యుడు పంతులు అతనికి డబ్బు ఇస్తాడు. ఆ డబ్బు తీసుకున్నందుకు ఋణంగా కొండయ్య ఎద్దులను దొంగిలించమని గోవిందరావు చెప్పుతాడు. దొర మాటలు వినకపోతే ఏమైనా చేస్తాడన్న భయంతో కొండయ్య ఎద్దులను రంగయ్య దొంగిలిస్తాడు. రంగయ్యను పోలీసులు తీసుకువెళ్ళారు. ఎంతో కష్టపడి చివరికి రంగయ్యను పోలీసు స్టేషన్ నుండి కొండయ్య ఇంటికి తీసుకువస్తాడు. తన వల్ల చాలా కష్టాలు పడ్డాడని కొండయ్యకు కృతజ్ఞతలు తెలియజేస్తాడు రంగయ్య. రంగయ్య ఎప్పటిలాగానే పాలేరుతనం

చేస్తున్నాడు. కాని కొండయ్య నిజాన్ని తెలుసుకోవాలని రంగయ్యను గట్టిగా అడిగితే అప్పుడు రంగయ్య గోవిందరావు దొర చేయమంటేనే చేశానని తెలియజేస్తాడు.

రంగయ్య పాలేరుగా ఉంటూ నమ్మకంగానే ఉండేవాడు కాని అతని ఆర్థిక పరిస్థితులు మరియు దొరల బెదిరింపులు అతన్ని పిరికివాడిగా చేసి చివరికి దొంగగా నిలబెట్టాయి. దొరల పీడన ఒకవైపు బతుకుదెరువు మరోకవైపు అతన్ని ఒక దొంగగా ముద్ర వేయించాయి.

### 4.5.10. భూమయ్య (బతుకు పుస్తకం):

సాంబయ్య కొడుకు భూమయ్య. కొండల్ రావు చదువుకుంటే ఎన్నో విషయాలు తెలుస్తాయని సాంబయ్యకి తెలియజేస్తాడు. అతన్ని చదివిస్తే ఉద్యోగవకాశాలు వచ్చే అవకాశం ఉందని చెప్పడంతో సాంబయ్య కొండల్ రావు మాటను గౌరవిస్తూ భూమయ్యను బడికి పంపిస్తాడు. భూమయ్య తెలివిగలవాడు. భూమయ్య చదువులో ముందజలో ఉండేవాడు. భూమయ్య కాలేజీ నుండి ఇంటికి వచ్చినప్పుడు ఉన్నతంగా ఉండేవాడు. భూమయ్య డిగ్రీ, బి.హెడ్. పూర్తిచేసి ఉపాధ్యాయ వృత్తిలో స్థిరపడ్డాడు. మల్లేశం, భూమయ్యలు స్నేహితులు. ఇతర ఊళ్లలో ఉన్నట్లుగా అంటరానితనం మన ఊళ్లో లేదు. కులాలకు అతీతంగా వరుసలు పెట్టుకొని పిలవడం మన ఊర్లోనే ఉందని భూమయ్య అంటాడు. గోదావరిఖనిలో ఉన్నవారంతా కార్మికులే కాని అక్కడ చాలావరకు అందరిని దొరలని పిలవాలి. దొరతనం అక్కడ మరొక రూపంలో ఉన్నట్లు ఉందనపిస్తుంది. ఇప్పుడిప్పుడే దొరా అని పిలవడం బంద్ అవుతుంది. జీతం వస్తుందన్న మాటేగాని నాకు అక్కడికంటె అన్ని విధాలా మన ఊరిలోనే మంచిగా ఉందనిపిస్తుందని మల్లేశం అంటాడు. ఇద్దరూ కొంత సమయం వరకు వారి బాధలు, ఊరి విషయాలు మొదలైనవి చర్చించుకుంటారు. భూమయ్య తల్లిదండ్రులకు ఇబ్బంది కలుగకుండా చూసుకుంటాడు. ఎంతైనా ఊరు ఊరేనని, ఊళ్లో సామాజిక వ్యవస్థకు పటిష్ఠమైన పునాదులున్నాయని భూమయ్య నమ్మకం.

భూమయ్య తల్లిదండ్రులకు దూరంగా ఉంటున్నానని బాధపడేవాడు. అతడు పిల్లలను ఊరికి తీసుకవెళ్లి వారికి ఊరిలో ఉన్న ప్రత్యేకమైన విషయాలను గురించి తెలియజేస్తాడు. అతడు పిల్లలను బాధ్యతగా పెంచుతూ వారికి మంచి విషయాలను తెలియజేస్తూ వారిని బాగా చదువుకునేట్లు ప్రోత్సహిస్తాడు. భూమయ్య స్నేహితులతో కలిసి ఊరిలో తిరుగుతాడు. అతడు తన అనుభవాలను పంచుకుంటూ ఊళ్లో వచ్చిన మార్పులను గమనిస్తూ, ఊరి గురించి చర్చిస్తాడు. వృత్తి పనిచేసేవారు పట్టణాలకు వలస వెళ్లిపోతున్నారని బాధపడేవాడు.

భూమయ్య ఊరంటే ప్రేమ గలిగినవాడిగా, ఉద్యోగిగా, తల్లిదండ్రులను గౌరవంగా చూసుకుంటున్నవాడిగా, పిల్లలు భవిష్యత్తులో తమ మూలాలను మర్చిపోకుండా వారికి బాధ్యతను గుర్తు చేస్తున్న పాత్రగా భూమయ్య పాత్ర తీర్చిదిద్దబడింది.

### 4.5.11. లింగమ్మ (బతుకుపుస్తకం):

లసుమయ్య భార్య లింగమ్మ. ఈమె భర్తతోపాటు వ్యవసాయం చేస్తుంది. ఇంటి ముందున్న చింతచెట్టు నుండి చల్లని గాలి వీస్తుంది. హాయిగా నిద్రపట్టే సమయంలో తెల్లవారుతుంది. కాబట్టి లింగమ్మ నిద్ర లేచింది. ఆ రోజు ఉగాది పండుగ కాబట్టి ఇంకా ముందుగానే లేవవలసి వచ్చింది. ఈ సంవత్సరంలో వడ్ల గుమ్ములు, గరిసెలు నిండాలని కోరుకుంటుంది. లింగమ్మ అలుకు చల్లి, ముగ్గు వేసింది. బెల్లం, శనగపప్పుతో బూరెలు చేసింది. ఉగాది పచ్చడి చేసింది. ఆమె చేసిన పిండి వంటలు అందరికి వడ్డించింది. ఎంతో ఆనందంగా ఆమె కుటుంబంతో కలిసి ఉగాది పండుగ చేసుకుంది. ఇంటికొచ్చిన బంధువులకు కడుపు నిండా పెట్టి, వారికి కావలసిన మర్యాదలు అన్ని చేసింది. ఆమె ఉమ్మడి కుటుంబం బాగుండాలని కోరుకునేది.

లింగమ్మ పెద్ద కొడుకు బావి పనికి వెళ్లడానికి సిద్ధపడుతుంటాడు. కోడలు ప్రోత్సాహం వల్లె కొడుకు బయటకు వెళుతున్నాడని లింగమ్మకు కోడలుపై తీవ్రమైన కోపం ఉంది. కోడలు కొడుకును తనకు దూరంగా పెడుతుందని లింగమ్మ బాధ పడుతుంది. ఉద్యోగం వచ్చిన తరువాత కొడుకు తన కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకోడన్న నమ్మకంతో ఉంది. లింగమ్మకి అతన్ని బావి పనికి పంపడం ఇష్టం లేదు. మృత్యురూపం లాంటి పనికి వద్దని కొడుకుతో చెప్పి బాధపడుతుంది. ప్రమాదకరమైన పని అని ఒకవైపు, కోడలు చేతిలో పడి తనకు దూరం అవుతాడేమోనన్న భయం మరో దిక్కు లింగమ్మను వేధిస్తుంటాయి. చివరకు బావి పనికి వెళ్తున్న కొడుక్కి జాగ్రత్తలు చెప్పి పంపించింది. కొంతకాలం గడిచింది. సమాజంలో చాలా మార్పులు వచ్చాయి. లింగమ్మ కొడుకులు స్థిరపడ్డారు. కోడల్లు భర్తలను తీసుకొని కొంగుచాటున ఉండటంతో బాధపడేది. పెద్ద కోడలు కొన్ని రోజులైన ఇంట్లో ఉంది కాని చిన్న కోడలుకు ఆ అవసరం కూడా రాకపోవడంతో కోడళ్ల మీద కోపంగానే ఉండేది. చివరికి కొడుకులతో ఆనందంగా గడపుతున్న సమయంలో కూడా లింగమ్మకు కోడళ్లకు పడేదికాదు. లింగమ్మ ఒక మంచి ఇల్లాలిగా ఉంటూ సంసారాన్ని చక్కదిద్దింది. కొడుకుల ఎదుగుదలను ప్రోత్సహించేది. కోడళ్లపై కోపంగా ఉండి అత్తరికం చాటుకునేది. ఒక ఇల్లాలిగా, కొడుకుల ఎదుగుదలను కాంక్షించిన తల్లిగా, కోడళ్లపై అత్తరికాన్ని సాధించుకోవాలనుకున్న ఒక అత్తగా లింగమ్మ పాత్ర తీర్చిదిద్దబడింది.

### 4.5.12. గడ్డం రామయ్య (బతుకు పుస్తకం):

గడ్డం రామయ్య వ్యాపారపు పంటతో డబ్బు సంపాదించవచ్చని దానితో లక్షాధికారి కావాలన్న ఆశతో బలైపోయిన ఒక రైతు. గడ్డం రామయ్యకు నాలుగు ఎకరాల భూమి ఉంది. కొత్తగా అతడు వ్యాపారపు పంట అయిన పత్తిని వేయాలనుకుంటాడు. ఆ పంటతో లక్షాధికారి కావచ్చన్న మిత్రుడి సలహాతో పంటను వేస్తాడు. అతడు కిరాయి నాగళ్లతో భూమిని సాగు చేయిస్తాడు. విత్తనాలు కొంటాడు. అతడు విత్తనాలు నాటడం, కలుపులు, మందులకు డబ్బును బాగా పెట్టుబడిగా పెడతాడు. పంట పెరుగుతున్న కొద్ది పురుగు మందులు విపరీతంగా వాడాడు. అప్పు చేయడానికి భయపడే అతను పంట కోసం లక్ష రూపాయలు అప్పు చేస్తాడు. ఆ పంట ద్వారా రెండు లక్షలు వస్తాయనుకుంటాడు. కాని అతని ఊహ తలకిందులైంది. పంట చేతికి వచ్చే సమయానికి విపరీతంగా తెగుళ్లు పంటను ధ్వసం చేశాయి. పంట దిగుబడి పూర్తిగా తగ్గింది. పత్తి ధర కూడా తగ్గడంతో అతను భారీగా నష్టపోతాడు. రామయ్య భూమిని అమ్మి అప్పును తీర్చాలనుకుంటాడు. కాని పిల్లలు భూమిలేని వారవుతారని అనుకుంటాడు. తన అప్పుకి చావే పరిష్కారం అనుకొని పురుగుల మందు తాగి చనిపోతాడు. పంట మంచిగా పండించాలన్న రైతు పరిస్థితి ఘోరంగా ఉంటుందని ఈ పాత్ర ద్వారా తెలుస్తుంది. ఒక రైతు దీనస్థితి, అప్పుల వలయంలో నష్టపోయినవాడుగా, పిల్లల భవిష్యత్ ఆలోచించిన తండ్రిగా రామయ్య పాత్ర కనిపిస్తుంది.

### 4.5.13. మొండయ్య (డబ్బు మైనస్ తృప్తి = దుఃఖం):

శివయ్య మేనమామ మొండయ్య. మొండయ్య పేరుకు తగ్గట్టుగా మొండిఘటమే. అతడు డబ్బున్న వ్యక్తే అయినా పిసినారి వ్యక్తి. శివయ్య తండ్రి చనిపోయినప్పుడు అతని కుటుంబాన్ని పట్టించుకోడు. బావ ఉపాయవంతుడని, ఎవరూ ఇన్సూరెన్స్ చేయనికాలంలో ఇన్సూరెన్స్ చేశాడని, అది ఇప్పుడు ఉపయోగపడుతుందని చెప్పి తప్పించుకుంటాడు. అతన్ని అందరూ మహా స్వార్థపరుడు అంటారు. మొండయ్య కూతురు మంజులకు ఇరవై వేలు కట్నంగా ఇచ్చి శివయ్యతో పెళ్లి చేస్తాడు. ఎవరైనా డబ్బు సంపాదించాలి అనుకుంటే కృత నిశ్చయంతో సంపాదించుకోవాలని అంటాడు. సంపాదన కావాలి కాని ఎలా సంపాదించావని కాదు చూడాల్సింది. జీతంతో బతికితే అందులో సుఖం ఉండదని లంచాలు తీసుకోనైనా సంపాదించాలి అని మేనల్లుడుకి హితబోధ చేస్తాడు. అత్తను వేధిస్తున్న తన బిడ్డకు ఇలాంటివి జరగడం ఈ కాలంలో మామూలే అని చెప్పి కూతురిని సమర్థిస్తాడు. తర తరానికి కొంత మార్పు వస్తుంది. అది మంచివైపు వెళుతుందో లేదా

చెడు వైపు వెళుతుందో అర్థం కావడం లేదు. కాలంతోపాటు మనమూ నడవాలి అని అక్క సుమిత్రమ్మకు చెప్తాడు. సంసారంలో సాధ్యమైనంత వరకు కలతలు రాకుండా చూసుకోమని కూతురికి చెప్పేవాడు. ఎన్నో విషయాలు తెలిసిన మొండయ్య తన కుటుంబ విషయానికి వచ్చేసరికి సర్ది చెప్పుకోలేక కొడుకును దూరం చేసుకుంటాడు. మొండయ్య శివయ్యకు ఆడపిల్ల పుడితే సర్దిచెప్పి అతని కోపాన్ని తగ్గించాడు. తల్లిదండ్రులకు దుఃఖాన్ని కలిగించేవారిలో అటు కొడుకులు ఇటు కూతుళ్లు ఉంటారని, వృద్ధాప్యంలో ఎవరైనా చూసుకోవచ్చు అని అల్లుడికి తెలియజేస్తాడు. శివయ్యకు డబ్బుతోనే సుఖం వస్తుందని, అందుకొరకు ఏ మార్గనైనా అవలంబించవచ్చని మొండయ్య చెబుతాడు. అతడు మనుమరాళ్లను చూస్తూ ఆనందంగా గడిపేవాడు. కూతుళ్లను ఎంతో బాధ్యతగా పెంచాలని శివయ్యకు చెప్పేవాడు. మొండయ్య మనమరాళ్ల ఎదుగుదలను చూస్తూ సంతోషించేవాడు. అతడు మనుమరాళ్ల పెళ్ళిళ్లకు ఎంతో కొంత సాయం చేస్తానంటాడు. కాని వారి పెళ్ళిళ్లు చూడకుండానే చనిపోతాడు.

మొండివాడిగా, పిసినారివాడిగా, స్వార్థపరుడిగా, కఠినాత్ముడుగా, కూతురు కోసం తపించే వ్యక్తిగా, అల్లుడుని తన మార్గం వైపే నడవమనే వ్యక్తిగా, డబ్బుతోనే సుఖం వస్తుందన్న నమ్మకం ఉన్న వ్యక్తిగా మొండయ్య పాత్ర తీర్చిదిద్దబడింది.

### 4.5.14. సుమిత్రమ్మ (డబ్బు మైనస్ తృప్తి = దుఃఖం):

సుమిత్రమ్మ కొడుకు శివయ్య. ఆమె భర్త చనిపోయిన తరువాత చాలా కష్టాలు పడి కొడుకును పెంచి పెద్ద చేసింది. తన తమ్ముడు పట్టించుకోకపోయినా చాలా జాగ్రత్తగా కష్టపడుతూ బ్రతుకుతుంది. తన తమ్ముడి కూతురైన మంజులను పెళ్లి చేసుకోమని కొడుక్కి చెప్తుంది. తమ్ముడి కూతురును చేసుకుంటే ఆమెకు బలంగా ఉంటుందని వారి కుటుంబాల మధ్య సంబంధాలు సజీవంగా ఉంటాయని, మనకు కొండంత అండగా ఉంటుందని చెప్పి కొడుక్కి పెళ్లి చేసింది. సుమిత్రమ్మను కోడలు దూరంగా పెట్టేది. క్రమక్రమంగా శివయ్యకు సుమిత్రమ్మ ఛాందసురాలిగా కనిపించింది. ఒక్కగానొక్క కొడుకు దూరమైపోతున్నాడని ఆమె బాధ పడేది. తల్లిచాటు కొడుకు అని పిలిపించుకోవడం నీకు అవమానంగా ఉంటే ఇప్పుడు పెండ్లాం చాటు మొగుడని అనిపించుకో బాగుంటుందని కొడుకుతో సుమిత్రమ్మ అంటుంది. అల్లారుముద్దుగా పెరిగిన కొడుకు తనకు దూరం అవుతుండటం చూసి బాధ పడేది. కోడలిని నిలదీస్తుంది. నువ్వు గడుసుదానివని చేసుకోనన్న నేనే అతన్ని ఒప్పించి పెళ్లి చేశాను. నీ గడుసుతనంతో కొడుకును దూరం చేయ్యోద్దని మంజులని వేడుకుంటుంది. మంజుల తన తెలివిని ఉపయోగిస్తూ అత్తకు ఎదురు మాట్లాడుతూ

సమాధానం చెప్పుతుంది.  మంజుల తెలివితో తన కొడుకును దూరం చేస్తుందని సుమిత్రమ్మ ఏడుస్తుంది. అలాగే కొంతకాలం గడిచిన తరువాత తాను నానమ్మను కాబోతుందని తెలిసి ఆనందపడింది. సంపాదన అంటూ తన కొడుకుని కాల్చుకు తింటుందని తమ్ముణింట్లో కోడలును తిట్టాలని వెళ్తుంది. తన తమ్ముడి ముందు కోడలుని నిలదీసింది. నా భర్తను స్వంత వ్యక్తిత్వంగల మనిషిగా ఉంచుకోవడం తప్పుకాదని తండ్రికి, అత్తకి చాలా తెలివిగల మాటలు చెప్పి మంజుల తప్పించుకుంటుంది. ఇలా జరగడం మామూలే అని తమ్ముడు అంటాడు. సుమిత్రమ్మ నాకైతే నచ్చడం లేదు అని తమ్ముణ్ని తిట్టి కాలంతో మనం నడవాలని అనుకుంటుంది. తల్లి కడుపు చూస్తుంది. పెండ్లాం జేబు చూస్తుందనడానికి చక్కని ఉదాహరణ నా కోడలే అనుకుంటూ ఆమె వెళ్లిపోతుంది. సుమిత్రమ్మ తన కొడుకుకి సంతానంగా మగపిల్లవాడు పుట్టలేదని, వంశాంకురం పేరుమీద రెండవ పెళ్లికి కొడుకును సిద్ధంగా ఉండాలని శివయ్యతో అంటుంది. కోడలు మీద కోపంతో సుమిత్రమ్మ అలా అంటుంది. కాలం గడుస్తున్న కొద్దీ సుమిత్రమ్మ కోడలి మధ్య వైరం పెరుగుతూనే ఉంది. ఎప్పటికైనా కోడలు మారుతుందన్న ఆశతో ఎదురు చూస్తుంది. మనమరాళ్లతో కలిసి ఎంతో ఆనందంగా గడపాలని ఆశ పడుతుంది. కాని సుమిత్రమ్మ వృద్ధురాలై చనిపోతుంది. ఒక్క మనుమరాలి పెళ్లి కూడా చూడకుండానే చనిపోతుంది. కుటుంబ పెద్దగా, కొడుకును ఉన్నత స్థితికి తీసుకువచ్చిన తల్లిగా, మేనకోడలుపై ఆధిపత్యం చెలాయించాలనే అత్తగా సుమిత్రమ్మ పాత్ర తీర్చిదిద్దబడింది.

### 4.5.15. ఓదెలు (అస్పృశ్య కోయిల):

మనోజ్ స్నేహితుడు ఓదెలు. ఓదెలు ఊరికి దూరంగా ఉంటూ చదువుకుంటున్న మనోజ్ తన ఊరికి వచ్చినప్పుడు, మనోజ్ లేని కాలంలో ఊరిలో జరిగిన విశేషాల్ని తెలియజేసేవాడు. అనుభవ జ్ఞానంలో వచ్చిన చైతన్యంతో ఎదుటివారి మనసుల్లో మరీ ముఖ్యంగా మనోజ్ మిత్రుల మనస్సుల్లో ఏముందో చెప్పగలిగే నేర్పరి. మనోజ్ ఉద్యోగం చేస్తున్న సమయంలో కూడా ఊరికి వచ్చినప్పుడు ఊరి విశేషాల్ని, ప్రధానంగా కోకిలమ్మ సంగతుల్ని మనోజ్ కు వివరించేవాడు ఓదెలే. తండ్రినిగాని, చిన్నాననుగాని అడగలేకపోయిన విషయాలు మనోజుకు తెలియజేసే మిత్రుడు ఓదెలు.

### 4.5.16. మనోజ్ తాత (అస్పృశ్య కోయిల):

మనోజ్ తాతగా పిలువబడుతున్న పాత్ర పేరులేని పాత్ర. చిన్నప్పటి నుండే మనోజ్ దళితుల పట్ల సానుకూలంగా ప్రవర్తించడానికి, వారి పట్ల ప్రేమను కలిగి ఉండడానికి కారణం అతని తాత

అని కూడా చెప్పాలి. తాతతో మనోజ్ జరిపే సంభాషణలో దళితుల గురించి, వారు పడే కష్టాల గురించి, వారి శ్రమ నైపుణ్యాల గురించి, చేతి నిండా కష్టమున్నా కడుపులోకి తిండి రాకపోవడం గురించి, దొరలు వారిని దోపిడీ చేసే విధానం గురించి మనువడితో చెప్పడం కారణంగా మనోజ్ మనసులో దళితులంటే అభిమానం, గౌరవం కూడా ఏర్పడ్డాయి.

### 4.5.17. మనోజ్ తల్లి (అస్పృశ్య కోయిల):

మనోజ్ తాతకు, తండ్రికీ కొంత ఉదారభావాలున్న, కులం విషయంలో పట్టింపు లేకపోయినా మనోజ్ తల్లికి మాత్రం కులం విషయంలో పట్టింపు ఉంది. మనోజ్ చిన్నప్పుడే కురవ పిల్లతో పెళ్లి చేయాలని చూసిన కిష్టయ్యతో కులం కాని పిల్లతో పెళ్లి వద్దని వాదించి చివరికి చనిపోతానని బెదిరించి కులం పట్టింపును ప్రదర్శించిన స్త్రీ.

### 4.5.18. అన్నలు (అస్పృశ్య కోయిల):

కోకిలమ్మ ఆశయాలకు అండదండగా నిలిచిన వారు 'అన్నలు'. వీరిని 'నక్సలైట్లు', 'మావోయిస్టులు' అని పిలుస్తారు. తెలంగాణ విప్లవోద్యమం దళితుల కోసం, ఊరి పీడితుల కోసం ఎలా బాసటగా నిలబడిందో తెలియజేయడం కోసం నవలలో చోటు కల్పించిన పాత్రలివి. దళితులు దేవాలయ ప్రవేశం చేస్తామన్నప్పుడు, బతుకమ్మ పండుగ జరుపుకుంటామన్నప్పుడు దొర, అతని బంట్లు, పంచాయితీ పెద్దలు మూకుమ్మడిగా వాటిని వ్యతిరేకిస్తే దళితుల ఆకాంక్షలు నెరవేర్చకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కొంటారని హెచ్చరించి, దళితుల కోరికలు తీర్చిన వారిగా వీరు ఈ నవలలో 'అన్నలు' పాత్రగా చిత్రించబడ్డారు.

### 4.5.19. శ్రీరాం (గువ్వలచెన్నా):

శ్రీరాం రాజలింగం కొడుకు. రాజలింగం నేతపని వృత్తిలో అభివృద్ధి లేకపోవడంతో భీవండికి వలస వెళ్లి అక్కడ పనిచేస్తుండగా మత కలహాలతో అక్కడ జరిగిన ఘర్షణల వల్ల చనిపోతాడు. తండ్రి పడిన బాధలను తెలుసుకొని బాగా చదువుకొని శ్రీరాం ఇంజనీరుగా ఉద్యోగం చేస్తాడు. అతని కంటె ఉన్నతంగా ఉన్న కుటుంబంలోని అమ్మాయిని పెళ్లి చేసుకుంటాడు. ఎన్ని అవకాశాలు వచ్చినా విదేశాలకు వెళ్లకుండా స్వదేశంలో ఉంటూ తల్లిని చూసుకుంటూ ఉంటాడు. ఆర్థికంగా ఎదగడం కొరకు భార్యభర్తలు ఇద్దరు కలిసి ఉద్యోగం చేస్తూ కాలం గడుపుతున్నారు. శ్రీరాం ఇంటివద్దనే ఉంటూ ఎంతో ఆనందంగా జీవిస్తుంటాడు. తల్లిని, స్వదేశాన్ని, కుటుంబాన్ని ప్రేమించే వ్యక్తిగా శ్రీరాం పాత్ర చిత్రించబడింది.

### 4.5.20. రాజమల్లు (గువ్వలచెన్నా):

రాజమల్లు చిప్ప మల్లయ్య, లింగమ్మల పెద్ద కొడుకు. రాజలింగం భార్య లచ్చవ్వ, కొడుకు శ్రీరాం. రాజమల్లు తండ్రి చేసే నేత పనిచేస్తూ ఉండేవాడు. అతనికి ఆ పనిలో వృద్ధిలేక ఆర్థిక పరిస్థితి మెరుగుపడకపోవడంతో ఏదైనా పని చేసుకొని బతకాలనుకుంటాడు. నేతపనిలో బతుకుదెరువే కష్టమవుతుండటంతో భీవండికి వెళ్లి డబ్బు సంపాదించాలనుకుంటాడు. అవమానాలు భరిస్తూ, చాలీచాలని బతుకు బ్రతుకుంటూ ఉండటం అతనికి ఇష్టం ఉండదు. రాజమల్లు తల్లిదండ్రులను ఒప్పించి భీవండికి పని కొరకు వలస వెళతాడు. భీవండికి వెళ్లిన ఆరు నెలల తరువాత మత కలహాలు ప్రారంభమవుతాయి. రైల్వే స్టేషనుకు వస్తున్న రాజమల్లు కత్తిపోట్లకు గురవుతాడు. అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోతాడు. రాజమల్లు కొడుకు శ్రీరాంను చూసుకోకుండానే ఆఖరి శ్వాస వదిలాడు.

వృత్తి పనిచేసేవాడిగా, వృత్తి పనిలో ఎదుగుదల లేకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందిపడిన వ్యక్తిగా, బయట దేశాలకు వెళ్లి ఆర్థికంగా ఎదగాలనే ఆలోచనతో వలస వెళ్లినవాడిగా రాజమల్లు పాత్ర కనిపిస్తుంది.

### 4.5.21. లక్ష్మీరాజం (గువ్వలచెన్నా):

లక్ష్మీరాజం వీరయ్య చిన్న కొడుకు. సంప్రదాయంగా వస్తున్న మగ్గాల కన్న ఆధునాతన మగ్గాల ద్వారా ఆదాయం లభిస్తే జీవితంలో ఎదగాలనుకుంటాడు. అతడు తనకున్న స్థితి కంటె కొంత ముందుకుపోయి జీవితాన్ని గెలుచుకొని తన పిల్లల తరానికైనా అన్ని అవకాశాలు కల్పించాలనుకుంటాడు. సహకార సంఘాలు, ప్రభుత్వం ఆధునాతన మగ్గాలపై మంచి రాయితీలు ఇస్తున్నాయని ముఖ్యంగా నూలు, కరెంట్, రుణాలపై సబ్సిడీలున్నాయని వాటిని ఉపయోగించుకొని తెలివిగా ఎదగాలని అందులో అడుగుపెడతాడు. ప్రభుత్వ సబ్సిడీలు, సహకార సంఘాల పని తీరు సరిగ్గా లేకపోవడంతో తాను తయారుచేసిన బట్టలు అమ్ముడుపోక కుప్పలు కుప్పలుగా మిగిలిపోతాయి. దానితో అతనికి అప్పులు పెరిగి ఆత్మహత్య చేసుకుంటాడు. చేనేత కార్మికుడిగా, పారిశ్రామికీకరణ మోజులో పడి తన వృత్తిని వృద్ధిచేసే క్రమంలో అప్పుల పాలై ఆత్మహత్య చేసుకున్న పాత్ర లక్ష్మీరాజంది. ప్రభుత్వ వైఫల్యంతో చేనేత కార్మికుల ఆత్మహత్యల దుస్థితికి నిదర్శనం లక్ష్మీరాజం పాత్ర.

★★★

# ఐదవ అధ్యాయం

# కాలువ మల్లయ్య నవలలు – రచనాశిల్పం

## ఐదవ అధ్యాయం

## కాలువ మల్లయ్య నవలలు – రచనాశిల్పం

### 5.0. శిల్పం – పరిచయం:

కథా విన్యాసంలో రచయిత చూపే నైపుణ్యాన్నే శిల్పం అంటారు. శిల్పాన్ని ఆంగ్లంలో 'Technique' అనే పదానికి సమానార్థకంగా వాడతారు.

"రచయిత తాను చెప్పదలచుకున్న ఒక విషయాన్ని ఒక ప్రత్యేక పద్ధతిలో చెప్పటాన్నే శిల్పం అంటారు" (నవీన్.2001:పుట.13).

"వస్తువు ఏ రూపంలో అభివ్యక్తం అవుతుందో ఆ రూపాన్ని శిల్పం అంటారు" (మధుసూదనరావు, త్రిపురనేని.1997:పుట.13).

కాలువ మల్లయ్య రచనాశైలి వాస్తవికంగా ఉంటుంది. అతని శైలి ప్రధానంగా తెలంగాణ జీవద్భాషలో సాగుతుంది. కాలువ మల్లయ్య నవలల్లో శిల్పం ఎంతో వైవిధ్యపూరితంగా ఉంటుంది. ముఖ్యంగా కాలువ మల్లయ్య నవలల్లో శిల్పానికి సంబంధించిన కాలువ మల్లయ్య రచనా శైలి, నవలల్లో విభాగాలు, నిడివి, ఎత్తుగడ, ముగింపు, శీర్షిక ఔచిత్యం, పాత్రోచితభాష, దృష్టికోణం, మాండలికాలు, ధ్వన్యనుకరణ రూప పదాలు, జంట పదాలు, సామెతలు, జాతీయాలు, అన్యదేశ్యాలు మొదలైన అంశాలు ఉంటాయి. వాటిని కాలువ మల్లయ్య నవలల్లో ఉపయోగించిన తీరును ఈ అధ్యాయంలో పరిశీలిస్తున్నాను.

### 5.1. కాలువ మల్లయ్య రచనాశైలి:

"శైలి అనేది రచనకు పైపైనే పూసే పూత కాదు, బయట తగిలించే అలంకారాలు అసలే కావు. రచనలో మొదటి నుంచి చివరిదాకా అంతర్లీనంగా ఒదిగిపోయి కలగలిసి పోయిన వాక్య రచనా పద్ధతి, మాటల కూర్పులో వాక్యం విరుపులో, చెప్పే తీరులో తొంగి చూసే రచయిత వ్యక్తిత్వం" (వీరాజు, శీలా:1974).

భాషను ఉపయోగించడంలో ఒక ప్రత్యేక పద్ధతినే శైలి అంటున్నాం. ఆంగ్లంలో దీనికి సమానార్థంగా 'స్టైల్' (Style) అనే పదాన్ని వాడుతున్నాం. దీనిని రచయిత యొక్క రచనల్ని అంచనా వేయడానికి కొలబద్ధగా గ్రహిస్తున్నాం. ఇది వ్యక్తిగతమైనది కావడం వల్లనే ఒక్కో రచయిత మధ్య స్పష్టంగా శైలీ భేదం కనిపిస్తుంది. కాలువ మల్లయ్య గారి శైలిని పరిశీలిద్దాం.

కాలువ మల్లయ్య గారు నవలల్లో వాస్తవిక శైలిని వాడారు. ప్రజల వాడుకలో ఉన్న భాషను ఉపయోగించి వాక్య నిర్మాణాన్ని చేశాడు. వాస్తవిక శైలిలో లయాత్మకత ఉంటుంది. నాద

సౌందర్యం ఉంటుంది. అలవాటుపడి చదివితే వదిలిపెట్టలేని పఠనీయత ఉంటుంది. ఈ వాస్తవికత సత్యాన్వేషణ దృష్టి నుండి వచ్చిందని అనుకోవచ్చు. కాలువ మల్లయ్య శైలిని వాస్తవిక మాండలిక శైలిగా పేర్కొనవచ్చు. అతడు శిష్ట వ్యవహారిక, మాండలిక భాషల్ని వాడుతూ నవలలను రచించారు.

వాస్తవికంగా ఎలాంటి కృత్రిమత్వం లేకుండా సజీవ పాత్రలతో వాస్తవ సంఘటనలతో అతని శైలి కొనసాగుతుంది. కాలువ మల్లయ్య నవలల్లో అద్భుత కల్పనలు ఉండవు. ఏ పాత్ర భాషను ఆ పాత్రకు వాడుతూ నవలలకు సౌందర్యాన్ని తీసుకువచ్చాడు. కాల్పనిక సాహిత్యానికి మాండలిక భాష గొప్ప అలంకరణ. ప్రజల భాషలో నవలలు రాయడం వల్ల పాఠకులపై ఎక్కువగా ప్రభావాన్ని చూపాయి. కాలువ మల్లయ్య రచనలలో మరో గొప్ప అంశం పాత్రోచిత భాషను వాడటం. ఎత్తుగడ కథ నడిచే తీరు ఎక్కడా మనకు విసుగును పుట్టించదు. నవలలు చదవడం మొదలుపెడితే మన జీవితమో, మనకు తెలిసిన జీవితమో దర్శనం ఇస్తుంది. ఆద్యంతం ఆసక్తిగా చదివించే లక్షణం కాలువ మల్లయ్య నవలలకు ఉంటుంది.

కథా అంశాలు సమకాలీనతకు, సామాజిక సంక్షోభాలకు సంబంధించినవై ఉంటాయి. ప్రాంతీయత, కాలమానత, వివిధ విప్లవాలు అన్నింటిలో ఒక సమకాలీన ప్రపంచాన్ని తన నవలల ద్వారా దర్శనం చేసుకుంటాయి. తన చుట్టు పక్కల నిత్యం జరిగే సామాన్య సంఘటనలను చూసి చలించి ప్రతి సంఘటన తన రచనా వస్తువుగా తీసుకొని సౌందర్యవంతంగా, శిల్ప నైపుణ్యంతో చిత్రీకరించడం కాలువ మల్లయ్య గారిది అందె వేసిన చెయ్యి. ఒక రచనను పేరు లేకుండా చదివితే ఇది ఫలానా వారు రాసిందే అని అనుకునేలా అతని శైలి ఉంటుంది. అలా ఉన్నప్పుడే ఆ రచన విజయం సాధించినట్టు అవుతుంది.

## 5.2. కాలువ మల్లయ్య నవలల్లో భాగాలు, నిడివి:

నవలలో భాగాలు చేయాలనికాని, చేయకూడదనిగాని ఎటువంటి నియమాలు లేవు. ఒకవేళ చేసిన ఇన్నే విభాగాలు ఉండాలని కూడా ఎటువంటి పరిమితులు లేవు. అది పూర్తిగా రచయిత స్వేచ్ఛ. కాలువ మల్లయ్య నవలల్లో ఉన్న భాగాలు, పేజీల సంఖ్యను కింద పట్టిక రూపంలో పొందుపరుస్తున్నాను.

| సంఖ్య | నవల పేరు | భాగాలు | పేజీల సంఖ్య |
|---|---|---|---|
| 1) | భూమిపుత్రుడు | 19 | 124 |
| 2) | సాంబయ్య చదువు | 13 | 113 |
| 3) | మాట్లాడే బొమ్మలు | 17 | 100 |

| | | | |
|---|---|---|---|
| 4) | బతుకు పుస్తకం | 25 | 376 |
| 5) | మాదిగ విజయం | 36 | 322 |
| 6) | గులాంగిరి చోడో | 16 | 194 |
| 7) | మెతుకు పుస్తకం | 26 | 227 |
| 8) | మంచియన్నది మాల అయితే.. | -- | 127 |
| 9) | అస్పృశ్య కోయిల | 18 | 155 |
| 10) | గువ్వలచెన్నా (చతుర మాసపత్రిక) | 10 | 120 |
| 11) | తెలంగాణ దేవదాసు (చతుర మాస పత్రిక) | 18 | 96 |
| 12) | డబ్బు—తృప్తి = దుఃఖం (చతుర మాస పత్రిక) | 15 | 96 |
| 13) | తపస్సు (చేతిరాత ప్రతి) | 16 | 165 |

పై నవలలో ఆయా భాగాల్లోని విషయ విస్తృతి దృష్ట్యా కొన్ని భాగాలు పెద్దవిగానూ, మరికొన్ని చిన్నవిగానూ ఉన్నాయి. మెతుకుపుస్తకం, మాదిగ విజయం, బతుకు పుస్తకం నవలలు మినహా మిగతా నవలలన్ని దాదాపుగా 200 పేజీల్లోనే ఉండటం గమనార్హం. నవల ఆవిర్భావం జరిగింది ప్రధానంగా నిడివితోనే కావడంతో దీర్ఘతను వ్యతిరేకించడం కనిపిస్తుంది. కాని ఆ కోణంలో చూసినప్పుడు మెతుకుపుస్తకం, మాదిగవిజయం, బతుకు పుస్తకం పేజీలు ఎక్కువగా, దీర్ఘంగా ఉన్నా ఏమి ఇబ్బందిని కలుగజేయవు. అదే విధంగా మిగతా నవలల నిడివి సముచితంగానే ఉన్నవి.

## 5.3. నవలా శీర్షిక ఔచిత్యం:

రచయిత తాను ఎన్నుకున్న కథాంశానికి తగిన శీర్షికను గ్రహిస్తాడు. నవలలో రచయిత చెప్పబోయే కథా పరమార్థాన్ని సూచించే విధంగా శీర్షికలుంటాయి. కాలువ మల్లయ్య నవలలకు ఆకర్షణీయమైన శీర్షికలనే ఎన్నుకున్నారు. కాలువ మల్లయ్య నవలల శీర్షికల్ని పరిశీలిస్తే అవి కథకు తగ్గినట్లుగా ఆమోదయోగ్యంగా ఉంటాయి. 'భూమి పుత్రుడు' నవల శీర్షిక. కొండ మల్లయ్య అనే రైతు ఈ నవలలో ప్రధాన పాత్రధారి. కొండ మల్లయ్య భూమిని ఆధారంగా చేసుకొని వ్యవసాయం చేస్తాడు. ప్రధాన పాత్రధారికి ఆధారాన్ని ఇచ్చేదాన్ని నవల శీర్షికగా పెట్టడం జరిగింది. నవలలో రైతు జీవితం ఉంది. కాబట్టి ఈ నవలకు భూమిపుత్రుడు అనే శీర్షిక పెట్టడం సమంజసంగానే ఉన్నది. ప్రధాన పాత్రధారికి భూమి ఆధారం కాబట్టి అతడు భూమిపుత్రుడయ్యాడు.

'సాంబయ్య చదువు' నవల శీర్షిక. సాంబయ్యది ఈ నవలలో ప్రధాన పాత్ర. సాంబయ్య చదువు విషయాన్ని చెప్పడం కోసం ఈ నవల రాయడం జరిగింది. నవలలో ప్రధాన పాత్రధారి అయిన సాంబయ్య పేరుతోనే శీర్షిక పెట్టడం సమంజసంగానే ఉంది.

'మాట్లాడే బొమ్మలు' నవల శీర్షిక. మానవీయ విలువలు మాయమైపోయి కృత్రిమ మానవ సంబంధాలు ఏర్పడిన కాలంలో మనుషులు కేవలం జీవంలేని బొమ్మలైపోతారని, సంభాషణ బొమ్మలు చేసేది తప్ప మనుషులు చేసేది కాదని చెప్పడం ఒక ఉద్దేశ్యంగా ఈ నవలకు 'మాట్లాడే బొమ్మలు' అనే శీర్షిక పెట్టారు.

'బతుకు పుస్తకం' నవల శీర్షిక. ఈ నవలలో రాజయ్య గ్రామానికి బతుకు పుస్తకం అనే పేరు పెట్టాడు. బతుకుతెరువును చూపించేది గ్రామం. గ్రామంలో వృత్తులవారు, వివిధ రకాల పనివారు బతుకుదెరువు కోసం పనిచేస్తూ బతుకుతారు. గ్రామంలోని వారి బతుకులల గాథే 'బతుకు పుస్తకం' అని చెప్పవచ్చు. గ్రామాన్ని ప్రధానంగా తీసుకొని అక్కడున్న సమస్యలు, సుఖదుఃఖాలు మొదలైనవి వాటి గురించి చెప్పడం వల్ల ఈ నవలకు 'బతుకు పుస్తకం' అనే శీర్షికను పెట్టడం సమంజసంగానే ఉంది.

'మాదిగ విజయం' నవల శీర్షిక. ఈ నవలలో మాదిగల జీవితం ఉంది. నాలుగు తరాల మాదిగలు సాధించిన విజయం ఉంది. ఈ నవలలో ఆనందరావు మాదిగ కులంలో పుట్టి అవమానాలు భరించి ఉన్నత స్థాయికి చేరుతాడు కాబట్టి మాదిగ వ్యక్తి సాధించిన విజయం వల్లే ఈ నవల 'మాదిగ విజయం' పేరును ఖరారు చేసుకుంది. అందుకే శీర్షిక పేరు 'మాదిగ విజయం' అని పెట్టాడు. ఈ శీర్షికను నిర్ణయించడంలో నవలారచయిత ఔచిత్యవంతమైన నిర్ణయం చేశారని చెప్పవచ్చు.

'మెతుకు పుస్తకం' నవల శీర్షిక. పట్టణాన్ని లేదా పారిశ్రామిక కాలనీని రచయిత 'మెతుకుపుస్తకం' అంటాడు. ఈ నవలలో పారిశ్రామిక ఫ్యాక్టరీలో పనిచేసే కార్మికులు, ఉద్యోగులు మొదలైన వారి జీవితం ఉంది. పారిశ్రామిక ప్రాంతంలో కార్మికులుండే కర్మాగారాలు 'మెతుకు పుస్తకాలు'. కార్మికులకు జీవనోపాధిని ఇవ్వడం వల్ల అవి 'మెతుకుపుస్తకాలు' అని రచయిత తెలియజేశాడు. ఈ నవలకు 'మెతుకు పుస్తకం' అనే శీర్షిక పెట్టడం సమంజసంగానే ఉంది.

'తెలంగాణ దేవదాసు' నవల శీర్షిక – ఈ నవలలో రఘురాం దొర కూతురైన రాజ్యలక్ష్మిని ప్రేమించి దేవదాసుగా మారతాడు. దొరలు అవసరమైతే పరువు హత్యలకు వెనుకాడకపోవడంతో తెలంగాణలో ప్రేమ వివాహాలకు ఆ కాలంలో ఆస్కారం లేకుండా పోయింది. అన్ని కులాల్లో

కట్టుబాట్లు ఉండటం వల్ల ఆనాడు వీటిని అధిగమించే సాహసం చేయలేకపోవడంతో తెలంగాణలో దేవదాసుగా మారింది తక్కువేనని రచయిత ఈ నవల ద్వారా తెలియజేశాడు. రఘురాం దేవదాసులా భగ్న ప్రేమికుడు అయినప్పటికి మిత్రులు, తాను ప్రేమించిన రాజ్యలక్ష్మి కోరిక మేరకు రఘురాం వేరొక అమ్మాయిని పెళ్లి చేసుకోవడం గమనించాల్సిన విషయం. ప్రేమ విఫలమయినంత మాత్రాన భవిష్యత్తును ఛిద్రం చేసుకోవద్దని తెలియజేయటానికి 'తెలంగాణ దేవదాసు' అనే శీర్షిక పెట్టాడని భావించవచ్చు. కథాపరంగా ఆ దేవదాసు పెళ్లి చేసుకోడు. ఈ దేవదాసు పెళ్లి చేసుకుంటాడు. కాబట్టి 'తెలంగాణ దేవదాసు' అనే శీర్షిక కొంతవరకు సమంజసంగానే ఉందనిపిస్తుంది.

'డబ్బు మైనస్ తృప్తి = దుఃఖం' అనేది నవలా శీర్షిక. ఈ నవలలో శివయ్య ప్రధాన పాత్రధారి. ఆ పాత్రధారి డబ్బు కొరకు ఆశపడుతూ తృప్తిని కోరుకోడు. చివరికి దుఃఖాన్ని కొని తెచ్చుకుంటాడు. కాబట్టి ఈ పాత్రధారి అనుభవించిన వాటిని ఆధారంగా చేసుకొని ఈ శీర్షిక పేరు పెట్టారు. డబ్బు, తృప్తి, దుఃఖం ఈ మూడింటి ద్వారా ఈ శీర్షిక పేరు పెట్టడం సమంజసంగానే ఉంది.

'గువ్వలచెన్నా' నవల శీర్షిక. ఈ నవల పద్మశాలీల కులవృత్తిని గురించి తెలియజేస్తుంది. 'వెలి విద్యలెన్నియైనను కులవిద్యకు సాటిరావు గువ్వలచెన్నా' అనే పద్యపాదంలోని చివరి పదాన్ని తీసుకొని ఔచిత్యవంతంగా నవలకు 'గువ్వలచెన్నా' అనే పేరు పెట్టాడు.

'గులాంగిరి చోడో' నవల శీర్షిక. 'గులాంగిరి చోడో' అనగా బానిసత్వాన్ని వదులుకో అని అర్థం. మాదిగ కులానికి చెందిన కొంరయ్య ప్రధాన పాత్రధారిగా ఉంటాడు. అతడు దొరలను ఎదిరించి వారి బానిసత్వం నుండి విముక్తి పొంది స్వంతంగా బతుకుతూ జీవనం గడుపుతాడు. ఆ పాత్ర బానిసత్వాన్ని వదులుకోవడం ఇక్కడ ప్రధానం కాబట్టి నవలకు 'గులాంగిరి చోడో' అనే పేరు పెట్టడం సమంజసంగానే ఉంది.

'మంచియన్నది మాల అయితే..' నవల శీర్షిక. మాలకులంలో పుట్టిన కొండయ్య దొరలను తన తెలివితో బురిడి కొట్టిస్తూ తెలివిగా తప్పించుకుంటూ ఒక సందేశాన్ని ఇస్తాడు. అతని పాత్ర ద్వారా 'మంచియన్నది మాలనే' అని రచయిత గుర్తించుకోవాలన్నాడు. మంచి అనేది మాల మాదిగలల దగ్గరే ఉంది అని తెలియజేస్తూ 'మంచియన్నది మాల అయితే...' అనేది శీర్షికగా పెట్టాడు.

'తపస్సు' నవల శీర్షిక. ఈ నవలలో ప్రధాన పాత్రధారి మహేష్ అనే రచయిత రచనా వ్యాసంగాన్ని రాస్తూ సాహిత్యం కొరకు తపస్సు చేస్తున్నాడు. అందుకే తపస్సు అనే పేరును నవల శీర్షికగా నిర్ణయించారు. 'తపస్సు' పేరుతో శీర్షిక పెట్టడం సమంజసంగానే ఉంది.

'అస్పృశ్య కోయిల' నవల శీర్షిక. కోకిలమ్మ కథను చెప్పడం కోసం ఈ నవల రాయడం జరిగింది కాబట్టి నవలలో ప్రధాన పాత్రధారి అయిన కోకిలమ్మ పేరుతోనే శీర్షిక పెట్టడం సమంజసంగానే ఉంది. నవలలోని ప్రధాన పాత్రధారి పేరుమీదనే శీర్షిక పెట్టడం అన్నది ప్రాచ్య, పాశ్చాత్య నవలా రచన సాంప్రదాయంలో ఉంది. కాబట్టి శీర్షికను నిర్ణయించడంలో నవలారచయిత ఔచిత్యవంతమైన నిర్ణయం చేశారని చెప్పవచ్చు. కాలువ మల్లయ్య పాత్రలనే శీర్షికలుగా గ్రహించిన నవలలు ఆస్పృశ్య కోయిల, సాంబయ్య చదువు.

మాదిగ విజయం, మంచియన్నది మాల అయితే.., మెతుకు పుస్తకం, గువ్వలచెన్నా నవలల్లో సమస్యల ఆధారంగా శీర్షికను నిర్ణయించాడు.

### 5.4. ఎత్తుగడ:

అస్పృశ్య కోయిల నవల శ్రీశ్రీ మహాప్రస్థానం కవితా పంక్తులతో ప్రారంభమయ్యింది. సాధారణంగా ఏదైనా వర్ణనతో నవల ప్రారంభమవుతుంది. వ్యాసం, ఉపన్యాసం వంటి వాటిలో కవితా పంక్తుల్లో, సూక్తుల్లో, జాతీయాల్లో, నానుల్లో ఆరంభ వాక్యాలుగా ఉంటుంటాయి. కాని ఈ నవలలో కవితా పంక్తులతో ప్రారంభించడం రచయిత ఎత్తుగడగా చెప్పవచ్చు.

**"పతితులార భ్రష్టులార బాధసర్ప ద్రష్టులార**
**ఏడవకండేడవకండేడవకండి...**
**మీ కోసం కలంపట్టి మీతో నా గళం కలిపి**
**ఆకాశపుదారులెంట హడావిడిగ పరుగెత్తే**
**రథచక్రాల్... రథచక్రాల్...**
**జగన్నాథ రథచక్రాల్...**
**భూమార్గం పట్టిస్తాను... భూకంపం సృష్టిస్తాను...**
**భూకంపం సృష్టిస్తాను...**

(మల్లయ్య, కాలువ.2017:పుట.1)

ఎత్తుగడ ఎంత కవితాత్మకంగా ఉన్నా, రమణీయమైన వర్ణనలతో ఉన్నా, అది ప్రధానమైన కథలోకి నడపించగలిగే, వస్తువులోని ఆంతర్యాన్ని సూచనప్రాయంగా అందించగలిగేదై ఉండకపోతే

వృధా ప్రయాసగా మిగిలిపోతుంది. ఈ నవలలో వెనుకబడిన వర్గానికి చెందిన మనోజ్ ది ప్రధానపాత్ర. అతడు తన ఊరిలోని దొర కుటుంబం, ఇతర శూద్ర కులాలు దళితులను ఎంతటి కుల వివక్షకు గురిచేస్తున్నాయో, వారిమీద ఎంతటి సామాజిక పీడనను అమలుచేస్తున్నాయో, ఎంతటి దోపిడీకి గురిచేస్తున్నాయో స్వయంగా చూసినవాడు. అతడు చదువుకున్న చదువు వల్ల, చదువుకునే రోజుల్లో నడిసిన  ఉద్యమాల వల్ల ప్రభావితుడై మనోజ్ దళితులపై ప్రేమను కలిగి ఉంటాడు. తాను పుట్టిన శూద్ర కులమే కాదు, అగ్ర వర్ణాలన్ని దళితులకు రుణపడే ఉన్నాయని, తాను దళితుల పక్షాన నిలబడి సాహిత్య కృషి చేయడం ద్వారా వారికి మేలు తలపెట్టాలని మనోజ్ భావిస్తాడు. "తాత మాటలు వింటూంటే నాకు ఆయాలు సాయాలు మాకు వట్టి బొక్కలు మీకన్న సామెత జ్ఞాపకం వచ్చింది. మనోజుకు మాల మాదిగల కోసం జీవితంలో ఏమన్నా చేయాలనిపించింది" (మల్లయ్య, కాలువ.2017:పుట.70).  అందుకే ఎత్తుగడలో శ్రీశ్రీ కవితను రచయిత ఎంచుకున్నాడు.

తెలంగాణ దేవదాసు నవల కూడా కవితాపంక్తులతోనే ప్రారంభమవుతుంది.

**"పల్లెకు పోదాం... రాజ్యలక్ష్మిని చూద్దాం**
**అల్లరి చేద్దాం చలో చలో...**
**పెళ్లికొప్పిద్దాం చలో చలో...**
**చిన్ననాడు కట్టుకున్న పిచ్చుకగూళ్లు**
**పేర్చుకున్న బతుకమ్మల గూర్చి**
**మాట్లాడుకుందాం చలో చలో...**
**పోట్లాడుకుందాం చలో చలో...** (మల్లయ్య, కాలువ.2011:పుట.1)

పై పంక్తుల్లో ఎత్తుగడ కవితాత్మకంగా ఉంది. రఘురాం ఈ నవలలో ప్రధాన పాత్రధారి. అతడు దొర కూతురైన రాజ్యలక్ష్మిని ప్రేమిస్తాడు. రఘురాం రాజ్యలక్ష్మిల ప్రేమ విషయం గురించి ఈ నవల చర్చించింది. కాబట్టి నవలారంభం కవితా పంక్తులతో రఘురాం పాత్ర ద్వారా ఎత్తుగడ రూపంలో రచయిత తెలియజేశాడు. రఘురాం పల్లెకు పోయి రాజ్యలక్ష్మిని పెళ్లికి ఒప్పించాలన్న ఉత్సాహంతో వస్తాడు.

'గువ్వలచెన్నా' నవల సూక్తితో ప్రారంభమవుతుంది. ఈ నవలను సూక్తితో ప్రారంభించడం రచయిత ఎత్తుగడగా భావించవచ్చు. "తల్లిందెత్తా పిల్లందెత్తా మల్లవొయ్యి మ్యానత్తందెత్తా ఎయ్ తల్లిందెత్తా పిల్లందెత్తా మల్లవొయ్యి మ్యానత్తందెత్తా చిర్రగోనాటలో గూతపడుతూ పరిగెత్తుతున్నాడు

శంకరయ్య. డొక్కలెగిసి పడ్తున్నాయి. ఇది చాలా సేపట్నుంచే జరుగుతుంది. అయినా ఆట పూర్తి కావడం లేదు. గమ్యస్థానం చేరుకోవడం లేదు" (మల్లయ్య, కాలువ.2005:పుట.1).

శంకరయ్య బాల్యంతో ప్రారంభమవ్వడంతో జీవితంలో ఆ పాత్ర ఎలా స్థిరపడిందో తెలియజేయడం కొరకే ఈ పాత్ర ద్వారా నవల ఆరంభమయినట్టు కనిపిస్తుంది. శంకరయ్య వృత్తి కులంలో పుట్టి ఆ వృత్తిలో తల్లిదండ్రులు పడుతున్న కష్టాలను చూసి బాగా చదువుకొని ఉన్నత స్థాయికి చేరుకున్నాడు. వృత్తి ద్వారా బతుకుదెరువు కష్టంగా ఉంటుందని ఈ పాత్ర తెలియజేస్తుంది. అందుకే ఈ నవలను శంకరయ్య పాత్రతోనే రచయిత ప్రారంభించాడు. శంకరయ్య పాత్ర దశ తిరిగింది కాబట్టే ఎత్తుగడలో ఆ పాత్రతో సూక్తులు చెప్పించాడు.

'భూమిపుత్రుడు' నవలలో కథ వాతావరణంతో ప్రారంభమవుతుంది. ఇంచుమించుగా వర్ణనతో కూడిన ప్రారంభమైనప్పటికీ, నవలలోని కథావస్తువుకు అనుగుణమైన వాతావరణాన్ని కల్పించిన నవలారంభాన్ని కాలువ మల్లయ్య ఎంతో నేర్పుగా రచించారు. "ఇంటి ముందున్న వాకిట్లో తాటికమ్మల పందిరి క్రింద నులక మంచంలో గొంగళేసుకొని వెల్లకిల్లా పడుకున్నాడు కొండ మల్లయ్య. గాలి స్తంభించిపోయి ఉంది... చెట్టుకొమ్మలు కూడా ఊగడం లేదు... విపరీతంగా ఉబ్బర పోస్తోంది. మరో దిక్కు జూయ్ మంటూ దోమలు సంగీతం పాడుతున్నాయి. దోమల సంగీతం భరించలేక కాళ్ళదిక్కున దుప్పటి తీసి చెవుల వరకు కప్పుకున్నాడు. మంచంలో అటూ ఇటూ దొర్లాడాడు... అర్థరాత్రి కావస్తున్నా ఎంతకు నిద్ర పట్టడం లేదు. లేచి కూర్చున్నాడు. మంచం క్రిందున్న కంచు చెంబులోని నీళ్లు తాగాడు. మళ్లీ పడుకున్నాడు. దగ్గర్లో ఉన్న పెంట బొందలోంచి గబ్బు వాసనొస్తోంది. తలగుడ్డ తీసి ముక్కుకడ్డం పెట్టుకున్నాడు. చొక్కాతో దోమలను పారద్రోలుతూ నిద్ర పోవడానికి సతమతమవుతున్నాడు. ఎంత ప్రయత్నించినా నిద్రరాక మెడ వరకు దుప్పటి కప్పుకున్నాడు. తలలో ఎన్నో ఆలోచనలు, గత జీవితం, తండ్రి, తన ఆర్థిక పరిస్థితి, పిల్లలు అంతా అతని కళ్ళ ముందు కదులుతున్నారు" (మల్లయ్య, కాలువ.2001:పుట.1).

'సాంబయ్య చదువు' నవలలో కథ సంప్రదాయ పద్ధతితో ప్రారంభమవుతుంది.

"అ, ఆ, ఇ, ఈ...

దిద్దు బాబూ దిద్దు... దిద్దమంటే దిద్దవేంది? దిద్దు దొరా? మంచోడు మా చిన్నదొర... మంచిగ చదువుకుంటడు..." (మల్లయ్య, కాలువ.2001:పుట.1).

'మాట్లాడే బొమ్మలు' నవలలో కథ సాధారణంగా సంప్రదాయ పద్ధతితో ప్రారంభమవుతుంది. "ఎమర్జెన్సీ రోజులు. దేశాన్నంధకారం అలుముకొని నెల రోజులు దాటింది.

ఎమర్జెన్సీ ప్రభావాన్ని చూపడం ప్రారంభమైంది. దీని ప్రభావం ఉత్తర భారతదేశంలో ఉన్నతంగా కాకున్నా దక్షిణ భారతదేశంలోనూ కొంతుంది. గరీబీ హటావో నినాదాలిచ్చిన ప్రభుత్వం ఢిల్లీలో గరీబుల గుడిసెలను నేలమట్టం చేయడానికి పునాది సిద్ధం చూసుకుంది. ఆంధ్రప్రదేశ్ లోనూ రాజకీయ నాయకులను, విద్యార్థులను అరెస్టు చేశారు. ప్రభుత్వ అధినాయకులను విమర్శించే వారిపై నిఘా ఉంది" అంటూ సంఘటనతో నవల ఆరంభం అవుతుంది" (మల్లయ్య, కాలువ.2001:పుట.1).

'బతుకుపుస్తకం' నవల సంప్రదాయ పద్ధతిలో సహజంగా ప్రారంభమవుతుంది. "దేశానికి స్వాతంత్ర్యం వచ్చి పుష్కర కాలం దాటింది. తెలంగాణలో నిరంకుశ ప్రభువు పోయి పుష్కర కాలమయింది. ఇరవైయవ శతాబ్ది ఏడవ దశాబ్దం ప్రారంభమైంది. స్వాతంత్ర్యానంతరం భారతదేశం రూపు దిద్దుకుంటుంది. ప్రణాళిక ఫలితాలు కొద్ది కొద్దిగా ప్రజలకందుతున్నాయి" (మల్లయ్య, కాలువ.2000:పుట.1).

'డబ్బు మైనస్ తృప్తి = దుఃఖం' నవలలో ప్రారంభం రచయిత నేరుగా కథనంతో ప్రారంభించిన తరువాత పాత్రల ద్వారా సంభాషణలు మొదలవుతాయి.

"దుఃఖం... దుఃఖం... దుఃఖం... మనిషి పుటకే ఏడ్పుతో ప్రారంభమవుతుంది. ప్రసూతి వేదనను భరించలేక తల్లి... పుట్టగానే శిశువు కెవ్వున కేక వేయక తప్పదు... ఎంత కాలం బతికినా పోయేటప్పుడు ఏడ్పే... ఈ రెండు ఏడ్పుల మధ్యదే జీవితం... లేదా బతుకు... అనంతమైన కాలంలో మనిషి బతికే కాలం చాలా స్వల్పం..." (మల్లయ్య, కాలువ.2002:పుట.1).

'గులాంగిరి చోడో' నవల ఆరంభంలో పల్లెలోని మురికివాడలో ఉన్న వాతావరణాన్ని వర్ణించాడు. మురికివాడ వర్ణనతో ప్రారంభమవుతుంది. "ఎనిమిది రోజుల్నుండి ఎడతెగకుండ వానపడ్తుంది. మూడు రోజుల్నుంచయితే రాలింది రాలినట్టే... గెరువిచ్చినట్టే ఇత్తుంది. మల్ల ఐదారు నిమిషాలల్లోనే వాన మొదలైతంది... రోజుల తరబడి వడ్తున్న తుంపురుతోని అంత ఇసుకుడిసుకుడింది... మాదిగ వాడయితే మరీ గలీజు గుంది. అంతా కస్పడం పిస్పడమోలుంది... ముందే మురికివాడలు వసతుల్లేనిండ్లు... ఇరుకుటాలు... దాంట్ల వాన..." (మల్లయ్య, కాలువ. 2019:పుట.1).

'మాదిగ విజయం' నవల పాత బాణీలో, సంప్రదాయ పద్ధతిలో ప్రారంభమవుతుంది.

"నిజాం పాలన కిందున్న తెలంగాణలో అదో ఊరు. ఆ ఊరు కరీంనగర్ జిల్లా కేంద్రానికి మూడామడల దూరంలో ఉంది. అన్ని ఊళ్లకు లాగానే ఆ ఊరికీ ఓ మాదిగ వాడుంది. అది ఊరి

బయటే ఉంది. మాదిగవాడ మధ్యలో బుచ్చయ్య ఇల్లుంది. వాకిట్లో పందిరి కింద కూచొని చెప్పులు కుడుతున్నాడు బుచ్చయ్య. ఇంకా అంబటి వేళ కాలేదు" (మల్లయ్య, కాలువ.2015:పుట.1).

'మంచియన్నది మాల అయితే..' నవలలో ఎడ్లు ఎలా ఉన్నాయో తెలియజేస్తూ ఎడ్లను వర్ణిస్తూ నవల ప్రారంభమయింది.

"ఎడ్లు పోయినయ్ సారు. నా ఎడ్లు పోయినయి. ఎసొంటెడ్లనుకున్నరు సారు. అవ్వల్దర్జగున్నెడ్లు. ఎత్తుకెత్తున్న ఆంబోతులసొంటెడ్లు. అవ్వతోడు సారు. నేనవద్దమాడుతలేను. యాడాది కిందనే సారు. లక్సెట్టిపేటంగట్లకు పోయి కొనుక్కచ్చిన... అయ్యతోడు సారు. గంగ దాటి పొయ్యి కొనుక్కచ్చిన వాట్ని. బండలకు బండలున్నయా ఎడ్లు" (మల్లయ్య, కాలువ.2014:పుట.1).

'మెతుకు పుస్తకం' నవల సన్నివేశంతో సహజంగానే నవల ప్రారంభమవుతుంది.

"నాన్న...! అమ్మా...! మనం రామగుండం పోయొద్దాం... ఓ సోషల్ సైంటిస్టులా నాకిప్పుడా ఊరును చూడాలనుకుంది... నా ఫెర్టిలైజర్ సిటీ" అన్నాడు శ్రీనివాస్ తల్లిదండ్రుల దిక్కు చూస్తూ..." (మల్లయ్య, కాలువ.2017:పుట.1).

'తపస్సు' నవల ప్రారంభం సహజంగానే ప్రారంభమవుతుంది. తెల్లవారు జామున ఉన్న వాతావరణాన్ని వర్ణిస్తూ నవల ప్రారంభమయింది. ప్రకృతి వర్ణన ఇది.

"టింగ్... టింగ్... టింగ్... టింగ్... టింగ్... ఉదయం ఆరుగంటలవుతుంది... తెల్లవారుతుంది. భలా భలా తెల్లవారుతుంది... కానీ ఒక్క పిచ్చుకా అరవడం లేదు... ఒక్క పక్షి కూత కూడా వినబడటం లేదు. కాకి అరుపులు అసలే లేవు... కోకిల అరుపులు అంత కంటే లేవు. రోడ్లపై మాత్రం ధ్వనులు... రకరకాల ధ్వనులు... పాలవాళ్ళ సైకిల్ గంటల మోతలు..." (మల్లయ్య, కాలువ.2017:పుట.1).

## 5.5. నవల ముగింపు:

'భూమిపుత్రుడు' నవలలోని ముగింపు విషాదాంతంగా ఉంటుంది. "ఓ కొడుకును పోలీసులు చంపింద్రు. ఇంకో కొడుకును బొగ్గు బావి బలి తీసుకుంది. కొడుకును బలి తీసుకున్న పనికే ఉన్నొక్క కొడుకును పంపుతనన్న, నేనూ ఊర్నిడిసిపోతున్న అంటూ తమ్ముని, ఇతర రక్త సంబంధీకులను, మిత్రులను కౌగిలించుకున్నాడు కొండ మల్లయ్య. కళ్ల వెంట పటపట నీళ్లు కారుతుండగా బస్సెక్కాడు. పుట్టి పెరిగిన ఊరును, అయిదు దశాబ్దాలకు పైగా జీవిస్తున్న నేలను, పీలుస్తున్న గాలిని వదిలి వెళ్లిపోతున్న ఆ రైతుబిడ్డ కడుపుల్లో అనంత శోకముంది".

"ఆ కుటుంబాన్ని ఊరు నుంచి దూరంగా తీసుకెళ్తూ బస్సు పరిగెడుతుంది" (మల్లయ్య, కాలువ.2001:పుట.124).

రైతు తన ఊరును, జీవిస్తున్న నేలను వదిలివెళ్లి పట్టణానికి బతుకుదెరువుకు వెళ్తున్నాడు. అతని దుఃఖంతో విషాదాంతంగా నవల ముగిసింది.

'సాంబయ్య చదువు' నవలను సహజంగా ముగించారు. ముగింపు వాక్యాలు చదువగానే నవల పూర్తయిందన్న భావన కలిగే విధంగా ఉంటాయి.

"వృద్ధుడైన చిలుకయ్య ఇంకా రెండు బక్కెడ్లతో ఒంటినాగలెవుసం చేస్తూనే ఉన్నాడు. రాజమ్మ పొలం పనులకెళ్తూనే ఉంది" (మల్లయ్య, కాలువ.2001:పుట.203) అంటూ సహజంగా ముగించారు.

'మాట్లాడే బొమ్మలు' నవల విషాదాంతంతో ముగుస్తుంది. కొడుకు కొరకు తల్లిదండ్రులు ఎదురుచూస్తూ బాధపడుతున్నారు. ఇది విషాదాంతమే.

"బాగా ఆలోచిస్తే ఇది శ్రీనివాస్ తప్పు మాత్రమే కాదనిపిస్తోంది? అందరిలాగే చేస్తున్నారని కాదు గాని ఈ విధానంలో ఏదో లోపముంది. ఈ చదువులు పరాయీకరణకు గురిచేస్తున్నాయి. మాట్లాడే బొమ్మలను తయారుచేస్తున్నాయి అయిలయ్య. రేపు నేను నీలాగే ఎదురు చూడాల్సి వస్తుందేమో?"

సాంబయ్య కంఠం పూడుకుపోయింది.

ఒకరి చేయిలో ఒకరు చేయి కలుపుకున్నారు వాళ్ళిద్దరు.

అర్ధరాత్రి దాటింది.

అయినా వాళ్ల నిరీక్షణ కొనసాగుతూ ఉంది. శ్రీనివాస్ వస్తాడో రాడో తెలియదు. వచ్చిన అయిలయ్యను అక్కున చేర్చుకుంటాడన్న నమ్మకం లేదు. అయినప్పటికీ ఊళ్ళో గలుమ దగ్గర కూచొని శాంతమ్మ, జిల్లా ప్రయాణ ప్రాంగణంలో కూచొని అయిలయ్య కొడుక్కోసం ఎదురుతెన్నులు చూస్తూనే ఉన్నారు" (మల్లయ్య, కాలువ.2001:పుట.327).

'బతుకుపుస్తకం' నవలలో కథను సహజంగా ముగించారు. ముగింపు వాక్యాలు చదువగానే నవల పూర్తయిందన్న భావన కలిగే విధంగా ఉంటుంది.

"అవును ఊరు బతుకుపుస్తకమే. బతుకు తెరువు పుస్తకం. దీన్ని గురించి ఎంత చదివిన తక్కువే" లేచి నిల్చుంటూ అన్నాడు రాజయ్య. వాళ్ళంతా మనస్ఫూర్తిగా నవ్వుకున్నారు".

“బస్సు కోసం ఊళ్ళోంచి నడుస్తున్న వాళ్ళందరి నాలుకల మీద ‘బతుకుపుస్తకం’ గురించి అక్షరాలే... ఆలోచనల్లోనూ అవే అక్షరాలు” (మల్లయ్య, కాలువ.2000:పుట.376).

‘తెలంగాణ దేవదాసు’ నవలలో ముగింపు సహజంగానే ఉంటుంది.

“రఘురాం గారు! మీరు రచయితవడానికి వెనుకున్న నేపథ్యమేంటి?”

“శ్రమైక జీవన సంస్కృతిని ప్రేమించే తత్వం రెడ్డిగారు”

“మరి మీరెందుకు రాస్తున్నారు?”

“శ్రమ జీవన సంస్కృతిని ఉన్నతీకరించడానికి” అన్నాడు లేచి నిల్చుంటూ రఘురాం (మల్లయ్య, కాలువ.2001:పుట.96).

‘డబ్బు మైనస్ తృప్తి = దుఃఖం’ నవల సుఖాంతంగా, సహజంగా ముగుస్తుంది.

“సుఖం = తృప్తి + సామాజికత;

సుఖం = డబ్బు + తృప్తి

ఎంత డబ్బున్నా తృప్తి లేకుంటే సుఖముండదు కదా...!” అందుకే డబ్బు మైనస్ తృప్తి = దుఃఖం అంటాడు సదానందం నవ్వుతూ.

“డబ్బు మైనస్ తృప్తి = దుఃఖం

అన్న మాటలనే మననం చేసుకుంటూ ఇంటి దిక్కు నడుస్తున్నాడు శివయ్య.

దాన్నే x (డబ్బు మైనస్ తృప్తి) = దుఃఖం

అంటే మరింత సరిగ్గా ఉంటుంది కదా అనుకుంటాడు” (మల్లయ్య, కాలువ.2002:పుట.96).

‘అస్పృశ్య కోయిల’ నవలలో ముగింపు ఆశాజనకంగా, సహజంగా ఉంటుంది.

“ఆమె ఇప్పుడు అస్పృశ్యకోయిల కాదు.

అణగారిన ప్రజల ఆశాజ్యోతి.

అణగారిన ప్రజల అధినాయకత్వాన్ని ముందుకు తెస్తున్న సమ్మక్క, సారక్కల వారసురాలు” (మల్లయ్య, కాలువ.2017:పుట.152).

‘గులాంగిరి చోడో’ నవలలో ముగింపు సహజంగానే ముగిసింది. కథ సుఖాంతం అవుతూ నవల ముగుస్తుంది.

“మూల జాతుల రాజ్యాధికార సాధన ఎజెండాతో ఓ పార్టీ రావలె. అందు కోసమే, దళిత రాజ్యాధికారం కోసమే నా జీవితాన్ని అంకితం చేస్తాను.

“నీల్ బనో ‘గులాంగిరి’ చోడో...

జై భోలో బి.ఆర్. అంబేద్కర్, పూలే...

లాల్ ఖిలాపై నీల్ జెండా లహరాయేంగే... లహరాయేంగే...

ఇవే నా నినాదాలు" అంటాడు రాజేష్..." (మల్లయ్య, కాలువ.2019:పుట.194).

'మాదిగ విజయం' నవలలో ముగింపు సహజంగానే ఉంటుంది. నవలలో కథ సుఖంగా, ఆనందంతో ఆనందరావు విజయంగా ముగుస్తుంది.

"వరుసకో వంద మంది చొప్పున పది వరసల్లో కూర్చున్నారు జనాలు... నలభై యాభై మంది యువకులు ఆసుగొట్టంలా అటూ ఇటూ తిరుగుతూ పదార్థాలను వడ్డిస్తున్నారు... మాట్లాడుకుంటూ, పరాచికాలాడుకుంటూ తృప్తిగా భోం చేస్తున్నారు... వాళ్ళంతా... కడుపు నిండా తిని బ్రేవ్ తీసేవరకు కొసరి కొసరి వడ్డించి వాళ్లతో తినిపిస్తున్నారు ఆనందరావు వాళ్ళు... (మల్లయ్య, కాలువ.2015:పుట.322).

'మంచియన్నది మాల అయితే..' నవల ముగింపు సహజంగా సాధారణంగా ఉంటుంది.

"మల్లొక్కసారి జెప్పుతున్న సారు! మంచియన్నది మాలమాదిగేనని, మా అసోంటి కష్టజీవులేనని యాదికుంచుకోండ్రి సారూ.

మంచంటె మాలే సార్.. మా అసోంటి పీడితులే సార్...

ఈ దేశపు మూలవాసులే సార్. గీ కతిన్నంకయిన మేమెసొంటోల్లమో తెలుసుకున్నరు గద సార్" (మల్లయ్య, కాలువ.2014:పుట.127).

'మెతుకు పుస్తకం' నవల ముగింపు సహజంగానే ఉంటుంది.

"ఆర్యులు మొదలుకొని అనేక విదేశీ దండయాత్రల నెదుర్కొన్న భారతీయ గ్రామం, నగరం తన దేశీయ వ్యావసాయక ప్రధాన స్వభావాన్ని కోల్పోలేదు. పారిశ్రామికీకరణను, వివిధ నాగరికతలను తనలో సంలీనం చేసుకుంది. ఇప్పుడు ప్రపంచీకరణ భూతంతో పెనుగులాడుతుంది. పాలక వర్గాలు, సామ్రాజ్యవాద, ప్రపంచీకరణ అనుకూల వైఖరి నవలంభించినా మెజారిటీ ప్రజలు ముఖ్యంగా భారతీయ పీడిత జాతుల ప్రజలు వీటిని ప్రతిఘటిస్తున్నారు. ఢీకొంటున్నారు. ఇప్పుడు దేశంలో తీవ్రమైన ప్రతిఘటన, చైతన్యం వెల్లివిరుస్తుంది. అందువల్ల గ్రామాలు బతుకు పుస్తకాలుగా, పట్టణాలు, కాలనీలు మెతుకు పుస్తకాలుగా మారే సమయం సమీపంలోనే ఉంది" అన్నాడు అరుణ్ కుమార్.

"అంటే...? మన 'తెలంగాణ పరువు నగరం...'?" అన్నాడు దివాకర్ రెడ్డి.

"ఇంకో మూడు నాలుగేండ్లలో వేలాది మందికి ఉపాధి కల్పించే 'మెతుకు పుస్తకం..." అన్నాడు అరుణ్ కుమార్ (మల్లయ్య, కాలువ.2017:పుట.227).

'గువ్వలచెన్నా' నవల ముగింపు సుఖాంతంగా ఉంటుంది.

" 'గువ్వలచెన్నా గువ్వలచెన్నా' పదే పదే తనలో తానే గొణుక్కుంటున్నట్టనుకుంటున్నాడు శంకరయ్య. ఎందుకో ఈ పదాలతని ఆందోళనకు కొంత ఉపశమనాన్ని కలిగిస్తున్నాయి" (మల్లయ్య, కాలువ.2005:పుట.119).

'తపస్సు' నవల ముగింపు సహజంగానే ఉంటుంది.

"రాత్రి తొమ్మిది గంటలవుతుంది... తన పదిహేను గంటల ఆలోచనాధార ఆగిపోయింది".

"భాషలో తిక్కన్న, ప్రజల ధ్యాసలో వేమన్న...".

"భాషలో గురజాడ. ప్రజాకవనంలో శ్రీశ్రీ".

"నా మార్గం అనితర సాధ్యం...".

"ఇంటి కెళ్ళే వరకు పది గంటలవుతుంది. ఆ తరువాత భోజనం... నిదుర... అంతే... అంతే..."

"పోతున్నాడు... పోతున్నాడు... తానంతటికి పోతున్నాడు... వార్ఘేష్ కార్లో ఇంటికి పోతున్నాడు" (మల్లయ్య, కాలువ.2017:పుట.165).

## 5.6. పాత్రోచిత భాష:

'అస్పృశ్య కోయిల' నవలలో ఎక్కువ పాత్రలు తెలంగాణలోని కరీంనగర్ జిల్లా స్థానికతను కలిగి ఉన్నాయి. కనుక ఆ పాత్రలన్నింటికి మాండలిక పదాల కలయికతో స్థానిక భాషను వినియోగించారు. మనోజ్ పాత్ర కరీంనగర్ ప్రాంతానికే చెందినదయినా చదువుకున్నవాడు కాబట్టి ఆ పాత్రకు మాత్రం శిష్ట వ్యవహారిక భాషను వాడారు. హైదరాబాదులోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన చర్చావేదికలో పాల్గొన్న వ్యక్తులకు శిష్ట వ్యవహారిక భాషనే వినియోగించారు.

'మాదిగ విజయం' నవలలో ఎక్కువ పాత్రలు కరీంనగర్ జిల్లా స్థానికతను కలిగి ఉన్నాయి. కనుక ఆ పాత్రలన్నింటికి స్థానిక భాషనే వినియోగించారు. ఆ ప్రాంతంలోని మాటల స్వరూపాన్ని యథాతథంగా వాడారు. ఆనందరావు, సోమయ్య పాత్రలు చదువుకొని ఉన్నత స్థితిలో ఉండటం వల్ల వారికి వ్యవహారిక భాషనే వాడారు. 'అస్పృశ్యతా మూలాలు' అనే అంశంపై చర్చాగోష్ఠి చేసినప్పుడు విశ్వవిద్యాలయాలకు చెందిన ఆచార్యులకు వ్యవహారిక భాషనే వాడారు. శ్రీకాంత్, ఆజాదుల ఆదర్శ వివాహ వేడుకకు హాజరైన మేధావులు వ్యవహారిక భాషనే వాడారు.

'మెతుకు పుస్తకం' నవలలోని ఎక్కువ పాత్రలకు కరీంనగర్ జిల్లా మాండలిక పదాలతో కూడిన స్థానిక భాషనే వాడారు. అరుణ్, భిక్షపతి, సారయ్య, చంద్రమౌళి, దివాకర్ రెడ్డి పాత్రలకు వ్యవహారిక భాషను వాడారు. వీరు ఫ్యాక్టరీలో ఉద్యోగులుగా ఉన్నారు కాబట్టి వ్యవహారికాన్ని వాడారు.

'భూమిపుత్రుడు' నవలలో రైతు అయిన కొండ మల్లయ్య, నర్సమ్మ మిగతా సహాయక పాత్రలకు కరీంనగర్ జిల్లా స్థానిక భాషనే వాడారు. ముఖ్యంగా తిరుపతయ్య, రాజయ్య పాత్రలు చదువుకొని తెలివిగలవారిగా ఉండటంతో ఆ పాత్రలకు వ్యవహారిక భాషను వాడారు.

'సాంబయ్య చదువు' నవలలో పాత్రోచిత సంభాషణ కనిపిస్తుంది. ఆ సంభాషణల్లో చక్కటి తెలంగాణ నుడికారం ప్రయోగించబడింది. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు మాట్లాడుకునే స్థానిక భాషను వాడుతూ ఆ భాషలోని నానుళ్లు, నుడికారాలు చక్కగా రచయిత వాడారు. సాంబయ్య పాత్రకు వ్యవహారిక భాషను వాడారు. సాంబయ్య చదువుకుంటూ జ్ఞానాన్ని కలగి ఉండటం వల్ల అతనికి వ్యవహారిక భాషను వాడారు. ఏ రచనకైనా పాత్రల సొంత భాష ఉండటమనేది సజీవ చిత్రణకు మిక్కిలి దోహదం చేస్తుంది.

'మాట్లాడే బొమ్మలు' నవలలో కూడా ఎక్కువగా కరీంనగర్ జిల్లా స్థానిక భాషనే వాడారు. సాంబయ్య చదువు నవలకు ఇది కొనసాగింపు కావడంతో ఇక్కడ సాంబయ్య పాత్రకు వ్యవహారిక భాషను వాడారు. ఈ నవలలో చక్కని పాత్రోచిత సంభాషణ కనిపిస్తుంది.

'గులాంగిరి చోడో' నవలలో పాత్రోచిత సంభాషణ కనిపిస్తుంది. ఈ నవలలో కరీంనగర్ జిల్లా స్థానిక భాషనే వాడారు. ఈ నవల సింహభాగం పాత్రలకు సొంత భాషనే వాడారు. మధునయ్య సార్, రాజేష్ పాత్రలకు వ్యవహారిక భాషను వాడారు. చాలా పాత్రల ద్వారా తెలంగాణ నుడికారాన్నే వారి సంభాషణల్లో వాడారు.

'మంచియన్నది మాల అయితే..' నవలలో మొత్తం పాత్రలకు కరీంనగర్ జిల్లా స్థానిక భాషను వినియోగించారు. చక్కటి పలుకుబళ్లు, నుడికారం ఉపయోగించి పాత్రలకు గ్రామాల్లోని సొంత భాషను ఉపయోగించారు. గ్రామీణ ప్రాంతంలో ప్రజలు మాట్లాడుకునే భాషనే ఆ పాత్రలకు వాడారు.

'తెలంగాణ దేవదాసు' నవలలో రఘురాం, రాజ్యలక్ష్మి, సునిత పాత్రలకు వ్యవహారిక భాషను వాడారు. దొర, పల్లెలోని కొన్ని సహాయక పాత్రలకు స్థానిక భాషనే వాడారు. ఎక్కువ భాగం వ్యవహారిక భాషలోనే ఉంది ఈ నవల.

'డబ్బు మైనస్ తృప్తి = దుఃఖం' నవలలో పాత్రోచిత సంభాషణ కనిపిస్తుంది. ఎక్కువగా ఈ నవలలో వ్యవహారిక భాషనే వాడారు. సుమిత్రమ్మ, మొండయ్య కొన్ని సహాయక పాత్రలకు మాత్రమే స్థానిక భాషను వాడారు.

'గువ్వలచెన్నా' నవలలో పాత్రలు సింహభాగం తెలంగాణలోని కరీంనగర్ జిల్లా స్థానికతను కలిగి ఉన్నాయి. కనుక ఆ పాత్రలన్నింటికి స్థానిక భాషనే వాడారు. శంకరయ్య ఉద్యోగి కావడం వల్ల అతనికి వ్యవహారిక భాషను వాడారు.

'బతుకు పుస్తకం' నవలలో ఎక్కువగా పాత్రలు ఉన్నాయి. సగం పాత్రలు ముఖ్యంగా ఊరిలో చదువుకోని వారికి స్థానిక భాషనే వాడారు. ఈ నవలలోని పాత్రలకు కరీంనగర్ జిల్లా స్థానిక భాషనే వాడారు. ఈ నవలలోని మొత్తం పాత్రలలో  సగం పాత్రలు వ్యవహారిక భాషలోను, సగం పాత్రలు స్థానిక భాషలో మాట్లాడిన కాని పాత్రోచిత సంభాషణ కనిపిస్తుంది.

'తపస్సు' నవలలో పాత్రలకు వ్యవహారిక భాషను వాడారు. ఈ నవల మొత్తం వ్యవహారిక భాషలోనే కొనసాగుతుంది.

కాలువ మల్లయ్య నవలల్లో పాత్రోచిత సంభాషణ కనిపిస్తుంది. సంభాషణల్లో చక్కటి నుడికారం, పలుకుబళ్లు మొదలైనవి ఉంటాయి. ఎక్కువగా కరీంనగర్ జిల్లా మాండలికాన్ని వాడుతూ స్థానిక భాష ద్వారానే పాత్రలకు జీవం పోశారు. ఇప్పటికే చాలావరకు జన వ్యవహారంలో నుండి తొలగిపోతున్న కొన్ని పదాలకు కొన ఊపిరి పోసి ఆ పదాలకు జీవం పోశారు. మాండలిక పదాలు పాత్రోచితంగా సంభాషణకు వాడటం వల్ల స్థానిక భాష నశించిపోకుండా కాపాడేందుకు కొంత ప్రయత్నం చేశాడు కాలువ మల్లయ్య. తెలంగాణ మాండలికంలోనే ఎక్కువగా నవలలు రచించారు. కాలువ మల్లయ్య చదువుకున్న పాత్రలకు మాత్రమే వ్యవహారిక భాషను వాడారు. కరీంనగర్ మాండలికాన్ని ఎక్కువగా నవలల్లో ఉపయోగించారు. కాలువ మల్లయ్య మాండలికానికి సాహిత్యంలో గౌరవాన్ని తీసుకురావాలని పాత్రలకు మాండలిక భాషను ఉపయోగించి మాండలిక పదజాలాన్ని సాహిత్యంలోకి ప్రవేశించేటట్లు చేశాడు. కాలువ మల్లయ్య గ్రామాల్లో ఉండే కార్మిక, వృత్తి, వివిధ రకాలైన పనులు చేసేవారి భాషను సాహిత్యంలోకి ప్రవేశపెట్టాడు. కొందరికి మాండలిక పదాలు అర్థం కావు అప్పుడు మాండలిక పదకోశాన్ని దగ్గర పెట్టుకొని చదవాలి అప్పుడే ఆ నవలలకు సహజత్వం వస్తుంది.

## 5.7. దృష్టికోణం:

నవలా కథనంలో దృష్టి కోణానిది మౌలిక పాత్ర. కథను ఏయే పద్ధతుల్లో నడిపించాలనే విషయంతోపాటు కథను ఎవరు చెప్పాలనేది కూడా ప్రధానమైనదే. సాధారణంగా నవలలు సర్వసాక్షి దృష్టికోణం, ఉత్తమ పురుష దృష్టికోణం, ప్రధమ పురుష దృష్టికోణం, నాటకీయ దృష్టికోణాలలో రాస్తుంటారు. నవలలోని వస్తువే నవలా రూపాన్ని ఎన్నుకున్నట్లు, మళ్లీ అదే దృష్టికోణాన్ని కూడా ఎన్నుకుంటుంది.

భూమిపుత్రుడు, సాంబయ్య చదువు, మాట్లాడే బొమ్మలు, బతుకుపుస్తకం, మెతుకు పుస్తకం, మాదిగ విజయం, గువ్వలచెన్నా, గులాంగిరి చోడో, తెలంగాణ దేవదాసు, డబ్బు–తృప్తి = దుఃఖం నవలలు ప్రధమ పురుష దృష్టికోణంలో రాయబడ్డాయి. ఈ నవలల్లో పాత్రల ప్రాముఖ్యాన్ని బట్టి ఆయా సందర్భాలలో  ఆయా పాత్రల మనస్సులలోకి రచయిత ప్రవేశించి కథను నడిపిస్తాడు. దీనివల్ల వ్యక్తుల స్వభావాలు, కథా పరిణామం, వ్యక్తుల పరస్పర సంబంధాలు కథా ప్రారంభం నుండి సూచనప్రాయంగా ప్రకటితమవుతాయి.

అస్పృశ్య కోయిల, తపస్సు, మంచియన్నది మాల అయితే.. నవలలు ఉత్తమ పురుష దృష్టికోణంలో రాయబడ్డాయి. ఉత్తమ పురుష దృష్టికోణాన్నే స్వీయ కథనం అని కూడా అంటారు. ఇందులో కొన్ని వైవిధ్యాలతో రచన చేయడానికి అవకాశం ఉంది. 'అస్పృశ్య కోయిల' నవలలో మనోజ్ అనే వ్యక్తి కోకిలమ్మ కథను చెప్పుతాడు. మనోజ్ అనే వ్యక్తి తన కథను కాకుండా మరొక వ్యక్తి కోకిలమ్మ కథను చెప్పాడు. ఇది స్వీయకథన పద్ధతిలో ఒక భాగం. 'తపస్సు' నవలలో మహేష్ పాఠకుడికి తన కథ చెప్పే పద్ధతి మరొక రకం అని చెప్పవచ్చు. 'మంచియన్నది మాల అయితే..' నవలలో కొండయ్య తన కథను పాఠకుడికి చెప్పుతాడు. కాబట్టి దృష్టికోణం విషయంలో ఈ నవలలు ఔచిత్యాన్ని పాటించాయి.

మాండలిక పరంగా పరిశీలిస్తే తెలంగాణ పల్లెల స్వచ్ఛమైన మాండలిక పదాలతో కాలువ మల్లయ్య నవలలు జీవం పోసుకున్నాయి. ఈ మాండలిక పదజాలం తెలంగాణ ప్రాంతపు గ్రామీణ సంస్కృతికి దర్పణం పట్టినట్లు అనిపిస్తుంది. కాలువ మల్లయ్య రచనకు ఊపిరి తెలంగాణ మాండలిక భాష. తెలంగాణ నుడికారానికి ఒక సవ్వడి, డప్పు మోగినట్టు, అందెలు గలగలాడినట్టు అదొక జీవన సవ్వడి.

## 5.8. మాండలికాలు:

భాషకు మార్పు సహజం. మారుతున్న కాలాన్ని బట్టి భాషలో మార్పు వస్తుంది. ప్రజల వ్యవహారంలో నియమ నిబంధనలు లేని సులభమైన సువ్యక్తమైన వాగ్రూప వ్యవహార లక్షణం కలిగించేదే మాండలిక భాష. మండలం సంబంధమైంది మాండలికం. ఒకే భాషకు చెందిన భిన్న భిన్న ప్రాంతాల్లోని భేదాన్ని మాండలికాలుగా పిలుస్తారు. ఒకే భాషకు ప్రజల వ్యవహారంలోనూ, పదాల్లోనూ, వాటి ఉచ్చారణలోనూ, ప్రత్యయాల్లోనూ, పదాల అర్థాల్లోనూ, వ్యాకరణంలోనూ, వాక్య రచనలోనూ భేదాలు ఉంటాయి. ఒకే భాషకు ఉన్న ఇలాంటి భేదాల్ని 'మాండలికాలు' అని అంటారు.

"ఒకే భాషకు ప్రజల వ్యవహారంలో పదాలలోనూ, వాటి యొక్క ఉచ్చారణలోనూ, ప్రత్యయాలలోనూ, పదాల అర్థాలలోనూ, భేదాలు ఉండి ఆ భాషలో రకాలు ఉంటాయి. ఒకే భాషకు ఉన్నటువంటి రకాలని 'మాండలికాలు' (Dialects) అని అంటారు" (సుబ్రహ్మణ్యం, పి.యస్. 1997:పుట.174).

కాలువ మల్లయ్య నవలలు కొన్ని వ్యవహారిక భాషలోను మరికొన్ని మాండలిక భాషలోను ఉన్నాయి. తెలంగాణ మాండలిక భాషా పదాలు మరీ ముఖ్యంగా కరీంనగర్ జిల్లా ప్రజల వాడుక పదాలు ఎక్కువగా ఉన్నాయి. మాండలిక పదాలకు అర్థాలను 'తెలంగాణ పదకోశం' నుండి గ్రహించాను. కాలువ మల్లయ్య నవలల్లో ఉన్న మాండలికాలను కింద పొందుపరుస్తున్నాను.

| క్రమ సంఖ్య | మాండలిక పదం | అర్థం | పుస్తకం పేరు | పుట సంఖ్య |
|---|---|---|---|---|
| 1 | బొంద | సమాధి, గుంత | భూమిపుత్రుడు | 13 |
| 2 | వాకిలి | ఇంటి ముందరి భాగం | భూమిపుత్రుడు | 13 |
| 3 | పెండ | పేడ | భూమిపుత్రుడు | 14 |
| 4 | ధోవతి | పంచె | భూమిపుత్రుడు | 14 |
| 5 | ఆపారమంగీ | నిలువు చొక్కా,<br>హాఫ్ షర్ట్ | భూమిపుత్రుడు | 14 |
| 6 | గుమ్మి | వడ్లను నిలువచేసే స్థలం | భూమిపుత్రుడు | 14 |
| 7 | పాలె | నాగలి భాగం | భూమిపుత్రుడు | 16 |
| 8 | సంబురం | ఆనందం | భూమిపుత్రుడు | 19 |

| | | | | |
|---|---|---|---|---|
| 9 | కళ్లం | పొలంలో ధాన్యాన్ని ఉంచే భాగం | భూమిపుత్రుడు | 22 |
| 10 | పరాశికం | హాస్యం | భూమిపుత్రుడు | 23 |
| 11 | బాకీ | అప్పు | భూమిపుత్రుడు | 27 |
| 12 | కుంచం | ఎనిమిది తవ్వలు | భూమిపుత్రుడు | 27 |
| 13 | చేద బొక్కెన | నీళ్లను తోడే వస్తువు | భూమిపుత్రుడు | 31 |
| 14 | సోపతికాల్లు | స్నేహితులు | భూమిపుత్రుడు | 32 |
| 15 | ఇయ్యాల | ఈరోజు | భూమిపుత్రుడు | 34 |
| 16 | పీసుకం | పిసినారితనం | భూమిపుత్రుడు | 37 |
| 17 | కైకిలి | కూలి | భూమిపుత్రుడు | 37 |
| 18 | లగ్గం | పెళ్లి | భూమిపుత్రుడు | 38 |
| 19 | కారటు | కార్డు (Postcard) | భూమిపుత్రుడు | 42 |
| 20 | బింకెడు | కొన్ని | భూమిపుత్రుడు | 55 |
| 21 | మునుపు | పూర్వం, గతం | భూమిపుత్రుడు | 57 |
| 22 | పాలుకు | కౌలుకు | భూమిపుత్రుడు | 72 |
| 23 | పగటీలి | పగలు | భూమిపుత్రుడు | 77 |
| 24 | గాసం | ధాన్యం | భూమిపుత్రుడు | 77 |
| 25 | ఒరగడం | వాల్చడం | భూమిపుత్రుడు | 82 |
| 26 | ఆడ్తి | వ్యవసాయ మార్కెట్ | భూమిపుత్రుడు | 85 |
| 27 | ఎవుసం | వ్యవసాయం | భూమిపుత్రుడు | 85 |
| 28 | భూమి తనాఖా | భూమి శిస్తు | భూమిపుత్రుడు | 89 |
| 29 | మోపులు | మూటలు, గడ్డి మొదలైన వాటి కట్టలు | భూమిపుత్రుడు | 103 |
| 30 | బీటికి | వ్యవసాయ మార్కెటుకి | భూమిపుత్రుడు | 105 |
| 31 | జోకుట | తూచుట | భూమిపుత్రుడు | 109 |
| 32 | తూకం | కొలత | భూమిపుత్రుడు | 109 |
| 33 | రంకుల పోరడు | గడుచు పిల్లవాడు | భూమిపుత్రుడు | 113 |
| 34 | మాగికాలం | చలికాలం | భూమిపుత్రుడు | 114 |

| | | | | |
|---|---|---|---|---|
| 35 | పాశెం | పాయసం | భూమిపుత్రుడు | 117 |
| 36 | కానిగిరి పంతులు | ప్రైవేట్ పాఠశాల ఉపాధ్యాయుడు | బతుకు పుస్తకం | 3 |
| 37 | గరిసె | వ్యవసాయ పనిముట్లను నిలువ ఉంచే గది | బతుకు పుస్తకం | 20 |
| 38 | బీడు | ఖాళీ స్థలం | బతుకు పుస్తకం | 20 |
| 39 | యాది | గుర్తు | బతుకు పుస్తకం | 22 |
| 40 | బొక్కెన | చేద | బతుకు పుస్తకం | 22 |
| 41 | కంచం | పల్లెం (Plate) | బతుకు పుస్తకం | 25 |
| 42 | చుట్టం | బంధువు | బతుకు పుస్తకం | 26 |
| 43 | తేపకోసారి | వెంటవెంటనే | బతుకు పుస్తకం | 35 |
| 44 | మనూల్లె | మన ఊరిలో | బతుకు పుస్తకం | 44 |
| 45 | కలికుండ | కుండలో పులిసిన గంజి | బతుకు పుస్తకం | 44 |
| 46 | పొరుగూరు | చుట్టు ప్రక్కల ఉన్న ఊరు | బతుకు పుస్తకం | 56 |
| 47 | పొక్కిలి | నేల గుంతలుగా మారడం | బతుకు పుస్తకం | 61 |
| 48 | ఈయేడు | ఈ సంవత్సరం | బతుకు పుస్తకం | 76 |
| 49 | మత్తడి | అలుగు పారడం | బతుకు పుస్తకం | 80 |
| 50 | చేపాలుకు | ఆదాయంలో ఆరవ భాగం | బతుకు పుస్తకం | 89 |
| 51 | కందీ | లాంతర వెలుగు | బతుకు పుస్తకం | 215 |
| 52 | మునుపు | గతం, పూర్వం | బతుకు పుస్తకం | 365 |
| 53 | ముత్తెమంతసేపు | కొంచెం సమయం | గువ్వలచెన్నా | 20 |
| 54 | తవ్వెడు | కొలమానం, కొలత | గువ్వలచెన్నా | 39 |
| 55 | శంభట్కు పోవడం | మల విసర్జనకు బహిరంగ ప్రదేశానికి వెళ్లడం | గులాంగిరి చోడో | 1 |
| 56 | పిడుకల కుచ్చె | పిడకల రాశి | గులాంగిరి చోడో | 1 |
| 57 | బువ్వ | ఆహారం, అన్నం | గులాంగిరి చోడో | 2 |
| 58 | ముసురు | విరామం లేకుండా వస్తుండటం | గులాంగిరి చోడో | 5 |
| 59 | ఎల్లెలుకల | బోర్లా, వెల్లకిలా | గులాంగిరి చోడో | 11 |

| | | | | |
|---|---|---|---|---|
| 60 | మబ్బులేసి | ఉదయాన్నే లేసి | గులాంగిరి చోడో | 15 |
| 61 | పొల్లగాండ్లు | పిల్లలు | గులాంగిరి చోడో | 17 |
| 62 | పెండకల్లు | పేడముద్దలు | గులాంగిరి చోడో | 32 |
| 63 | అంబలి | ఒక రకమైన జావ | గులాంగిరి చోడో | 24 |
| 64 | పిరెం | ధర ఎక్కువ, విలువగల | గులాంగిరి చోడో | 42 |
| 65 | కాంట | పిన్నీసు | గులాంగిరి చోడో | 44 |
| 66 | అటెనుక | ఆ తరువాత | గులాంగిరి చోడో | 47 |
| 67 | రంధి | బాధ, విచారం | గులాంగిరి చోడో | 111 |
| 68 | మకామెత్తేసిందు | పారిపోయాడు | గులాంగిరి చోడో | 122 |
| 69 | టేల | కిళ్లిబడ్డి, షాపు | గులాంగిరి చోడో | 122 |
| 70 | మస్తు | చాలా | గులాంగిరి చోడో | 130 |
| 71 | అగ్గువ | తక్కువ | గులాంగిరి చోడో | 136 |
| 72 | ఇన్నూరు | రెండు వందలు | గులాంగిరి చోడో | 141 |
| 73 | కిరికిరిగాల్లు | గొడవ పెట్టేవారు | గులాంగిరి చోడో | 146 |
| 74 | ఉంగుటాలు | చెప్పు ఉంగుటం | గులాంగిరి చోడో | 146 |
| 75 | కొట్టం | పశువుల పాక | మంచియన్న మాల అయితే.. | 1 |
| 76 | ఖాయిస్ | సొంతం, స్వయాన | మంచియన్న మాల అయితే.. | 13 |
| 77 | తిప్పలవడి | బాధపడి | మంచియన్న మాల అయితే.. | 19 |
| 78 | కచ్చీరు | కార్యాలయం, రచ్చబండ | మంచియన్న మాల అయితే.. | 35 |
| 79 | పబ్బతి | చేతులు జోడించడం | మంచియన్న మాల అయితే.. | 69 |
| 80 | గులుగవట్టిందు | నస పెట్టడం, గొణగడం | మంచియన్న మాల అయితే.. | 84 |
| 81 | యాటలు | మేకలు, గొర్రెలు | తెలంగాణ దేవదాసు | 6 |
| 82 | గడీ | కోట | తెలంగాణ దేవదాసు | 6 |
| 83 | ఏదో వంకపెట్టి | ఏదో ఒక లోపం, దోషం | తెలంగాణ దేవదాసు | 13 |
| 84 | పొద్దుగూకంగనే | సాయంత్రం | తెలంగాణ దేవదాసు | 18 |
| 85 | పాటకులు | గేట్లు | తెలంగాణ దేవదాసు | 26 |
| 86 | దబాయింపు | హడలుఎత్తు | దబ్బు–తృప్తి=దుఃఖం | 41 |

| | | | | |
|---|---|---|---|---|
| 87 | తొలిచూలు | మొదటిసారి | డబ్బు–తృప్తి=దుఃఖం | 44 |
| 88 | గొడ్లు | పశువులు | అస్పృశ్యకోయిల | 14 |
| 89 | అంగీ | చొక్కా | అస్పృశ్యకోయిల | 16 |
| 90 | ఇజ్జత్ | గౌరవం, పరువు | అస్పృశ్యకోయిల | 18 |
| 91 | పోరి | పిల్ల, అమ్మాయి | అస్పృశ్యకోయిల | 25 |
| 92 | ఇచ్చంతురగం | కొత్తగా | అస్పృశ్యకోయిల | 2 |
| 93 | కొసెల్ల | ఆసాంతం, చివరి వరకు | అస్పృశ్యకోయిల | 29 |
| 94 | తాపకింత | కొద్దికొద్దిగా | అస్పృశ్యకోయిల | 77 |
| 95 | శనార్తి | నమస్కారం | అస్పృశ్యకోయిల | 77 |
| 96 | గడుక (బువ్వ) | ఆహారం | అస్పృశ్యకోయిల | 79 |
| 97 | దొరల జులుం | దొరల దౌర్జన్యం | అస్పృశ్యకోయిల | 114 |
| 98 | తూము | ఎనిమిది కుంచాలు | అస్పృశ్యకోయిల | 125 |
| 99 | మారాం | గారాబం | అస్పృశ్యకోయిల | 79 |
| 100 | తలుగులు | పలుపులు | అస్పృశ్యకోయిల | 23 |
| 101 | డొక్క | కడుపు | అస్పృశ్యకోయిల | 65 |
| 102 | ఉసురు | ప్రాణం | మెతుకు పుస్తకం | 4 |
| 103 | చెపరాశి | అటెండర్ | మెతుకు పుస్తకం | 16 |
| 104 | బొత్త | గుండి | మెతుకు పుస్తకం | 55 |
| 105 | తలపాగా | రుమాలు | మాదిగ విజయం | 1 |
| 106 | ఓపారోపారి | ఒక్కసారి | మాదిగ విజయం | 5 |
| 107 | పురుసత్ | విశ్రాంతి | మాదిగ విజయం | 16 |
| 108 | ధాతు | నాడీ | మాదిగ విజయం | 21 |
| 109 | గుడాలు | గుగ్గిళ్లు | మాదిగ విజయం | 21 |
| 110 | ఇంకింత ఉప్పు | కొద్దిగా ఉప్పు | మాదిగ విజయం | 35 |
| 111 | బందెల దొడ్డి | పశువులను బంధించే స్థలం | మాదిగ విజయం | 104 |
| 112 | గబ్బు | కంపు వాసన | మాదిగ విజయం | 165 |
| 113 | జాడ | ఆనవాలు | మాదిగ విజయం | 225 |

## 5.9. ధ్వన్యనుకరణ పదాలు :

భాషలోని కొన్ని పదాలు శబ్దాలు, ధ్వనిని బట్టి ఏర్పడతాయి. అలాంటి పదాలను ధ్వన్యనుకరణ పదాలు అంటారు. ఒక క్రియను స్పష్టంగా చెప్పదలచిన వాటిల్లో ధ్వన్యనుకరణ శబ్దాలని గ్రహించాలి. ధ్వన్యనుకరణ శబ్దాలు సందర్భానుగుణంగా శాబ్దికంగానూ, అర్థవంతంగానూ ఉండి చదివే వారికి ఆసక్తిని కలిగిస్తూ, భాషకు నిండుదనాన్ని కలిగించడానికి సహాయకారిగా ఉంటాయి. కాలువ మల్లయ్య నవలలో వాడిన ధ్వన్యనుకరణ పదాలను క్రింద పొందుపరుస్తున్నాను.

| క్రమ సంఖ్య | ధ్వన్యనుకరణ పదాలు | నవల పేరు | పుట సంఖ్య |
|---|---|---|---|
| 1 | సుయ్ సుయ్ | భూమిపుత్రుడు | 20 |
| 2 | గబగబా | భూమిపుత్రుడు | 31 |
| 3 | కావ్ కావ్ | భూమిపుత్రుడు | 21 |
| 4 | గలగలా | భూమిపుత్రుడు | 36 |
| 5 | లొటలొట | భూమిపుత్రుడు | 137 |
| 6 | జుమ్ జుమ్ | గులాంగిరి చోడో | 1 |
| 7 | ఖళ్ ఖళ్ | గులాంగిరి చోడో | 1 |
| 8 | గజ్జగజ్జ | గులాంగిరి చోడో | 18 |
| 9 | పటపట | గులాంగిరి చోడో | 116 |
| 10 | చుర్ చుర్ | గులాంగిరి చోడో | 144 |
| 11 | కిచ్ కిచ్ | గులాంగిరి చోడో | 145 |
| 12 | బుయ్ బుయ్ | గులాంగిరి చోడో | 156 |
| 13 | కిలకిల | తెలంగాణ దేవదాసు | 23 |
| 14 | విలవిల | డబ్బు–తృప్తి = దుఃఖం | 20 |
| 15 | లబోదిబో | అస్పృశ్య కోయిల | 20 |
| 16 | లబలబ | అస్పృశ్య కోయిల | 27 |
| 17 | గొడగొడ | అస్పృశ్య కోయిల | 30 |
| 18 | బరబర | అస్పృశ్య కోయిల | 42 |

| | | | |
|---|---|---|---|
| 19 | కుయ్ కుయ్ | అస్పృశ్య కోయిల | 51 |
| 20 | తుకతుక | మాదిగ విజయం | 27 |
| 21 | భగభగ | మాదిగ విజయం | 39 |
| 22 | తుక్కు తుక్కు | మాదిగ విజయం | 96 |

## 5.10. జంటపదాలు:

పరస్పర సన్నిహిత సంబంధం గల పదాలు జంటపదాలు. జంటపదాలు భాషకు సహజత్వాన్ని కలిగిస్తాయి. కాలువ మల్లయ్య నవలల్లో ఉన్న జంటపదాలను కింద పొందుపరుస్తున్నాను.

| క్రమ సంఖ్య | జంటపదాలు | పుస్తకం పేరు | పుట సంఖ్య |
|---|---|---|---|
| 1 | కూలినాలి | భూమిపుత్రుడు | 13 |
| 2 | చిలుకాగోరింక | భూమిపుత్రుడు | 16 |
| 3 | కల్లో గంజో | భూమిపుత్రుడు | 17 |
| 4 | ఆరునూరైనా | భూమిపుత్రుడు | 31 |
| 5 | తర్జన భర్జన | భూమిపుత్రుడు | 33 |
| 6 | అంటుసొంటు | భూమిపుత్రుడు | 102 |
| 7 | దుమ్ముధూళి | సాంబయ్య చదువు | 176 |
| 8 | రాత్రింబవళ్ళు | సాంబయ్య చదువు | 202 |
| 9 | రేపోమాపో | మాట్లాడే బొమ్మలు | 239 |
| 10 | ఎదుగూ బొదుగూ | బతుకు పుస్తకం | 140 |
| 11 | గజ్జిరి బిజ్జిరి | గులాంగిరి చోడో | 1 |
| 12 | సంబురమో గింబురమో | గులాంగిరి చోడో | 22 |
| 13 | గజిబిజి | గులాంగిరి చోడో | 101 |
| 14 | కారాలు మీరాలు | గులాంగిరి చోడో | 103 |
| 15 | తల్లిదండ్రులు | గులాంగిరి చోడో | 129 |
| 16 | మంచో చెడో | గులాంగిరి చోడో | 136 |
| 17 | మన్ను మసానం | గులాంగిరి చోడో | 160 |

| | | | |
|---|---|---|---|
| 18 | గడిబిడి | మంచియన్నది మాల అయితే... | 76 |
| 19 | అక్కాతమ్ముళ్ళు | డబ్బు–తృప్తి= దుఃఖం | 12 |
| 20 | ముట్టుడు గిట్టుడు | అస్పృశ్యకోయిల | 50 |
| 21 | అణిగిమణిగి | అస్పృశ్యకోయిల | 20 |
| 22 | సూటుబూటు | అస్పృశ్యకోయిల | 118 |
| 23 | నయానాభయానా | అస్పృశ్యకోయిల | 124 |
| 24 | పెళ్లిపెటాకులు | అస్పృశ్యకోయిల | 37 |
| 25 | కలగాబులగం | అస్పృశ్యకోయిల | 15 |
| 26 | రాత్రనక పగలనక | మెతుకుపుస్తకం | 64 |
| 27 | ఎండనక వాననక | మెతుకుపుస్తకం | 64 |
| 28 | అలాయి బలాయి | మెతుకుపుస్తకం | 159 |
| 29 | సదువు శాత్రం | మాదిగ విజయం | 5 |
| 30 | బువ్వాకూర | మాదిగ విజయం | 36 |

## 5.11. సామెతలు:

సామెతను ఆంగ్లంలో 'Proverb' అంటారు. సామెత అనే పదానికి నానుడి, సుద్దులు, ముచ్చట, శాస్త్రం అనే మాటలు తెలుగులో వాడుకలో ఉన్నాయి. సామెత అనే పదం సామ్యతకు తద్భవమని పెక్కు పండితుల అభిప్రాయం. ప్రజలు పోలికలు చెప్పకుండా కొన్ని విషయాలు మాట్లాడలేరు. వారు చెప్పదలుచుకున్న విషయంలో ఉన్న ప్రాధాన్యత దృష్ట్యా శ్రోతపై గాఢమైన ముద్ర వేయాలనే తపన వల్ల సామెతలను ప్రయోగిస్తారు. ఈ ప్రక్రియ చాలా సహజంగా, యాదృచ్ఛికంగా జరుగుతుంది. సామెతల్లో సంక్షిప్తత, ఉపదేశాత్మకత, ప్రాసనియమాలు మొదలైన లక్షణాలు ఉంటాయి. "ప్రజా జీవతానుభవాలలో నుంచి ఉద్భవించినవి సామెతలు. వాటికి ప్రజలే రచయితలు. సామెత లేకుండా సామాన్య ప్రజలు కాని, మహా విద్వాంసులు కాని మాట్లాడలేరు, రాయలేరు" అని దాశరథి రంగాచార్యులు గారు "తెలుగు సామెతలు – సాంఘిక జీవితం" అనే గ్రంథానికి రాసిన ముందుమాటలో పేర్కొన్నారు (తులజ, పుట్టపర్తి.1985:పుట.iii).

సామెతలను నవల ప్రక్రియలో చాలామంది రచయితలు ఉపయోగించారు. ముఖ్యంగా మన గ్రామీణ వాతావరణం, గ్రామీణ అలవాట్లు, సాధకబాధకాలు మొదలైనవి సామెతలలో నిండుగా ఉన్నాయి. ఏ రచయిత అయితే తన రచనా విధానంలో సామెతలను, జాతీయాలను ప్రయోగించి

రచన చేస్తాడో, ఆ రచయిత రచనలు రమ్యంగా ఆకర్షణీయంగా ఉండి పాఠకులపై మంచి ప్రభావాన్ని కలిగి ఆదరణను పొందే అవకాశం ఉంటుంది. ఎందుకంటే చెప్పదలుచుకున్న మాటకు సామెతలు, జాతీయాలు భాషకి మంచి అలంకారనిస్తాయి.

కాలువ మల్లయ్యగారు నవలల్లో సామాన్య ప్రజలు వాడే ఉపయోగించే సామెతలను ప్రయోగించారు. కాలువ మల్లయ్య నిజ జీవిత అనుభవాల నుండే వచ్చిన సామెతలను ఉపయోగించారు. ఈ సామెతలు కాలువ మల్లయ్య నవలలకు నిండుదనాన్ని కలిగించి పాఠకులను ఆనందించేటట్లు చేశాయి. కాలువ మల్లయ్య నవలల్లో ఉపయోగించిన సామెతలను కింద పొందుపరుస్తున్నాను.

| క్రమ సంఖ్య | సామెతలు | నవల పేరు మరియు పుట సంఖ్య |
|---|---|---|
| 1 | ముడ్డినాది గాకుంటె పట్నందాక దేకమన్నడుట నీ అసుంటోడు | భూమిపుత్రుడు:పుట.37 |
| 2 | మోసెటోనికెరుక కావడి బరువు | భూమిపుత్రుడు:పుట.37 |
| 3 | పిలిచి పిల్లనిస్తానంటే కులం తక్కువట | భూమిపుత్రుడు:పుట.44 |
| 4 | ఓ ఊరి పోలీసు పటేలు ఇంకో ఊరు సుంకరోనితోని సమానమట | సాంబయ్య చదువు:పుట.130 |
| 5 | ఉట్టికెక్కలేనమ్మ స్వర్గానికెక్కుతనన్నదట | సాంబయ్య చదువు:పుట.143 |
| 6 | కులం చెడినా సుఖం దక్కాలనట్టు | సాంబయ్య చదువు:పుట.154 |
| 7 | ఎక్కడున్న గొంగళి అక్కడే వేసినట్టు | మాట్లాడే బొమ్మలు:పుట.235 |
| 8 | ఆలూ లేదు చూలూ లేదు అల్లుని పేరు సోమలింగమన్నట్టు | మాట్లాడే బొమ్మలు:పుట.251 |
| 9 | ఊరికి చేసిన ఉపకారం పీనుక్కు చేసిన శింగారమే అన్నట్టయింది | మాట్లాడే బొమ్మలు:పుట.264 |
| 10 | చిత్తం శివుని మీద మనసు చెప్పుల మీదున్నట్టు | మాట్లాడే బొమ్మలు:పుట.290 |
| 11 | పొట్టతిప్పలకు జెరిపోతులాట | బతుకు పుస్తకం:పుట.9 |
| 12 | చదువేత్తె ఉన్న మతి పోయిందన్నట్టు | బతుకు పుస్తకం:పుట.12 |
| 13 | ముందే ముక్కిడంటె అందులో దగ్గు | బతుకు పుస్తకం:పుట.12 |

| | | |
|---|---|---|
| | పడిశమన్నట్టు | |
| 14 | నవ్విన నాపచేనే పండుతుంది | బతుకు పుస్తకం:పుట.64 |
| 15 | గాలికిపోయే కంపను తలుగవెట్టుకున్నట్టు | బతుకు పుస్తకం:పుట.73 |
| 16 | దోని తడువది దొయ్య పారదన్నట్టు | బతుకు పుస్తకం:పుట.106 |
| 17 | పరాశికానికి పక్కల పంటె ఒల్లెక్కానికి బిడ్డ పుట్టిందట | బతుకు పుస్తకం:పుట.202 |
| 18 | పాతొకరోత కొత్తొకవింత | బతుకు పుస్తకం:పుట.255 |
| 19 | పాము చావద్దు... కర్ర విరుగద్దు | బతుకు పుస్తకం:పుట.298 |
| 20 | ఉరురిమి మంగలం మీద పడ్డట్టు | బతుకు పుస్తకం:పుట.322 |
| 21 | రెక్కాడితే కాని డొక్కాడని బతుకు | గువ్వలచెన్నా:పుట.20 |
| 22 | పుక్కానికస్తె అయ్యా కొడుకులమున్నమన్నారట | గువ్వలచెన్నా:పుట.38 |
| 23 | లేడికి లేసిందే పరుగన్నట్టు | గువ్వలచెన్నా:పుట.51 |
| 24 | ఊరు పొమ్మంటుంది, కాడు రమ్మంటుంది | గువ్వలచెన్నా:పుట.62 |
| 25 | ముందచ్చిన చెవులకంటె ఎనుకచ్చిన కొమ్ములు వాడిగుంటయన్నట్టు | గువ్వలచెన్నా:పుట.62 |
| 26 | కొనబోతే కొరివి అమ్మబోతే అడవి | గువ్వలచెన్నా:పుట.78 |
| 27 | విలువిద్యలెన్ని నేర్చిన కులవిద్యకు సాటిరావు | గువ్వలచెన్నా:పుట.78 |
| 28 | కులం జెడ్డా సుఖం దక్కాలనట్లు | గువ్వలచెన్నా:పుట.79 |
| 29 | దుఃఖం లేనోడు బర్రెను కొన్నట్టు | గువ్వలచెన్నా:పుట.83 |
| 30 | ఊరిడిసిబోదునా ఉరిపెట్టుకొని సత్తునా | గువ్వలచెన్నా:పుట.102 |
| 31 | మానం బోయినంక పానమెందుకని | గువ్వలచెన్నా:పుట.102 |
| 32 | అయితె ఆత్కూర్ లేకుంటె బూత్కూర్ | గులాంగిరి చోడో:పుట.2 |
| 33 | పేదోని కోపం పెదవులకు సేటు | గులాంగిరి చోడో:పుట.6 |
| 34 | పిట్ట కొంచెం కూత ఘనం | గులాంగిరి చోడో:పుట.29 |
| 35 | ఉట్టికెగుర లేనమ్మ స్వర్గానికెగిరినట్టున్నయి | గులాంగిరి చోడో:పుట.38 |
| 36 | పెద్దల మాట పెరుగన్నపు మూట | గులాంగిరి చోడో:పుట.41 |

| | | |
|---|---|---|
| 37 | మింగుమంటె కప్పకు కోపం, విడువమంటె పాముకు కోపం | గులాంగిరి చోడో:పుట.180 |
| 38 | కాట్నం కాలుతుంటె బీడంటు పెట్టుకున్నట్టు, పుట్నాలేరుకతిన్నట్టు | మంచియన్నది మాల అయితే.. :పుట.13 |
| 39 | పిలిచి పిల్లనిత్తనంటె కులం తక్కువ అన్నడట | మంచియన్నది మాల అయితే.. :పుట.17 |
| 40 | ఒడ్డెక్కెదాక ఓడ మల్లప్ప ఒడ్డెక్కినంక బోడ మల్లప్ప | మంచియన్నది మాల అయితే..:పుట.37 |
| 41 | ఓ దిక్కు కాట్నం గాలుతుంటె ఇంకో దిక్కు చలిగాసుకున్నట్టు | మంచియన్నది మాల అయితే..:పుట.99 |
| 42 | దుడ్డున్నోనిదే బర్రె | తెలంగాణ దేవదాసు:పుట.33 |
| 43 | కుండ పగిలినా కుక్కబుద్ధి తెలుస్తది | డబ్బు మైనస్ తృప్తి=దుఃఖం:పుట.12 |
| 44 | దీపముండగానే ఇల్లు చక్కబెట్టుకోవాలి | డబ్బు మైనస్ తృప్తి=దుఃఖం:పుట.26 |
| 45 | వెతకబోయే తీగ కాలికి తగిలినట్టు | డబ్బు మైనస్ తృప్తి=దుఃఖం:పుట.122 |
| 46 | పెద్దమనిషని పేరంటం పిలిస్తే ఏదో చేసిందన్నట్టు | మెతుకుపుస్తకం:పుట.15 |
| 47 | బొడక్క బొడక్క దీవించుమంటే నా తీరుగ నువ్వుండు మన్నదట | మాదిగ విజయం:పుట.45 |
| 48 | అదృష్టం అందల మెక్కిస్తానంటే నొసలు కట్టెలే మోస్తనన్నదట | మాదిగ విజయం:పుట.235 |
| 49 | చిన్ని నా పొట్టకు శ్రీరామ రక్ష | మాదిగ విజయం:పుట.312 |
| 50 | ఒక్కటాయెరొండాయె ఒనరంగ మూడాయెనన్నట్టు | అస్పృశ్య కోయిల:పుట.7 |

## 5.12. జాతీయాలు:

ఒక జాతి ప్రజల సంభాషణలో స్థిరపడిపోయిన కొన్ని నానుడులనే జాతీయాలు అంటారు. ఇవి అనగానే అర్థమైపోయే మాటలు. మనిషి జీవితంలో కంటికి కనిపించేది, అనుభవంలోకి వచ్చేది, అనుభూతిని కలిగించేది ఇలా ప్రతి దాని నుండి జాతీయాలు పుట్టుకొస్తూనే ఉన్నాయి. భాషలో సామెతలు చేసే పనినే జాతీయాలు చేస్తుంటాయి. నిర్మాణపరంగా చూస్తే సామెతలు వాక్య

స్థాయిలోనూ, జాతీయాలు కేవలం పదబంధ స్థాయిలోనూ ఉంటాయి. సామెతల్లో చెప్పదలుచుకున్న విషయాన్ని అత్యంత ప్రతిభావంతంగానూ, సౌందర్యాత్మకంగానూ, చమత్కారంగానూ వ్యక్తీకరించడానికి జాతీయాలు అత్యంత ఉపయోగకరమైనవి. "జాతీయానికి చమత్కారం, నుడికారం, నుడిగట్టు, పలుకుబడి, భాషీయం అనే పర్యాయ పదాలున్నాయి. ఆంగ్లంలో 'Idiom', హిందీలో 'ముహవర్' సమనార్థకాలు" (విజయలక్ష్మి, మూలె.1999: పుట.1). ప్రజల అస్థిత్వాన్ని, ఆత్మ సౌందర్యాన్ని పుక్కిట పట్టినవి జాతీయాలు. కాలువ మల్లయ్య నవలల్లో జాతీయాలను ఉపయోగించారు. ఈ జాతీయాలు నవలల్లో భాషకు నిండుదనాన్ని కలిగించి పాఠకులను ఆనందింపచేస్తాయి. కాలువ మల్లయ్య ప్రయోగించిన జాతీయాలను కింద పొందుపరుస్తున్నాను.

| **క్రమ సంఖ్య** | **జాతీయాలు** | **నవల పేరు మరియు పుట సంఖ్య** |
|---|---|---|
| 1 | ముండబొడ్డికి | సాంబయ్య చదువు:పుట.139 |
| 2 | ఎడ్లెనుక ముద్దు | బతుకు పుస్తకం:పుట.249 |
| 3 | తేనెపూసిన కత్తి | బతుకు పుస్తకం:పుట.261 |
| 4 | అగ్నికాజ్యం పోసినట్టు | గువ్వలచెన్నా:పుట.28 |
| 5 | గొర్రెతోక బెత్తెడు | గువ్వలచెన్నా:పుట.80 |
| 6 | ముసుగులో గుద్దులాట | తెలంగాణ దేవదాసు:పుట.83 |
| 7 | గంతకు తగ్గ బొంత | డబ్బు మైనస్ తృప్తి=దుఃఖం:పుట.26 |
| 8 | సందట్లో సడేమియా | అస్పృశ్య కోయిల:పుట.84 |
| 9 | అడవిగాచిన వెన్నెల | అస్పృశ్య కోయిల:పుట.125 |
| 10 | కుక్కలు చింపిన విస్తరి | అస్పృశ్య కోయిల:పుట.125 |
| 11 | లోకంతోని లొటలొట | మెతుకు పుస్తకం:పుట.100 |

## 5.13. అన్యదేశ్యాలు:

ఒక భాషలో సహజసిద్ధంగా ఉన్న పదాలు దేశీయాలు (Indegenious). ఇతర భాషల నుండి వచ్చిన పదాలను అన్యదేశ్యాలు అని అంటారు. ఆంగ్లంలో వీటిని "Loan words" అని వ్యవహారిస్తారు. వీటినే 'ఎరవు పదాలు', 'ప్రాతిదేయ పదాలు' అని కూడా అంటారు. భాషలో కొత్త పదాలు చేరడానికి ప్రధాన కారణం ఆదానం (Borrowing). తెలుగు భాషలో ప్రవేశించిన ఇతర

భాషల్లో ప్రధానమైనవి తమిళం, కన్నడం, సంస్కృతం, మరాఠీ, ఒరియా, హిందీ, ఉర్దూ, తుర్కీ, పర్షియన్, పోర్చుగీసు, డచ్చి, ఫ్రెంచి, ఆంగ్ల పదాలు మొదలైనవి. కాలువ మల్లయ్యగారు నవలల్లో ఉపయోగించిన కొన్ని అన్యదేశాలను కింద పొందుపరుస్తున్నాను.

| క్రమ సంఖ్య | అన్యదేశ్య పదం | భాష | నవల పేరు | పుట సంఖ్య |
|---|---|---|---|---|
| 1 | షావుకారి | ఉర్దూ | భూమిపుత్రుడు | 13 |
| 2 | సర్కారు | ఉర్దూ | భూమిపుత్రుడు | 88 |
| 3 | దవాఖాన | ఉర్దూ | భూమిపుత్రుడు | 97 |
| 4 | దుకాణం | ఉర్దూ | గులాంగిరి చోడో | 121 |
| 5 | పరేషాన్ | ఉర్దూ | మంచియన్నది మాల అయితే.. | 3 |
| 6 | మోజు | ఉర్దూ | డబ్బు మైనస్ తృప్తి = దుఃఖం | 48 |
| 7 | సర్కార్ | ఉర్దూ | అస్పృశ్య కోయిల | 51 |
| 8 | జిందాబాద్ | ఉర్దూ | మెతుకు పుస్తకం | 4 |
| 9 | మార్కెట్ | ఆంగ్లం | భూమిపుత్రుడు | 13 |
| 10 | పోలీసు | ఆంగ్లం | భూమిపుత్రుడు | 15 |
| 11 | కాలేజీ | ఆంగ్లం | భూమిపుత్రుడు | 17 |
| 12 | రాడికల్స్ | ఆంగ్లం | భూమిపుత్రుడు | 17 |
| 13 | కోర్టు | ఆంగ్లం | భూమిపుత్రుడు | 25 |
| 14 | కామ్రేడ్ | ఆంగ్లం | భూమిపుత్రుడు | 41 |
| 15 | రెవెన్యూ ఇన్స్పెక్టర్ | ఆంగ్లం | భూమిపుత్రుడు | 87 |
| 16 | అపాయింట్మెంట్ | ఆంగ్లం | భూమిపుత్రుడు | 123 |
| 17 | బస్టాండ్ | ఆంగ్లం | భూమిపుత్రుడు | 124 |
| 18 | బిల్లు | ఆంగ్లం | బతుకు పుస్తకం | 40 |
| 19 | సబ్సిడీ | ఆంగ్లం | గువ్వలచెన్నా | 105 |
| 20 | వీసా | ఆంగ్లం | గువ్వలచెన్నా | 114 |
| 21 | లాయరు | ఆంగ్లం | గులాంగిరి చోడో | 104 |
| 22 | రిజర్వేషన్లు | ఆంగ్లం | గులాంగిరి చోడో | 127 |

| | | | | |
|---|---|---|---|---|
| 23 | ఆపరేషన్ | ఆంగ్లం | డబ్బు మైనస్ తృప్తి = దుఃఖం | 47 |
| 24 | ప్రైవేటైజేషన్ | ఆంగ్లం | డబ్బు మైనస్ తృప్తి = దుఃఖం | 62 |
| 25 | టికెట్ | ఆంగ్లం | డబ్బు మైనస్ తృప్తి = దుఃఖం | 91 |
| 26 | ఎమర్జెన్సీ | ఆంగ్లం | అస్పృశ్య కోయిల | 95 |
| 27 | ఫ్యాక్టరీ | ఆంగ్లం | మెతుకు పుస్తకం | 4 |
| 28 | టౌన్ షిప్ | ఆంగ్లం | మెతుకు పుస్తకం | 9 |
| 29 | పోస్టాఫీసు | ఆంగ్లం | మెతుకు పుస్తకం | 9 |
| 30 | జైలు | ఆంగ్లం | మెతుకు పుస్తకం | 15 |
| 31 | ఎన్ కౌంటర్ | ఆంగ్లం | మెతుకు పుస్తకం | 127 |
| 32 | ఫెర్టిలైజర్ సిటీ | ఆంగ్లం | మెతుకు పుస్తకం | 226 |
| 33 | ఉద్యోగం | సంస్కృతం | భూమిపుత్రుడు | 17 |
| 34 | ప్రభుత్వం | సంస్కృతం | భూమిపుత్రుడు | 123 |
| 35 | పంతులు | మరాఠీ | బతుకుపుస్తకం | 34 |
| 36 | బజార్ | పారసీ | భూమిపుత్రుడు | 14 |
| 37 | రుమాలు | పారసీ | భూమిపుత్రుడు | 15 |
| 38 | నౌకరి | పారసీ | గువ్వలచెన్నా | 56 |
| 39 | దర్వాజ | పారసీ | తెలంగాణ దేవదాసు | 24 |
| 40 | జిల్లా | అరబిక్ | గులాంగిరి చోడో | 178 |
| 41 | దుప్పటి | ఉర్దూ | భూమిపుత్రుడు | 13 |
| 42 | సర్పంచ్ | ఉర్దూ | భూమిపుత్రుడు | 48 |
| 43 | కిరాయి | ఉర్దూ | గులాంగిరి చోడో | 117 |
| 44 | బాకీ | ఉర్దూ | మంచియన్నది మాల అయితే.. | 18 |
| 45 | బంద్ | హిందీ | అస్పృశ్య కోయిల | 47 |
| 46 | పాయిఖానా | ఉర్దూ | అస్పృశ్య కోయిల | 37 |
| 47 | సిపాయి | ఉర్దూ | అస్పృశ్య కోయిల | 21 |
| 48 | బేరీజు | ఉర్దూ | అస్పశ్య కోయిల | 129 |
| 49 | జాగ | ఉర్దూ | అస్పశ్య కోయిల | 58 |

# ఉపసంహారం

**ఉపసంహారం:**

పూర్వం నుండి నేటివరకు సమసమాజ వికాస అభివృద్ధి కోసం దళితులు, బహుజనులు అత్యంత ముఖ్యమైన పాత్రను పోషిస్తున్నారు. వారు సంఘంలో సామాజిక, ఆర్థిక రంగాలను ఎంతో ప్రభావితం చేస్తున్నారు. గత నలభై సంవత్సరాల సామాజిక చరిత్రను వీరి కొరకు తన రచనల్లో నిక్షిప్తం చేసి భావితరాలను అందించిన వారిలో కాలువ మల్లయ్య ముఖ్యమైనవాడు. అన్యాయాలకు, దోపిడీలకు, అణచివేతలకు గురవుతున్న ప్రజానీకంపై తన రచనల్లో అంతులేని ప్రేమను కురిపించారు. ప్రజల జీవితాలలో మార్పు రావాలని తపిస్తూ వారిని చైతన్యవంతం చేయడానికి నవలలు రచించారు. సర్వసంపదలకు సృష్టికర్తలైన దళిత బహుజనులు రాజ్యాధికారంలోకి రావాలన్నదే వీరి నవలల్లోని లక్ష్యం. కాలువ మల్లయ్య నవలల్లో తెలంగాణ మట్టి వాసన గుబాలిస్తుంది. తెలంగాణ భాష, నుడికారపు సొంపు పాఠకుల్ని మంత్రముగ్ధుల్ని చేస్తుంది. సహజమైన, స్వచ్ఛమైన మాండలికంలో నవలలు రచించారు. కాలువ మల్లయ్య నవలల్లో మన చుట్టూ ఉన్న సామాజిక సమస్యలు కనిపిస్తాయి. తెలంగాణ ప్రాంత సంస్కృతి, సంక్షోభం, సంఘర్షణ, పోరాటాలు, పరిష్కారాలు, దళిత, బహుజనుల జీవితం, రైతాంగ జీవితంలోని కడగండ్లు, వ్యవసాయ, అసంఘటిత కూలీల బతుకులు, బొగ్గు గని కార్మికుల జీవనం, భూస్వాములైన దొరల దౌర్జన్యాలు, మావోయిస్టుల విప్లవ ఉద్యమాలు, బీడి కార్మిక శ్రామిక వర్గాలు, నశిస్తున్న కులవృత్తులు, మారుతున్న పల్లెల సంస్కతి, వలస బతుకులు, వరకట్న సమస్యలు, ఉమ్మడి కుటుంబాల విచ్ఛిన్నం, రక్త సంబంధీకులను, తల్లిదండ్రులను నిరాదరిస్తున్న అసమానత్వం, పరాయికరణకు గురిచేస్తున్న చదువులు, ఇంగ్లీషు మీడియం చదువులు, మాతృభాషపై ప్రేమ, కంప్యూటర్ విద్య, విదేశాలపై మోజు వంటి పరిణామాలు, ప్రపంచీకరణ ప్రభావం, మధ్యతరగతి కుటుంబాలలో పెరుగుతున్న ఆశలు, అయోమయం వంటి మొదలైన సమస్యలు తెలంగాణ సామాజిక, ఆర్థిక, రాజకీయ పరిణామాలు, సామాజిక సంఘటనలు వీరి నవలల్లో ప్రతిబింబిస్తాయి. అందుకే వీరి నవలలు సామాజిక చరిత్రను రికార్డ్ చేసినట్లుగా కనిపిస్తాయి.

'కాలువ మల్లయ్య నవలలు – వస్తు విశ్లేషణ' పరిశోధన గ్రంథాన్ని ఐదు అధ్యాయాలుగా విభజించాను. ఆయా అధ్యాయాలలోని అంశాలను స్థూలంగా పరిశీలిస్తే –

మొదటి అధ్యాయం – 'కాలువ మల్లయ్య జీవిత విశేషాలు'లో కాలువ మల్లయ్య కుటుంబ నేపథ్యం, బాల్యం, విద్యాభ్యాసం, వివాహ జీవితం, ఉద్యోగ జీవితం, రచనా వ్యాసంగం, సాహిత్య

పురస్కారాలు, బహుమతులు, కాలువ మల్లయ్య అధిష్టించిన పదవులు, గుర్తింపులు మొదలైన వాటిని పేర్కొన్నాను.

రెండవ అధ్యాయం –'తెలంగాణ నవల – పరిచయం'లో నవలా ప్రక్రియకు సంబంధించి పాశ్చాత్య, తెలుగు సాహితీవేత్తలు, నవలాకారులు ఇచ్చిన పలు నిర్వచనాలను, వివిధ భాషలలో నవలకు గల పేర్లు, తొలి తెలుగు నవల గురించి ప్రముఖుల అభిప్రాయాలు, నవల ప్రక్రియలో వస్తువైవిధ్యాన్ని చర్చించాను. తెలంగాణలో తొలి తెలుగు నవల గురించి ప్రముఖులు తెలిపిన అభిప్రాయాలను, తెలంగాణ చారిత్రక, సాంఘిక, ఉద్యమ, విప్లవ, ఇతర నవలలు గురించి పరిశీలించాను.

మూడవ అధ్యాయం – 'కాలువ మల్లయ్య నవలలు – వస్తు విశ్లేషణ'లో వస్తువును పరిచయం చేసి ప్రముఖులు తెలిపిన వస్తు నిర్వచనాలను తెలియజేశాను. సాహిత్యకారులు, విమర్శకులు, పరిశోధకులు తెలిపిన వస్తువు దృష్ట్యా తెలుగు నవలల వర్గీకరణను తెలియజేసి, కాలువ మల్లయ్యగారు రచించిన నవలలను సామాజిక నవలలు, దళిత నవలలు, వృత్తి నవలలు, చైతన్య స్రవంతి నవలలు, కార్మిక నవలలు, అలభ్య నవలలు అని వర్గీకరించాను. ప్రతి నవలను పరిచయం చేస్తూ, నవలా వస్తువును తెలియజేసి, నవలల్లోని వస్తువును విశ్లేషించాను.

నాల్గవ అధ్యాయం – 'కాలువ మల్లయ్య నవలలు – పాత్ర చిత్రణ'లో పాత్రలు, పాత్రచిత్రణను పరిచయం చేసి పాత్రల యొక్క వర్గీకరణను ప్రముఖులు తెలిపినవి తెలియజేశాను. కాలువ మల్లయ్య నవలల్లోని పాత్రల పేర్లను తెలియజేశాను. సాహితీకారులు, విమర్శకులు, పరిశోధకులు తెలిపిన పాత్రల వర్గీకరణను ఆధారంగా చేసుకొని కాలువ మల్లయ్య నవలల్లోని పాత్రలను ప్రధాన పాత్రలు, ఆదర్శ పాత్రలు, సందేశాత్మక పాత్రలు, సహాయక పాత్రలు అని నాలుగు రకాలుగా వర్గీకరించి ఆ పాత్రల పాత్రచిత్రణలోనే పాత్ర స్వభావం, ప్రయోజనం, వైశిష్ట్యం, వైవిధ్యాలను విశ్లేషించాను.

ఐదవ అధ్యాయం –' కాలువ మల్లయ్య నవలలు – రచనాశిల్పం'లో శిల్పాన్ని పరిచయం చేసి ప్రముఖులు తెలిపిన శిల్ప నిర్వచనాలను తెలియజేశాను. శిల్పంలో భాగంగా కాలువ మల్లయ్య నవలల్లో ఉన్న విభాగాలు, నిడివి, ఎత్తుగడ, ముగింపు, నవల శీర్షిక ఔచిత్యం, పాత్రోచిత భాష, దృష్టి కోణం, మాండలికాలు, సామెతలు, జాతీయాలు, ధ్వన్యనుకరణ పదాలు, జంటపదాలు, అన్యదేశ్యాలు కాలువ మల్లయ్య రచనాశైలిని విశ్లేషించాను.

**పరిశోధన ఫలితాలు**:

కాలువ మల్లయ్య నవలలను పరిశోధించిన తరువాత నవలల్లో దాగి ఉన్న, చెప్పదలుచుకున్న, సందేశమివ్వదల్చుకున్న మౌలికమైన విషయాలను కింద తెలియజేస్తున్నాను.

1) గ్రామీణ జీవితంలోని మధ్యతరగతి కుటుంబాల పరిస్థితిని గమనించవచ్చు. ఒక తరం నిరక్షరాస్యతకు గురైతే మరొక తరం చైతన్యం అయిన వైనాన్ని మనం గమనించవచ్చు.

2) దొరలు, వడ్డీ వ్యాపారులు, బ్యాంకు అధికారుల వల్ల రైతులు పీడనకు గురయ్యారు.

3) ప్రజలు దొరలను ఎదురించి గ్రామసీమలను చైతన్యవంతం చేసి పట్టణాలకు వెళ్లి ఉన్నతమైన విద్యను అభ్యసించి నాగరికత వైపు మళ్లిన విషయాలను కాలువ మల్లయ్య నవలలు తెలియజేశాయి.

4) తెలంగాణ ప్రాంతంలో స్వాతంత్ర్యం రాకముందు అమలైన భూస్వామ్య వ్యవస్థ, స్వాతంత్ర్యం వచ్చిన తరువాత కూడా సుమారు నాలుగు దశాబ్దాల పాటు కొనసాగింది.

5) సమాజ నిర్మాణంలో అట్టడుగు ప్రజల జీవన విధానంలోనే సమాజం మొత్తం అవలంభించాల్సిన ప్రజాస్వామిక విలువలు దాగి ఉన్నాయి.

6) దళితుల మీద తీవ్రమైన అణచివేత ఉన్నప్పటికీ, వారిలో నరనరాల్లో జీర్ణించుకుపోయిన ఆత్మగౌరం ఏదో ఒక రూపంలో ఎప్పుడూ వ్యక్తమవుతూనే ఉంటుంది.

7) అణచివేత ఉన్నచోట వెంటనే కాకపోయినా, ఏదో ఒక సమయంలో తిరుగుబాటు అనివార్య చర్యగా వ్యక్తమవుతుంది.

8) తెలంగాణ గ్రామీణ సమాజంలో అంటరానివారిగా ముద్రపడిన సమాజ వివక్షకు గురైన దళితులు స్వాతంత్ర్యానంతరం బాగా చదువుకొని ఉద్యోగాలు పొంది సమాజంలో గౌరవాన్ని, జీవన ప్రమాణాలను మెరుగుపరుచుకున్నారు.

9) వెనుకబడిన తరగతులకు చెందిన బి.సి.లు మూలాల్ని మరిచి అవగాహన రాహిత్యంతో అగ్రవర్ణాల వారిలాగే దళితులను వేధించిన కొన్ని సంఘటనలు ఉన్నాయి. కాని దళితులు, బి.సి.లు గ్రామాల్లో అణగారిన జాతులేనని, సహజ మిత్రులేనని చెప్పే సంఘటనలు మాదిగ విజయం, సాంబయ్య చదువు, బతుకుపుస్తకం నవలల్లో కనబడతాయి.

10) గ్రామీణ ప్రాంతంలోని వారు పట్టణాల్లో పెట్టుబడులు కేంద్రీకృతం కావడంతో ఆర్థిక అవసరాలు తీర్చుకోవడానికి మెరుగైన జీవితాన్ని పట్టణంలో గడపడానికి గ్రామాలను వదిలి వలసలు వెళ్లుతున్నారు.

11) చేనేత కార్మికులు ప్రపంచీకరణ ప్రభావం వల్ల వృత్తిని కోల్పోయి పట్టణాలు, ఇతర రాష్ట్రాలకు బతుకుదెరువు కొరకు వలస వెళ్లుతున్నారు.

12) అస్పృశ్యత కారణంగా సమాజానికి దూరం చేయబడి ప్రజా జీవన విధానంలో కలిసిపోతున్న తీరును గమనించవచ్చు.

13) తెలంగాణ సంస్కృతిని తెలుసుకోవచ్చు.

14) మానవ సంబంధాలు కులాలకు అతీతంగా సడలిపోవడాన్ని గమనించవచ్చు.

15) రైతులు, కార్మికులు, వృత్తి కులాలు వారి జీవన విధానాన్ని, సంస్కృతిని తెలుసుకోవచ్చు.

16) దళితులు, శూద్రులు కలిసి ఐక్య పోరాటం చేయాల్సి ఉంది.

17) దళితులు, వెనుకబడిన వర్గాలకి చెందినవారు చారిత్రకంగా ఒకే వర్గానికి చెందిన ప్రజలు.

18) గ్రామాలలో మనుషుల మధ్య ఉండే ఆప్యాయతలు, సహాయ సహకారాలు కనిపిస్తాయి.

19) వృత్తులకు ఆదరణ లేనప్పుడు అప్పులు చేయడం, వలసలు పోవడం లాంటి సంఘటనలు కనిపిస్తాయి.

20) వృత్తి వారిని దొరలు దౌర్జన్యంతో బెదిరించి వెట్టి చేయించడం కనబడుతుంది.

21) విద్యారంగంలో అమలవుతున్న కుల వివక్షను వ్యక్తపరచవచ్చు.

22) కాలువ మల్లయ్య యాబై శాతం నవలల్లో కులం ప్రస్తావన ఉన్నది. కులం అనగానే దళితులు, వెనుకబడిన వర్గాల వారు అగ్ర వర్ణాల వారి మధ్య వైరుధ్యం స్ఫురణకు వస్తుంది.

23) భూస్వాములు దళిత స్త్రీల పట్ల వ్యవహరించే అమానవీయ వైఖరి గురించి తెలుసుకోవచ్చు.

24) 1990 సంవత్సరం తరువాత మొదలైన ప్రపంచీకరణ, నూతన ఆర్థిక విధానాల కారణంగా తెలంగాణలోని వృత్తులు ధ్వంసమైన తీరును, ఫెర్టిలైజర్ కంపెనీ మూతపడటంతో కార్మికులు పడిన బాధలను ఈ నవలలు విశ్లేషించాయి.

25) ఫెర్టిలైజర్ ఫ్యాక్టరీ కార్మికులు, ఉద్యోగులు నూతన ఆర్థిక విధానాల కారణంగా యాజమాన్యం తీసుకున్న నిర్ణయానికి బలైపోయారు.

26) తెలంగాణ మొదటి నుండి అనేక ఉద్యమాలకు పుట్టినిల్లు. స్వాతంత్ర్యానికి పూర్వం రాజులు ఉద్యమాలను అణచివేస్తే, స్వాతంత్ర్యానంతరం సొంత పాలకులే తీవ్రమైన అణచివేతను, నిర్బంధాన్ని ప్రయోగించారని ఈ నవలలు విశదీకరించాయి.

27) తెలంగాణ సమాజంలో రోజురోజుకి దిగజారిపోతున్న వ్యవసాయం గురించి, రైతుల బాధలను గురించి ఈ నవలలు విస్తారంగా చర్చించాయి.

28) మాతృభాష అయిన తెలుగుకు విద్యాభోదనలో సముచిత స్థానం ఇవ్వాలని కూడా చెప్తున్నాయి.

29) తెలంగాణలోని భూస్వాములైన దొరలు తీసుకువచ్చిన విధానాల కారణంగా ప్రజల ఆలోచన విధానాల్లో, సామాజిక సంబంధాల్లో వచ్చిన యాంత్రికత, కృత్రిమతల గురించి కూడా ఈ నవలలు ప్రధానంగా చిత్రించాయి.

30) దొరల పీడన కమ్యూనిస్టులు, అంబేద్కర్ సంఘాల ప్రభావంతో అణచివేయబడిందని ఈ నవలలు తెలుపుతున్నాయి.

31) మాల మాదిగల్లో వస్తున్న వైరుధ్యాలు తగ్గి దళిత రాజ్యాధికారం కొరకు వారు కలిసి పోరాటం చేయాల్సి ఉన్నది. అలాగే దళితులు, వెనుకబడిన తరగతుల వారు కలిసి ఐక్యంగా పోరాడి దళిత, బహుజనులు రాజ్యాధికారం దక్కించుకోవాలని ఈ నవలలు తెలియజేస్తున్నాయి.

32) దళితులు నిత్యం శ్రమలోనే జీవితాల్ని గడిపినా, వారి జీవితాల్లో పురోగతి రాకపోవడానికి కారణం అగ్రకులాలు వారి శ్రమను దోచుకోవడమే.

33) దొరలు, భూస్వాములు, పెత్తందారీ వర్గాల వారు కుల వ్యత్యాసాలు, ఆర్థిక అంతరాలు, పరువు మర్యాదలకు ప్రాధాన్యతను ఇస్తారు.

34) కాలువ మల్లయ్య నవలల్లో విప్లవోద్యమం ఆదర్శవంతంగానే కనిపిస్తున్నప్పటికీ అందులో హింస ఉన్నది. నక్సలైట్ ఉద్యమాలు, అంబేద్కర్ సంఘాలు తెలంగాణ గ్రామాల్లో సమాంతరంగా ప్రవేశించి తమ ప్రభావాన్ని చూపాయి. నక్సలైట్ ఉద్యమం వల్ల అంబేద్కర్ సంఘాల ఉద్యమాలు దెబ్బతిన్నాయని అంబేద్కర్ వాదులు, అంబేద్కర్ సంఘాల ఉద్యమాల వల్ల నక్సలైట్ల ఉద్యమాలకు నష్టం జరిగిందని కమ్యూనిస్టులు వాదిస్తారు. కాని కాలువ మల్లయ్య నవలను నిశితంగా పరిశీలిస్తే రెండు ఉద్యమాలు తెలంగాణ గ్రామాల్లో విశేషంగా ధనాత్మకంగా (పాజిటివ్ గా) ఫలితాలను ఇచ్చాయన్న విషయాన్ని చెప్తాయి. నక్సలైట్ ఉద్యమాలతో భూస్వామ్య వ్యవస్థకు బీటలు వారటం, దొరల దౌర్జన్యాలు తగ్గడం జరిగింది. అలాగే అంబేద్కర్ సంఘాల ఉద్యమాల వల్ల దళిత బహుజనులు చైతన్యవంతులై చదువుకొని ఉపాధ్యాయులుగా, ఉపన్యాసకులుగా, జర్నలిస్టులుగా, రచయితలుగా, మేధావులుగా వివిధ రకాలైన ఉన్నత ఉద్యోగాల్లో చేరడం జరిగింది.

35) తెలంగాణ సమాజంలో కనిపించే మూఢ విశ్వాసాలను ఈ నవలలు శాస్త్రీయ కోణంలో విశ్లేషించాయి.

36) కాలువ మల్లయ్య నవలలు సమాజంలో చోటు చేసుకున్న సామాజిక సమస్యలను చిత్రించి ఆ సమస్యలకు పరిష్కార మార్గాలను చూపించాయి. దళిత, బహుజనుల్లో చైతన్యాన్ని తీసుకువచ్చాయి. దళిత, బహుజనులు రాజ్యాధికారం దక్కించుకోవాలని ఈ నవలలు స్పష్టం చేస్తున్నాయి.

37) స్వాతంత్ర్యానంతర తరంలోని దళిత, వెనుకబడిన తరగతులకు చెందినవారు చదువుకునే అవకాశాలతో జీవితాలను గెలుచుకున్న క్రమాన్ని సాంబయ్య చదువు, మాట్లాడే బొమ్మలు, మాదిగ విజయం నవలలు తెలియజేస్తున్నాయి.

38) స్వాతంత్ర్యం వచ్చిన తరువాత తరంవారు కొందరు పాఠశాలలకు వెళ్లి, ఉన్నత చదువుల కోసం పట్టణాలకు, వివిధ విశ్వవిద్యాలయాలకు వెళ్లి చైతన్యవంతులయ్యారు. వారు తమతోపాటు గ్రామాల్లోకి అంబేద్కర్ సిద్ధాంతాలను తీసుకవచ్చారు.

39) కాలువ మల్లయ్య దళిత బహుజనుల జీవితాల్లోకి పరకాయ ప్రవేశం చేసి ఆయా కులాల వారి వేదనను, సమస్యలను, జీవితాల్ని ప్రేమతో అక్షరీకరించినట్లు కనిపిస్తుంది. దళిత నవలలు చదివితే దళితుడిగా, దళితబంధుగా కనబడతాడు. వృత్తి కులాల నవలలు చదివినప్పుడు ఆ కులానికి చెందిన వాడిగానే భావించే తథాద్మ్యత అతని అక్షరాలలో కనబడుతుంది. మొత్తంగా పరిశీలిస్తే దళిత, బహుజనుల జీవితాల గురించి ఇంత ప్రేమతో రాసిన రచయితలలో కాలువ మల్లయ్య అగ్రగణ్యుడు. కాలువ మల్లయ్య గారిని దళిత బహుజన నవలా శిల్పిగా పేర్కొనవచ్చు.

ఈ పరిశోధన కాలువ మల్లయ్య నవలల్లోని వస్తువు మీద ప్రధానంగా దృష్టి పెట్టింది కాబట్టి భవిష్యత్తులో కాలువ మల్లయ్య నవలల్లోని భాష, శిల్పం దళితులు, బహుజనుల జీవితాలపై ప్రత్యేకంగా పరిశోధన చేయవచ్చని తెలియజేస్తున్నాను.

1) కాలువ మల్లయ్య నవలలు – మాండలిక భాషా పరిశీలన.
2) కాలువ మల్లయ్య నవలలు – శిల్ప వైశిష్ట్యం
3) కాలువ మల్లయ్య నవలలు – బహు జనుల జీవిత చిత్రణ
4) కాలువ మల్లయ్య నవలలు – దళితుల జీవిత చిత్రణ.

★★★

# ఉపయుక్త గ్రంథసూచి

**ఉపయుక్త గ్రంథసూచి:**


1) అయిలయ్య, బన్న. 2010. కాలువ మల్లయ్య కథలు తెలంగాణా జనజీవితం. వరంగల్: నానీ ప్రచురణలు.

2) ఆనందరామం, సి. 1994. నవలా విమర్శ. హైదరాబాద్: పద్మావతి ఆర్ట్ ప్రింటర్స్.

3) ఆరుద్ర. 2012. సమగ్ర ఆంధ్ర సాహిత్యం నాల్గవ సంపుటి. హైదరాబాద్: తెలుగు అకాడమీ.

4) కాశీం, సి. 2015. తెలంగాణ సాహిత్యం. హైదరాబాద్: స్నేహ ప్రచురణలు.

5) కృష్ణమూర్తి, భద్రిరాజు. 2014. తెలుగు భాషాచరిత్ర. హైదరాబాద్: తెలుగు విశ్వవిద్యాలయం.

6) గంగాధర్, ఎం. 1994. ఆధునిక తెలుగు కవిత్వంలో విప్లవ ధోరణులు. వరంగల్: ప్రాణ–హిత ప్రచురణలు.

7) చైతన్య, ఎ.వి.వి.కె. 2019. తెలుగులో అనువాద నవలలు – విమర్శనాత్మక అధ్యయనం. హైదరాబద్: హైదరాబాద్ విశ్వవిద్యాలయానికి సమర్పించిన పరిశోధన గ్రంథం.

8) జనార్ధన్, గౌడిచర్ల. 2019. తెలంగాణ నవలలు – వృత్తి జీవన చిత్రణ: హైదరాబాద్: హైదరాబాద్ విశ్వవిద్యాలయానికి సమర్పించిన పరిశోధన గ్రంథం.

9) జయప్రకాష్, ఎస్. 2009. పరిశోధన విధానం. హైదరాబాద్: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్.

10) తులజ, పుట్టపర్తి. 1985. తెలుగు సామెతలు–సాంఘిక జీవితం. హైదరాబాద్: రాజధాని ప్రింటర్స్.

11) దక్షిణామూర్తి, పోరంకి. 1992. భాష ఆధునిక దృక్పథం. హైదరాబాద్: వరలక్ష్మి పబ్లిషర్స్.

12) నవీన్. 2001. సాహిత్య వ్యాసాలు. వరంగల్: ప్రత్యూష ప్రచురణలు.

13) నాగభూషణశర్మ, మొదలి. 1971. తెలుగు నవలా వికాసం. హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ.

14) నాగయ్య, జి. 2009. తెలుగు సాహిత్య సమీక్ష రెండవ సంపుటం. తిరుపతి: నవ్య పరిశోధక ప్రచురణలు.

15) నిత్యనందరావు, వెలుదండ. 2013. విశ్వవిద్యాలయాల్లో తెలుగు పరిశోధన. హైదరాబాద్: నవోదయ బుక్ హౌస్.

16) ప్రతాపరెడ్డి, కాసుల. 2017. తెలంగాణ నవలా వికాసం. హైదరాబాద్: తెలంగాణ సాహిత్య అకాడమీ.

17) ప్రసన్నాంజనేయులు, మంచికలపాటి. 2007. విశ్వనాథ నవలాశిల్పము. నెల్లూరు: శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయానికి సమర్పించిన సిద్ధాంత గ్రంథం.

18) బాలగోపాల్, కె. 2009. ప్రాచీన భారతదేశ చరిత్ర డి.డి. కోశాంబి పరిచయం. హైదరాబాద్: హైదరాబాద్ బుక్ ట్రస్టు ప్రచురణ.

19) బాలగోపాల్, కె. 2010. రాజ్యం – సంక్షేమం. హైదరాబాద్: పర్స్పెక్టివ్స్ ప్రచురణ.

20) బాలగోపాల్, కె. 2010. హక్కుల ఉద్యమం తాత్విక దృక్పథం. హైదరాబాద్: మానవ హక్కుల వేదిక.

21) బాలగోపాల్, కె. 2011. రూపం – సారం సాహిత్యంపై బాలగోపాల్. హైదరాబాద్: హైదరాబాద్ బుక్ ట్రస్టు.

22) భాస్కర్, నలిమెల. 2019. తెలంగాణ పదకోశం. హైదరాబాద్: అడుగుజాడలు పబ్లికేషన్స్. ఆరవ ముద్రణ.

23) మధుసూదనరావు, త్రిపురనేని. 2010. సాహిత్యంలో వస్తుశిల్పాలు. హైదరాబాద్: పర్స్పెక్టివ్ పబ్లిషర్.

24) మల్లయ్య, కాలువ. 1998. అవ్వతోడు గిది తెలంగాణ. హైదరాబాద్: దేవులపల్లి పబ్లికేషన్స్.

25) మల్లయ్య, కాలువ. 1998. మా కథలు. హైదరాబాద్: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్.

26) మల్లయ్య, కాలువ. 1999. కాలువ మల్లయ్య కథలు. కరీంనగర్: తెలుగు వచనం ప్రచురణలు.

27) మల్లయ్య, కాలువ. 2000. బతుకు పుస్తకం. హైదరాబాద్: లైఫ్–లైన్ కమ్యూనికేషన్స్.

28) మల్లయ్య, కాలువ. 2001. కాలువ మల్లయ్య నవలలు. కరీంనగర్: తెలుగు వచనం ప్రచురణలు.

29) మల్లయ్య, కాలువ. 2002. డబ్బు మైనస్ తృప్తి = దుఃఖం. విజయవాడ: స్వాతి సచిత్ర మాసపత్రిక.

30) మల్లయ్య, కాలువ. 2005. గువ్వలచెన్నా. హైదరాబాద్: చతుర మాసపత్రిక 325వ సంచిక.

31) మల్లయ్య, కాలువ. 2011. తెలంగాణ దేవదాసు. విజయవాడ: స్వాతి సచిత్ర మాసపత్రిక.

32) మల్లయ్య, కాలువ. 2014. మంచియన్నది మాల అయితే.. . హైదరాబాద్: సామాజిక భారత్ ప్రచురణలు.

33) మల్లయ్య, కాలువ. 2015. మాదిగ విజయం. హైదరాబాద్: సామాజిక భారత్ బి.వి.వి. ఛారిటబుల్ ట్రస్టు.

34) మల్లయ్య, కాలువ. 2017. అస్పృశ్యకోయిల. హైదరాబాద్: లిఖిత ప్రెస్.

35) మల్లయ్య, కాలువ. 2017. మెతుకుపుస్తకం: హైదరాబాద్: బి.వి.వి. ప్రచురణలు.

36) మల్లయ్య, కాలువ. 2019. గులాంగిరి చోడో. హైదరాబాద్: బి.వి.వి. ప్రచురణలు.

37) మల్లేష్, మంత్రి. 2018. తెలంగాణ మాండలిక నవలలు–భాషా పరిశీలన. హైదరాబాద్: హైదరాబాద్ విశ్వవిద్యాలయానికి సమర్పించిన పరిశోధన గ్రంథం.

38) మృణాళిని, సి. సాంఘిక నవల–కథన శిల్పం. 1988. హైదరాబాద్: తెలుగు పరిశోధన ప్రచురణలు.

39) యోహన్ బాబు, జి. 1995. బలివాడ కాంతారావు నవలలు. విశాఖపట్టణం: దీప్తేజ పబ్లికేషన్స్.

40) రమాదేవి, యమ్. 2018. తెలంగాణ నవల – వస్తు వివేచన. హైదరాబాద్: హైదరాబాద్ విశ్వవిద్యాలయానికి సమర్పించిన పరిశోధన గ్రంథం.

41) రమాపతిరావు, అక్కిరాజు. 1975. తెలుగు నవల. హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ.

42) రాజేశ్వరి, శివుని. 2012. ఆధునిక తెలుగు భాషా నిర్మాణం. తిరుపతి: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్.

43) రామమోహన్ రాయ్, కడియాల. 2012. మన తెలుగు నవలలు. హైదరాబాద్: అజో–విభో, కందాళం ఫౌండేషన్.

44) రామారావు, కాళీపట్నం. 1990. మనలోమనం. విశాఖపట్నం: సాగర గ్రంథమాల.

45) రామారావు, చేకూరి. 2019. తెలుగు వాక్యం. సికింద్రాబాద్: కావ్య పబ్లిషింగ్ హౌస్.

46) రామారెడ్డి, ఘంట. 2002. అంపశయ్య నవీన్ సాహితీ ప్రస్థానం. వరంగల్: ప్రత్యూష ప్రచురణలు.

47) రాములు, బి.యస్. 1998. కథలబడి–కథాసాహిత్య ఆలంకార శాస్త్రం. హైదరాబాద్: విశాల సాహిత్య అకాడమీ ప్రచురణ.

48) లింగరాజు, గడ్డం. 2016. జిగిరి నవల–పరిశీలన. హైదరాబాద్: హైదరాబాద్ విశ్వవిద్యాలయానికి సమర్పించిన సిద్ధాంత వ్యాసం.

49) విజయలక్ష్మి, మూలె. 1999. తెలుగు జాతీయాలకోశం. తిరుపతి: యమ్బి యమ్మార్ పబ్లికేషన్స్.

50) విజయ కుమార్, వై. 2003. సాహిత్య సమాలోచన. హైదరాబాద్: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్.

51) వీరభద్రయ్య, ముదిగొండ. 2000. నవల–నవలా విమర్శకులు. హైదరాబాద్: మూసీ మాస పత్రిక.

52) వీరభద్రరావు, కొత్తపల్లి. 1986. తెలుగు సాహిత్యంపై ఇంగ్లీషు ప్రభావం. సికింద్రాబాద్: శివాజీ ప్రెస్.

53) వీర్రాజు, శీలా. 1974. తెలుగు కథాశైలి. మచిలీపట్నం: ఆంధ్ర సారస్వత సమితి.

54) వెంకట కుటుంబరావు, బొడ్డపాటి. 1971. ఆంధ్ర నవలా పరిణామము. హైదరాబాద్: గాయత్రీ ప్రచురణము.

55) వెంకటరావు, నిడదవోలు. 1992. ఆంధ్ర వచన వాఙ్మయం. హైదరాబాద్: యువభారతి ప్రచురణలు.

56) వెంకటసుబ్బయ్య, వల్లంపాటి. 1994. నవలాశిల్పం. హైదరాబాద్: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్.

57) వెంకటసుబ్బయ్య, వల్లంపాటి. 2008. కథాశిల్పం. హైదరాబాద్: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్.

58) వెంకట్రామయ్య, తుమ్మల. 1994. అభ్యుదయ ఈ శతాబ్ది నవల సంచిక. హైదరాబాద్: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్.

59) వెంకటేశ్వర్లు, పుల్లాభొట్ల. 2019. తెలుగు నవలా సాహిత్య వికాసము. హైదరాబాద్: తెలంగాణ సాహిత్య అకాడమీ.

60) వెంకటేశ్వర్లు, పంతంగి. 2014. తెలంగాణ తెలుగు నవల. వరంగల్: కాకతీయ విశ్వవిద్యాలయం.

61) వేదవతి, సి. 1983. సామెత. హైదరాబాద్: స్పందన సాహితీ సమాఖ్య ప్రచురణ.

62) శరత్ జ్యోత్స్నారాణి, ఎస్. 2003. స్వాతంత్ర్యానంతర తెలుగు కవిత: వస్తువు, రూపం, శిల్పం. హైదరాబాద్: జ్యోత్స్న కళాపీఠం ప్రచురణలు.
63) శ్రీధరరావు, దేశ్ పాండే. 2008. తెలంగాణ రాజకీయ ఆర్థిక సామాజిక వ్యాసాలు. హైదరాబాద్: తెలంగాణ విద్యావంతుల వేదిక.
64) శ్రీనివాసరావు, రాజబోయిన. 2017. సి.యస్. రావు నవలలు – వస్తు వివేచన. హైదరాబాద్: హైదరాబాద్ విశ్వవిద్యాలయానికి సమర్పించిన పరిశోధన గ్రంథం.
65) శ్రీరామమూర్తి, కోడూరి. 2001. తెలుగు నవలా సాహిత్యంలో మనోవిశ్లేషణ. హైదరాబాద్: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్.
66) శ్రీహరి, రవ్వా. 2016. తెలంగాణ ఆధునిక సాహిత్య చరిత్ర. హైదరాబాద్: తెలుగు అకాడమీ.
67) సత్యనారాయణ, మన్నవ. 1984. శ్రీ అడివి బాపిరాజు నవలా సాహిత్యానుశీలనం. గుంటూరు.
68) సదాశివ్, కర్రె. 2018. బి.యస్. రాములు సాహిత్యం సమగ్ర పరిశీలన. హన్మకొండ: సౌపర్ణిక సహర్ష్ ప్రచురణలు.
69) సాగర్, సి.ఎస్. 2006. కుల నిర్మూలన విద్య. హైదరాబాద్: పి.డి.యస్.యూ. ప్రచురణలు.
70) సిద్ధారెడ్డి, నందిని. 2008. కులవృత్తులు తెలంగాణ సాహిత్యం. హైదరాబాద్: తెలంగాణ రచయితల వేదిక.
71) సిమ్మన్న, వెలమల. 2004. తెలుగు భాషా చరిత్ర. విశాఖపట్నం: దళిత సాహిత్య పీఠం.
72) సుజాతరెడ్డి, ముదిగంటి. తెలుగు నవలానుశీలనము. హైదరాబాద్: రోషణమ్ పబ్లికేషన్స్.
73) సుదర్శనం, ఆర్.యస్. 1972. సమాజం – సాహిత్యము. చిత్తూరు: చిత్తూరు జిల్లా రచయితల సహకార ప్రచురణ సంఘం.
74) సుబ్రహ్మణ్యం, పి.యస్. 1997. ఆధునిక భాషాశాస్త్ర సిద్ధాంతాలు. హైదరాబాద్: తెలుగు విశ్వవిద్యాలయం.

**అముద్రిత నవల**:

1) మల్లయ్య, కాలువ. 2017. తపస్సు.

★★★

# అనుబంధాలు

## అనుబంధం – 1

1) **మీ నవలల్లో మీకు నచ్చిన నవల పేరు తెలియజేసి, దాని ప్రత్యేకతను తెలపండి?**

**సమాధానం:** ఒక రచయతకు తాను రాసిన అన్ని రచనలపై సమాన ప్రేమే ఉంటుంది. అయినా రచయితను నిలబెట్టే కొన్ని పుస్తకాలు ఉంటాయి. కాబట్టి ఒక నవలను గురించి మాత్రమే చెప్పమంటే చెప్పడం కష్టమే అయినా మాదిగ విజయం నాకు బాగా నచ్చిన నవలగా చెప్పుకోవచ్చు. నా నవలలు అన్ని నేను పుట్టి పెరిగిన, జీవించిన, గ్రామీణ బహుజన నేపథ్యం నుండి వచ్చినవే. అలాగే మాదిగ విజయం నవల స్పార్టకస్ రాసిన నీగ్రోల ఏడు తరాలను పోలి ఉండటం వల్లనేమో దీనిలో కూడా ఐదు తరాలల్లో తెలంగాణ మాదిగ కుటుంబంలో జరిగిన సామాజిక, చారిత్రక మార్పుల చిత్రణ ఉంది. కాబట్టి ఈ నవల దళిత రాజ్యాధికారం రావలసిన అవసరాన్ని నొక్కి చెప్పుతుంది. ఈ నవలను చదివి నన్ను మాదిగగానే భావించిన పాఠకులు చాలామంది ఉన్నారు. తెలుగులో దళిత రాజ్యాధికారం గురించి రాని రచనల కొరతను మాదిగ విజయం తీర్చడం వల్ల ఇది నాకు నచ్చింది.

2) **రాయకుండా మిగిలిపోయిన పెద్ద ఇతివృత్తం లాంటిదేమైనా ఉందా? ఉంటే, దాని గురించి తెలపండి?**

**సమాధానం:** ఉంది. మా కుటుంబం చరిత్రను గురించి ఒక బృహత్ నవలగా 'తరతరాల చరిత్ర' పేరుతో రాయాలన్న కాంక్ష ఉంది. అందుకోసం ఏడు తరాల మా కుటుంబ నేపథ్య చరిత్రను నోట్సుగా రాసుకున్నాను. నవలగా రాయడం ప్రారంభించి ఎనభై పేజీల వరకు రాశాను. మా ముత్తాతల తరం నుండి మొదలై నా కొడుకు తరం వరకు తీసుకొని రాస్తున్నాను. మా కుటుంబంలోని గొర్ల కాపర్ల జీవిత నేపథ్యంతో ప్రారంభమై నా కొడుకు తరం ఉద్యోగంలో స్థిరపడిన వరకు తీసుకొని నవలగా రాస్తున్నాను. కాని అనేక కారణాల వల్ల ముఖ్యంగా నిత్యం ఏదో ఒకటి రాస్తున్న ఒత్తిడి వల్ల సమయం దొరకక దాన్ని పూర్తి చేయలేకపోయాను. దీన్ని తప్పకుండా త్వరలోనే పూర్తి చేస్తాను. ఇది గొల్లల జీవితంపై ఒక ఎపిక్ గా ఉండాలని భావిస్తున్నాను.

3) **మీరు ఎన్ని కథలు రాశారు? మీకు గుర్తింపు తెచ్చిన కథ ఏది?**

**సమాధానం:** దాదాపు 1000 కథలు రాశాను. అన్ని కథలు దళిత, బహుజన జీవితాలను

తీసుకొని మనిషి కేంద్రంగా రాసినవే. నాకు నచ్చిన కథలు కొన్ని వందలు ఉన్నాయి. నిజానికి నేను రాసినవన్నీ నాకు నచ్చిన కథలే. 'మౌన వసంతం', 'మానవ స్వప్నం', 'అమ్మమీది సొమ్ములు', 'ఆంబోతు' లాంటి ఎన్నో కథలు చెప్పుకోవచ్చు. 'అవ్వతోడు గిది తెలంగాణ' కథలు నాకు మంచి పేరుని తెచ్చి పెట్టాయి.

4) **మీరు ఎన్ని నవలలు రాశారు? మీకు గుర్తింపు తెచ్చిన నవల ఏది?**

**సమాధానం:** పదహారు నవలలు రాశాను. అందులో రెండు అసంపూర్ణ నవలలు ఉన్నాయి. ఇంకో పది నవలలకు సరిపోయే సవివరమైన నోట్స్ రాసి ఉంది. నాకు గుర్తింపు తెచ్చిన నవల 'బతుకు పుస్తకం'. ఈ నవల ఆటా (ATA) అంతర్జాతీయ నవలల పోటీలో ప్రథమ బహుమితిని పొందింది. ఈ నవలకు ఈ దేశంలోనే కాక అమెరికాలోను విశేషమైన పాఠకులు ఉన్నారు. డెబ్బై సంవత్సరాల తెలంగాణ సామాజిక, సాంఘిక చరిత్రను తెలిపే ఈ నవల నాకు నచ్చిన నవలల్లో ఒకటి.

5) **మీ నవలకి మొదటి శ్రోత ఎవరు?**

**సమాధానం:** నా నవలకి మొదటి శ్రోతను నేనే అని చెప్పుకోవచ్చు. ఎందుకంటే ఏ నవల రాసినా, కథ రాసినా దానికి ముందు నోట్స్ రాసుకొని తరువాత దాన్ని రాసి రెండు, మూడు సార్లు చదువుకొని ఒక ప్రణాళిక బద్ధంగా ఏమైనా మార్పులు ఉంటే చేసి నాకు సంతృప్తి కలిగితేనే పత్రికకు పంపడమైనా, ముద్రణకు ఇవ్వడంగాని జరుగుతుంది. నా చేతి నుండి వెళ్లిన తరువాత బహుశా ప్రథమ శ్రోత ఆ పత్రిక సంపాదకుడేనేమో.

6) **మీరు అవార్డుల కోసం ఏ రచనైనా రచించారా?**

**సమాధానం:** నేను ఎప్పుడు అవార్డుల కోసం ఏ రచన చెయ్యలేదు. నేను నిరంతరం రాస్తున్న క్రమంలో లేదా పుస్తకం ప్రచురణ చేస్తున్న క్రమంలో ఏదైనా పోటీ ప్రకటన, అవార్డు ప్రకటన వస్తే అప్పుడున్న రచనను పంపేవాడిని. అవార్డు వస్తుందా? రాదా? అని ఎప్పుడూ ఆలోచించలేదు. ఎదురుచూడనూ లేదు. ఎవరైనా అవార్డు వచ్చిందని ఫోన్ చేసో, ఉత్తరం ద్వారానో చెప్పితే తప్ప నాకు తెలిసేది కాదు. అవార్డులు మన వెంట పడాలిగాని మనం అవార్డుల వెంట పడకూడదని నా ఉద్దేశ్యం. జాతీయ, అంతర్జాతీయ, ప్రాంతీయ అవార్డులు వంద వరకు వచ్చి నాకే ఆశ్చర్యం కలిగించేలా చేశాయి.

7) **నేటి కాలంలో నవలలను పాఠకులు ఆదరిస్తున్నారా?**

**సమాధానం:** ఇది ఎలక్ట్రానిక్ యుగం. పుస్తకాలను మొత్తంగా చదవడమే తక్కువయింది. కాని విపరీతంగా పుస్తకాలు మాత్రం అచ్చు అవుతున్నాయి. అంటే మనకు తెలియకుండానే పుస్తకాలు చదివేవారు బాగానే ఉన్నట్టు కదా! నాకు తెలిసి మొదటితరం దళిత, బహుజన గ్రామీణ చదువరులు సాహిత్యాన్ని ఈ కాలంలో ఎక్కువగా చదువుతున్నారు. నవల నిడివి పెద్దది కాబట్టి కథను, కవితను చదివినట్టు చాలా మంది నవలను చదువరు కాని నవలకు ఉన్న విస్తృతి గొప్పది కాబట్టి అంతర్జాతీయ బహుమతులను గెలుచుకుంటుంది. కథ, కవిత చిన్న సంఘటనలను, జీవిత పార్శ్వాలను చెప్పితే నవల జీవితం మొత్తాన్ని తెలియజేస్తుంది. జీవితమంత విస్తృతి ఉన్న నవలను చదివి తీరాలి. రచయితలు రాసి తీరాలి.

8) **నవలా సాహిత్యం ద్వారా మీరు ఏం సాధించాలనుకున్నారు?**

**సమాధానం:** నవలా సాహిత్యం ద్వారా సామాజిక, సాంఘిక, చారిత్రక జీవన సంఘర్షణను సంపూర్ణంగా తెలుసుకోవచ్చు. నా నవలలను చదివితే వంద సంవత్సరాల తెలంగాణ సాంఘిక, సామాజిక చరిత్రలతోపాటు బహుజన జీవితాల జీవన సంఘర్షణ, ఉద్యమాలు, చారిత్రక పరిణామాలు దర్శనమిస్తాయి. మానవ స్వభావం, అంతరంగిక ఘర్షణ, మనిషిని చూసే సమాజం కోసం నేను నవలలు రాస్తున్నాను. అణగారిన జాతుల చరిత్రను రాసేవారు ఆ జాతుల నుండి వచ్చినప్పుడే సరియైన చరిత్ర వస్తుంది. అలాంటి వాస్తవిక చరిత్ర రాయడానికే నవలలు ఉన్నాయి.

9) **రచయితగా మీకు తీరని కోరికలు ఏమైనా ఉన్నాయా?**

**సమాధానం:** యాభై ఏళ్లుగా నిరంతరంగా రాస్తూనే ఉన్నాను. నేను ముట్టని సాహిత్య వస్తువుగాని, సాహిత్య ప్రక్రియగాని లేవు. అయితే బుద్దుని మార్గంలో ప్రాపంచిక దుఃఖ నివారణ ఓషధి గ్రంథాన్ని రాయాలన్నది నా జీవిత లక్ష్యం. అలాగే అణగారిన జాతులైన మూల జాతుల రాజ్యాధికార సాధన కోసం అవసరమైన రచనలను ఇవ్వాలని ఉంది. ఆ పనిలోనే నిమగ్నమై ఉన్నాను. ఇవి నా తీరే కోరికలేనని అనుకుంటున్నాను.

10) **నవలల ద్వారా సమాజానికి మీరు ఎలాంటి సందేశాన్ని ఇవ్వదలచారు?**

**సమాధానం:** మనిషి కేంద్రంగా మనిషి సుఖమయమైన జీవితం గడపడానికే అవసరమైన వ్యవస్థ స్థాపన చేయాలన్నదే నా నవలల ఉద్దేశ్యం. యుద్ధాలు, హింస, తీవ్రవాదం, కాలుష్యం, మనిషి కాలుష్యం, మనస్సుల కాలుష్యం లేని వ్యవస్థను స్వప్నించి

అందుకు అవసరమైన వస్తువును నా నవలల ద్వారా అందిస్తాను. మనిషి మనిషిగా, మనీషిగా మానవత్వం పరిమళించే విధంగా జీవితాన్ని మలుచుకోవాలన్నదే నేను ఇచ్చే సందేశం.

11) **ఇటీవల కాలంలో ఆడపిల్లలపై ఆత్యాచారాలు, అఘాయిత్యాలు ఎక్కువయ్యాయి. వాటిని నిరోధించే రీతిలో ప్రజలను చైతన్యపరిచే రచనలు ఏమైనా రాయబోతున్నారా?**

**సమాధానం:** స్త్రీలపై నేను ఇదివరకే అనేక కథలు రాశాను. దళిత స్త్రీ జీవితం నేపథ్యంగా అస్పృశ్య కోయిల నవల రాశాను. వీటిలో స్త్రీలకి సమాన హక్కులు ఉండాలని చెప్పడం జరిగింది. మాతృస్వామ్య వ్యవస్థ వచ్చినప్పుడే స్త్రీ బతుకులు బాగుపడతాయని నా నమ్మకం. స్త్రీల జీవితం గురించి ఒక సంపూర్ణ నవల రాయాలని చాలా ఏళ్ల క్రితమే నోట్స్ రాసుకొని ఉంచాను. దానిని నేను తప్పకుండా పూర్తి చేస్తాను. ప్రతి పురుషుడు స్త్రీలో తల్లిని, సోదరిని, కూతురిని అలాగే ప్రతి స్త్రీ పురుషునిలో తండ్రిని, కొడుకుని, తాతను, సోదరున్ని చూసుకున్నప్పుడే స్త్రీ, పురుష సమస్యలకు చాలా వరకు పరిష్కారాలు లభిస్తాయి.

12) **మీ నవలల్లో మీ వ్యక్తిగత అంశాలు ముడిపడి ఉన్నాయని భావించవచ్చా? మీ నవలల్లో ఎక్కువగా దళిత, బహుజనుల జీవితాలు ఉన్నాయి. వారి జీవితాన్నే తెలియజేయడానికి గల కారణాలు తెలపండి?**

**సమాధానం:** సాధారణంగా కథలు, నవలలు ఆత్మకథాత్మకంగా రాయడం ఒక పద్ధతి. వ్యక్తిగత జీవితానుభవాలను తీసుకొని వాటినే సాధారణీకరించి రాయడం కూడా చేస్తారు. నేను చాలా కథల్లో నా వ్యక్తిగత అనుభవాలను రచనలుగా మలిచాను. సాంబయ్య చదువు నవల నా ఆత్మకథాత్మక నవల. బతుకు పుస్తకం నవలలో రాజయ్య పాత్రలో అస్పృశ్యకోయిల నవలలో మనోజ్ పాత్రలో నేనున్నాను. నేను బహుజనుల నేపథ్య కుటుంబం నుండి వచ్చాను. అదే జీవితాన్ని చూసాను, అనుభవించాను, జీవించాను. నాకు తెలిసిన జీవితాలను నవలల్లో రాశాను.

13) **మీరు కొన్ని నవలల్లో వామపక్ష భావజాలాన్ని ఎక్కువగా ప్రస్తావించారు. దీనిని బట్టి మిమ్మల్ని విప్లవాభిమానిగా భావించవచ్చా?**

**సమాధానం:** నేను కాలేజీ విద్యార్థిగా ఉన్నప్పుడు రచనలు ప్రారంభించాను. ఆ కాలంలో తెలంగాణ, విప్లవోద్యమాలతో తెలంగాణ ప్రాంతం అట్టుడికిపోయింది. తెలంగాణలో

ఫ్యూడల్ దొరల పాద ఘటనల కింద గ్రామీణ జీవితాలు నలిగిపోయాయి. వీటన్నింటిని చూస్తూ అనివార్యంగా కలం పట్టాల్సిన పరిస్థితులు ఆ కాలంలో ఉండేవి. యవ్వన దశలో వామపక్ష భావాల వైపు ఆకర్షితుడిని కావడం అతి సహజమైన విషయమే. అప్పటి పోరాట ఉద్యమాల్లోని, భూస్వామ్య వ్యవస్థ పతనం, దున్నేవాడికే భూమిలాంటి నచ్చే అంశాలు ఉన్నప్పటికి సాయుధ పోరాటం ద్వారా వాటిని సాధించాలన్నది నాకు నచ్చని అంశం. చిన్నప్పటి నుండి బుద్ధుడి అనుయాయిగా హింస నాకు నచ్చేది కాదు. అందువల్ల నేను వామపక్ష భావాల అభిమానిగా, సామాజిక విప్లవ రచనలు చేశాను తప్ప, సాయుధ పోరాటాన్ని సమర్థించలేదు.

14) **మీ నవలలు ఎక్కువగా పత్రికల్లో సీరియల్సుగా వచ్చాయి. దానికి గల కారణాలు తెలపండి?**

**సమాధానం:** పత్రికల్లో అచ్చు అయితే ప్రజల్లోకి ఏ రచనైనా వెళుతుంది. వేలాది, లక్షలాది మంది పత్రికలను చదవడం వల్ల ఓ రచన పత్రికల్లో వచ్చిందంటే ఆ రచన సగం మార్కులు కొట్టేసినట్లే. ఆ కాలంలో పత్రికలు ఎక్కువగా ఉండటం, పత్రికల్లో రచన వస్తే సంతోషించడం మామూలే. నేను పంపిన ప్రతి రచన ఏదో ఒక పత్రికలో వచ్చేది. అలా రావడం చేత ఎక్కువ రచనలు చేయడానికి అవకాశం దొరికినట్లయింది.

15) **మానవ జీవితం ఎలా ఉండాలని మీరు అనుకుంటున్నారు?**

**సమాధానం:** దుఃఖం, హింస, స్వార్థం, ద్వేషం లేని మానవ అభ్యున్నతిని కోరే జీవన విధానాన్ని అందరూ అలవరుచుకుంటే మానవ జాతి సౌఖ్యంగా ఉంటుంది. ధన వ్యామోహం, అధికార కాంక్ష, అహంకారం జీవితాన్ని దుఃఖమయం చేస్తాయి. బుద్ధుడు చెప్పిన అష్టాంగ మార్గాలు నైతిక వర్తనం మనిషి జీవితానికి చక్కటి మార్గాలని నేను భావిస్తున్నాను.

16) **మీపై ప్రభావం చూపిన రచనలు, రచయితల గురించి చెప్పండి?**

**సమాధానం:** బాల్యం నుండి నాకు పుస్తకాలు చదవడం అంటే ఇష్టం. మా నాన్న చదివిన రామాయణ, మహాభారతాలు మొదలుకొని డిటెక్టివ్ నవలల వరకు చదివేవాన్ని. చిన్నతనంలో బెంగాలీ సాహిత్యాన్ని చదివేవాన్ని. శరత్, రవీంద్రనాథ్ ఠాగూర్, ప్రేమ్ చంద్, మాక్సిం గోర్కి, టాల్ స్టాయ్ ల రచనలను చదవేవాన్ని. సాక్షి వ్యాసాలు, శ్రీశ్రీ

మహాప్రస్థానం, కన్యాశుల్కం, ఆంధ్రుల సాంఘిక చరిత్ర ఇంకా అనేక పుస్తకాలు చదివాను. బుద్ధుని, అంబేద్కర్ రచనలు కాలక్రమంలో పఠనం చేశాను. ఎన్ని చదివినా, వేలాది పుస్తకాలు చదివినప్పటికీ ఏ ప్రభావం నాపై పడకుండా నాదైన మార్గంలో రచనలు చేశాను. సమాజాన్ని పురోగమన దిశలో మనిషి కోసం తండ్లాడే మార్గంలో మానవత్వం పరిమళించే తోవలో నడిపించే రచనను, అవి రాసే రచయితలు నాకు అభిమానపాత్రులే. ఒక్క మాటలో చెప్పాలంటే బుద్ధుడు, అంబేద్కర్ రచనలు నాపై విశేష ప్రభావాన్ని చూపాయి.

**17) మీరు నవలల్లో మాండలికాన్ని ఎక్కువగా ఎందుకు వాడారు?**

**సమాధానం:** మాండలికం జీవద్భాష. అసలు సిసలైన ప్రజల భాష మాండలికం. దీన్ని మాండలికం అనడం తక్కువ చేయడం అవుతుంది. ఇదే ముందు పుట్టిన భాష. మన తాత, ముత్తాతలు, పూర్వీకులు సృష్టించిన భాష. ఇదే నా తల్లిదండ్రుల భాష. పండితులు దీన్ని నిరసించినా, పుస్తకాలలో ఎక్కువగా రాకపోయిన మౌఖికంగా మాండలికం జీవించింది. నేను రచనలు చేయడం ప్రారంభించినప్పుడు తెలంగాణ మాండలిక భాష పత్రికల్లో కనబడేది కాదు. నా తల్లి భాషను, తెలంగాణ భాషను తీసుకొని దానికి సాహిత్య గౌరవం తీసుకరావడానికి నా నవలల్లో మాండలికాలు రాశాను. అది నా భాష కాదు, ఆయా పాత్రల భాష.

**18) మాండలిక పదాలు, అన్యదేశ్య పదాలతో రాయడం వల్ల ఉన్న ఉపయోగాలు ఏమిటి?**

**సమాధానం:** మాండలికం సహజమైన ప్రజల భాష. ఏ పాత్ర భాషను ఆ పాత్రకు వాడితే ఆ రచనకు గొప్ప బలమే కాదు సౌందర్యం ఉంటుంది. కాల్పనిక సాహిత్యానికి మాండలిక భాష గొప్ప అలంకరణ. ప్రజల భాషలో రాసిన కథలు, నవలలు పాఠకులపై ఎక్కువ ప్రభావాన్ని చూపుతాయి. అందుకే మాండలికంలో రాయడం జరిగింది. అక్కడక్కడే అన్యదేశ్య పదాలు ముఖ్యంగా ఇంగ్లీషు, ఉర్దూ పదాలు రాయడంలో దోషం ఏమి లేదు. ఎందుకంటే ఆంగ్లేయులు, ముస్లిం రాజుల పాలనలో వారు వాడిన ఇంగ్లీషు, ఉర్దూ పదాలు భారతీయ భాషల్లో విడదీయలేనంతగా కలిసి పోయాయి. **Oxford** నిఘంటువులో అన్ని భాషల పదాలు బ్రిటన్ సమాజంలో వాడుకలో ఉన్నాయి, చేరాయి. ఆ పద్ధతి చాలా మంచిది.

**19) మాండలిక రచనలు తెలుగు భాషాభివృద్ధికి దోహదపడతాయా? మాండలికంలో**

**రచనలు చేయడానికి ఇబ్బందులు ఉన్నాయా? ఉంటే అవి ఏమిటి?**

**సమాధానం:** అసలు సిసలైన భాషంటేనే మాండలిక భాష. అదే ప్రజల భాష. దానికే ఆ భాష వాడకుండా భాషాభివృద్ధి ఎలా సాధ్యమవుతుంది? భాషను రక్షించుకోవడం అంటే మాండలికాన్ని రక్షించుకోవడమే. మాండలికంలో మన సంస్కృతి, చరిత్ర, వస్తు సంపదలు ఉన్నాయి. కాబట్టి భాషాభివృద్ధికి ఇది అవసరమే. మాండలిక మర్మం తెలిసిన వారికి దాన్ని ప్రేమించిన వారికి అందులో రాయడం ఇబ్బందికరం కాదు.

20) **మీ నవలల్లోని పాత్రలు సహజంగా గ్రామీణ నేపథ్యంలో ఉన్నాయి. అలా ఉండటానికి గల కారణాలు ఏమిటి?**

**సమాధానం:** నేను గ్రామంలో పుట్టాను. గ్రామం అంటే నాకు చాలా ఇష్టం. భారతదేశంలో సగంపైగా జనం గ్రామాల్లోనే నివసిస్తున్నారు. సర్వ సంపదలు సృష్టించే సృష్టికర్తలంతా గ్రామీణులే కాబట్టి వారి పాత్రలను సహజంగా నవలల్లో చిత్రించాను. ప్రతి మనిషి అవసరాలకు ఉపయోగపడే తిండి దినుసులు, పండ్లు, పలాలు, మాంసం, పాలు మొదలైనవి పట్టణాలకు గ్రామాల నుండే వస్తాయి. కాబట్టి గ్రామాభివృద్ధే దేశాభివృద్ధి. అలాంటప్పుడు గ్రామాల గురించి రాయకుండా ఎలా ఉంటాను? గ్రామాలను తీసుకుంటే వస్తువుకు కొరత లేదు. దేశంలోని కుల సమస్య కూడా గ్రామాల్లో ఉంది. అందువల్ల నాకు గ్రామీణ వస్తువును తీసుకొని గ్రామీణులైన వారి పాత్రలను తీసుకొని చిత్రించడం నాకిష్టం.

21) **వివిధ ఇతివృత్తాలను తీసుకొని కమర్షియల్ గా నవలలు రాస్తున్న తరుణంలో సామాజిక అంశాలను ఎంచుకొని నవలలను ఎందుకు రాయాలనిపించింది?**

**సమాధానం:** నేను కాలేజీ విద్యార్థిగా ఉన్న కాలంలో పత్రికలలో ఎక్కువగా వ్యాపార నవలలే వచ్చేవి. అసహజ ప్రేమకథలు, డిటెక్టివ్ రచనలు, భూతప్రేత రచనలు, శృంగార రచనలు పక్కా వ్యాపార దృక్పథంలో వచ్చేవి. ఇవి రాయడం నా బాధ్యత కాదనిపించింది. ఏమి రాయాలని నన్ను నేను ప్రశ్నించుకుని మధనపడి ఎన్నో రోజులు ఘర్షణ పడ్డ సందర్భాలు ఉన్నాయి. మన చుట్టూ ఉన్న సమాజంలో అనేక సమస్యలు ఉన్నాయి. సామాజిక అసమానతలు ఉన్నాయి. సాంఘిక దురాచారాలు, దొరల పీడన, స్త్రీలపై అత్యాచారాలు, వరకట్న సమస్యలు ఇలా ఎన్నో ఉన్నాయి. కార్మికులు, కర్షకులు, వివిధ వృత్తులవారు, మేధావులు, విద్యార్థులు అనేక

సమస్యలతో బాధపడుతుండటం చూసి వ్యాపార రచనలు చేయడం రచయిత లక్షణం కాదని సామాజిక అంతరాలు, కుల వ్యత్యాసాల నేపథ్యం నుండి రచనలు చేయడం ప్రారంభించాను. ముఖ్యంగా నా కుటుంబం సామాజిక నేపథ్యం నుండే రావడంతో సామాజిక రచనలు చేశాను. రచన యొక్క ప్రధానోద్దేశ్యం సామాజిక మార్పును కోరడమే కావాలి కాని టైంపాస్ కాలం గడపడానికి చదువుకునే మసాలాకాకూడదనే ఉద్దేశ్యంతో ఆలోచించినప్పుడు పుంఖానుపుంఖాలుగా సామాజిక వస్తువు లభించింది. ఆ వస్తువుతోనే నవలలు రచించాను.

★★★

అనుబంధం – 2

రచయిత కాలువ మల్లయ్య గారితో ముఖాముఖి ప్రశ్నావళి సందర్భంగా దిగిన ఛాయాచిత్రాలు:







## అనుబంధం – 3

## యు.జి.సి. కేర్ జర్నల్ భావవీణలో, జాతీయ, అంతర్జాతీయ సదస్సులలో సమర్పించిన పరిశోధన పత్రాలు, ధ్రువ పత్రాలు


మాతెలుగు తల్లికి మల్లెపూదండ - మాకన్న తల్లికి మంగళారతులు



# BHAVA VEENA (భావ వీణ)

International Journal of Telugu Literary, Culture & Language Study

(అంతర్జాతీయ తెలుగు సాహిత్య, సాంస్కృతిక, భాషాధ్యయన పత్రిక)

Editor : Kolla Sri Krishnarao

E-mail : parisodhanatelugu@gmail.com

7989781963,
9490847482
Rohini Towers,
2/11 Brodipet, GUNTUR-2.

**Vol. 15 - Issue. 12 (1) - December 2018 - ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253 - Rs. : 15/-**



**EDITORIAL BOARD**

*Chief Editor*
**PITTA SANTHI**
*M.A.(Tel), M.Sc(Psy).,M.Ed.,M.Phil(Edu),(Ph.D).,*
C/o. Dr. Busi Venkataswamy
Holy Homes Apartment
Postal colony ,4 Th Line, 522 002, Guntur Dist., A.P.
Cell no : 7386529274, 7989781963.

**ADVISORY COMMITTEE**

1. **Prof. G Yohan Babu,** M.A., PhD.
   Dept. of Telugu,
   Andhra University, Visakhapatnam.
2. **Prof. K. Madhu Jyothi,** M.A., PhD.
   Dept. of Telugu,
   Sri Padmavathi Mahila University, Tirupathi.
3. **Prof. C. Srirama Chandra Murthy,** M.A., PhD.
   Dept. of Telugu, Faculty of Arts,
   Benaras Hindu University, Varanasi, Utter Pradesh.
4. **Dr. Busi Venkataswamy,** M.A. (Tel)., M.A (San)., M.A (Ling)., PhD.
   HOD & Research Guide
   Dept. of Telugu
   PAS College, Pedanandipadu.

**ASSOCIATE EDITORS**

1. **Dr.N. R. SADASIVA REDDY,** M.A.,M.Phil,PhD.
   Asst. Professor,
   Dept. of Telugu & Comparative Literature,
   Sri Krishna Deva Raya University,
   Ananthapuram, Andhra Pradesh.
2. **Dr.V.SANKARA RAO,** M.A.,M.A.,M.Phil,PhD.
   Associate Professor, Dept. of Telugu, Madras
   University, CHENNAI, Tamilnadu.
3. **Dr. D. SESHUBABU,** M.A.,M.Phil,PhD.
   Asst. Professor, Dept.of Hindi,
   Moulana Azad National Urdu University,
   HYDERABAD, Telangana.
4. **Dr. K. Lavanya,** M.A., M.Phil., PhD.
   Board of Studies Chairman, Telangana University,
   Dichpally, Nizamabad, Telangana.
5. **Dr. N.V. KRISHNA RAO,** M.A.,M.Phil,PhD.
   Asst.Professor, Dept. of Telugu,
   Acharya Nagarjuna University,
   Nagarjuna Nagar, Guntur District.
6. **Dr. A. JYOTHI,** M.A.,M.Phil,PhD.
   Associate Professor, Dept. of Telugu,
   Kakatiya University, Warangal District. Telangana.
7. **Dr. J. VENKATA RAMANA,** M.A.,M.Phil,PhD.
   Asst.Professor, Dept.of Modern Indian Languages,
   Madhurai Kamaraj University, Madhurai, Tamilnadu.

BHAVAVEENA
Vol. 15, Issue. 12 (1), December - 2018.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC Approved Journal No. 42500

# Contents (విషయ సూచిక)

| | | | |
|---|---|---|---|
| 1. | రొంపిచెర్ల - పీలేరు మండలాలలోని సామెతలు | - ఆవుల గిరిబాబు | 5 |
| 2. | ఆరడుగుల నేల ఆహ్వానించిన వేళ - మానవతావాద పరిశీలన | - ఆళ్ళ సుబ్బారెడ్డి | 9 |
| 3. | మహి నవల - పురుష పాత్రల చైతన్యం | - బి.అరుణ | 13 |
| 4. | ఒక విలక్షణ విద్య 'భ్రూకళావధానం' | - డాక్టర్ కప్పగంతుల మధుసూదన్ | 15 |
| 5. | ఆధునిక యువతి అంతర్యానికి అద్దం పట్టిన "కలవరమాయే మదిలో" | - అల్లు గణేష్ | 17 |
| 6. | మంతెన నాటికలు-హాస్యం | - డా. దార సుమన్ | 20 |
| 7. | 'సాహితీ రత్న' మల్లవరపు రాజేశ్వరరావు సాహిత్యం - సామాజిక దర్శనం | - దిట్టకవి తిరుమల శ్రీనివాస్ | 25 |
| 8. | కాలువ మల్లయ్య 'భూమిపుత్రుడు' నవల - రైతు జీవితం | - గడ్డం లింగరాజు | 28 |
| 9. | ఖాదర్ మొహియుద్దీన్ 'పుట్టుమచ్చ' - ముస్లిం మైనారిటీవాద తాత్త్వికత | - డా॥ షేక్ ఇబ్రహీం | 30 |
| 10. | 'సంకెళ్ళు తెగాయి' నవల - మంగలి వృత్తి జీవిత చిత్రణ | - గౌడిచర్ల జనార్దన్ | 35 |
| 11. | బడబాగ్నిని దాచుకొన్న కడలి - కుంతి | - డా॥ నల్లపనేని విజయలక్ష్మి | 37 |
| 12. | రాయప్రోలు కవిత్వం - దేశభక్తి | - సోనబోయిన సతీష్ | 40 |
| 13. | అడుగు'జాడ'లు | - డా. ఇడికోజు శ్రీనివాసాచారి | 43 |
| 14. | తెలుగు సాహిత్యములో నవలా రచయిత్రిగా శ్రీమతి డా॥ కె.శ్రీదేవి | - జె. సంజమ్మ | 45 |
| 15. | హృద్యమైన బాలకథా రచయిత డా॥ గంగిశెట్టి శివకుమార్ | - ఎం. రామలింగయ్య | 50 |
| 16. | వాడుక భాషోద్యమ పితామహుడు-గిడుగు రామమూర్తి | - డా॥డి. సత్యలత | 53 |
| 17. | శిఖామణి-నల్లాగేటూ నంది వర్ధనం చెట్టు - "స్మృతి" కవితలు | - సుంకర గోపాలయ్య | 58 |
| 18. | "తెనుగులెంక" తుమ్మల సీతారామమూర్తి రచనలు - సామాజిక సందేశం | - డా॥ పి. విజయకుమార్ | 60 |
| 19. | అనువాదము - తీరుతెన్నులు | - డా॥ కె. పుష్పమ్మ | 63 |
| 20. | నల్లదీగ శ్రీనివాసాచార్యుల కవిత్వం - వ్యక్తిత్వం | - బొలుగాని శోభన్‌బాబు | 66 |
| 21. | లంబాడి రాందాసు నాటకం - గిరిజన సామాజిక జీవన విధానం | - మూడావత్ వెంకటేష్ | 70 |
| 22. | సిక్కోలు సాహితీ నిర్దేశకులు | - డా॥ పప్పల వెంకటరమణ | 72 |
| 23. | ఉత్తమ కథా సాహిత్యంపై నమ్మకాన్ని ప్రోది చేస్తున్న రచయిత | - యం. మునే నాయక్ | 75 |
| 24. | తెలుగులో స్త్రీల ఆత్మకథలు - పరిచయం | - డా. గిన్నారపు ఆదినారాయణ | 77 |
| 25. | బొబ్బిలి యుద్ధ చారిత్రక ప్రాశస్త్యం | - డా॥ కె.వెంకటరమణ | 81 |
| 26. | పత్రికల ద్వారా వెలుగులోకి వచ్చిన యువకవి | - డా॥ కోడూరు స్వతంత్రబాబు | 84 |
| 27. | దళిత రచయిత్రుల కథా సాహిత్యం - పరిశీలన | - ఇరుగు. మధుకర్ | 87 |
| 28. | "ఇప్పపూలు" కథా సంకలనం - గిరిజన సంచార తెగల జీవితం | - డా.పి.భగ్గు నాయక్ | 90 |
| 29. | వర్తమాన సమాజానికి అద్ధం పట్టిన - 'నిశ్శబ్ధ యుద్ధం' | - డా॥ చిలకా అనిత | 95 |
| 30. | తెలుగు దినపత్రికలలో సాహిత్య పుటలు:ఆధునిక కవితాభివ్యక్తి పద్ధతులు | - జోగు చిరంజీవి | 97 |
| 31. | చాగంటి సోమయాజులు (చాసో) బొండు మల్లెలు - మానవతా విలువలు | - జి. శ్రీనివాస్, - డి.సుశీల్ ప్రత్యూష | 101 |
| 32. | ఒద్దిరాజు సోదరుల 'రుద్రమదేవి' నవల చారిత్రక నేపథ్యం | - తాడూరి స్రవంతి | 104 |
| 33. | ఉదంకుని ప్రతీకార రీతి - నేటి సమాజానికి అన్వయం | - వెంకట నరేంద్ర ప్రసాద్ | 107 |
| 34. | భక్తి: పుట్టుక, ప్రస్థానం, ఉద్యమం | - నందిగామ నిర్మలకుమారి | 109 |
| 35. | చెంచుల సాహిత్యం-సాంస్కృతిక జీవనం | - డా॥ బిర్రు అశోక్ | 111 |

BHAVAVEENA
Vol. 15, Issue. 12 (1), December - 2018.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC Approved Journal No. 42500

# కాలువ మల్లయ్య 'భూమిపుత్రుడు' నవల - రైతు జీవితం

- గడ్డం లింగరాజు, పరిశోధక విద్యార్థి, తెలుగు విభాగం, హైదరాబాద్ విశ్వవిద్యాలయం, హైదరాబాద్.

తెలుగు సాహిత్యాభివృద్ధికి కృషి చేస్తున్న మహామేధావి, సాహిత్య కారుడు డాక్టర్ కాలువ మల్లయ్య. తెలుగు కథా, నవలా రచయితలలో తనకంటూ ఒక ప్రత్యేకతను చాటుకున్న వ్యక్తి కాలువ మల్లయ్య. కవిగా, కథకునిగా, నవలాకారునిగా, విమర్శ కునిగా, వ్యాసకర్తగా బహుముఖ ప్రజ్ఞాశాలిగా తన ప్రతిభను ప్రదర్శిస్తూ పాఠకుల హృదయాల్లో విశిష్ట స్థానాన్ని సంపాదించు కున్నాడు. తెలంగాణలోని గ్రామీణ జీవితాన్ని, దళిత బహుజనుల సంస్కృతిని చిత్రిస్తూ ఎన్నో రచనలు చేశారు. "విశాఖ మాండలి కానికి రావిశాస్త్రి, రాయలసీమ మాండలికానికి నాయిని సాహితీ గౌరవాన్ని కలిగించినట్లే తెలంగాణ మాండలికానికి కాలువ మల్లయ్య సాహితీ కీర్తిని ఆర్జించి పెట్టారని, తన మాండలిక రచనలను అన్ని ప్రాంతాల తెలుగు వాళ్ళతో చదివించిన ఘనత కాలువ మల్లయ్యకే దక్కుతుందని" ఎన్. గోపిగారు ఈ నవల ముందుమాటలో చెప్పారు.

కాలువ మల్లయ్య రచించిన మొదటి నవల 'భూమి పుత్రుడు'. ఇది చతుర పత్రికలో చలసాని ప్రసాదరావుగారి సంపాదకత్వంలో 1991 డిసెంబర్ సంచికలో వెలువడింది. ఈ నవలకు 1992 సంవత్సరంలో పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయం పురస్కారం లభించింది. భూమిపుత్రుడు, సాంబయ్య చదువు, మాట్లాడే బొమ్మలు అనే మూడు నవలలు కలిపి 'కాలువ మల్లయ్య నవలలు' అనే పుస్తకంగా 2001 డిసెం బర్‌లో ముద్రించబడింది.

కాలువ మల్లయ్య సామాజిక అంశాలైన కార్మిక, విప్లవ, దళిత, గ్రామీణ రైతు జీవన విధానాలను, భూస్వామ్యవ్యవస్థ, మధ్యతరగతి కుటుంబ సమస్యలు, స్త్రీల సమస్యలు మొదలైన అంశాలను స్పృశిస్తూ నవలలు రచించారు. 20వ శతాబ్దపు చివర లో వచ్చిన భూమిపుత్రుడు నవలలో ముఖ్యంగా రైతు కుటుం బంలో చోటుచేసుకున్న ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక పరిస్థితు లను తెలియజేశారు.

భూమిపుత్రుడు నవల తెలంగాణ రైతుల యొక్క దుర్భర పరిస్థితులను, భూమిని నమ్ముకున్న రైతు భూమిని అమ్ముకొనే దైన్యస్థితికి రావడానికి గల కారణాలను, బొగ్గు గనుల్లో పనిచేసే శ్రామికుల యొక్క కష్టాలను, బ్యాంక్ అధికారులు, వడ్డీ వ్యాపా రులు రైతులను ఇబ్బంది పెట్టే పరిస్థితులను, ఉన్నత చదువులు చదివి ఏ ఉద్యోగం రాకపోవడం వల్ల నిరుద్యోగిగా ఉన్న యువ కులు చివరికి నక్సలైట్లుగా మారుతున్న వైనాన్ని విశ్లేషిస్తుంది.

ఈ నవలలో ప్రధాన పాత్ర కొండమల్లయ్యది. కొండ మల్లయ్య ఒక రైతు బిడ్డ. అతని వయస్సు 50సంవత్సరాలపైనే. శ్రమైకజీవన సౌందర్యానికి సమానమైంది ఏది లేదని నమ్మిన భూమిపుత్రుడు. వ్యవసాయాన్ని నమ్ముకొని భూమినే జీవనా ధారంగా చేసుకొని బతుకుతూ కుటుంబాన్ని పోషిస్తున్న వ్యక్తి. అతని భార్య నర్సమ్మ, ఆమె వంశం తాత, ముత్తాతల కాలం నుండి కూడా వ్యవసాయ కుటుంబమే. 8సంవత్సరాల వయ స్సులో మల్లయ్యను పెళ్ళి చేసుకుంది. శ్రమజీవనంలోని అందాన్ని చూసిన వ్యక్తి నర్సమ్మ. కష్టాల్లో, సుఖాల్లో భర్తకు చేదోడు వాదో డుగా ఉంటూ సంసార బాధ్యతలు మోస్తుంది.

కొండమల్లయ్య దంపతులకు ముగ్గురు కొడుకులు, ఒక కూతురు ఉన్నారు. పెద్దకొడుకు పేరు రచయిత ప్రస్తావించలేదు. అతడు వ్యవసాయం చేసుకుంటూ తమ ప్రాంతంలో జరుగుతున్న పోరాటాలలో చేరి చివరకు పోలీసు కాల్పుల వల్ల చనిపోతాడు. రెండవ కొడుకు రాజయ్య. మల్లయ్య రాజయ్యను ఐదేళ్ళు నిండగానే బడికి పంపించాడు. కొన్నిరోజుల తరువాత రాజయ్యకు చదువుకోవడం ఇష్టం లేక బడి మానేశాడు. బడి మానేసిన తరు వాత రాజయ్య తండ్రికి వ్యవసాయపు పనుల్లో సహాయంగా ఉండేవాడు. వ్యవసాయం పనులు చేస్తూ రాజయ్య పెళ్ళి చేసు కున్నాడు. పెళ్ళి అయిన తరువాత భార్య లక్ష్మి కోరిక మేరకు బొగ్గు గని పనిలో చేరి గనిలో జరిగిన ప్రమాదం వల్ల చనిపోతాడు.

మల్లయ్య మూడవ కొడుకు తిరుపతయ్య. ఇతన్ని మల్లయ్య బాగా చదివించాలనుకున్నాడు. తండ్రిమీద ప్రేమతో తిరుపతయ్య బాగా చదువుతాడు. తిరుపతయ్య అమ్మమ్మ వాళ్ళ ఊళ్ళో పదవ తరగతి వరకు చదివి ఆ తరువాత సుల్తానాబాదులో ఇంటరు పూర్తిచేసి కరీంనగర్లో బి.ఎ.లో చేరతాడు. ఖర్చులు మరింత పెరగడం వల్ల ఖర్చులు భరించలేక రాజయ్య అతన్ని చదువు మాన్పించాలనుకుంటాడు కాని తండ్రి ఒప్పుకోడు. కుటుం బంలో ఒక్కరైనా చదువుకున్నవాళ్ళుండాలని మల్లయ్య పట్టుపట్టి తిరుపతయ్యను డిగ్రీ వరకు చదివిస్తాడు. చదువు అయిపోగానే ఉద్యోగం వస్తుందని తన కొడుకు కష్టాలు తీర్చుతాడని అను కుంటాడు కాని డిగ్రీ అయి నాలుగేళ్ళు గడిచినా ఉద్యోగం రాలేదు. అటు ఉద్యోగం రాక ఇటు వ్యవసాయం చేయడం చేతగాక తిరుపతయ్య సతమతమయ్యేవాడు. ఇలాగే నిరుద్యోగిగా ఉంటే రాడికల్సులో కలుస్తాడేమోనని మల్లయ్య భయపడేవాడు. చుట్టుప్రక్కల గ్రామాల్లో రాడికల్స్ ప్రభావం చాలా ఉంది. తిరు పతయ్య ఇద్దరు స్నేహితులు రాడికల్సులో కలిసిపోయారు. ఇప్ప

BHAVAVEENA
Vol. 15, Issue. 12 (1), December - 2018.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253



టికే ఓ కొడుకు బలైపోయాడు, చదువుకున్న ఈ కొడుకు కూడా నక్సలైట్ల పోరాటంలో కలుస్తాడేమోనని భయపడేవాడు. కాని తిరుపతయ్యకు అలాంటి విషయాలు, పోరాటాలు నచ్చవు. మల్లయ్యకు తిరుపతయ్య అంటే ఎంతో ప్రేమ, ప్రత్యేక అభిమానం. తాను తిరుపతయ్యను అపురూపంగా చూసుకునేవాడు. చదువుకున్నవాడికే ఎక్కువ ఆలోచనా, జ్ఞానం ఉంటుందని నమ్మేవాడు. కొండమల్లయ్య కూతురు కాంతమ్మ ఇంటి పనులు చేస్తూ తల్లిదండ్రులకు వ్యవసాయపు పనుల్లో సహాయం చేస్తుంది. అర్ధాంతరంగా జీవితం చాలించి వెళ్ళిపోయిన పెద్దకొడుకు గురించి, చదువురాక ఇంకా జీవితంలో స్థిరపడని రాజయ్య గురించి, డిగ్రీ చదివినా బ్రతుకు అగమ్యగోచరంగా ఉన్న చిన్న కొడుకు గురించి, పద్దెనిమిది ఏళ్ళు నిండిన కూతురు పెళ్ళిచేయడం ఆలస్యమైందని తన ఆర్థిక పరిస్థితులను గురించి తలుచుకుంటూ మల్లయ్య దుర్భరమైన జీవితాన్ని గడుపుతున్నాడు.

కొండ మల్లయ్య ఇద్దరు కొడుకులతో వ్యవసాయం పని చేసుకుంటూ గడుపుతాడు. వ్యవసాయం వల్ల వచ్చే ఆదాయంతో ఇంట్లో ఖర్చులు, వడ్డీలు కట్టడానికే సరిపోవట్లేదని తాను బొగ్గు పనికి వెళ్తానని రాజయ్య తండ్రితో అంటాడు. రాజయ్య బొగ్గుగని పనికి వెళ్ళడం మల్లయ్యకు అసలు ఇష్టం ఉండదు. విలాసవంతమైన జీవితం గడపాలన్న భార్య లక్ష్మికోరిక మేరకు ఎలాగైనా బొగ్గుపని చేయాలని నిశ్చయించుకుంటాడు. మల్లయ్య ఆరువేల రూపాయలు వడ్డీకి తీసుకొచ్చి ఏజెంటుకు కట్టేస్తాడు. ఏజెంటు ద్వారా రాజయ్య బొగ్గుగని పనిలో చేరతాడు. గని పని వలన రాజయ్య కష్టాలను ఎదుర్కొంటాడు. గనిలో జరిగిన ప్రమాదం వల్ల రాజయ్య చనిపోతాడు.

మార్గశిర మాసంలో మొక్కజొన్న పంట వేస్తారు. ఆ పంట వల్ల వచ్చిన డబ్బు వడ్డీలు కట్టడానికి, ఇంట్లో ఖర్చులకే సరిపోతుంది. మల్లయ్య ఎద్దును కొనాలనుకున్నా డబ్బు లేకపోవడం వల్ల కొనలేక పోయాడు. తిరుపతయ్య తండ్రికి వ్యవసాయం చెయ్యడం మానెయ్యమని సలహా ఇస్తాడు. ఉన్న మగాణి భూమి అమ్మి బాకీల నుండి విముక్తి పొందాలని చెప్తుతాడు. తాను కరీంనగర్ లో ఏ ప్రైవేటుస్కూల్లో అయినా చేరి నాలుగైదు వందలైనా సంపాదించాలనుకుంటాడు లేదా సింగరేణిలో జాబు చెయ్యడానికి సిద్ధపడతాడు. మల్లయ్య వేసవి పంట పండిన తరువాత భూమి అమ్మకానికి సంబంధించిన విషయంపైన నిర్ణయం తీసుకోవాలనుకుంటాడు.

కూతురు పెళ్ళి వలన అయిన ఖర్చులు మరియు బాకీలు పెరిగిపోవడం వల్ల రోజురోజుకు దిగజారుతున్న ఆర్థిక పరిస్థితులు, ఉన్న భూమిని అమ్మందే బాకీ తీర్చడం సాధ్యంగాని పరిస్థితులు, అగ్నిగుండంలా ఉన్న ఆ ప్రదేశంలోని పరిస్థితులు, వెంటాడుతున్న కొడుకుల జ్ఞాపకాలవల్ల చివరకు రెండెకరాల భూమిని అమ్ముతాడు. వచ్చిన డబ్బుతో ఊళ్ళో ఉన్న అప్పులు తీరుస్తాడు. ఆ తరువాత కొన్ని రోజుల్లో తిరుపతయ్యకు బొగ్గు గనిలో 'కేల్ ఫిల్లర్' ఉద్యోగం వచ్చింది. తిరుపతయ్య ఉద్యోగం వలన కుటుంబం మొత్తం పట్టణంలో ఉండడానికి సిద్ధపడతారు. పుట్టిపెరిగిన ఊరును ఐదు దశాబ్దాలకు పైగా జీవిస్తున్న నేలను, పీలుస్తున్న గాలిని వదిలిపెట్టి పట్టణానికి వెళ్ళినాడు ఆ రైతుబిడ్డ మల్లయ్య.

రైతు బతుకంతా కష్టాల కడలే. ఏడాదంతా ఏరోజు తీరిక దొరకదు. అట్లని ఏ రోజు హాయిగా, సుఖంగా ఉన్నది లేదు. మండుటెండల్లో మాడిపోతూ పనిచేస్తాడు. కడవలకొద్ది ఘర్మజలాన్ని ధారపోస్తాడు. రైతు శరీరంపై ఎప్పుడు చెమట కంపుకి పేరుకుపోయిన ఉప్పు, కాళ్ల పగుళ్ళు తేలి దుబ్బమయమై ఉంటాయి. ఎముకలు కొరికే చలిలోనూ ముడుచుకుపోతున్నా పనిచేయక తప్పదు. చాలా మందికి కప్పుకోవడానికి చిరుగులు పడ్డ గొంగళ్ళు తప్ప వేరే లభించవు. కుండపోత వర్షాలు పడుతున్నా రైతు నానక తప్పదు. వర్షాకాలంలో బురదలో నాగళ్ళు దున్నడం వల్ల కాళ్ళు ఎప్పుడూ నానుతుండటం వల్ల పుళ్లు పుళ్లుగా తయారవుతాయి. అయినా పని.. పని.. పని.. ఏకాలంలోనూ రైతుకు తప్పదు పని.

ఎన్ని పోరాటాలు జరిగినా, జరుగుతున్నా గ్రామాల్లో ఇంకా పాత అవశేషాలు ఉన్నాయి. ఇప్పటికీ చాకలివాళ్ళు కోళ్లను, గొర్రెలను కోసిపెట్టడం ప్రతిగా వాటి కాళ్లు, తలకాయలు తీసుకెళ్లడం, మంగలివారు ఇంటికొచ్చి క్షవరం చేయడం లాంటివి కొన్ని గ్రామాల్లో ఉన్నాయి. బీడీలు చేయడం గృహపరిశ్రమగా కొన్ని గ్రామాల్లో ఉంది. కొంత పారిశ్రామికీకరణ జరిగిన చాలా గ్రామాల్లో కులవృత్తులు చెక్కుచెదరకుండ ఉన్నాయి. చదువుకున్న వాళ్ళలో అన్నికులాల వారు ఉద్యోగాలు దొరికితే చేసే వాళ్లు చేస్తున్నా ఊళ్లలో ఉన్న వాళ్లు పాత వృత్తులే చేసుకుంటున్నారు. పరిస్థితులు తరిమివేయగా కడుపులు చేతుల్లో పట్టుకొని కొంతమంది, మరికొంత మంది బ్రతుకుదెరువు వెతుక్కుంటూ, కొంతమంది ఉద్యోగాలను వెతుక్కుంటూ ఊళ్లు వదిలి వలస పోతున్నారు. అందువల్ల ఊళ్లో కూలిపోతున్న గోడలు పగిలిపోతున్న పెంకులతో శిథిలావస్థలో ఉన్న ఇళ్ళు కనిపిస్తున్నాయి. మరికొన్ని ఊళ్ళలో బ్రతుకు దెరువు కోసం యువకులు ఊరు వదిలి వెళ్ళిపోతే బిక్కుబిక్కుమంటూ ఇంటి వద్ద ఉన్న వృద్ధులు కనిపిస్తారు.

ఈ నవలలో గ్రామీణ రైతు జీవన విధానాన్ని ఎంతో చక్కగా తన అనుభవంతో పాటు, తాను చూసిన సమాజంలోని సంఘటనల ద్వారా కళ్ళకు కట్టినట్లు కాలువ మల్లయ్య చిత్రించారు. రైతుకు భూమి మీద ఉన్న మమకారం గొప్పది. భూమిని కన్నతల్లిగా భావించేతత్వం రైతుది. అందుకే అతను భూమిపుత్రుడయ్యాడు.



మాతెలుగు తల్లికి మల్లెపూదండ - మాకన్న తల్లికి మంగళారతులు

# BHAVA VEENA (భావ వీణ)

Journal of Arts, Literary, Culture & Language Study

(కళలు - సాహిత్య-సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక)

Editor : Kolla Sri Krishnarao
E-mail : parisodhanatelugu@gmail.com

7989781963,
9490847482.
Rohini Towers,
2/11 Brodipet,
GUNTUR-2.

**Vol. 19 - Issue. 7 (1) - July 2022 - ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253 - Rs. : 15/-**

**EDITORIAL BOARD**

*Chief Editor*
**Dr. PITTA SANTHI**
***M.A.(Tel), M.Sc(Psy).,M.Ed.,M.Phil(Edu), Ph.D.,***
**C/o. Dr. Busi Venkataswamy**
Holy Homes Apartment, Postal colony ,
4 Th Line,- 522 002, Guntur Dist., A.P. Cell no : 7386529274, 7989781963.

**ADVISORY COMMITTEE**

1. **Prof. G. Yohan Babu,** M.A., PhD.
Dept. of Telugu,
Andhra University, Visakhapatnam.
2. **Prof. K. Madhu Jyothi,** M.A., PhD.
Dept. of Telugu,
Sri Padmavathi Mahila University,
Tirupathi.
3. **Prof. C. Srirama Chandra Murthy,** M.A., PhD.
Dept. of Telugu, Faculty of Arts,
Benaras Hindu University, Varanasi, Utter Pradesh.
4. **Dr. Busi Venkataswamy,** M.A. (Tel)., M.A (San)., M.A (Ling)., PhD.
Associate Professor, Dept. of Telugu,
Andhra University, Visakhapatnam.
5. **Thottempudi Sree Ganesh,** M.A., M.Phil (Computational Linguistics) (Ph.D)
Research Scientist, Centre for Applied Linguistics and Transalation Studies, Universityof Heidelberg, Germany.
6. **Prof. Darla Venkateswara Rao,** M.A., M.Phil., Ph.D.
HOD, Dept. of Telugu,
Hyderabad Central University, Hyderabad, Telangana.

**ASSOCIATE EDITORS**

1. **Dr. N. R. SADASIVA REDDY**, M.A.,M.Phil,PhD.
Associate Professor,
Dept. of Telugu & Comparative Literature,
Sri Krishna Deva Raya University,
Ananthapuram, Andhra Pradesh.
2. **Prof. V.SANKARA RAO**, M.A.,M.A.,M.Phil,PhD.
HOD, Dept. of Telugu,
Madras University,
CHENNAI, Tamilnadu.
3. **Dr. D. SESHUBABU**, M.A.,M.Phil,PhD.
Associate Professor, Dept.of Hindi,
Moulana Azad National Urdu University,
HYDERABAD, Telangana.
4. **Dr. K. Lavanya,** M.A., M.Phil., PhD.
HOD, Dept. of Telugu
Telangana University, Dichpally,
Nizamabad, Telangana.
5. Prof. **N.V. KRISHNA RAO,** M.A.,M.Phil,PhD.
Dept. of Telugu & O.L.,
Acharya Nagarjuna University,
Nagarjuna Nagar, Guntur District.
6. **Prof. A. JYOTHI,** M.A.,M.Phil,PhD.
Dept. of Telugu,
Kakatiya University, Warangal District.
Telangana.

7. **Dr. J. VENKATA RAMANA,** M.A.,M.Phil,PhD.
Associate Professor, Dept.of Modern Indian Languages,
Madhurai Kamaraj University, Madhurai,
Tamilnadu.

8. **Dr. N. Eswar Reddy,** M.A., PhD.
Associate Professor, Dept. of Telugu,
Yogi Vemana University, Kadapa.

9. **Prof. P.R. Harinadh,** M.A., M.Ed., M.Phil,PhD.
Dept. of Telugu,
Regional Institute of Education (NCRT)
Manasa Gangothri, Mysore, Karnataka.

10. **Dr. B. Tirupathi,** M.A., PhD.
Associate Professor, Dept. of Telugu,
Dravidian University, Kuppam, Chittor Dist.

11. **Dr. T.SATYANARAYANA,** M.A.,M.Phil,PhD.
Asst.Professor, Dept. of Telugu,
Adikavi Nannaya University,
RAJAMUNDRY, East Godavari, A.P.

12. **Mr. D.ESWARA RAO,** M.A.,
Principal,
P.A.S.College, PEDANANDIPADU-522 235,
Guntur, A.P.

13. **Dr. P. VIJAYA KUMAR**, M.A.,M.Phil,PhD.
Vice Principal,
Govt. Degree College, Yemmiganuru.

14. **Dr. K. RAVI**, M.A., M.Phil,PhD.
HOD, Dept. of Telugu,
Govt. Degree College, Narayanapuram.

15. **Dr. Kakani Sudhakar,** M.A., M.Phil., PhD.
Dept. of Telugu,
Govt. Arts College, Rajahmundry.

16. **Dr. P. Srinivasa Rao,** M.A., M.Phil., PhD.
Guest Faculty, Dept. of Telugu,
Potti Sriramulu University, Bommuru.

17. **Dr. Ch. Praveen Kumar,** M.A., M.Phil., PhD.
PDF Scholar, Dept. of Telugu,
Kakatiya University, Warangal.

18. **Dr. N. Rambabu,** M.A., M.Phil., PhD.
Project Senior Fellow, Dept. of Classical
Literature, Nellore.

19. **Dr. G. Sailamma,** M.A., M.Phil., PhD.
Editorial Assistat,
Centre for Publications Dravidian University,
Kuppam, Chittor Dist.

20. **Dr. M. Sangeetha Rao,** M.A., M.Phil., PhD.
Guest Faculty, Dept. of Telugu,
Central University of Andhra Pradesh,
Ananthapuram District. A.P.

21. **Dr. M. Prasad,** M.A., M.A. (San)., PhD. Diploma in Maliyalam.
School Assistant (Telugu)
Govt. High School,
Rapuru, SPSR Nellore.

22. **Dr. Mark Poloneyes,** M.A., M.Phil., PhD.
Principal & HOD,
P.G. Centre, Gadwal,
Palamuru University, Mahabobnagar, Telangana.

**LEGALADVISER**

**Dr. A. GURAVAIAH**, ***M.A., L.L.M., PhD.,***
Principal & Research Guide, Dept., of Law, A. C. Law College, GUNTUR - 522 002, A.P.



**DTP & PRINTING**

**TENALI PRAKASH**, G.L.S. GRAPHICS, LEMALLE, Guntur. 94 94 660 509.


గమనిక : రచయితల అభిప్రాయములతో సంపాదక వర్గమునకు సంబంధం లేదు - **ఎడిటర్.**


Edited, Printed, Published and owned by Kolla Srikrishna Rao, Rohini Towers, 2/11 Brodipet, GUNTUR - 522 002. Andhra Pradesh. Cell : 7386529274, 7989781963.
E-mail : parisodhanatelugu@gmail.com.Printed at : GLS Enterprises, Kavitha Nagar, Guntur - 522 002. Ph. 94 94 660 509.

# Contents (విషయ సూచిక)

| | | | |
|---|---|---|---|
| 1. | బీసీ అస్తిత్వ కవిత్వం దశ - దిశ | - డా॥. చింతం ప్రవీణ్ కుమార్ | 6 |
| 2. | తెలుగు సాహిత్యంలో దేశభక్తి | - డా॥. డి. రాంబాబు | 13 |
| 3. | అంతశ్చేతనలో విధ్వంసం - "మంచుపూవు" | - డా॥. కె. శ్యామలాదేవి | 17 |
| 4. | వడలి రాధాకృష్ణ కథా సంపుటి 'గూటి పడవ' - గ్రామీణ జీవనం | - డా॥. లంకిపల్లె జ్యోతీశ్వర నాయుడు | 20 |
| 5. | అనువాదవిద్య : అనువాదకులకు మార్గదర్శక సూత్రాలు | - డా॥. ప్రత్తిపాటి మాథ్యు | 23 |
| 6. | కుప్పిలి పద్మ కథలు : ప్రపంచీకరణ ప్రభావం - స్త్రీ చైతన్యం | - డా॥. వి. శాంతిలక్ష్మి | 30 |
| 7. | భారతం తెలిపిన భార్య గొప్పతనం | - డా॥. సూరపరాజు వసంత కుమారి | 37 |
| 8. | జాలా రంగస్వామి - జీవితం, రచనలు | - డా॥. ఎల్లే విజయానందరాజు | 41 |
| 9. | ఆదర్శ సమాజ నిర్మాణంలో కాలువ మల్లయ్య కృషి | - గడ్డం లింగరాజు | 45 |
| 10. | నిప్పుల గళం - అంజయ్య కలం | - పోల్కం రాములు | 50 |
| 11. | | - డా॥. లగుడు వరలక్ష్మి | 58 |
| 12. | Analogy between Theme and Characters in Arundhati... | - Dr. Adi Ramesh Babu | 59 |
| 13. | Measuring university students' Technostress in ... | - Akash Kumar & <br> - Ravi Kant | 72 |
| 14. | Caste Gender and Media | - Sujatha Devarapalli | 81 |
| 15. | Philosophical Aspects Reflected in Vamana Puram | - Dr. Asa Devi G. | 88 |
| 16. | National Education Policy 2020 : An Overview | - Dr. K. Lakshman | 90 |
| 17. | Use of Dictionary : A tool to learn English Language | - Dr. P. Sarath Chandra | 96 |
| 18. | Sociolinguistics and Multilingual Communities | - Dr. M.Prasad Naik | 103 |
| 19. | Ganga : The sacred river on the earth | - Dr. Nilachal Mishra | 108 |
| 20. | Error analysis of secondary school students in .... | - Firdaus Tabassum | 112 |
| 21. | Anthropocentrism and Econarratology in Flight Behaviour | - Haritha Fernandez, <br> - Harinandana R. & <br> - Shibani Chakraverty Aich | 124 |
| 22. | An Indian Magi Play to Sustain the Community Identity | - Joly Puthussery | 127 |
| 23. | Political Discourse through Web-based Political ... | - Kasi Babu | 134 |

BHAVAVEENA
Vol. 19, Issue. 7 (1), July 2022
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావ వీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

# ఆదర్శ సమాజ నిర్మాణంలో కాలువ మల్లయ్య కృషి

- గడ్డం లింగరాజు, పరిశోధక విద్యార్థి, తెలుగు విభాగం, హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం.

తెలుగు సాహిత్యంలో తన రచనల ద్వారా తెలంగాణ గ్రామీణ జీవనం, ఆచార వ్యవహారాలు, సంస్కృతి సాంప్రదాయాలు, విశ్వాసాలు, పండుగలు మొదలైన వాటిని తనదైన శైలిలో సాహిత్య సృష్టిని చేస్తున్న రచయితలలో కాలువ మల్లయ్యగారు ప్రముఖులు. కాలువ మల్లయ్యగారు తన రచనా వ్యాసంగం ద్వారా సమాజంలోని అనేక సమస్యలను రచనల్లో చిత్రిస్తూ,వాటికి తనదైన పరిష్కార మార్గాలను చూపిస్తూ, ప్రజలను, సమాజాన్ని చైతన్యవంతులను చేస్తున్నారు.ఒక రచయిత యొక్క విలువలు తెలుసుకోవాలంటే ఆ రచయిత యొక్క సామాజిక వర్గాన్ని, రచయిత పెరిగిన పరిసరాలను వారి కుటుంబ నేపథ్యాన్ని తెలుసుకోవటం ద్వారా ఆనాటి దేశ,కాల, సామాజిక పరిస్థితులు తెలుస్తాయి.తద్వారా వారి రచనల్లో ప్రతిబింబించిన సామాజిక స్పృహను అంచనా వేసి సమాజానికి తెలుపవచ్చు.కాలువ మల్లయ్య బహుముఖ ప్రజ్ఞాశాలి. కథా రచయితగా, నవలాకారునిగా, నాటకకర్తగా, సినిమాలకు కథా రచయితగా, దృశ్య శ్రవ్య మాధ్యమ రచయితగా, సంపాదకునిగా, వ్యాసకర్తగా కాలువ మల్లయ్యగారు అన్ని ప్రక్రియల్లో తన రచనా వ్యాసాంగాన్ని సృజించారు.

రచయితగా కాలువ మల్లయ్యగారు గత 40 సంవత్సరాల సాహితీ ప్రస్థానంలో ఎనిమిది వందలకు పైగా కథలు, పదిహేడు నవలలు, ఐదు కవితా సంపుటాలు, రెండు వందలకు పైగా వ్యాసాలు, నూట యాభై కవితలు, పది నాటకాలు రాశారు. ఇంకా మరెన్నో గ్రంథాలకు సంపాదకునిగా కూడా వ్యవహరించారు. సాహిత్యం ద్వారా ఆదర్శవంతమైన సమసమాజ నిర్మాణం కోసం కాలువ మల్లయ్యగారు చేస్తున్న కృషిని తెలపటమే ఈ వ్యాసోద్దేశ్యం.

పూర్వం నుండి నేటి వరకు కూడా సమ సమాజ వికాస అభివృద్ధి కోసం దళితులు, బహుజనులు, బి.సి.వృత్తి కులాల వారు అత్యంత ముఖ్యమైన పాత్రను పోషిస్తున్నారు.వారు సంఘంలో సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక రంగాలను ఎంతో ప్రభావితం చేస్తున్నారు.గత యాభై సంవత్సరాల సామాజిక చరిత్రను వీరి కొరకు తన రచనల్లో నిక్షిప్తంచేసి బావి తరాలకు అందించిన వారిలో ముఖ్యుడు.అన్యాయాలకు దోపిడీకి,అణచివేతకు గురైతున్న ప్రజానీకం పై తన రచనల్లో అంతులేని ప్రేమను కురిపించారు. ఈ జనం జీవితాలలో మార్పు రావాలని తపిస్తున్నారు. సర్వసంపదలకు సృష్టి కర్తలైన దళిత బహుజనులు రాజ్యాధికారంలోకి రావాలన్నదే వీరి రచనల్లోని లక్ష్యం.కాలువ మల్లయ్యగారి కథలు, నవలల్లో తెలంగాణ మట్టి వాసన గుబాలిస్తుంది.తెలంగాణ భాష, నుడి కారపు సొంపు పాఠకుల్ని మంత్రముగ్ధుల్ని చేస్తుంది.సహజమైన, స్వచ్ఛమైన మాండలికంలో రచనలు చేసిన అతికొద్ది మంది రచయితలలో కాలువ మల్లయ్య గారు ఒకరు.వీరి రచనల్లో మన చుట్టూ ఉన్న సామాజిక సమస్యలు కనిపిస్తాయి. తెలంగాణ ప్రాంత సంస్కృతి, సంక్షోభం, సంఘర్షణ, పోరాటాలు,పరిష్కారం, దళిత బహుజన జీవితం, రైతాంగ జీవితంలోని కడగండ్లు, వ్యవసాయ, అసంఘటిత కూలీల బతుకులు, బొగ్గు గని కార్మికుల జీవనం, భూస్వాములైన దొరల దౌర్జన్యాలు, మావోయిష్టుల విప్లవ ఉద్యమాలు, బీడీ కార్మిక శ్రామిక వర్గాలు,నశిస్తున్న కుల వృత్తులు, మారుతున్న పల్లె సంస్కృతి వలస బతుకులు, వరకట్న సమస్యలు, ఉమ్మడి కుటుంబాల విచ్ఛిన్నం, రక్త సంబంధీకులను, తల్లిదండ్రులను నిరాదరిస్తున్న అనమానత్వం, పరాయికరణకు గురి చేస్తున్న చదువులు, ఇంగ్లీషు

మీడియం చదువులు, కంప్యూటర్ విద్య, విదేశాలపై మోజు వంటి పరిణామాలు, ప్రపంచీకరణ ప్రభావం, మధ్యతరగతి కుటుంబాలలో పెరుగుతున్న ఆశలు, అయోమయం వంటి మొదలైన సమస్యలు తెలంగాణ సామాజిక, ఆర్థిక, రాజకీయ పరిణామాలు, సామాజిక సంఘటనలు వీరి కథల్లో, నవలల్లో ప్రతిబింబిస్తాయి. అందుకే వీరి రచనలు సామాజిక చరిత్రను రికార్డు చేసినట్లుగా కనిపిస్తాయి.

1982లో వెలి, పాలేరు, పతనం, భ్రమలు, మార్పు అనే కథలు రాసారు. అన్ని కథలను వివిధ పత్రికలకు పంపారు. అన్నింటికంటే ముందుగా సృజన పత్రిక నుండి 1983జనవరి సంచికలో వెలి కథ అచ్చయింది.తర్వాత మిగిలిన కథలు అన్ని అచ్చయ్యాయి.కాలువ మల్లయ్య గారి మొదటి కథగా 'వెలి'అనే కథను చెప్పవచ్చు.వెలి కథ ఒక రజక స్త్రీ గురించి చెప్పబడింది. ఒక చాకలి స్త్రీని ఊరి దొరలు, గ్రామ బహిష్కరణ చేస్తే ఆమె విప్లవోద్యమ స్ఫూర్తితో దొరను ఎదిరించి,దొరల ఆధిపత్యంపైన తిరుగుబాటు చేసిన బావమరదళ్ళ కథ. ఒక దళితుడైన పాలేరు విప్లవ చైతన్యంలో దొరని ఎదిరించిన కథ 'పాలేరు' కథ. ఒకప్పుడు తెలంగాణా సాయుధ పోరాటాన్ని సమర్థించి కమ్యూనిస్టుగా ఉన్న వ్యక్తి ఆతర్వాత వ్యాపారిగా, పెట్టుబడిదారీ వ్యవస్థలోకి వెళ్ళిన వ్యక్తి కథే. 'పతనం' కథ. ఈ వ్యవస్థపై ప్రజలకు ఉన్న భ్రమలు తొలగి పోవాలని విప్లవించి సమ సమాజాన్ని స్థాపించుకోవాలనే చెప్పే కథే 'భ్రమలు'. 1986ప్రాంతంలో రాసిన 'అవ్వతోడు గిది తెలంగాణ' శీర్షికతో రాసిన యాభై కథలలో పండుగనాడే. మెతుకుల బువ్వ, ఆగమాగమయింది', బతుకుదెరువు లేకుంట యింది, మందమీద తోడేలు పడ్డట్టయింది, పురాగటిక్క టాసారు, సోసంత్రమంటేందే? మొదలైన కథలు వివిధ కులాల పై, వృత్తుల పతనం పై మాండలిక భాషలో రాసినవి.అవే కాలువ మల్లయ్యగారికి రచయితగా మంచి గుర్తింపును ఇచ్చాయి. కాలువ మల్లయ్య గారి కథల్లో చాలా వరకు భూస్వాముల ప్రతినిధులైన దొరల ప్రస్తావనే ఉంటుంది. కాలక్రమేణా భూస్వామ్య వ్యవస్థ విచ్ఛినం కావడానికి దారి తీసిన పరిస్థితులు ప్రస్ఫుటమయ్యాయి. భూస్వామ్య వర్గ ప్రతినిధులైన దొరలు అణగారిన కులాల పై దౌర్జన్యం చేసి అన్ని విధాలుగా దోచుకున్నారు. లైంగిక దోపిడి తమ హక్కు అన్నట్లు ప్రవర్తించేవారు. ఆనాటి దొరల లైంగిక దోపిడీకి నిలువెత్తు దర్పణం 'దొరసానిచీర' కథ.తెలంగాణ లోని ఒకనాటి దొరతనానికి కంచుకోటగా ఉన్న దొరల నివాసాలు నక్సలైట్ ఉద్యమం అనంతరం సామాజిక పరిణామాల వల్ల శిథిలమై ఎలాంటి దుస్థితికి చేరుకున్నాయో తెలిపే కథే 'దొరగారిగడి'.తెలంగాణలోని నిజాంప్రభువు దయాదాక్షిణ్యాలతో భూస్వాములు దొరలుగా, పటేలుగా, దేశ్ముఖ్లుగా, జమీందారులుగా, చెలామణి అవుతూ గ్రామాధికారులపై ఆధిపత్యం చెలాయిస్తూ ఇలా అన్ని అధికారాలతో సామాన్య ప్రజలను చెప్పు చేతల్లో పెట్టుకున్నారు. వెట్టి పనివాళ్ళు, షేరిదార్లు, దళితులు, వివిధ కుల వృత్తుల వారు సపర్యలు చేస్తుంటే రాజభోగాలు అనుభవించారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట కాలంలో వీరి అధికారానికి కొంత వరకు అడ్డుకట్ట వేయబడింది. గ్రామాలలో విస్తరించిన నక్సలైట్, విప్లవోద్యమాలు భూస్వామ్య వ్యవస్థను నశింపచేశాయి. దీనితో సామాన్య ప్రజానీకం గ్రామాలలో ఊపిరి పీల్చుకున్నారు. 'ధిక్కారం' కథలో బడుగు బలహీన వర్గాల ప్రజలు తెలంగాణలో ఉవ్వెత్తున లేచిన విప్లవోద్యమాల వల్ల చైతన్యవంతులై తరతరాల అగ్రవర్ణపు భూస్వామ్యపు ఆధిపత్యాన్ని దిక్కరించి నిలిచిన వైనం కనిపిస్తుంది.

కాలువ మల్లయ్య రచనలు గ్రామీణజీవనాన్ని ఆసరాగా చేసుకుని చిత్రించినవే. పల్లెలో పుట్టిపెరిగి, బాల్యమంతా పల్లెలో గడపడంతో కాలువమల్లయ్యకు గ్రామీణ సమాజంపై పరిపూర్ణమైన అవగాహన ఏర్పడింది. గ్రామీణుల మనస్తత్వం, సంస్కృతి,జీవితం, కులవర్గ పోరాటాలు, పీడన కట్టుబాట్లు, ఆచార వ్యవహారాలు, వాతావరణం దుర్భర పరిస్థితులు వీరికథల్లో కనిపిస్తాయి.

మారుతున్న కాలంతోపాటు ఆచార వ్యవహారాలు మారుతుంటాయి. అలా మారుతున్న క్రమంలో కులవృత్తులు, జీవనభారం కోల్పోతున్న వైనాన్ని చిత్రించిన కథ 'మడేలయ్య మనస్సు' గౌడ కులవృత్తిని వారి జీవన విధానాలను గురించి 'ఊరుమ్మడి బతుకులు' కథలో చిత్రించాడు. గొల్లకులం వారి ప్రధానవృత్తి మేకలు, గొర్రెలు కాయడం. వారు ఎండనక, వాననకం వాటిని కాసుకుంటూ బ్రతుకుదెరువును కాపాడుకుంటున్న వైనాన్ని 'అడవికాచిన వెన్నెల' కథలో చిత్రించారు. గత తరం వారి వ్యక్తుల్లోన్ని నిష్కల్మషమైన మనస్తత్వానికి వరసలు పెట్టుకుని పిలుచుకునే ఆప్యాయతానురాగాలు 'ముసలవ్వ మనస్సు'కథలో ఉన్నాయి.ఉమ్మడి కుటుంబ వ్యవస్థ ఔన్నత్యాన్ని చాటి చెప్పిన కథ 'పెద్ద తాతయ్య' కథ.

భూమిపుత్రుడు నవల తెలంగాణ రైతుయొక్క దుర్భర పరిస్థితులను, భూమిని నమ్ముకున్న రైతు భూమిని అమ్ముకునే దైన్యస్థితికి రావడానికి గల కారణాలను, బొగ్గుగనుల్లో పనిచేసే శ్రామికుల యొక్క కష్టాలను, బ్యాంకు అధికారులు, వడ్డీవ్యాపారులు, రైతులను ఇబ్బంది పెట్టే పరిస్థితులను, ఉన్నత చదువులు చదివి ఉద్యోగం రాకపోవడంవల్ల నిరుద్యోగులుగా ఉన్న యువకులు, చివరికి నక్సలైట్లుగా మారుతున్న వైనాన్ని విశ్లేషిస్తుంది.

'సాంబయ్య చదువు' నవలలో సామాన్య రైతు కుటుంబంలో జన్మించిన సాంబయ్య చదువుకుని ఉద్యోగంలో, జీవితంలో స్థిరపడటం వంటి అంశాలను నేపథ్యంగా ఒక మధ్య తరగతి దళిత యువకుడి జీవిత ప్రస్థానాన్ని చిత్రించారు. ఈ నవలలో కథారంభం "చదువు నేపథ్యంగా 1940-1986 వరకు తెలంగాణ గ్రామీణ జీవనంలో నెలకొన్న సామాజిక పరిణామాలను ఈ నవల ప్రతిఫలింపజేసింది. కాలువ మల్లయ్య స్వీయజీవనం అంతసూత్రంగా ఈ నవల రూపుదిద్దుకుంది" (ఐలయ్య బన్న, కాలువ మల్లయ్య కథలు తెలంగాణా జనజీవితం; పుట: 109).'మాట్లాడేబొమ్మలు' నవలలో చదువు మూలంగా కుటుంబాల్లో మనుషుల మధ్య దూరాలు పెరగడం, బంధాలు తరగడం, గ్రామసీమలను నిర్లక్ష్యం చేయడం ఇతివృత్తంగా సాగిన నవల ఇది. సంస్కారాన్ని ఆదర్శాన్ని, విజ్ఞానాన్ని వినయాన్ని నేర్పవలసిన విద్య మనుష్యు లను స్వార్థపూరితంగా తయారుకావడానికి గల పరిస్థితులను ఈ నవల తెలియజేస్తుంది. ఈ నవల 'సాంబయ్య చదువు' నవలకు కొనసాగింపుగా అనిపిస్తుంది. ఈ మూడు నవలలో గ్రామీణ జీవితంలోని మధ్యతరగతి కుటుంబాలు పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. ఒక తరం నిరక్ష్యరాస్యతకు గురైతే మరొక తరం చైతన్యం అవుతుంటే దళిత, బహుజనులను దొరలు, వడ్డీ వ్యాపారులు, బ్యాంకు అధికారులు ఎలా వారిని పీడనకు గురి చేస్తున్నారో తెలుసుకోవచ్చు అయినా యువకులు దొరలను ఎదిరించి గ్రామసీమలను చైతన్యం వంతం చేసి పట్టణాల్లోకి వెళ్ళి ఉన్నతమైన విద్యను అభ్యసించి నాగరికతవైపు ఎలా వెళ్ళారో ఈ మూడు నవలలు మనకు విశ్లేషిస్తాయి.

'అస్పృశ్య కోయిల' నవలలో తెలంగాణాలోని గ్రామీనజీవిత సంబంధాలు, అక్కడి ఆదిపత్య కులాల దురహంకారం, అణగారిన కులాలు ఎదుర్కొనే వివక్షను కళ్లకుకట్టినట్లు చిత్రించారు. అస్పృశ్యత కారణంగా సమాజానికి దూరం చేయబడ్డ వారు ప్రజాజీవన స్రవంతిలో కలిసిన విధానాన్ని వివరించారు. ఊరు ఊరంతా అంటరానివారంటూ కులవివక్షత చూపుతూ అణిచివేతను అమలు చేస్తున్న కాలంలో పండగే కాదు, దేవాలయప్రవేశాన్ని నిషేధించిన కాలంలో కులవివక్షను ప్రశ్నించిన స్త్రీ యొక్క జీవితాన్ని ఆవిష్కరింపజేశారు. దొరలచేతుల్లో బలైన ఒక స్త్రీ తన జీవన ప్రస్థానంలో ఏ మార్గం ఎంచుకుందో తెలిపే ఈ రచన దళిత బహుజన సాహిత్యంలో ఒక మైలురాయిగా నిలుస్తుంది. ఈ నవలలో గ్రామంలో పాతుకుపోయిన దురాచారాలు, దళితుల శ్రమైక జీవితం, దళిత ప్రజల్లో వస్తున్న చైతన్యాన్ని మనం

గమనించవచ్చు. దొరలను ఎదిరించి దళితవాడల వైపు చూస్తున్న దొరల అహంకారాన్ని అణగదొక్కి దళితస్త్రీశక్తిగా నిలిచిన ఒక స్త్రీ ఎదిగిన క్రమాన్ని మనం గమనించవచ్చు.

'మాదిగవిజయం' అనే నవల మాదిగ సామాజిక వర్గానికి చెందిన ఒక కుటుంబం కాలానుగుణంగా అంచెలంచెలుగా ఏ విధంగా అభివృద్ధి చెందిందో తెలియ జేసే నవల. కాలక్రమంలో ఆ కుటంబ పరిణామం, అభ్యుదయం, చైతన్యం, అభివృద్ధి ఈ నవలలో కనిపిస్తాయి. ఒక కుటుంబానికి చెందిన నాలుగు తరాల దళితుల జీవన విధానాన్ని రచయిత చిత్రించడం జరిగింది.

'అస్పృశ్యకోయిల', 'మాదిగవిజయం' అనే ఈ రెండు నవలల్లో దళితుల జీవన విధానం ఉంది. వారు ఏ విధంగా భూస్వాములు, దొరలచేత ఏ విధంగా పీడించ బడ్డారో తెలుసుకోవచ్చు.కులం పేరు చెప్పుకోలేని స్థితినుండి ఈ రోజు మా కులం మాల, మాదిగలమని చెప్పుకునే స్థాయికి ఎదిగిన తీరును ఈ నవలలు తెలియ జేస్తాయి. తెలంగాణా గ్రామీణ సమాజంలో అంటరాని వారిగా ముద్రపడిన సమాజవివక్షకు గురైన దళితులు స్వాతంత్ర్యానంతరం బాగా చదువుకుని ఉద్యోగాలను పొంది సమాజ గౌరవాన్ని, జీవన ప్రమాణాలను మెరుగు పరుచుకుంటున్నారు.

తెలంగాణ పల్లెల్లో 1960సంవత్సరం తర్వాత వచ్చిన మార్పుల్ని చిత్రించిన నవల 'బతుకుపుస్తకం'. ఈ నవలలో తెలంగాణ సంస్కృతిని గురించిన వివరణ పుష్కలంగా ఉంది. జానపద ప్రదర్శనల కళలు, బతుకమ్మ పండుగలు, పోచమ్మ బోనాలు, పెండ్లి వేడుకలు వాటిల్లో వివిధ వృత్తుల వాళ్ళు పాల్గొనటం, మానవ సంబంధాలలో కులాలకు అతీతంగా ప్రేమానుబంధాలు క్రమంగా అవి సడలిపోవడాన్ని రచయిత ఎంతో నేర్పుగా చిత్రించారు. పెట్టుబడులు కేంద్రీకృతం కావటం, కేవలం పట్టణాలలోనే ఆర్థిక అవసరాలు అందుబాటులో ఉండటం, మరోవైపు వలసలు వీటన్నింటి వల్ల క్రమంగా గ్రామాలు ఖాళీ అయ్యే పరిస్థితి నెలకొంది. ఈ విషయం మామూలు సందర్భాలలో అయితే అర్థం కాదు కానీ, ఒకటి, రెండు దశాబ్దాలకు ముందు పండుగలకు ఊర్లకు వచ్చే జనాల సంఖ్యనూ, నేడు ఊర్లకు పండుగలకు వస్తున్న జనాల సంఖ్యనూ చూస్తే చాలా స్పష్టంగా బోధపడుతుంది. ఈ పరిణామాలన్నింటిని ఈ నవల ఎంతోచక్కగా పూసగుచ్చినట్లు వివరిస్తుంది.

'గువ్వల చెన్నా' నవల పద్మశాలీల కులవృత్తిని గురించి,చేనేత కార్మికుల కష్టాలను గురించి వివరించిన నవల. ప్రపంచీకరణ నేపథ్యంలో అంతరించిపోతున్న నేత కార్మికుల వృత్తిని గురించి తెలిపిన నవల ఇది. ప్రపంచీకరణ పేరుతో పల్లెల్లో వచ్చిన ఫ్యాషన్ డిజైనింగ్‌లు పేద బతుకులను ఎలా కడదేర్చుతున్నాయో రచయిత చక్కగా తెలియజేశారు. అగ్గిపెట్టెలో చీరలను విదేశాలకు పంపించగల దేశం ఈ రోజు ప్రపంచీకరణ భూతానికి నేతపనివారి పనితనం కనుమరుగై పోవటం ఈ నవలలో చూస్తాం.

కాలువ మల్లయ్యగారు తన రచనల్లో ఉత్తర తెలంగాణలోని కరీంనగర్ జిల్లా మాండలికాల్ని విరివిగా వాడారు. ఈ మాండలికం అంతా అట్టడుగు వర్గాల వారిదేనని రుజువు అవుతుంది.తెలంగాణ యాసను స్వీకరించి,వారి రచనల్లో అన్ని పాత్రలకు వాడారు. అతని రచనల్లోని పాత్రలు చాలా సాదాసీదాగా ఉంటాయి. అందువల్ల పాఠకులు ఆ పాత్రల్లో తమను తాము చూసుకోవటం విశేషం. అందుకే వీరి రచనలు పాఠకులకు ఆత్మీయమైనవిగా ఉంటాయి. తమ ఊరి వ్యక్తుల్ని పాత్రలుగా మలచి కథల్లో, నవలల్లో రచనకు వాస్తవికతను కల్పించారు.ఒక ప్రాంతంలోని సామాజిక జీవితాన్ని తీసుకుని విశ్వసనీయతను కలిగించి, రాయడంలోనే రచయిత విజయం ఆధారపడి ఉంటుంది. గొప్ప రచనలు అన్నీ ఇలా సార్వజనీనమైనవే అనే సంకల్పాన్ని త్రికరణ శుద్ధిగా నమ్మి సాహితీ

వ్యవసాయం చేస్తున్న అక్షర కృషీవలుడు కాలువ మల్లయ్యగారు. ఆయన సాహిత్య కృషిని గుర్తించి, ఎన్నో సంస్థలు, అకాడమీలు, పత్రికలు సాహిత్య పురస్కారాలను అందించాయి. కొన్ని నవలలు, కథలు, ఉత్తమ పురస్కారాలను పొందాయి. అవి

1. 'భూమి పుత్రుడు' నవలకు పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం వారు ఎటుకూరి వెంకటనరసయ్యగారి పురస్కారం అందించారు.
2. 'సాంబయ్య చదువు' నవల ఆటా వారి నవలల పోటీల్లో మొదటి బహుమతి పొందింది.
3. 'బతుకు పుస్తకం' నవల ఆటా వారి నవలల పోటీల్లో మొదటి బహుమతి పొందింది.
4. 'సృష్టికర్త ఆవేదన' కథ ఆంధ్రప్రభ కథల పోటీల్లో బహుమతి పొందింది.
5. 'కరువు' కథ స్వాతి వారి కథల పోటీల్లో మొదటి బహుమతి పొందింది.
6. 'మా కథలు' విశాల సాహిత్య పురస్కారాన్ని అందుకుంది.

ఇంకా అనేక రకాల సాహిత్య పురస్కారాలు, బహుమతులు అందుకున్నారు.తెలుగు అధికారా భాషా సంఘం సభ్యులుగా 2005నుండి 2007 వరకు ఉన్నారు. కాలువ మల్లయ్యగారు చేస్తున్న విశేష సేవకు గుర్తింపుగా, సాహిత్య విలువలు కాపాడుతున్న సంస్థల్లో ఘనమైన గుర్తింపును పొందారు.

**ఆధార గ్రంథాలు :**


1. ఐలయ్య, బన్న; కాలువ మల్లయ్య కథలు తెలంగాణ జనజీవితం; వరంగల్, నానీ ప్రచురణలు; 2010.
2. మల్లయ్య, కాలువ; కాలువ మల్లయ్య నవలలు; కరీంనగర్; తెలుగు వచనం ప్రచురణలు, 2001.
3. మల్లయ్య, కాలువ; గువ్వలచెన్నా; హైదరాబాద్; చతుర మాస పత్రిక; 2009.
4. మల్లయ్య, కాలువ; అస్పృశ్య కోయిల; హైదరాబాద్, లిఖిత ప్రెస్; 2017.
5. మల్లయ్య, కాలువ; మాదిగ విజయం; హైదరాబాద్, సామాజిక భారత్, బి.వి.వి.ఛారిటబుల్ ట్రస్టు; 2015.
6. మల్లయ్య, కాలువ; అవ్వతోడు గిది తెలంగాణ; హైదరాబాద్, దేవులపల్లి పబ్లికేషన్స్; 1998.
7. మల్లయ్య, కాలువ; మాకథలు; హైదరాబాద్, విశాలాంధ్ర పబ్లికేషన్స్; 1998.


★★★

జ్యోత్స్నా కళాపీఠం హైదరాబాదు
చిత్కళా వాహిని హైదరాబాదు

సంయుక్త నిర్వహణలో

# తెలుగు సాహిత్యం - దేశభక్తి భావన
# జాతీయ సదస్సు

2018 జనవరి 19, 20 శుక్ర, శనివారాలు
వేదిక : కాన్ఫరెన్స్ హాల్, హ్యుమానిటీస్, గచ్చిబౌలి, హైదరాబాదు విశ్వవిద్యాయలం, హైదరాబాదు

## ధ్రువీకరణ పత్రం

శ్రీ / శ్రీమతి / డా॥ / ఆచార్య గడ్డం. లింగరాజు

జాతీయ సదస్సుకు హాజరై చదువు నవల-దేశభక్తి భావన

అనే అంశంపై పరిశోధనా పత్రాన్ని సమర్పించారు.

ఆచార్య ఎస్. శరత్‌జ్యోత్స్నారాణి
సదస్సు కో-ఆర్డినేటర్

డా॥ వల్లి సుబ్బలక్ష్మి
సదస్సు కో-ఆర్డినేటర్

ప్రపంచ తెలుగు మహాసభలు-2017 నిజామాబాదు జిల్లా

మరియు

**తెలంగాణ విశ్వవిద్యాలయం**

సంయుక్త ఆధ్వర్యంలో

రెండు రోజుల అంతర్జాతీయ సదస్సు

## తెలంగాణ సాంస్కృతిక వికాసం- వివిధ దృక్కోణాలు

(భాష, సాహిత్యం, చరిత్ర, జానపదకళలు, సమాజం)

దివి: 04,05 డిసెంబర్ 2017; సోమ, మంగళవారాలలో

వేదిక: సమావేశ మందిరం, విశ్వ విద్యాలయ న్యాయకళాశాల, తెలంగాణ విశ్వవిద్యాలయం

# ధ్రువ పత్రము

~~ఆచార్య~~ / ~~డా॥~~ / శ్రీ / ~~శ్రీమతి~~ గడ్డం. లింగరాజు

ప్రపంచ తెలుగు మహాసభలు 2017, నిజామాబాదు జిల్లా మరియు తెలంగాణ విశ్వవిద్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహింపబడిన రెండు రోజుల అంతర్జాతీయ సదస్సు "తెలంగాణ సాంస్కృతిక వికాసం- వివిధ దృక్కోణాలు" (భాష, సాహిత్యం, చరిత్ర, జానపద కళలు, సమాజం) దివి: 04,05 డిసెంబర్ 2017; సోమ, మంగళవారాలలో వేదిక: సమావేశ మందిరం, విశ్వ విద్యాలయ న్యాయకళాశాల, తెలంగాణ విశ్వవిద్యాలయంలో పాల్గొని కాలువ మల్లయ్య నవలలు – సాంస్కృతిక వికాసం అనే అంశంపై పత్ర సమర్పణ చేశారు.

డా॥ వి. త్రివేణి
సదస్సు సంచాలకులు

శ్రీ ఎ. రవీందర్ రెడ్డి
కలెక్టర్ & జిల్లా మెజిస్ట్రేట్, నిజామాబాద్.

Bsomy/426 04/01/2-17

UNIVERSITY OF HYDERABAD
NOTIFICATION OF RESULTS

Course: Ph.D.
Subject: Telugu

Month & Year: November'2016
Semester: I,

| Sl .No | Regn. No. | Name of the Student | Course No. Credits-4 HT-801 | Course No. Credits-4 HT-802 | Course No. Credits-4 HT-803 | Course No. Credits-4 HT-804 |
|---|---|---|---|---|---|---|
| 1 | 16HTPH01 | Alluru Masthan | PASS | PASS | PASS | PASS |
| 2 | 16HTPH02 | A Sunilkumar Reddy | PASS | PASS | PASS | PASS |
| 3 | 16HTPH03 | AVVK Chaitanya | PASS | PASS | PASS | PASS |
| 4 | 16HTPH04 | Garige Divya | PASS | PASS | PASS | PASS |
| 5 | 16HTPH05 | G Anjani Bai | PASS | PASS | PASS | PASS |
| 6 | 16HTPH06 | Harita B | PASS | PASS | PASS | PASS |
| [illegible] | 16HTPH07 | Inala Bharath | PASS | PASS | PASS | PASS |
| 8 | 16HTPH08 | K Raja | PASS | PASS | PASS | PASS |
| 9 | 16HTPH10 | P Dhananjaya Rao | PASS | PASS | PASS | PASS |
| 10 | 16HTPH11 | Ragha Vender K | PASS | PASS | PASS | PASS |
| 11 | 16HTPH12 | S Sandhyarani | PASS | PASS | PASS | PASS |
| 12 | 16HTPH13 | S Thirupathi | PASS | PASS | PASS | PASS |
| 13 | 16HTPH14 | V Gopi | PASS | PASS | PASS | PASS |
| 14 | 16HTPH15 | N Saradamma | PASS | PASS | PASS | PASS |
| 15 | 16HTPH16 | K Lavanya | PASS | PASS | PASS | PASS |
| 16 | 16HTPH17 | Sadmeka Lalitha | PASS | PASS | PASS | PASS |
| 17 | 16HTPH18 | Tejavathu Ashok | PASS | PASS | PASS | PASS |
| 18 | 16HTPH19 | Vemula Harishtha | PASS | PASS | PASS | PASS |
| 19 | 16HTPH20 | G Lingaraju | PASS | PASS | PASS | PASS |
| 20 | 16HTPH21 | N.Ramprasad | PASS | PASS | PASS | PASS |
| 21 | 16HTPH22 | P Srikanth | PASS | PASS | PASS | PASS |
| 22 | 16HTPH23 | B.Ramesh | PASS | PASS | PASS | PASS |

| Course No. | Title of the Course |
|---|---|
| HT- 801 | Research Methodology |
| HT- 802 | History of Telugu Research |
| HT- 803 | Studies in Leterature |
| HT- 804 | Studies in Specialized Area |

Dated: 03.01.2017

3-1-17
**Controller of Examinations**

Copy to :
Head Department of Telugu

5/1/2017
Head
Department of Telugu
University of Hyderabad
Hyderabad-500 0..